
యాబది యైదవ పూజా పుష్పము

శ్రీరామకథా సుధాలహరి

ఉత్తర కాండము

రెండవ భాగము

(శ్రీ వాల్మీకి రామాయణము ననుసరించి - గీతికలలో)



దుర్గాప్రసాద్

శ్రీరామకథాసుధాలహరి

ఉత్తరకాండము రెండవ భాగము -చతురస్ర గీతికలు

ప్రథమ ముద్రణము : 500 ప్రతులు

చిత్రభాను సంవత్సరము
శ్రావణ పూర్ణిమ - వర్షఋతువు
ఆగస్టు మాసము, 2002


వెల : రు. **80-00**

డి.టి.పి. :
శ్రీ గాయత్రీదేవి గ్రాఫిక్స్, విజయవాడ - 3.

ముద్రణ :
తులసి గ్రాఫిక్స్, విజయవాడ - 2
ఫోన్ : 435732.

ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
విజ్ఞాన భవన్ బ్యాంకు స్ట్రీట్
హైదరాబాదు - 500 001.

పి. దుర్గారావు, యం.ఓ.యల్.
మీత్యాతండా, రాగడప పోస్టు - 508 207
(వయా) మిర్యాలగూడ - నల్లగొండ జిల్లా.



సమర్పణము :

కూజంతం రామరామేతి
మధురం మధురాక్షరమ్।
ఆరుహ్య కవితా శాఖాం
వందే వాల్మీకి కోకిలమ్॥

పుష్పాంజలులతో

కృతజ్ఞతలు

1. ఆర్షవిజ్ఞాన ట్రస్టు హైదరాబాదు వారు ప్రచురించిన శ్రీ మద్రామాయణ గ్రంథము గీతికా రూపమున నేను రచించిన శ్రీరామ కథాసుథాలహరి అను గ్రంథమునకు మిక్కిలి తోడ్పడినది. వారికి నా హృదయపూర్వక నమస్కృతులు.

   అదే విధముగా టీకా తాత్పర్య సహితముగా వ్యాఖ్యానించిన ఆచార్య శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు గారికి నా వినయపూర్వక నమో వాకములు.

2. నా యీ రామకథాసుథాలహరిని తమ బ్రాంచీల కన్నింటికి బంపి ప్రజలకు అందజేయుచున్న "విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్", హైదరాబాదు వారికి మిక్కిలి కృతజ్ఞుడను.

3. పది సంపుటాలుగా వెలువడిన యీ మహా గ్రంథమును, పుస్తక ప్రచురణలో సహకరించి సుందరముగా ప్రచురించిన శ్రీ డి.బి. ప్రింటర్సు విజయవాడ వారికి మిక్కిలి కృతజ్ఞతలు.

4. గ్రంథ రచనకు ప్రోత్సహించిన అనేక మంది మిత్రులకు వినయ పూర్వక నమస్కృతులు.

5. 3000 పుటలుగా పది సంపుటాలుగా రచించి ప్రచురించుట ఒక క్రతువు వంటిదని చెప్పవచ్చును. ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు వచ్చినప్పటికి గ్రంథము పూర్తిగా ప్రచురించినందులకు పరబ్రహ్మ స్వరూపమైన శ్రీరామచంద్రునకు భక్తి పూర్వక నమస్కృతులు.

- రచయిత.

దేవతావందనము

వాణీ! వీణాపాణీ! వందిత జన సకలలోక!
కామిత విద్యాప్రసన్న! కల్యాణీ! శుభదాయిని!
వాణీ! వీణాపాణీ! వందిత జన సకలలోక!

యోగివంద్య జ్ఞానజ్యోతి! సారస్వత స్వాదురూప!
మృదుపద సుందర భావన! కవికులజన వరదాయిని
విశ్వరూప విమలచరిత! అక్షర రూపిణి భారతి!
లలిత లలిత పదశోభిని! లాలిత సుందర భాషిణి!

వాణీ! వీణాపాణీ! వందిత జన సకలలోక!
కామిత విద్యాప్రసన్న! కల్యాణీ! శుభదాయిని!

ఉదయసంధ్య అరుణారుణ రేఖాంకిత సదయనేత్రి
కరుణామయి! కావ్యగేయ గాన కళా సుప్రసన్న!
అజరుద్రాచ్యుత పూజిత! ఆదిరూప! సుఖదాయిని!
బుధ సేవిత! ధవళవర్ణ! భూరికృపానంద లహరి!

వాణీ! వీణాపాణీ! వందిత జన సకలలోక!
కామిత విద్యాప్రసన్న! కల్యాణీ! శుభదాయిని!

లలితకళానందమూర్తి విలసిత చైతన్యమూర్తి!
మానవ విజ్ఞాన భాండ మధుర సుధా కలశహస్త!
శివరూపిణి! ప్రణవనాద! తేజోమయి! దీపలేఖ!
అఖిల జీవకోటి హృదయ! ఆనందిని! శ్రీదుర్గా!

వాణీ! వీణాపాణీ! వందిత జన సకలలోక!
కామిత విద్యాప్రసన్న! కల్యాణీ! శుభదాయిని!
వాణీ! వీణాపాణీ! వందిత జన సకలలోక!

మాతృ వందనము

ఓహో! నా జన్మభూమి! ఓహో! నా మాతృభూమి!
ఓహో! నా కన్న తల్లి! వందన మిదె ప్రియభారతి!
ఓహో! నా జన్మభూమి! ఓహో! నా మాతృభూమి!

సకలసస్య శ్రీనిలయిని! సాధుమార్గ శుభదాయిని!
సర్వలోక జనపూజిత! సామగాన సురభాషిణి!
సకల ధర్మ సహజీవన సంస్కృతి విలసిత శోభిని!
పుణ్యకర్మ సువిరాజిత పూర్ణకలా తేజోమయి!

ఓహో! నా జన్మభూమి! ఓహో! నా మాతృభూమి!
ఓహో! నా కన్న తల్లి! వందన మిదె ప్రియభారతి!

గంగ యమున గోదావరి కావేరీ కృష్ణవేణి!
ఉన్నత హిమ గిరి శిఖరము లొప్పిన శుభ కల్యాణీ!
అడుగడుగున పుణ్యభూము లమరు విమల సౌమ్యమూర్తి!
మధుర కావ్య గేయ శిల్ప మంజులతర శివగాయని!

ఓహో! నా జన్మభూమి! ఓహో! నా మాతృభూమి!
ఓహో! నా కన్న తల్లి! వందన మిదె ప్రియభారతి!

సత్యము శివ సుందరములు సర్వదిశలు విలసిల్లిన
ఈ సుందర కర్మభూమి! ఈ పవిత్ర దివ్యధాత్రి!
నీ స్వరూప విలసనమే! నీ యనంత దర్శనమే!
అమ్మా! నీ యాశీస్సులు నలరి వేడుచుంటి నమ్మా!

ఓహో! నా జన్మభూమి! ఓహో! నా మాతృభూమి!
ఓహో! నా కన్న తల్లి! వందన మిదె ప్రియభారతి!
ఓహో! నా జన్మభూమి! ఓహో! నా మాతృభూమి!

వినయ వాక్యము

శ్రీ మద్రామాయణ మహాకావ్యము సంస్కృత భాషలో రచింపబడినది. రచించినది శ్రీ వాల్మీకులవారు, ఐదువేల సంవత్సరముల క్రిందట వ్రాయ బడినదని పెద్దలు జెప్పుదురు.

శ్రీ మద్రామాయణమును భారతీయ భాషలలో ప్రపంచ భాషలలో ఎందఱో మహానుభావులు ననువదించిరి. ఆంధ్రభాషలో గూడ గద్య పద్యగీతికా రూపాలలో ఎందఱో మహాకవులు గానము జేసిరి.

శ్రీ మద్రామాయణము భారతీయ సాహిత్యమునకును సంస్కృతికిని మూలము, ప్రతీక, రామాయణ కావ్యములోని నాయకుడైన శ్రీరామచంద్రుడు భారతీయులకు పరమ దైవము, పరబ్రహ్మ స్వరూపము. ఋషితుల్యుడు, ఆదర్శ మానవుడు.

తమ పుట్టినబిడ్డలకు తెలుగుదేశములో శ్రీరాముని పేరు పెట్టుకుందురు. రామ మందిరము లేని గ్రామము తెలుగుదేశములో లేదని చెప్పవచ్చును. అట్టి శ్రీరామ చరిత్రమును తెలుగులో, తేలిక భాషలో, సామాన్యులు పాడుకొనుటకు వీలుగా గీతికా రూపమున వ్రాయుటకు బూనుకొంటిని.

వృత్తిచేత ఉపాధ్యాయుడ నైనప్పటికినీ, సంస్కృతభాషా పరిజ్ఞానము స్వల్పమైనప్పటికినీ, శ్రీరామునిపై గల భక్తి భావము చేతను, శ్రీ మద్రామాయణము నందు గల ప్రీతిభావముచేతను ఇట్టి మహత్కార్యమునకు బూనుకొంటిని. శ్రీరామచంద్రుడే నా చేత యీ కార్యమును జేయించుచుండెనని నా భావన.

ఈగ్రంథములోని విశేషములు

1. శ్రీ వాల్మీకి రామాయణము ననుసరించి, తేలిక భాషలో బాలుర కర్థమగు రీతిలో పాడుకొనుటకు వీలుగా రచించుటకు యత్నించితిని.
2. గీతికలుగా వ్రాయుటవలన స్వేచ్ఛానువాదమని భావింపవచ్చును. చేర్పులు, మార్పులు లేకుండా మూలముననుసరించి వ్రాయబడినది.
3. 38వ సర్గ నుండి 111 సర్గములుగల ఉత్తరకాండము రెండవభాగము దాదాపు 2000 చరణములతో పూర్తిచేయబడినది.

4. ఇందలి ఛందస్సు చతురస్రగతి, మధ్యాంతరమున యతిగాని ప్రాసగాని యుంపబడినది. పాడుకొనుటకు వీలుగా బాదాంతమున గురువు నుంపబడినది. నాలుగేసి పాదములు మూడు లేక రెండు ఒక గీతికగా గుది గ్రుచ్చబడినది.

5. ఏ సర్గమున కాసర్గ విడదీయబడి, విషయసూచిక జేర్చబడినది.

6. మూలమునందలి రెండు మూడు శ్లోకములను ఒక గీతికగా గూర్చబడినది.

7. మున్యాశ్రమములో మహర్షి వాల్మీకి దగ్గఱ నేర్చుకొని వీధి గాయకులుగా గానము జేసిన లవకుశులే నాకాదర్శము.

ఈ గ్రంథ రచనయందు భాషలో, భావనలో, అచ్చులో కథాగమన పుష్టిలో ఎన్నియో దోషములుండవచ్చును. సహృదయులు దెలియబఱచిన సరిదిద్దుకొందును.

గీతికా రచనలోగాని, ప్రచురించుటలోగాని ఎట్టి యాటంకములు గలుగనందులకు శ్రీ రామచంద్రునకు నా నమోవాకములు,

శ్రీ వాల్మీకులవారు శ్రీ మద్రామాయణ కావ్యమును రచించి ముద్దుగా కుశలవులచే బాడించిరి. అదే విధముగా విద్యార్థులు గూడ యీ రామాయణమును ముద్దుగా బఠించి గానము చేసి సంగీత సాహిత్య సంస్కృతులను సంపాదించుకొనవలెనని నా కోరిక.

శ్రీ రామాయణ గ్రంథము భారతీయులకు బూజనీయమైనది. ఆది కావ్యము. అట్టి గ్రంథము యొక్క ఆత్మీయతను, వాల్మీకులవారి కవితా హృదయమును, రామాయణములోని మహోజ్జ్వలములైన పాత్రలను స్పృశించుటయే గాక, రామాయణ గ్రంథమంతయు గీతికారూపమున వెలువరించుట నా పూర్వపుణ్య సుకృతమని భావించుచున్నాను. సహృదయులకు నమస్కారములు.

-రచయిత.

విషయ సూచిక

50. లక్ష్మణ సుమంత్రుల సంభాషణము.

51.సుమంత్రుడు తాను దుర్వాసుని ద్వారా విన్న భృగుశాపవృత్తాంతమును, కొంచెము రాబోవు కథను లక్ష్మణునికి చెప్పి, అతనిని ఓదార్చుట.

52. అయోధ్యలో రాజభవనములో ప్రవేశించిన లక్ష్మణుడు దుఃఖించు చున్న రాముణ్ణి ఓదార్చుట.

53. పనిమీద వచ్చినవారిని ఉపేక్షించుటచేత నృగమహారాజుకు వచ్చిన శాపమును గూర్చిన కథ చెప్పి రాముడు కార్యార్థులను నిరీక్షించవలెను అని లక్ష్మణుణ్ణి ఆదేశించుట.

54. నృగమహారాజు తన పుత్రునకు రాజ్య మిచ్చివేసి, భూమిలో అందమైన గొయ్యి త్రవ్వించుకొని శాపమును అనుభవించుట.

55. నిమి చక్రవర్తి, వసిష్ఠుడు ఒకరి నొకరు శపించుకొని దేహములు త్యజించుట.

56. బ్రహ్మదేవుడు చెప్పగా వసిష్ఠుడు వరుణుని రేతస్సులో ప్రవేశించుట, వరుణుడు ఊర్వశి సమీపమున ఒక కలశలో తన రేతస్సును ఉంచుట, మిత్రుని శాపము చేత ఊర్వశి భూలోకములో పురూర వుని దగ్గర ఉండి పుత్రుణ్ణి కనుట.

57. వసిష్ఠుడు క్రొత్త దేహమును పొందుట. నిమి ప్రాణుల నేత్రముల మీద నివసించుట.

58. శుక్రాచార్యుడు యయాతిని శపించుట.

59. యయాతి పుత్రుడైన పూరువునకు తన వార్ధక్యము నిచ్చి అతని యౌవనమును తీసికొనుట. భోగము లనుభవించి తృప్తుడైన పిమ్మట అతడు చాలాకాలానికి అతని యౌవనమును తిరిగి ఇచ్చివేయుట. పూరువును రాజ్యమునందు అభిషేకించుట, యదువును శపించుట.

ప్ర.స. 1. కార్యార్థియై కుక్క ఒకటి రాముని భవను ద్వారమునకు వచ్చుట. దానిని రాజసభలోనికి తీసికొని రమ్మని రాముడు లక్ష్మణుణ్ణి ఆదేశించుట.

ప్ర.స. 2. శునకము విషయమున రాముడు న్యాయనిర్ణయము చేయుట. దాని అభిప్రాయము ప్రకారము రాముడు దానిని కొట్టిన బ్రాహ్మణునకు మఠాధిపత్య మిచ్చుట. శునకము మఠాధిపత్యములో ఉన్న దోషాలు వర్ణించి చెప్పుట.

ప్ర.స. 3. గ్రద్ద గుడ్లగూబల వివాదము.

60. రాముని సభకు ఋషులు వచ్చుట. రాముడు వారిని సత్కరించి వారి అభీష్టమును పూరించుటకై ప్రతిజ్ఞ చేయుట. ఆ ఋషులు రాముణ్ణి ప్రశంసించుట.

61. మునులు రామునకు మధువు సంపాదించిన వరమును, లవణాసురుని బలమును, అతడు చేయుచున్న ఉపద్రవమును గూర్చి చెప్పి అతనివలన తమకు కలిగిన భయమును తొలగింపుమని రాముణ్ణి వేడుట.

62. లవణాసురుని ఆహారాదుల విషయమున రాముడు మునలను ప్రశ్నించుట. వానిని చంపుటకై శత్రుఘ్నుని ఉత్సాహము తెలిసికొని ఆతనిని ఆ కార్యమునకై ఆజ్ఞాపించుట.

63. రాముడు శత్రుఘ్నుణ్ణి మధురాజ్యమునందు అభిషిక్తుని చేసి లవణుని శూలము నుండి ఆత్మరక్ష చేసికొను ఉపాయమును చెప్పుట.

64. రాముని ఆజ్ఞచేత శత్రుఘ్నుడు ముందుగా సైన్యమును పంపి ఒక మాసము తరువాత మధురకు ప్రయాణమై వెళ్లుట.

65. వాల్మీకి శత్రుఘ్నునకు సౌదాసుడైన కల్మాషపాదుని కథ చెప్పుట.

66. సీత ఇద్దరు పుత్రులను కనుట. వాల్మీకి ఆ శిశువులకు రక్షణము ఏర్పరచుట. ఈ విషయము విని శత్రుఘ్నుడు సంతోషించి, అక్కడి నుండి బయలుదేరి యమునాతటమునకు వెళ్లుట.

67. చ్యవనుడు శత్రుఘ్నునకు లవణాసురుని శూలమునకు గల శక్తిని చెప్పుచు, పూర్వము జరిగిన మాంధాత వధను గూర్చి తెలుపుట.

68. లవణాసురుడు ఆహారము కొరకై బయలుదేరుట. శత్రుఘ్నుడు మధురాపుర ద్వారమునందు నిలచి ఉండుట. తిరిగివచ్చిన లవణునితో అతని సంభాషణము.

69. శత్రుఘ్న లవణాసురుల యద్ధము, లవణుని సంహారము.

70. శత్రుఘ్నుడు దేవతలనుండి వరములను పొందుట. మధుపురిని నిర్మించి పిదప రామునివద్దకు వెళ్ళవలెనని అతడు సంకల్పించుట.

71. స్వల్పమైన సైన్యము తీసికొని శత్రుఘ్నుడు అయోధ్యకు బయలుదేరుట. మార్గమధ్యములో వాల్మీక్యాశ్రమమునందు శ్రీరామచరిత గానమును విని వారందరు ఆశ్చర్యమును చెందుట.

72. శత్రుఘ్నుడు వాల్మీకి అనుజ్ఞ పొంది, అయోధ్యకు వెళ్ళి రామాదులతో కలిసి, అక్కడ ఏడురోజులు ఉండి, మరల మధురకు బయలుదేరి వెళ్లుట.

73. ఒకానొక బ్రాహ్మణుడు మరణించిన బాలుడైన పుత్రుణ్ణి తీసికొని రాజ ద్వారము వద్దకు వచ్చి విలపించుట.1

74. 'తపస్సు చేయుచున్న శూద్రుడు అధర్మము చేయుటయే బ్రాహ్మణ పుత్రుని మరణమునకు హేతువు' అని నారదుడు రామునకు తెలుపుట.

75. రాముడు పుష్పకము నెక్కి తన రాజ్యములో అంతటా తిరుగుచు పాప కర్మలు జరుగుచున్నవా అని అన్వేషించుట, అంతటా పుణ్యకర్మలే జరుగుచుండుట చూచుట, దక్షిణ దిక్కున తపస్సు చేయుచున్న శూద్రుని వద్దకు వెళ్లుట.

76. రాముడు శంబూకుణ్ణి వధించుట; దేవతలు ప్రశంసించుట, అగస్త్యా శ్రమములో అగస్త్యుడు రాముణ్ణి సత్కరించి, అతనికి అలంకారమును ఇచ్చుట.

77. అగస్త్యుడు రామునకు స్వర్గములో ఉండు ఒక పురుషుడు శవమును భక్షించిన కథ చెప్పుట.

78. శ్వేతుడు తనకు కుత్సితమైన ఆహారము తినవలసి వచ్చినందుకు కారణమును అగస్త్యునకు చెప్పుట. బ్రహ్మతో తనకు జరిగిన సంభాషణమును తెలుపుట, అగస్త్యునకు దివ్యాలంకారమును దానము చేయుటచే అతడు ఆకలిదప్పుల నుండి విముక్తుడగుట.

79. ఇక్ష్వాకు పుత్రుడైన దండుని రాజ్యము.

80. దండుడు శుక్రాచార్యుని పుత్రిని బలాత్కరించుట.

81. శుక్రాచార్యుని శాపముచేత దండుడు, వాని రాజ్యము నశించుట.

82. రాముడు అగస్త్యాశ్రమమునుండి అయోధ్యకు బయలుదేరుట.

83. భరతుడు సలహా చెప్పగా రాముడు రాజసూయయాగము చేయు ప్రయత్నము నుండి విరమించుట.

84. లక్ష్మణుడు అశ్వమేధ యాగమును గూర్చి చెప్పుచు ఇంద్రవృత్రుల కథను చెప్పుట. వృత్రుడు తపస్సు చేయుట. అతనిని చంపుమని ఇంద్రుడు విష్ణువును ప్రార్థించుట.

85. ఇంద్రునిలోను, వాని వజ్రాయుధములోను విష్ణు తేజస్సు ప్రవేశించుట, ఇంద్రుని వజ్రాయుధము చేత వృత్రాసురుని సంహారము. బ్రహ్మహత్య ఆవహించిన ఇంద్రుడు తమోమయమైన ప్రదేశము లోనికి వెళ్ళిపోవుట.

86. ఇంద్రుడు లేకపోవుటచే జగత్తులో అశాంతి పెరుగుట. ఇంద్రుడు అశ్వమేధము చేసి బ్రహ్మ హత్య నుంచి విముక్తుడగుట.

87. రాముడు లక్ష్మణునకు ఇలోపాఖ్యానము చెప్పుట. ఇలుడు ఒక మాసము పాటు స్త్రీగాను, ఒక మాసము పురుషుడుగాను ఉండుట.

88. ఇలా బుధుల పరస్పర దర్శనము, ఇలా సహచారిణులకు కింపురుషి అను పేరు పెట్టి బుధుడు వాళ్ళను పర్వతముమీద నివసింపు డని పంపుట.

89. ఇలాబుధులకు పురూరవుడు అను పుత్రుడు పుట్టుట.

90. అశ్వమేధయాగము చేయుటచే ఇలకు పురుషత్వము లభించుట.

91. రాముని ఆజ్ఞచేత అశ్వమేధయాగమునకు ఏర్పాటు జరుగుట.

92. రాముని అశ్వమేధయాగములో దానగౌరవములు బాగా జరుగుట.

93. వాల్మీకి రాముని యజ్ఞమునకు వచ్చుట. రామాయాణము గానము చేయుడని వాల్మీకి కుశలవులను ఆదేశించుట.

94. కుశలవులు రామాయణము గానము చేయుట. రాముడు ఆ గానమును సభలో వినుట.

95. సీత తన పరిశుద్ధత్వము విషయమున శపథము చేయవలెనని రాముడు అనుట.

96. సీత పరిశుద్ధురాలని వాల్మీకి ఘోషించుట.

97. సీత శపథము చేయుట. రసాతలములో ప్రవేశించుట.

98. సీతకై రాముని శోకము, బ్రహ్మదేవుడు ఓదార్చి ఉత్తరకాండ శేషమును వినుమని చెప్పుట.

99. సీత రసాతములో ప్రవేశించిన పిమ్మట రాముని జీవన విధానము. రామ రాజ్యములోని పరిస్థితులు, రాముని తల్లులు స్వర్గస్థులగుట.

100. కేకయదేశమునుండి కానుకలు తీసికొని గార్గ్యుడు వచ్చుట. అతడు తీసికొని వచ్చిన సందేశము అనుసరించి భరతుడు రాముని ఆజ్ఞచేత, ఇద్దరు కుమారులతో కలిసి గంధర్వదేశమును ఆక్రమించుటకు వెళ్ళుట.

101. భరతుడు గంధర్వులను సంహరించి, రెండు పురములను నెలకొల్పి వాటిని పుత్రులిద్దరికీ ఇచ్చి, మరల అయోధ్యకు తిరిగి వచ్చుట.

102. రాముని ఆజ్ఞను అనుసరించి భరత లక్ష్మణులు కారుపథ ప్రదేశము నందు వేరువేరు రాజ్యములలో లక్ష్మణుని పుత్రులైన అంగద చంద్రకేతువులను నియమించుట.

103. రామునివద్దకు కాలపురుషుడు వచ్చుట. ఒక సమయము (షరతు) పెట్టి ఆ కాలపురుషుడు రామునితో మాటలాడుటకు ఉద్యమించుట.

104. కాలపురుషుడు రామునకు బ్రహ్మదేవుని సందేశము చెప్పుట. రాముడు అంగీకరించుట.

105. దుర్వాసుడు శపించుననే భయముచేత లక్ష్మణుడు నియమభంగమైనను లెక్కచేయక రాముని దగ్గరకు వచ్చి అతని రాకను గూర్చి చెప్పుట. రాముడు దుర్వాసునకు భోజనము పెట్టుట. అతడు వెళ్ళిపోయిన పిమ్మట రామునకు లక్ష్మణుని విషయమున చింత కలుగుట.

106. రామునిచే విడువబడిన లక్ష్మణుడు శరీరముతో స్వర్గమునకు వెళ్లుట.

107. వసిష్ఠుని ఆజ్ఞ ప్రకారము పౌరు లందరిని తనతో పరమధామమునకు తీసికొని వెళ్ళవలెనని రాముడు ఆలోచించుట. కుశలవులను రాజ్యము నందు అభిషిక్తులను చేయుట.

108. సోదరులతోను, వానరులతోను, భల్లూకములతోను కలిసి పరమ ధామమునకు వెళ్ళవలెనని రాముడు నిశ్చయించుకొనుట. మీరు భూలోకము నందే ఉండుడు అని విభీషణ- హనుమత్- జాంబవత్- మైంద- ద్వివిదులను ఆజ్ఞాపించుట.

109. పరమధామమును చేరుటకై బయలుదేరిన రామునితో అయోధ్యా వాసులందరూ కూడ బయలుదేరుట.

110. సోదర సహితుడైన రాముడు తన వైష్ణవ తేజస్సులో ప్రవేశించుట. ఆ రామునితో వచ్చిన వారి కందరికీ సంతానకమను లోకము లభించుట.

111. శ్రీ మద్రామాయణ మాహాత్మ్యము.

సమాప్తము

నివేదన

శ్రీ రామాయణ పుణ్యగథను జనచిత్తము హర్షము రంజిలగా!
మధుర పదములను మధుర భావముల మల్లెమాలగా నలరింపన్!
శ్రీ గణేశ్వరుని జిన్మయభక్తిని జిత్తము బొంగగ స్మరియింతున్!
శ్రీ భారతి గిరిజామ తల్లులను సిద్ధిని గోరుచు బ్రార్థింతున్!

ఆదికవులు శ్రీ వాల్మీకులకిదె యలరి జేయుదును వందనముల్!
పూర్వకవులకును బుణ్యమతులకును బూర్ణ భక్తినే నర్చింతున్!
రామకథను వ్రాసిన ఘనులకు నిదె రమ్య నమస్కృతు లర్పింతున్!
సీతారాముల భజించువారిని జేరికొలుతు నే నడుగడుగున్!

ఆ సేతు హిమాచల పర్యంతంబును నలరెడి భారతదేశమునా!
భారతీయులకు బరమాదర్శము భవ్య రామ సీతాకథయే!
వారి మార్గమే యాదర్శము మఱి వారి చరిత దగ్దర్శనమూ!
వారు నడిచినా మధుర మార్గమే వన్నెదెచ్చు జీవనధర్మం!

చిన్ని మాటలను చిఱుత బాలురకు తీయని తీయన రాగములన్!
తెలియజేయగను బూనుకుంటినీ తేనె లొలికెడి గీతికలన్!
రామాయణమది మహాసముద్రము రంజిలు హిమగిరి శిఖరమదీ!
తేటతెలుగులో మహాత్ములెందఱో తెలియగ వ్రాసిరి విశదముగా!

అందులకే నే నఖిల దేవతల యారాధనలను జేసితినీ!
పదముల నిమ్మని భావము లిమ్మని భారతాంబ నర్థించితినీ!
ఇష్టదైవమగు నిందిరారమణు నిహపరమిచ్చెడి రఘుపతినీ!
భక్తి భావమున శిరమును మోడ్చితి భావమునందున నిలువమనీ!

ఎట్టి పుణ్యమును జేసితినో మఱి యెట్టి సుకర్మలు జేసితినో?
గట్టిగ యా శ్రీరాముని చరితము బట్టువడెను నా మనసునకున్!
మధురాక్షరములు మధురపదములై మంజుల గీతముగా వెరుసన్!
లయతాళములను నృత్యము చేసెను లలితరాగ మధురోక్తులతోన్!

అల వాల్మీకులు వ్రాసిన దానిని యా శ్రీరాముని సభయందున్!
వీధిగాయకులుగా కుశలవులును విమలగానమును జేసినదీ!
ఆ పాటను నే దెనుగున బాడితి నమరగానమును జేయంగన్!
తెలుగుబాసలో తేటతెనుగులో దెలుగు బాలకులు బాడుటకున్!

కఠిన పదములకు దూరముగా నే కఠిన భావముల జొరనీకన్!
బాలకులగు నా కుశీలవులనే భవ్యాదర్శముగా గొనుచున్!
శ్రీరాముని మహనీయ చరితమును జేయగ బూనితి గేయముగా!
బాలురు వృద్ధులు బాడుకొనుటకై భవ్యరాగలయ తాళములన్!

భారతదేశమునం దణువణువున భవ్య రామ శుభచరితంబున్!
పాడు కొనును శ్రీరామరామ యని భవ్య రాగలయ తాళములన్!
గాలికదలికల వినిపించును నా కమ్మని రాముని నిస్వనముల్!
అట్టి కథను నే రచింప బూనితి ఎట్టి సుకృతినో యీ జన్మన్!

సిద్ధి వినాయక! చిత్తము రంజిల శిల్పి వోలె హృది రంగమునన్
శ్రీ రామయణ చిత్రమందిరము జేయుచుంటి భక్తిని రక్తిన్!
ఒక్కొక్క చరణము నందియిమ్ము నే మక్కువ తోడను నిర్మింతున్!
మధురాక్షరములు దుధురభావములు మానసంబు జిందులు ద్రొక్కన్!

కన్నతల్లివని కలలు యందునను గాంచుదుకద! భారతి! వాణీ!
అంధకారమును దొలగజేసి నన్నాదరింపు వీణాపాణి!
హృదయకమలమున నిడుగిడి దయతో హృది వెన్నెలను గావించి!
కావ్యకన్యకను గమనీయముగా కాంచన కుసుమము గావింపూ!

✡ ✡ ✡

ముప్పది యెనిమిదవ సర్గము

(రాముడు జేసిన సత్కారములను నందుకొని జనకాదులు
తమ తమ దేశములకు వెళ్లుట)

మహాబాహువగు రాఘవుండునూ మానుగ యీ విధముగ తానున్
ప్రతి దినమందును పౌరుల మఱియును బరగ జానపదు లందుననూ
సర్వ కార్యముల కర్తవ్యంబుల సరసతజేసెడి ధర్మములన్
తగువారలనూ నియమించుచునూ సకలము జేయించుచు నుండెన్!

కొన్ని దినము లిటు గడిచిన పిమ్మట కూరిమితో నా రాఘవుడున్,
అంజలి ఘటించి నమస్కరించుచు నలరి సహజ వినయము తోడన్,
మిధిలకు రాజగు జనకుని తోడను మేలిమి మధుర సువాక్యములన్
గౌరవ భావముతోని బలికె నిటు గడు నాదరమును దొలుకగనూ!

నీవే మాకును నచంచలంబగు గతివి! మార్గదర్శకుడవునూ,
నీ చేతను బాలింపబడితిమీ! నీ యాజ్ఞల మన్నించుచునూ!
ఉన్నతమగు నీ తేజస్సులచే నురుతరమైన ప్రభావముచే,
దశగ్రీవుని నే సంహరించితిని! దగ శాంతిని గాపాడితినీ!

ఓ రాజా! ఇక్ష్వాకులకును మఱి యొనరగ మిధిలా ప్రభువులకున్
అన్ని విధములా చేతను గూడను నలరు వియ్యములు మొదలైనా
మధుర స్నేహములు మాలిమి ప్రేమలు మానుగ సుస్థిరముగ నుండీ
అపారమగు నాప్యాయత మఱియును నాదర భావములును గలవూ!

అందువలన ఓ పార్థివ! వినుమా! చందముగా నే నర్పించూ
బహు రత్నములను గ్రహించి వేగము బన్నుగ మీదు పురంబునకున్,
బయనించెడి వాడవు గావుతనూ! భరతుడు గూడను మీ వెంటన్
సహాయార్థమై నీ వెనుకను మఱి సరసత బయనించును గాతన్!

అటుబిమ్మట యా జనకరాజునూ "అట్లే!"-యనుచును బహుప్రీతిన్,
శ్రీరామునితో నిట్లు బలికెనూ చిఱునవ్వును దొలుకుచు నతడున్,

రామచంద్ర! నీ దర్శనంబుచే నయమ్ముగ యాదర గౌరవముల్,
మధురమైన నీ ప్రీతిప్రేమలను మానుగ సంతోషించితి నేనున్! 6

రామచంద్ర! ఓ రాజా! వినుమా! రయముగ నాదు సువాక్యములన్
ఏ రత్నములను నాదు ప్రియార్ధము నయముగ నిచ్చుచునున్నావో
ఆ రత్నములను, నా వస్తువులను నలరు నాదు దుహితలకు మఱిన్
బహుమానించుచు నుంటిని రామా! బన్నుగ పయనించెడి వేళన్! 7

శోభాయుక్తుండైన జనకుడును సురుచిరముగ కాకుత్స్థునితో,
నిటుల బలికి బహుసంతోషించిన పటుమానసమును గలవాడై!
శ్రీరాముని మఱి కౌగలించుకుని శ్రీకరముగ యాదరముననూ
మిథిలానగరమునకు బయనించెను మేదురమగు నాహ్లాదమునన్! 8

అటుబిమ్మట యా జనకనరేంద్రుడు నలరుచు బయనించుచు నుండన్,
రామచంద్రుడును ప్రాంజలి తోడను రయమున ప్రభువును నగువాడున్,
మేనమామయగు కేకయరాజును మేదుర గౌరవ భావమునన్,
వినయపూర్వకముగా నిటుబలికెను విమలాక్షరములు దులకింపన్! 9

పురుషశ్రేష్ఠుడ! రాజా! వినుమా! పూనికతో నా వచనములన్,
ఈ రాజ్యంబును, సర్వసంపదలు, నిలపరివారము, బంధువులున్,
లక్ష్మణుండు మఱి భరతకుమారుడు లాలితుడగు శత్రుఘ్నుండున్,
ఆధీనంబై యున్న వారలము నటు నీ కను సన్నలకు మఱిన్! 10

వృద్ధుడైన నీ జనకుడు రాజును విమలత త్వదర్థమై మిగులన్,
సంతాపంబును నందగలడు సుమ! వంత జెందు నిను గాంచకనూ!
ఆ కారణమున నేడే నీవును నాలస్యము మఱి లేకుండన్!
బయలుదేరిబోవుట మంచిదనీ భావించుచు నుంటిని రాజా! 11

బహుళములైనా ధనసంపదలును బహుళములైనా రత్నములన్,
మణిమయ ఖచితములైన హారములు మానుగ గైకొని నీ తోడన్,
అను యాత్రికుడై లక్ష్మణుండునూ యలరి రాగలడు పయమునన్!
అభినందనములు దెలుపుము తండ్రికి యాదరింపుమని సంప్రీతిన్! 12

అటుబిమ్మట యా యుధాజిత్తునూ యలరుచు దన గమనము గూర్చి
అలరామునితో 'నట్లే' యనుచును నాహ్లాదముతో బలికి మఱిన్,

హూకరించిన రత్నంబులనూ బహువిధ ధనములు గూడ మఱిన్,
యధీనమున నుండుగాత! యని నిర్మల యాత్మీయత బలికెన్! 13

ఇందుగ రాముడు యుధాజిత్తునకు బొందుగ నమస్కృతులను జేసీ
ప్రదక్షిణంబును జేసెను బ్రీతిని బన్నుగ నాదర ప్రేమలతో,
ఇటుబిమ్మట యా యుధాజిత్తునూ యలరామునకును మఱియున్,
ప్రదక్షిణంబును జేసి మఱియునూ బయలుదేరె కేకయ పురికిన్! 14

వృత్రాసురునీ సంహరించి మఱి వినుతి గనిన దేవేంద్రుడునూ,
విష్ణువుతోడను గలిసి మెలసి మఱి విమల భావమున బోయినటుల్,
తనకు సహాయుడుగా వచ్చిన యా సరసత లక్ష్మణుతో గూడన్,
కేకయరాజును బయనించెను మఱి కేకయ దేశమునకును మఱిన్! 15

రామచంద్రుడును యుధాజిత్తునూ రయమున బంపిన తరువాతన్,
తన మిత్రుండును నకుతోభయుడును నలరుచు గాశీ రాజయినా,
ప్రతర్దనుని మఱి కౌగలించుకుని కమ్మని వచనములను బలికీ,
తన కృతజ్ఞతను దెలియజేసెనూ, దగ మధురాక్షరముల తోడన్! 16

ఓ మిత్రుడ! ఓ కాశీరాజా! నీ ప్రీతియు దర్శన మాయెన్,
అధికమైన నీ స్నేహము గూడను నలరి ప్రదర్శిత మాయె మఱిన్,
నీ చేతను మా భరతుని తోడుత నిర్మలభావముతోని మఱిన్,
రాజ్యపాలనా కార్యంబులనూ రహి నిర్వహణము జేసితివీ! 17

కాశీరాజా! యా కారణమున గడు వేగమునను నీ చేతన్,
రక్షింపగబడుచున్నవి మఱియును రమ్యమైన ప్రాకారములున్
గలదియు సుందర ముఖ తోరణములు కమనీయంబగు శోభలతో
నున్నదియును మఱి వారణాశికిని బన్నుగ పయనించుము రాజా!
ప్రజా హృదయమును జూరగొనుటకును ప్రజలను బాలింపగవేగన్! 18

ధర్మాత్ముండగు రామచంద్రుడును దగ యీ విధముగ పలికి మఱిన్,
పరమాసనమున నుండి లేచి మఱి బన్నుగ యా కాశీరాజున్
గాఢముగా మఱి కౌగలించుకొని కమ్మని కృతజ్ఞతాంజలితో,
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 19

కౌసల్యాసతి ప్రీతి వర్ధనుడు గడు విక్రముడగు రాఘవుడున్,
కాశీరాజును స్వదేశమునకును కదిలిపోవగా కృతజ్ఞతన్,
అనుమతి నిచ్చెను కాశీరాజును నల స్వదేశమునకును బోయెన్!
జేయబడిన యనుమతి గలిగియునూ, చిత్తమందు భయమును లేనీ,
కాశీరాజును శ్రీరామునిచే గడు విసర్జితుం డగుచు మఱిన్
వారణాశికిని బయలు దేరెనూ, వనరగ ప్రజలను బాలింపన్! 20

రామచంద్రుడును కాశీరాజును రమ్యమైన యభివందనముల్,
వారణాశికిని బోవుట కొఱకై వనరగ వీడ్కోలును నిచ్చీ,
మందస్మితమును జేయుచు మఱియును మానుగ మూడొందల మందీ,
రాజుల తోడను నీ విధి బలికెను, రమ్యాక్షరముల దోడుతనూ! 21

మీ తేజస్సుల చేతను మఱియును మానుగ మన స్నేహంబునకున్,
ఎట్టి యొడుదుడుకులును లేకుండగ మఱి గట్టిగ స్నేహము నిలుపబడెన్,
మీలో సత్యము ధర్మము గూడను మేదురముగ బావింపబడెన్!
దుష్టత్వంబును రూపుమాపగా దూరాలోచన గలదు మఱిన్! 22

మహాత్ములగు మీ ప్రభావంబునను మానుగ మీ తేజస్సులచే
ధురాత్ముండునూ దుర్బుద్ధియునూ, దుష్టత్వంబును బోయెడి యా
దశగ్రీవుండును సంహరింపబడె దగ ధర్మంబును నిలుపబడెన్
శాంతిగూర్చబడె సకల లోకముల కాంతి గూర్చబడె దిశలందున్! 23

ఆ రావణునీ సంహరించుటను అలరి హేతు మాత్రంబును నే
వాని సైన్యమును వాని పుత్రులును, వాని బంధువులు నమాత్యులున్,
యుద్ధమునందున మీ చేతను మఱి యుద్ధతి తేజస్సుల జేతన్
వధింపబడిరని తలచుచుంటినీ, వనరగ సందేహము లేదూ! 24

జనకరాజసుత యా యరణ్యమున సాహసుడగు రావణు జేతన్
అపహరింపబడినట్లుగా వినుచు నలరి మనస్సున వేదనతో,
మిమ్ముల నందఱ యాహ్వానించెను నిమ్ముగ భరతుడు నయోధ్యకున్,
యుద్ధము సేయగ రావణుతోడను యుద్ధతి శాంతిని నెలకొల్పన్! 25

యుద్ధోద్యుక్తులునై మీరందఱు యుద్ధతి వచ్చిన వా రిటకున్,
మహాత్ములగు మీ రాజులందఱును మహనీయంబగు కాలంబున్,

గడిచిపోయినది, పరదేశంబున బహు వేదనలను భరియించి,
భావించుచు నుంటిని నేనును మఱి బరగ బోవుటయు మంచిదనీ! 26

ఆ రాజులునూ సంతసించుచును నలరి బలికి రీ విధముగనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్!
అదృష్టవశమున సంగ్రామంబున యలరి విజయమును నందితివి,
రాజ్యముగూడను ప్రతిష్ఠించితివి! రమ్యశాంతి నెలకొలిపితివి!
అదృష్టవశమున సీతను గూడను నలరి యయోధ్యకు దెచ్చితినీ!
శత్రువుగూడను వధింపగాబడి వనరగ శాంతియు నెలకొనియెన్ 27,28

రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్!
శాత్రువులను మఱి సంహరించితివి! సహజ విజయ వంతుడవైనా,
నిన్ను జూడ గలుగుచునున్నాము! నిర్మల శాంతియు జే కూరెన్,
ఇదియే మా ఘన కోరికనుమ్మా! యిదియే ఘన సంతోషంబున్! 29

ప్రశంసార్హుడవు నగు శ్రీరామా! బన్నుగ నీవటు సేయకనూ!
మమ్ము ప్రశంసను జేయుచుంటివీ! మానుగ దగియున్నది నీకున్!
ఇట్టి ప్రశంసలు జేయుటగూడను నిట్టి గారవము సేయుటయున్
మే మెఱుగము మఱి పూర్వమునందును మేదుర ప్రస్తుత కాలమునన్! 30

మహా బాహు! మా రాజులందఱము మానుగ సెలవును దీసికొనీ,
మా నగరములకు బోవుచుంటిమీ! మానుగ సంతోషము తోడన్,
మా హృదయములను నుంటివి రామా! మానుగ యెల్లపుడును మఱిన్,
మహా ప్రేమతో నుంటి మిచ్చటను మానుగ యే లోపము లేకన్!
మహారాజ! నీకును నెల్లపుడును మా యందున దయ యుండవలెన్! 31

'అట్లే! తప్పక!' యనుచు రాముడును నలరి బలుకగా వారలతో,
రాజులందఱును మిగుల హర్షమున రమ్యానందము నందుచునూ,
తమ తమ దేశములకు బోవుటకును దగ సిద్ధము గలవారగుచున్,
అంజలి తోడుత నమస్కరించుచు నా రామునకును వినయమునన్,
'వెళ్ళి వచ్చెదము!' నని దెలుపుచునూ యల శ్రీరామునిచేత మఱిన్,
విమలముగా పూజింపబడుచునూ, వేడుక తమ నగరంబులకున్,
పయనంబై పోయిరి నరేంద్రులును బన్నుగ నాహ్లాదము తోడన్! 32,33

శ్రీరామ కథాసుధాలహరి యందు - ఉత్తరకాండములో
ముప్పది యెనిమిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ముప్పది తొమ్మిదవ సర్గము

(రాజులు రామునకు కానుకలు బంపుట, రాముడు వానిని స్వీకరించి,
తనకు మిత్రులైన వానరాదులకు బహూకరించుట, వానరాదులు
అచ్చట యయోధ్యలో సుఖముగా నుండుట)

మహాత్ములగు నా రాజులందఱును మానుగ సంతోషించుచునూ,
రాముని బాడుచు, కీర్తించుచునూ, రమ్యగానముల జేయుచునూ,
వేలకొలది యేనుగుల గుఱ్ఱముల విమలమైన సముదాయములన్,
భూతలమును గంపింప జేయుచును బొలుపుగ నర్తనముల తోడన్! 1

భరతుని యాజ్ఞలజేతను మఱియును బ్రహృష్టమగు సైన్యంబులునూ
వాహనములుగల యక్షౌహిణులును వనరగ యుండెను సిద్ధంబై!
రావణుతోడను యుద్ధముసేయగ రహి రాక్షసులను మర్దింపన్,
శ్రీరాముని ఘన విజయము గోరుచు చిత్త శుద్ధితో పోరాడన్! 2

బలదర్పంబుల సమన్వితులునగు బరగ మహీపతు లందఱునూ!
తమలో దామిట్లనుచును బలికిరి తగు విధమున బలగర్వితులై!
హేరామా! సంగ్రామమునందున యా రావణునీ గనలేదూ!
అటుల గనబడిన యేమి జేసెదమొ! యలరి మేము వర్తించెదమో! 3

భరతుని జేతను నిరర్ధకముగా బన్నుగ వచ్చితి మిచ్చటకున్,
కార్యమంతయును జరిగిన తదుపరి కదిలివచ్చితిమి రణమునకున్,
ముందుగ వచ్చిన రాజులందఱును చందముగా నిస్సంశయతన్
రాక్షసులను మఱి సంహరించియును రహి యుండెడి వారును మఱియున్! 4

రామలక్ష్మణుల పరాక్రమంబున రహి మేమును రక్షింపబడీ,
మహాసముద్రము నావలి యొడ్డున మానుగ యే భయమును లేకన్,
యుద్ధము జేసెడి యుండు వారలము యుద్ధతి యసురుల నెదిరించీ,
విజయంబును సాధించి యుండెదము విమల విక్రమము గనబఱచీ! 5

వేలకొలది రాజులు నీ కథలను విమలములగు గథలును మఱియున్,
జెప్పికొనుచు బహు సంతోషంబున జేరి కీర్తనలు బాడుచునూ!
సంతోషంబున దన్మయమందుచు దగ శూరత్వము దోడుతనూ,
వీరగీతముల బాడుచు బోయిరి విమలత దమ నగరంబులకున్! 6

ఆ నరేంద్రులును ప్రసిద్ధంబులును నైశ్వర్యంబుల గూడినవీ,
సంతసించినవి ధనధాన్యంబుల సమృద్ధంబులును నవియు మఱిన్,
విడిచి వచ్చి నవు డెటుల నుండెనో యా విధముగ నున్నట్టివియునూ,
ఆ రాజ్యములకు బోయి పిమ్మటను నలరుచు సంతోషముతోడన్
శ్రీరామునకును బ్రీతికూర్పగా బ్రీతిని యనేక విధములునూ,
రత్నములను, మణులను, హారములును రమ్య సుగంధములును మఱియున్,
కానుకలుగ బంపిరి రామునకును కమ్మని యుపహారంబులునూ! 7,8

గుఱ్ఱంబులు మఱి వాహనంబులును గూరిమి రత్నంబులు మఱియున్,
మదోత్కటంబగు కుంజరంబులును మానుగ ముఖ్య సుగంధములున్,
దివ్యాలంకారములు, మణులునూ, దీరుగ ముత్తెపు హారములున్!
రూపవతులునగు దాసీజనముల రూఢిగ యనేక విధములునూ,
మేకల గొఱ్ఱెల మందల బంపిరి మేలగు నావుల మందలునూ,
అనేక విధముల రథముల బంపిరి యా రామునకును నరేంద్రులున్! 9, 10

భరతుడు, లక్ష్మణ శత్రుఘ్నులునూ బన్నుగ రాజుల నంపి మఱిన్,
తిరిగి వచ్చెడీ సమయమునందున దీరుగ యనేక సంపదలున్
బహురత్నంబులు, మణులను దెచ్చిరి బన్నుగ తమ నగరంబునకున్,
తిరిగి వచ్చెడీ సమయమునందున దీరుగ దెచ్చిరి కానుకలన్! 11

ఆ పురుష శ్రేష్ఠులును మఱియునూ మానుగ కానుకలన్నియునూ
చిత్రములైనా బహు రత్నములను శ్రీకరమగు మణులను గూడన్,
సుగంధ ద్రవ్యములను మఱి దెచ్చిరి చిత్రమైన వస్తువుల మఱిన్,
రామచంద్రునకు సమర్పించిరీ రాజులిచ్చినా కానుకలన్! 12

మహాత్ముడైనా రామచంద్రుడును మానుగ కానుక లన్నియును
స్వీకరించి సంతోష పూర్వకము శ్రీకరముగ నా కానుకలన్,
తన కార్యము సాధించి పెట్టినా తగ సుగ్రీవునకును మఱియున్,
బహూకరించెను బహునాదరమున భవ్యాలంకారంబులనూ! 13

రామచంద్రుడును సంతోషముతో రహి విభీషణునకును మఱియున్
ఎవరి సహాయము జేత తనకు మఱి యింపుగ విజయము గలిగినదో!
అట్టి రాక్షసులకును, వానరులకు నిట్టె యిచ్చె నా కానుకలన్,
స్వీయ హస్తముల నలంకరించెను సిద్ధిని గోరుచు వారలకున్! 14

మహాబలముగల సమస్తమైనా మానుగ యా కపి రాక్షసులున్,
రామునిచేతను బహూకరించిన రత్నంబులు మఱి హారములున్,
శిరస్సులందున బాహువులందున పరిపరి విధముల యంగములన్,
ధరించి రంతట తన్మయంబుగను దగ పకపక నవ్వుచును మఱిన్! 15

ఇక్ష్వాకుల వంశమున బుట్టినా విమల ధర్మములు దెలిసిన యా
మహారథుండును, వీర్యవంతుడును మఱియు కమల పత్రాక్షుండున్,
అయిన రామచంద్రుండు శీఘ్రముగ నటగల హనుమంతుని మఱియున్,
మహా బాహువగు నంగదునీ మఱి యలరెడి యంకము నందుననూ
కూర్చొనబెట్టుక కుమారులకు వలె కూరిమి ప్రీతిని జిందుచునూ,
సుగ్రీవునితో నిటులను బలికెను సురుచిరముగను సువచనములన్! 16

హరీశ్వరా! యీ యంగదుండునూ యలరు సుపుత్రుడు నీకు మఱిన్,
ఈ హనుమంతుడు నీకు మంత్రి సుమ! నింపుగ నీ యోచనలందున్,
సంబంధించిన వారు సుమా! మఱి సరసత నా హితమందుననూ,
గూడువారు మఱి గోరువారునూ కూరిమి నిను బట్టియు వీరున్,
అనేక విధముల సత్కారంబుల నందదగిన వారును వీరున్! 17, 18

మహా యశంబును గలవారును మఱి మానుగ యీ విధముగ బలికీ
తన శరీరమున నుండి దీసి మఱి దగ యమూల్యమగు భూషణముల్,
ఆ యంగదునికి, హనుమంతునికిని నలంకరించెను నందముగా,
వారల సొగసును గాంచి రాముడును భవ్యానందంబును బొందెన్! 19

నరులయందునను శ్రేష్ఠుడైన యా నయముగ రాఘవుడును మఱియున్
మహా విక్రమము గలిగినట్టి యా వానర యూధపనాయకులున్,
శ్రేష్ఠులైన నీలుని మఱి నలునీ శ్రీకరముగ కేసరి కుముదున్
గంధ మాదనుని సుషేణునీ మఱి ఘన విక్రముడగు పనసుణ్ణీ!
మైందుని ద్వివిదుని జాంబవంతునీ మానుగ గవాక్షు వినతుణ్ణీ!
ధూమ్రాక్షుని మఱి వలీముఖుణ్ణీ తోరముగాను ప్రజంఘునినీ,
మహాబలముగల సన్నాధుణ్ణీ మానుగ దరీముఖుని మఱియున్,
వానర యూధపనాయకుడైనా వనర యింద్రజానుణ్ణి మఱిన్! 20,21,22,23

వేఱువేఱుగా బలుకరించుచును విమల నేత్రములతో వారిన్
త్రాగుచున్నవాడా యనునట్లుగ దగ గాంచుచు నీ విధి బలికెన్!

ఓ వానరులారా! మీరందఱు యెనరగ నాకు సుమిత్రులునూ
నా శరీరమని భావింతును నే నయముగ మీరందఱను మఱిన్! 24

నా సోదరులని భావింతును నే నయముగ దలతును మదియందున్,
ఘన వ్యసనంబున యుద్ధరింపబడి ఘన రణమున జయమందితినీ,
మీరలు ఉత్తమ మిత్రసత్తములు, మేదుర సుగ్రీవుండు మఱిన్
ధన్యుడనుచునూ మృదుమధురముగా దగువచనములను బలుకుచునూ
అలంకారములు నమూల్యంబులగు నలరు వజ్రముల హారములున్,
బహూకరించుచు గౌగలించుకొనె బహు ప్రీతిని వారిని గాంచెన్! 25

అల సుభక్తిగల కపులందఱునూ యలరు సుగంధము లైనట్టీ
తీయని తేనెలు ద్రావుచు వారలు దీరుగ పరిశుద్ధములైనా!
మాంసంబులునూ, కందమూలముల మానుగ ఫలములను దినుచున్,
ఆ యయోధ్యవనమున వసించిరీ యలరుచు వానరు లందఱునూ! 26

ఆ వానరులును నీ ప్రకారమున యలరుచు వసించుచుండగనూ,
అధికముగా నొక మాసము గడిచెను నానందముగా వారలకున్,
రామభక్తిగల వానరులకునూ, యా కాలంబంతయును మఱిన్,
ముహూర్త మాత్రముగా గడిచినదీ మోదముగా కపులకును మఱిన్! 27

రామచంద్రుడును స్వేచ్ఛా రూపము రహి ధరించు కపివీరులతో,
మహావీర్యమును గలిగినట్టి యా మానుగ రాక్షస వీరులతో,
మహాబలంబును గలిగినట్టి యా మానుగ భల్లూకంబులతో,
బహు సుఖంబుగా కాలము గడిపెను, బహు చరిత్ర గాథలు వినుచున్! 28

ఈ ప్రకారమున యన్ని విధములను నింపుగ సంతసమున నున్నా
రాక్షస వీరులు కపివీరులకును రమ్యముగా దినములు గడిచెన్,
శిశిరఋతువులో మొదటి మాసమును శీఘ్రముగా వారికి గడిచెన్,
ఆటపాటలా సంగీతములను నలరు సుమంజుల వాద్యములన్! 29

రమ్యమైన యా యయోధ్యనగరిని యానందము నందుచునున్నా,
వానరాదులకు రాక్షసులకు మఱి వనరగ కాలంబంతయునూ,
రామచంద్రుడును ప్రేమ పూర్వకము రహి జూచెడి యాదరములనూ,
బహుముఖ యానందంబుల తోడను బన్నుగ గడిచెను కాలంబున్! 30

శ్రీరామ కథా సుధా లహరి యందు - ఉత్తరకాండములో
ముప్పది తొమ్మిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నలుబదియవ సర్గము

(రాముడు సుగ్రీవాది వానరవీరులను, విభీషణాది రాక్షసవీరులను సన్మానించి వారివారి దేశములకు వారిని బంపుట)

అల వానర భల్లూక రాక్షసులు నా విధి వసించుచుండగనూ
మహావీరుడగు రామచంద్రుడును రమ్యముగా సుగ్రీవునితో
ఈ విధమగు వాక్యములను బలికెను నిండు మనసునను గూడికొనీ,
స్నేహ రసంబును జిందుచు నుండగ చిరతర శుభమును గోరుచునూ! 1

ఓ సౌమ్యుడ! ఓ సుగ్రీవా! విను! సురుచిరముగ నా వచనములన్,
సురలచేత, మఱి యసురులజేతను శూరత్వంబును నెదిరింపన్,
శక్యముగానీ కిష్కింధకు మఱి సరసత బోదువుగాత! మఱిన్,
మంత్రులతోడను విహితకంటకము మానుగ నుండిన రాజ్యంబున్,
పాలింపుము నీ వారలనందఱ బరగ కన్న బిడ్డలకు వలెన్! 2

మహాబాహువులు గలవాడా విను! మానుగ నాదు సువాక్యములన్,
పరమప్రీతిగలవాడవు నగుచును బన్నుగ యా యంగదుని మఱిన్!
మహా మంత్రియగు నా హనుమంతుని మహాబలముగల నలుని మఱిన్,
ప్రేమతోడుతను జూచుకొనుము మఱి ప్రీతినొలుకు మఱి వారలపై! 3

నీదు మామయగు సుషేణునీ మఱి నిర్భయుడగు తారుని మఱియున్,
బలవంతులలో శ్రేష్ఠుడైన యా బన్నుగ కుముదుని గాంచవలెన్,
దుర్ధర్షుండును మహాబలీయుడు దూరదర్శియగు నీలుణ్ణీ!
వీరుడైన శతబలిని గూడనూ విమల బుద్ధియగు మైందునినీ,
ద్వివిదుని, గవయుని, శరభుని మఱియును దీరుగ భల్లూకంబులకున్,
రాజగునట్టియు, దుర్ధర్షుండును రమ్య బలాఢ్యుడు నైనట్టే
జాంబవంతునీ గంధమాదనుని సరసత ప్రీతిని గూడికొనీ,
గాంచుచుండుమా! సహోదరులుగా కమ్మని జూపులతోని మఱిన్! 4,5,6

మహా పరాక్రముడైన ఋషభునీ మానుగ సుపాటలుండనుచున్
పిలువబడెడి యా వానరునీ మఱి ప్రేమను కేసరి, శరభుణ్ణీ!

శంభుణ్ణీ మఱి మహాబలముగల శంఖచూడునీ గనుగొనుమా!
నా కొఱకై మఱి తమ ప్రాణంబుల నయముగ త్యజింప సిద్ధంబై! 7

యున్న వారలను నా మహాత్ములను జెన్నుగ వారల నందఱనూ
ప్రేమను గూడిన వాడవగుచునూ ప్రియముగ వారల కనుగొనుమా!
అప్రియమెన్నడు జేయకుమా మఱి యనాదరంబును జేయకుమా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామా! 8

రామచంద్రుడును సుగ్రీవునితో రమ్యముగా నీ విధి బలికీ,
మాటిమాటికిని కౌగలించుకొని మధురముగా నటు బిమ్మటనూ,
రావణు తమ్ముడు విభీషణుని మఱి రమ్య మధుర వచనంబులతో
బలికె నిట్టులను రామచంద్రుడును భవ్య మధురమగు శబ్దములన్! 9

లంకా రాజ్యము బరిపాలింపుము! శంకలేక ప్రజలందఱినీ,
ధర్మము తెలిసిన వాడవనుచు నిను దగ నేనును లంకాపురినీ,
గల ప్రజలందఱు, రక్కసులందఱు, కమ్మని హృదయము గలవాడున్,
నీ సోదరుడగు కుబేరుండునూ నిరతము నమ్మిచు మన్నామూ! 10

విభీషణా విను! నీ వెన్నడునూ మమత విడకు ధర్మము పైనీ
అధర్మంబుపై బుద్ధి నిలుపకుము! ఆ మార్గము జనకెన్నడునూ!
మంచి బుద్ధి గల రాజులు మాత్రము నంచితముగ యీ ధరిత్రినీ,
అనుభవించెదరు బరిపాలింతురు నల యశస్సులను నందెదరూ! 11

ఓ రాజా! ఓ విభీషణా! విను! యొనరగ నాదు సువచనములన్!
నిత్యము సుగ్రీవుని మఱి నన్నును నిరతము జ్ఞాపక ముంచుకునీ,
రాజ్యపాలనము సేయుచుండుమా! రమ్యముగా సమభావమునన్,
ఏ బాధలునూ లేనివాడవై నింపుగ జను లంకాపురికిన్! 12

భల్లూకంబులు, కపిరాక్షసులును బన్నుగ శ్రీరాముని బలుకుల్,
విని వెనువెంటను 'బాగు!' 'బాగు!' నని విశదముగా బలుకుచు వారున్,
మాటి మాటికిని యా శ్రీరాముని మధుర ప్రశంసలు జేసిరటన్,
అంజలితోడను నమస్కరించిరి యంతులేని యాప్యాయతనూ! 13

మహా.బాహువులు గలవాడా! విను! మానుగ మాదు సువచనములన్,
రఘురామా! నీ బుద్ధియు మఱియును రమ్యమైన యా వీర్యంబున్

మహోఘనత నొందిన మాధుర్యము మానుగ స్వయంభూదేవువలెన్
బహు స్థిరమైనవి శాశ్వతమైనవి బరగ హృదయమున నిలుచునవీ! 14

ఆ వానరం రాక్షసు లందఱునూ యల భల్లూకంబులు గూడన్
అటుల వినయమున బలుకుచుండగా నట్టి సమయమున చిత్రముగా,
బుద్ధిమంతుడును మహావీరుడును బూనికతో హనుమంతుడునూ,
అంజలి ఘటించి నమస్కరించుచు నా రామునితో నిటులనియెన్! 15

ఓ రఘురామా! సీతారామా! రమ్యమైన వచనము వినుమా!
నీ యందున నా పరమ స్నేహమును నిత్యంబుగ నుండును గాతన్!
ఓ వీరా! నీ యందు భక్తియును నొనరగ స్థిరమైనదిగానూ!
నా భావంబును మఱియొక చోటుకు నయముగ బోకుండును గాతన్! 16

ఓ వీరా! యీ భూలోకంబున యొనరగ నీదు చరిత్రంబున్,
మహీతలంబున నిలిచి యుండునో మానుగ యా కాలము వఱకున్,
నా శరీరమున ప్రాణంబులునూ నయముగ నుండును చలించుచున్,
సందేహంబును లేదు మఱియునూ సంశయంబునూ లేదిందున్! 17

ఓ రఘురామా! ఓ రఘునందన! యొనరగ విను! నా వచనములన్,
దివ్యమైన నీ చరితంబును మఱి దివ్యమైన నీ కథను మఱిన్,
అప్సర స్త్రీలును నాడిపాడుచును నలరుచు వినిపింతురు గాతన్!
తంబుర తీగెకు వలెను మ్రోగెదను సంబరమున నే వినుచుందున్! 18

ఓ వీరా! ఓ ప్రభూ! వినుమిదే! యొనరగ విన్నప మాలింపూ!
అట్టి నీదు చరితామృతంబునూ యలరి వినుచు నటు బిమ్మటనూ!
అనిలము సుమేఘ పంక్తిని వోలెను నలరు నాదు నుత్కంఠతనూ!
తొలగజేసికొందును సుస్థిరముగ తోరముగా నిలిపెద మదినీ! 19

ఆ హనుమంతుడు నలరామునితో నలరి బలుకుచును నుండగనూ!
రామచంద్రుడును రమణీయమునగు రమ్యమైన సింహాసనమున్,
నుండి లేచియును నా హనుమంతుని నిండు కౌగిలిని జేర్చకొనీ,
ఆదరంబునూ, యప్యాయతనూ యలరి దొలుక యా సమయమునన్,
స్నేహపూర్వకముగా నిటు బలికెను చిత్తము హర్షము బొంగారన్! 20

వానర శ్రేష్ఠా! ఓ హనుమంతా! వనర నీవు కోరిన విధమున్,
జరుగగలదు! మఱి సందేహంబును సంశయంబునూ లేదు సుమా!
నా కథ జగతిని యెంతవఱకు మఱి నయముగ ప్రచారముండెడినో
అంతవఱకు నీ కీర్తి లోకమున కాంతివంతముగ నుండు నికన్,
శరీరంబునను, ప్రాణంబులునూ, సరసత నుండగ గలవు సుమా!
ఈ లోకము లున్నంతవఱకునూ నింపుగ నాకథ నిలుచు నిలన్! 21, 22

ఓ హనుమంతా! నీవు జేసినా వనరగ యుపకారంబులకున్,
ఒక్కొక యుపకారమునకు నేనును యొనర ప్రాణముల నిచ్చెదనూ!
కానీ, మిగిలిన యుపకారములకు గడగి ఋణపడియె యుందును నే
ఇంత ప్రేమ నాపై యెందులకో సుంతయు నెఱుగను హనుమంతా! 23

ఓ హనుమంతా! నీవును నాకును యొనరగ జేసిన సత్కృతులన్,
నా శరీరమందే యవి యన్నియు నయముగ జీర్ణంబగు గాతన్,
నరుడు నాపదలు వచ్చినప్పుడే నయముగ ప్రత్యుపకారమునన్,
పాత్రత నందును, నీ కే యాపద బరగ రాదుగద యెన్నడునూ! 24

అటు బిమ్మట యా రామచంద్రుడును నయముగ తన కంఠము నుండీ,
చంద్రుని వంటీ కాంతి గలిగినా సాంద్రవంతమగునది మఱియున్,
వైడూర్యంబును మధ్యమ మణిగా మానుగ గల హారము దీసీ,
ఆ హనుమంతుని కంఠమునందున నలంకరించెను రాఘవుడున్! 25

వక్షస్థలమున గట్టినట్టి యా వనరగ ఘన హారముతోడన్,
హనుమంతుండును శిఖరముపైనీ అల చంద్రుడు నిలిచిన యట్టీ!
మేఱు పర్వతము వలె నాతండును మిగుల ప్రకాశించెను నతడున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామా! 26

మహాబలముగల యా వానరులును మానుగ రాముని మాట వినీ,
లేచి లేచి తమ శిరసులజేతను లీలగ రాముని యడుగులకున్
నమస్కరించుచు బయలుదేరిరీ నయముగ సంతోషము తోడన్
అడుగులు వైచుచు ముందుకు నడిచిరి యలరి ధ్వనులు మఱి జేయుచునూ! 27

ఆ రఘురాముని యతి గాఢముగా నాలింగనమును జేసికొనీ,
సుగ్రీవుడు, ధర్మాత్ముడునైనా సురుచిర విభీషణుండు మఱిన్,

అందఱు గూడను కన్నీళులతో నలరి వ్యాకులత్వము జెందీ,
తమ తమ దేశంబులకు బోవగను దగురీతిని సిద్ధమునైరీ! 28

ఆ సమయంబున నలరాఘవునీ నలరి విడిచెడీ సమయమునన్,
వారందఱును డగ్గుత్తికచే నస్పష్టములగు మాటలతో,
కన్నీళులతో నిండినట్టి యా కలవరబడు నేత్రంబులతో,
మనస్సులును మఱి పనిచేయకనూ మూనుగ దుఃఖాక్రాంతులునై
ఏమియుదోచని స్థితిలో నుండిరి యెటు బోవలెనో దోచకనూ! 29

మహాత్ముడైనా రామచంద్రునీ మహోన్నతంబగు ననుగ్రహమున్,
లాలితంబుగను! బొందినట్టి యా లలి రాక్షసులును వానరులున్
అందఱుగూడను దేహంబులు విడి కందువ బోవుచు నున్నట్టీ
జీవునికినివలె తమ తమ గృహములు జేరగ బోయిరి శీఘ్రముగన్! 30

ఆ సమయంబున యా రాక్షసులును నల భల్లూకములును కపులున్,
రఘువంశంబును వర్ధిలజేసెడి రమ్య పురుషు డా రామునికిన్
నమస్కరించీ, వియోగంబుతో గలిగిన కన్నీళుల తోడన్,
నిండిన నేత్రంబుల తోడుతనూ పండిన రాలిన ఫలములుగా
ప్రవాసంబునకు బోవు వారి వలె బన్నుగ బోయిరి గృహములకున్! 31

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నలుబదియవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుథాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నలుబది యొకటవ సర్గము

(కుబేరుడు బంపగా పుష్పకము రాముని వద్దకు వచ్చుట -
రాముడు దానిని పూజించి మరల బంపివేయుట -
భరతుడు రామరాజ్యములోని అద్భుత ప్రభావములను వర్ణించి చెప్పుట)

బహుబలశాలియు రాఘవుండునూ భల్లూకంబులు వానరులున్,
రాక్షసులను మఱి చంపివేసియును రహి సోదరులను గూడికొనీ,
సుఖవంతుడునై శుభంబుగా మఱి సురుచిరముగ యానందించెన్,
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

మహాప్రభువు నగు రామచంద్రుడును మానుగ సోదరులను గూడీ,
కూర్చుని యుండీ వారలతోడను కూరిమి మాటాడుచు నుండన్,
అపరాహ్ణంబగు సమయమునందున యంతరిక్షమున నుండి మఱిన్
మధురమైన వాక్యము వినిపించెను మానుగ తమ్ములతోడుతనూ! 2

సౌమ్యుడవగు ఓ రామా వినుమా! సరసత కరుణా పూర్ణముగన్,
నిరీక్షింపుమా! ననుగనుమో ప్రభు! నిర్మల భావము దోడుతనూ!
కుబేరు భవనమునుండి వచ్చినా కూరిమి పుష్పక మనునట్టీ
విమాన వాహనమని తెలిపితినీ వేగము విను నావచనములన్! 3

నరులలోపలను శ్రేష్ఠుడవైనా నయముగ రామా! నీ యాజ్ఞన్
అల కుబేరునీ సేవించుటకై యతని భవనమును జేరితినీ!
ఆతడు నన్నును దిరస్కరించుచు నలరుచు నాతడు నిటు బలికెన్
ఎవరి యాజ్ఞ పాలింపగవలెనో నింపుగ దెలియుట లేదు మఱిన్! 4

మహాత్ముడైనా నరేంద్రుండునగు మానుగ రాఘవు తోని మఱిన్
దుర్ధర్షుండగు లంకేశ్వరునీ దోర్బలమున రావణు జంపీ,
నిన్నును స్వాధీనమును జేసికొనె నిను జయించినా వాడగుచున్!
ఎటుల నేను నిను నా వాహనమని చటులత బలుకుదు రూఢముగా? 5

దురాత్ముడైనా యా రావణునీ దుష్టులైన పరివారంబున్,
పుత్రులు, బంధులు జంపబడుటచే బొలుపుగ నేనును గూడ మఱిన్,

సంతోషంబును బొందుచుంటినీ సంతాపంబును లేక మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 6

పరమాత్ముండగు రామచంద్రుడును బన్నుగ లంకాపురియందున్
నిను జయించెనూ రావణునుండీ నిను హస్తగతమును జేసికొనెన్,
అందువలన ఓ సౌమ్య విమానమ! ఆ శ్రీరాముని మోయు మికన్!
ఆజ్ఞాపించుచు నుంటి విమానమ! యటుల జేయుమా! యికముందున్! 7

ఇది నా మనసున ఘనమగు కోరిక! యింపుగ మోయుము రఘురామున్
త్రైలోక్యంబుల నడిపించెడి యా తత్త్వవేత్తయగు శ్రీరామున్,
మోయుచుండవలెనని నా వాంఛయు మోయుచుండుమా నిక మీదన్!
అందుచేత యే మాత్రంబును మఱి కందక పరితాపము లేకన్,
అల రాముని దరిజేరు విమానమ! యా దేవునికిని వాహనమై! 8

అట్టి నేను మఱి మహాత్ముడైనా యల ధనదుని యాజ్ఞను దెలిసీ
నీ సమీపమునకును వచ్చితినీ నిర్మల భావముతోని మఱిన్!
నిర్విశంకమున ననుగ్రహింపుము! స్వీకరింపు నిశ్చిత బుద్ధిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 9

కుబేరు నాజ్ఞను నే భూతములును కూరిమి నన్నెదిరిం పుగా
నేను ప్రస్తుతము నీ యాజ్ఞలనూ నిర్మలముగ తలదాల్చుచునూ!
అనుసరించి మఱి ప్రభావంబుతో నలరి సంచరించెద దిశలన్,
కటాక్షించి నను జేకొను రామా! కరుణాసాగర శ్రీరామా! 10

ఆ సమయంబున పుష్పకంబుచే నలరి యిటుల బలుకగ బడుచున్
మహాబలముగల శ్రీరాముండును మఱల దిరిగి వచ్చిన యట్టీ
పుష్పక విమానమును గాంచుచును, బూనికతో నిటులను బలికెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 11

విమానములలో శ్రేష్ఠమైన ఓ విలసిత పుష్పక విమానమా!
అది యటులైనా నీకు స్వాగతము! అలరుగాత! సుస్వాగతమూ!
అల కుబేరుడును ననుకూలుడునై యంగీకారము దెలిపెగదా!
నిన్ను మేము నుపయోగించిననూ నేరములేదు గదా మాకున్! 12

మహాబాహువగు రామచంద్రుడును మానుగ యా సమయమునందున్,
ఆ పుష్పకమును లాజలతోడను, నలరు పుష్పములతోని మఱిన్

ధూపంబులతో, సుగంధములతో, సురుచిర వస్తువులను గూర్చి,
పూజించియు మఱి మధురభావమున పొలుపుగ బలికెను సంప్రీతిన్!
'ఎపుడు నిన్ను మది స్మరింతునో మఱి యపుడు రమ్ము! ననుచును బలికెన్! 13

సౌమ్య విమానమ! సరసత వినుమా! సౌమ్యత నాదు సువచనములన్,
సిద్ధుల సంచారంబు నందునను జేరి యడ్డముగ నుండకుమా!
యథేష్టంబుగను నన్ని దిక్కులను నలరి సంచరించెడి వేళన్,
ఏ యడ్డును మఱి లేకుండుతనూ! యిష్టరీతి నడుతువుగాతన్! 14

రామునిచేతను బూజింపగబడి రమ్యమైన యా పుష్పకమున్
'అట్లే యగు గాతను' యని బలుకుచు నాతని యాజ్ఞను గైకొనుచున్!
తనకు నిష్టమగు ప్రదేశంబునకు దగ యా దిక్కునకును బోయెన్!
రమ్యమైన కాంతులను జిమ్ముచును రమణీయంబగు ధ్వనితోడన్! 15

పుణ్య స్వరూపమునైన పుష్పకము బొలుపుగ యంతర్ధానంబున్
నగుచుండగ యా భరతకుమారుడు నయముగ యంజలి ఘటియించి,
శ్రీరామునితో నిటులను బలికెను చిత్తము హర్షము బులకింపన్!
కుతూహలంబును గలుగగ మదిలో కూరిమి యాశ్చర్యము తోడన్! 16

ఓ వీరుడ! వినులాత్ముడవైనా విమలత నీ పరిపాలనలో
మనుష్య భిన్నములైన ప్రాణులును మాటిమాటికిని స్పష్టముగా
మాటలాడుచును కనబడుచున్నవి మటుమాయము లగుచున్నవియున్,
చిత్రమైన సంభాషణంబులును జేరువగా వినబడుచుండెన్! 17

శ్రీరామా! నీవును నయోధ్యకును శీఘ్రముగా వచ్చియు మఱియున్,
మాసముకంటెను కొంచెమధికముగ మానుగ నయ్యెను నెక్కువగన్!
అనారోగ్యమును లేదు మర్త్యులకు నస్థిర భావము లేదు మఱిన్,
జీర్ణమైన ప్రాణులకును గూడను స్థిర రూపము గలుగుచు నుండెన్! 18

శ్రీరామా! స్త్రీలును రాజ్యంబున శ్రీకరముగ రోగములేని
సంతానంబును గనుచున్నారలు కమ్మని యారోగ్యము తోడన్,
పురుషులందఱును తుష్టిని పుష్టిని బొలుపుగ శరీర సౌష్ఠవమున్,

గలగియుండిరీ పురమునందునను కమ్మని కాలక్షేపములన్,
సంతోషంబున నుండిరి పౌరులు సరసత్వంబును గూడికొనీ! 19

మేఘంబులు మఱి యుక్తకాలమున మేదుర యమృత తుల్యములా
ఉదకంబుల వర్షించుచున్నవీ సదమల భావము తోని మఱిన్,
ఈ వాయువులును స్పర్శయుక్తమై నింపుగ సుఖకరములు నగుచున్,
మంగళ ప్రదములు నగుచును నవియును మానుగ వీచుచు నున్నవియున్! 20

సర్వేశ్వర! ఓ రామా! వినుమా! నయముగ మా వచనంబులనూ
చిరకాలంబును నిట్టి నరేంద్రుడు శ్రీకరముగ కావలె మాకున్!
అనుచు బురమునను వసించువారలు నలరి జానపదులును గూడన్!
దెలుపుకొనుచు నున్నారు రాఘవా! దీరుగ రాజ్యములోని ప్రజల్! 21

భరతుని జేతను సమీరితములగు బహు భంగుల మధురములైనా
ఇట్టి పలుకులను విని రాఘవుడును నిట్టె బొందె సంతోషంబున్,
ప్రజల వాక్కు మఱి గీటురాయిగద! ప్రభునకు నెల్లపుడును మఱిన్
మార్గదర్శియై ముందు నడువవలె మఱి యాదర్శపు ద్రోవలనూ! 22

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నలుబది యొకటవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నలుబది రెండవ సర్గము

(శ్రీ సీతారాములు అశోక వాటికలో విహరించుట, గర్భవతియైన సీతాదేవికి
తపోవనమును జూడవలయునను గోరిక ఉదయించుట,
రాముడు నీ కోరికను దీర్చెదనని మాట యిచ్చుట)

మహాబాహువగు శ్రీ రఘురాముడు మానుగ యా సమయమునందున్,
హేమ భూషితంబగు పుష్పకమును కామిత సుపుష్ప పూజలతో,
పంపివేసి తన స్వస్థానమునకును నింపుగ సంతోషము తోడన్,
అశోక వనమున బ్రవేశించెనూ యలరి విహారము సేయగనూ! 1

ఆ యశోకవని యందచందములు నలవిగాదు మఱి దెలుపుటకున్,
చందనాగురుల చూతంబులతో అందమైన పున్నాగంబుల్,
రక్తచందనపు వృక్షంబులతో రమ్య దారువుల జేత మఱిన్,
ఆ యశోకవని చుట్టును నెలకొని యంతులేని శోభను గూర్చెన్,
అట్టి వనంబున ప్రవేశించెనూ, యల రాఘవుడును విహరింపన్! 2

చందన యశోక పున్నాగంబులు కంపిత మధూక వృక్షంబుల్,
అసన వృక్షంబులు మఱి ధూమములేని యగ్నికాంతులు గలుగూ,
పారిజాత వృక్షంబులు గూడను ప్రకాశింప జేయుచునుండెన్,
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

లోధ్ర నీప యర్జున వృక్షంబుల లోల నాగ వృక్షంబులతో,
ఏడాకులు గల యరటి చెట్లతో నింపుగ మందారంబులతో
బండి గురివెంద దీవెలతోడను మండిత పూవుల దీవెలతో,
వ్యాకులమై యుండెను యశోకవని రమ్యమైన శోభలతోడన్,
అల యశోకవని ప్రవేశించెనూ యల రాఘవుడును విహరింపన్! 4

ప్రియంగువులచే కదంబములచే ప్రీతివకుల వృక్షంబులచే
జంబూ వృక్షంబులచేతను మఱి స్తంభంబులవలె నున్నట్టి
దాడిమ వృక్షంబుల చేతను మఱి దనర కోవిదారంబులచే
శోభితమై యుండెను నశోకవని సురుచిర పుష్పంబులతోడన్
అల యశోక వని ప్రవేశించెనూ యల రాఘవుడును విహరింపన్! 5

సర్వవేళలను కుసుమంబులతో రమ్యమైన ఫలములతోడన్
మనోహరంబగు దివ్యగంధముల మానుగ రసములు జిందుచునూ!
తరుణాంకురముల పల్లవములతో ప్రకాశించు చుండెను నపుడున్
అల యశోకవని ప్రవేశించెను యల రాఘవుడును విహరింపన్! 6

అచ్చటగల యా దివ్య వృక్షముల నలరుచు నటగల శిల్పులునూ,
అందముగా శోభించునట్లుగా నటగల కొమ్మలు దీవెలనూ,
కత్తిరించి మఱి జిక్కులు దీసీ కమనీయముగా దీర్చిరటన్,
ఆ వృక్షములును నందము జిందుచు నలరెడి చిగుళ్ల బూవులతో
మత్తభ్రమర సంకులమై యుండెను మానుగ మధుర సుగీతములన్,
నిండియుండెనూ ప్రకాశించుచును మెండుగ హృదయానందమునన్,
అల యశోకమును బ్రవేశించెనూ యల రాఘవుడును విహరింపన్! 7

కోకిల గుంపులచేతను మఱియును కోమల భృంగంబుల జేతన్,
నానా వర్ణంబులుగల బక్షులు నాట్యమాడుచుండెను నచటన్,
చూతవృక్షముల అగ్రభాగముల శోభించెడి పూగుత్తులచే
చిత్ర వర్ణములుగా నట నుండెను జిత్తరువులు గీసిన యటులన్
అల యశోకవని బ్రవేశించెనూ యల రాఘవుడును విహరింపన్! 8

అచట గలిగినా కొన్ని వృక్షములు అచ్చమైన బంగారముతో
సమానంబుగా నుండెను నచ్చట సరసత యగ్నుల శిఖలవలెన్,
మఱి కొన్నియు నీలాంజన ప్రభతో మానుగ సమముగ నుండెనటన్,
అల యశోకవని బ్రవేశించెనూ నల రాఘవుడును విహరింపన్! 9

ఆ వని లోపల పరిమళించెడీ అనేక విధముల పుష్పములున్
అనేక విధముల పూలమాలికలు అందము జిందుచు నచ్చోటన్,
పరిమళమగు యుదకంబుల తోడను బన్నుగ యనేక రూపములన్,
దిగుడు బావులుగ కనిపించుచునూ, దిశలు బ్రకాశించుచు నుండెన్,
అల యశోకవని ప్రవేశించెనూ నల రాఘవుడును విహరింపన్! 10

మాణిక్యంబులతో నిర్మించిరి మానుగ దిగు బావుల మెట్లున్
మెట్ల మధ్య గల చపటాలను మఱి మిగుల స్ఫటిక మాణిక్యములన్,
గూర్చిరి శిల్పులు బహు శోభితముగ కుదురుగ చిత్ర సువర్ణములన్,
వికసించిన పద్మంబుల తోడను విమలమైన యుత్పలములతో
చక్రవాకములు నా మెట్లను మఱి శోభను గూర్చుచు నుండె నటన్! 11

నీటికాకులును, జిలుకలు, హంసలు, సారస పక్షులు జేయు ధ్వనుల్,
మారు మ్రోగుచుండెను యా బావులు యానుగ బడిపిల్లల వోలెన్,
తీరమునందున యున్న వృక్షములు చిత్రములగు బూవుల తోడన్!
వాని శోభలను బెంచుచు నుండెను వనరగ శిల్ప కళా రీతిన్! 12

అనేక యాకారంబులతోడను అట్టి దిగుడు బావులకు మఱిన్
ప్రాకారంబులు, వాని చుట్టునూ శిలాఫలకములు నుండె నటన్,
శిల్పుల ఘన చాతుర్యమంతయును, చిత్రముగా నట కనిపించున్,
తోటమాలులా తోరపు శ్రద్ధయు తులకించును నా వనమందున్! 13

ఆ యశోకవన సమీపంబునను నలరు మణుల వైడూర్యములన్,
సమానమైనా శాద్వలముండెను చక్కని పచ్చిక తోని మఱిన్,
ఆ సమీపమున నున్న వనములును నందమైన కుసుమంబులతో
పుష్పించిన వృక్షములు నుండెనూ పూర్ణచంద్రునీ తరువులుగా! 14

పోటీబడి మఱి పెరుగుచున్నవా? పొందుగ నా విధి వృక్షములున్,
పుష్పంబులతో నిండినట్టి యా పొలుపుగ నా ఘన వృక్షములున్,
పుష్పంబులునూ రాలి తొడిమలను స్ఫూర్తి శిలాఫలకంబులపై
నక్షత్రంబుల వోలె నింగినీ నయముగ కనిపించుచు నుండెన్! 15

ఆ శ్రీరాముని సన్నివేశమున నద్భుతమును నగు కాననమున్
అల యింద్రుని నందన వనమును వలె యందాలను జిందుచు నుండెన్,
అల బ్రహ్మయు నిర్మించినట్టి యా యాశ్చర్యంబగు చైత్రరథం
వనమును బోలెను ప్రకాశించెనూ మన శ్రీరాముని వని గూడన్! 16

రఘు నందనుడగు రామచంద్రుడును రమ్యా శోకము జేరి మఱిన్
అనేక విధముల యాసనములు గల యాగృహంబులును నటనుండెన్,
అచ్చటనచ్చట లతా గృహంబులు నలరుచు నుండెను నా వనిలో
అట్టి యశోకము ప్రవేశించియును అల శ్రీరాముడు శీఘ్రముగన్,
పుష్ప ప్రకర భూషితమైనట్టి కుథాస్తరణ సంస్తీర్ణమునన్
ఆసనంబుపైనను గూర్చుండెను నందాలను వని గాంచుచునూ! 17

ఆ శ్రీరాముడు పరిశుద్ధమునగు మైరేయకమను మద్యమునూ
పెద్ద యుసిరికయు బెల్లముతోడను పెంపుగ జేసిన మధువు మఱిన్
హస్తముతోడను గ్రహించి మఱియును నల దేవేంద్రుడు ప్రియసతికిన్
శచీదేవికిని ద్రాగించినయటు సఖియ సీతకును ద్రావించెన్! 18

రాముడు భుజించుటకును వేగమే రహిసేవకులును వేవేగన్,
శుద్ధి జేసినా మాంసంబును మఱి తోరముగా నుపహారములున్,
అనేక విధముల ఫలహారములును నలరుచు దెచ్చిరి శీఘ్రముగన్,
ఆ శ్రీరాముని ముందు నుంచిరీ యతి వినయంబున కింకరులున్! 19

నృత్య గీతములయందు నిపుణులగు నేర్పరులగు కింనర గణముల్
చుట్టబడిన యా యప్సర స్త్రీలును సుందరులగు నురగుల గణముల్,
ఆ శ్రీరాముని యెదుట నిలువబడి యభినందనమును జేయుచునూ,
నృత్యము జేసిరి శాస్త్రబద్ధముగ నిండుదనంబున యభినయమున్ 20

మంచి నేర్పుగలవారును మఱియును నంచితముగ మఱి రూపవతుల్
నృత్యగీతములయందు ప్రవీణులు నేతృత్వము గలవారు మఱిన్,
పానంబునకును పశులై వారలు బన్నుగ మత్తిలుచును వారున్,
రాముని దగ్గఱ నృత్యము జేసిరి రంజిల్లుచు తన్మయ మగుచున్! 21

ఆనందింపగ జేయువారిలో నతిశయంబు గలవాడు మఱిన్
శ్రేష్ఠుండును మఱి ధర్మాత్ముండును స్థిరమగు మనసును గలవాడున్,
మనోభిరామలు, పరమ భూషితలు మానుగ యా స్త్రీలును మఱియున్
నిత్యంబును క్రీడింపజేసెనూ నృత్య గానముల రాఘవుడున్! 22

(ఈ శ్లోకం ప్రాచ్యప్రతిలో లేదు)

అల జానకితో గూర్చొని యున్నా యా శ్రీరాముని గాంచగనూ!
తేజస్సులతో సౌజన్యముతో దీరుగనున్నా శ్రీరామున్,
అల యరుంధతీ దేవి ప్రక్కనూ యల మహాఋషియు వసిష్ఠుడున్,
ప్రకాశించి నటు బ్రకాశించిరీ బన్నుగ యా సీతారాముల్! 23

శ్రీ రాఘవుడును నిట్టి విధముగా చిత్తము సంతసమును గూడీ,
దేవకన్యతో సమానురాలగు దివ్య మహిషి సీతాదేవిన్,
ఆ శ్రీరాముడు దేవపురుషువలె నలరుచు ప్రతి దినమందుననూ
క్రీడింపగ జేసెను వైదేహిని కింనర నృత్యంబులతోడన్! 24

సీతారాములు చిరకాలంబును జిరతర భోగంబులను మఱిన్
అనుభవించుచుండిరి వారలునూ యాట పాటలను దేలుచునూ!
ఎల్లపుడును మఱి భోగంబులకును నింపుగ రమ్యమునైనదియున్
శిశిర కాలమును గడిచిపోయినది శీఘ్రము వారలకును నపుడున్! 25

ఆ మహాత్ములిద్దఱికిని యపుడును యలరి పదివేల వత్సరముల్
గడిచిపోయినవి కాలగర్భమున కానిపింపకను వివరముగన్
వారిరువురునూ యనేక విధముల యలరు భోగముల నందగనూ
శిశిర ఋతువునూ గడిచిపోయినది శీఘ్రముగా రాత్రులు బగళుల్! 26

వి. పైని రెండు శ్లోకాలకు బదులుగా ప్రాచ్య పాఠములో

"తథా చ రమమాణస్య తస్యాథ శిశిరాగమ
వ్యతీతఃపూరుషేన్ద్రస్య రాఘవస్య మహాత్మనః"

అను ఒక శ్లోకము మాత్రమే యున్నది..

ధర్మవేత్తయగు శ్రీరాముండును దగ పూర్వాహ్నము నందుననూ
ధర్మముజేతను ధర్మకార్యముల దగ సమాప్తి మఱి జేసికొనీ,
శ్రేష్ఠమైన యపరాహ్న సమయమున శ్రీకరముగ యంతఃపురమందున్
గడుపుచుండెడీవాడు నిత్యమును కార్యాలోచన జేయుచునూ! 27

వైదేహీయును పూర్వహ్నముననను వనర దేవ కార్యంబులనూ,
పూర్తిజేసి తన యత్తగారలకు బొలుపుగ సేవలు జేసెడిదీ,
అత్తగార లందఱికిని గూడను నవిశేషత లేకుండగనూ,
మాతృమూర్తులుగ భావించెడిదీ మాధుర్యము వెదజల్లెడిదీ! 28

అటుబిమ్మట యా వైదేహీయును అలరు చిత్రములు నైనట్టీ
ఆభరణాంబరముల ధరియించీ మఱి యల త్రివిష్టపము నందుననూ,
ఉపవిష్టుండగు సహస్రాక్షునీ యువిద శచీసతి జేరునటుల్,
ఆ శ్రీరాముని సమీపంబునకు నలరుచు బోవుచు నుండెడిదీ! 29

ఆ శ్రీరాముడు మంగళకరమగు మధుర రూపమును గమనించీ
ధర్మపత్నియగు సీతాదేవిని మధురముగా వీక్షించుచునూ,
అంతులేని యానందమునందెను నరమరలేనీ స్పందనలన్,
బాగు! బాగు! నని యభినందించెను బన్నుగ ప్రీతి సువాక్యములన్! 30

దేవకన్యతో సమానురాలును దీరుగ సుందరమైనట్టీ,
కటి ప్రదేశము గలిగినయట్టీ కమలాక్షియునగు మైథిలినీ,
సంబోధించుచు రాముడు బలికెను కమనీయంబగు పలుకులనూ,

వైదేహీ! నీయందు నాకు మఱి దీరుగ యపత్య లాభంబున్,
గలుగగలదు! నా మధుర క్షణముళ్ళను గడు వేగముగా రాగలవూ! 31

జనకసుతా! నీ మనసు కోరికను చయ్యన దెలుపుము ప్రియ సఖియా!
ఏ కోరిక నే దీర్చవలయునో నింపుగ దెలుపుము మధురముగా!
అనుచు బలుకగా రామచంద్రుడును నా భూపుత్రియు నిటులనియెన్,
చిఱునవ్వులు జిందులు ద్రొక్కగనూ శ్రీరామునితో నిటు బలికెన్! 32

ఓ రాఘవ! నా మనసున కోరిక మహనీయంబైనది మఱియున్
అనుచు బలికె నా సీతాదేవియు నా శ్రీరామునితో నిటులన్!
పుణ్యప్రదమగు తపోవనములను బొందుగ జూడగ వలె ననియున్,
గంగా తీరము నందు వసించెడి ఘనమగు తేజస్సులు గలుగూ!
కందమూలముల భక్షించెడి యా బొందుగ దీక్షితు లైనట్టి
అట్టి ఋషుల పాదముల దగ్గఱకు నిట్టె వసింపగవలె ననుచున్
నా హృదయంబున కోరిక యున్నది నాథ! దీర్చుమా? వాంఛితమున్! 33

శ్రీ రామా! నా మదిలో కోరిక శ్రీకరముగ దీర్చుము నిదియే!
ఫలమూలంబులు భుజించునట్టి బరగ ఋషుల యాశ్రమములనూ!
ఒక్క రాత్రియైనను వసించి మఱి చిక్కని సంస్కారమునందీ
ధన్యను గావలెనను గోరిక యిదె దగ దీర్చుము శ్రీ రఘురామా! 34

ఈ విధమున వైదేహి బలుకగా నింపుగ శ్రీరాముడు బలికెన్,
వైదేహీ! అట్లేయగు గాతను! వనరగ నీ కోరిక దీరున్,
పయనము రేపే! సిద్ధముగమ్మా! బన్నుగ వన భూములకు మఱిన్,
నమ్మకంబు గల దానవు గమ్మా! నయముగ మాటను నిచ్చితినీ! 35

అక్లిష్టకర్మణుడైన రాముడును అలరు ప్రతిజ్ఞను జేసె మఱిన్,
కకుత్స్థ వంశమనందు జనించిన కరుణా మయుడగు రాఘవుడున్,
జనకాత్మజయగు నా మైథిలికీ తన నిర్ణయమిటు బలికి మఱిన్,
స్నేహితులను గూడిన వాడగుచును శీఘ్రము ప్రాసాదమునందున్,
మఱియొక కక్షకు బోయెను రాముడు మానుగ చర్చలు జరుపగనూ! 36

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నలుబది రెండవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నలుబది మూడవ సర్గము

(భద్రుడు సీతాదేవిని గురించి లోకాపవాదమును శ్రీరామునకు దెలుపుట)

రాజగునట్టి రామచంద్రుడును రమ్యముగా నట గూర్చొనగన్
అనేక విధముల కథలయందునను నలినేర్పరులగు కథకులునూ,
హాస్యంబును మఱి గలుగునట్లుగా నలరి మాటలాడెడివారున్,
ఆ శ్రీరాముని జుట్టు గూర్చొనియు నలరుచు సేవించుచు నుండన్! 1

విజయుడు, మధుమత్తుడు, కాశ్యపుడును, వినయవాక్కు మంగలుడు మఱిన్,
కులుడు, సురాజియు, కాలియుండునూ, భద్రుడు, సుదంత వక్త్రుడునూ,
సుమాగధులు మున్నగు వారలు నట సురుచిర పరిహాసంబులతో,
అనేక విధముల కథలును మఱియును నపురూపంబగు విషయములన్
మహాత్ముడగు శ్రీరాఘవునకునూ మానుగ సంతసమును గూర్చి
వినిపించుచునుండిరి వారలునూ, విమల వాక్య చాతుర్యమునన్! 2,3

అట్టి సమయమున రామచంద్రుడును నా మాటల సందర్భమునన్
భద్రుండనియెడి వాని తోడుతను బన్నుగ బ్రశ్నించెను నిటులన్,
భద్రా! దేశమునందు నగరమున బన్నుగ జనులును జానపదుల్,
ఎట్టి కథలు మఱి సంభాషణములు నిట్టె బలుకుచును నున్నారూ? 4

పురములందు మఱి గ్రామములందును బొలుపుగ నివసించెడి ప్రజలున్
నాకును సంబంధించు సంగతులు నయముగ నితరములైనవియున్,
జెప్పుకొనుచున్నారో తెలుపుము తేటతెల్లముగ విశదముగన్,
సీతను గూర్చియు భరతుని గూర్చియు శ్రీ లక్ష్మణునీ గూర్చి మఱిన్
ఏమని బలుకుచున్నారో మఱి యెటు భాషించుచు నున్నారో? 5

అల శత్రుఘ్నుని గూర్చి జనంబులు నలరుచు నేమనుచున్నారూ?
తల్లియైన కైకేయిని గూర్చియు దగ యేమని బలికిరి జనముల్?
రాజు క్రొత్తవాడగుచునుండగా రాజ్యమునందలి ప్రజలు మఱిన్
ఏమేమో మఱి బలుకుచు నుందురు నింపుగ మంచియు చెడ్డయునూ! 6

ఆ శ్రీరాముని మాటలు వినియును నల భద్రుండును వినయమునన్,
నమస్కరించుచు నిటులను బలికెను రమ్యమైన వాక్యంబులతోన్,
రాజా! లోకులు కాకులు సుమ్మా? రహి బలికెదరూ వికటముగా,
శుభాశుభంబులు బలుకుచు నుందరు సూటిగ దెలుపరు విషయములన్,
మంచిగాను, చెడుగాను పౌరులును మానుగ బలుకుచు నున్నారూ! 7

పురుషర్షభ! ఓ సౌమ్యుడ వినుమా! పూనికతో నా వచనములన్,
రావణువధ ద్వారా పొందిన యా రమ్య విజయమును గూర్చి మఱిన్.
మన పురమందున పౌరులచేతను మానుగ యధికాధికముగనూ,
చర్చలు జరుపుచు మాటలాడుచును జరిగిన సంగతులను గూర్చి! 8

భద్రుని మాటలు విని రాఘవుడును బన్నుగ యీ విధమున బలికెన్,
భద్రా! తెలుపుము! విషయమంతయును బన్నుగ దాపరికము లేకన్,
ఉన్నదున్నటుల విన్నదంతయును వివరముగా దెలుపుము నాకున్,
దాటి వేయకుము! విషయంబులనూ దగ పూర్తిగ వివరింపదగున్! 9

పురమునందు నివసించు వారలును బూనికతో జనులందఱునూ,
మంచి చెడ్డలను శుభాశుభంబుల నేమని బలుకుచు నున్నారూ?
వారు జెప్పుకొను మంచి కార్యములు మానుగ నే జేయుటకు మఱిన్.
చెడు కార్యంబులు జేయకుండుటకు చైతన్యము గలుగును నాకున్,
మంచి చెడుగులను దెలుపుము నాకును మానుగ స్ఫురియింపగ భద్రా! 10

పురముల యందును గ్రామములందును పూనికతో జనులందఱునూ
ఏమి జెప్పుకొనుచున్నారో మఱి ఎట్టి భావనల నున్నారో?
విశ్వాసముతో నిర్భయింబుగా నింపుగ దెలుపుము సహచరుడా!
ఏ మాత్రము సంకోచము మదిలో నింపుగ లేకుండగ నీవున్! 11

రామచంద్రు డీ విధమున బలుకగ రమ్యమైన యా వచనములన్,
విని యా భద్రుడు వినయాంజలితో విమల నమస్కృతి జేసి మఱిన్,
సావధాన చిత్తముతో గూడుక సరసమైన తన భావననూ,
మహా బాహువగు శ్రీరామునితో మానుగ బలికెను నీ విధమున్! 12

రామచంద్ర! ఓ రామా! వినుమా! రమ్యమైన నా వచనములన్,
నాలుగు వీధుల మొగలుల యందున నయముగ విపిణుల యందుననూ,

వీధులయందును, వనములయందును విమలోద్యానము లందుననూ,
ఏ విధముగ మఱి శుభాశుభంబుల నింపుగ గుమిగూడుచు జనముల్!
జెప్పుకొనుచు నున్నారో వినుమా! తేటతెల్లమగు వచనములన్! 13

పూర్వజులెవ్వరు జేయలేని పని బొలుపుగ జేసెను రాఘవుడున్,
దానవులగు వారలచేగానీ దగ దేవతలనుచేగానీ,
చేయజాలనీ దుష్కర కార్యము జేసెను శ్రీ రఘు రాఘవుడున్,
సంద్రమునందున సేతు బంధనము దగ జేసెను నాశ్చర్యముగన్! 14

దురాధర్షుడును సబలవాహనుడు దురాత్ముడగు నా రావణునీ,
హతమార్చెను రణమందున వానిని యదురు బెదురు లేకుండగనూ,
వానరులను నల భల్లూకంబుల వరుసను రాక్షసులను గూడన్,
వశము జేసికొని నాడు రాఘవుడు వల్లభుడాయెను నయోధ్యకున్! 15

రాముడు యుద్ధమునందు రావణుని రయమున హతమార్చియు మఱియున్,
రావణు స్పర్శను కోపము విడిచీ రయమున యా సీతాదేవిన్
మఱల గృహమునకు జేర్చినాడు గద! మన్నించుచు నా తప్పిదమున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

ఆ శ్రీరాముని హృదయము నందున యా వైదేహి సమాగమమున్,
ఏమి సుఖంబును గలుగునో మఱియు వివరింపగ జాలము దానిన్
ఆ రావణుడును బలవంతముగా నలరి యొడిని గూర్చుండగనూ
ఆ వైదేహిని హరించి యాతడు నల లంకకు వే గొనిపోయెన్
అశోక వనమును జేర్చగా నపుడు నల రాక్షసులకు వశమగుచున్
ఆ సీతాదేవిని గూర్చియునూ యల రాముడు మఱి దెలిసియునూ
ఏవగించుకొనకుండగా నతడు నెటుల సహించుచు నున్నాడో? 17,18

మన భార్యల విషయంబున గూడను మనము సహింపగవలయు నికన్
రాజెటు జేయునో ప్రజలుగూడనూ రహి యట్లే వర్తించెదరూ!
రాజే మార్గము ననుసరించునో రహి ప్రజాళియును నా రీతిన్,
అనుసరించి మఱి ప్రవర్తించెదరు నాశ్చర్యము మఱి లేకుండన్! 19

రామచంద్ర!- ఓ రాజా! వినుమా! రహి నాదు సువచనంబులనూ,
సమస్తమైనా నగరములందున సకల జానపదముల యందున్,

జనులందఱునూ యీ విధముగను ననేక విధముల వచనములన్
జెప్పుకొనుచునున్నారు ఓ ప్రభూ! విప్పిజెప్పబోనింక ప్రభూ! 20

భద్రుని మాటలు విని శ్రీరాముడు బన్నుగ హృదయావేదనతో
దు:ఖితుడగుచును మిత్రుల తోడను దోరముగా నిటు ప్రశ్నించెన్,
'ఇది యెట్లో మఱి నాకు దెలుపుడూ!' నింపుగ మనసున దర్శించీ,
అచటనున్న మంత్రుల నందఱినీ యా శ్రీరాముడు ప్రశ్నించెన్! 21

వారందఱునూ తమ శీర్షంబుల వనరగ భూమిని స్పృశియించీ,
నమ్రవదనముల వినయముతోడను నలరుచు బలికిరి రామునితో,
ఈతడు జెప్పిన దంతయు నిజమే! అసత్యమేమియు లేదు సుమా!
బదులు బలికిరీ శ్రీరామునితో బన్నుగ హృది కలవరమందన్! 22

శత్రు సూదనుండైన రాముడును సహచరులందఱు జెప్పినదీ,
విని తన హృదయము కలవర మందగ విమలమైన తెరబడిన యటుల్,
మిత్రుల నందఱ బంపివేసెనూ మిగుల జారు కన్నీళులతో,
తనలో తానే వ్యాకులమందెను తపసివోలె యేకాంతమునన్! 23

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నలుబది మూడవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నలుబది నాల్గవ సర్గము

(రాముడు ద్వారపాలకుని బంపి, లక్ష్మణ, భరత శత్రుఘ్నులను బిలిపించుట)

ఆ శ్రీరాముడు సుహృద్వర్గమును నటుల బంపివేసియు మఱలన్
తాను జేయవలసిన కార్యంబును దగ మఱి నిశ్చయ మొనరించీ,
సమీపంబునను గూర్చొని యున్నా సరసత ద్వార సుపాలకునీ,
జేరబిలిచి యాతనితో మృదువుగ శ్రీకరముగ నిటులను బలికెన్! 1

శుభలక్షణ సంపన్నుడైన యా సుమిత్ర నందనుడైనట్టీ
లాలితముగ లక్ష్మణ కుమారునీ లీలగ దోడ్కొని రమ్మిటకున్,
మహాభాగ్యవంతుండు భరతునీ మానుగ శత్రుఘ్నుని మఱియున్
శీఘ్రముగా మఱి దోడ్కొనిరమ్మా! శ్రీకరమగు వచనంబులతో! 2

రాముని మాటలు విని వేవెంటను రయమున ద్వార సుపాలకుడున్
అంజలి ఘటించి నమస్కరించుచు నల లక్ష్మణునీ గృహమునకున్,
ఆటంకము లేకుండ నెవరిచే నడ్డులేక నా సేవకుడున్
ఆ లక్ష్మణునీ గృహమునందునను నలరి ప్రవేశించెను నతడున్! 3

లక్ష్మణుండు రాముని యానతివిని 'అట్లే జేసెద' ననుచు మఱిన్
అరదము పైనను నధిరోహించీ యా శ్రీరాముని గృహమునకున్
వేగముగా బయనించెను నాతడు విమల భక్తి భావన తోడన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 4

మహాత్ముడైనా యా లక్ష్మణునకు మానుగ యంజలి ఘటియించీ
'జయ విజయీభవ!' యను పలుకులచే యా లక్ష్మణు నభినందించీ
'రాజు నిన్ను మఱి జూడగ దలచెను! రయమున యాలస్యము లేకన్,
శీఘ్రముగా బయనింపు మనుచునూ సేవకుండు వినిపించె మఱిన్! 5

అట్టి ద్వారపాలకుడు లక్ష్మణుడు నలరి బోవుచున్నట్లుగనూ,
గాంచి భరతునీ గృహంబునకునూ బన్నుగ బోయెను శీఘ్రముగన్,
చేయబడిన దోసిలిగలవాడై స్థిరముగ నమస్కరించి మఱిన్
వినయముదోడుత వంగినవాడై విధేయతను నీ విధి బలికెన్
రాజు నిన్ను మఱి జూడగదలచెను రయమున నిన్నాహ్వానించెన్! 6

బలశాలియునగు భరతడంతటను బరగ ద్వారపాలకుడు మఱిన్,
తెలిపిన రాముని యానతి వినుచును దీరుగ యాసనమును విడిచీ!
కాలినడకనే బయలుదేరెనూ కమనీయంబగు నార్ద్రతతో
అన్న దమ్ములన యటులుండగవలె నలరి ప్రీతి ప్రేమలు విరియన్! 7

భరత కుమారుడు బోవుచున్నటుల బరగ గాంచి యా సేవకుడున్
తొందరబడుచును అంజలితోడను యా భరతుని యభినందించీ,
అటుబిమ్మట శత్రఘ్నుని భవనము నలరి జేరి యంజలితోడన్,
నమస్కరించుచు బలికె నిట్టులను నయముగ వినయము బొంగారన్! 8

ఓ రఘు శ్రేష్టా! రమ్ము రమ్ము! వే వనర రాజు నిను జూడగనూ!
గ్గోరుచుండెనూ! ఓ శత్రుఘ్నా! కోమల భావము గలిగిన యా
లక్ష్మణుండు మఱి ముందుగ బోయెను లాలితముగ రాజును గాంచన్,
మహాయశుడు నా భరతుడు గూడను మానుగ బోయెను ముందుగనూ! 9

శత్రుఘ్నుండును ద్వారపాలకుని సౌమ్య వచనముల వినుచు మఱిన్
శ్రేష్ఠమైన యాసనమును విడిచీ శ్రీకరముగ ధాత్రిని పొందీ,
రాముడున్న దిశ నమస్కరించీ రమ్యమైన వినయముతోడన్
రామచంద్రునీ దర్శింపగనూ రయమున బోయెను కాల్నడకన్! 10

ఆ మీదట యా ద్వారపాలకుడు నల రాముని సందర్శించీ
అంజలి ఘటించి నమస్కరించీ యలరి బలికె నీ విధముగనూ!
బిలువ మనిన వారిని బిలిచితినీ ప్రీతితోని వారలుగూడన్
వచ్చియున్న వారనుచును బలికెను వనరగ ద్వారసుపాలకుడున్! 11

సోదరులందఱు వచ్చినారనుచు సాదరముగ విని యాతనితో
చింతా వ్యాకులితేంద్రియుండగుచు చింత చేత తలవంచుచునూ!
దీన మనస్సును గలవాడగుచును దిశలను గాంచుచు రాఘవుడున్
ద్వారపాలకునితో నిటు బలికెన్ను ద్వాదశి చంద్రుని వోలె నిటుల్! 12

నీవు బోయి నా సోదరులందఱ నయముగ గొని రమ్మా! నిటకున్
మత్సమీపమున ప్రవేశపెట్టుము మానగ సోదరులందఱినీ,
వీరిమీదనే నా జీవితమును విమలముగా నాధారంబున్,
వీరే నా ప్రియమైన ప్రాణములు వికసించిన పూరేకులునూ! 13

రాజయినట్టి రామచంద్రునీ రయమున నాజ్ఞను గైకొనుచున
శుక్రుని వంటీ తేజస్సునుగల సురుచిర రాజకుమారులునూ
అంజలితోడుత నమస్కరించుచు నలరుచు వినయముతోని మఱిన్,
సావధానచిత్తులునై వారలు సరసత బోయిరి లోపలకున్! 14

ఆ సమయంబున ధీమంతుడునగు నల శ్రీరాముని ముఖము మఱిన్
రాహువు జేతను నాక్రమింపబడి రహి శశిబింబమువలె నుండెన్!
సంధ్యా సమయమునందు రవికి వలె సహజ కాంతులును లేవు మఱిన్
శోభాహీనంబైన జలజవలె శోభయు లేదా సమయమనన్!

నేత్రంబులు మఱి కన్నీళులతో నిండియుండె కొలకుల వోలెన్
అట్టి స్థితిని యా రాముడుండుటను నిట్టె లక్ష్మణాదులు వేగన్
శిరసులతో పాదాభివందనము స్థిరభక్తిని మఱి జేయుచునూ,
సావధానచిత్తులుగా నుండిరి సంతసమును విడనాడి మఱిన్!
కన్నీళులతో రాముడుండెనూ కనక బిందువులు రాల్చుచునూ! 15, 16, 17

మహా బలముగల రాము డంతటను మానుగ వారిని లేపుచునూ
బాహువులను మఱి కౌగలించుకొని బరగ యాసనము లందుననూ,
కూర్చొను డనుచును విన్నవించెనూ, కూరిమి ప్రేమను జూపుచునూ!
అటు మీదటనూ వారలతోడను నిటుల బలికె స్పందించుచునూ! 18

రాజులార! ఓ సోదరులారా! రమ్యముగా మీరందఱునూ,
మీరే సర్వస్వంబును మఱియును మీరే నా జీవితమనుచున్,
రక్షణ జేయుచు మీరలిచ్చినా రాజ్యమునే బాలించుచునూ
భావించుచునుంటిని నే మనసున బన్నుగ నిరతము మఱువకనూ! 19

రాజులార! మీరందఱు గూడను రమ్య శాస్త్రములు పఠించినా
తెలిసిన వారలు మంచి బుద్ధిగల తీయని మనసును గలవారున్,
మీరందఱునూ కలిసి కూడికొని మిక్కిలి యోజన జేసి మఱిన్,
నా కార్యమునూ నిర్ణయింపవలె నలుగురు మెచ్చగ లోకమునన్! 20

కాకుత్స్థుడు నా విధముగ బలుకగ కరుణతోని యా లక్ష్మణుడున్
భరతుడు మఱియును శత్రుఘ్నుండును బన్నుగ యాలోచనలేకన్
రాజగు రాముడు నేమి జెప్పునో రమ్యముగా వారందఱునూ
అనుచు మనస్సున దిగులు జెందిరీ యవనతులై వారందఱునూ!

శ్రీరామ కథా సుధాలహరి యందు-ఉత్తరకాండములో నలుబది నాల్గవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నలుబది యైదవ సర్గము

(సీత విషయమున వచ్చిన లోకాపవాదమును గురించి సోదరులకు దెలిపి రాముడు
సీతను అరణ్యములో విడిచి రమ్మని లక్ష్మణుని ఆదేశించుట)

దీనమైన స్థితి గలవారగుచును దీప్తి హీను లగుచును వారున్,
సముపవిష్టులై లక్ష్మణాదులును శాంతిలేని వారగుచు నటన్,
అట్టి సమయమున రామచంద్రుడును నిట్టె వాడిపోయిన ముఖమున్,
గలవాడగుచును బలికె నిట్టులను గలవరబాటును జెందుచునూ! 1

నా విషయంబున సీత విషయమున నయముగ పౌరులు నే విధమున్,
జెప్పుకొనుచు నుండిరో వినుడయ్యా! తేటతెల్లముగ విషయంబున్!
అన్యవిధమునను మనస్సునందున యాలోచనలను జేయకనూ!
మీకందఱకును భద్రమగును మఱి మీరకుడీ నా యోజననూ! 2

మహాపవాదము బయలుదేరినది మానుగ నా పై యగ్నివలెన్
పౌరుల యందును, జానపదులలో బరగ తెలుపరానిది యదియున్,
ప్రచారమందున యీ భీభత్సము బరగ యాపరానిది గూడన్
మర్మ స్థానముల భేదించుచునూ మంటలవలె నను జుట్టుకొనెన్! 3

నేను మహాత్ములు, ప్రసిద్ధులైనా నిర్మల భావ సుశిక్షితులున్,
ఇక్ష్వాకుల వంశములో బట్టితినీ యిలలో యశమును గాంచితినీ!
జానకిగూడను మహాత్ములైనా జనకరాజు వంశమునందున్
సత్కుల మందున జనన మొందినది సాధ్విగ ప్రసిద్ధి నందినదీ! 4

సౌమ్య! లక్ష్మణా! జన శూన్యంబగు దండక కానన ముందుననూ,
జానకి రావణుజేత నే విధము సరగున హరింపబడినదియో!
ఆ రావణుండును నా చేతను మఱి యటుల వధింపగ బడినాడో!
అంతయు దెలియును నీకు లక్ష్మణా! యా వృత్తాంతం బంతయునూ! 5

అచటనె యా లంకాపురియందే యలరి నాకు నొక యోచనయున్,
కలిగినది గదా! సీతయందునను కఠినమైన యాలోచనయున్!
ఈ లంకాపురి యందున నున్నా యింపుగ సీతను నే విధమున్,
అయోధ్య నగరికి గొనిపోదును నే నలరి నింద గలుగక యుండన్? 6

అటువిమ్మట ఓ సౌమిత్రీ! విను! నలరి జరిగినది తెలియు గదా!
అటువిమ్మట యా జనక తనూజయు నలరి ప్రత్యయార్థము కొఱకై
ప్రత్యక్షముగా నగ్నియందునను బరగ ప్రవేశించెను నపుడున్,
దేవతలందున హవ్యవాహనుడు నా మైథిలినీ జూపి మఱిన్,
'పాపములేనీ పరమ పవిత్రత' బలికె యగ్నియును నందఱిలో
అంబరమందున సంచరించెడీ యలరి వాయువును గూడ మఱిన్
పాపరహితురాలనుచు బలికెనూ ప్రజల ముందు బహిరంగముగా, 7

పూర్వ మందు దేవతల సన్నిధిని బరగ ఋషుల సన్నిధియందున్
సూర్యచంద్రులును స్వయముగ బలికిరి సురుచిర మధురాక్షరములలో!
'పాపములేనీ పరమ పతివ్రత!' బన్నుగ కీర్తించిరి వారున్,
అంతయు దెలియును నీకు లక్ష్మణా! యా వృత్తాంతం బంతయునూ! 8

ఈ విధముగ పరిశుద్ధ చరిత్రము నింపుగ గల సీతా సాధ్వీన్
దేవతలును, గంధర్వులు, మునులును దీరుగ వారల సన్నిధిలో
ఆల దేవేంద్రుడు నా సీతను మఱి యలరి నాదు హస్తమునందున్
ఉంచినాడు గద! లంకాపురినీ యంచితముగ దెలియును నీకున్! 9

యశస్వినీయును, పరమపవిత్రయు నలరు జనక నందినిని మఱిన్
అలరు శుద్ధురాలనుచు నాదు మది యంతరాత్మయును గూడ మఱిన్
తెలిసికొన్నదీ యా కారణమున దీరుగ సీతను గైకొనుచున్,
అయోధ్య నగరికి యరుదెంచితినీ యనుమానము లేకుండగనూ! 10

ఇట్టి 'మహానధర్మము' మఱియును నిట్టి శోకమును గూడ మఱిన్
నా హృదయమునందున్నవి మఱియును నను బీడించుచు నున్నవియున్
సుమహత్తర పౌరాపవాదమును సురుచిరముగ పల్లీయులయున్
అపవాదము గూడను వేధించుచు నశాంతి గలిగించుచు నుండెన్! 11

ఈ జగతిని యెవ్వని యపకీర్తియు నింపుగ వ్యాపించియు యుండున్
ఆ యపకీర్తియు, చెడ్డమాటయును అలరి వ్యాప్తిలో నుండు మఱిన్
అంతవఱకు నాతడు నరకములో కలిగిపోవుచుండును నెపుడున్
వజ్రముతో గొట్టినయట్లుగనూ, వలను బడ్డ మత్స్యము వోలెన్! 12

అపకీర్తిని దివిజులు నిందింతురు నల కీర్తిని లోకమునందున్
సర్వజనులు బూజింతురు శ్రద్ధను శాంతిని నొందగ హృదయమునన్

మహాత్ములందఱు మహాపురుషులును మానుగ కోరుదు రీ కీర్తిన్,
అట్టి కీర్తి కాములు నీ జగతిని యలరి శాశ్వతము నుందు రిలన్! 13

పురుషర్షభులగు సోదరులారా! బొలుపుగ నా మాటలు వినుడూ!
అపవాదునకును దూరమునుందును! అల చెడు మాటకు భయబడుదున్!
అపవాదుకు భయ పడిన నేను మఱి యలరి జీవితము గూడ మఱిన్,
మిమ్ముల గూడను త్యజియించెద నే నిమ్ముగ సీతను గూర్చి మఱిన్
దెలుపవలయునా సోదరులారా! దీరుగ వివరింపగ వలెనా? 14

ఆ కారణమున మీరలందఱును అట్టి శోక సంద్రమునందున్
బడిపోయితినో గాంచుడు మీరలు బన్నుగ నీదుచు నుంటి నిదే
ఇంతకంటె నా కధికమైనదీ వింత దుఃఖ మేదియు నాకున్
వచ్చినట్లు గనబడుటయు లేదూ! మచ్చికతో బరిశీలింపన్! 15

సౌమిత్రీ! విను రేపటి దినమున సరసత ప్రాతఃకాలమునన్,
సుమంత్రుచేతను నధిష్ఠింపబడు సుందరమగు రథమును నెక్కి!
వైదేహిని గూడను నెక్కించీ వనరగ దేశము దూరముగన్
విడిచి రమ్ము! వేవేగ లక్ష్మణా! వికట విచారములను విడిచీ! 16

రఘునందన! లక్ష్మణకుమార! విను! రమ్యముగా నా వచనములన్,
గంగకు నావలి యొడ్డున నున్నది తమసానదియును బ్రవహించున్,
ఆ నదీ తీరమును నానుకుని యట వాల్మీకుల యాశ్రమమున్,
కనుల పండువుగ కానిపించునది కమ్మని వేదాధ్యయనములన్,
దేవలోక యాశ్రమము రీతిగా దీరుగ కనిపించుచు నుండున్,
వైదేహిని యా విజనమునందున వదిలి రమ్ము! బహు శీఘ్రముగన్,
నేను దెలిపినటు జేయుము లక్ష్మణ! నీకు భద్రమగు గాత! యికన్! 17, 18

సీత విషయమున నేవిధముగనూ చింత జేయగా వలదు సుమా!
అడ్డు జెప్పగూడదు నా మాటకు ప్రతివక్తవ్యము గూడ దికన్!
అందువలన ఓ లక్ష్మణ కుమార! చందముగా వెడలుము నింకన్,
ఈ విషయములో మఱియొక యోచన నింపుగ జేయకుమా మదిలో! 19

వలదని మీరలు నడ్డుదెలుపుచో వనర నాకు నప్రీతియునూ
గలుగును మఱి నా సోదరులారా! కలత జెందకుడు మదియందున్,

నాదు పాదముల మీదను మఱియును నాదు జీవితము మీద మఱిన్
ఒట్టుబెట్టి మఱి దెలుపుచునుంటిని నెట్టి విచారము వలదు సుమా! 20

ఎవరు నన్ను వాక్యాంతరమందున యే విధమున బ్రతిమాలుటకున్,
యత్నము జేయుదురో యాటంకము నలరి జేయగా దలచెదరో!
వానిని నే నతి యహితులుగా మఱి వనరగ దలతును మదియందున్,
బరిగణింపబడుదురు వారలు మఱి బరగ విరోధులుగా నాకున్! 21

నాదు నాజ్ఞలో మీరందఱునూ నయముగ యున్నటులయిన మఱిన్,
నా యానతి మన్నింపవలయునూ నయముగ నే దెలిపిన దానిన్!
జనకనందినిని మీర లిప్పుడే సరగున గొనిపోవలెను మఱిన్
నాదు మాటలను మన్నన జేయుడు నయముగ వర్తింపుడు నటులన్! 22

గంగా తీరమునందు వెలసినా గలిగిన ఋష్యాశ్రమములనూ,
జూడవలయునని కోరిక యున్నది సురుచిరముగ నాకోర్కి యిదీ!
అనుచు బలికినది జానకి నాతో నలరుచు ముద్దుగ ప్రార్థించీ!
ఆమె కోరికయు తీర్పబడగలదు నలరుచు నీ మిషతోని మఱిన్! 23

తన తమ్ములచే పరివారితుడై తగ కాకుత్థ్సుడు రాఘవుడున్,
పరిదీనుండై బలుకుచుండగా బన్నుగ యాతని నేత్రములున్
కన్నీళులతో నిండిపోయినవి కరుణాపూరిత మగుచు మఱిన్!
పంపివేసి తన సోదరులందఱ ప్రవేశించె తన గృహమునకున్! 24

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నలుబది యైదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నలుబది యాఱవ సర్గము

(లక్ష్మణుండు సీతను రథమునందు గూర్చుండబెట్టి ఆమెను వనము నందు విడుచుటకై బయలుదేరి గంగాతీరము జేరుట)

అటుబిమ్మట యా రాత్రి గడిచినది! పటుతరముగ తెలిరేకలనూ,
తెల్లవారినది తూరుపునందున తీరుగ సంధ్యలు వికసించెన్!
ఆ సమయంబున లక్ష్మణుండు మఱి యన్నమాట నెఱవేర్చుటకై,
పరిదీనంబగు మనసుతోడుతను పరిశుష్యంబగు ముఖంబుతో
సారథియైనా సుమంత్రుతోడత సరస వాక్యముల నిటు లనియెన్! 1

ఓ సారథి! ఓ సుమంత్రుడా! విను! నొనరగ నాదు సువాక్యములన్
ఉత్తమమైనా రథమునందు మఱి నురుతరమగు నశ్వంబులనూ
గూర్పుము వేగము! రాజాజ్ఞయనియు నిది! కూరిమి సీతాపతి కొఱకై!
అందమైన వస్త్రాదులు బఱచిన చందముగా నాసనము మఱిన్,
సిద్ధము జేయుము! సూతపుంగవా! సురుచిరమగు పయనము కొఱకై! 2

శ్రీరాముని యానతి ప్రకారమును శీలవతియు నగు సీతను నే,
పునీతములునగు ఋష్యాశ్రమముల బూనికతో జనవలయు మఱిన్!
సీతాదేవికి జూపించుటకును పూనికతో గొనిపోవలెనూ!
రథమును వేగము గొనిరమ్మా! మఱి రయమునబోదము వనములకున్! 3

'అట్లే జేసెద!' ననుచు బలుకుచును నా సుమంత్రుడును వేగముగన్!
ఉత్తమంబులగు నశ్వంబులతో నురుతర శోభను గలిగిన యా!
సుఖకరమైనా పరుపును బఱచిన శోభావంతము నైనట్టి
రథమును దెచ్చి ముందు నిలిపి మఱి రమ్యముగా నని లక్ష్మణుతో!

లక్ష్మణకుమార! రథము వచ్చినది! లాలితముగ పయనము గమ్మా!
ఏమి చేయవలెనో మఱి నీవును నేపుగ చేయగ వలె నిపుడున్!
అనుచు బలికె నా సుమంత్రుండు మఱి యా లాలిత లక్ష్మణుతోడన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 4,5

నరోత్తముండగు లక్ష్మణుడంతట హాయిగ సుమంత్రు మాటవినీ,
రాణివాసమును బ్రవేశించియును రయమున వైదేహిని గాంచి!

నమస్కరించుచు బలికెనిట్టులను నయముగ మృదువగు బలుకులతో,
కనుల నీరు మఱి దొలుకుచునుండగ గాంచ జాలకను పాదములన్! 6

వరము గోరినావట! మఱి నీవును వనర రామచంద్ర ప్రభునీ
ప్రతిన జేసినాడట మఱి రాజును బన్నుగ యిచ్చెద ననుచు మఱిన్!
అందువలన మున్యాశ్రమంబులకు ముదమున నిను గొనిపోవగనూ,
రామచంద్రుడును నాజ్ఞాపించెను రయమున గొనిపొమ్మని వనికిన్! 7

ఓ వైదేహీ! జనకనందినీ! యెనరగ వినుము నా వచనములన్,
మన పార్థివునీ యాజ్ఞప్రకారము మానుగ గంగాతీరమునన్!
పునీతంబులగు మున్యాశ్రమముల బూనిక నీకును జూపుమనీ,
ఆనతి యిచ్చెను అందులకే నే నలరి వచ్చితిని యిచ్చటికిన్!
అచట మునులు వసియించు వనంబును నలరి జేర్పవలయును నిపుడున్ 8

మహాత్ముడగు లక్ష్మణుని మాటలకు నలరి సీతయును మదియందున్
అతులమైన యానందము పొందెను నలరి సంతసముతో గూడీ,
వన్యభూములను దిలికింపగనూ, వనమునులను దర్శింపగనూ!
సంసిద్ధతనూ తెలియజేసెనూ సహజాతురతను గూడి మఱిన్! 9

వనమునందుగల ముని పత్నులకును మోదముతో నర్పించుటకున్
మహావిలువగల వస్త్రంబులనూ, మానుగ మాణిక్యములు మణుల్,
రత్నంబులు మఱి యాభరణంబులు రమణీయములగు వస్తువులన్,
గొనిపోవుటకును సిద్ధంబాయెను కూరిమి భక్తియు రాజిలగన్! 10

ఈ మణులును నీ మాణిక్యంబులు నీ రత్నంబులు వస్త్రములున్
అనేక విధముల ధనముల మఱియును అనేక రీతుల సంపదలున్,
ముని పత్నులకును బహూకరించీ మోదము గూర్చెద వారలకున్
అనుచు బలికె సీతయు లక్ష్మణు తో నాప్యాయతనూ గూడికొనీ! 11

లక్ష్మణు 'డట్లే, జేయు' మనుచునూ యా వైదేహికి దెలిపి మఱిన్
శీఘ్రగమనమును గలుగు నశ్వముల స్థిరముగ రథమునకును గట్టీ,
అధిరోహింపగ జేసి మైథిలిని యా శ్రీరాముని యానతినీ,
మనసునందు స్మరియించుచు నాతడు నా దేవిని వని గొనిపోయెన్! 12

ఆ సమయంబున సీతాదేవియు నా లక్ష్మణుతో నిటు లనియెన్,
లక్ష్మణకుమార! యెందులకో మఱి లలితమైన నా మది యందున్,

అదురు బెదురులును స్ఫురించుచున్నవి యపశకునంబులు గూడ మతిన్,
కనబడుచున్నవి కన్నుల యందున కాంతి హీనమగు చున్నటులన్! 13

సవ్య నేత్రమును నదురుచున్నదీ శరీరమంతయు గూడ మతిన్,
వణకుచున్నదీ యెందులకో మతి వనరగ యెన్నడు లేని విధిన్!
హృదయముగూడను అస్వస్థముగా నుండినటులుగా మదియందున్,
భావించుచునున్నాను లక్ష్మణా! బరువుగ నున్నది గాత్రమునూ! 14

పృథులోచన! ఓ లక్ష్మణ కుమార! పీడితమగు చున్నది మదియున్,
అధైర్యంబునూ యధికారికముగ యలరి స్ఫురించుచు నున్నదియున్,
వసుధ యంతయును బహు శూన్యముగా వనరగ కనబడుచున్నదియున్,
సుడులయందు నే జిక్కినటుల మతి కడు భయమును గలుగుచు నుండెన్! 15

భాతృవత్సలా! వీరకుమారా! బన్నుగ నీ సోదరుడైనా
రామచంద్రునకు క్షేమంబేకద! రంజిలుచును మది నుండెగదా!
అత్తగారలందఱును స్వస్థతను నలరుచు నుండిరి గద జెపుమా!
వారలక్షేమము గోరుదు నెపుడును వరుసగ దివిజుల ప్రార్థింతున్! 16

నగరములందును గ్రామములందును నయముగ సమస్త ప్రాంతములన్
సకల ప్రాణులును శాంతి సుఖములను సరసతయుండిరి గద జెపుమా!
ఆ మిధిలాపురి రాజకుమారియు నలరి చేతులను జోడించీ,
దివి దేవతలకు నమస్కరించెను దీరుగ శ్రద్ధాభక్తులతో! 17

అటుబిమ్మట యా లక్ష్మణుండునూ యామె దెలుపు విషయంబులనూ
వినుచు మైథిలికి నమస్కరించెను విమల భావమున దలవంచీ,
పైకి హృష్టునిగ కనిపించుచునూ బరగ హృదయమందున నతడున్
శోషించుచునూ నున్నవాడునై శోకము గనబరుపక మతియున్,
అంతా మంగళ ప్రదమని బలికెను నా లక్ష్మణుడును గద్గదతోన్! 18

అటుబిమ్మట యా లక్ష్మణుండునూ యా రథంబునూ గూడికొనీ
గోమతీనదీ తీరమునందున కుదురుగ యట యాశ్రమమందున్,
వసించి, ప్రాతఃకాలమునందున వనర లేచి యా లక్ష్మణుడున్,
సారథి తోడను బలికెను నీ విధి సామ్య వచనముల తోని మతిన్! 19

సారథి సుమంత్ర! రథమును వేగము సరసత సిద్ధము జేయు మికన్
ఇపుడు నేను గంగా జలంబునూ నీశ్వరుండు దన తేజసులన్,

శిరసు మీద ధరియించి నట్లుగా శీర్షమునందున ధరియింతున్,
పరమ పావనంబయ్యెద నిప్పుడు పాపంబులు శమియింపగనూ! 20

ఆ సారధియును బహు శీఘ్రముగా యశ్వములను రథమునను మఱిన్
అలరినట్టి వానిని నడుపుచునూ యా వైదేహి సమీపంబున్,
జేరి, యంజలిని నమస్కరించుచు శీర్షము వంచుచు నిటు లనియెన్
'అమ్మా! జానకి రథమునెక్కుమా! యలసట లేకుండగ నిన్నున్
గమ్యమునకు నిను జేర్చెదనమ్మా! కామితార్థములు ఫలియింపన్! 21

సారధి మాటలు విని జానకియును నవ్యపాదమును ముందుంచీ
అరదము నెక్కెను నాశ్రమవాసుల నందటినీ బూజించి మఱిన్,
భాతృవత్సలుండైన లక్ష్మణుడు బన్నుగ నెక్కెను రథంబునూ,
ధీమతుడగు నా సారధి గూడను దీరుగ రథమెక్కెను నపుడున్! 22

విశాలాక్షియగు సీతాదేవియు విమలసలిల భాగీరథినీ
సమీపించెనూ, యటుబిమ్మటనూ, యా సుమిత్ర నందనుడు మఱిన్,
అర్ధదివసమును బయనించిన యా లక్ష్మణుండు రథమును దిగుచున్,
భాగీరథి యా జలాశయంబును బన్నుగ గాంచుచు దీనుండై
మహాస్వనముతో రోదించెను మఱి మతిమంతుడు యా లక్ష్మణుడున్! 23,24

ధర్మజ్ఞయునగు సీతాదేవియు, మానుగ సుమిత్రనందనుడున్,
కడు బిగ్గఱగా రోదించుటయును కలియజూచి యా మైథిలియున్
మనసునందునను మిగుల భయబడుచు మానుగ బలికెను లక్ష్మణుతో,
లక్ష్మణ కుమార! ఎందు కీ విధము జిందుచు నుంటివి దుఃఖంబున్! 25

గంగాతీరము దర్శింపగనూ కడు నాసక్తిని బహు దినముల్
నుండి యెదురుజూచుచు నే నుంటిని! యురుతర భక్తిని గూడికొనీ,
నేటికి మీ కోరిక నెఱవేరెను నీ విటు నేడ్చుట యెందులకూ?
సంతోషించెడి సమయమునందున సంతాపము జెందుట యేలా? 26

పురుష శ్రేష్ఠుడ! లక్ష్మణ వినుమా! పూనికతో నా వచనములన్
రాముని పార్శ్వమునందు నుందువూ రహి నీవును మఱి యెల్లపుడున్!
అట్టి నీవు మఱి ద్విరాత్రంబులును నిట్టె దూరమున నుండుటచే
శోకించుటయును లేదుగదా మఱి సూటిగ వివరింపుము నాకున్! 27

సుమిత్ర నందన! వినుమా తెలిపెద! సురుచిరమగు నా వచనములన్,
రామచంద్రుడును నాకును గూడను రమ్యముగా ప్రాణముకంటెన్

ఇష్టుండును మఱి నే నీ విధముగ కష్టబడుటయును లేదుగదా!
బాలిశునకు వలె రోదింపకుమా! భవితవ్యము యోజింపు మికన్! 28

భాగీరధినీ దాటింపుము నను బన్నుగ నావను నెక్కించీ,
ఋషి మునులను దర్శింప జేయుమా! రూఢిగ వారిని దర్శింతున్!
ఆ ముని పత్నులకును నే నిచ్చెద యా భరణంబులు హారంబుల్
పట్టు వస్త్రములు బహూకరించెద బన్నుగ సుగంధ ద్రవ్యములున్! 29

అటు బిమ్మట నే నా విధముగనూ నట మహర్షుల దర్శించీ
అభివందనముల నాచరించి మఱి యా యాశ్రమముల నొక రాత్రిన్,
వసించి వారల సెలవు దీసికొని వనరగ మఱలను బయనంబై
అయోధ్య నగరికి బోవలయుననీ యా రాముని సన్నిధికి మఱిన్! 30

పద్మపత్రముల వంటి నేత్రములు బన్నుగ సింహోరస్కుండున్,
కృశోదరుండును ప్రజలందఱినీ కిలకిల నవ్వించెడి వాడున్,
ఆనందింపగ జేయువారిలో నతి శ్రేష్ఠుండగు శ్రీరామున్
దర్శింపగ నా హృదయము మిక్కిలి దగ తొందరబడు చున్నదియున్! 31

శాత్రవులను మఱి సంహరించెడీ సహజ వీరుడగు లక్ష్మణుడున్
ఆ వైదేహి వచనంబులు విని నలరుచు రోదనమును మానీ,
నేత్రంబులు మఱి దుడుచుకొనుచునూ నిర్మల మనసును గలవాడై!
నావ నడుపువారిని మఱి బిలిచెను నావ నడుపగా జాహ్నవినీ! 32

ఇదిగో! నావయు సిద్ధ మనుచునూ యింపుగ నావికులును నపుడున్,
అంజలితోడను నమస్కరించుచు నలరి జెప్పిరీ వారలకున్!

గంగను దాటగ దలచినవా డా రంగుగ సుమిత్ర పుత్రుండున్,
సుందరమైనా నౌకలోనికిని సురుచిరముగ యధిరోహించెన్,
సీతను గూడను జాగరూకతను శ్రీకరముగ భాగీరథినీ!
దాటించెను మఱి నమస్కృతులనూ దగ యర్పించెను జాహ్నవికిన్! 33

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నలుబది యాఱవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుథాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నలుబది యేడవ సర్గము

(సీతాదేవిని గంగానదిని దాటించిన తరువాత లక్ష్మణుడు నామెకు పరిత్యాగమును గురించి వివరించుట)

అటు తరువాతను రాఘవానుజుడు నా లక్ష్మణుడును వేగముగన్,
సువిస్తీర్ణమును సమాయుక్తమును సురుచిరముగ యా నిషాదుచే,
గొనిరాబడినా సుందర నౌకను సురుచిరముగ యా లక్ష్మణుడున్,
అధిరోహించెను మునుముందుగ మతి యటు తరువాతను మైథిలినీ,
నావను నధిరోహింపజేసెనూ నయముగ రోదన భాష్పములన్! 1

శోక పూరితుండగు లక్ష్మణుడును శోకముతో నా సుమంత్రుతో
'అరదము తోడను నిటనే యుండుము!' నలరి తిరిగి నే వచ్చెదనూ!
అనుచు బలికి యా సారథితోడను నల నావికుతో నిటు లనియెన్,
'నడిపింపుము నావను ముందునకును' నయమున గద్గదమున ననియెన్! 2

అటుబిమ్మట యా లక్ష్మణుండునూ యల భగీరథీ తీరమునన్,
పొంది, నావ దిగి, సీతను దింపీ పూనికతో తీరముజేరి!
అంజలి ఘటించి నమస్కరించుచు నల వైదేహిని జూచి మతిన్!
కన్నీళ్లను ప్రవహింపజేయుచును కాంత సీతతో నిటు బలికెన్! 3

'అమ్మా! శ్రీ వైదేహీ! వినుమా! అలరి నాదు వచనంబులనూ
ధీమంతుండగు అన్నగారిచే దీనునిగా జేయగ బడితిన్,
నన్నీ విషయమునందు రాఘవుడు నయముగ క్రూరత గనబఱచెన్,
లోక నిందలా పాలగునట్లుగ లోలత గావించెను మిగులన్,
నా హృదయంబున గొప్ప శల్యముగ నయముగ యిపుడేర్పరుపబడెన్! 4

ఇపుడు నాకు మరణంబు నొక్కటే నింపుగ శ్రేయస్కరము నగున్,
మృత్యువు కంటెను యధికమైనదియును మేలుగ మతియొక్కటి యున్నన్,
అది శ్రేయస్కరమై యుండెడిదీ యమృత తుల్యముగ నుండెడిదీ,
ఈ దృశమగు లోకాపదారమగు నిట్టి కార్యముల యందు మతిన్
నియమింపగ బడువాడనుగానూ, నిష్ఠురమగు నీ కార్యమ్మునన్! 5

మంగళప్రదురాలా! వైదేహీ! మానుగ విను! నా వచనంబులి,
నా విషయంబున దోషమున్నదని నయముగయూహింపకు మమ్మా!
'దోషిని కాదూ! దోషిని కాదూ!' దోషిననుచు భావింపను నే,
అటుల బలికి యా లక్ష్మణుండునూ యంజలి ఘటించి వినయమునన్,
నమస్కరించుచు భూతలమందున నయముగ పడిపోయెను వేగన్! 6

ఏడ్చుచున్నవాడును బిగ్గఱగా నింపుగ దోసిలి గలవాడున్,
తనకు మృత్యువును గోరుచునున్నా దగ సౌమిత్రిని జూచి మఱిన్,
వేదనతోడుత దిగులు జెందుచును విమలమైన సద్భావముతో,
సుమిత్రనందనుతోని బలికెనూ సురుచిరముగ భూదేవి సుతా! 7

కుమార లక్ష్మణ! యిది యేమీ మఱి కూర్మి యర్థమగుటయు లేదూ!
అసలు విషయ మది యేమో దెలుపుము! నాలకింతు విషయము నేనున్!
స్వస్థ చిత్తునిగ నున్నట్లును మఱి స్వయముగ కనబడుటయు లేదూ!
రామచంద్రునకు క్షేమమే గదా! రయమున దెలుపుము విషయంబున్! 8

రాజు మీద నే యాన బెట్టియును రయమున బ్రశ్నించుచు నుంటిన్,
ఇంత దుఃఖమది యేల గలిగెనో ఋంపుగ దెలుపుము నాకు మఱిన్,
ఈ సంతాపము నెందుకు గలిగెనొ విన్నవింపు నా సన్నిధినీ!
ని న్నాజ్ఞాపించుచు నుంటిని నే నిజము దెలుపు వృత్తాంతంబున్! 9

సీతచేత మఱి చోద్యమానుడై దీనవదనమువ లక్ష్మణుడున్
దైన్యముతో గూడిన మనస్సుతో దగ యవాన్ముఖుండై యతడున్
కంఠమందు కన్నీరు గలుగుచును కరుణా స్వనమును గలవాడై,
సీతామాతను సంబోధించుచు శ్రీలక్ష్మణుడును నిటు లనియెన్! 10

జనకాత్మజ! ఓ సీతామాతా! సరగున పరిషద్ మధ్యమునన్,
పురమునందు మఱి గ్రామములందును పొలుపుగ నీ విషయమునందున్,
సుదారుణంబగు నపవాదము విని సూటిగ పరితాపుం డగుచున్
పరితపించుచును నాకాజ్ఞను నిడి తక్షణమే తలవంచుకొనీ
తన మందిరమును జేరెను రాముడు దగ వేదనతో దహించుచున్! 11

ఏ మాటలు హృదయమున నుంచుకొని యింపుగ రాముడు నీ మీదన్
గల స్నేహంబును, ప్రీతి, ప్రేమలను కఠినత నెట్టెనొ మెనుకకనూ,
ఆ వచనంబుల యపవాదంబుల యలరి సాధ్వి! నీ ముందుననూ,
తెలుపజాల యా వచనంబులనూ, తెలుపదగినవియును కాదు సుమా! 12

దేవీ! నీవును నిర్దోషివి సుమ! దీరుగ నీవును బతివ్రతవూ!
పౌరుల యపవాదంబున భయపడి బన్నుగ రాజును నా ద్వారా!
నిన్ను త్యజించెను నిర్దయ తోడుత నిర్భయముగ నుండుము నీవున్!
మఱియొక విధమున భావన సేయకు! మన్నింపుము విధి నిర్ణయమున్!
రాజాజ్ఞను నే ననుసరించుచును రయమున యాశ్రమ ప్రాంతముననన్!
విడువ వలసియున్నది నిను సాధ్వీ! విమల భగీరథి తీరముననన్!
నీదు కోర్కెయును నదియే నటకద! నీ మది కోరిక నెఱవేరెన్! 13, 14

అదిగదిగో! గంగానది తీరము! నటు గనుమా! కనబడుచుండెన్!
పుణ్యప్రదంబును రమణీయంబును బొలుపుగ సుందరమైనదియున్!
బ్రహ్మ ఋషుల యా తపోవనంబును బన్నుగ యగుబడుచున్నదియున్!
మంగళ ప్రదురాలా! దుఃఖంబును మానుగ నందకు మది యందున్! 15

మునిపుంగవుడును వేదవిదుండును మోదముననను నా తండ్రియగూ!
దశరథరాజుకు ప్రియసుఖుండునూ దగ యశస్సు ధర గలవాడున్!
అట్టి మహాత్ముడు నా వాల్మీకియునూ యా బ్రాహ్మణుడును నిటగలడూ!
నీ కోరికయును సిద్ధించును మది నిర్మల వాణీ కృపవలనన్! 16

అమ్మా! విను! ఓ జనకనందినీ యలరు నీదు వాంఛయు దీరున్
ఆ మహాత్ముని చెంత జేరి మఱి యల పతివ్రతా ధర్మములన్!
ఆచరించుచును మునిపత్నులతో మోదముననను విహరింపు మిటన్!
నిత్యము పతియగు రామచంద్రుని నిరతము స్మరించుచును మదిలో
నియమ పూర్వకము నాహారంబును నిత్యంబును భుజియించుచునూ,
ఇట నివసింపుము సాధ్వీమణిరో! నీకు శ్రేయమును గాగలదూ! 17, 18

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నలుబది యేడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నలుబది యెనిమిదవ సర్గము

(సీతాదేవి దుఃఖముతో గూడికొన్నదై శ్రీ రామచంద్రునకు సందేశమును బంపుట, లక్ష్మణుడు అయోధ్యకు వెడలిపోవుట, సీతాదేవి విలపించుట)

జనకాత్మజయగు నా వైదేహియు దారుణమగు లక్ష్మణు మాటల్
విని విషాదమును వేదన నందీ, విపులమైన పరితాపమునన్,
వసుధ మీదబడి మూర్ఛనందెనూ వసర స్మృతియు లేకుండగనూ!
ఎంతటి వారలకయిన కష్టములు నింపుగ చుట్టును జేరుగదా! 1

ముహూర్తకాలము నసంజ్ఞరాలగుచు మోహమునను బడియున్నట్టీ
యా జనకాత్మజ సీతాదేవియు అలరి మేలుకొని లేచి మఱిన్,
కన్నీళులు నిండిన కన్నులతో కలయ జూచుచును దిక్కులనూ,
దీనవదనయై దీనవచనముల ధీరుడు లక్ష్మణుతో బలికెన్! 2

కుమార లక్ష్మణ! బ్రహ్మదేవుడును కుదురుగ నా దేహంబు నిలన్
దుఃఖంబులనే యనుభవించుటకు కూరిమి సృజియించెనొ యేమో!
అందుచేతనో నేను ప్రస్తుతము నలరి జూచుచుంటిని కనులన్
మూర్తినందినా దుఃఖరాశిచే మొరటుగ గాంచుచు నుంటి నిలన్! 3

పరిశుద్ధంబగు నాచారంబును బన్నుగ గలిగిన పతివ్రతనూ,
అట్టి నేను మఱి రాజుచేతనూ నిట్టె త్యజింపగ బడుచుంటిన్!
పూర్వకాలమున యే పాపంబును పొందుగ జేసితినో నేనున్,
ఎవనికి పత్నీ వియోగంబునూ యిలపై గలిగించితినో నేనున్? 4

సుమిత్రనందన! నేను పూర్వమున దుఃఖమునందువ మునుగుచునూ,
రాముని పాదము లాశ్రయించుచును రమ్యాశ్రమముల యందుంటిన్,
ఎన్ని కష్టముల యందున్నను మఱి చిన్ని నాదు హృదయమునందున్,
ఆ శ్రీరాముడు నిలిచియుండెనూ యాతని మఱువగ లేదుగదా! 5

కుమార! లక్ష్మణ! ప్రస్తుతంబు నే బన్నుగ గంగాజలమందున్,
ప్రాణంబుల నే విడువను లక్ష్మణ! బన్నుగ యుండెద జీవముతో!

ఎందుచేత నవ నాగర్భంబున చందురువలె క్షీణించినచో
భర్తృవంశమును విచ్ఛిన్నంబగు బరగ నేను మరణించినచో! 6

సౌమ్య! లక్ష్మణా! బంధుజనములకు బహుదూరము జేయగబడినా
విజనమందు నాశ్రమముల యందును వికృతముగ నే నెటులుందున్?
దుఃఖపరాయణురాలనైన నే దూరబంధువులకును మఱియున్
జెప్పికొందునూ యెవరికి నేనును విప్పి జెబుదు నా కథ నంతన్? 7

ప్రభూ! లక్ష్మణా! యెట్టి దప్పిదము యెట్టి చెడ్డ కర్మంబుల నే
జేసినా ననుచు మునులకు దెలుపుదు? ముని పత్నులకును దెలుపుదునూ?
మహాత్ముడగు శ్రీరామచంద్రుడును మన్నింపక నన్నడవులకున్,
ఏల బంపెనని ప్రశ్నింపగ నే నేమని దెలుపుదు వారలకున్? 8

సుమిత్ర నందన! లక్ష్మణ వినుమా! సూటిగ నాదు సువచనములన్,
రాజాజ్ఞను మఱి బరిపాలింపుము! రయమున దూరాలోచననూ!
దుఃఖ భాగినిని నన్ను విడిచి నిట దురపిల్లకుమా మది యందున్
అయితే నే దెలిపెడి వాక్యములను నలరి వినుము హృది స్పందింపన్! 9

అత్తగారలందఱికిని గూడను అవిశేషణముగ తలవంచీ,
దోసిలితోడను, శిరస్సుతోడను శ్రీకరముగ పాదంబులనూ,
స్పృశించినానని తెలుపవలయునూ శ్రీకరముగ మన్నింపమనీ,
రాజుకు కుశలము నడిగినాననుచు రయముగ దెలుపుము సౌమిత్రీ! 10

సుమిత్రనందన! అత్తలందఱికి శిరసా నమస్కరించుచునూ
నా వందనములు తెలియజేయుమా! నయముగ వారలకును మఱియున్!
సమాహితుండును ధర్మములందున సావధాన చిత్తుడునైనా
నృపతికి దెలుపుము నా వందనములు నిండు హృదయమున జేసెననీ! 11

రామచంద్రునికి నిటుల దెలుపుమా! రయమున నా విషయంబు నిటుల్,
అన్నా రాఘవ! సీత పతివ్రత! అలరు శుద్ధురాలును మఱియున్,
మహా భక్తితో గూడి యుండునది మఱి నీ హితమును గోరునదీ,
ఈ విషయంబును నీకును దెలియును నిపుడు నీకు జెప్పగనేలా? 2

ఓ వీరా! మఱి జనాపవాదము నొనరగ భయబడుచును నీవున్
త్యజించినాడవు! నిజమే! కావున దగ యీ యపనిందను నేమన్,

తొలగింపగవలె శుద్ధ మనసుతో దోరముగా బరిశుద్ధతనూ,
నీవే నాకును పరమగతివి గద! నిను నే మఱువను నెన్నటికిన్! 13

ధర్మమునందున సావధానముగ-దగ యుండెడి శ్రీరామునితో
నిటుల బలుకుమా! వినయముతోడను, నింపుగ సుమధుర వచనములన్,
నీవు సోదరుల నెటుల గాంతువో నిత్యము పౌరుల నా విధమున్
జూచుకొనుము! మఱి కన్నబిడ్డలుగ సురుచిరముగ యాప్యాయతనూ! 14

పౌరులందఱిని సోదరులకు వలె బరగ గాంచు టది ధర్మంబున్,
భ్రాతృభావమున గనుగొనవలెనూ బన్నుగ ప్రీతియు బొంగారన్,
పౌరజానపదులందున జూపెడి బన్నుగ ధర్మ ప్రవృత్తులచే
లభించు పుణ్యము వలన రాఘవా! లావుగ కీర్తియు గలుగు గదా! 15

నర శ్రేష్ఠుడవగు రామా! వినుమా! నయముగ నాదు సువచనములన్,
నా శరీరమును గూర్చి రాఘవా! నయముగ యోచించుట లేదూ!
పౌరుల యపవాదము నెట్లున్నదొ బన్నుగ నే నటు వర్తింతున్!
నీకు దూరముగ యుండుటకును మఱి నిజముగ సిద్ధముగా నుంటిన్! 16

స్త్రీకి భర్తయే దైవము మఱియును స్త్రీకి భర్త బంధువు, గురువున్,
ఆ కారణమున తన భర్తకు మఱి యలరి యిష్టమగు కార్యంబున్,
చేయగవలెనూ విశేషించి మఱి శీలవతియు తన ప్రాణములన్,
అర్పించియు మఱి చేయగవలెనూ యరమర లేకను స్థిరముగనూ! 17

నా మాటలుగా శ్రీరామునితో నయముగ దెలుపుము సౌమిత్రీ!
ఇదియె నాదు సంక్షిప్త వచనమును నిదియే నాహృది భావనమున్,
ప్రస్తుత ముంటిని గర్భవతినిగా బరగ హృదయమున దెలిసికొనీ
అయోధ్యనగరమునకు బొమ్మింకను నలరి నా పైని దయతోడన్!
సీతాదేవియు బలుకు సమయమున శీలవంతుడగు లక్ష్మణుడున్
దైన్యముతోడుత నిండినవాడై దగ యశ్రువులను గూడికొనీ,
సీత నిలిచినా యల ధరిత్రికిని శిరసున జేసియు వందనముల్
పలుకుటకును మఱి శక్తి లేకయును బరగ యుండె మౌనముతోడన్! 18,19

మహాస్వనముతో రోదన జేయుచు మానుగ యా సౌమిత్రియునూ
ప్రదక్షిణంబును జేసి సీతకును భక్తి నమస్కృతి జేసి మతిన్,
ముహూర్త మాత్రము నాలోచించియు ముదిత సీతతో నిట్లనియెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 20

అనఘురాల! నీ రూపంబును నే నలరి జూడగను లేదమ్మా!
పూర్వమెన్నడును గానగ లేదూ! పొలుపుగ గాంచితి పాదములన్,
ఈ సమయంబున యిచట వనసునను నిల రాఘవుడును లేనపుడున్
ఎటుల గాంచుదును తల్లీ! జానకి! యీ వివదా సమయంబుననూ!
అనుచు బలికి యా సౌమిత్రియునూ యలరి సీత పాదంబులకున్
నమస్కరించుచు సెలవుదీసికొని నయముగ నెక్కెను నా పడవన్! 21, 22

అటుబిమ్మట యా లక్ష్మణుండునూ యధిరోహించెను నాపడవన్
నావికునీ మతి ప్రేరేపించెను నయముగ ముందుకు సాగమనీ,
దు:ఖము జేతను గూడినవాడై దుఃఖము చేతను మూఢుండై
యున్న లక్ష్మణుడు పడవనెక్కి మతి యుత్తర తీరము జేరుకునీ,
శీఘ్రముగా మతి మౌనముతోడను శ్రీకరముగ రథమును నెక్కెన్! 23

మతియొక యొడ్డున నున్న జానకిని మానుగ యడలుచు నున్నట్టి
అనాథవలెనూ నేల బొరలుచును నటు దుఃఖించెడి మైథిలినీ,
వెనుకకు దిరిగియు మాటి మాటికిని, విమలభావ యా జనక సుతన్,
కనులగాంచుచును గన్నీరొలుకుచు గలవర బడుచును బయనించెన్! 24

దూరముగా బోయెడి యా రథమును దూరముగా నా సౌమిత్రిన్
మాటిమాటికిని కనుల గాంచుచును మదిలో యాలోచించుచునూ!
దిగులు జెందినా యామహాసతిని దీరుగ శోకము నగ్నివలెన్,
దహించుచుండగ శోకమూర్తివలె దగ గంగా తీరమునందున్,
శిల్పము వోలెను నిలబడిపోయెను శీలవతియు నా సీతయునూ! 25

యశస్వినీయును, యశోధరాయును నలరెడి భర్తను గాంచనిదీ,
పతివ్రతయునూ, ప్రసిద్ధురాలును, బన్నుగ దుఃఖితు రాలైనా
అల మైథిలియును మయూర ధ్వనులను అలరు మ్రోగెడీ వనమందున్,
మహాస్వనములను పతిని దలుచుకుని మానుగ రోదించెను నపుడున్! 26

శ్రీరామ కథా సుధాలహరి యందు – ఉత్తరకాండములో
నలుబది యెనిమిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నలుబది తొమ్మిదవ సర్గము

(వాల్మీకి మునికుమారుల ద్వారా, సీతాదేవిని గూర్చి విని, అచ్చటికి వచ్చి, సీతాదేవిని యోదార్చి ఆమెను తన యాశ్రమమునకు తీసికొని పోవుట)

ఆ భగీరథీ తీరమునందున యా సీతాసతి రుదన వినీ,
మునికుమారులును గాంచిరి యామెను ముఖరిత రోదన ధ్వని వినుచున్,
భగవంతుండును బుద్ధిశాలియగు బన్నుగ వాల్మీకులు నెచటన్,
నిలిచియుండిరో యా దారకులును నింపుగ బోయిరి పరుగులతో! 1

సమస్తమైనా మునికుమారులును సరగున యాశ్రమ మందున్నా
భగవంతుండగు వాల్మీకులకును బరగ పాదముల స్పృశియించీ,
ఆ వైదేహి రుదిత స్వరంబును నా వాల్మీకులకును వేగన్,
నివేదించిరీ మునికుమారులును నిండు మనసుతో కన్నీటన్! 2

భగవంతుడ! ఎవరో మహాత్మునీ బన్నుగ భార్యయు లక్ష్మి వలెన్,
కనిపించుచు నున్నది యామెను మఱి గనలేదెన్నడు నిదివఱకున్,
సమ్మోహమువలనను మిక్కిలిగా సతమత మగుచున్నది మఱియున్,
రోదన జేయుచు నున్నది స్వామీ! రోదసి ప్రతి ధ్వనింపగనూ! 3

ఓ భగవంతుడ! నదీతీరమున దుఃఖితురాలెవరో మిగులన్
దుఖితురాలై యేడ్చుచున్నదీ దూరమునుండీ గాంచితిమీ!
శోకపరాయణురాలైయున్నది శోకించుటకును దగనిదియున్,
దీనురాలుగా నొంటరిగా నట దిగులుతోని యొక యనాథగా,
కన్నీళులతో నిండిన యామెను కనికరింపగా దగునయ్యా!
గగనము నుండీ జారిపడిన యొక కనక దేవతకు వలె నుండెన్!
మీరు గాంచుదురు గాత! యామెనూ, మేదుర హృదయమునను గనుచున్! 4,5

ఓ పూజ్యుడ! యా పూజ్యురాలినీ యొనరగ మానుష స్త్రీయనుచున్
మది భావింపుము! మన్నన జేయుము! మానుగ సత్కారముతోడన్,
ఆశ్రమ సమీపమునకు వచ్చి మఱి యాశ్రయించినది నిన్ను మఱిన్
ఓ పూజ్యుడ! యాసాధ్వి! పతివ్రత! యొనరగ తన రక్షకుని మఱిన్,
గోరుచున్నదీ రక్షించుటకును గోరిక దీర్పుము రక్షించీ! 6

తపస్సు జేతను దివ్యదృష్టిచే సంపాదించిన నేత్రములన్
ధర్మములన్నియు దెలిసినట్టి యా దగ మహామునియు వాల్మీకుల్
ముని తనయుల యా వాక్యములను విని మోదమునను యోజించి మతిన్,
మైథిలి యెచ్చట యున్నదో యటకు మానుగ శీఘ్రముగను జనియెన్,
పయనించెడి యా మునిని గాంచి మతి బన్నుగ శిష్యులగూడ మతిన్
అనుసరించి వారును బరుగెత్తిరి యా ఘన వాల్మీకుల వెంటన్! 7,8

మహామతియునగు వాల్మీకులునూ మానుగ పూజా ద్రవ్యములన్
నటుల దీసికొని యా ప్రదేశమును నలరి నడిచి పాదంబులతో,
సుందరమగు నా గంగాతీరము సురుచిరముగ జేరెను నతడున్,
అచట గాంచె నా వాల్మీకులునూ యల శ్రీ రఘురాముని సతినీ,
అనాథకును వలె విలపించెడి యా యల జానకినీ బొడగాంచెన్! 9

ముని పుంగవుడగు వాల్మీకియునూ మోహ శోక భారంబులచే
పీడితురాలగు జనక నందినిని ప్రీతిని గాంచెను నా మునియున్
తన తేజస్సులచేత జానకిని దగ సంతసమును గలిగించీ,
ఆనందము గలిగించు చుండెనా యనునట్లుగ యా వాల్మీకుల్,
మధురమైన వాణిని బలికెను మతి మానుగ యోదార్చిన యటులన్! 10

స్వాగతమమ్మా! నీకు స్వాగతము స్వాగతమును గైకొను మమ్మా!
ఆ దశరథునకు గోడలివమ్మా! యా రామునకును ప్రియసతివీ!
జనకరాజునకు ముద్దుకుమార్తెవు జలజతోని నమమును నీవున్,
అట్టి నీకు మతి స్వాగతమమ్మా! యలరి రమ్మి! యాశ్రమమునకున్! 11

ధర్మ సమాధిని దెలిసికొంటినీ దగ నీవును విచ్చేయుటయున్
సమస్తమైనా కారణంబులును సకలమైన వృత్తాంతములన్,
నా మనస్సునకు దెలిసినదమ్మా! నయముగ నీ దుఃఖంబు మతిన్,
తెలుపనవసరము లేదిక తల్లీ! తెలిసిపోయినవి నన్నియునూ! 12

భాగ్యవంతురాలా! నీ విషయము బన్నుగ దెలియును నంతయునూ,
యథార్థముగ నే దెలిసితినమ్మా! నట జరిగిన విషయంబులునూ!

మూడు లోకముల విషయములన్నియు మోదముగా నాకును దెలియున్,
ధర్మ సమాధిని దెలిసికొంటినీ దగ యీ విషయము లన్నియునూ! 13

పాపములేనీ దానవనుచు నే బన్నుగ నెఱుగుదు వైదేహీ!
తపస్సు వలనను లభించినట్టీ దగ చక్షువులను జేత మఱిన్,
అన్ని విషయములు దెలిసికొంటినీ నట జరిగిన విషయంబులనూ!
విస్రబ్దవు గమ్మా వైదేహీ! విమల భావమును మది నింపీ,
నా దగ్గఱ నుంటివి తల్లీ! యిక నయముగ వీడుము భయభీతుల్! 14

అమ్మా! రమ్మా! నా యాశ్రమమునకు నలరి వసింపుము నచ్చోటన్,
నా యాశ్రమము సమీపమునందే నయముగ కొందఱు స్త్రీలు మఱిన్
తపస్సు జేయుచునుండిరి తల్లీ! దగ యా తాపస స్త్రీలు మఱిన్,
గోమాతయు తన లేగ దూడలను కోమలముగ పాలించినటుల్
నిత్యంబును నిను బాలించెదరూ! నిర్మల భావముతోని మఱిన్! 15

ఈ యర్ఘ్యంబును స్వీకరింపుమా! యీ పూజా ద్రవ్యములు మఱిన్
స్వీకరించి నీ మనో వ్యధను విడి శీఘ్రము మా పరిచర్యలనూ,
అనుగ్రహింపుము! దుఃఖింపకుమా! యలరి నీదు గృహమునకు వలెన్
మా యాశ్రమమును మన్నింపుము నిక మఱి నీ గృహమున యుండినటుల్! 16

జనక సుతయునూ, రాముని భార్యయు జానకి యా సమయము నందున్
పరమాద్భుతమగు ముని పలుకులు విని బన్నుగ యాశ్చర్యము నందీ,
శిరస్సుచేతను యతని పదములకు స్థిరముగ నమస్కృతులను జేసీ,
అంజలితో నా ముని వర్యునితో అట్లే యనుచును బలికె మఱిన్! 17

ముందు నడిచెడీ యా ముని వెనుకను చందము నంజలి ఘటియించీ,
సీతాదేవియు నడుచుచు బోయెను శీఘ్రము మున్యాశ్రమమునకున్
వైదేహిని గొని వచ్చుచున్న యా వాల్మీకులనూ గాంచి మఱిన్,
మునిపత్నులు సంతోషము తోడను మోదముతోడను వచ్చి మఱిన్
ఆ ముని తోడను నిటుల బలికిరీ యానందముతో నిటు లనిరీ! 18, 19

మునిశ్రేష్ఠా! మఱి నీకు స్వాగతము! స్వాగతమయ్యా! నీకు నిదే!
నీ యాగమనము జిరకాలమునకు నింపుగ జరిగెను శుభవేళన్!

మేమందఱమును నీ పాదములను నిర్మలమతి వందనములనూ!
జేయుచుంటిమీ! యీ సమయంబున శీఘ్రము దెలుపుము మునివర్యా!
ఏమి చేయవలెనో మేమును మఱి నెటుల బ్రవర్తింపగ వలెనో! 20

ఆ మునిపత్నుల వచనంబుల విని యా వాల్మీకియు నిటు లనియెన్,
ధీమంతుండగు రాముని భార్యయు శీలవతియు సీతామాతా!
మన యాశ్రమమునకును విచ్చేసెను మానుగ నిట నివసింపగనూ!
ఈమెను నిత్యము బాలింపగ వలె నిరతము సేవలు జేయుచునూ! 21

సీత దశరధుని ముద్దుకోడలును శీలవతియు పతివ్రతయు మఱిన్
జనకుని కుమార్తె తేజోవతియును సర్వ ధర్మములు దెలిసిన యా
పొలుపుగ యరుంధతీ సతికిని వలె పూజ్యూరాలు మఱి పుణ్యవతీ!
ఏ పాపంబును దెలియని సతినీ యిల త్యజించె పతియును నేడున్,
అందుచేత నీమెను నిత్యంబును నలరుచు బాలింపగ వలెనూ! 22

మీ రీమెను బహు వాత్సల్యంబును మీరిన ప్రీతిని జూపించీ,
కన్న బిడ్డగా జూతురు గాతను! కడు స్నేహంబును వర్ధిలగన్,
ఈమె కుటుంబమునందు గౌరవము నింపుగ జూపించుచును మఱిన్
నాదు వచనముల మన్నించుచునూ నయముగ పూజింతురు గాతన్! 23

మహా యశస్సును మహా తపస్సును మానుగ గలిగిన వాల్మీకుల్
ఆ వైదేహిని మాటి మాటికిని మానుగ యా మునిపత్నులకున్,
అప్పగించి తన శిష్యులతోడను నల తన యాశ్రమమును జేరెన్!
ఆకాశంబున సప్త ఋషులనూ యా యరుంధతిని బొడగాంచెన్,
ధ్యానమగ్నుడై యా వాల్మీకియునూ దగ నిలిచెను మౌనముగ నటన్! 24

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నలుబది తొమ్మిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

యాబదియవ సర్గము

(లక్ష్మణ సుమంత్రుల సంభాషణము)

మిధిలా రాజకుమారియైన యా మిగుల శీలవతి పతివ్రతయున్
ఆ మున్యాశ్రమ మందు సీతయును నలరి ప్రవేశము నొందుటయున్
గాంచి లక్ష్మణుడు దీన వదనుడై కలతను బొందిన వాడగుచున్,
భయంకరంబగు సంతాపంబును బన్నుగ నొందెను నపుడతడున్! 1

మహాతేజమును గల లక్ష్మణుడును మంత్ర సారధియునగు నట్టి
సుమంత్రు గూరిచి నిటులను బలికెను సురుచిరమగు వచనంబులనూ!
సుమంత్రుడా! ఓ సారధి వినుమా! సురుచిరమగు నా వచనములన్,
సీతా వియోగమున రామునకును చింతా దుఃఖము దోడుతనూ!
ఎటుల బాధబడుచున్నాడో మఱి యే విధముగ నుండెనొ గనుమా! 2

పరిశుద్ధంబగు చరిత్ర గలిగిన భార్యయైన సీతాదేవిన్
త్యజించినా యా శ్రీరామునకును దగ యధికంబగు దుఃఖంబున్,
మఱి యొకటుండున? విచారింపుమా? మానుగ యీ లోకమునందున్,
విధి నిర్ణయమిది! యెవ్వరాపుదురు? విధిగా జరుగుచునుండు నిలన్! 3

సారధి! సుమంత్ర! శ్రీరామునకును దగ వైదేహి వియోగంబున్,
దైవనిర్ణయం బని భావించెద! దగ గలిగినదని భావింతున్,
దైవ నిర్ణయము ఏ నాటికినీ దాట శక్యమును గాదుగదా!
మహారాజులైనను గూడను మఱి మానుగ తలలను వంపవలెన్! 4

ఏ శ్రీరాముడు క్రుద్ధుడైనచో యే గంధర్వుల దేవతలన్
అసురుల మఱి రాక్షసులను గూడను నలరి వధింపగ గలవాడో
అట్టి రామచంద్రుడు దైవమునకు నట్టె కట్టబడి యుండె మఱిన్
విధి నిర్ణయమును దాటలేరుగా విమల కీర్తిగలవారు మఱిన్! 5

పూర్వంబున శ్రీరామచంద్రుడును బొలుపుగ తండ్రి సువాక్యములన్,
జన శూన్యంబగు దండకవనమున సరి పదునాలుగు వత్సరముల్
వసించినాడు గదా సుమంత్రుడా! వన ఫల మూలములను దినుచున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 6

జానపదుల పౌరుల మాటలు విని పరుగున యా జనకుని తనయన్
దూరముగా మఱి బంపివేయుటను దోషముగా నే భావింతున్!
దానికంటెనూ దుఃఖకరంబని దగ బహు క్రూరంబనుచు మఱిన్,
నా మది యందున తోచుచున్నది నయముగ సుమంత్ర! వికటముగా! 7

సారధి సుమంత్ర! మైథిలి గూరిచి సరగున హీనార్థములైనా
పలుకులు బలికిన పౌరులచేతను బరగ కీర్తి హరియించునవీ,
ఇట్టి కర్మయందున పౌరులునూ యే ధర్మాశ్రమమును బొందీ
సంతసింతురో తెలియరాదుగద! సరసత యా లోకము నందున్! 8

లక్ష్మణు జేతను భాషితమైనా లాలిత బహు విధ వచనములన్
విని ప్రాజ్ఞుండును సుమంత్రు డంతట వేగముగా లక్ష్మణు తోడన్,
శ్రద్ధా భక్తుల బలికె నిట్టులను సరసత మృదు వాక్యంబులతో
అంతరంగమున యాప్యాయతనూ యలరి పొందుచును మండగనూ! 9

సౌమిత్రీ! మఱి సీత విషయమున దగ దుఃఖింపకుమా నీవున్
పూర్వమునందున తండ్రి దశరథుని పొలుపుగ యెదుటను బ్రాహ్మణులున్
ఈ విషయంబును గూర్చి తెలిపిరీ నింపుగ బహు దినముల క్రితమే!
యిటుల జరుగునని దెలిపిరి జోశ్యులు నింపుగ లక్ష్మణ! యానాడే! 10

జోశ్యులు దెలిపిరి రామచంద్రుడును భాస్వంతములగు వచనములన్,
దుఃఖ భాజనుండనుచును దెలిపిరి దూరాలోచనతోని మఱిన్,
కష్టనష్టములు ననుభవించునని కరుణ గలిగి మఱి యుండుననీ,
ఇష్ట జనులతో వియోగంబునూ, కష్టంబుల భరియించుననీ! 11

మహాత్ముండు మఱి ధర్మాత్ముండును మానుగ శ్రీరాముడు మఱియున్
చాలకాలమున జరిగిన తదుపరి దగ నిన్నును సీతాపతినీ
భరతుని, శత్రుఘ్నుని గూడను మఱి బరగ విడుచునని జోస్యులునూ
ఆనాడే తెలిపిరి సౌమిత్రీ! యా బ్రాహ్మణులును వివరముగా! 12

సౌమిత్రీ! మీ తండ్రితోని మఱి సరసత యా దుర్వాసుండున్
పలికిన పలుకులలోని విషయమును బన్నుగ నీకును భరతునకున్,
ఇతరుల కెవరికి తెలుపరానివీ నింపుగ స్త్రీలకు గూడ మఱిన్,
తెలిపినచో మఱి ప్రమాదమగునూ దీరుగ ముని శాపము గలుగున్! 13

సుమిత్రనందన! ఓ నర శ్రేష్ఠుడ! సురుచిరముగ విను నా పలుకుల్,
ఆ ఋషి చేతను పూర్వకాలమున నా దశరధునీ ముందఱనూ!

నా ముందును మఱి ఋషీశ్వరుండగు నయముగ వసిష్ఠు ముందఱనూ
పలికినాడు గద! పరమ రహస్యము పరులకు దెలుపగ రాని దిదీ!
మా ముువ్వురకును మాత్రము దెలియును మఱి యెవ్వరికిని తెలియదిదీ! 14

మహా ఋషియునగు దుర్వాసుని యా మహనీయంబగు వచనములన్
పురుష శ్రేష్ఠుడగు దశరథుడును విని పొలుపుగ నాతో నిటులనియెన్,
పురుష శ్రేష్ఠుడా! సుమంత్రుడా! విను బొలుపుగ యెచ్చట గూడ మఱిన్
జన సముదాయమునందు దెలుపకుము! జాగరూకతను దాపవలెన్! 15

ఓ సౌమిత్రీ! జాగరూకతను వనరగ మది నీ రహస్యమున్,
మహారాజు దశరథుడు బలికినా మాట నెపుడు నే మఱువకనూ!
మనసునందు నే దాచియుంచితిని మానుగ దుర్వాసుని పలుకుల్,
రాజు జెప్పినా విషయంబును నే రహి యసత్యమును జేయననీ
ప్రతిన జేసితిని భగవంతునిపై బరగ రహస్యము దెలుపననీ! 16

రఘునందన! ఓ లక్ష్మణ కుమార! రహి విను! నా వచనంబులనూ,
నా చేతను నా విషయములన్నియు రహి నీ యెదుటను వివరముగా!
విప్పి తెలుపగా జాలను వినుమా! విశదీకరణను గూడి మఱిన్,
వినవలెనని యాసక్తియున్నచో వినిపింతును గాతను! నీకున్! 17

పూర్వము దశరథు డీ విషయంబును బొలుపుగ రహస్యమని నాతో
తెలిపిన గూడను నీకు దెలిపెదను దీరుగ ముని వాక్యంబులనూ!
దైవము చేతను నిట్టి దుఃఖమును దగ వచ్చినదీ నిజముగనూ!
దాట శక్యమును గాదు గదా మఱి దరిజేరను వీలునుగాదూ!

ఈ దృశమైనా శోక దుఃఖములు నింపుగ ప్రాప్తించినా వానిన్,
వివరించెదనూ వినుమా లక్ష్మణ! వికటమైన యా కారణముల్,
భరతునకును మఱి శత్రుఘ్నుకును బరగ దెలుపగా రాదు సుమా! 18, 19

ఆ సుమంత్రునీ వాక్యంబులు విని యాలక్ష్మణుడును శీఘ్రముగన్,
గంభీరార్థములును గలిగిన యా కమనీయంబగు భాషితమున్,
విని సౌమిత్రియు సుమంత్రు తోడను విమలముగా నిటులను బలికెన్!
సత్యము దెలుపుము! ననుచు బలికెనూ చయ్యన యా సారథి తోడన్! 20

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
యాబదియవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

యాబది యొకటవ సర్గము

(సుమంత్రుడు తాను దుర్వాసుని ద్వారా వినిన భృగుశాప వృత్తాంతమును
కొంచెము రాబోవు కథను, లక్ష్మణునికి దెలిపి, అతనిని యోదార్చుట)

మహాత్ముండగు లక్ష్మణుని జేతనూ మానుగ ప్రేరేపింపబడీ,
సూతుడైన యా సుమంత్రుండునూ సురుచిరముగ దుర్వాసునిచే,
పలుకబడిన యా వృత్తాంతంబును బన్నుగ యా సౌమిత్రికినీ,
తెలియజేయుటకు నుపక్రమించెను తేటతెల్లముగ సుమంత్రుడున్ 1

పూర్వంబున మఱి యత్రి పుత్రుడగు బొలుపుగ దుర్వాసుండు మఱిన్
చాతుర్మాస్యము నిర్వహించుటకు సహితముగా దన శిష్యులతో!
పవిత్రమైనా వసిష్ఠాశ్రమము బన్నుగ బోయెను నాతండున్,
ఆదర సత్కారములను బొందెను నా ఋష్యాశ్రమ మందుననూ! 2

మహా యశస్సును గలవాడును మఱి మహా తేజమును గలవాడున్,
నీదు తండ్రి యా దశరధ రాజును నిర్మలమగు మనసున గూడీ,
పురోహితుండగు నా వసిష్ఠునీ పొలుపుగ దర్శించుట కొఱకున్
స్వయముగ బోయెను నాశ్రమమునకును సారస్వత పఠనము జేయన్! 3

సూర్యుని తోడను సమానుండునూ స్ఫురితంబగు తేజము గలిగీ
యుండుచున్నటుల గనబడుచుండెను మానుగ యట దుర్వాసుండున్,
ఆ వసిష్ఠ కుడిప్రక్కన గూర్చొని నలరి యుండె మఱి నాతండున్
దశరధరాజును మదిని గాంచి మఱి దగ మునులందున శ్రేష్ఠులునూ,
వారిద్దఱికిని నమస్కరించెను వరుసగ యంజలి ఘటియించీ! 4

ఆ వసిష్ఠుడును, దుర్వాసుండును నా మునులిద్దఱునూ మఱియున్,
మహారాజునకు స్వాగతంబునూ మానుగ యాసన మిచ్చి మఱిన్,
పాద్యము మఱియును కందమూలముల బరగ యాదరించిరి వారున్,
ఆ దశరథుడును మునులతోడుతను నలరి వసించెను నా దినమున్! 5

అచ్చట గూర్చొని యున్న ఋషులునూ, యా మౌనులునూ యాసక్తిన్
అల మధ్యాహ్నము సమయమునందున యలరుచు వివిధములైనట్టీ

మధురములైనా కథలు, విషయములు మానుగ నూతన విషయములున్
జెప్పుకొనుచు మఱి సంతోషించిరి చిత్రవిచిత్రములగు వార్తల్! 6

అటుబిమ్మట నొక ప్రసంగమందున నా దశరథుడును వినయముతో
అంజలి ఘటించి నమస్కరించుచు నత్రి పుత్రుడగు దుర్వాసున్,
మధురాక్షరములతో గూడిన తన మనసునగల యా ప్రశ్నలనూ,
మానుగ యా దుర్వాసమౌనితో మఱి ప్రశ్నించెను నాసక్తిన్! 7

భగవంతుడ! ఓ దుర్వాసమునీ! బరగ వినుము! నా వచనములన్!
నా వంశము మఱి యెంత కాలమును నయముగ నుండును లోకమునన్?
నా ప్రియపుత్రుడు రామచంద్రుడును నయముగ యాయుర్దాయమునూ,
అన్యపుత్రులా యాయుర్దాయము నలరి దెలుపు కాలమును మఱిన్! 8

భగవంతుడ! ఓ దుర్వాసమునీ! బన్నుగ మన శ్రీరామునకున్
పుట్టబోవు పుత్రుల యాయువునూ పొలుపుగ దెలుపుము నెంతటిదో?
నా వంశంబును గూర్చి దెలుపుమా! నయముగ నీకును దోచునదీ!
తెలుపగ మనసున నున్న దెలుపుమా! దీరుగ దెలుపుము ప్రియమారన్! 9

రాజగునట్టీ యా దశరథునీ రమ్యమైన వచనమును వినీ
మహాతేజమును, మహా తపస్సును మానుగ గలిగిన మౌనియునూ,
తెలుపుటకును మఱి యుపక్రమించెను దీరుగ దశరథ రాజునకున్,
అట్టి పలుకులను నేను వింటినీ యిట్టె రాజునూ గూడికొనీ! 10

రాజా! పూర్వము జరిగిన వృత్తము రహి వినుమా! నే దెలిపెదనూ!
అపుడు జరిగెనూ దేవాసురులకు నతిభయంకరము యుద్ధంబున్
ఆ యుద్ధంబున సురలు గెలిచిరీ యసురులు పరాజితులునైరీ!
భయపెట్టుగ బడుచున్న రాక్షసులు భంగబడుచు పరుగెత్తుచునూ,
భృగు మహర్షి భార్యను రాక్షసులును భీతిని వేడిరి శరణంబున్,
భీతిల్లిన రాక్షసులకు నామెయు ప్రీతిగ యభయంబిచ్చి మఱిన్,
గాపాడెను నామెయు రాక్షసులను గడగి వసించిరి యచ్చోటన్! 11, 12

ఆమె చేత యా యసురు లందఱునూ యనుగ్రహింపగ బడుటయునూ,
గాంచియు విష్ణువు గోపముతోడను గఱకు నంచుగల చక్రముతో,

విచక్షణా రహితముగ విష్ణువును విమల పతివ్రత భృగుపత్నిన్
కంఠంబును మఱి నరికివేసెనూ కరుణ లేక నిసుమంతయునూ! 13

అటుబిమ్మట యా భృగుకులోద్భవుడు నా భృగుమహర్షి కోపమునన్!
విష్ణువు తన భార్యను జంపుటయును వికట దృశ్యమును గాంచి మఱిన్,
తీవ్రముగా వ్యాకులుడై యాతడు దీరుగ హస్తము నెత్తి మఱిన్,
శత్రునాశకుండైన విష్ణువును గాత్రము కంపిల శపియించెన్! 14

శత్రునాశనా! జనార్ధనా విను! నాత్రము క్రోధావిష్టుడవై
చంపగూడనీ నా భార్యను మఱి జంపినావుగద! విస్మరతన్,
ఆ కారణమున యట్టి నీవు మఱి యల మనుష్య లోకమునందున్,
జన్మమంది బహు వత్సరంబులును భార్యా వియోగ శోకముతో,
అలమటించెదవు నటు నిటు దిరుగుచు నల విరహమునను గూడికొనీ! 15

ఆ భృగువును మఱి యా విష్ణువునకు నలరి శాపమిచ్చుట జేతన్
కలత జెందినా మనస్సుతోడను నలత జెందినా హృదయముతో,
తన యాత్మను తానే ధ్యానించుచు తన్మయ భావముతోని మఱిన్,
ఆ భృగు మహర్షి తన శాపముచే దానే బీడింపగ బడుచున్
పశ్చాత్తాపము జెంది విష్ణువును బన్నుగ బూజించెను నతడున్! 16

తపస్సుజేతను నారాధితుడును దగ ప్రేమాస్పదుడును మఱియున్
భక్తవత్సలుండైన విష్ణువును బన్నుగ బలికెను నీ రీతిన్,
లోకములకు హితమును జేయుటకై లోకములను రక్షించుటకై,
'ఈ శాపంబును నాకు గ్రాహ్యమే' నింపుగ బలికెను విష్ణువునూ! 17

ఓ రాజోత్తమ! పార్థివసత్తమ! యొనరగ యా భృగుమహర్షిచే
ఈ విధముగనూ శపింపబడినా వింపుగ ఘన తేజస్సులచే
నిండిన విష్ణువు నీ జన్మంబున నిండుగ యిచ్చోటునను మఱిన్,
నీ పుత్రునిగా జనన మొందెనూ నిర్మల మనస్సునను గూడి! 18

గౌరవమును రక్షించెడివాడా! కామితార్థ ఫలదుండవునూ!
రాముడనియెడి నామము తోడను రమ్యమైన త్రైలోక్యంబుల్!

ప్రసిద్ధుడైనా యా విష్ణువునూ బన్నుగ నీదు కుమారుండున్,
ముని శాపంబును ననుభవించునూ, మోదమునను నా విష్ణువునూ! 19

రామచంద్రుడును చాలకాలమును రమ్య యయోధ్యా పురమునకున్,
ప్రభువు గాగలడు పరిపాలించును ప్రజల మన్ననల బడయు నిటన్,
రాముని యనుచరు లెవ్వరుందురో రయమున వారందఱు గూడన్
సుఖ సమృద్ధులును గలిగి యుందురూ సురుచిరముగ యానందమునన్! 20

ఆ శ్రీరాముడు నయోధ్య యందున యలరి రాజ్యపాలన సేయున్,
బదునొకండు వేలగు వత్సరమలు బన్నుగ రాజ్యము బాలించున్,
ప్రజా క్షేమమును దన క్షేమముగా బన్నుగ భావించుచు నుండున్,
బ్రహ్మలోకమునకును బోవును మఱి బాహ్య జీవితము వర్జించీ! 21

పరమ దుర్జయుండైన రాముడును బరగ జయింప నశక్యంబున్
అట్టి రాముడును ననేకంబులగు నశ్వమేధములతోని మఱిన్,
యాగంబులు మఱి జేయునిచ్చటను నలరి మెచ్చగా లోకములున్,
అనేక పర్యాయంబులు నిలుపును నలరి రాజవంశంబులనూ! 22

ఆ రామునకును సీత యందునను నలరి యిరువురగు పుత్రులునూ
జన్మించెదరూ, వర్థిల్లెదరూ సరసత లోకమునందుననూ,
అనుచు బలికి యా దుర్వాసుండును నలరి రాజవంశంబునకున్
సంబంధించిన గడిచిన దానిని జరుగబోవు దానిని గూడన్
తెలిపి రాజునకు నూరకుండెనూ దీరుగ మౌనముతో నతడున్! 23, 24

ఆ ముని వర్యుడు దుర్వాసుండును నలరుచు మౌనము వహింపగా
ఆ దశరధుడును మహాత్ములైనా యా వసిష్ఠ దుర్వాసులకున్,
నమస్కరించుచు బయలుదేరెనూ నయముగ తన నగరంబునకున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 25

పూర్వమచ్చటను ముని పలికిన యా పొలుపగు వచనము నే వింటిన్
పరమ రహస్యములని దెలిసితి నే బన్నుగ యెవరికి దెలుపకనూ!

హృదయమునందున దాచుకుంటినీ సదయ భావనను నద్దానిన్,
ముని తెలిపినదీ మఱి యొక విధమున మానుగ జరుగదు సౌమిత్రీ! 26

అటు బిమ్మటనూ రామచంద్రుడును నా సీతాపుత్రులను మఱిన్
అయోధ్య యందున గాక వారికిని యలరుచు వేరొకచోట మఱిన్,
అభిషిక్తులనూ జేయగలరు సుమ! యా ముని జెప్పిన విషయమదీ!
ఇతరుల కెవరికి దెలుపరాదు సుమ! యీ నా దెలిపిన విషయములున్! 27

నరోత్తముడవగు లక్ష్మణ వినుమా! లాలితముగ నా వచనములన్
ఇట్టి స్థితిని రాముని విషయమునను నల వైదేహీ విషయమునన్,
దుఃఖము జెందగ రాదు సుమా! మఱి దూరుట జరుగగరాదు సుమా!
ధైర్యముగా నుండుము సౌమిత్రీ! దైన్యమునకు దూరము తొలగీ! 28

సూతుడైన యా సుమంత్రు మాటలు సురుచిరముగ విని లక్ష్మణుడున్
పరమాద్భుతమగు పలుకులు వినుచును బరమాశ్చర్యము నతడొందెన్,
ప్రహర్షమును మఱి పొందెను నాతడు 'బాగు బాగు!' అని మెచ్చుకొనెన్!
జరుగవలసినది జరుగు చున్నదీ జాగు సేయకను నంతయునూ,
విధి నిర్ణయమును దాటలేరు గద! వేదవిదులు గూడను మఱియున్! 29

ఆ సుమంత్ర లక్ష్మణు లిద్దఱునూ, మానుగ మార్గము నందుననూ!
సంభాషించుచు నుండగా నపుడు సంధ్యలు నింగిని వ్యాపించెన్!
అరుణు డంతటను నస్తమించెనూ, యాకసమున తారలు మొలిచెన్,
కేశినీ నదీ తీరమునందున వశించి రంతట వారలునూ! 30

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
యాబది యొకటవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

యాబది రెండవ సర్గము

(అయోధ్యలో రాజభవనమునందు ప్రవేశించిన లక్ష్మణుడు, దుఃఖించుచున్న రాముని యోదార్చుట)

రఘువంశమునకు నానందంబును రహి గూర్చెడి వాడైనట్టి
లక్ష్మణుండు నా రాత్రిని నచటే లాలిత కేశిని తీరమునన్!
బసజేసియు మఱునాటి యుదయమున బన్నుగ మేల్కొని సుమంత్రుతో
మఱల రథముపై యాసీనుండై మానుగ పయనం బయ్యె పురిన్! 1

అటుబిమ్మట మధ్యాహ్నమగుసరికి యలరుచు నా లక్ష్మణుడు మఱిన్,
రత్నంబులతో నిండినట్టిదియు లాలితముగ సంతోషముతో,
హృష్టపుష్టులై యున్న ప్రజాళిని శిష్టులైన శిల్పులతోడన్,
నిండినట్టి యా యయోధ్య నగరిని నింపుగ జనె యా లక్ష్మణుడున్! 2

సుమహామతియగు లక్ష్మణుండునూ సురుచిరముగ నిటు మధనపడెన్
రామపాదముల చెంత జేరి నే రహి బలుకుడు నేమనుచు మఱిన్!
ఆతని దుఃఖము నెటుల నాపుదును? నతనికి శాంతిని సమకూర్తున్?
అను యాలోచనలను గూడికొనీ నాతడు దీనత్వము నందెన్! 3

ఈ విధముగ యతడాలోచనలను నిట్టూర్పుచు నుండగను మఱిన్
మహా యోధుడగు నా సౌమిత్రికి మానుగ యయోధ్య పురియందున్!
పరమోదారంబైనది మఱియును బన్నుగ చంద్రుని వలె నున్నా
అద్భుతమైనా రాముని భవనము నాతని యెదుటను గనబడియెన్! 4

నరశ్రేష్ఠుండగు లక్ష్మణుండునూ నయముగ సురాజ్య భవనమునన్
ద్వారము దగ్గఱ దిగి యాతండును దగ దీనంబగు మనస్సుతో!
తలను వంచుకొని భవనమునందున దగ ప్రవేశమును నొనరించెన్!
అడ్డుపెట్టలే దెవ్వరు గూడను నాటంకము జేయగ లేదూ! 5

ఆ శ్రీరాముడు దీనవదనుడై యల నిండిన కన్నీళులతో
భూమినంతటిని కాల్చివేయుచును బొలుపుగ నున్నట్లున్నాడా?
అనునట్లుగనూ, యా శ్రీరాముడు నాసనంబు పై గూర్చుండెన్,

అట్టి రాఘవుని గాంచి లక్ష్మణుడు నిట్టె దీనవదనుండగుచున్,
అతని పాదముల స్పృశించుచును మఱి యలరి సావధానుండగుచున్
అంజలి ఘటించి నమస్కరించుచు నలరామునితో నిటు లనియెన్! 6,7

రఘువీరా! నీ యాజ్ఞప్రకారము నల వైదేహిని జనకసుతన్,
నీవు తెలిపినా గంగాతీరము నిర్మల పవిత్ర యాశ్రమమున్,
ఆ వాల్మీకుల యాశ్రమమునకును నలరి దీసికొని బోయితినీ!
యశస్వినీయును పరమ పతివ్రత అలరి మైథిలిని యచ్చటనే
ఆశ్రమ ప్రాంతమునందు విడిచితిని యలరి క్రూరతను నేను మఱిన్!
మఱలి తిరిగి వచ్చితిని రాఘవా! మానుగ నీపద సన్నిధికిన్! 8,9

పురుష వ్యాఘ్రు! మఱి దుఃఖింపకుమా! స్ఫురిత కాలగతి నిట్టిదియున్
త్వద్విధమైనా బుద్ధి మంతులును త్వద్విధ మనస్వినులు మఱియున్,
దుఃఖింపరుగదు! కన్నీళులతో, దోరముగా మది యందుననూ!
ఇట్టి యాపదలు సహజములనుచును గట్టిగ మదిలో నమ్ముదురూ! 10

కూడగ బెట్టిన వన్నియు చివఱికి కూరిమి నశింప వలసినదే!
ఎంత యున్నతియు లభించినా మఱి వింతను క్రిందను బడువారే?
కలయికలన్నియు జిట్టజివరికిని విలయమునందే ముగియు మఱిన్!
ఎంత కాలమును బ్రతికియున్ననూ సుంత శాశ్వతము నుండదుగా! 11

ఆ కారణమున పుత్రుల యందును నల భార్యల యందునను మఱిన్
ధనములయందును పుత్రులయందును, దగ రాజ్యమునందున గూడన్,
మీదు మిక్కిలిగ సంగముగూడదు, మిగులాసక్తియు వలదు సుమా!
వీని వియోగము తప్పదు! తప్పదు! విధివిలాస మది జరుగు మఱిన్! 12

రామా! నీవును తనను తాను మఱి రయమున నడుపుచు నుండుదువూ!
మనస్సు చేతను మనసును నీవును మానుగ యదుపున నుంచెదవూ!
సమస్త లోకములను గూడను మఱి సరగున యదుపున నుంచెదవూ!
అట్టి నీవు నీ శోకంబును మది యదుపున నుంపగ వలె ననుచున్
వేఱుగ నీకును వివరించియు మఱి విమలముగా దెలుపగవలెనా? 13

రామా! నీ సమ పురుష శ్రేష్ఠులును రయమున యీ దృశమైనట్టి
విషయము లందున మోహము జెందరు వికలము నందరు నిక్కముగన్,

నీ విటులుండిన యా యపవాదును నిక్కముగా మఱలను వచ్చున్,
కావున రాఘవ! దుఃఖ మోహములు కంటనీరు మఱి దొలకకుమా! 14

రాజా! ఏ యపవాద భయముననను రహి వైదేహిని వదిలితివో,
ఆ యపవాదము మఱియొక విధమున మఱల వచ్చి నిను జుట్టుకొనున్,
స్వకర్తవ్యమును విడిచినావనుచు సర్వజనుల యందున పురిలో
అపవాదములును గలుగును రాఘవ! అలరు సంశయంబును లేదూ! 15

పురుష శ్రేష్ఠుడ!అట్టి నీవు మఱి పొలుపుగ ధైర్యము జేకొనుమా!
సావధాన చిత్తుడవై యుండుము! సకలములగు చింతల నొదిలీ!
దుర్బలమగు నీ బుద్ధిని విడిచీ దూరమునుండుము నిశ్చలతన్!
సంతాపము మఱి జెందకు రాఘవ! పరితాపము మఱి బొందకుమా! 16

మహాత్ముడగు సౌమిత్రి వచనమును మానుగ విని శ్రీ రాఘవుడున్
మిత్రులయందున ప్రేమ గలిగినా శాత్రువులను భంజించెడి యా
రామచంద్రుడును రంజిల్లుచునూ రమ్యముగా నిటులను బలికెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 17

నరశ్రేష్ఠుడ! ఓ సౌమిత్రీ! విను! లలిత వాక్యముల వింటిని నే
నీవు బలికినా పలుకులన్నియును నిండుగ సత్యంబని దలతున్!
వీరుడ! నీవును నా కర్తవ్యంబును నింపుగ శాసించిన రీతిన్
సంతోషంబును గలుగుచున్నదీ వింతగ దలచుట లేదు మదిన్!
సౌమ్య! లక్ష్మణా! నాదు వచనముల సరసత వినుమా! నాసక్తిన్,
నా దుఃఖంబును నివర్తించినది సంతాపంబును వదిలితినీ!
భవద్వాక్యములచేత నేను మఱి బాధారహితుడ నైతి నిలన్!
సుస్పష్టమునగు మార్గము దోచెను సురుచిరమగు నా మది యందున్! 18, 19

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
యాబది రెండవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

యాబది మూడవ సర్గము

(పనిమీదను వచ్చిన వారిని యుపేక్షించుటచేత నృగమహారాజునకు వచ్చిన
శాపమును గురించిన కథను జెప్పి, రాముడు కార్యార్థులను
నిరీక్షింపవలెను అని లక్ష్మణుని యాదేశించుట.)

మహాత్ముడగు నా రామచంద్రుడును మానుగ సుమిత్ర నందనునీ
పరమాద్భుతమగు మధుర వచనమును మానుగ విని సంతోషించెన్!
అటుబిమ్మట యా రామచంద్రుడును నా సుమిత్ర నందను తోడన్,
ఏతద్వాక్యంబును బలికెను మఱి నింపుగ లక్ష్మణుతోని మతిన్! 1

సౌమ్యభావ! ఓ సుమిత్రనందన! చక్కగ నా మనసునకు మతిన్
అనుగుణంబుగా బ్రవర్తించుచును నలరి యుండెడీ నీవు మతిన్,
ఎట్టి బంధువుగ నున్నావో మఱి యట్టి బంధువును లోకమునన్,
లభియించుట మఱి దుర్లభంబుగద! లాలితముగ యీ కాలములో! 2

శుభలక్షణ! ఓ లక్ష్మణ వినుమా! సురుచిరముగ నా వచనములన్
హృదయమునందున యున్న విషయమును సదయ! నీకు నే దెలిపెదనూ!
ఆ ప్రకారమున జేయుము నీవును నలరుచు శ్రద్ధా భక్తులతో!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

సుమిత్రనందన! లక్ష్మణ వినుమా! శుభకరమగు నా వచనములన్
పౌరజనుల కార్యంబుల గాంచీ బరగ నాల్గు దినములు గడిచెన్,
మర్మంబుల ఛేదించుచున్నదీ మానుగ యీ విషయంబు మతిన్!
అంతరాత్మ బహు బాధనొందుచును నలమటించు చున్నది మఱియున్! 4

పురుష శ్రేష్ఠుడ! లక్ష్మణ వినుమా! పూనికతో నా వచనములన్!
వ్యవహారములో నున్న పురుషులను వ్యవహారిక మంత్రులును మతిన్,
పురోహితుండును కార్యార్థులునగు పురుషులుగానీ, స్త్రీలు మతిన్,
వారందఱినీ పిలువగవలయును నలరి విచారింపగ వలయున్! 5

ఏ రాజును మఱి యధికారంబును నింపుగ ప్రతి దినమందుననూ,
పౌరకార్యముల నెవడు జేయడో బన్నుగ యీ యధికారి మతిన్,

గాలి వెలుతురును లేని యట్టి యా కఠినమైన నరకమునందున్
కప్పివేయబడుచుండును నాతడు కనికరమింతయు లేకుండన్!
సందేహంబును లేదు సుమా మఱి కల్లగాదు నిది సత్యంబున్! 6

పూర్వమందునను మహా యశుండును పృధివీపతియును గలడొకడున్,
బ్రహ్మణ్యుండును సత్యవాక్కునూ బన్నుగ శుచిమంతుండు మఱిన్,
నృగుడను రాజను గలడనుచును మఱి దగ వినుచుంటిమి నీ ధరణిన్
అతడు ప్రసిద్ధిని పొందియుండెనూ యలరి రాజ్యపరిపాలనలో! 7

ఒక్కసారి యా మహారాజునూ చక్కని పుష్కరముల యందున్,
లేగదూడలను గూడినట్టి యా లీలగ సుందర మైనవియున్!
స్వర్ణ భూషితములగు నట్టివియును సరిసరి కోట్లకు పైబడినా
గోమాతలనూ దానము జేసెను కూర్మి దక్షిణల తోని మఱిన్! 8

అహితాగ్నియు మఱి దరిద్రుండునూ యలరి యుంఛ వృత్తిని గూడీ
జీవించెడి యొక బ్రాహ్మణ శ్రేష్ఠుని శ్రీకరమగు గో-లేగలునూ!
దానము జేసిన గోవులతోడను కలిసిపోయినవి యెచ్చటికో!
ఆ బ్రాహ్మణుడును నలరి వెదికెనూ యల గో లేగల కొఱకు మఱిన్! 9

క్షుధార్తుడగు నా బ్రాహ్మణుండునూ సుక్కుచుపోయిన గోవునకై
అన్ని రాష్ట్రముల యందును వెదికెను నా యా ప్రదేశములను మఱిన్!
అనేక సంవత్సరములు వెదికెను నా బ్రాహ్మణుడును గోవునకై
కానీ గోవును గనబడలేదూ! కడు నిరాశతో బ్రాహ్మణుడున్! 10

అటుబిమ్మట యా బ్రాహ్మణుండునూ యల కనఖలమునకును బోయెన్,
అటగాంచెను నా బ్రాహ్మణుండునూ యటగల యొక విప్రుని యింటన్,
ఆరోగ్యముగా నున్న ధేనువును నటగాంచెను నా బ్రాహ్మణుడున్
దాని లేగ మాత్రము దుర్బలముగ నట నుండెను విప్రుని యింటన్! 11

అటుబిమ్మట యా క్షుధార్తుండునూ యా బ్రాహ్మణుడును వెనువెంటన్
'శబలా! రమ్మా! నను‌చును గోవును బేరుపెట్టి పిలిచెను నతడున్
ఆ సంబోధము విని యా ధేనువు నాతని స్వనమును వినె నపుడున్,
తన యజమానిని గుర్తించియు మఱి యతని సమీపమునకు వచ్చెన్! 12

క్షుధార్తుడైనా యా బ్రాహ్మణునీ క్షోభజెందెడీ స్వనము వినీ,
గుర్తుబట్టి యాధేనువు మఱియును కూరిమి యాతని తోడుతనూ,

అగ్ని సమానుండైన బ్రాహ్మణుడు నలరి ముందు నడుచుచు నుండెన్!
నడుచుచుండె తన లేగ తోడుతను నయముగ 'యంబా' యనుచు మఱిన్! 13

పాలించెడి యా విప్రుడు గూడను బన్నుగ ధేనువు పయనంబై
క్షుధార్తు వెంటను బోవుటగాంచియు సురుచిరముగ దా బోయి మఱిన్
బహు శీఘ్రముగా నా బ్రాహ్మణుడును బరగబోయి యా క్షుధార్తుతో,
'ఇది నా ధేనువు' అనుచు బలికెనూ యందఱి యెదుటను కేకలతో! 14

గోవును పాలించెడి బ్రాహ్మణుడును కోప దృష్టితో నిటులనియెన్
నృగుని చేత నా కివ్వబడినదీ నేరము నాదియు కాదు సుమా!
అతని చేత దానంబు జేయబడి అలరి యుండె నా గృహమందున్
అటుబిమ్మట యా విద్వాంసులకును నలరి వివాదం బయ్యె నటన్
ధేనువు నెవరిదొ తెలియకపోయెను దైన్యము నొందిరి యిరువురునూ! 15

విప్రులిరువురును గలహించుచునూ వేద విదులునగు వారలునూ
దానము జేసిన వాడగు నృగునీ దగ సమీపమును జేరి రటన్!
కానీ వారికి రాజ దర్శనము దగ లభింపకను బోయె నటన్!
రాజ ద్వారమున నిలిచియుండిరీ రహి కలహంబును జేయుచునూ! 16

మహాత్ములగు నా ద్విజ సత్తములును మానుగ కలహించుచును మఱిన్
నృగుని ద్వారమున యందు నిలిచిరీ దగ రాత్రిం బవళులు వారున్
కొన్ని దినములిటు గడిచిన పిమ్మట కోపముతో నా విద్వాంసుల్
భయంకరంబగు తాత్పర్యముగల పలుకు బలకిరీ శపించుచున్! 17

కార్యసిద్ధికై వచ్చిన వారిని కడు నిర్లక్ష్యము తోడుతనూ
నీవు దర్శనంబిచ్చుట లేదూ! నిర్దయతోనీ గూడికొనీ
ఆ కారణమున యే ప్రాణులకును నలరుచు గనబడకుండగనూ
కృకలాసముగా నుండుము నూతిని కిలకిల లాడుచు జలములనూ! 18

తొండవుగా నయి వేల వర్షములు దోరముగా నుండుము నూతిన్
ఏ ప్రాణులనూ గాంచకుండగను నెవ్వరితోడను బలుకకనూ!
మఱికి నీటిలో నీదుచునుండుము! మునగక తేలక యచ్చటనూ!
ఆహారము మఱి నిద్రయులేకను నట నివసింపుము కృశించుచున్! 19

ఆ విష్ణువునూ యా యాదవులయు నలరు మహిత కీర్తిని జగతిన్
వృద్ధిబొంద జేయుచును విష్ణువును విమల వాసుదేవుడని ప్రసిద్ధుడై!
మానవరూపుండై లోకమునను మహిమాన్విత కర్మలు జేయన్
జన్మింపగ గల డా విష్ణువునూ చరియింపగ గల డీ జగతిన్! 20

నృగురాజా! యా వాసుదేవుడును నిర్మల భావముతోని మఱిన్
ఈ శాపంబున నుండు కృష్ణుడును నింపుగ విడిపింపగ గలడూ!
ఆ కారణమున నా కాలమునకు నలరి నీకు మఱి శాపంబున్
విముక్తిగలుగును ప్రాయశ్చిత్తము విమలముగ్గా సంపూర్తి యగున్! 21

కలియుగంబు దగ్గఱ బడినప్పుడు కఠినమైన భూ భారంబున్,
తొలగించుటకై పరాక్రమముగల తోరముగా నారాయణుడున్,
భూలోకంబున జననమందుచును భూరి విక్రమముతోని మఱిన్
దుష్ట శిక్షణను శిష్టరక్షణను తోరముగా చేయును నతడున్ 22

ఈ విధంబుగా బ్రాహ్మణు లిరువురు నీ విధి శపించి నృగురాజున్
పోయిన కోపము గలిగి నట్టి యా పొంకముగా నా విద్వాంసుల్
దుర్బలమైనా వృద్ధయైన యా దోసములేనీ ధేనువుమా
దానమునిచ్చిరి వేఱొక విప్రుకు దగ దీనత్వము గాంచి మఱిన్! 23

ఈ విధముగ యా నృగరాజును మఱి నిలలో దారుణమైనట్టీ
బ్రాహ్మణ శాపము ననుభవించెనూ బన్నుగ దన దోషము జేతన్,
కార్యముపై వచ్చిన వారికి మఱి కపటముగా బాధను గూర్చి
వేదన గలిగించెడి వారికి నిల విపుల దోష హేతువునగునూ! 24

అందువలన పనులున్న వారు మఱి చందముగా నా దర్శనమున్
అంది పొందుదురు గాత! లక్ష్మణా యిందువలన దోషములేదూ!
సఫలత బొందును గద! యా కార్యము చక్కని ఫలితము నిచ్చుగదా!
అందువలన నీవును జని యచటకు చందముగా కార్యార్థంబై
వచ్చియుండిరో, వేచి యుండిరో, మచ్చిక గనుమా సౌమిత్రీ! 25, 26, 27

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
యాబది మూడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

యాబది నాల్గవ సర్గము

(నృగమహారాజు తన భృత్యునకు రాజ్యము నిచ్చి భూమిలో అందమైన గొయ్యి త్రవ్వించుకుని శాపమును అనుభవించుట)

శ్రీరాముని భాషితమును వినియు మఱి శ్రీకరముగ పరమార్థంబున్,
నెఱిగి నట్టి యా లక్ష్మణదేవుడు నింపుగ ప్రాంజలితోని మఱిన్,
దీప్త తేజసుండగు రాఘవుతో ధీరత నీ విధముగ బలికెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

కాకుత్స్థా! ఓ రామా! వినుమా! కరుణతోని నా వచనములన్,
అల్పమైన యపరాధము వలనను నా యిరువురి విప్రులచేతన్,
ఈ దృశమగు యమదండమైన యా నిలపై భరింపగా రానీ,
మహా శాపమును నిచ్చిరి గద మఱి మానుగ యాలోచింపకనూ! 2

పురుషశ్రేష్ఠుడ! ఓ శ్రీరామా! పొలుపుగ యా నృగ మహారాజున్,
తనను శపించిన యట్లు దెలిసి మఱి దగ కోపముతో గూడిన యా
విప్రోత్తములను గూర్చి నృగుడునూ యేమని బలికెను వారలతో
ఏ విధముగ తా బాధపడియెనో నింపుగ దెలుపుము రఘురామా! 3

ఆ సౌమిత్రీ పలుకును వినియును అల శ్రీరాముడు నిటు బలికెన్!
'ఓ సౌమ్యుడ! సౌమిత్రీ! వినుమా! యొనరగ పూర్వము నా నృగుడున్.
ఏ విధముగ దా శాపముజేతను నే విధముగ దా కృశించెనో!
విషయమంతయును దెలిపెద వినుమా! వివరముగా వృత్తాంతంబున్! 4

అటుబిమ్మట యా నృపుడగు నృగుడును నా యిద్దఱు విద్వాంసులునూ
మార్గమందు వెళ్ళిన వారినిగా మఱి దా విజ్ఞాతుండై యతడున్
మంత్రి సత్తముల పురోహితులనూ మానుగ సమాజ పెద్దలనూ
ఆహ్వానించియు సమస్తమైనా యధికారుల పెద్దలను మఱిన్
దుఃఖము దోడుత కూడినవాడై తోరముగా నీ విధి బలికెన్
సావధాన చిత్తులునై మీరును దగ విందురు గాతను దీనిన్!
నేను దెలుపు విషయంబులన్నియును నిర్మల హృది జేకొనుడు మఱిన్! 5, 6

నారదు వంటీ మహితాత్ములు మఱి నయముగ విప్రులు నిరువురునూ
నాకును శాపభయంబును గూర్చియు నయముగా బోయిరి తమ దారిన్,
నా తప్పిదమును నేను దెలిసికొని నాకు దగిన దండన యనుచున్
మది యందున భావించితి నేనును మానుగ వేదనతో గూడీ! 7

వసువను పేరును గలిగినట్టి యా యశమును గలుగు కుమారుడునూ,
గలడు వాని నీ రాజ్యమునందును కమనీయముగా రాజునుగా
అభిషిక్తునిగా జేయుచు నాతని నాలసింపక ను త్వరబడుచూ!
నా కొఱకును మఱి శిల్పుల చేతను నయముగ సుఖ స్పర్శయు గలుగూ!
గోతిని యొక్కటి నిర్మింపుడు వే కోర్కె దీరగా నాదు మదిన్! 8

వర్షబాధ లేకుండు దానినీ యొక్క గోయి నిర్మింపుడికన్,
చలిబాధయు మఱి లేనిదానినీ చక్కని యొక గోతిని మీరున్,
వేడి బాధ మఱి లేని దానినీ విమలమైన సుఖస్పర్శయునూ
గలుగునట్లుగా శిల్పుల జేతను దగ నిర్మింపగ జేయు డిలన్,
అట్టి గోతులందున నివసించియు నలరి బ్రాహ్మణుల చేత మఱిన్
వచ్చిన శాపము పోగొట్టు కొనెద వనరగ గోతుల వసియించి! 9

ఫలవంతములగు వృక్షంబులు మఱి బన్నుగ పుష్పిత వృక్షములున్
పూవుల తీగెలు నా గోతులకును బొలుపుగ సమీపముల యందున్
నాటింపగ వలె పెరిగే మొక్కల నయముగ నీడల నిచ్చునవీ,
మూడు గోతులకు సమీపంబునను మోదముగా నాటింపవలెన్! 10

ఆ గోతులకును నన్నివైపులను నందము సురు చిర మగునటులన్
నాటి పెంచవలె నీరుబోసి మఱి నయముగ గాపాడుచు మఱియున్,
బ్రాహ్మణ శాపము గడుచు వఱకునూ, బన్నుగ నే నట నుండెదనూ!
విధి నిర్ణయమును దాటలేరుగా వేదవిదులు విమలురు గూడన్! 11

నా నివాసమునకును జుట్టును మఱి నయముగ యోజన దూరంబున్
చక్కని తోటలు పుష్ప వాటికలు చక్కగ నాటింపగ వలెనూ!
మిక్కిలి నీడయు గలుగునట్లుగా పిక్కటిల్లు నటు జేయవలెన్!
రమణీయంబగు వాతావరణము రమ్యముగా జేకూర్ప వలెన్! 12

ఆ నృగరాజును నట్టి విధముగా నలరుచు సమస్త విధములను ,
ఏర్పాటుల మఱి జేసికొనియునూ యల తన పుత్రుని యా వసువున్,
రాజ్యమునకు నభిషిక్తునిజేసీ రయమున నాతని కీ విధమున్,
ఉపదేశించెను మధుర వాక్యముల మానుగ దెలిపె సువాక్యములన్! 13

పుత్రా! ధర్మమునందు స్థిరుడవై పొలుపుగ నుండుము నీవు మఱిన్
క్షత్రియ ధర్మము ననుసరించి మఱి సరసత జేయుము బాలనమున్,
సామాన్యంబగు నపరాధమునకు సరసత వచ్చెను ముప్పు మఱిన్,
బ్రాహ్మణ శాపము నెట్లు వచ్చెనో బరగ మీకు తెలియును గాదా! 14

రాజులలో శ్రేష్ఠుడవై యుండుము నయముగ నాదు నిమిత్తంబున్
మనస్తాపమును జెందకుమా! యా బాధను హృదిలో నొందకుమా!
దైవశక్తి బహు గొప్పది మఱియును దాటలేదు విధి నిర్ణయమున్!
నా కీ కష్టము నా దైవంబే నయముగ గూర్చెను విధివశతన్! 15

వత్సా! ప్రతి యొక్కడు గూడను మఱి వనరగ గత జన్మమునందున్
చేసిన కర్మల ననుసరించియే చెందును పొందును ధనాదులన్
వెళ్లవలసినా స్థానంబునకును వెళ్లును సందేహములేకన్,
పొందదగిన దుఃఖంబుల బొందును పొందవలసినా సుఖములనూ
అంది పొందునూ యనుభవించునూ బొందుచుండు సుఖదుఃఖములన్
అందుకొఱకునై దుఃఖమునందకు జిందకుమా మఱి శోకంబున్! 16, 17

సుమిత్ర నందన! లక్ష్మణ వినుమా! సురుచిరముగ నా వచనములన్
మహా యశుండగు నా నృగ రాజును మానుగ తన పుత్రున కపుడున్,
నీతి వాక్యముల కర్మ పథంబును నిర్మలముగ నుపదేశించీ,
గోతిలోపలను నివసించుటకై కూరిమి తన దారిని బోయెన్! 18

మహాత్ముడైనా నృగరాజును మఱి రత్నవిభూషిత మైనట్టీ
పెద్ద గోతిలో నివసించియు మఱి కూరిమి కృకలాసము రూపున్
ఆ యిద్దఱు విప్రులు యిచ్చిన యా యలరు శాపమును భరియించీ
అనుభవించుటకు ప్రారంభించెను నాశ్చర్యము లేకుండగనూ! 19

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
యాబది నాల్గవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

యాబది యైదవ సర్గము

(నిమి చక్రవర్తి మఱియు వసిష్ఠుడు ఒకరినొకరు శపించుకొని
దేహములు త్యజించుట)

సుమిత్ర నందన! లక్ష్మణ వినుమా! సూనృతమగు నా వచనములన్
నృగ శాపంబును గూర్చినట్టి యా నిజ విషయంబును దెలిపితినీ,
మఱియొక వృత్తాంతంబును వినగా మదిలో కోరిక గలిగినచో,
మఱియొక కథనూ దెలిపెద వినుమా! మానుగ యాసక్తిని గూడీ! 1

రాముని చేతను బలుకబడిన యా లక్ష్మణుండు మఱి యా వెంటన్
శ్రీరామునితో బలికె నిట్టులను చిత్తము హర్షము బులకింపన్,
ఆశ్చర్యంబును నద్భుతములునగు నట్టి కథలు వినుటయు నాకున్
సంతృప్తియునూ లేదు రాఘవా! చాలు! ననుటయును లేదు సుమా! 2

లక్ష్మణు డిటులను బలుకుచుండగా లాలితముగ యిక్ష్వాకులయున్
కులమునకును యానందకరుడు మఱి కూరిమి శ్రీ రఘురాఘవుడున్
ధర్మ సమ్మతంబగు నొక కథనూ ధార్మిక దృష్టిని గనుగొనుచున్
తెలియజేయుటకు నుపక్రమించెను దీరుగ సుమధుర వచనములన్! 3

మహాత్ములను నిక్ష్వాకు వంశమున పంద్రెండవ వాడునుగలడూ
నిమి యను నామము గలవాడును మఱి నీతిని పాటించెడి వాడున్
పరాక్రమముననూ, ధర్మమునందును బన్నుగ స్థిరుడగువాడు మఱిన్
ధర్మ చక్రమున బరిపాలించుచు ధార్మికుడను బేరును బొందెన్! 4

మహా విక్రమము గలిగినట్టి యా మానుగ నిమి యా సమయమునన్
గౌతమాశ్రమము సమీపమందున గడగి దేవపుర సమానమున్
పట్టణమును నిర్మింపజేసెనూ బహు గుణములును ప్రకాశింపన్
అమరావతియా యనునట్టులుగా యా నగరంబును నపుడుండెన్! 5

ఆ నగరమునకు వైజయంతి యను నల ప్రసిద్ధమగు నామంబున్,
చక్కని బేరును బెట్టిరి వారలు చిక్కని సౌఖ్యములును గలుగగా!
మహాయశుండగు రాజర్షియును మానుగ యా నగరమునందున్
నివాసంబు మఱి యేర్పఱచుకునీ నిశ్చల శాంతిని యతడుండెన్! 6

మహానగరమును నిర్మించిన యా మనసున యా నిమిరాజునకున్
ఉత్పన్నం బాయెను నొక కోరికయు నురుతర గాఢ ప్రదీప్తి మతిన్
తండ్రిగారి మనసుకు నానందము దగ గూర్చుచు నొక యాగమునూ
దీర్ఘ సత్రమును జేయగ దలచెను దివిదేవత లాశ్చర్యబడన్,
(దీర్ఘ సత్రమన కొన్ని వర్షములు దీరుగ జేయగ వలసినదీ) 7

అటుబిమ్మట నిమి తన తండ్రియునూ యలరి మనువునకు కుమారుడున్
ఇక్ష్వాకుని మఱి యాహ్వానించెను నింపుగ యాగమునకు మఱియున్!
ముందుగ ఋషి బ్రహ్మలను వనుత్తముడు మోదముతో నా వసిష్ఠునిన్
తన యాగమునకు ఋత్విక్కునిగా దగ వరించె నిమి రాజు మతిన్! 8

అటుబిమ్మట యిక్ష్వాకు బుత్రుడును రాజఋషియునగు నిమి రాజున్
అత్రిని మఱియును నంగీరసునీ యలరు తపోనిధి యైనట్టీ
భృగువును గూడను వరించె నాతడు భూరి యాగమును నడుపగనూ!
ఈ విధమున యాగమును జేయుటకు నింపుగ నిమి సిద్ధంబయ్యెన్! 9

వసిష్ఠుడైతే రాజసత్తముడు వనరగ నిమితో నిటు బలికెన్
నన్ను ముందుగా దేవేంద్రుడునూ నయముగ తన యాగము గొఱకున్
వరించి యుండెను సమయము కొఱకై వనరగ నీవును నా కొఱకున్
వేచి యుండుమా! ఓ నిమిరాజా! విశదముగా నా ముని బలికెన్! 10

అనంతరంబున మహా విప్రుడగు నా గౌతముడును యాగమునన్,
ఋత్విక్ పదవిని పూరించెను మఱి రూఢిగ యాగంబును జరిగెన్
మహాతేజమును గల వసిష్ఠుడును మానుగ సురరాజగునట్టీ
ఇంద్రుని యాగంబును మఱి దానును సాంద్రముగా బూరించె నటన్! 11

చక్రవర్తియగు నిమి రాజును మఱి సద్బ్రాహ్మణులను రావించీ
హిమవత్పర్వత ప్రాంతమునందున తమ పుర సమీపమందు మతిన్!
యాగము జేసెను బహు శోభితముగ దూగుచు ధనధాన్యంబులతో
ఐదువేల వర్షంబులు నిమియును నలరి యజ్ఞదీక్షను నుండెన్! 12

ఇంద్రుని యజ్ఞము పూర్తియైనదీ సాంద్రముగా నా పూజ్యుండున్,
దోష రహితుడగు వసిష్ఠుడంతట దోరముగా ఋషి ఋత్వికుగా
నుండుట కొఱకై నిమి యొద్దకు మఱి మండితముగ నటకును వచ్చెన్
గౌతముండు ఋత్వికుగనుండటను గమనించెను నా వసిష్ఠుడున్! 13

అటుబిమ్మట యా యాగమునందున యలరుచు ఋత్విక్ స్థానంబున్
గౌతముండు బూరించినట్లుగా గమనించెను నా వసిష్ఠుడున్!
అపుడు బ్రహ్మపుత్రుడు వసిష్ఠుడును నలరుచు రాజును జూచుటకున్
ముహూర్తకాలము గూర్చుండెను నట మోదమునను రాజును గలియన్! 14,15

ఆ రోజున యా రాజ ఋషికినీ యలరి చాల నిద్రయు వచ్చెన్,
ఆ నిమి రాజును వసిష్ఠునకునూ యలరి కనబడక పోవుటచే
ఆ వసిష్ఠునకు క్రోధము గలిగెను నా యిక్ష్వాకుని పుత్రునిపై!
కోపము జెందియు నా వసిష్ఠుడును కూరిమి తోడను నిటుబలికెన్! 16

ఎందువలన ఓ పార్థివ! నీవును ముందుగ నను మఱి వరించియున్
మఱి యొకరిని మఱి స్వీకరించితివి మానుగ నన్నవమానించీ,
అందువలన ఓ నిమి వినుమా! మఱి యలరి నీదు దేహంబు నికన్!
చైతన్యంబును గోలుపోవునూ శాంతి కాంతి మఱి నశియించున్! 17

అటుబిమ్మట యా నిమియు మేలుకొని యలరి శాపవచనమును వినీ!
క్రోధావిష్టుండై యా రాజును కూరిమి గౌరవమును వీడీ,
బ్రహ్మపుత్రుడగు యా వసిష్ఠునీ బన్నుగ నీ విధమున బలికెన్!
గురవను భావము మనసునందునను గూరిమి లేకను జడు డగుచున్! 18

క్రోధము జేతను కలుషీకృతముగ కుటిలత మది నను దలచుచునూ!
నిదురించిన యా సమయమునందున నీరసునై నే నున్నపుడున్,
మఱియొక యమదండము వంటిది యగు మానుగ మరణము వంటిదియున్,
శాపాగ్నిని మఱి ప్రయోగించితివి సర్వము దహించి పోవునటుల్! 19

బ్రహ్మర్షీ! యా కారణంబునను బన్నుగ శాంతియు గలయట్టీ
నీ దేహంబును గూడను మఱియును నిజముగ తేజోహీనంబై!
చైతన్యంబును గోలుపోవునూ సకల కాలములు హీనములై
సందేహంబును లేదు సుమా! మఱి సరగున జరుగును నా పలుకుల్! 20

ప్రభావంబునను కోపవశంబున యన్యోన్యంబుగ వారలునూ
ఒకరినొకరు శపియించుకొని రటను నోర్పులేక క్రోధముతోడన్!
వారిరువురునూ సమానులని మఱి వాసిగ జెందిరి ప్రసిద్ధియున్!
రాజ బ్రాహ్మణులు నిరువురు గూడను రహి దేహంబులు లేకయునూ!
ప్రేతములుగ మఱి దిరుగగ సాగిరి ప్రీతి యన్నదియు లేకయునూ,
క్రోధము వలనను జెడును సర్వమును క్రోధము వీడగ వలయు మఱిన్! 21

యాబది యైదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

యాబది యాఱవ సర్గము

(బ్రహ్మదేవుడు దెలుపగా వసిష్ఠుడు వరుణుని రేతస్సులో ప్రవేశించుట-
వరుణుడు ఊర్వశి సమీపమున ఒక కలశంలో తనరేతస్సును ఉంచుట-
మిత్రుని శాపము చేత ఊర్వశి భూలోకములో పురూరవుని
దగ్గఱ యుండి పుత్రుని కనుట)

శత్రువీర సంహారకుడైనా సహజవీరుడగు లక్ష్మణుడున్
మహాత్ముడగు శ్రీరాముని పలుకులు మానుగ యాసక్తిని గలిగీ,
విని ప్రాంజలితో నమస్కరించుచు విమలమైన హృదయముతోడన్,
దీప్త తేజసుడు శ్రీరామునితో శ్రీకరముగ నిటులను బలికెన్ 1

రఘురామా! దివిజులకు గూడనూ రమ్య పూజ్యులగు వారలునూ
ఆ వసిష్ఠ నిమి చక్రవర్తులును నల దేహములను వదిలి మఱిన్
మఱల దేహములను నెట్లు బొందిరో మానుగ దెలుపుము రఘురామా!
తేజో హీనులునై వారలునూ తేజసులను పొందిరి యెటులన్? 2

లక్ష్మణు జేతను నీ విధముగనూ లాలితముగ పలుకగబడినా
ఇక్ష్వాకుల వంశమునకునూ మఱి యింపుగ యానందంబు మఱిన్
గలిగించెడి వాడును పూజ్యుండును గడు తేజస్సును గలవాడున్
ఆ శ్రీరాముడు నా లక్ష్మణుతో నలరి పలికె నీ విధముగనూ! 3

ధార్మికులగు నా నృపవిప్రులునూ బరగ క్రోధమున గూడికొనీ
పరస్పరంబును శాపంబులచే బన్నుగ శపించు కొనుచు మఱిన్
దేహంబులనూ విడిచి వారలును దీరుగ వాయువు రూపములన్,
నుండినట్టి ముని రూపంబులతో మోదముగా నపుడయిరి మఱిన్! 4

అశరీరుండును మహాతేజుడును నల యరుంధతీ వల్లభుడున్
అల వసిష్ఠ ముని వేగముతోడను నలరుచు వేఱొక కాయముకై
తండ్రియైన యా బ్రహ్మ వద్దకును దగబోయెను వివరించుటకై
వివరించుటకును విప్పిజెప్పుటకు విశదబరుప [illegible]న వేదననూ! 5

సకల ధర్మములు దెలిసిన వాడును సాధురూపుడును సజ్జనుడున్
వాయువుగా మారిన వసిష్ఠుడును వన్నె దరిగినా వాడగుచున్
దేవదేవునీ చరణములకు మఱి దీరుగ యంజలి ఘటియించీ
నమస్కరించుచు బ్రహ్మతోడనూ నయముగ బలికెను నీ రీతిన్! 6

దేవదేవ! ఓ ప్రజాపతీ విను! దీరుగ నాదు సువచనంబుల్
నిమిరాజును నిచ్చిన శాపంబును నిఖిలంబును నే గోల్పోతిన్!
దేహంబును మఱి గోల్పోయితినీ దీరుగ కాంతిని గోల్పోతిన్,
వాయురూపునిగ యైపోతిని నే వనరగ భూతము వలె నేనున్! 7

ప్రజాపతీ! ఓ బ్రహ్మదేవుడా! బరగ వినుము గా వచనములన్
దేహము లేనీ వారందఱికిని దీరుగ దుఃఖము గలుగు మఱిన్
దేహము లేనీ వానికి జగమున దీరుగ పని యే మున్నదికన్?
అన్ని పనులునూ లోపించును గద! అలరి చూడజాలరు వానిన్! 8

మఱి యొక దేహము గలుగునట్లుగా మన్నన సేయుము మఱి నన్నున్
అట్టి సమర్థత గలవాడవు మఱి యనుగ్రహింపుము పితామహా!
అనుచు బలుక నా వసిష్ఠుండును యలరి బలికె యా బ్రహ్మయునూ!
ఆ వసిష్ఠుతో మృదుమధురముగా నలరి ప్రీతియును దొలుకగనూ! 9

మహా యశా! నీవును శీఘ్రముగా మిత్రావరుణుల వలన మఱిన్
గలిగినట్టి యా తేజసునందున కనలి ప్రవేశింపుము వేగన్!
అచట గూడనూ నయోనిజుడవై యలరుచు నుందువు నీవు మఱిన్!
ఓ ద్విజ శ్రేష్ఠుడ! మహాధర్మముల యొప్పుగ గూడినవాడవునై
మఱల నాదు వశుడవు నగుదువు మఱి యలరుచు నను జేరెదవు మఱిన్! 10

పితామహునిచే నటుల బలుకబడి ప్రీతిగ యా ఋషి వసిష్ఠుడున్
ఆ బ్రహ్మకు నంజలి ఘటియించీ యలరి నమస్కారము జేసీ,
శీఘ్రముగా నా వసిష్ఠుండునూ శ్రీకరముగ వరుణాలయమున్
నివాసంబునకు బోయెను నాతడు నిశ్చయ స్థిర సంకల్పము తోడన్! 11

ఆ సమయంబున మిత్రుడు గూడను నలరి క్షీర సంద్రమునందున్
గూడినవాడై సురేశ్వరులచే గూరిమి పూజింపగ బడుచున్,

వరుణత్వంబును జేయుచు నుండెను వాసిగ తన ధర్మంబు మఱిన్
ఎవరి పనులు నారలు జేయగవలె యెంతటి వారలు గూడ మఱిన్! 12

చిత్రముగను నా కాలమునందే చిత్రము జరిగెను నచ్చోటన్
ఊర్వసి యనియెడి పేరు గలిగినా యున్నత పరమాప్సరస మఱిన్,
సుఖియల తోడుత గూడికొనీ మఱి సయ్యాటలనూ నాడుచునూ
దైవ వశముచే నా ప్రదేశమును చయ్యన వచ్చెను నూర్వసియున్! 13

రూప సంపదయు గల నూర్వసియును రూఢిగ వరుణాలయముననూ
క్రీడించెడి మదవతిని గాంచుచును క్రిందు మీదులై కామమునన్,
ఆ వరుణునకును ఆమె విషయమున యలరి జెప్పరా నటువంటీ
సంతోషంబును గలిగెనప్పుడును వింతవాంఛ గలిగెను మదిలో! 14

పద్మపత్రములవంటి నేత్రముల బరగ పూర్ణచంద్రుని వంటీ
ముఖము గలిగినా యప్సరసలతో మోదవతియు నూర్వసిగాంచీ,
ఆ వరుణుండును కామ వాంఛతో నల యప్సరసను శీఘ్రముగన్
మైథునమునకై వరించె నామెను మదికోరిక దెలిపెను నతడున్! 15

ఆ యూర్వసియును నంజలి ఘటించి యలరి నిలిచి వరుణుని తోడన్
మృదు మధురముగా బలికె నామెయును మాధుర్యంబును బొంగారన్!
ఓ సురేశ్వరా! దేవతా ప్రభూ! యొనరగ నీకంటెను ముందున్!
మిత్రుడు నన్నును వరించియుండెను మేలిమిగను ప్రత్యక్షముగనూ!
నీపై నాకును ప్రేమయున్నదీ నిర్ణయింపుమా నీవె మఱిన్! 16

అటుపిమ్మట యా వరుణదేవుడును నలరుచు నూర్వసి గాంచి మఱిన్
కందర్పుని శర పీడితుడగుచును చందముగా నీ విధి బలికెన్!
ఈ తేజస్సును నీ వీర్యంబును నింపుగ పితామహుని చేతన్
నిర్మింపగబడినట్టి కుంభమున నిలిపి విడిచెదను వనజాక్షీ! 17

అందమైన కటి ప్రదేశంబునూ యలరు సువర్ణము గలదానా!
నీవును నాయందున యనురాగము నింపుగ భావంబును మఱియున్,
ప్రవర్తింపజేయుము కమలాక్షీ! బన్నుగ నా కోరిక దీరున్,
సంగమంబు జేయకపోయిననూ చక్కని నీ యనురాగముచే,

నా వాంఛయు మఱి దీరిపోవునూ! నర్మిలి నీతో గూడికొనీ,
సంగమంబు జేసిన యట్లుగనే సరసరీతి నే భావింతున్! 18

లోకపాలుడగు వరుణుని మాటలు లోలత విని యా యూర్వసియున్,
బహు విధముగ మది సంతోషించుచు బన్నుగ వరుణునితో బలికెన్! 19

ప్రభూ! వరుణదేవా! మఱి వినుమా! బన్నుగ యట్లే యగుగాతన్!
నీయందే నా హృదయము నున్నది నిండుగ కామముతోని మఱిన్,
భావముగూడను నధికముగా మఱి బరగ నున్నదీ నీయందే!
దేహము మాత్రము మిత్రునకును మఱి దీరుగ యర్పింపగ బడియెన్! 20

అప్సరసయును నగు యూర్వసి జేతను నలరుచు నా విధి పలుకబడీ,
ఆవరుణుండును నాశ్చర్యముగా నలరియున్న తన రేతసును,
ప్రజ్వలించు నగ్నికి సమానమగు కాంతి గలిగినా రేతసునూ,
బ్రహ్మదేవుడును నిర్మించిన యా బన్నుగ కుంభముననను విడిచెన్! 21

అటుబిమ్మట యా యూర్వసి యైతే యల దేవతయగు మిత్రుండున్
ఎచటనుండెనో యచటికి బోయెను నింపుగ యొయ్యారముతోడన్,
ఈ సంగతి తెలిసిన మిత్రుండును నిందుకు బహు కోపించుచునూ,
ఆ యూర్వసితో నిట్లని బలికెను నా మిత్రుండును క్రోధముతో! 22

ముందుగ యూర్వసి! పిలువగబడితివి! మోదముననను నా జేత మఱిన్
దుష్టచారిణీ! బహు నీచముగా దోసమునను వర్తించితివీ!
ఎందువలన శంకయు మఱిలేకను చందముగా భావన తోడన్,
మఱియొక పురుషుని వరించితివిగద! మానుగ కామము గూడికొనీ! 23

మత్క్రోధముననను కలుషిత మైతివి మానుగ నీతిని విడనాడీ
ఈ జేసిన పాపముజేతను మఱి యింపుగ మానవ లోకమునన్,
పోయి వసింపుము! ప్రాయశ్చిత్తము బొందుగ యనుభవమును గలుగున్!
కొంత కాలమటు వసింపు లలనా! వింతలు దెలియును నీకు మఱిన్! 24

బుధుని పుత్రుడును కాశీరాజును పురూరవుండను నామముతో
రాజ ఋషిగ పేరొందెను నాతడు రమ్యముగా దేశమునందున్,

ఓ దుర్బుద్ధీ! ఊర్వసి వినుమా! యొనరగ పొందుము నాతనినీ!
భావికాలమున నాతడు నీకును భర్తయునూ కాగలడు సుమా! 25

అటుబిమ్మట యా యప్సరసయు మఱి యలరి శాపదోషము జేతన్,
ప్రతిష్ఠాన మనియెడి పురంబునూ బన్నుగ జేరెను నామెయునూ
బుధుని యొక్క ఔరస పుత్రుండగు పురూరవుని తా జేరి మఱిన్,
ఆతని తోడను గూరి చరించెను నలరి భార్యవలె జీవితమున్! 26

ఆపురూరవుడు నలరాజర్షికిని? నలరి యూర్వసీ యందుననూ,
మహాబలము గల యాయువు బుట్టెను నా పురూరవుకు బుత్రుడుగా,
ఇంద్రునితోడను సమానమైనా నింపును, కాంతియునూ గలుగీ
నహుషుడు జన్మించెను యాయువునకు నలరు సుపుత్రునిగా నిలలో! 27

ఇంద్రుడు వజ్రము జేత వృత్రుణ్ణీ నింపుగ సంహారము జేసీ
తిరుగు చుండగా నా యింద్రుడునూ దీరుగ నహుషుడు దివియందున్,
లక్షవత్సరములును బాలించెను లలి యింద్రునిగా దివియందున్!
ఇంద్రుడు లేనీ లోటు దీర్చెనూ యింపుగ యా సురలోకమునన్! 28

అందమైన నేత్రములు, దంతములు, నలరెడి కనుబొమ్మలు గలుగూ
ఆ యూర్వసియును శాపము జేతను నల భూలోకమునకు బోయీ!
అనేక వత్సరములు నటనుండెను నలరు శాప సమయము నంతన్
పూర్తిజేసికొని మఱల జేరెనూ పొలుపుగ యింద్రుని సభకు మఱిన్! 29

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
యాబది యాఱవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

యాబది యేడవ సర్గము

(వసిష్ఠుడు క్రొత్త దేహమును బొందుట. నిమి ప్రాణుల నేత్రముల మీద నివసించుట)

దివ్యమైనదియు నద్భుతమైనా దీప్తియు గలిగిన యా కథనూ
విని లక్ష్మణుడును పరమ ప్రీతితో విమల మనస్సును గలవాడై!
శ్రీరామునితో నీ విధి బలికెను చిత్తము సంతోషింపగనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

రఘురామా! దివిజులకు గూడనూ రమ్య పూజ్యులగు వారలునూ
ఆ వసిష్ఠ నిమి చక్రవర్తులును నల దేహములను వదలి మఱిన్
మఱల దేహముల నెటుల బొందిరో మానుగ దెలుపుము రఘురామా!
తేజోహీనులునై వారలునూ తేజసులను బొందిరి యెటులన్? 2

ఆ సుమిత్ర నందను వచనము విని నలరుచు శ్రీరాముడు మఱియున్
సత్య పరాక్రముడైన రాముడును తన్మయ మందుచు మదియందున్
మహాత్ముడగు నా వసిష్ఠు కథనూ మానుగ దెలిపెను నీ విధమున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

సుమిత్రనందన! లక్ష్మణ వినుమా! సురుచిరముగ నా వచనములన్,
మహాత్ముడైనా వరుణుని తేజము మానుగ నిండిన కుంభమునన్
తేజస్వరూపులు ముని శ్రేష్ఠులునూ దీరుగ నిరువురు బ్రాహ్మణులున్,
జన్మము నందిరి తేజస్సులతో దీరుగ కుంభము నందుననూ! 4

ముందుగ నచటను భగవంతుండగు మోదముననను నా యగస్త్యుడున్
జననము నందెను కానీ యాతడు సహజముగా నీ విధి బలికెన్!
'నేను నీదుపుత్రుండును కాదూ!' నిజముగ నని మిత్రుని తోడన్
పలికియు నాతడు వెడలపోయెనూ బన్నుగ యటనుండియు మఱియున్! 5

ఊర్వసి నిమిత్తముగ స్ఖలితంబై యున్న మిత్రునీ తేజసునూ
పూర్వమందు నా కుంభము నందున పాలుపుగ నుండగ బడినదియున్
ఆ తరువాతను వరుణుని తేజము వరుసగ నుండగ బడె నపుడున్
ఆ కుంభము నుండియె యగస్త్యుడును నలరుచు జన్మించెను నపుడున్! 6

కొంత కాల మటు జరిగిన పిమ్మట కాంతివంతులగు వారలునూ
మిత్రావరుణుల కారణమును గల మేదుర తేజోశాలియునూ
ఇక్ష్వాకుల వంశీయులందఱకు నిలవేలుపు మఱి కులగురువున్
వసిష్ఠ దేవుడు జననమునందెను వాసిగ యశస్సు గలవాడున్! 7

ఓ సౌమ్యుడ! సౌమిత్రీ వినుమా! యొనరగ నాదు సువచనములన్!
అనిందితుండగు నా వసిష్ఠునీ పుట్టిన వెంటనె శీఘ్రముగన్,
ఇక్ష్వాకుండును తన వంశమునకు నింపుగ హితమును గూర్పగనూ!
పురోహితునిగా స్వీకరించెనూ పొలుపుగ నా సమయమునందున్! 8

సౌమ్యుడ! లక్ష్మణ! యీ విధముగనూ సరసత వసిష్ఠుడును మఱియున్
పూర్వదేహమున బొలుపుగ వచ్చుట పూనికతో దెలుపుగబడియెన్!
నూత్నదేహమును నెట్లు బొందెనూ నూత్న దేహి నిమియును గూడన్,
ఎట్లు పొందెనో వినుమా దెలిపెద నింపుగ నాశ్చర్యము నిదియున్! 9

బుద్ధిమంతులగు సప్తఋషులునూ పూనికతో యీ నిమిరాజున్
దేహము లేకను యుండుట గాంచియు దీరుగ యోజించియు వారల్
యోగ దీక్షనూ యాతని కిచ్చిరి రాగముతో యాప్యాయతనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 10

అటుల ఋషులు మఱి బ్రాహ్మణోత్తములు నలరుచు పౌరులతో గూడన్
భృత్యులతోడను గలిగి యాతనికి పూనిక యాతని దేహంబున్,
సుగంధ ద్రవ్యంబుల చేతను మఱి సుపుష్పమాలల చేత మఱిన్,
పట్టు వస్త్రములచేతను మఱియును పరిమళ ద్రవ్యంబుల చేతన్
ఆ నిమిరాజు సుదేహంబును మఱి యలరుచు రక్షించిరి వారున్! 11

అటుపిమ్మట యా యజ్ఞం బచ్చట యలరి సమాప్తంబాయె మఱిన్
అంతట భృగుఋషి నిటులను బలికెను శాంతముతో నిమితోని మఱిన్
నీ విషయంబున సంతోషించితి నిర్మల మతితో నుండు మికన్!
నీ మనస్సునూ మఱల దెచ్చెదను నిండుగ నీ దేహంబునకున్,
మఱల యథావిధి కార్యక్రమమును మానుగ జేయుదు విక నీవున్! 12

ఆ సమయంబున దేవతలందఱు నలరుచు సంతోషించి మఱిన్
నిమి చిత్తముతో నిట్లని బలికిరి నిండు హృదయమున వారలునూ!
సంతసించితిమి! మేమందఱమును చయ్యన రాజర్షీ! మేమున్,
వరమును గోరుము! నీ చిత్తంబును బరగ నెచట యుంపగ వలయున్! 13

సమస్తమైనా సురలజేతనూ చయ్యన విని నిమి చిత్తంబున్,
దేవతలారా! నాదు కోరికను దీరుగ వినుడూ! విశదముగన్!
సకల ప్రాణులా నేత్రంబులపై చయ్యన వసియింతును గాతన్!
అనుచు బలికె నా నిమి చిత్తంబును నలరి బలికె తన కోరికనూ! 14

ఆ సమయంబున విబుధు లందఱును 'అట్లే' యగుగావుత ! యనుచున్
వాయురూపమున నుండి నీవునూ వనర సకల ప్రాణుల యందున్,
నేత్రంబులపై నివసించెదవూ! నిరుపమానముగ నీవు మఱిన్!
అని వారలు నిమి చిత్తము తోడుత యలరి పలికి రాప్యాయతతో! 15

రాజా! నీవును వాయురూపమున రయమున సంచారము జేయన్
ప్రాణులన్నియును విశ్రాంతికినై బరగ మాటిమాటికిని మఱిన్!
నీ మూలముననె యా నేత్రంబులు నిలిచి మూసికొను చుండు మఱిన్!
విశ్రాంతియునూ గలుగు వానికిని నిర్మలతయు వానికి గలుగున్! 16

ఇట్లు బలికి దేవతలందఱునూ నింపుగ వచ్చిన మార్గమునన్
వెడలపోయిరీ! తమ స్థానములకు నిల జూడగ వచ్చిన వారున్!
మహాత్ములగు నా ఋషి మునులందఱు మానుగ నిమి దేహమును మఱిన్
దీసికొనియు వచ్చిరి ఒకచోటికి దీరుగ గూడియు నందఱునూ! 17

మహాత్ములగు నా ఋషి మునులందఱు మానుగః యా సమయమునందున్
నిమికి కుమారుని బుట్టించుటకై నిమి దేహము మీదను నరణిన్
నుంచి మంత్రములు బఠించుచును మఱి యున్నతమగు హోమమును మఱిన్
జేయుచు బలముగ మథింపసాగిరి జేర్చి యరణినీ దేహమునన్! 18

అరణిని బట్టుక నిమి దేహంబును నలరి మథింపగ నటుమీదన్
మహాతపసుగల మహా పురుషుడును మానుగ జన్మించెను నపుడున్

మధియించుటచే పుట్టుట వలనను 'మిధి' యను బేరును బుట్టె మఱిన్,
జనియించుటచే జనకుడు అనియును సహజముగా నామము బుట్టెన్! 19

దేహము లేనీ నిమి నుండీ మఱి దేహముచే బుట్టుట చేతన్
అట్టి పూర్వ పురుషునకును వచ్చెను వలరుచు 'విదేహరాజు' అనీ,
'జనకుడు' అనియును నామధేయములు చయ్యన నామములును వచ్చెన్!
మహా విక్రమము గల యాతనికిని మానుగ గలగిన 'మిథి' యనెడీ
ప్రసిద్ధమైనా నామముజేతను బన్నుగ మిథిలా నగరముగన్! 20

సౌమ్య! లక్ష్మణా! నిమి శాపమునను సరగున వసిష్ఠునకు మఱియున్,
ఆ వశిష్ఠునీ శాపము చేతను నా నిమిరాజునకును మఱియున్
ఎట్లు శాపములు జరిగినవో మఱి యెటుల జన్మలును గలిగినవో!
ఆశ్చర్యము మఱి యద్భుతంబునగు నా వృత్తాంతం బంతయునూ!
కథలుగ నీకును వినిపించితినీ కడలి యలల వలె యొక టొకటిన్! 24

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
యాబది యేడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

యాబది యెనిమిదవ సర్గము

(శుక్రాచార్యుడు యయాతిని శపించుట)

శ్రీరాముడు నిటు బలుకుచుండగా శీలవ్రతుడు మఱి సుశీలుడున్,
శత్రువీరులను సంహరించు యా సౌమిత్రియునూ శీఘ్రముగన్,
తేజస్సులతో మండుచుండ నా దీరుగ యున్నట్లుండిన యా
మహాత్ముడైనా శ్రీరామునితో మానుగ లక్ష్మణు డిటు లనియెన్! 1

రాజశార్దూల! రామచంద్ర విను! రమ్యమైన నా వచనములన్,
దేహము లేనీ వసిష్ఠునికి మఱి దీరుగ పురాతనంబైనా
జరిగిన వృత్తాంతంబంతయునూ సరసత యద్భుతమును మఱియున్
ఆశ్చర్యంబును గలిగింపెడిదీ సందఱు తెలియగ గలిగినదీ! 2

కాని శూరుడగు క్షత్రియుండునూ కమనీయంబుగ దీక్షితుడున్
అయినవాడునూ నిమి రాజును మఱి యలరు మహాత్ముడు నైనట్టీ
వసిష్ఠ మహర్షి విషయంబుననూ వనరగ తగు విధ క్రమముననూ!
ప్రయత్నింపలేదని నే నెంచెద బన్నుగ విషయ విహీనతనూ! 3

సుమిత్రనందను డటుల బలుకగా సురుచిరముగ శ్రీరాఘవుడున్,
అతని వచనముల విని నాతండును నలరి మనసునను మోదమునన్
సకల నేత్రముల యందు నేర్పుగల సౌమిత్రిని గాంచుచును మఱిన్
తీయని మాటలతోని బలికెనూ దీరుగ శ్రీరాముండపుడున్! 4

ఆనందింపగ జేయువారిలో నతి శ్రేష్ఠుండగు రాఘవుడున్,
లలిత వాక్యములలో నిపుణుండును లక్ష్మణ దేవునితో బలికెన్,
ఓ వీరుడ! ఓ సుమిత్రనందన! యొనరగ పరుషుల యందఱిలో
ఓరుపు, శాంతము, క్షమా కాంతియును నొప్పుగ కనిపింపవు ధాత్రిన్! 5

పూర్వకాలమున యయాతి చేతను సత్త్వ గుణములను ధరియించీ
సహింప శక్యముగాని దోషమును సహించినాడో వినుము నికన్,
సావధాన చిత్తముతో వినుమా! సద్గుణ రాశివి గమ్మికనూ
ఓరిమితో సకలము జయించుమా యోరిమి నరునకు ప్రధానమున్! 6

ఓ సౌమ్యుడ! ఓలక్ష్మణ వినుమా! యొనరగ నాదు సువచనములన్,
నహుషుని పుత్రుడు పౌరుల నందఱ నయముగ పాలించెడివాడున్,
అయిన యయాతీ యను రాజుండెను నలరుచు బాలింపుచు నుండెన్,
ఆ యయాతికిని భూలోకములో నలరెడి రూపవతులునైనా
భార్య లిద్దఱును గలరు లక్ష్మణా! బంగరు బొమ్మలు వారు మఱిన్! 7

వృషపర్వుని యా కుమార్తెయయినా విమలమతియు నగు శర్మిష్ఠా
దైత్య స్త్రీ యుండెను పూర్వంబున తరుణి బహుళ సుందరియు మఱిన్,
ఆ యయాతికిని ప్రీతి పాత్రమై నలరుచు నుండెను బహుళగతిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 8

పురుష శ్రేష్ఠుడ! శుక్రాచార్యుని పొలుపుగ పుత్రిక గలదు మఱిన్,
దేవయానియను బేరుగలిగనది దీరుగ సుందరి యైనదియున్!
ఆమె యయాతికి రెండవ భార్యయు నలరె ప్రసిద్ధిగ యామెయునూ!
కాని యయాతికి దేవయాని మఱి కాదు నిష్ఠురాలుగ లేదూ! 9

ఆ యయాతి భార్యలు నిద్దఱికిని యలరు రూపవంతులు మఱియున్,
సుగుణవంతులగు నిరువురు పుత్రులు సురుచిరముగ జన్మించిరిలన్
శర్మిష్ఠకు మఱి పూరువుండునూ సరసత శుక్రుని సుతకు మఱిన్
యదువు యనియెడీ వాడు జనించెను నలరి ప్రసిద్ధిగ లోకమునన్! 10

పూరువు తన సద్గుణముల చేతను పొలుపుగ తల్లిని బట్టి మఱిన్
తండ్రియైన యా యయాతికిని మఱి దగ యిష్టుడుగా నాయె మఱిన్
ఆ కారణమున దుఃఖ సమావిష్టుండగుచు వేదనను గూడికొనీ
తల్లియైన యా దేవయానితో తనయుడు యదువును నిటు బలికెన్! 11

భగవంతుండును నక్లిష్ట కర్మణుడగు భార్గవునీ కులమందున్
పుట్టినట్టి నీ విటుల దుఃఖమును పొలుపుగ పొందుచు నుంటివిగా!
సహింప శక్యము గానటువంటీ సలలితముగ యవమానంబున్
పొందుచు నుంటివి తల్లీ! నీవును బొందుగ నేనెటు భరియింతున్? 12

దేవీ తల్లీ! మన మిద్దఱమును దీరుగ యగ్ని ప్రవేశంబున్
జేయుదమమ్మా! అవమానముతో జిందుచు బ్రదుకగ నేల యిటుల్?

యయాతిరాజును నా శర్మిష్ఠయు నలరుచు రమించుచును వారున్,
అనేక రాత్రులు నలర నిమ్ము! మఱి యలరుచు మనమే తొలగుదమూ! 13

నీకు సహింపగ గలిగినట్లయిన నిశ్చయముగ సహియింపు మికన్
నే మరణించెద యనుమతి నిమ్మా! నిలువలేను ఒక క్షణమైనా!
తల్లీ! నీవును నోర్చుకొనుము నిక దగ నే నోర్వగ లేను సుమా!
మరణించెదనూ యగ్నియందు బడి మానుగ సందేహము లేదూ! 14

దేవయాని యా సమయమునందున తీవ్రముగా దుఃఖించెడి యా,
పుత్రుని మాటలు విని యామెయునూ పొలుపుగ కోపించియు వేగన్,
తండ్రియైన యా శుక్రాచార్యుని తనయ దేవయానియు నపుడున్,
మనస్సునందున ధ్యానించెను మఱి మనోవ్యధను జెందుచు నపుడున్! 15

అట్టి సమయమున యా భార్గవుడును నిట్టె దుహిత మది లోపలనూ!
యుండినట్టి యా యభిప్రాయమును దండిగ దెలియుచు మది యందున్!
దేవయాని యెటనున్నదో మఱియు దీరుగ యచటికి భార్గవుడున్!
జేరవచ్చి కనుగొనెను పుత్రినీ, శ్రీకరముగ బహు సంప్రీతిన్! 16

సంతోషంబును లేక మఱియునూ సహజాలోచన శక్తియునూ
యస్వస్థతతో నున్న పుత్రినీ యా భార్గవుడును గనుగొనుచున్!
ఇదేమి పుత్రీ! యిటుల నుంటివీ! యీషన్మాత్రము సంతసమున్,
లేక యుంటివీ? కారణమేమీ? కలవర బడుచునుంటివి మదిలో! 17

మాటికిమాటికి ప్రశ్నించెడి యా మధురమూర్తి యా భార్గవునీ
మనస్సునందున మండిబడెడి యా మహా మనిషియును నగు శుక్రున్
దేవయాని కోపమతో బలికెను దీరుగ యగ్నికి వోలె మఱిన్
తన మనస్సులో నిష్ఠుర వాక్యము మానుగ ప్రకటించెను నపుడున్! 18

మునీశ్వరా! ఓ తండ్రీ భార్గవ! మోదమునను అగ్నిని గానీ
జలమునందుగానీ ప్రవేశమును చయ్యన జేసెదగాని మఱిన్,
తీక్షణమగు అగ్నిని భక్షించెద దీరుగ జీవింపను నింకన్
సమర్థురాలను గాను బ్రతుకుటకు చాలు నింక యీ జీవితమున్! 19

నన్ను నీవు దుఃఖితురాలునుగా నయముగ యవమానింపబడీ
యుండిన దానను నను నించుకయు యూహలేదు గద! నీకు మఱిన్
మునీశ్వరా! ఓ తండ్రీ! భార్గవ! మోదమునను వృక్షమును మఱిన్
అనాదరముచే జూచుట చేతను నా వృక్షము నాశ్రయ మందూ
జీవించెడి ప్రాణులకును గూడను స్థిరమగు బాధయు గలుగు గదా! 20

శుక్రాచార్యా! తండ్రీ భార్గవ! సురుచిరముగ నీ యందు మఱిన్,
అనాదరముచే దిరస్కరించుచు నలరుచు నా యందున గూడన్,
అనాదరంబును జూపుచు నుండెను నాదరణయు లేకింత మఱిన్
నను సాదరముగ జూచుట లేదూ! నయముగ గారవమును లేదూ! 21

దేవయాని యా వచనములను విని దీరుగ శుక్రాచార్యుండున్
కోపముతోడను గూడినవాడై కూడి కఠినమగు వచనములన్
యయాతి గూరిచి నిటులను బలికెను నా సమయంబున క్రోధముతో
కోపంబును మఱి యాపలేరుగద! క్రోధముతో గూడిన వారల్! 22

నహుష పుత్రుడా! యయాతి వినుమా! నయముగ నాచు సువచనములన్
దుర్బుద్ధివియై నీవును నన్నును దీరుగ యవమానించితివీ!
ఆ కారణమున ముసలితనముచే నలరుచు జీర్ణుడ వగుము సుమా!
శిథిలత్వంబును బొందుము వేగము శీలము యౌవనమును బోవున్! 23

మహా యశస్సును గలవాడును మఱి మానుగ ఋషి బ్రహ్మియునైనా
ఆ భార్గవుడును నా యయాతి నిటు నావేశముగా శపియించీ
తన కుమార్తెయగు దేవయానినీ దగ యోదార్చియు శీఘ్రముగన్
తన గృహంబునకు బయలుదేరెనూ దగ శాంతముతో గూడికొనీ! 24

సూర్యునితోడను సమానమైనా సురుచిరముగ తేజము గలుగూ
బ్రాహ్మణోత్తముల శ్రేష్ఠుడైన యా బన్నుగ శుక్రాచార్యుండున్,
ఇటుల బలికి సుతదేవయానినీ యింపుగ యోదార్చియు మఱియున్
యయాతికిని మఱి శాపము నిచ్చుచు నా శుక్రుడు బోయెను కుటికిన్! 25

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
యాబది యెనిమిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

యాబది తొమ్మిదవ సర్గము

(యయాతి ప్రుత్రుడైన పూరువునకు తన వార్ధక్యము నిచ్చి అతని యౌవనమును తీసికొనుట, భోగము లనుభవించి, తృప్తి జెందిన పిమ్మట, చాలా కాలానికి అతని యౌవనమును తిరిగి యిచ్చి వేయుట, పూరువును రాజ్యమునందు అభిషేకించుట, యదువును క్షమించుట)

ఆ సమయంబున యా యయాతియును ఆ శుక్రాచార్యుండు మతిన్
కోపించిన వానినిగా దెలిసీ కూరిమి శాపంబును వినియున్,
బహు దుఃఖితుడై వృద్ధుండగుచును బహు యాతనలను దా బడుచున్,
శర్మిష్ఠాసతి కుమారుడైనా సరసత యదువును బిలిచి మతిన్! 1

మహాకీర్తిగల పుత్రా! ఓ యదు! మానుగ నాకు సహాయంబున్
జేయుట కొఱకై నిను బిలిచితినీ దీరుగ నా వృద్ధాప్యంబున్
నీవు దీసికొని నీ యౌవనమును నిండు ప్రేమతో నాకిమ్మా!
భోగంబుల నే ననుభవించెదను భూరి సుఖంబుల నందుదునూ! 2

పురుష శ్రేష్ఠుడ! పుత్రా వినుమా! పొలుపుగ నాదు సువచనములన్
బోగంబుల నే ననుభవించి మతి భూరి తృప్తి నందగలేదూ!
కామములను నే ననుభవించియును గడు తృప్తిని నేనంది మతిన్!
నీ యౌవనమును నీకు నిచ్చెదను నా వృద్ధాప్యము నే గొనెదన్! 3

యదువును తద్వచనములను వినియును నలరి తండ్రితో నిటులనియెన్
తండ్రీ! నీ ప్రియ పుత్రుండైనా పూరువు నీ కోరిన విధమున్
ముసలితనంబును గ్రహించు గావుత! మోదముతో తన యౌవనమున్
అర్పించును నీకును ప్రియజనకా! యలరుచు సంతసమును దొలుకన్ 4

ఓ రాజా! నను రాజకార్యముల యొనరఁగ దూరము నుంచితివీ!
సామీప్యమునకు దూరముంచి నను సరసత బహిష్కరించితివీ!
ఎవరితోని కలిసియు భోజనమును నింపుగ భుజించుచున్నావో
ఆతడు నీ వృద్ధాప్యముగైకొని యలరి యిచ్చు తన యౌవనమున్! 5

రాజు వాని మాటలను వినియు మఱి రమ్యముగా పూరువుతో ననియెన్
మహాబాహు! నాకును నుపకారము మానుగ జేయుట కొఱకునునై
ముసలితనము నీపైకి దీసికొని మురిపెముగా నీ యౌవనమున్
నాకిమ్మా! పూరువుడా! యనుచును నలరి బలికె బ్రతిమాలుచునూ! 6

యయాతి మాటలు విని పూరువునూ యంజలి ఘటించి వినయమునన్
ధన్యుడనైతిని నీ యనుగ్రహము దయతో పొందితి ప్రియ జనకా!
నీ య్యాజ్ఞను నే ననుసరించెదను నిండు హృదయమున వినయముతో
అనుచు బలికె పూరువును తండ్రితో నాప్యాయత తోడుత భక్తిన్! 7

ఆ యయాతియును పూరువు బలికిన యలరి వచనముల వినియు మఱిన్
మహదానందము నంది పొంది మఱి మానుగ తన వృద్ధాప్యంబున్,
ఆ పూరువునకు సంక్రమింపగా యలరజేసి సంతోషమునన్!
ఆతని యౌవనమును దా పొందెను నలరుచు బోగము లందుటకై! 8

అటుబిమ్మటనూ యువకుడైన యా యయాతిరాజును రాజ్యమునన్
వేలకొలది యజ్ఞంబులు జేసియు వేలకొలది దానంబులనూ!
జేసియు నాతడు వేల వర్షములు శ్రీకరముగ రాజ్యము జేసెన్!
సుఖ భోగంబులు ననుభవించెనూ సురుచిరముగ యా కాలమునన్!

అటుబిమ్మటనూ బహు కాలమునకు నా యయాతి రాజును మఱియున్
పూరువు తోడను నిట్లని బలికెను బొలుపుగ ప్రీతియు బొంగారన్
పుత్రా! నా వృద్ధాప్యంబును మఱి బొందుగ దెమ్మా శీఘ్రముగన్!
నా న్యాసమునూ దిరిగి యిమ్ము మఱి నయముగ నేనుంచినది మఱిన్! 10

మహాబాహు! పుత్రా! నా వచనము బొందుగ నిమ్మా ఆసక్తిన్,
నా యాజ్ఞను మఱి నిరాకరింపక నయముగ శిరసున దాల్చితివీ!
వ్యధజెందకుమా! చేసిన పనికిని చెన్నుగ నే సంతోషముగా
రాజ్యమునకు ని న్నభిషిక్తునిగా రయముగ జేసెద నిక పుత్రా! 11

నహుషుని పుత్రుండైన యయాతియు నయముగ తన పుత్రుండైనా
పూరువుతోడను నిటులను బలికెను బొందుగ సంతసమును బొందీ
దేవయాని సుతుడైన యదువుతో దీరుగ కోపముతోని మఱిన్
ఇటుల బలికె యా యయాతి రాజును చటుల పరుష వచనంబులతో! 12, 13

ఓరీ! యదువూ! దురాత్ముండవును యొనరగ దుష్టుడ వీవు మఱిన్!
రమ్య క్షత్రియుని రూపమునున్నా రాక్షసుండవును నీవు మఱిన్,
నాకు జనించితి వీవు మఱియునూ నా యానతి మీరితి వీవున్
అందువలన నీకును శాపంబును చందముగా నిచ్చుచు నుంటిన్
సత్సంతానము గలుగ కుండునూ సరసత యీ జన్మము నందున్! 14

పూజ్యుండును! మఱి తండ్రియునగు నను పలుకున యవమానించితివీ
కావున నీకును భవిష్యత్తులో కలుగును సంతానంబు మఱిన్,
క్రూరులైన రాక్షసులు, పిశాచులు కూరిమి సంతానము గలుగున్!
సత్సంతానము గలుగదు సుమ్మా! సహింపవలయును ఫలితంబున్! 15

ఓరీ! దుర్మతి! వినుమా దెలిపెద యొనరగ పరుషములగు వాక్కుల్!
నీవు నింక మఱి చంద్రవంశమున నిలబడి యుండవు నిక్కముగా!
నీ వంశంబును నీ సమానమై నీచ స్థితియును గలుగు సుమా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

రాజర్షియునగు యయాతి యదువును రయమున నీ విధి శపియించీ,
రాజ్యంబును మఱి వృద్ధిని పొందగ రయమున జేసెడి పూరువునూ!
రాజ్యమునకు నభిషిక్తుని జేసీ రమ్యముగా నాదరముననూ!
ప్రీతిని జూచుచు నా కుమారునీ పిదప తాను ఆశ్రమమందున్,
ప్రవేశించెనూ వానప్రస్థము బన్నుగ స్వీకరణము జేసెన్! 17

నహుషాత్మజుడగు యయాతి యంతట నయముగ బహు కాలంబునకున్
మరణించియు యా మహారాజునూ మానుగ స్వర్గమునకు జేరెన్! 18

మహాయశుండగు పూరువుండునూ మానుగ ధర్మముతోని మఱిన్
కాశీరాజ్యము నందున నాతడు కడు పరాక్రమము విలసిల్లన్!
ప్రతిష్ఠాన పురమందు నాతడును బరగ ధర్మమార్గమును మఱిన్
అలవంబించియు రాజ్యము జేసెను నలరుచు శాంతము దొలుకగనూ! 19

రాజ వంశమున నుండి యదువునూ రహి బహిష్కృతుండగుచు మఱిన్
ప్రవేశింపగా శక్యముగానీ బరగ క్రౌంచ వనమున నతడున్,
అట్టి పురములో నా యదువును మఱి నిట్టి వేలకొలదియు నతడున్
రాక్షసులను జన్మింపజేసెను రమ్యముగా నా పురమందున్! 20

శుక్రాచార్యుని చేత విడువబడి సురుచిరముగ యీ శాపంబున్,
యయాతి చేతను ధరింపబడినది నల క్షత్రియ ధర్మముచేతన్
అట్టి శాపమును నిమి రాజును మఱి నిట్టె క్షమింపగ లేదు మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 21

సుమిత్రనందన! సౌమ్యా వినుమా! సురుచిరమగ యీ కథ నంతన్,
వివరముగా విశదీకరించితిని విమల మార్గమున నది నీకున్!
కార్యంబులు గల వారిని మనమును కసరుకొనక జూడగ వలయున్!
అటుల చేయకుండుట చేతను మఱి యా నృగరాజును గలుగునదియున్
దోషము గలుగక యుండుగాత! మఱి దోరముగా మన కందఱకున్! 22

చంద్రునితోడను సమానమైనా చారు సుందరము ముఖంబుతో
రామచంద్రు డిటు బలుకుచుండగనే రమ్యాకాశము నందుననూ
నక్షత్రంబులు పలుచబడినవీ రమ్యముగా చీకటి దొలగెన్!
సూర్యకిరణముల జేతను తూర్పును సూటిగ పుష్పరసంబులచే
ఎట్టినైన వస్త్రంబును మీదను నింపుగ గ్రహియించెనో యనగా
మందారంబులు పూచినట్లుగా మానుగ ప్రకాశమును బొందెన్! 23

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
యాబది తొమ్మిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఇది ప్రక్షిప్త సర్గము - మొదటిది

(ఇటుపై వచ్చే మూడు సర్గలు వ్యాఖ్యాతలు వ్యాఖ్యానమును వ్రాయలేదు)

(కార్యార్థియై కుక్క ఒకటి రాముని భవనము ద్వారము వద్దకు వచ్చుట.
దానిని రాజసభలోనికి తీసికొని రమ్మని రాముడు లక్ష్మణుని యాదేశించుట)

అటుబిమ్మట మఱి తెలతెలవారెను అందమైన సంధ్యల తోడన్!
పద్మపత్రముల వంటి నేత్రములు బన్నుగ గలిగిన రాఘవుడున్,
పూర్వాహ్ణమునందున దా జేసెడి పొలుపగు కృత్యము లన్నియునూ
జేసికొనియు బ్రాహ్మణులతోడ మఱి శ్రీకరమగు నా సంఘములన్
ముఖ్యులతోడను పురోహితుండగు మోదమునను నా వసిష్ఠుతో
కశ్యప ఋషితో కలిసిమెలసి మఱి కమనీయంబగు విషయములన్
పరిశీలింపగ ధర్మాసనమున పన్నుగ యాసీనుం డయ్యెన్! 1,2

అక్లిష్ట కర్మణుడైన వాడునూ, రాజశ్రేష్ఠుడైనటువంటీ
రామచంద్రునీ యా సభయుండెను రమ్యమైన వ్యవహారములన్
జ్ఞానమున్న యా మంత్రులతోడను, నయముగ ధర్మములను మఱియున్
శాస్త్రాధ్యయనము జేసినట్టి యా చతురులైన యితరుల తోడన్
నీతిజ్ఞులతో, రాజులతోడను నిఖిలము నెఱిగిన వారలతో
ఆ మహేంద్రునీ సభవోలెను మఱి యలరుచు యుజ్జ్వలముగ నుండెన్! 3,4

అటుబిమ్మట యా రామచంద్రుడును నల శుభలక్షణములు గలుగూ
సుమిత్రనందనుతోని బలికెనూ సురుచిరముగ యీ విధముగనూ!
మహాబాహు! ఓ సుమిత్రనందన! సువ్రత! నా వచనము వినుమా!
బయటకు వెళ్ళే ద్వారము వద్దను బన్నుగ నుందురు కొందరటన్
కార్యార్థమునకు వచ్చిన వారలు గమ్మని సంభాషణమునకై
ఉపక్రమింపుము లక్ష్మణకుమార! యున్నత గారవమును దొలుకన్! 5

శుభలక్షణములు గల లక్ష్మణుండునూ శుభ వీక్షణుడగు రాఘవుడున్
అటుల బలుకగా యా లక్ష్మణుడును అలరి వచ్చి ద్వారము కడకున్

కార్యార్థమునై వచ్చిన వారిని కలయజూచి యాహ్వానించెన్!
ఎందులకొచ్చిరో? యే కార్యమునకు? చందముగా బలుకగ సాగెన్! 6

'ఇచట నాకు వ్యవహారమున్నదీ! యింపుగ యీ ప్రదేశమునన్
అనుచునెవ్వరును చెప్పగలేదూ! అట నుండిన వారును యెవరున్!
రాముడు రాజ్యము జేయుచుండగా రమ్యముగా రాజ్యమునందున్
మనో బాధలును, రోగంబులునూ మానుగ నెచ్చట లేవు మఱిన్,
వసుధ యంతయును పక్వములైనా వనరగ సస్యంబుల తోడన్
సకలమైన ఓషధుల గూడికొని సమృద్ధిగా ధాత్రియు నుండెన్! 7,8

అచట బాలుడును, యువకుడుగానీ, అలరెడి మధ్య వయస్కుడునూ
మరణించెడి వాడును లేడుగదా! మానుగ సర్వము సుభిక్షమున్!
ధర్మము నాలుగు పాదంబులతో నడిచెను రాముని రాజ్యమునన్!
అనుసరించి మఱి ధర్మము మీదను అలరుచు పాలింపగ బడుచున్
నుండె నెవరికిని బాధ భ్రష్టతలు మండితముగ నెచటను లేవూ! 9

రాముడు రాజ్యము పాలన సేయగ రహి కార్యార్థియు లేకుండెన్,
విన్నపములు జేసెడి వాడును మఱి విజ్ఞాపన జేసెడివాడున్,
లేకుండెను మఱి రాజ్యమంతటను లీనమయ్యె ధర్మమునందున్
లక్ష్మణుండు నంజలి ఘటించుచును లాలితముగ యా విషయంబున్
మహాత్ముడగు రామునకును దెలిపెను మానుగ విశదముగా మిగులన్! 10

అటుపిమ్మట శ్రీరామచంద్రుడును నలరి ప్రసన్నాత్ముండునునై
ఆ సౌమిత్రిని గూర్చి బలికెనూ యాశ్చర్యము లేకుండగనూ!
లక్ష్మణ ద్వారముకడకు బోయి మఱి లాలితముగ కార్యాపేక్షన్
ఉన్న వారలెవరైనా నచ్చట నుండిరొ వేగము గని రమ్మా
యాదేశించెను రామచంద్రుడును అల లక్ష్మణుతో శీఘ్రముగన్! 11

నీతిని చక్కగ నిర్వహింపగా నిక్కముగా నెచ్చట గూడన్
అధర్మమనియెడి మాటలేదుగా నంతట ధర్మము వర్థిల్లెన్!

ఆ కారణమున, రాజభయమునను నందఱు ప్రజలును నిక్కముగా
ఒకరినొకరు రక్షించుకొనుచునూ వర్తిలుచుండిరి ధర్మమునన్! 12

నా చేతను విడువగబడినట్టి నయముగ బాణంబుల వోలెన్
ఇచట నాదు ప్రజలును నా ప్రజలను రక్షించుచు నుండిరి మిగులన్
మహాబాహు! అటులయినను గూడను మానుగ యాసక్తిని గలిగీ
శ్రద్ధాయుక్తుడవై ప్రజలను మఱి శాంతిని రక్షింపుము వారిన్!
అనుచు బలికె శ్రీరామచంద్రుడును నా సౌమిత్రికి దెలుపుచునూ! 13

ఇటుల బలుకబడి యా సౌమిత్రియు నింపుగ ప్రాసాదమునుండీ
ద్వారము కడకును వచ్చి లక్ష్మణుడు దగ కార్యార్థుల కనుగొనగన్!
ఆ లక్ష్మణునకు రాజద్వారమున యచట నిలబడిన శునకంబున్
కానబడెను నా సౌమిత్రికినీ కలయజూచి యా శునకంబున్! 14

అటుపిమ్మటనూ వీర్యవానుడగు నా లక్ష్మణుడును గనుగొనుచున్
మాటిమాటికిని అఱచుచున్న యా మానుగ శునకంబును గాంచీ,
ఆ శునకంబును ప్రశ్నించెను మఱి యలరుచు సుమిత్ర నందనుడున్!
ద్వారమందు నిలుచుంటి వదేలను? దగ యాక్రోసించుట యేలా? 15

మహా భాగ్యమును గల ఓ శునకమ! మానుగ దెలుపుము విషయంబున్?
నీ కార్యం బది యేమి దెలుపుమా! నిశ్చయముగ దెలుపుము నింకన్!
విశ్వాసము గూడిన మనస్సుతో విమలముగా దెలుపుము నింకన్!
సౌమిత్రీ వచనములను వినుచును సారమేయమును నిటు బలికెన్! 16

సర్వప్రాణులకు రక్షకుండునూ, శ్రమ లేకుండను కార్యములన్
సాధించెడివాడును భయంబునను సరసత యభయము నిచ్చుచునూ
రక్షించెడి వాడగు శ్రీరాముడు రమ్యముగా నే నాతనికే
దెలుపవలయునని గోరుచుంటినీ దీరుగ నా ప్రార్థనల మఱిన్! 17

సుమిత్ర నందనుడైన లక్ష్మణుడు సూటిగ శునకము మాట వినీ,
ఈ విషయంబును రామచంద్రునికి నింపుగ దెలుపగ వలయుననీ,

మంగళకరమగు భవనములోనికి మానుగ బోయెను నాతండున్
విచిత్రమగు నా విషయము తెలుపగ విన్నవింప నా ప్రార్ధనలన్! 18

ఆ లక్ష్మణుడును శునకము దెలిపిన సురుచిరమగు నా వాక్యములన్
శ్రీరామునకును దెలిపి మఱలనూ స్థిరముగ భవనము నుండి మఱిన్
బయటకు వచ్చి శునకము తోడను బన్నుగ నీ విధముగ బలికెన్!
'చెప్పవలసినది నీకేమైనా జేరియున్నదియు రాజునకున్'
తెలియజెప్పుమా! శ్రీరామునకును దీరుగ సభకును జేరి యటన్! 19

సుమిత్ర నందను వచనంబుల విని శునకము లక్ష్మణుతో ననియెన్,
లక్ష్మణ! దేవత గృహమునందునను, రమ్య రాజభవనము లందున్,
ద్విజుల గృహములను అగ్ని, యింద్రుడును దీప్తికరుడు సూర్యుండు మఱిన్,
వాయువునందురు అధమయోనులము వనరగ యా గృహములయందున్
ప్రవేశించుటకు మే మయోగ్యులము బన్నుగ బోవగరాదు గదా! 20, 21

నే నీ భవనమునందు ప్రవేశము నిర్మలమతి బోవగలేనూ!
రూపము గలిగిన ధర్మము రాజును రాజే ధర్మ స్వరూపి మఱిన్
సత్యము పలుకును, రణరంగంబున సమర్ధుండు నా రాజు మఱిన్
సకల భూతముల హితమునందునను సహజాసక్తియు గలవాడున్! 22

రఘువంశంబున బుట్టినవాడును రమియించెడి వాడందఱినీ,
రామచంద్రు డల యాఱు గుణములను రమ్యముగా తెలిసిన వాడున్
సంధి విగ్రహము యాన - ఆసనము ద్వైదీభావ సమాశ్రమములన్
నెఱిగిన వాడును నీతికర్తయును సర్వజ్ఞుడు తెలిసిన వాడున్!
అన్నియు జూడగ గలిగిన వాడును ఆ రాముడు పరమాత్మయునూ! 23

ఆ శ్రీరాముడు అగ్నియు, చంద్రుడు నలరు మృత్యువును యముడు మఱిన్
కుబేరుండు నింద్రుడు సూర్యుండును వరుణుడు భూమ్యాకాశములున్! 24

ఓ లక్ష్మణ! రామునితో బలుకుము! ఆ రాముడు జనపాలకుడున్!
సౌమిత్రీ! నే నా శ్రీరాముని సరసత ఆజ్ఞయు లేకుండన్,

ర్రాజ భవనమును నే జొచ్చుటకును రహి నే నిష్టము బడను సుమా!
అనుచు బలికె. నా సారమేయమును నదురుబెదురు లేకుండగనూ! 25

మహా భాగ్యమును గలవాడును మతి మహాతేజమును గలవాడున్
ఆ సౌమిత్రియు విసిగికొనకనూ, అలరి రాజభవనము నందున్
ప్రవేశించి రఘురామచంద్రుతో బన్నుగ నీ విధమున బలికెన్!
శునకము చెప్పిన దంతయు గూడను సూటిగ దెలిపెను రామునితో! 26

కౌసల్యానంధన వర్ధన విను! కరుణతోని నా వచనములన్
మహా బాహు ఓ వంశవర్ధనా! అలరెడి నీ యాజ్ఞల వలనన్
ఏర్పడినట్టి విజ్ఞాపింపగ నింపుగ గలదొక విషయంబున్,
ఒక్క శునకమును కార్యార్థివియై యొనరగ వచ్చినదీ స్వామీ!
ద్వారము వద్దను నిలిచియున్నదీ దగ నీకును విజ్ఞాపింపన్! 27

ఆ లక్ష్మణునీ వచనములను విని నా శ్రీరాముడు శీఘ్రముగన్
'కార్యార్థినియై వచ్చియున్న యా కడు నేర్పరియగు శునకంబున్
ప్రవేశపెట్టుమ లక్ష్మణ! వేగము! బన్నుగ యాలస్యములేకన్'
ఆ లక్ష్మణుతో బలికెను రాముడు నా శునకము మొఱ వినుటకునై! 28

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ప్రక్షిప్త సర్గలలో మొదటి సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఇది ప్రక్షిప్త సర్గము - ద్వితీయము

(శునకము విషయమున రాముడు న్యాయ నిర్ణయమును జేయుట- దాని యభిప్రాయము ప్రకారము రాముడు దానిని కొట్టిన బ్రాహ్మణునకు మఠాధిపత్యమును నిచ్చుట, శునకము మఠాధిపత్యములో నున్న దోషాలను వర్ణించి చెప్పుట)

రాముని మధుర సువచనములను విని రహి మతిమంతుడు లక్ష్మణుడున్
తొందరబడుచును నున్నవాడునై తోరముగా శ్వానమును మతిన్
పిలిచి తీసికొని వెళ్లి రామునకు ప్రీతిని జూపించెను దానిన్
రాముడు గూడను సారమేయమును రహి గాంచుచు సంతసమందెన్! 1

వచ్చినట్టి యా సారమేయమును మచ్చికతో రాముడు గాంచి,
భయములేదనుచు బలికి రాఘవుడు బన్నుగ నీ విధమున బలికెన్!
'సారమేయమా! హృదిలో నున్నది సరసత దెలుపగ దలచినదీ!
నిశ్చయంబుగా తెలియబలుకుమా నిక్కము భయ మేమియులేదూ! 2
ఆ శ్రీరాముని వచనము వినుచును అలశునకంబును శీఘ్రముగన్,
తలబ్రద్దలునై రక్తము గార్చుచు దగ యుండిన యా శునకంబున్
అచటనున్న యా రాముని గాంచెను వలరుచు శిరసును వంచి మతిన్,
రామచంద్రునీ గాంచి శునకమును రమ్యముగా నిటులను బలికెన్! 3

సకల భూతముల దృష్టికి హేతువు సార్వభౌముడగు రాజుగదా!
రాజే గొప్ప వినాయకుండునూ రాజే ప్రజలను బాలించున్!
సర్వజనులు నిద్రించుచుండగా సార్వభౌముడగు రాజు మతిన్!
మేల్కొని యుండును జాగరూకతను మిగుల నంతయును గమనించున్! 4

రక్షకుడైనా రాజు చేత మతి రమ్యముగా నడుపగ బడినా
నీతిచేత ధర్మమును దేశమున నిక్కముగా రక్షింప బడున్!
సార్వభౌముడును పాలింపనిచో సకల ప్రజలు భ్రష్టులు నగుచున్
నశించి పోదురు నామరూపములు నయముగ నుండవు లోకమునన్! 5

రాజే కర్తయు రాజ్యంబునకును రాజే రక్షకుడును సుమ్మా!
రాజే జగత్తు కంతకు దండ్రియు రాజే కాలము గూడ మతిన్,

రాజే యుగమని భావించెదనూ రమ్యముగా నామది యందున్
సకలమైన యీ సర్వ జగత్తును సరసత రాజని దలతు మదిన్! 6

ధరించునది మఱి ధర్మము కావున ధర్మమనుచు బలికెదరు ధరన్,
ధర్మమె ప్రజలను నిలబెట్టును మఱి ధర్మమె సకలంబును నిలుపున్!
జంగమ స్థావరములతో గూడిన సకలమైన త్రైలోక్యంబుల్
నిలబెట్టునదీ ధర్మమే కదా నిఖిలము ధర్మము బరికింపన్! 7

శత్రువులను మఱి యదుపునుంచుటకు సరసత ధర్మమె నిది గూడన్,
ధర్మము జేతను రాజులు ప్రజలను దగ రంజింపగ జేతు రిలన్!
అందుజేత ధరియింప జేయునది చందముగా జెప్పగ బడియెన్!
ఇదే ధర్మమని నిశ్చయంబుగా నింపుగ బలుకగ వచ్చు ధరన్! 8

రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్!
ఉత్తమమైనా యీ ధర్మంబే యురుతర ఫలమును గొనితెచ్చున్
మరణానంతరమును గూడను మఱి మానుగ ఫలముల నిచ్చు మఱిన్!
ధర్మము వలనను లభింపజాలని దగ సత్ఫలితములు పృథ్విన్!
ఏదీ యుండదు నీ వసుంధరను నింపుగ నాదు సుభావనయున్! 9

రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్!
రఘురామా! దానము దయ మఱియును రహి సత్పురుషుల పూజయునూ,
వ్యవహారములందున బుజుత్వమును నివి మరణానంతరము మఱిన్
ఇహ లోకంబుల నందున గూడను నింపుగ రక్షించుట చేతన్!
'ధర్మము' అని మఱి పలుకబడినదీ ధర్మము మఱి యిదియేను సుమా! 10

సువ్రత! వినుమా! దయతో రాఘవ! సురుచిరమగు నా వచనములన్,
ప్రమాణంబులకు ప్రమాణంబులై బన్నుగ యుంటివి నీవు మఱిన్,
సత్పురుషులచే నాచరింపబడు సకల ధర్మములు తెలిసెదవూ!
అట్టి ధర్మమును నీకును దెలియును నిట్టె దెలియనిది లేదు సుమా! 11

రాజులలో శ్రేష్ఠుండవు రామా! రయమున ధర్మములకును మఱిన్
ఉత్తమ స్థానము నీవు సుమా! మఱి యున్నతమగు గుణముల లోనన్!
సంద్రము వంటీ వాడవు నీవును సరసత యజ్ఞానము వలనన్

నీ ముందఱ ధర్మమును గూర్చి మఱి నిగిడి మాటలాడుచు నుంటిన్,
శిరమును వంచీ నమస్కరించుచు సిద్ధముగా నుంటిని నేమన్
కోపము జేయకు నీ విషయంబున గోరుచుంటి క్షమియింపమనీ! 12

శునకము వాక్యము విని రాఘవుడును సురుచిరముగ నీ విధి బలికెన్
ఇపుడు నీకు నేనేమి కార్యమును నింపుగ జేయగ వలెనొ మఱిన్!
నిర్భయంబుగా తెలియ జేయుమా! నిజముగ యాలస్యము వలదూ!
అని శ్రీరాముడు శునకము తోడను నలరుచు బలికెను బహు ప్రీతిన్! 13

శ్రీ రాఘవునీ వచనములను విని స్థిరముగ శునకము నిటులనియెన్
ధర్మము జేతను రాష్ట్రంబును మఱి ధార్మికముగ పొందగవలెనూ!
ధర్మము జేతను దేశంబును మఱి దగ పాలింపగ వలెను సుమా!
ధర్మము వలనను సకలము జరుగును దార్మికత్వమును నిలుచు ధరన్! 14

రఘురామా! ధర్మంబు వలననూ సకల భయంబులు తొలగించూ!
రాజు రక్షకుడు నగును జగతికిని రాజు న్యాయమును నిలుపు ధరన్!
ఈ విషయంబును దెలిసికొనియు మఱి నింపుగ ధర్మాధర్మంబుల్,
ఏమి చేయవలెనో నా కొఱకై యింపుగ వినుమా రఘురామా! 15

బ్రాహ్మణులుండే ప్రదేశంబునను బన్నుగ నివసించుచు నున్నా
సర్వార్థ సిద్ధుడను భిక్షువుగలడూ సర్వము నెఱిగిన వాడు మఱిన్,
కారణమేమియు లేకుండగనే కఠినత్వంబును వహియించీ
అపరాధంబేమియు లేనీ నను నలరి కొట్టినా డతడు మఱిన్! 16

ఆ సమయంబున రామునిచేతను నలరి ద్వారపాలకుడు మఱిన్
సత్వరమే నా విప్రుని గొనిరాగను సరసత నాతని గృహమేగీ!
సకల శాస్త్రముల నెఱిగిన వాడగు సర్వ విషయముల దెలిసిన యా
బ్రాహ్మణోత్తముని వెంట బెట్టుకొని బన్నుగ రాఘవు కడ కొచ్చెన్!
అటుబిమ్మట యా మహాద్యుతియుగల యలరి బ్రాహ్మణోత్తముడు మఱిన్!
రామచంద్రునీ కనుగొని యాతడు రమ్యముగా నీ విధి బలికెన్
రఘురామా! నీ కేమి జేయవలె రయముగా నే నిపుడు మఱిన్!
తెలియబరుపుమా! యనుచును బలికెను దీరుగ బ్రాహ్మణు డపుడు మఱిన్! 17,18

ఆ విప్రుని మాటలు విని రాముడు నలరి బలికె నీ విధముగనూ
నీవు నిట్టి శునకమును గొట్టితివి! నీకు నెట్టి యపరాధంబున్
సారమేయమును జేసినదో మఱి చయ్యన దెలుపుము విషయంబున్
కట్టెతోని కొట్టిన కారణమును కఠినత్వమును దెలుపు మికన్! 19,20

క్రోధము ప్రాణములను హరియించెడి కూరిమి పెనుభూతంబు సుమా
కోపము మిత్రుని వలె కనిపించును కూరిమి శత్రువు నిక్కముగన్!
వాడియైన ఖడ్గము కోపము సుమ! వేడియైన తైలంబు సుమా!
కోపము సకలము నశింప జేయును కోపము మించిన పాపంబున్,
లేదీ జగతిని సకల పుణ్యమును సరగున మాయము జేయు నిలన్! 21

తపము జేసినా, జపము జేసినా తగ యజ్ఞంబులు జేసిననూ
దానధర్మములు నెన్ని జేసినా దగ వానిని మఱి యన్నిటినీ
కోపము వలనను నశించి పోవును కోపము శత్రువు జీవునకున్!
అందువలన కోపమును విడువవలె చందము దూరము నుండవలెన్! 22

ఇంద్రియములకును గోచరంబులై నింపుగ యా భోగ్యంబులనూ
వాటి నుండి మఱి దూరము జేసీ వనరగ మళ్లింపగ వలెనూ!
దుష్టములగు నశ్వంబులకును వలె దూరము బరుగెత్తుచునున్నా
ఇంద్రియంబులను ధైర్యముతోడను నిల సారథ్యము జేయవలెన్! 23

మనస్సు చేతను, కర్మల చేతను మానుగ వచనంబుల చేతన్
చూపుల చేతను నెదుట నున్న యీ చోద్యమైన లోకంబునకున్!
శ్రేయస్సును మఱి జేయుచుండవలె శ్రీకరముగ యెల్లప్పుడునూ!
అట్టివాడు నెవరిని ద్వేషింపడు నచ్చరిత్రమును గలుగుచునూ
పాప పుణ్యములు నంటవు నతనికి బరగ క్రోధమును జయించినన్! 24

స్వాధీనము నందుండని మనసును సరసత యెంతటి వ్యధను మఱిన్
అపకారంబును దెచ్చి పెట్టునో యంతటి యపకారంబు మఱిన్
వాడియైన ఖడ్గముగానీ మఱి వనరగ త్రొక్కిన సర్పంబున్
నిత్యము కోపముతోని యున్న యా కుదురుగ శత్రువుగాని మఱిన్
జేయగజాలరు నుపకారంబును చేదు, విషము, క్రోధంబు నిలన్! 25

సహజ స్వభావము కోపము గావున సరస రీతి మాన్పగ వలయున్,
ఎంత వినయమును నేర్పినగానీ సుంత స్వభావము మారదుగా,
సహజముగా ప్రకృతి యనుసారము పనులు జేయుటయు దప్ప దిలన్,
అందుకనే యా సహజ స్వభావము చందముగా క్రోధమును మఱిన్
మార్చుకొనగవలె వినయము చేతను మధురాదర్శంబుల తోడన్! 26

అక్లిష్ట కర్మణుడైన రాఘవుడు నటుల బలుకగా పిమ్మటనూ
సర్వార్థ సిద్ధుడను బ్రాహ్మణు డంతట సంసిద్ధుండై చతురతనూ!
ఆ రాముని సన్నిధిలో బలికెను నలరుచు నాలోచించి మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 27

రామా! నేనును భిక్ష కొఱకునై బన్నుగ దిరుగుచు నుండగనూ!
ఆ రోజున మఱి యెందువలననో యలరి భిక్ష దొరకగ లేదూ!
ఆ సమయంబున కోపావేశము నందునుండి యావేశముతో
ఈ శునకంబును జేతి కఱ్ఱతో, నిహ నే గొట్టితి క్రోధమునన్! 28

వీధికి యడ్డముగా నిలిచిన యా వికటమైన యీ శునకంబున్
వెళ్ళుము! వెళ్ళుము! లే! లే! యనుచును వేగముగా దోలితి నేనున్!
అయినను గూడను నీ శునకంబును నలరుచు స్వేచ్ఛగ నడుచుచునూ!
వీధి చివఱ యడ్డముగా నిలచెను వికటముగా జూచుచును మఱిన్! 29

రాజ రాజ! శ్రీ రఘురామా! విను! ఆ సమయంబున యాకలితో
కోపావేశము నందునున్న నే క్రోధావేశము తోని మఱిన్,
ఈ శునకంబును జేతికఱ్ఱతో నిట్టె గొట్టితిని తీవ్రముగన్!
అపరాధంబును జేసినట్టి నను నలరి శిక్ష వేయుము నాకున్! 30

రాజేంద్రా శిక్షించిన నీవును రహి భవిష్యత్తులో నరకంబున్
అనుభవింపవలె నను భయంబునూ యలరి యుండ దిక మును ముందున్
అటుల బలుక యా సన్యాసియునూ యటు మీదట నా రాఘవుడున్,
సభలో గల సభ్యులను జూచి మఱి సరసత నీ విధి ప్రశ్నించెన్! 31

ఇప్పుడేమి కార్యమును జేయవలె? నితనికెట్టి దండనము మఱిన్
నీయవలయునో దెలుపుడు మీరట నింపుగ ధర్మము నిలుపగనూ?

సరిగా శిక్షను విధించినపుడే, సరసత ప్రజలందఱును మఱిన్
రక్షింపగ బడుదురు దేశంబున రక్షణయుండును దేశమునన్! 32

భృగు నంగీరస కుత్స వసిష్ఠులు దగ కాశ్యపుడును మఱియు నికన్
ధర్మశాస్త్రముల పఠనము జేసిన దగువారలు యచటను గలరూ!
మంత్రులు నా యా సంఘ ముఖ్యులును ధర్మశాస్త్రముల నిష్ణాతుల్
అచట నుండినా పండితు లెందఱొ యా రామునితో నిటులనిరీ!
విప్రుని దండింపగ కూడదు! అని విమల శాస్త్రవేత్తలు మఱియున్,
తెలుపుచునుండిరి శాస్త్రములందున తీరుగ శ్రీరామా! యనుచున్!
సభలో నుండిన ప్రముఖులందఱును సరసరీతి వివరించి రటన్! 33, 34

అటుబిమ్మట యా మునులందఱునూ యా రామునితో నిటులనిరీ,
రఘురామా! భూప్రజలనందఱను రమ్యముగా పాలన సేయన్,
శిక్షించెడి వాడును నతడే కద! శాసకుడవు రామా! నీవున్
సనాతనుండగు విష్ణుదేవుడవు! సరసత త్రైలోక్యంబులనూ
శాసించెడివాడవు నీవే కద! సభ్యత నిలిపెడి వాడవునూ! 35, 36

సభ లోపలగల సభ్యు లందఱును సరసత యా విధమున బలుకన్,
సారమేయమును నిటులను బలికెను సార్వభౌముడగు రామునితో,
రఘురామా! నా విషయమునందున రమ్యానుగ్రహమును జూపన్
దలచినట్లయిన నాకు వరంబును దగ నివ్వగ దలచిన నీవున్,
నేను దెలిపెదను వీరుడ! వినుమా! విశదముగా నా వచనంబున్
నీకు నేను మఱి యేమి చేయవలె? విశదముగా బలికితి విపుడున్!
ప్రతిజ్ఞ పూర్వకముగ బలికితివీ! బన్నుగ నందఱి ముందు సభన్
రాజా! యీ బ్రాహ్మణునకు వేగము రయమున కులపతి పదవి మఱిన్,
రయమున నిమ్మా మహారాజా విను! కాలంజర క్షేత్రంబుననూ!
కులపతిత్వమును నిమ్మాదయతో కూరిమితో బరిపాలింపన్! 37, 38

సారమేయమును విన్నవించినా సరస విషయమును దెలిసికొనీ,
ఆ బ్రాహ్మణునీ కులపతి సేయగ యా విప్రుడు సంతస మందెన్,
రాజకుంజరము నెక్కినంతగా రహి యాతడు మోదమునందెన్,
రామచంద్రునీ ప్రస్తుతించుచును రయమున బోయెను బ్రాహ్మణుడున్! 39

అటుబిమ్మట యా రాముని సచివులు నాశ్చర్యంబును బడుచు మఱిన్
మహాద్యుతే! ఓ రామా వినుమా! మామగ యా వచనంబులనూ
ఇది యీతనికి శిక్షయు గాదూ! యిది దండనమును గాదు గదా!
ఇది యీతనికిని వరప్రసాదము! ఇది యీతనికిని వరము సుమా! 40

రామచంద్రుడును మంత్రుల మాటలు రమ్యముగా విని వారలతో
దీని యందుగల రహస్య భావము మీకు దెలియ దీ సంగతియున్,
శునకంబునకును దీని రహస్యము సురుచిరముగ దెలియును గావన్,
అని పలికెను శ్రీరామచంద్రుడును నా రహస్యమును దెలిసి మఱిన్! 41

అటుబిమ్మట యా రాఘవు డడుగగ యా శునకము మఱి యిటు లనియెన్!
నే నచ్చట మఱి కులపతిగానూ, కూరిమి యధిపతిగా నుంటిన్,
దేవతలయు మఱి బ్రాహ్మణ పూజయు దీరుగ జరిగిన తదుపరియే
మిగిలినట్టి శిష్టాన్న భోజనము మేలిమిగా దినుచును నుంటిన్,
దాసీదాసుల కన్నాదులనూ దగ యిచ్చుచు నుండెడివాడన్,
శుభకరమైనా దృష్టితోడుతను శుభకర దేవ సుద్రవ్యములన్,
రక్షించుచు నుంటిని యా నాడును రమ్యశీల సంపన్నుడనై
సమస్త ప్రాణులయందు గూడనూ సరసరీతి దయతో నుంటిన్!
అట్టి నాకు ఘోరమునగునట్టి యధమ స్థితియు సంభవ మయ్యెన్
నీచమైన యీ శునక జన్మమును నిండుగ వచ్చెను నాకు నిలన్! 42, 43, 44

రఘురామా! యంతటి పవిత్రతను నలరుచు జీవితమును గడిపి
వ్యవహరించినా నాకే యీ ఈ గతి యావరించినది నిక్కముగా,
కోప స్వభావుడు ధర్మంబును మఱి కూరిమి త్యజియించిన వాడున్
అహితము సేయుట యందాసక్తియు యలరెడి వాడు సుక్రోధుండున్,
క్రూరుడు కఠినుడు నవిద్వాంసుడును నధార్మికుండును నైనట్టి
ఈ బ్రాహ్మణుడును కులపతిత్వమును నింపుగ శిరసున ధరియించి,
వెనుకటి తరాల నేడింటిని మఱి విమల భావి తరములను మఱిన్!
ఏడింటిని మఱి ధ్వంసమొనర్చును నేడింటిని పతితంబులుగా! 45, 46

అందువలన యే స్థితిగతులందును నల కులపతిత్వమును మఱియున్
చేయగరాదూ! అధికారముతో జిందగ రాదూ! గర్వముతో,

ఎవనిని పుత్రులు పశువులతోడను నింపుగ బంధు సమేతముగా
నరకంబునకును బంపవలయునని నయముగ కోరిక యుండినచో
దేవాలయములయందు మఱియునూ దీరుగ గోవుల యందు మఱిన్
బ్రాహ్మణుల మీదను! నధికారము బన్నుగ నీయగవలయు నిలన్! 47

ఇవ్వబడిన బ్రాహ్మణ ధనంబునూ నింపుగ యుంచిన ధనంబునూ,
దేవతల యా ద్రవ్యంబును మఱి దీరుగ హరియించిన వాడున్,
శీఘ్రము అవీచి యను నరకంబున స్థిరముగబడు తలక్రిందులుగా
మనసునందునను గోరగరాదూ! మహనీయములగు ధనంబులన్
స్త్రీ ధనంబునూ బాలధనంబును శీలత లేకను హరించునో
ఇష్టులతో కూడను నాతండును నింపుగ నశియించును ధరణిన్, 48, 49

దేవ బ్రాహ్మణ ధనంబులను మఱి దీరుగ మనసున గోరుకొనున్
అట్టివాడు నిత్యము నరకంబున నిట్టెయుండు వేదన తోడన్,
కొఱవితోని తల గోకి కొన్నటుల కూడియుండు నెల్లప్పుడునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 50

శునకము మాటలు విని రాఘవుడును సురుచిరముగ యాశ్చర్యముతో
ఆశ్చర్యముతో వికసించెను మఱి యాతని నేత్రంబులు నపుడున్!
వచ్చినట్టి యా సారమేయమును వచ్చినట్టి యా చోటునకున్
వెడలిపోయెనూ వెనుజూడక మఱి వేగము తన స్థానంబునకున్! 51

మనస్వియును మఱి పూర్వజ్ఞాతిజ్ఞ మహా భాగ్యమును గలదియునూ!
జాతిమాత్రమున దూషింపగ బడి జ్యోతి స్వరూపము గలదియునూ,
అట్టి సారమేయమును కాశిలో నిట్టె జేసె యుపవాసంబున్
భక్తితోని తన ప్రాణము లొదిలెను నిష్ట భక్తితో పరమేశున్! 52

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ప్రక్షిప్త సర్గలలో రెండవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుథాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఇది ప్రక్షిప్త సర్గము - తృతీయము

(గ్రద్ధ గుడ్లగూబల వివాదము)

వృక్షంబులతో ప్రకాశించెడీ యున్నతమగు నది చేత మఱిన్
వ్యాప్తమైన యా వనమునందుననూ ననేక పక్షుల దోడుతనూ!
ధ్వనింపగా జేయగబడినట్టిది తరుల పూలతలు గూడికొనీ
సింహంబులతో వ్యాఘ్రంబులతో వ్యాప్తమైన యా వనము మఱిన్
అనేక విధముల మృగ సంఘంబులు నలరునట్టి పర్వతముననూ!
అనేక వత్సర సముదాయంబులు నలరు నట్టి యా గిరి పైనన్
గ్రద్ధయొకటియును గుడ్లగూబయును నలరి వసించుచు నుండె నటన్! 1,2

అటుబిమ్మట యా పాప నిశ్చయము నలరెడి గ్రద్ధయు నులూకముల్
ఇంటిని గూరిచి వాదులాడుచును నింపుగ నాదీ! నాదనుచున్!
కలహంబును మఱి ప్రారంభించెను కంటికి కునుకును లేకుండన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

కోపముతో నా రెండును గూడను కోలాహలమును జేయుచునూ!
గృహమెవ్వరిదో గ్రహింపలేకను తహతహతో బోరాడుచునూ!
పద్మపత్ర నేత్రుడు శ్రీరాముడు బన్నుగ త్రైలోక్యంబులకున్
ప్రభువాతడు మఱి తేల్చుకొనుటకును బన్నుగ నాతని తీర్పునకై
బోవుదమని యా రెండును గూడను బొందుగ నిశ్చయమును జేసీ! 4

ఇట్లు నిర్ణయము కొఱకు రెండునూ వింపుగ సునిశ్చయమునునైనా
బుద్ధిని జేసీ కోపావిష్టము బొలుపుగ యమర్షమున బొంగీ
రామచంద్రునీ కడకు బోయినవి రమ్యమైన వినతుల తోడన్!
తమ కలహంబును విన్నవించుటకు దగు న్యాయంబును గోరుచునూ! 5

కలహముజేతను వ్యాకులమైనా కలత నందినా చిత్తములన్
గృధ్ర ఉలూకంబులు రెండును మఱి కేకలు వేయుచు బిగ్గఱగన్!

తమలో దామటు దగవులాడుచును దగ శ్రీరాముని యొద్దకునూ
జేరి యాతనీ పాదంబులనూ శీఘ్రము తలదాల్చుచును మఱిన్! 6

అటుబిమ్మట యా గృధ్రరాజమును నా నరేంద్రునీ గాంచి మఱిన్
నీ విధముగ బలికెను నా గృధ్రము నింపుగ రాముని బరికించీ,
నీవు సురలలో నసురలయందును నిర్మలుండవని తెలియునులే
నిండు మనసనుచు దెలియును నాకును ఖండితముగ ధీరుడవీవున్! 7

మహా కాంతిగలవాడా రామా! మానుగ సురలకు గురువగు నా
బృహస్పతికి మించిన వాడవునూ యిహ శుక్రాచార్యుని కంటెన్
విశిష్టుండవును నయియున్నావూ తారతమ్యములు దెలియు మఱిన్,
కాంతిచేత మఱియొక చంద్రుండవు శాంతిని గూర్చెడి వాడవునూ! 8

సూర్యుని వలెనూ దుర్నిరీక్షుడవు సురుచిర గౌరవ మందుననూ
హిమవంతుండవు! గాంభీర్యంబున హేమ కాంతి గలవాడవునూ!
ఆటుపోటులను గలిగినట్టి యా యల సంద్రంబును బోలుదువూ!
లోకపాలుడగు యముడవు నీవును లోలత వాయువు నీవు మఱిన్! 9

రామా! నీవును నోర్పుచేత మఱి రమ్య ధరణి సముడవు నీవున్
శీఘ్రత్వంబున వాయువుతోడను శ్రీకరముగ సమ తుల్యుడవున్,
పూజ్యుండవు మఱి సర్వసంపదలు బొలుపుగ గలవాడవు నీవున్,
కీర్తితోని మఱి గూడినవాడవు! నార్తి బాపెడీ వాడవునూ! 10

జయింప శక్యముగాని వాడవును! జయమును బొందెడి వాడవునూ!
పట్టుదలయు గలవాడవు నీవును, ప్రతాపంబు గలవాడవునూ!
సకలాస్త్రముల విధానము దెలిసిన సార్వభౌముడవు శ్రీరామా!
నేను జేయు విజ్ఞాపనంబునూ నిర్మల మతి యోచింపు మికన్! 11

మహారాజ ఓ రఘురామా! విను! మానుగ నాదు సువచనములన్
పూర్వంబున నిర్మించుకున్న యా పొలుపగు నాదు గృహంబు మఱిన్
ఈ యులూకమును బాహుబలంబున నిట్టె హరించుచునున్నదియున్
ఈ విషయంబున నీవు నన్ను మఱి నింపుగ రక్షింపగ వలయున్! 12

ఇటుల గ్రద్ద బలికిన తరువాతను నింపుగ యులూక మిటు లనియెన్
రామా! రాజును నింద్రచంద్రులను రమ్య సూర్యుడును కుబేరుడున్,
యముల వలన జన్మించును నతడును మనుష్యాంశ కొలదియు నుండున్,
కానీ నీవును మాత్రము రెండవ కరుణానిధి నారాయణుగన్
సకల దేవతా స్వరూపుండవును సాంద్ర దివ్య రూపుడవు మఱిన్ 13, 14

నీ సౌమ్యత్వము రామా! నీవును నిశ్చయముగ పరిశీలించీ
సమానముగ వర్తింపజేయుదువు! సద్గుణవంతుడ వీవు సుమా!
అందువలన నీ యందున నున్నది చందముగా సోమాంశమంబున్
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

క్రోధమునందును, దండమునందును కూరిమి దానము నందుననూ
పాప భయంబును బోగొట్టెదవూ! ప్రజానాథుడవు నీవు మఱిన్,
నీవు మాకు మఱి యింద్రుని వోలెను నిర్మలమగు దాతవు మఱియున్!
హర్తవు మఱియును రక్షకుండవును హరియించెడి వాడవు నీవున్! 16

సకల భూతముల జేతను మఱియును సహింప శక్యము గాకయునూ,
హవ్య వాహనునివలె తేజస్సున యలరు సర్వలోకములు మఱిన్!
తపింప జేయుచు నున్నవాడవును తాపము గలిగించుచును మఱిన్
అందువలన నీవును సూర్యునితో నలరు సమానుండవును మఱిన్! 17

రాజసత్తమా! సాక్షాత్ నీవును రహి విత్తేశుని తుల్యుడవున్
లేదా నీవును కుబేరు కంటెను లీలగ యధికుండవు నీవున్!
విత్తేశునకును పద్మ మున్నటుల విమలముగా లక్ష్మియు మఱియున్
నీ దగ్గఱగా నిత్యము నుండును నిరవధిక శుభముల తోడన్! 18

ధనదుడు జేసెడి యా కార్యములను దగ నీవును జేయుదు వెపుడున్
అందులకే మాకును కుబేరుడవు చందముగా భావించెదమూ!
స్థావరములు జంగమములు నయినా సకల భూతముల యందు మఱిన్
సమానుండవును సాక్షిభూతుడవు! సకలము రక్షించెదవు మఱిన్! 19

రఘురామా! నీ దృష్టి యెల్లపుడు రమ్యముగా శత్రులయందున్
మిత్రులయందును సమముగ నుండును మేలిమి బంగరు గీత వలెన్!
సకలమైన వ్యవహారములందును సరసత విధి యనుసారముగా
ధర్మము జేతను నిత్యంబును మఱి దగ శాసనమును జేయుదువూ! 20

రామా! నీవును ఎవరియందు మఱి రయమున కోపింతువా వేగన్
మృత్యువు పరుగులు దీయుచు వచ్చును మోక్షమునందును నతడు మఱిన్
మహా విక్రమము గలిగిన నీవును మానుగ యముడనుచును మదిలో
భావించుచు మది పలుకును నోటను ప్రబలమైన భీతిని నతడున్! 21

నృపసత్తమ! ఓ రాజా వినుమా! నిర్మలమగు నా వచనములన్,
నీ యందున మఱి మానుష భావము నిండియున్నదో పూర్ణముగన్,
క్రూరత్వము మఱి లేకపోవుటను కూడియుండు సహజత్వమునన్
సర్వప్రాణులను నోర్పుతోని మఱి సహనముతో గాంచుచు నుండున్! 22

నాథుడు లేనీ దుర్బలునకు ధర నాథుడు రాజే నిక్కముగన్
అనాథులను మఱి యాదరించునూ యలరుచు తానే కర్తగనూ!
నేత్రంబులు మఱి లేని వానికిని నేత్రము నీవే రఘురామా!
గతియు లేని వానికిని నీవు గతి! గమనము జూపెడి వాడవునూ! 23

నీవు మాకు గూడను రక్షకుడవు! నిర్మల ధార్మికుడా వినుమా!
నా విన్నపమును నాలకింపుమా! న్యాయము బరిశీలింపు మఱిన్!
ఈ గృధ్రము మఱి నా యాలయమును నింపుగ ప్రవిష్టమును జేసీ,
బాధింపుచు నున్నది దేవా! మఱి బన్నుగ రక్షింపుము వేగన్,
మానవులందున రక్షించెడి యా మహిమాన్వితుడవు నీవు కదా! 24

ఇది విని రాముడు మంత్రులనందఱ నింపుగ స్వయముగ బిలిపించెన్!
దృష్టి, జయంతుడు, విజయుడు మఱియును సిద్ధార్థుండును నశోకుడున్,
రాష్ట్ర వర్ధనుడు, ధర్మ పాలుడును రమ్య బుద్ధిగల సుమంత్రుడున్!
వీరందఱునూ దశరథునికి మఱి విమల స్వరూపుడు రామునకున్
మంత్రులుగా నుండిరి యందఱునూ తంత్రము నడిపిరి రాజ్యమునన్!

ఈ మహాత్ము లందఱు గూడను మఱి నింపుగ నీతియు గలవారున్,
సకల శాస్త్రముల యందు నిపుణులును సరసత సిగ్గును గలవారున్,
సత్కుల మందున బుట్టిన వారును సభ్యత, నీతియు గలవారున్!
ఆలోచనలందున బండితులును నఖిలము దెలిసినవారు మఱిన్! 25, 26, 27

ధర్మాత్ముండగు రఘూత్తముండును దగ సచివులను బిలిచి మఱిన్
పుష్పకంబునుండియు నాతడు దిగి పొలుపుగ వివరముగా నడిగెన్!
గ్రద్ధ మఱియునూ గుడ్లగూబలయు రహి వివాదమును గూర్చి మఱిన్
ప్రశ్నించెను నా మంత్రుల నందఱ బన్నుగ వివరము లన్నియునూ! 28

ఓ గృధ్రమ! యీ నిలయంబును మఱి యొనరగ యెన్ని సువర్షములున్
నిర్మించుకునీ యెన్నాళ్లయినదొ నిశ్చయముగ మఱి యధార్ధమున్,
నీ కారణమును తెలియగజేయుము నలరి సత్యమును దెలుపుమికన్
అనుచు బలుక శ్రీరామచంద్రుడును నా గ్రద్ధయు నిటులను బలికెన్! 29, 30

శ్రీరామా! ఈ భూమి యంతయును స్థిరముగ నుద్భవమైనట్టి
మానవులను జేతను యేనాడును మధురముగా కప్పగ బడెనో
ఆ దినంబు లానాటి నుండియును నలరుచు నాదు నివాసముగా
భావించుచునుంటిని శ్రీరామా! ప్రబలమైన సాక్ష్యంబులతో! 31

ఆ సమయంబున గుడ్లగూబయును నలరుచు రామునితో ననియెన్,
ఓ రాజా! యీ పృధివి యంతయును నొనరగ పుష్పంబులచేతన్,
ఉపశోభితమో నాటినుండి మఱి యున్నతమగు నా గృహమిదియే!
రామచంద్రుడును ఆ మాటలు విని రయమున సభా సదుల తోడన్! 32

ఎచ్చట వృద్ధులు గనబడరో మఱి యచ్చట యది సభ కాదు సుమా!
ధర్మంబును మఱి బలుకని వారును దగ వృద్ధులునూ కాదు సుమా!
సత్యము నెచ్చట యుండదో యచట ధర్మంబని బలుకగ రాదూ!
కపటముతో గూడినది లోకమున కాదు సత్యమును లోకమునన్! 33

ఏ సభ్యులు మఱి తెలిసి యుండియును నింపుగ మాటాడకను మఱిన్
మౌనము తోడను జూచుచుందురో మాటాడక గూర్చుండెదరో!

చెప్పవలసినా మాట దెలుపకను జేరి యుందురో బహుగురిలో!
అట్టి వారలందఱు గూడను మఱి యబద్ధములు బలికెడి వారే! 34

కామము వలనను, క్రోధము వలనను గడు భయమందుచు కాని మఱిన్
తెలిపియుండియును ప్రశ్నలకును మఱి దీరుగ సమాధానములను మఱిన్
వివరములను మఱి విశద బఱచియును విప్పి దెలుపడో నతడు మఱిన్
వేయి వరుణపాశములను తనకును వేగ ధరించుచు నతడుండున్! 35

వత్సరమును నిండిన దగుచుండగ యొనరగ సహస్రపాశములన్
ఒక పాశంబును విడిచి పోవునూ వనరగ వత్సరమున కొకటిన్,
కావున సత్యము దెలిసిన వాడిల గడగి సత్యమును బలుకవలెన్
అసత్యమాడగ రాదు నెప్పుడును అందులోన సభలందుననూ! 36

దీనివి విని యా మంత్రులందఱును దీక్షను రామునితో ననిరీ,
మహామతే! శ్రీరామా వినుమా! మానుగ నాదు సువాక్యములన్,
ఈ ఉలూకమును మంచిదాని వలె యూహ కందుచున్నది నిజమున్
గృధ్రము అటులను గాక యున్నదీ క్రూరత కనిపించుచు నుండెన్! 37

మహారాజ! నీవే ప్రయాణమును, నీవే నిర్ణయమును జేయన్
రాజే పరమగతియు లోకమునకు రాజే మూలము ధరణికినీ,
రాజ ధర్మమును ప్రాచీనంబది రహి సర్వులకును మోదమదీ!
ఆమోదింపగ వలె జనులందఱు అట్టి రాజ ధర్మమును మఱిన్! 38

ఏ మానవులకు రాజు శిక్షకుడు నింపుగ నుండును వారు మఱిన్
దుర్గతి నొందరు వారు నెన్నటికి దురితము లొందరు పాపములన్,
యముని చేత విడువగబడు వారై యలరుచు పుణ్యాత్ములు నగుచున్
పురుషోత్తములును నగుచు వారలును పూర్ణ పురుషు లగుదురు వారున్! 39

మంత్రుల వచనములను విని రాముడు మానుగ వారలతో బలికెన్,
పురాతనంబగు గ్రంధములందును పూనిక దెలిపిన దంతయునూ,
వినిపించెద నే విశదముగాగను వివరముగా నంతయును మఱిన్
సావధానులై వినిదెరుగాతను! శాంతము, నాసక్తియు దొలుకన్! 40

చంద్ర సూర్య నక్షత్రంబులు మఱియును సాంద్ర పర్వతారణ్యములన్
కూడినట్టి యాకాశముతోడను కూరిమి స్థావర జంగమమ్ముల్
కుదురుగ నుండిన మూడు లోకములు కూరిమి సముద్రమందుననూ!
ఉదకంబులతో నిండిపోయెనూ యుర్వియు గనబడకుండగనూ!
అపుడు ప్రపంచము నొకటిగ నుండీ నలరుచు రెండవ మేరువుగా
నిదురబోవుచుండెను నిశ్చలముగ నిర్భరమగు గతిగూడికొనీ
పూర్వము భూమియు లక్ష్మిని గలిసీ పొలుపుగ విష్ణువు జఠరములో
ప్రవేశించి యుండెను నిశ్చలముగ ప్రకాశించుచుండెను నచటన్! 41, 42

మహాతేజమును గలిగినట్టి యా మానుగ సకలమునైనట్టీ
భూత స్వరూపుండైన విష్ణువును బొలుపుగ భూమిని గ్రహియించీ,
సలిలార్ణవమును బ్రవేశించి మఱి సరసత యనేక వర్ణములన్
సముదాయంబులబాటు విష్ణువును చక్కగ నిద్రించెను నందున్! 43

ఆ సమయంబున యా విష్ణువునూ యల నిద్రించుచు నుండగనూ
అటుబిమ్మట యా బ్రహ్మదేవుడును జఠరమునందున జేరి మఱిన్,
ఆ విష్ణువునూ నిరోధింపబడు నలరు జలప్రవాహముగాగన్,
మదిని దెలిసికొని మహాయోగియును మానుగ బ్రహ్మయు గ్రహియించీ
అల విష్ణువునూ బ్రవేశించెనూ యల జఠరమునందున వేగన్! 44

అల విష్ణువునకు నాభి యందునను నలరు స్వర్ణ పద్మము బుట్టెన్
దాని నుండియును మహా ప్రభువునగు దగ బ్రహ్మయు వెలుపలి కొచ్చెన్!
బ్రహ్మదేవుడును వెలుపలికొచ్చి యోగి యగుచు నాలోచించెన్!
చరాచరంబును సకల భూతములు సకలంబును దా సృజియించెన్! 45

మహా తపముగల బ్రహ్మ దేవుడును మానుగ భూమిని వాయువునూ
పర్వతంబులను వృక్షంబుల మఱి బన్నుగ సృజియింపగ దలచీ,
అంత లోపలను నండజ ప్రజలను నలరు మనుష్యుల సర్పములన్
జరాయుజములను, నండజములనూ సరసత నాతడు సృజియించెన్! 46

అచ్చట చెవిలో గులిమినుండియును నట బుట్టిరి మధుకైటభులున్
మహావీర్యమును ఘోరరూపమును మానుగ యెదిరింపగరానీ

ఖయిన దానవులు నా సమయంబున నల బ్రహ్మను గాంచియు వారున్
కోపావేశము నందిరి వారలు క్రోధమునందున మసిలిరటన్! 48, 48

అచ్చట వారును మహా వేగమున యా స్వయంభువుని మీదకునూ
పరుగెత్తిరి మతి వారిని గాంచియు బ్రహ్మయు వారిని గాంచి మతిన్,
వికృతముగ యఱచెను నాతండును విలయము వచ్చిన యట్టులుగా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 49

ఆ శబ్దముచేతను హరుండునూ, హరియును వచ్చిరి యచ్చటకున్
అటుబిమ్మటనూ మధు కైటభులును మౌనుగ చక్ర ప్రహారముచే
చంపగబడిరీ విష్ణువుచేతను పంపగబడి చక్రము జేతన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 50

సమస్తమైనా పృధివి యంతటను చయ్యన వారల మేధసుచే
ఆప్లావితమై పోయెనంతటను నలరి నిండిపోయెను నచటన్,
మఱల లోకముల భరించునట్టి మానుగ విష్ణువు జేత మతిన్
ఆ భూమియు శుభ్రము జేయగబడి యల పరిశోధింపగ బడియెన్! 51

పరిశుద్ధమునగు భూమినంతటిని బన్నుగ సమస్త వృక్షములన్
నిండెను విష్ణువు మేదిని యంతట నిరవధికముగా నోషధులన్!
సకల సస్యములుగూడ మొలచినవి సాధుమార్గమున వూదీవెల్!
ప్రకృతి యంతయును నవశోభలతో పరమాశ్చర్యముగను మారెన్! 52

మేదోగంథము జేత ధరణికిని మేదిని యను పేరొచ్చినదీ,
ఆ కారణమున గ్రద్ద గృహంబును కాదను మాటయు సత్యమిలన్!
గుడ్లగూబ గృహమనుటయు నిజమూ కూర్మి నాదు నభిప్రాయంబున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 53

ఆకారణమున పాపము జేసిన పర గృహమును హరియించిన యా
గ్రద్దయేగదా దండనీయమును కఠిన దోషి యాగ్రద్ద మతిన్
దుష్టబుద్ధిగల యా గ్రద్దయునూ దురితము జేయుచు నున్నదియున్
ఉలూకమును బీడించుచున్నదీ యురుతరమగు శక్తియు గదురన్! 54

ఇంతలోపలను నాకాశంబున వింత వాక్యమును వినబడియెన్!
అశరీరంబగు వాక్కు వినబడియె నందఱి కర్ణములకు నపుడున్!
తపోబలముచే బీడింపగబడు దగ బీడింపగ బడియున్నా
యీ గృధ్రంబును చంపబోకుమా! యీతని కథ దెలిపెద వినుమా! 55

నరేశ్వరా! యీతడు పూర్వంబున యరయ కాలగౌతము జేతన్
పీడితుడైనా ప్రజానాథుడును పేరు బ్రహ్మదత్తుండు మఱిన్
ఈతడు శూరుడు సత్యవ్రతుండును నింపుగ బరిశుద్ధుండు మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 56

ఒక బ్రాహ్మణుడును నితని గృహమునకు నింపుగ వచ్చియు నిటు లడిగెన్
రాజా! నాకును కొంచె మధికముగ నయముగ వర్ష శతంబులునూ
భోజనంబు మఱి కావలెననుచును మేదురమున నాతని గోరెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 57

నృపుడైనట్టి బ్రహ్మదత్తుడును నియమముగా నతనికి మఱిన్
మహాద్యుతియుగల నాతనికిని మఱి మానుగ స్వయముగ నర్ఘ్యంబున్!
పాద్యంబును భోజనము కొఱకునై పరిపరి విధముల నేర్పాటుల్
స్నేహపూర్వకము జేసెను నాతడు స్థిరముగ యాదర పూర్వకమున్! 58

మహాత్ముడగు నాతనికి యిచ్చినా మానుగ యాహారము నందున్
మత్స్యమాంసములు నుండె నంతటను మానుగ మునియును గోపించీ
దారుణమైనా శాపము నిచ్చెను దయదాక్షిణ్యంబులు లేకన్
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 59

'రాజా! నీవును గ్రద్దవు గమ్మా!' రయమున మునియు శపింపగనూ!
అపుడు రాజు మునితోడుత ననియెను నాలస్యము లేకుండగనూ!
'ఇటుల శపింపకు! శాసింపకుమా!' యల ధర్మంబులు దెలియుగదా!
మహా నియమములు గలవాడా! మఱి మానుగ నా యజ్ఞానమునన్
కలిగిన యపచారమును క్షమింపుము! గరుణ గలిగి నా యందుననూ!
మహాభాగ! ఓ దోష రహితుడా! మానుగ నీ శాపంబునకున్
అంతము జేయుము! నలరి కటాక్షము నింతయు లేకుండగను మఱిన్! 60

అది యజ్ఞానముజేత జేసినటు నలరి దెలిసికొని యా మునియున్
రాజుతోని మఱి యిటులను బలికెను రమ్యముగా మృదుమధురముగన్!
ఇక్ష్వాకుల వంశీయుడైన యా యింపగు రాజుల కులమందున్,
రాఘవుడనియెడి పేరు గలిగినా రఘురాముడు జన్మించునిలన్
మహాభాగుడును మహావీరుడును మఱి రాజీవ సులోచనుడున్,
అతడు స్పృశింపగ నీ శాపంబును నలరి తొలగిపోవును గాతన్! 61, 62

ఆ వాక్యంబును విని రామునిచే నలరి స్పృశింపగబడినట్టి
నరేంద్రుండు పృథ్వీపతియైనా నయముగ యా రాజును మఱియున్,
గృధ్రత్వంబును వదిలినవాడై కిలకిల నవ్వుచు నాతండున్
దివ్యగంధములతోని రాజిలుచు దీప్య మానముగ జెలగుచునూ
శ్రీరామునితో నిట్లు బలికెనూ చిత్తమునందున శోభిలుచున్!

ధర్మములను నెఱిగిన శ్రీరామా! దాక్షిణ్యముతో గూడినమన్
బాగు! బాగు! నీ యనుగ్రహంబున ప్రబలమైన శాపమునుండీ
ఘోరమైన యా నరకము నుండియు భారరహితుడను నే నగుచున్
విముక్తుడను నే నయితిని రామా! విమలమైన నీ స్పర్శలచే
నా శాపంబును నంతము జేయుచు నను కృతార్థునిగ జేసితివీ! 63, 64

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ప్రక్షిప్త సర్గలలో మూడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

అఱువదియవ సర్గము

(రాముని సభకు ఋషులు వచ్చుట, శ్రీరాముడు వారిని సత్కరించి
వారి యభీష్టమును పూరించుటకై ప్రతిజ్ఞచేయుట,
ఆ ఋషులు శ్రీరాముని ప్రశంసించుట)

రామలక్ష్మణులు నీ విధముగనూ రమ్యముగా నాసక్తిగనూ
మాటలాడుకొను చుండగ వారలు మఱి చల్లదనంబును గానిదియున్
బహు వేడిమినీ ప్రసాదించనిది బన్నుగ వసంత ఋతువునకున్
సంబంధించిన రాత్రి వచ్చినది సాధు మార్గమున బ్రకృతినీ! 1

అటు బిమ్మట మఱి తెల్లవారగను నల పూర్వాహ్ణిక కృత్యములున్,
సమస్తమును మఱి పూర్తిజేసికొని యా రఘురాముడు వేగముగన్,
పౌరుల కార్యములను జూచుటకై బరగ వినగ విన్నపములనూ
దర్మక గృహమును జేరెను రాముడు దగ శోధింపగ విషయములన్! 2

అపుడు సుమంత్రుడు వచ్చి వేగమున యా శ్రీరామునితో బలికెన్!
రఘురామా! ఓ రాజా వినుమా! రమ్యముగా నా వచనములన్,
మునులును వచ్చిరి కార్యార్థమునకు మోదముతో నీ కొఱకు మఱిన్
ద్వారము వద్దను నాపి వేయబడి దగ నిలబడి యుండిరి యచటన్! 3

మహారాజ! భార్గవుని, చ్యవనునీ మానుగ ముందఱ నుంచుకొనీ
వచ్చినట్టి యా మహర్షులందరు మచ్చిక నీ దర్శనమునకై
తొందరబడుచును ద్వారపాలురను దోరముగా సంబోధించీ
ప్రేరేపించుచు నుండిరి వారలు పేరిమి నిను దర్శించుటకై 4

నరశ్రేష్ఠా! యా యమునా తీరపు నయముగ నివాసు లగువారల్
ఆ ఋషులును సంతోషముతోడను నలరుచు కనబడుచుండి రిటన్!
దర్మవేత్తయగు రామచంద్రుడును దగ సుమంత్రునీ పలుకు వినీ
భార్గవుండు మొదలైన బ్రాహ్మణుల ప్రవేశపెట్టుము వేగముగన్!
అనుచు బలికె శ్రీ రామచంద్రుడును నా సుమంత్రు తోడను నపుడున్! 5

ద్వారపాలకుడు తలను వంచి మఱి తగిన రీతి వందనములతో
రాజాజ్ఞను మఱి యనుసరించియును రహి శక్యము గానటువంటీ
తేజస్సులుగల యట్టి మునులనూ దీరుగ ప్రవేశమును బెట్టెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 6

అపుడు తమదు తేజస్సుల తోడను నలరు బ్రకాశించుచు నున్నా
మహాత్ములైనా వందమందియును మానుగ మునీశ్వరులును మఱియున్,
రాజభవనమున బ్రవేశించిరీ రమ్యాశీర్వాదంబులతో!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 7

ఆ బ్రాహ్మణులును నలంకరించిన యలరు పూర్ణ కలశంబులతో
సకల తీర్థముల యుదకంబును మఱి చయ్యన గ్రహియించియు వారున్,
ఆ రామునకును నధికమైన యా యల ఫల మూలంబుల గూడన్
గ్రహించి తెచ్చిరి కానుకలనుగా కమ్మని తీయని తేనియలన్! 8

మహాబాహువులు గల శ్రీరాముడు మానుగ ప్రీతిని గలవాడై
సమస్తమైనా తీర్థోదకముల సకలానేక ఫలంబులనూ
అన్నియు గూడను ప్రీతి పూర్వకము నలరి గ్రహించియు నిటులనియెన్!
ఇవిగో! యున్నత యాసనంబులును, ఇవిగో శ్రేష్ఠంబులు మఱియున్
యోగ్యతానుసారముగా మీరలు యోగ్యముగా నాశీనులునై
నను ధన్యునిగా జేయుడు మీరలు నయముగ ప్రీతిని జూపి మఱిన్! 9,10

ఆ శ్రీరాముని మాటలు వినుచును నలరి మహాఋషు లందఱునూ!
అందమైన బంగారు వికారము బంగరు దీవెల యల్లికతో!
అలంకరింపగ బడినయట్టి యా యలరెడి బ్రుస్సుల మీద మఱిన్
ఆసీనులునై మును లందఱునూ యలరుచు బలికిరి దీవెనలన్! 11

పరపురంజయుడు రాఘవు డంతట బన్నుగ యచ్చట గూర్చొనినా
మునులందఱనూ గాంచి నమ్రతను మోదమునను నంజలి తోడన్!
ఈ విధముగనూ బలికెను రాముడు నింపుగ మధురాక్షరములతో!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 12

మీరలు వచ్చిన కార్య మెయ్యదియొ మేదుర భావముతో దెలిపీ
నను ధన్యునిగా జేయుడు మీరలు నాదు భాగ్యమని దలచెదనూ!

సావధాన చిత్తముతో జేసెద సర్వకార్యములు వినయమునన్
నిస్సంకోచము నాజ్ఞాపింపుడు మీరలు కోరిన కార్యములన్! 13

ఇదిగో! నా సర్వస్వ రాజ్యమును, ఇదిగో! హృదయమునందున్నా
జీవితంబు మఱి సర్వము గూడను స్థిరముగ నాదు సుసంపదలున్!
ద్విజుల కొఱకు నని దెలుపుచుంటినీ ద్వివిధములగు బలుకులు లేవూ!
సత్యముగా నే దెలుపుచుంటినీ, సర్వదేవతల దలచుచునూ! 14

ఆ శ్రీరాముని పలుకులు వినుచును నా యమునా తీరమునందున్
నివాసులైనా యుగ్రతపసుగల నిశ్చల బుద్ధియు గలవారల్,
'బాగు బాగు!' అని ప్రశంసించిరీ దివ్యాత్ముండగు రాఘవునీ,
ఆ మహాత్ములును సంతోషముతో నలరుచు బలికిరి యీ విధమున్! 15, 16

రఘుకులనందన! శ్రీరామా విను! రమ్యమైన మా వచనములన్
ఇట్లు బలుకుటయు నీ లోకములో నింపుగ నీకే తగును సుమా!
మఱి యెవ్వరికిని వలను కాదు సుమ! మానుగ బలశాలురు రాజుల్
ఎందఱెందరో యుండెడి వారలు చందముగా నీ వసుంధరన్
అడుగబోవు కార్యంబ దెంతటిదొ యాలోచించిన మీదటనే
ప్రతిజ్ఞ జేసెడి వారు ధాత్రినీ, బన్నుగ స్థిరతను గూడికొనీ, 17

నీవు మాత్రమును వచ్చిన కార్యము నిశ్చయముగ తెలియక ముందే
విప్రుల మీదను, మునుల మీదనూ మిగుల గౌరవము జేత మఱిన్
ముందుగనే మఱి ప్రతిన జేసితివి! మోదముతో నందఱిముందున్
అందువలన రామా! నీ రీతిని బొందుగ జేయగ గలుగుదుమా?
మహా భయమునుండియు రక్షింపుము మానుగ ఋషిమునులను మమ్మున్! 18

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
అఱువదియవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

అఱువది యొకటవ సర్గము

(మునులు రామునకు మధువు సంపాదించిన వరమును, లవణాసురుని బలమును, అతడు జేయుచున్న ఉపద్రవమును గూర్చి జెప్పి, అతని వలన తమకు గలిగిన భయమును దొలగింపుమని శ్రీరాముని వేడుకొనుట)

ఇటుల బలికెడి ఋషుల వాక్యముల నింపుగ శ్రీరాముడు వినుచున్,
వారలతోడను నిటులను బలికెను రమ్యముగా రాఘవు డపుడున్,
మునులారా! మీరే పనిమీదను మోదముగా వచ్చిరి యిటకున్?
మీ భయంబులును దొలగు గావుతను! మీకును కుశలంబగుగాతన్! 1

రాముడటుల మఱి బలుకుచుండగను రయమున భార్గవు డిటుల మఱిన్
భయకారణమును దెలిపెను నిటులను భాసురమగు విషయమును మఱిన్,
నరేశ్వరా! శ్రీ రఘురామా! విను! నయముగ నాదు సువచవములన్!
భయకారణమది యేమో వినుమా! భవ్యముగను దేశంబునకున్! 2

రాజా! పూర్వము కృతయుగమందున రహి సుమహామతి దైత్యుండున్,
జ్యేష్ఠుండును మఱి లోలాపుత్రుడు నిష్ఠుడు రాక్షసులకు మఱియున్!
మధువు అనియెడి పేరుగలిగినా మహాసురుడునూ గలిగె భువిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

బ్రాహ్మణ పూజకుడాతండును మఱి బన్నుగ రక్షకు డాతండున్,
బుద్ధితోని పరివిష్ఠితమైనా భూరి బలుడు నాతడు నుండెన్,
ఆతనికిని పరమోదారులు నగు నలరు దేవతలతో గూడన్
సాటిలేని ప్రీతియునుండెను మఱి సాటిలేని మైత్రియు నుండెన్! 4

ఆ మధువును బహు వీర్యవంతుడును నలరు ధర్మమున బ్రీతియునూ,
ధర్మమునందున సుసమాహితుడును సద్గుణములు గలవాడు మఱిన్
రుద్రుడు గౌరవభావముతోడను రూఢిగ యతనికి వరమిచ్చెన్
ఆశ్చర్యము గలిగించునదియునూ యద్భుతమైనది యావరమున్! 5

మహాత్ముఁడగు నా రుద్రదేవుడును మానుగ శూలము నుండి మఱిన్
మహా విక్రమము గలిగినదియు మఱి మహాకాంతి గలిగినదియునూ!
శూలంబును మఱి పైకి లాగియును సుప్రీతిని యాతని కిచ్చెన్
మధువుతోని యా రుద్రుడు బలికెను మానుగ బ్రీతియు బొంగారన్ 6

నీ చేతను మఱి మత్ప్రసాదకర నిర్మలమగు ధర్మంబు మఱిన్
ఆచరింపబడినది నీ చేతను నానందించితి నేను హృదిన్!
మహా ప్రీతినీ గూడిన నేనును మానుగ యుత్తమమైనట్టీ
ఆయుధమును నే నిచ్చుచు నుంటిని యతులమైన దీ యాయుధమున్! 7

మహాసురా! నీ వెంత వఱకునూ మానుగ దేవతలందు మఱిన్
బ్రాహ్మణ సంఘమునందు గూడనూ బన్నుగ ద్వేషము వహింపవో,
అంతవఱకు నీ యాయుధంబునూ చెంతనుండు చైతన్యమునన్
అటులకానిచో నీ యాయుధమును నదృశ్యమై పోవును నిజమున్! 8

ఎవడు నిర్భయుండై రణమందును నెదిరింపగ నిను వచ్చెడినో
వానిని యీ శూలంబు మఱియునూ వనరగ భస్మము జేసి మఱిన్,
నీ హస్తములోనికి జేరును మఱి నిర్ద్వందముగా శూలంబున్,
సురల జోలికిని విప్రులజోలికి సురుచిరముగ బోరాదెపుడున్! 9

రుద్రుని నుండీ వరమును బొందీ మహాసురుడు మహాదేవునికిన్
అంజలి ఘటించి నమస్కరించియు నాతనికిని బహు విధములుగా
ఇటుల బలికె యా మహాదేవునితో చటుల భావ పరివేష్టితమున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 10

భగవంతుడ! ఓ విశ్వేశ్వర విను! బన్నుగ నాదు సువచనములన్,
ఈ శూలము మఱి నా వంశమునకు నింపుగ మఱి యెల్లపుడు మఱిన్,
చెందినదై మఱియుండును గావుత! నందముగా రాజిల్లుచునూ!
నీవు దేవతల ప్రభువుగదా మఱి నిర్మలముగ యీ వరమిమ్మా! 11

సర్వప్రాణులకు నధిపతియైనా సదాశివుడు మహాదేవుండున్
ఇటుల బలికెడీ మధువును గూరిచి చటుల భావమున నిటులనియెన్!
ఇది జరుగదు మఱి యిటుల జరుగదూ! యింపుగ నీవును బలికి నట్టుల్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 12

మత్ప్రసాద కృత శుభకరవాణియు మానుగ వ్యర్థము గాకుండన్,
ఆకారణమున యీ శూలము మఱి యలరును నీదు కుమారునకున్
ఒక్కని దగ్గఱ మాత్రము నుండును చెక్కు చెదరకను నెల్లపుడున్!
తక్కిన వారికి దూరము నుండును జిక్కక హస్తము లందుననూ! 13

ఈ శూలంబును యెంతవఱకు మఱి వింపుగ నీదు సుహస్తమునన్
అలరి యుండునో యంతవఱకునూ యాతని పుడమిని యెవ్వరునూ!
చంపగ జాలరు చలింపజేయరు వంపగజాలరు రణమందున్!
విమలతతో సురలను సేవింపుము! వినుతి సేయవలె నీశ్వరునీ! 14

అసురుల యందున శ్రేష్ఠుండైనా యలరి మధువు నీ విధముగనూ
ఆ మహాదేవుని నుండి వరంబును నద్భుతమైనది పొంది మఱిన్!
మహాకాంతి గల భవనంబును మఱి మానుగ నిర్మింపగ జేసెన్
పాలరాళ్లతో నిర్మించెను మఱి బంగరు బొమ్మల శిల్పములున్! 15

విశ్వావసునకు అనల యందునను విమలముగా జనియించిన యా
మహాకాంతిగల కుంభీనసియను మానుగ లక్షణ యుక్తయునూ,
మహాభాగ్యవతి యగు నా కన్యక మధువు వరించిన సుపత్నియున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

ఆ కుంభీనసికిని జనియించెను నలరు విక్రమము గలవాడున్,
భయంకరంబగు రూపముగలిగిన బన్నుగ లవణుండను బేరన్!
పుత్రుడు పుట్టెను బాల్యమునుండియు బొలుపుగ దుష్టుం డాతండున్!
పాపకార్యములు జేయుచు నుండెను బరగ నిరంతరమును వాడున్! 17

వినయ విహీనుండైన పుత్రునీ నింపుగ గాంచియు మధువు మఱిన్
కోపము దుఃఖము రెండును గలిగెను క్రోధము గలిగెను యాతనిపై
కానీ యాతడు వాని నేమియును నారాటము మఱి బెట్టకనూ
మౌనముతో నతడూరకుండెనూ మాటాడక మౌనికి వోలెన్! 18

ఆ మధువును మఱి తన శూలంబును నా లవణునకును నర్పించీ
దానిని గూర్చిన వరమును గూడను దగ వానికినీ దెలిపి మఱిన్
ఈ లోకంబును విడిచి మధువునూ యింపుగ పుత్రునికిని మఱియున్
బుద్ధులు జెప్పీ వరుణ లోకమును బోయెను కామము విడిచి మఱిన్! 19

ఆ లవణుండును శూలము యొక్కయు నలరు ప్రభావము జేత మఱిన్
సహజముగా నాతడు దుష్టుడునై సరిదూగుచు నుండుట చేతన్
లోకములను బీడించుచు నుండెను లోలత్వమునను గూడికొనీ!
మునులను బీడించుచు నున్నాడూ! మూర్ఖుండును యజ్ఞానుండై! 20

రఘురామా! విను యా లవణుండును నలరు ప్రభావం బిట్టిదియున్
తథా విధానము శూలంబును మఱి దగు విధమున యోజించి మఱిన్,
ఈ విషయంబున తుది నిర్ణయమును నింపుగ నీ పైనను గలదూ!
నీవే మాకును దిక్కుగదా మఱి నిండు దయను మము జూడుమికన్! 21

వీరుడ వగు ఓ రామా! వినుమా! విపులమైన భయ పీడితులన్
మునులు ఋషులునూ పూర్వమునందున మోదముగను బహు జనుల మఱిన్
రాజుల వద్దకు బోయి వారలను రమ్యముగా యభయంబు మఱిన్
యోచన జేసిరిగానీ రామా! రమ్యముగా నా రక్షకుడున్!
ఆదరించి మము బ్రోవలేదు మఱి యడ్డు బడగనూ లేదు మఱిన్! 22

తండ్రీ నీవును సైన్యము తోడను దగ వాహనముల గూడికొనీ
ఆ రావణునీ సంహరించి నటు అలరి మేము విన్నారమునూ!
ఈ భూలోకమునందు రక్షకుడు నింపుగ మఱి యొక్కండు మఱిన్
ఎవ్వండును మఱి కానబడరుగా నింపుగ రక్షింపగ మమ్మున్! 23

రామా! భయమును గూర్చి కారణము బన్నుగ నీకును దెలిపితిమీ
ఈ భయంబునూ నివారించుటకు నింపుగ నీవు సమర్థుడవున్!
మహా విక్రమము గలవాడా! విను! మానుగ మా కోరిక దీర్చి
రక్షింపుము మఱి యార్తి బాపుమా! రమ్య శాంతి నెలకొలుపు మిలన్! 24

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
అఱువది యొకటవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

అఱువది రెండవ సర్గము

(లవణాసురుని ఆహారాదుల విషయమున శ్రీరాముడు మునులను ప్రశ్నించుట
వానిని చంపుటకై శత్రుఘ్నుని యుత్సాహమును దెలిసికొని
ఆతనిని యా కార్యమునకై నాజ్ఞాపించుట)

ఆ శ్రీరాముడు ఋషుల మాట విని నలరుచు నమస్కరించుచునూ
ఆ లవణాసురుడును భూమిపై యలరుచు నెట్టి సుభోజనముల్
జేయుచు నుండును? ఏ విధముగనూ శీఘ్రముగను వర్తించుచునూ,
నుండుననుచు ప్రశ్నించెను రాముడు ఖండితముగ యాతని గూర్చి! 1

రాముని మాటలు విని ఋషులందఱు రమ్యముగా నా లవణుడునూ
ఎట్లభివృద్ధిని జెందెనో మఱియు నే విధముగ యభివృద్ధి మఱిన్
గాంచెనొ నంతయు విశదబఱచిరీ కొంచెము కొంచెము నంతయునూ
అతని ప్రవృత్తియు, యతని భోజనము యాతని యభిరుచులను మఱియున్! 2

సర్వసత్త్వములు గూడను నాతని సహజాహారము రాక్షసుకున్,
విశేషించి తాపసులు మునులునూ విమలమైన యాహారంబున్,
నిత్యంబును క్రూరముగనుండుటయె నిశ్చిత యాహారంబు మఱిన్,
మధువనంబులో నతని నివాసము మఱి నిద్రను బోవుచు నుండున్! 3

బహు సహస్రాణి సింహములు వ్యాఘ్రములు బన్నుగ లేళ్లను, బక్షులనూ
మనుష్యులను జంపియు నిత్యంబును మానుగ భోజనమును జేయున్,
హద్దులు లే వాతని యాకలికిని పద్దులు లేవాతనికి మఱిన్!
పగలు భోజనము జేయుచునుండును బలు విధముల మాంసంబులనూ! 4

ప్రళయమునందున నోరు దెఱచుకొను బన్నుగ మృత్యువు వలె నుండున్,
వచ్చినట్టి యా సర్వజంతువుల మచ్చిక నోటను బడవేయున్
మహాబలముగల యా లవణుండును మానుగ రాత్రుల 'యందు' మఱిన్
ఇతర జంతువుల దినుచుండును మఱి యిష్ట మొచ్చినటు వెదుకుచునూ! 5

రామచంద్రుడును నా మాటలు విని మానుగ యా మునులను గూర్చి
యోదార్చురు బలికెను నాతండును యోరిమితో మునులను ఋషులన్,
ఆ రాక్షసునీ జంపించెద నే నలరి మీరు భయమును వీడీ,
'శాంతముగా నుండుడు' యని పలికెను సరసత సుధీర వచనములన్! 6

రఘునందనుడగు శ్రీ రాఘవుడును దయమున మహోగ్ర తేజసులున్
అట్టిమునుల ముందఱ ప్రతిజ్ఞనూ నిట్టె జేసె వెనువెంట మఱిన్
అచ్చటనే యున్నట్టి సోదరుల మచ్చికతో నీ విధముగనూ!
మధురముగా నీ రీతిని బలికెను మాననీయంబగు స్వనముననూ! 7

ఏ వీరుడు మఱి చంపగ గలుగును? నింపుగ యా లవణాసురునీ
ఎవని యంశగా జేయగవలెనూ నింపుగ మా యందఱిలోనన్
మహావీరుడగు భరతుని యంశగ మానుగ నర్పింపగ వలెనా?
ధీమంతుడు శత్రుఘ్నునంశగా దీరుగ నర్పింపగ వలెనా? 8

రాముని జేతను నటుల బలుకబడి రమ్యముగా నా భరతుండున్
ఈ విధముగ భరతునితో బలికెను నింపుగ వినయముతోని మఱిన్
'లవణాసురునీ నేను వధించెద' రమ్యముగా నీ దినముననూ
నా భాగముగా జేయుము వానిని నయముగ వధియించెద నిపుడున్! 9

భరతుడు బలికిన శౌర్య ధైర్యముల బన్నుగ పలికిన వచనములన్
విని శత్రుఘ్నుడు గూరుచున్న యా విమలాసనమును లేచి మఱిన్
నిలబడి యంతట చేతులెత్తుచును నిండు సత్తువను జూపుచునూ!
శ్రీరామునితో బలికె నిట్టులను చిత్తము హర్షము బులకింపన్! 10

అటుబిమ్మట యా శత్రుఘ్నుండును నలరి నమస్కృతులను జేసీ
ఈ విధముగ బలికెను రామునితో నింపుగ మధుర సువచనములన్!
మహాబాహు! ఓ రఘురామా! విను! మానుగ యా భరతుండు మఱిన్!
నింతకు ముందుగ జేసినాడుగద! నింపొందగ ఘన కార్యంబున్! 11

ఇంతకు పూర్వము నీవులేని యా చెంతనుండి యా యయోధ్యనూ
నీ రాకను మఱి ఎదురు చూచుచును నిర్మల మతిని దపించుచునూ!
రక్షించెను గద! యా భరతుండును రమ్య సుదక్షత తోని మఱిన్
ప్రతినిధిగా నీ పాదుకలకునూ బన్నుగ రాజ్యము బాలించెన్! 12

పార్థివ! రాఘవ! మన భరతుండును బన్నుగ యనేక దుఃఖములన్
నీవు లేని సమయంబున నిచ్చట నిరవధికముగా వేదనలన్!
అనుభవించెనూ యంతియ గాకను నల నందీ గ్రామమునందున్
ఫలములు, దుంపలు, కాయలు దినుచును బహు భంగుల కష్టములందెన్
జటలను ధరించి నార చీరలను కఠినములగు శయ్యల మీదన్
నిదురించెను మఱి యిట్టి దుఃఖముల మది చింతింపక భరియించెన్

పంపదగిన వాడను నేనుండగ కంపము నొందగ కైక సుతున్,
క్లేశము నందగ బంప నేల మఱి క్లేశమునందగ నేనుండన్! 13, 14

శత్రుఘ్నుని యా మాటలు వినియును శౌరియైన రఘురాముడునూ
మధుర వచనముల నీ విధి బలికెను మాధుర్యము బొంగారగనూ!
శత్రుఘ్నా! యట్లే యగు గాతను! శాత్రవ సంహారమునందున్,
నిను నియమించెద! నా యాజ్ఞను మఱి నిర్వర్తింపుమే దగి నటులన్! 15

మంగళకరమగు మధువు నగరమున శృంగారముగను మఱి నిన్నున్
రాజ్యమునందున యభిషేకించెద రయమున బొమ్మా! యచ్చటికిన్,
భరతుని శ్రమబెట్టగ దలపనిచో సరగున యచటికి నేగి మఱిన్,
రాజ్యంబును మఱి సర్వ విద్యలును సురుచిరముగ నేర్చితి వీవున్
రాజ్యమేర్పఱచుటను గూడను మఱి రహి సమర్థుడవు శత్రుఘ్నా! 17

యమునా నదితో గూడిన నగరము నలరెడి మంగళకరమైనా
జనపదముల నిర్మింపుము వేగము సహజములును సుందరములునూ
ఒక్క రాజ వంశమును బోమరిచి చక్కగ యా స్థానము నందున్
మఱి యొకరిని నిర్మింపని వాడును మానుగ నరకమునకు బోవున్! 18

నీవు నాదు మాటల మన్నించీ నిశ్చయముగ నున్నట్లయినన్,
దుష్టబుద్ధిగల మదువు పుత్రునీ దూరము జేయుము రణమందున్!
ఆ లవణుని సంహారము జేసీ యంచితముగ నా రాజ్యంబున్
అనుసరించి ధర్మంబును నీవును నలరుచు బాలింపుము ధరణిన్! 19

శూరుడ! ఓ శత్రుఘ్నుడ వినుమా! సురుచిరముగ నా వచనములన్
అడ్డు మాటలను తెలుపబోకుమా! నాలస్యము జేయకు మింకన్!
జ్యేష్ఠుని మాటను నాలకింప వలె శ్రీకరముగ మఱి కనిష్ఠుడున్,
ఆ విషయంబున సంశయంబు మఱి యల సందేహంబును లేదూ! 20

శత్రుఘ్నా! నే సంకల్పించిన చిరతరమగు శుభకర్మంబున్
వసిష్ఠాది బ్రాహ్మణులు సంతులును వనరగ యథా ప్రకారముగా!
మత పూర్వకముగ విధి విధానముగ మానుగ సంకల్పంచినదీ!
అభిషేకంబును బొందుము వేగము నా లవణుని వధియించి మఱిన్! 21

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
అఱువది రెండవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

అఱువది మూడవ సర్గము

(శ్రీరాముడు శత్రుఘ్నుని మధు రాజ్యమునకు అభిషిక్తుని జేసి లవణుని శూలమునుండి ఆత్మసంరక్షణ జేసికొను ఉపాయము దెలుపుట)

మహా పరాక్రమ సంపన్నుండును మానుగ శత్రుఘ్నుండు మఱిన్
రాముని చేతను నటుల బలుకబడి రహి యాతడు సిగ్గును బొందీ,
మెల్ల మెల్లగా బలికె నట్టులను నల్లన శిరమును వంచుచునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

మహారాజ! శ్రీ రఘురామా! విను! మానుగ యీ విషయమును మఱిన్,
అధర్మమని నే మది భావించుచు! అంగీకృతమును జేయకనూ!
అడ్డు దెలుపుచుంటిని రఘురామా! యల జ్యేష్ఠులు ధరనుండగనూ!
చిన్న వాని కభిషేకము జరుగును? శీఘ్రము రాజరికంబునకున్? 2

పురుషశ్రేష్ఠా! శ్రీ రఘురామా! పాలుపుగ నీ యాజ్ఞలను మఱిన్
తప్పక నే పాటింపగవలయును విప్పక ముడులను విశదముగా!
మహాభాగ! నీ శాసనంబునూ మానుగ కనిష్టుడనునైనా
పాటింపగ వలయును గద రామా! పరమ పురుష నీ యానతులన్! 3

మహావీర! ఓ రఘుకులేశ్వరా! మానుగ వినియున్నాడను నే
శ్రుతులనుండి మఱి నే వినియుంటిని సురుచిరముగ యా వచనములన్
భరతుడు లవణుని జంపెద ననుచును లావుగ బలుకుచు నున్నపుడున్
నే బలుకుట యది యుక్తముగాదూ! నిందనీయ మది బరికింపన్! 4

రణమునందునను లవణాసురునీ రయమున వధియించెద ననుచున్
ఘోరమైన దుర్వచనంబును మఱి దుష్టవాక్యమును బలికితినీ
అట్టి చెడ్డమాటకు ఫలితముగా యిట్టి దుర్గతియు వచ్చినదీ
అన్న కంటె మఱి తమ్ముడు ముందుగ చెన్నుగ యభిషిక్తుండగుటన్
అట్టి పాపమును జేయగవలసిన యలరెడి దుస్థితి గలిగె మఱిన్! 5

పెద్దవాడు మాటాడిన తదుపరి చిన్నవాడు వ్యతిరేకించీ
అధర్మ సహితము పరలోకమునూ నలరు నట్టిదియు కానిదియున్,

ఎదురు జెప్పగా గూడదుగద మఱి యెదిరింపగనూ రాదుగదా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 6

భరతుని మాటకు నెదురు జెప్పి మఱి బన్నుగ మాటాడుట చేతన్!
ఇట్టి శిక్షయును లభించినది మఱి యిట్టి శాస్తి జరిగినది మఱిన్,
అందుచేత మఱిలను నీకును నిక మానుగ నెదురును జెప్పి మఱిన్
మఱి యొక శిక్షకు బాత్రుండును నే మానుగ గాకుందును గాతన్! 7

పురుషశ్రేష్ఠుడ! రామా! వినుమా! పూనికతో నా వచనములన్,
నేను నీకు నిచ్చానుసారమును నిక్కముగను జేసెద నెపుడున్!
నా నిమిత్తమై యధర్మమును మఱి నయముగ దొలగింపుము రామా!
చిన్న వాడనయి నేనుండియు మఱి జెలగి రాజ్యమునకును మఱియున్,
అభిషిక్తుండను నగుట యధర్మము నది నాకును నంటకయుండన్
జేయుము నదియే నా కోరిక సుమ! జెలగి నిన్ను బ్రార్థింతు మఱిన్! 8

శూరుండును మఱి మహాత్ముడైనా సురుచిరముగ శత్రుఘ్నుని యా
వచనములను విని శ్రీ రాఘవుడును వాలాయముగను ముదమందీ
భరతుని తోడను లక్ష్మణుతోడను భవ్య భావమున వారలతో
మధురోక్తులతో నీ విధి బలికెను మధురాక్షరములు వెలువడగన్! 9

సావధాన చిత్తులునై మీరలు సంభారంబులు తేతెండీ!
అభిషేకంబును జేసెద నిప్పుడు నల శత్రుఘ్నునకును మఱియున్
బంగరు కలశంబులతో జలకము రంగుగ గొనితెండీ యిపుడున్!
పురోహితుని యా వసిష్ఠ దేవుని పూనికతో కబురంపి మఱిన్! 10

భరతకుమారా! బ్రాహ్మణులను మఱి బన్నుగ యా యా సంఘములన్,
ప్రముఖులనూ మఱి ఋత్విక్కులనూ బన్నుగ నందఱ గూడ మఱిన్
నా యాజ్ఞను మఱి తెలియజేసియును నయముగ రండీ వేగముగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 11

మహారథులు మఱి రాజశాసనము నయముగ దెలిసియు శీఘ్రముగన్
పురోహితుని మఱి ముందు నుంచుకొని పొలుపుగ యా విధమున వారున్.
అభిషేకమునకు సమస్తమైనా యల యేర్పాటులు జేసిరటన్!
రాజులు మఱియును రహి బ్రాహ్మణులును రాజభవనమును జొచ్చి మఱిన్

అటుబిమ్మట యా మహాత్ముడైనా యల శత్రుఘ్నునకును మఱియున్,
అభిషేకంబును మహోన్నతముగా నలరి జరిగె బహు ముచ్చటగన్! 12, 13

శ్రీమంతుండగు శత్రుఘ్నుండును శ్రీరామునకును పురమునకున్
ఆనందంబును గలిగించుచునూ మఱి హర్షంబును గలిగించుచునూ
దేవేంద్రుడు మఱి సురలచేతనూ దీప్తిని యభిషిక్తుడు నైనా
స్కందుని వలె బహు యానందంబు గలిగించుచు సూర్యునికి వలెన్
ప్రకాశించెనూ యా శత్రుఘ్నుడు ప్రవిమల కాంతులు జిందగనూ! 14

అక్లిష్ట కర్మణుడైన రాఘవుడు నలరుచు నా శత్రుఘ్నుని యపుడున్,
అభిషేకింపగ పౌరులందఱును నలరుచు విద్యావంతులునూ
బ్రాహ్మణులందఱు సంతోషించిరి భవ్య భావమున పౌరులునూ
వివిధ వృత్తులకు జెందినవారలు విమలమతులు శిల్పులు, కవులున్! 15

రాజమాతలగు కౌసల్యయు మఱి రమ్య సుమిత్రా కైకేయీ!
రాజభవనమున యున్న యట్టి యా రాజ యోషితలు నందఱునూ!
మంగళంబులను జేసిరి యతనికి మానుగ శుభముల దీవెనలన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

యమునాతీరమునందు వసించెడి యా మహాత్ములును ఋషులు మఱిన్
శత్రుఘ్నుని మఱి యభిషేకించీ శాత్రవుడగు నా లవణుండున్,
చంపబడిన వానినిగా దలచిరి వంపబడిన వానిని వోలెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 17

అటుబిమ్మట యా రామచంద్రుడును నభిషిక్తుండగు శత్రుఘ్నున్
నొడియందున గూర్చుండబెట్టుకొని యొనరగ యాతని తేజస్సున్!
పెంచుచు మఱియును ప్రీతితోడుతను ప్రియవచనంబును బలికె నిటుల్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 18

రఘునందన! ఓ సౌమ్యుడ! వినుమా! రహి రమ్యంబైనది మఱియున్
శత్రుపురములను ధ్వంసము జేసెడి శాత్రవ సంహారంబు మఱిన్!
అట్టి శరంబును నిచ్చుచుంటినీ యమోఘమైనది గైకొనుమా!
దీనితోని యా లవణాసురునీ నిక్కముగా జంపగ గలవూ! 19

శత్రుఘ్నా! విను! తాను స్వయముగా సహజముగా నా విష్ణువునూ
సముద్రమున నిద్రించుచుండెనో సహజముగా నా సమయమునన్!
ఈ శరంబు సృజియింపబడినదీ యింపుగ ప్రళయ భయంకరమున్!
సురాసురులు దీనిని గనలేదూ! సరుచిరముగ రూపమును మఱిన్! 20

ఓ వీరా! ఆ కారణంబుచే నీ శరమును నే ప్రాణికినీ
కనిపింపదు మఱి కనుల జూచినను కలయ జూచినను దిక్కులనూ
క్రోధావిష్ణుండైన విష్ణువును కూరిమి దురాత్ములును నైనా
మధు కైటభులను జంపుటకును మఱి మానుగ రాక్షసు లందఱినీ
నశింపజేయుటకును నీ శరమును రమ్యముగా సృజియించె మఱిన్! 21

మూడు లోకముల సృజింప దలచిన మోదముగా నా విష్ణువునూ
ఈ బాణముచే వారిద్దఱునూ యింపుగ జంపగ బడి రటనూ!
శ్రీ విష్ణువునూ మధుకైటభులను శ్రేష్ఠమైన బాణము జేతన్
సంహరించి ప్రాణుల భోగమునకు సర్వలోకముల సృజియించెన్ 22, 23

శత్రుఘ్నా! అలనాడు రాఘవుని చంపగ దలచిన నేను మఱిన్
పూర్వము చాలా మంది ప్రాణులకు బొలుపుగ నాశము గలుగుననీ
భయముచేత యీ బాణంబును మఱి బరగ ప్రయోగింపగలేదూ!
వర్తమానమున యా శరంబు మఱి వదలగ యవసర మిపుడొచ్చెన్! 24

మహాత్ముడైనా మహేశ్వరుండును మానుగ శత్రుల జంపుటకై
ఆ మధువునకును నుత్తమమైనా యాయుధంబుగను నిచ్చిన యా
శూలంబును మఱి యా లవణుండును నూటిగ మాటికి మాటికినీ!
పూజలు మఱియును చేయుచునుండును బులకిత గాత్రుండై యెపుడున్,
ఆ శూలంబును నింట నుంచి మఱి నలరుచు నుత్తమమైనట్టి
ఆహారము సంపాదించుటకై యన్ని దిశల బోవుచునుండున్! 25, 26

ఆ రణమునకును నెవ్వడైననూ యలరి వచ్చి పిలిచిన యపుడున్
ఆ లవణుండును శూలంబును మఱి యలరి గ్రహించియు శీఘ్రముగన్
వానిని భస్మము జేయుచునుండును వల్ల కాటికిని బంపు మఱిన్
ఆ మహాదేవుని వరప్రసాదము నలరియుండు శక్తిని గలిగీ! 27

పురుష శ్రేష్ఠుడ శత్రుఘ్నా విను! పూనికతో నా వచనములన్
నీ వాయుధములు ధరించి పూర్వము నిండుగ యుండుము ద్వారమునన్
ఆయుధములు లేనట్టి లవణుడును నలరి పురములో జొచ్చుటకున్,
అంతకు పూర్వము నాతని కొఱకై అలరి ద్వారమున నిలిచి మఱిన్! 28

పురుషశ్రేష్ఠుడ! మహాబాహు! విను! పూనికతో నా వచనములన్!
అతడు భవనమున బ్రవేశించుటకు నలరి ముందుగానే నీవున్,
అతనిని బిలువుము రణరంగమునకు నాలసింపకను శీఘ్రముగన్,
అపుడు వానినీ వధింపగలవు! యలరి నీదు నాయుధములతో! 29

మహావీరుడా! మఱియొక విధమున మానుగజేసిన యట్లయినన్
జంపశక్యమును గాని వాడగును వంపశక్యమును గాడు మఱిన్!
నేను జెప్పినటు జేసినచో మఱి నిశ్చయముగ మరణించు సుమా!
శూలంబును మఱి లేకుండగనూ సూటిగ జంపగవలయు సుమా! 30

నీకు విషయమును నంతయు దెలిపితి నిశ్చయముగ లవణుని వంపన్,
శూలంబును మఱి పరిహరింపగను సూటిగ బలికితి శత్రుఘ్నా!
శ్రీమంతుండగు నా పరమేశ్వరు చిత్తము వరప్రసాదంబున్
దాటశక్యమును గాదు గదా మఱి దరి జేరుటయు నశక్యంబున్! 31

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
అఱువది మూడవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

అఱువది నాల్గవ సర్గము

(రాముని యాజ్ఞచేత శత్రుఘ్నుడు ముందుగా సైన్యమును బంపి, ఒక మాసము తరువాత, మధుపురమునకు ప్రయాణమై పోవుట)

రఘునందనడగు రామచంద్రుడును రయమున శత్రుఘ్నుని గూర్చి
పలికి, మాటి మాటికిని ప్రశంసను బరగ మఱల జేసియు నతడున్
మఱియొక వాక్యము బలికె నాతడును మానుగ శత్రుఘ్నుని తోడన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

పురుష శ్రేష్ఠుడ! శత్రుఘ్నా విను! పూనికతో నా వచనములన్
ఇవిగో నాలుగువేల గుఱ్ఱములు! ఇవిగో! వేల రథంబులునూ,
ఇవిగో వీరుడ! వంద యేనుగులు ఇవిగో! నీకు సహాయముగా
వచ్చుచు నున్నవి నీతోగూడను వనరగ సైన్యముతోని మఱిన్! 2

అమ్మగ జూపిన యనేకంబులగు నలరి ప్రకాశించుచు నున్నా
ఆపణంబులను వీధుల మధ్యను నలరు నటుల మఱి వర్తకులున్,
శత్రుఘ్నుని మఱి యనుసరించెదరు శాత్రువులను భంజింపగనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

పురుషశ్రేష్ఠుడ! శత్రుఘ్నా విను! పొలుపుగ సరిపడునంత మఱిన్!
ధనముతోని వాహనముల తోడను దగ ప్రయాణమై నీవు మఱిన్,
బంగరు నాణెంబులు బదిలక్షలు బరగ దీసికొని వెళ్లు మికన్!
ఏమి కావలయునో యవి యన్నియు నింపుగ గొనిపొమ్మా! యనికిన్! 4

పురుషశ్రేష్ఠుడ! శత్రుఘ్నా విను! పూనికతో నా వచనములన్
వీరుండవు! నీ సైన్యంబును మఱి విమలముగా పోషించుమనూ!
ఉత్సాహముతో సంతోషముతో సురుతరముగ యుండెడి రీతిన్!
జేయుచుండుమా! మంచి మాటలను శ్రీకరముగ రంజించునటుల్! 5

సంతోషింపగ జేసినట్టి యా సైనికాదులును రణమందున్
ఎట్టి యాపదల సమయములందున నిట్టె నిలిచెదరా యండగనూ!

అట్టి సమయముల్లయందున ధనములు నిట్టె భార్యలును, బంధువులున్
నిలిచియుండరూ యుద్ధములందున నిండు ధైర్యమున ధీరతనూ! 6

అందువలన యుత్సాహవంతులగు నిండుగ భటులను గూడిన యా
మహాసైన్యమును నడుపుచు నీవును మానుగ నొక్కడవే ధనుసున్
హస్తమునందున ధరించి నీవును నలరి బొమ్మ మధు వనమునకున్
నిండు దనముతో బయనింపుము మఱి నీడను ద్రొక్కక యుండునటుల్! 7

మధువు పుత్రుడగు లవణునకును మఱి మానుగ నీవును రణమునకున్
వచ్చుచున్నటుల తెలియకుండునటు మచ్చికతో బయనించునటుల్
వానికి శంకయు గలుగకుండునటు వనరగ ధైర్యము తోని మఱిన్
నిర్భయంబుగా ప్రయాణింపుమా! నిండు కుండవలె ధీరతనూ! 8

పురుష శ్రేష్ఠుడ! యా లవణునకును పొలుపుగ శంకయు లేకుండన్,
బోయి యాతనిని యడ్డగించియును బొలుపుగ రణమును జేయుటయే
మఱియొక యుపాయమును లేదు సుమా! మానుగ వానిని జంపుటకున్.
అటులగాక యాతని దృష్టిని బడి యాలసించినను వేగముగన్
వానిని యాతడు జంపివేయునూ యలరుచు శూలముతో నతడున్! 9

సౌమ్యుడ! ఓ శత్రుఘ్నా వినుమా! సౌమ్యమునగు నా వచనములన్,
గ్రీష్మము గడిచిన దగుచుండగనూ వర్షాకాలమును వచ్చె మఱిన్
లవణాసురునీ జంపుము వేగము నవలంబితమగు శౌర్యమునన్!
ఆ దుర్మతినీ జంపుటకును మఱి యలరి తగిన కాలంబిదియే! 10

నీ సైన్యంబును గ్రీష్మము కొంచెము నిలిచియున్నదనగా నపుడున్
గంగాజలమును దాటు రీతిగా రంగుగ ఋషి మునులను మఱియున్,
ముందునుంచుకొని బోదువు గాతను చందముగా నటకును మఱియున్,
ఆ లవణుడు మఱి యెచటనుండునో యలరుచు బరిశీలించుచునూ! 11

సైన్యమునంతను నదీతీరమున చక్కగ నిలుపుచు నీవు మఱిన్,
సావధాన చిత్తుడవై వేగము ధనువు ధరించియు వేగముగన్,
ముందుగ బయనింపుము ఓ వీరా! కందకు మదిలో భీతిలుచున్
శక్తియుక్తులను వధింపు మాతని రక్తిని నీ యాయుధమునమా! 12

శ్రీరామునిచే నటుల బలుకబడి శ్రీకరముగ శత్రుఘ్నుడునూ
మహాబలముగల సేనానుల మఱి మానుగ బిలిపించియు మఱిన్
వారల తోడను నిట్లని బలికెను రమ్యముగా యోజించుచునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 13

ఎచ్చెటెచట నివసింపగ వలెనో ఎచ్చటెచట విడుదులును మఱిన్
ఆ ప్రదేశములు నిర్ణయింపబడి యలరి యున్నదీ మీకు మఱిన్!
అదిగో! యచటను నెవ్వరికిని మఱి యలరి బాధలును లేకుండన్!
పరస్పరంబును విరోధమును మఱి బన్నుగ లేకండగను మఱిన్!
వసింపవలెనూ మీరందఱునూ వాలాయముగా మిత్రులుగన్! 14

అల శత్రుఘ్నుడు నా విధముగనూ యా సేనాధ్యక్షులకు మఱిన్
ఆనతి నిచ్చీ మహాసైన్యమును నలరి బయలుదేరగ దీసీ,
తల్లులైన యా కౌసల్యకు మఱి దగ సుమిత్ర కైకాదులకున్
అంజలి ఘటించి నమస్కరించెను నలరి దీవెనల నంది మఱిన్! 15

పరిశుద్ధంబగు మనస్సు గలిగిన బన్నుగ శత్రుఘ్నుండు మఱిన్,
శ్రీరామునకును ప్రదక్షిణంబును శిరసుతోని మఱి నమస్కృతుల్!
లక్ష్మణునికిని యా భరతునకును మఱి లాలితముగ వందనములునూ,
పురోహితుండగు వసిష్ఠునకునూ బూనిక వందనమును జేసెన్! 16

మహాబలముగల శత్రు తాపనుడు మానుగ శత్రుఘ్నుండు మఱిన్
శ్రీరామునిచే ననుమతింపబడి చిత్తము హర్షము బొంగారన్!
అటు బిమ్మట యా శ్రీరామునకును నలరి ప్రదక్షణమును జేసీ
బయలుదేరెనూ శత్రుఘ్నుడు మఱి బన్నుగ వీడ్కోలును దెలిపీ! 17

అటుబిమ్మట యా రఘునందనుడును నల శత్రుఘ్నుండును మఱియున్
కుంజరములతో నశ్వంబులతో గూడినట్టి యా సైన్యమునూ!
ముందుగ బంపీ యనుచరు లందఱు ముదముగ సేవించుచునుండన్!
రాజగు రాముని దగ్గఱనుండీ రహి పయనించెను వినయముగన్! 18

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
అఱువది నాల్గవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

అఱువది యైదవ సర్గము

(వాల్మీకి శత్రుఘ్నునకు సౌదాసుడైన కల్మాష పాదుని కథను జెప్పుట)

శత్రుఘ్నుడు తన సైన్యమునంతయు నాత్రత లేకుండగను మఱిన్
బయలుదేరగా దీసి మార్గమున బన్నుగ ఒక మాసము దానిన్!
అనుసరించి యుండిన వాడగుచును నటు పిమ్మటనూ దాను కడున్!
శీఘ్రము ముందునకును బయనించెను చిత్తము హర్షము బొంగారన్! 1

రాఘవ నందనుడైన యాతడును రయమున మార్గము మధ్యమునన్
రెండు దినములట గడిపి శత్రుఘ్నుడు మెండుగ నుత్తమ నివాసమున్!
పవిత్రమైనా వాల్మీక్యాశ్రమ పరిధిలోనికిని పయనించెన్!
తన జీవితమును ధన్యమైనదని దగ భావించెను నాతండున్! 2

మహాత్ముడును మఱి ముని సత్తముడును మానుగ వాల్మీకులకు మఱిన్
ప్రదక్షిణంబును జేసి యాతడును బరగ నమస్కృతులను జేసీ
చేయబడిన దోసిలి గలవాడగుచును శ్రీకరముగ నిటులను బలకెన్
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

భగవంతుడ! ఓ పూజ్యుడ వినుమా! బన్నుగ నాదు సువచనములన్!
అన్నగారి పనిమీద వచ్చితిని! అలరి నేడు నిచ్చటకు మఱిన్!
వసియింపగ మఱి గోరుచుంటినీ యొనరగ ప్రాతఃకాలమునన్!
భయంకరంబగు పశ్చిమ దిక్కును బరగ బోయెదను సైన్యముతో! 4
మునిపుంగవుడగు వాల్మీకియునూ మోదముననను శత్రుఘ్నుని యా
వచనంబును విని మహాత్ముడైనా వాల్మీకుల వా రిటులనిరీ!
మహాయశా! విను! నా వచనములను మానుగ స్వాగతమును నీకున్
హృదయపూర్వకముగా నీకును నిదె సదయ స్వాగతము! శత్రుఘ్నా! 5

సౌమ్యుడ! ఓ శత్రుఘ్నా వినుమా! సరసత యీ యాశ్రమము మఱిన్!
రఘు వంశమునకు సాశ్రమంబు సుమ! రమ్యముగా నా చేత మఱిన్!
ఆసనంబు, పాద్యంబును మఱియును నలరుచు నర్ఘ్యంబులను మఱిన్
నిస్సందేహము స్వీకరింపుమా! నీ కిదె నే నిచ్చుచు నుంటిన్! 6

ఆ సమయంబున శత్రుఘ్నుండును నలరి పూజ గ్రహియించి మఱిన్!
ఫలమూలంబుల రూపమైన యా బన్నుగ భోజనమును జేసెన్
పరమానందము బొందెను నాతడు బన్నుగ వాల్మీకుల చేతన్
ఆ విధముగ యాతిథ్యము నందీ యా ముని ఋషుల సమీపమునన్! 7

ఆ శత్రుఘ్నుడు ఫలమూలములను అలరి భుజించియు మహర్షినీ
ఈ విధముగ ప్రశ్నించెను నాతడు నింపుగ ప్రశ్నాపూర్వముగన్!
మీ యాశ్రమము సమీపమునందును నింపుగ యజ్ఞ విభూతియునూ!
ఎవ్వరి దనుచును ప్రశ్నించెను మఱి నింపుగ వాల్మీకుల వారిన్! 8

శత్రుఘ్నుని యా భాషితమును విని చయ్యన వాల్మీకుల వారున్
మందమందముగ యాలోచించియు సుందరముగ నీ విధి బలికెన్!
శత్రుఘ్నా! యిది పూర్వకాలమున చయ్యన యెవరి నివాసముగా
నుండెనో మఱియు నంతయు దెలిపెద దండిగ విశదముగా నీకున్! 9

మదాసు డనియెడి మీ పూర్వీకుడగు సురుచిరమగు నామముతోడన్
నరేంద్రుడుండెను యీ ప్రదేశమున నయముగ రాజ్యంబును జేసెన్!
అతని కుమారుడు మిత్రసహుండను నాతడు మిక్కిలి బలీయుడున్,
మహాపరాక్రమశాలి యతండును మానుగ బహుళ సుధార్మికుడున్! 10

ఆ సుదాసునీ పుత్రుడునైనా అట్టి మిత్రసహుండును నైనా
బాల్యము నుండియు వేటాడుటకను బరగ బోవుచుండెను నతడున్!
శూరుడైన యా మిత్రసహుండును సురుచిరముగ యధికంబుగనూ!
సంచరించు రాక్షసుల నిరువురను యంచితముగ జూచెను వనిలో! 11

శార్దూలంబుల రూపము గలిగిన సహింపరానీ క్రూరులునూ!
వేలకొలది మృగముల భక్షించుచు వికటముగను తృప్తియు లేకన్!
అసంతుష్టులును వారలు మిగులను నలరి చాలు! నను మాటయునూ!
లేకను యా రాక్షసు లిద్దఱునూ లీలగ భుజియించుచు వారున్! 12

ఆ రాక్షసులిద్దఱును యడవిలో నలరి నిర్మృగము జేయుటయున్
గాంచియు నా సౌదాసుడు వేగము ఘన క్రోధావిష్టుండగుచున్
ఆ సౌదాసుడు మహా బాణమున యులరుచు నొక రాక్షసుని మఱిన్,
సంహరించెనూ నేలపై బడగ చయ్యన ప్రాణములును వదలన్! 13

పురుషశ్రేష్ఠుడగు నా సౌదాసుడు పొలుపుగ యొక రాక్షసు జంపీ,
బాధలేని వాడగుచును మఱియును బన్నుగ కోపము విడిచి మఱిన్,
చనిపోయిన యా రాక్షసు గాంచెను సహనముతో కోపము లేకన్,
అయినను నా రెండవ రాక్షసుడును నలరి క్రోధమును జెంది మఱిన్! 14

ఆ రాక్షసుడును సహాయుడైనా అల తన మిత్రుని గాంచుచునూ!
నున్న యట్టి యా మిత్ర సహుని మఱి యురుతరముగ గాంచుచు నతడున్,
మనస్సునందున విచారించుచును మానుగ పండ్లను గొఱుకుచునూ!
సౌదాసునితో నిటులను బలికెను సాహస వచనములను వేగన్! 15

పాపిష్టుడ! ఓ పరమ నీచుడా! బన్నుగ నాదు సహాయకుడున్,
అపరాధంబును లేని వానినీ యలరి జంపితివి వ్యర్థముగన్,
ఆ కారణమున నీకు నేను వే యలరి ప్రతి క్రియ జేసెదనూ!
పగ సాధింపగ వలయుగదా మఱి బన్నుగ దుర్బలుడైన మఱిన్! 16

ఆ రాక్షసుడును నటుల బలకి వే యచ్చో యంతర్ధానంబున్
జెందెను నట కనిపింపగ లేదూ! కందువ మాటాడగలేదూ!
కాలక్రమమున మిత్రసహుండును కదిలి రాజ్యమున రాజయ్యెన్
పరిపాలించుచు నుండె నతడును భవ్యముగా నా యయోధ్యకున్! 17

ఆ రాజును నీ యాశ్రమ సమీపమందున సుందర స్థలముననూ
యజ్ఞము జేసెను వైభవంబుగను నలరు నశ్వమేధంబు మఱిన్,
బ్రాహ్మణులందఱు వచ్చిరి యటకును భవ్యముగా గోష్ఠులు జరుపన్,
ఆ యజ్ఞంబును వశిష్ఠ దేవుడు బన్నుగ పరిపాలించె మఱిన్ 18

ఆ ప్రదేశమున యా యజ్ఞంబును ననేక వర్షంబుల బాటున్,
మహా వైభవంబున జరిగెను నట మానుగ బహు దానంబులతో!
సమృద్ధమైనా యా యజ్ఞంబును సరసత శోభల గూడికొనీ,
దేవ యజ్ఞమును బోలె నుండెనూ దివిజులు వచ్చిన యట్లుండెను! 19

అటుబిమ్మట యా యజ్ఞము నందున అవసానమునందునను మఱిన్
ఆ రాక్షసుడును పూర్వవైరమును నలరుచు స్మరించుచును నతడున్!
ఆ వసిష్ఠునీ రూపంబును మఱి యలరి ధరించుచు శీఘ్రముగన్
రాజుతోని మరి బలికె నిటులను రమ్యమైన వచనంబులతో. 20

నేడు యజ్ఞమును బూర్తియైనదీ నిర్మలినంబుగ నంతయునూ!
నాకు శీఘ్రముగ మాంసము దోడుత నయముగ భోజనమును దెమ్మా!
ఈ విషయంబున యాలోచనయును నింపుగ యోచింపగ రాదూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 21

బ్రాహ్మణ రూపములో నుండిన యా ప్రబల రాక్షసుని బలుకు వినీ
పృథివీ పతియును వంటలందునను బేరుపొందినా చతురులనూ,
వారితోని నీ విధముగ బలికెను వనరగ మధుర సుభాషణనూ
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 22

హవిస్సునను నుపయోగబడునదీ యలరు మాంసమును గూడినదీ,
అట్టి భోజనము స్వాదురూపమున యలరునట్లుగా జేసి మఱిన్,
మన గురువెటులను సంతసించునో మానుగ యటులను జేసి మఱిన్,
తయారుజేసిగొని రారండీ! దగ యాతడు సంతసమందన్! 23

రాజు మాట విని వంటవాడునూ రయమున నాశ్చర్యమునందీ
మహాత్ముండునగు నా వసిష్ఠుడును మాంసాహారము దినుటయునా?
అనుచు మనసునను వంటవాడునూ యలరుచు సంభ్రమమును బొందెన్!
అపుడా రాక్షసుడును శీఘ్రముగా నలరుచు సూదునిగా మారెన్! 24

మధురంబుగనూ, హవిస్సుగానూ మానుగ యుపయోగించునదీ
మాంస యుక్తమగు అన్నం బిదిగో! మానుగ కొనిరాబడె నిటకున్
అని యాతండును నా రాక్షసుడును నల పార్థివునకు శీఘ్రముగన్
మనుష్య మాంసములను మఱి జూపెను మానుగ యా రాజునకు మఱిన్! 25

శత్రుఘ్నా! యా రాజు భార్యయగు అల దమయంతిని గలిసి మఱిన్
వెడలి రాక్షసుడు దెచ్చినట్టి యా వికట మాంసమును గూడిన యా
భోజనంబునూ సహృదయముతో బొలుపుగ వసిష్ఠునకు నిచ్చెన్
రాక్షస మాయలు నెవరికి దెలియును రహి పరిశీలించిన గూడన్! 26

ఆ వసిష్ఠుడును బోజనంబుతో నలరెడి మనుష్య మాంసంబున్
నున్నట్లును మఱి తెలిసికొనియునూ యుసురుసురున బహు కోపమునన్!
క్రోధముతోడను గూడినవాడై కుదురుగ బలుకుట మొదలిడెనూ
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 27

రాజా! నీవును నే కారణమున నీ దృశ భోజనమును నాకున్
నిచ్చుటకును మఱి గోరుచుంటివో నింపుగ యా కారణముననూ
ఏతత్ భోజనమును నీకును మఱి నింపుగ గాగల దింక సుమా!
సందేహంబును లేదుగదా మఱి సరసత్వంబును లేదు మఱిన్! 28

అల సౌదాసుడు క్రోధముతోడను నలరుచు కోపించినవాడై
హస్తముతోడను జలమును గైకొని యల వసిష్ఠునీ శపింపగన్!
పూనుకొనెను మఱి యింతటి లోపల బొలుపుగ యాతని భార్యయునూ!
ఆతనిని మఱి నివారించెనూ యలరి శాపమును నీకుండన్! 29

రాజా! భగవంతులకు, పూజ్యుడును బొలుపుగ ఋషియు వసిష్ఠుండున్
ఏ కారణమున ప్రభువో మనకును నింపుగ దైవ సమానుండున్,
పురోహితుని మఱి శపింపదలచుట బొలుపుగ సమర్థుడవు గావు!
పురోహితుడు మఱి దైవ సమానుడు బొలుపుగ పరమేశ్వరు డతడున్! 30

అటు బిమ్మట యా ధర్మాత్ముండును నా రాజును క్రోధము తోడన్!
నిండిన తేజో బలములతోడను నుండిన యా జలములను మఱిన్,
క్రిందికి విడిచియు తన పాదములను సాంద్రముగా తడిపెను నంతన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 31

ఆ సమయంబున నట్లు జేయుటను నా రాజునకును పాదములున్
నల్లని రూపంబును బొందినవీ నయముగ శిలలకు వలె మఱియున్,
ఆ సౌదాస మహారాజును మఱి యలరి కల్మషా పాదునిగన్!
ఆ రాజును మఱి ప్రసిద్ధి పొందెను నట్టి నామమున తోని మఱిన్! 32

ఆ రాజును మఱి యతని భార్యయును అల వశిష్ఠునకు పథేపదే?
నమస్కరించియు వసిష్ఠ రూపము నయముగ ధరియించిన యట్టి,
రాక్షసుండు తెలిపిన మాటలనూ రయమున దెలిపిరి యాతనికిన్!
అతని మోసమును బయలు బఱచిరీ యా రాజును మఱి భార్యయునూ! 33

రాజేంద్రుని యా వాక్యంబులు విని రహి యా రాక్షసు జేత మఱిన్
వికృతముగ జేయగబడినట్టి విలసిత కార్యములను దెలిసీ
ఆ వసిష్ఠుడును రాజేంద్రునిచే నలరి బలికె నీ విధముగనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 34

రోషముతో గూడిన మనస్సుతో రూఢిగ బలికిన మాటలనూ
మఱియొక విధమును జేయరాదుగా మానుగ శక్యంబును గాదూ!
కానీ, నీకొక వరమునిచ్చెదను కమనీయముగను రూపొందన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 35

రాజేంద్రా! పంద్రెండు వర్షములు రయమున గడిచిన తరువాతన్
శాపాంతము జరుగును నీకును మఱి సరసత యనుగ్రహము జేతన్!
ఆ కాలంబున గడిచిన దానిని యలరి స్మరింపవు తరువాతన్!
అభక్ష్య భక్షణ మున్నగు వానిని నలరి స్మరణ ఉండదు నీకున్! 36

అరి సూదనుడగు నా రాజప్పుడు నా విధముగ తన శాపంబున్
అనుభవించి మఱలను రాజ్యంబును నలరి పొందె యాతడు మఱలన్
పరిపాలించెను ప్రజల నందఱిని బన్నుగ సంతానము వోలెన్,
ఇక్ష్వాకులకును వన్నె దెచ్చెనూ యిన వంశమునకు కీర్తియునూ! 37

శత్రుఘ్నా! నీవును యడిగిన యా సరసత యాశ్రమ స్థానంబున్
కల్మాష పాదుడును జేసినట్టి యా కర్మభూమి కడు పవిత్రమున్,
యైన భూమి యిది గమనింపుము మఱి యాగభూమి యని దలపు మదిన్!
నాటి చిహ్నములు నేటికి గలవూ! నయముగ యజ్ఞ సువాటికయున్! 38

రాజేంద్రుని యా సుదారుణంబగు రమ్యముగా నా కథను వినీ
మహర్షికిని మఱి యభివందనములు మానుగ జేసియు బిమ్మటనూ!
శత్రుఘ్నుండును నాశ్చర్యంబును సరసత యద్భుతముల నందీ
పర్ణశాలలో ప్రవేశించెనూ బన్నుగ రాత్రిని నిదురింపన్! 39

శ్రీరామ కథాసుధాలహరి యందు - ఉత్తరకాండలో
అఱువది యైదవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

అఱువది యాఱవ సర్గము

(సీతాదేవి ఇద్దఱు పుత్రులను గనుట, వాల్మీకి శిశువులకు రక్షణము నేర్పఱచుట,
ఈ విషయమును విని శత్రుఘ్నుడు సంతోషించి, అచ్చటి నుండి బయలుదేరి
యమునా తటమునకు బోవుట)

శత్రుఘ్నుండును నే రాత్రిని మఱి సరసత వాల్మీక్యాశ్రమమున్,
ప్రవేశించెనో యా రాత్రిని మఱి బన్నుగ సీతాదేవి మఱిన్,
దారకద్వయమును బ్రసవించినదీ దగ మున్యాశ్రమ మందు మఱిన్!
కావుకావుమని యేడువ సాగిరి కలికి జానకీ యొడియందున్! 1

అటుబిమ్మట యా యర్ధరాత్రినీ యా సమయంబున యందువనూ
మునిదారకులును వేగముతోడను మోదమునను శుభకరమైనా,
జనకుని సుతయగు సీతాదేవీ సరగున ప్రసవించుటయు మఱిన్,
ప్రియమగు వార్తను దెలియజెప్పిరీ ప్రీతిని యా వాల్మీకులకు మఱిన్! 2

భగవంతుడు! ఓ పూజ్య పాదుడా! బన్నుగ రాముని దేవియునూ!
దారకద్వయమును బ్రసవించినదీ బన్నుగ యీరాత్రిని మఱియున్,
ఆ కారణమున భూత వినాశిని భూరి రక్షణను జేయుమికన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

ఆ మహర్షియగు నల వాల్మీకులు నలరి వారి వచనంబులకున్
సంతోషించుచు విని యా వెంటనె సరసత యా బాలకుల గనన్
బాలచంద్రునీ వంటి కాంతిగల బరగ దేవ పుత్రుల సముల్గున్,
అట్టి బాలకుల జూడగ వచ్చెను నిట్టె దీవెనల నందింపన్! 4

సంతోషించిన మనస్సుతోడను చక్కగ నచటికి బోయి మఱిన్
ఆ బాలకులను దర్శించెను మఱి యానందించెను దన మదిలో!
భూతంబులు, రాక్షసులు నశింపగ భూరి మంత్రముల జదువుచునూ,
రక్షను జేసెను నా వాల్మీకులును రమ్యముగా పసిపాపలకున్! 5

ఆ సమయంబున యా వాల్మీకులును నలరుచు కుశముష్టిని మఱియున్
లవమును గ్రహించి శిశువు లిద్దఱికి యాటుపోటులను లేకుండన్

భూతంబుల నశియింప జేసెడీ భూరి రక్షణను జెసి మఱిన్
అభిమంత్రించెను భవ్యాక్షరముల యలరి శరీరము దుడుచుచునూ 6

వారి లోపలను ముందుగ బుట్టిన వానికి మంత్రంబుల చేతన్
సంస్కరించినా కుశలతోని మఱి సంమార్జనమును జేయవలెన్
అందుచేత యాతని పేరును మఱి చందముగా కుశుడును నయ్యెన్
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 7

వారిలోపలను రెండవ వానిని వనర సావధానము తోడన్
యుండునటుల జేయుచును నట్టి యెడ నుండగ వృద్ధ స్త్రీలు మఱిన్,
లవము జేత వానిని దుడువగవలె లవుడను పేరును వానికగున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 8

ఈ విధముగ యీ కవల లిద్దఱును నింపుగ నే బెట్టిన పేర్లన్
కుశ లవు లనియెడి పేరులతోడను కీర్తినందుదురు లోకమునన్!
అనుచు బలికె యా వాల్మీకులునూ యలరి గాంచి యా బాలకులన్,
మహరాజ పుత్రులు జన్మించిరి మానుగ పర్ణ కుటీరమునన్! 9

పుణ్యవతులునగు వృద్ధ స్త్రీలును పుణ్యాత్ముడు ముని హస్తమునన్,
గ్రహించి శ్రద్ధా పూర్వకంబుగా కనులకద్దుకొని మఱి దానిన్!
ఆ శిశువులకును రక్ష జేసిరీ యలరుచు మంత్రోదకములనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 10

మునిపత్నులునగు పుణ్యస్త్రీలును మోదముగా 'రక్ష'ను జేసీ,
వారలపుడు తమ గోత్రంబును మఱి వనరగ రాముని పేరు మఱిన్!
జెప్పుకొనుటయును సీతాదేవియు శ్రీకరముగ యా శిశువులనూ
జననమొంద జేయుట శత్రుఘ్నుడు సరిగ పర్ణశాలను నుండీ
వారి వారి పలుకులనుండియు మఱి వరుసగ విని యా వచనములన్,
అటు మీదట యా శత్రుఘ్నుండును అలరిపోయి శాలకును మఱిన్
'తల్లీ! భాగ్యవశంబున నీవును దగ యుంటివి సుఖముగ ధరణిన్! 11,12

ఆ సమయంబున సంతోషించిన యలరు మహాత్ముండైనట్టీ
యా శత్రుఘ్నుని వీరునకును మఱి అల వర్షాకాలంబునకున్

సంబంధించిన రాత్రి యంతయును సరసత త్వరితము త్వరితముగన్
గడిచిపోయినది సంధ్యలు మొలిచెను కాంతి రేఖలును నుదయించెన్! 13

మహావీర్యుడగు శత్రుఘ్నుండును మానుగ ప్రాతఃకాలమునన్
పూర్వాహ్ణమునకు సంబంధించిన పొలుపగు క్రియలను జేసికొనీ
అంజలితోడుత మునీశ్వరునకును నలరి నమస్కృతులను జేసీ,
అనుమతింప జేసియు వాల్మీకుల యలరుచు పశ్చిమ ముఖుండునై
బయలుదేరెనూ యా శత్రుఘ్నుడు ప్రవిమల తేజము బొంగారన్! 14

శత్రుఘ్నుండును మార్గమునందున మానుగ సప్త దినంబులునూ
ప్రయాణంబు సాగించె నతండును బన్నుగ యమునా తీరంబున్,
జేరి యచ్చటను బుణ్యకీర్తిగల శీఘ్రముగా బయనించి మతిన్
మున్యాశ్రమముల యందు నివాసము బొలుపుగ జేసెను నాతండున్! 15

మహాయశముగల శత్రుఘ్నుండును మానుగ చ్యవనుడు మొదలైనా
మహామునులతో దగు విధములునగు మానుగ సంభాషణ జరిపీ
వారి వారి యాశ్రమము లందునను వరుసగ నివసించెను నచటన్!
వివిధ విషయములు, వృత్తాంతంబులు విమల కథలు దెలియుచు నచటన్! 16

మహాత్ముడగు నా రాజకుమారుడు మానుగ శత్రుఘ్నుండు నటన్
కలిసియున్న యా కాంచనాదిముని విలసిత సంభాషణల మతిన్
జేయుచు వారల యాశ్రమమందున శ్రీకరముగ రాత్రిని గడిపెన్
ఎన్నో కథలను వృత్తాంతంబుల జెన్నుగ శత్రుఘ్నుడు వినియెన్! 17

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
అఱువది యాఱవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

అఱువది యేడవ సర్గము

(చ్యవనుడు శత్రుఘ్నునకు లవణాసురుని శూలమునకు గల శక్తిని దెలుపుట,
పూర్వము జరిగిన మాంధాత కథను గుఱించి తెలుపుట)

అటుబిమ్మటనూ నా రాత్రియునూ యలరి ప్రవృత్తంబగుచుండన్,
ఆ శత్రుఘ్నుడు భృగునందనుడును నల బ్రాహ్మణుడును నైనట్టి
అలచ్యవనుని బలమెట్లున్నదో యని బన్నుగ ప్రశ్నించెను నతనిన్,
ఎవరిని జంపెనో యెటుల జంపెనో నింపుగ ప్రశ్నించెను నతనిన్! 1

పూజ్యుడ! ఓ బ్రాహ్మణుడా! వినుమా! బొలుపుగ యాతని శూలంబున్
బలమది యెట్టిది? పూర్వకాలమున బన్నుగ యుద్ధమునందు మఱిన్,
ఎవరితోని మఱి దలపడె నీతడు బవరములో నోడించె మఱిన్,
ఎట్టి మహావీరులను శూలమున నిట్టె సంహరించెను జెపుమా? 2

మహాత్ముడైనా శత్రుఘ్నుని యా మానుగ వచనంబులను వినీ
మహా తేజమును గల చ్యవనుండును మానుగ శత్రుఘ్నుని గనుచున్,
లవణుని పరాక్రమమును గూర్చి మఱి మానుగ వర్ణించెను నిటులన్!
శూలము యొక్కయు ఘనతను గూర్చియు సురుచిరముగ వర్ణించె నహా! 3

రఘునందన శత్రుఘ్నా! వినుమా! రమ్యము లీతని కర్మములున్,
ఈతడు జేసిన కర్మలనేకము నింపుగ లెక్కింపగ లేమూ!
ఇక్ష్వాకుల వంశమునకు జెందిన నింపుగ జరిగిన విషయంబున్!
ఒక రాజుకు జరిగిన వృత్తాంతము రహి దెలిపెద విను నాసక్తిన్! 4

పూర్వకాలమున యయోధ్య యందున పొలుపుగ యువనాశ్వుని సుతుడున్
మహా విక్రముడు త్రైలోక్యంబుల మానుగ ప్రసిద్ధుడగు వాడున్,
వీర్యవంతుడును మాంధాతాయను విమలమైన నామము గలగూ!
రాజొకడు మఱి యుండెడి వాడును రమ్య తేజమును గలవాడున్! 5

పృథివీపతియగు నా నృపుండు మఱి పృథివి యంతయును జయించియున్,
తన స్వాధీనములోనికి దెచ్చెను దనకు శత్రువులు లేకుండన్!
ఇచటి నుండి యా దేవలోకమును నింపుగ జయించుటకు వేగన్
ప్రయత్నంబునూ జేసెను నాతడు ప్రబలమైన సాహసమునను! 6

మాంధాతయు మఱి దేవలోకమును మానుగ జయింపవలయుననీ
కోరికతోడను ప్రయత్నమాతడు కూరిమి ప్రారంభింపగనే,
సురాధిపతియగు నింద్రునికిని మఱి సురలను గూడను బహు విధమున్
తీవ్రమునైనా భయమును గలిగెను తీరుగ యాలోచించి మఱిన్! 7

దేవేంద్రునితో నర్థాసనమును దీరుగ రాజ్యమునను సగమున్
నిచ్చెద మనుచును సురగణంబులును నింపుగ ప్రార్థించిన గూడన్
ఆ మాంధాతయు వదలలేదు మఱి యలరుచు దనదు ప్రతినను మఱియున్
దేవలోకమును జయింతు ననుచును ధీరత త్యజియింపగ లేదూ! 8

పాకశాసనుడు నా మాంధాతా పాపయోచనను గమనించీ
పూర్వమువోలెను గమనించుచునూ బొలుపుగ ప్రార్థించుచును మఱిన్!
ఆ మాంధాతను గూర్చి బలికెనూ యల దేవేంద్రుడు ఖిన్నుడునై!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 9

పురుషశ్రేష్ఠుడ! మాందాతా! విను! బొలుపుగ నాదు సువచనములన్!
ఈ భూలోకమునందు నీవు మఱి నింపుగ రాజువు కావు మఱిన్,
ఈ భూతలమున భూమియంతయును నింపుగ వశమును గాకుండన్,
స్వర్గ రాజ్యమును గోరుచుంటివీ! స్వాధీనంబును జేసికొనన్! 10

అదెట్లు జరుగును? ఓ వీరుడ! విను! అఖిలమైన భూతలము మఱిన్,
నీ యాధీనము నుండినట్లయిన నీ భృత్యులతో గూడికొనీ
సైన్యముతోడను వాహనములతో చక్కగ వచ్చియు స్వర్గమునన్
రాజ్యంబును మఱి జేయగవచ్చును రమ్యముగా నీ వచ్చుటనూ! 11

అటుల బలుకు నా యింద్రుని గాంచీ యా మాంధాతయు క్రోధముతో,
నీ విధముగ బలికెను నాతండును నింపుగ దేవేంద్రుని తోడన్!
దేవేంద్రా! యీ భూతలమందున దీరుగ నా యాజ్ఞయు మఱియున్,
చెల్లుటలేదో తెలియ బలుకుమా! దీరుగ నే నాలోచించెదనూ! 12

ఆ మాటలు విని సహస్రాక్షుడును నా మాంధాతను గాంచి మఱిన్
మధురముగా నీ విధమున బలికెను మన్నన: జేసెడి వాని వలెన్!
అనఘా! విను! మధుపుత్రుడైన యా యలరు లవణుడను పేరుగలా!
రాక్షసుండు మఱి గల డచ్చట సుమ! రహి నీ యానతి జేయడుగా! 13

సహస్రాక్షుడును బలికి నట్టి యా సాహసమును నప్రియమైనా
విషయంబును విని యా మాంధాతయు వికృతితో భావమునందున్,
సిగ్గుజెందనా వాడగుచును మఱి శీర్షము వంచిన వాడగుచున్
సమాధానమును తెలుప జాలకను సరి మౌనంబును ధరియించెన్! 14

శ్రీమంతుండగు నా నరేంద్రుడును శ్రీకరముగ యింద్రుని యొద్దన్,
సెలవు దీసికొని బహు శీఘ్రముగా శీర్షము కొంచెము వంచుకొనీ,
మఱల వచ్చె నీ భూలోకమునకు మానుగ జేయునదియు లేకన్,
అందఱిలో నవమానమునందీ యలరి వచ్చె తన గృహమునకున్! 15

అరిందముండగు నా మాంధాతయు నలరి హృదయమందునను మఱిన్
క్రోధముతోడను మధువు పుత్రుడగు కూరిమి లవణాసురుని మఱిన్,
తన వశమందున నుంచుకొనుటకై తన భృత్యులతో, సైన్యముతో
వాహనములతో కలసి వచ్చెనూ వరుసగ లవణాసురు పైకిన్! 16

పురుష శ్రేష్ఠుండైన యాతడును పొలుపుగ మాంధాతయు నపుడున్
యుద్ధము గోరుచు లవణాసురునీ కూరిమి యాతని యొద్దకునూ!
దూతను బంపెను నా మాంధాతయు దోషము లేకుండగ నపుడున్
యుద్ధముజేయగ రమ్మనుచును మఱి సిద్ధము కమ్మని రణమునకున్! 17

ఆ దూతయు మఱి లవణుని యొద్దకు నలరుచు జని యప్రియమైనా
అనేక వాక్యములను బలికెను మఱి యటునిటు జూడక క్రోధమునన్
ఆ దూతయు మఱి యటుల బలుకగా నా రాక్షసుడును గాంచి మఱిన్!
ఆ రాక్షసుడును నటునిటు జూడక యతనిని భక్షించెను వేగన్! 18

ఆ దూతయు నటు నాలస్యంబును నటుల జేయుచుండగ నపుడున్
మాంధాతయు బహు క్రోధము తోడను యా రాక్షసునీ గాంచి మఱిన్
అన్ని వైపులను బాణ వర్షమును నాతనిపై వర్షించె మఱిన్,
ఆ రాక్షసుడును జెక్కు చెదరకను నదురు బెదురు లేకుండగనూ! 19

అటుబిమ్మట యా లవణాసురుడును నలరుచు నవ్వుచు వేగముగన్
హస్తముతో శూలమును గ్రహించెను నాటుపోటులను లేకుండన్!
ఆ రాజును, పరివారము నంతను నలరి జంపుటకు శీఘ్రముగా
ఉత్తమోత్తమము నాయుధంబులను సత్తువతో విడిచెను నపుడున్! 20

దీప్యమానమగు నా శూలంబును దీరుగ సభృత్య బలములతో
వాహనములతో గూడిన రాజును వరుసగ భస్మము జేసి మఱిన్!
లవణాసురునీ హస్తము జేరెను లాలితముగ సుకుమారముగా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 21

మహౌఘనుండగు మాంధాతయునూ మానుగ యాతని సైన్యములున్,
వాహనంబులను హరింపబడినవి వరుసగ యన్నియుగూడ మఱిన్
సౌమ్యుడ వినుమా! శూలమునకుగల సహజశక్తి ఘనమైనదియున్
ఊహింపగ శక్యముగానిది సుమ! ఉరుగుణ శక్తియు గలదు సుమా! 22

ప్రాతఃకాలమునందు రేపు మఱి పన్నుగ శూలాయుధము మఱిన్
లేని సమయమున యతనిని నీవును లీలగ జంపగగలవు సుమా!
సంశయంబులే దెంత మాత్రమును సందేహంబును లేదు సుమా!
విజయము గలుగును నీకు నిశ్చయము నిర్భయముగ నుండుము నీవున్! 23

నీ చేతను మఱి యీ కర్మంబును నిర్భయముగ నెఱవేర్చినచో
లోకంబులకును క్షేమము గలుగును లోక జనులు హర్షించెదరూ!
దురాత్ముడైనా లవణునిగాథను దోరముగా నంతయు నీకున్,
తెలుపగబడినది శత్రుఘ్నా విను! దీరుగ నంతయు విశదముగన్! 24

నరర్షభా! ఓ శత్రుఘ్నా విను! నయముగ శూలము కున్నట్టీ
ఆ బలంబు మఱి యమోఘమైనది యలవిగానిదీ లోకమునన్!
ఊహింపగ శక్యంబుగానిదీ యురుగుణవంతుడు నింద్రునిచే
ప్రయత్నంబునను నీ శూలముచే బరగ నశించెను మాంధాతా! 25

మహాబాహు! ఓ శత్రుఘ్నా విను! మానుగ నాదు సువచనములన్,
ప్రాతఃకాలమునందు రేపు మఱి బన్నుగ మాంసాహారముకున్
శూలంబును లేకుండగ జనినాశూరుడు లవణాసురుని మఱిన్,
వధింపగలమూ! యీ విషయంబున వనరగ సంశయమును లేదూ!
నరేంద్ర! నీకును నిశ్చితమైనా నయముగ విజయము గలుగుసుమా! 26

శ్రీరామ కథా సుథాలహరి యందు - ఉత్తరకాండములో
అఱువది యేడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

అఱువది యెనిమిదవ సర్గము

(లవణాసురుడు ఆహారము కొఱకై బయలుదేరుట, శత్రుఘ్నుడు మధురాపుర ద్వారమునందు నిలిచి యుండుట, తిరిగి వచ్చిన లవణునితో నాతని సంభాషణము)

ఆ ఋషి మునులును నట్టి కథను మఱి యలరుచు దెలుపుచు నుండగనూ!
జయము శుభంబును గోరుచుండగా జనరంజకుడగు నాతనికిన్,
మహాత్ముడైనా శత్రుఘ్ననకును మానుగ రాత్రియు శీఘ్రముగన్,
గడిచిపోయినది, నక్షత్రంబులు గగనంబున లుప్తము లాయెన్!
తెలతెలవారెను నరుణరేఖలును దీరుగ తూర్పున వికసించెన్! 1

అటుబిమ్మట తెలవారిన పిమ్మట యల నిర్మలమగు కాలమునన్
వీరుడైన యా రాక్షసుండునూ భక్ష్యాహార ప్రబోధితుడై
నగరమునుండియు బయలుదేరెనూ నయముగ సహచరులను గూడి!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

ఇట్టి మధ్య సమయమునందుననూ నిట్టి వీర శత్రుఘ్నుండున్
యమునానదినీ దాటి యాతడును మానుగ ధనుసును ధరియించీ!
మధురా ద్వారమునందున నిలిచెను మానుగ రక్కసు వధియింపన్!
అతని రాకకును నెదురు జూచుచును నట నిలిచెను ధనువును బట్టీ! 3

అటుబిమ్మట దివసార్ధమునందున యలరు క్రూర కర్మలు గలుగూ,
ఆ రాక్షసుడును ప్రాణుల యొక్కయు నలరెడి వేలకు మించిన యా
ప్రాణుల భారము మోయుచు నాతడు బన్నుగ వచ్చెను గృహమునకున్'
రక్త మాంసములతోడ నిండెనూ రయమున నాతని కాయంబున్! 4

అటుబిమ్మట యా రాక్షసుండునూ యచట ద్వారమున నిలిచిన యా
ధరింపబడినా యాయుధములుగల దగ శత్రుఘ్నుని గాంచె మఱిన్,
అటుబిమ్మట వానిని గూర్చియు మఱి యలరి బలికె నీ విధముగనూ!
'దీనితోని మఱి యేమి జేసెదవో?' దీరుగ తెలుపుము! ముచ్చటగన్! 5

నరాధమా! బహు నాయుధంబులను బరగ ధరించిన వారలనూ!
వేలమందినీ నేను కోపమున వికటముగా భక్షించి మఱిన్
యమపురి కంపితి వారలనందఱ విమలముగా నీ ద్వారమునన్
కాలము ప్రేరేపింపగ నీవును కదలివచ్చితివి! యిటకు మఱిన్! 6

పురుషాధమ! యీ యాహారంబును బొలుపుగ చాలదు మఱి నాకున్
అందువలన ఓ దుర్మతి వినుమా! చందముగా నా సమీపమున్
వచ్చి స్వయముగను ప్రవేశించితివి మచ్చిక నా యాకలి దీరన్
తరలిపోకుమా! వెడలి బోకుమా! తన్మయముగ నిను భుజియింతున్! 7

ఆ లవణుండును యట్టి విధముగా నలరి మాటలాడుచునుండన్,
మాటిమాటికిని నవ్వుచుండగా మఱి మఱి హాస్యములాడగనూ,
మహాపరాక్రమ వంతుడైన యా మానుగ సుమిత్ర సుతుడు మఱిన్,
కోపముతో కన్నీటిని రాల్చెను క్రోధముతో గాంచెను నతనిన్! 8

రోషము జేతను నాక్రమింపబడి రూఢత మహాత్ముడైనట్టీ
శత్రుఘ్నుని యా సమస్తంబులగు సర్వగాత్రముల నుండి మఱిన్!
తేజో వికారములు నగునట్టీ తీరుగ కిరణంబులు రాలెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 9

సుసంక్రుద్ధుడగు శత్రుఘ్నుండును సురచిరముగ నా రాక్షసుతో
ఈ విధమున బలికెను నాతనితో నింపుగ క్రోధాక్షరములతో,
దుర్బుద్ధీ! వినుమా! ఓ రాక్షస! దీరుగ నీతోడను నేనున్,
ద్వంద్వ యుద్ధమును జేయవలయునని విందుగ గోరుచు నుంటి నిదే! 10

దశరథ రాజేంద్రుని పుత్రుడనే దగ ధీమంతుడు రామునికిన్
కనిష్ఠ సోదరుడను వినుమా! నే కలిసి చరింతును భరతునితో!
శత్రుఘ్నుండను పేరుగలాడను! శాత్రువులను నే వధియింతున్!
నిను జంపుటకై వచ్చితి నేనును నిండు హృదయమున నిచ్చటికిన్! 11

యుద్ధమునందున కోరికయును గల యుద్ధాసక్తుడ నేను మఱిన్,
సమస్తమైనా ప్రాణులకును మఱి సహజ శత్రుడవు నీవు మఱిన్,
ప్రాణంబులతో బయట బడవు సుమ! బన్నగ నా నుండియును మఱిన్!
ఇపుడే నిన్నును వధియించెదసుమ! నిల జనములు మోదము నందన్! 12

అతడా విధముగ బలుకుచుండగా నీ రాక్షసుడును మోదముగా,
పకపక నవ్వుచు నరశ్రేష్ఠునితో బన్నుగ బలికెను నీ విధమున్!
దుర్మతి వినుమా! దైవవశమునను దోరముగా వచ్చితి నిటకున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 13

ఓ దుర్బుద్ధీ! పురుషాధమ విను! నాదు తల్లి సోదరికి మఱిన్
సోదరుడైనా రావణు డనియెడి సురుచిరముగ రాక్షసుని మఱిన్

స్త్రీ నిమిత్తమున జంపినాడుగద! స్థిర సకల్పముజేత మఱిన్
కోతుల బలమును జేకొని యాతడు గోరి జంపె రాక్షసగుంపున్! 14

అల రావణునీ కులక్షయంబును నలరి క్షమించితిని నేనున్!
ప్రధానంబుగా కేవలమును నే ననాదరంబగు భావముచే
పురస్కరించుక మిమ్ములనందఱు పూని క్షమించితి నేనున్,
గడ్డిపరకలుగ జూచెద నేనును జెడ్డవారలుగ భావింతున్! 15

అనేక మందిని చంపివేసితిని నాశ్చర్యంబును లేదు మఱిన్,
పురుషాధములగు పూర్వుల నందఱు పాలుపుగ వధియించితి నేనున్!
రాబోయెడి వారలను మిమ్ములను రహి జీపురు పుల్లలకును వలెన్!
అనాదరంబును జేసి వైచితిని! యంటరాని వారలవోలెన్! 16

దుర్మతి వినుమా! యుద్ధము గోరుచు దోరముగా నుంటివి నీవున్
యుద్ధము నిచ్చెద! వేచియుండుమా! యుద్ధతి నణచెద నేనిపుడే!
ఆయుధములు నే దెచ్చువఱకునూ యటులాగుము క్షణమును నీవున్
ఆయుధములు లేనట్టి నేను మఱి నలరి పోరుదును నీతోడన్? 17

'నీకు తగిన యా యుధమును నేనును నిశ్చయముగ దెచ్చెడి వఱకున్
ఆగుమాగుమా! యంత వఱకనూ' యనుచు బలికె నా రాక్షసుడున్!
అంతట యా శత్రుఘ్నుడు బలికెను యాతని తోడను వెనువెంటన్!
నేనిట నుండగ ప్రాణంబులతో నెచటి కేగెదవు నీవు మఱిన్? 18

స్వయముగవచ్చిన శత్రువు నెప్పుడు స్వతంత్రముగ విడువగరాదూ!
బుద్ధిమంతుడగు వాడు నెప్పుడును బోలుపుగ విడువగ రాదు మఱిన్!
తెలివితక్కువగ నా శత్రువునకు దీరుగ యవకాశంబు మఱిన్,
విచ్చెడివాడును మందబుద్ధి మఱి యింపుగ నీచుని వోలె మఱిన్
చంపివేయబడుచుండును నాతడు చయ్యన శత్రువు జేత మఱిన్! 19

రామునకును మఱి త్రైలోక్యములకు రహి శత్రుండవు నీవు మఱిన్
పాపాత్ముండవు నైన నిన్ను మఱి బన్నుగ యనేక విధములునూ
వాడియైన బాణంబుల చేతను వనరగ యమలోకంబునకున్,
బంపివేసెదను రాక్షస వినుమా? బన్నుగ యా కారణముననూ!
చివఱిసారిగా జూచుకొనుము మఱి జీవలోకమును ఒకసారిన్! 20

శ్రీరామ కథా సుధాల్లహరి యందు - ఉత్తరకాండములో
అఱువది యెనిమిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

అఱువది తొమ్మిదవ సర్గము

(శత్రుఘ్న - లవణాసురుల యుద్ధము - లవణాసురుని సంహారము)

మహాత్ముఁడగు నా శత్రుఘ్నుని యా మాటలు విని రాక్షసుడున్,
తీవ్రమైన క్రోధమును దెచ్చుకొనె దీరుగ రణరంగమునందున్!
'నిలు! నిలు! మనుచును బలికె నాతడును నివ్వెఱ బోవ జనంబులునూ!
పరుషవచనములు బలుకుచు నాతడు బండ్లను పటపట గొఱుకుచునూ! 1

ఆ లవణుండును హస్తమునందున హస్తముంచి మఱి నలుపుచునూ!
దంతంబుల మఱి దంతంబులచే వింతగ కటకటలాడించీ,
మాటిమాటికిని శత్రుఘ్నుని మఱి మానుగ దుర్భాషలతోడన్,
ఆహ్వానించెను యుద్ధంబునకును రహి దొడగొట్టుచు వికటముగన్! 2

ఈ విధంబుగను బలుకుచుండినా యింపుగ జూచుటకును మఱియున్
భయంకరుడుగా నున్నయట్టి యా బర్బరుడగు రాక్షసుతోడన్,
రాక్షస సంహారకుడగునట్టీ రమ్యముగా శత్రుఘ్నుడునూ!
ఈ విధముగ బలికెను రాక్షసుతో నింపుగ పరుషాక్షరములతో! 3

నీ చేతను నెప్పుడు నితరులునూ నిర్భయముగను జయింపబడెన్!
ఆ సమయంబున శత్రుఘ్నుండును నలరి పుట్టనేలేదు సుమా!
ఆ కారణమున నీవు ప్రస్తుతము నలరి బాణముల కొట్టబడీ,
యమసదనంబును జేరుము రాక్షస! సదమలమతినీ గూర్చికొనీ! 4

పాపాత్ముఁడ! రణమున నా చేతను బన్నుగ జంపగబడిన నినున్,
రామునిచేతను జంపబడిన యా రావణాసురుని దేవతలున్
జూచినట్లుగా ఋషులు బ్రాహ్మణులు సురుచిరముగ విద్వాంసులునూ!
జూచినట్లుగా జాతురు గాతను జూడ ముచ్చటగ నందఱునూ! 5

నిశాచరుడవగు నీవు ప్రస్తుతము నిరుపమానమగు శరములచే
దహింపగా బడి నేలకూలగా దగ పురముల జనపదములనూ
క్షేమము గలుగును గాని రాక్షసా! కీడును గలుగదు నెన్నటికిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 6

బాహువు నుండీ వెడలినట్టి యా బన్నుగ వజ్రము వంటిదియున్
అగ్రభాగమును గలిగిన బాణము నల సూర్యుని నుండియును మఱిన్,
బయలువెడలినా కిరణంబును మఱి పద్మమునందున జొచ్చినటుల్,
నీ హృదయములో ప్రవేశించునూ నిశ్చయముగ నా బాణంబున్! 7

ఇటుల బలుకబడి యా లవణుండును చటుల క్రోధ మూర్ఛితు డగుచున్
మహావృక్షమును కరమునబట్టీ మానుగ శత్రుఘ్నుని హృదినీ,
విసిరివేసెను శత్రుఘ్నుండును విసిరిన యా వృక్షమును మఱిన్
నూరు ముక్కలుగ ఛేదించెను మఱి నుగ్గునుగ్గుగా నటబడగన్! 8

బలవంతుండగు నా రాక్షసుడును బరగ కర్మ వ్యర్థంబగుటన్,
జూచి మఱల బహువృక్షంబులనూ సొక్కుచు సోలుచు గ్రహియించీ,
ఆ శత్రుఘ్నుని మీదికి విసెరెను నలరుచు నొక్కొక్కటిని మఱిన్,
ఆతడు గూడను నా వృక్షములను నలరుచు ఛేదించెను వేగన్! 9

తేజస్వియునగు శత్రుఘ్నుండును దీరుగ మీదను బడుచున్నా
అనేకంబులగు వృక్షంబులనూ యలరుచు నొక్కొక దాని మఱిన్
మూడు నాల్గు బాణంబుల చేతను ముదమున ఛేదించెను నతడున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 10

అటుబిమ్మట నా మహా వీర్యుడును మానుగ శత్రుఘ్నుండపుడున్,
ఆ రాక్షసునీ మీద శీఘ్రమున అలరి బాణ వర్షంబు మఱిన్,
గుంపించెను గానీ రాక్షసుడును గూరిమి వ్యథ జెందగలేదూ!
నిశ్చలముగ నుండియు నాతండును నిర్భయముగ రణమును సలిపెన్! 11

అటుబిమ్మట యా వీర్యవంతుడును నల లవణుండును భీకరతన్
అట్టహాసమును జేయుచు నాతడు నలరి వృక్షమును బట్టుకొనీ,
శత్రుఘ్నుని తలమీదను గొట్టెను సహింపజాలక నాతండున్
అవయవంబులను జార విడిచి మఱి యాతడు మోహమును జెందెన్! 12

వీరుడైన యా శత్రుఘ్నుండును విమలమైన ధాత్రిని బడగా,
ఋషులు, మునులు యా దేవ సంఘములు రూఢిగ గంధర్వాప్సరసల్
హాహా-కారములును జేసిరీ నంతములేనీ ధ్వనులు మఱిన్
ఆ లవణుండును నానందించెను నా శత్రుఘ్నుడు నేలబడన్! 13

దెబ్బతినియు మఱి నేలవడిన యా తీరుగ శత్రుఘ్నుని యందున్,
ననాదరంబగు భావనచేతను నలరి యింటిలోపలికి మఱిన్,
వెళ్లుటకును నవకాశము దొరికిన వెళ్లలేదు నా రక్కసుడున్,
శూలము దెచ్చుటకును నాతండును సురుచిరమగు నవకాశంబున్,
దొరికిన గూడను నా లవణుండును తోరము గ్రహియింపగ లేదూ! 14

నేలమీద బడిపోయిన నాతని నిండు నిదురబోయిన యటులన్
ఆ లవణుండును గ్రహించి మదిలో నల శూలము గ్రహియింపకనూ,
మరణించినవా డనుకొని శత్రువు మానుగ దెచ్చిన మాంసములన్,
నామృషాదులను బైకి నెత్తుకొని మానుగ బోనగ గృహమునకున్! 15

శత్రుఘ్నుండును ముహూర్త మందున సరసత సంజ్ఞను బొందుచునూ
మునులజేత యా ఋషులజేతనూ! మోదముగను బూజింపబడీ
మఱల ధృతాయుధమును గలవాడై మానుగ రణమున సిద్ధుండై
పురద్వారంబున నిలబడె నాతడు పూనిక లవణుని వధియింపన్! 16

అటుబిమ్మట యా శత్రుఘ్నుండును నలరు దివ్యమును నమోఘమున్
అయినటువంటీ మహత్తరంబగు, నలరు శరము బైటకు దీసెన్,
తేజస్సులతో మండుచున్న యా దీరుగ భయంకరంబైనా
యాశరమును తేజస్సులతోడను నల దశదిశలను నింపుచునూ! 17

వజ్రము వంటీ వేగంబును మఱి వనర పిడుగువేగముగలిగీ
మేఱు మందరంబుల సమానమును మేదుర శరమును నట్టియెడన్
అన్ని కణుపులను వంగి యుండెనూ అన్ని కోణముల యందుననూ,
యుద్ధంబులలో నా బాణంబును నుద్ధతి యోటమి నెఱుగదుగా! 18

ఆ బాణంబును రక్త చందనము నలరి బూయబడి యందముగా
అందమైన రెక్కలతో గూడుక చందము పక్షికి వలె నుండెన్,
ఈ శరమును దానవ నాయకులను నింపుగ పర్వతములను మఱిన్,
అసురుల గూడను జీల్చివేసినది రుసరుసలను నది లేకుండన్! 19

ప్రళయకాలమున సముపస్థితమై ప్రజ్వలించు చున్నట్టియునూ
కాలాగ్నికి వలె యున్నట్టువంటీ కఠినమైన యా బాణంబున్

సకల భూతములు భయపడిపోయెను సారెకు ధ్వనులను జేయుచునూ!
హఠాత్తుగా వచ్చిన యాపద గని యారాటము జెందెను ప్రాణుల్! 20

ఆ సమయంబున సర్వజగంబును నస్వస్థంబును బొందె మఱిన్
బ్రహ్మదేవునీ యొద్దకుబోయిరి బన్నుగ మొఱలను వినిపింపన్!
దేవాసురులును, గంధర్వులును దీరుగ మునులును నప్సరసల్,
అందఱు గూడను భయమును జెందిరి జిందుచు వేదన హృదయములన్! 21

లోకంబులు మఱి నశించు ననుచును లోలత దేవతలకును మఱిన్,
భయమును మోహము గలిగె నప్పుడును భరింపరానీ వేదనయున్,
దేవదేవుడును సర్వసమర్థుడు దీరుగ వరముల నిచ్చెడి యా
బ్రహ్మదేవుతో నిట్లని బలికిరి బన్నుగ యంజలి ఘటియించి 22

పితామహా! ఓ ప్రజాపతీ! విను ప్రియముగ దెలుపుము మాకు మఱిన్,
లోకనాశమునుగాని, ప్రళయమును లోలత సంప్రాప్తించినదో!
ఈ దృశమైనది దృష్ట పూర్వమును నింపుగ జూడగలేదు గదా!
విన లేదెప్పుడు నిట్టి చిత్రమును నింపుగ లోకులచేత మఱిన్! 23

వారి యొక్క తద్వచనములను విని వనరగ లోక పితామహుడున్
అభయంకరుడగు నైన బ్రహ్మయును నా దేవతలకు మునులకునూ,
ఆ దేవతలకు భయ కారణమును నలరి దెలిపె నీ విధముననూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 24

ఆ దేవతలను గాంచి బ్రహ్మయును నలరి మధుర వచనంబులతో
భయముమాన్పుచును బాధ మాన్పుచును బన్నుగ దెలుపుచు విషయమునూ!
సకల దేవతలు వినుడూ! దెలిపెద! సరసత మధుర సువచనములన్!
లవణుని జంపగ శత్రుఘ్నుండును లావుగ యుద్ధమునందుననూ!
మహాభయంకరమగు బాణంబును మానుగ ధరియించెను నపుడున్! 25

సురసత్తములారా! వినుడో మఱి సూనృతములగు నా వచనములన్,
ఆ బాణము తేజస్సుల జేతను నలరి మందఱము మూఢులమై
ఏమియు దోపక యున్నారము మఱి యింపుగ యా కారణముననూ,
ఆ బాణము బహు సనాతనంబును నలరు తేజమును గూడినదీ!

లోకములను సృజియించినట్టి యా లోలత విష్ణువు బాణమదీ!
దీనిచేతనే లోకములకు మఱి దీరుగ భయమును నేర్పడియెన్! 26

ఈ శరమును నా మహాత్ముడైనా యింపుగ యా విష్ణువు మఱిన్
మధుకైటభులను మహాదానవుల మానుగ వధియింపగ నపుడున్
ఈ మహాశరము సృజించె నాతడు నింపుగ తనదు ప్రకాశముతో!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 27

తేజోమయమగు శరమును గురించి తీరుగ తెలిసినవాడు మఱిన్
విష్ణువు మాత్రము దెలిసిన వాడును వివరముగా దానిని మఱియున్,
ఈ శరంబు మఱి మహాత్ముడైనా నింపుగ విష్ణువు రూపంబే
ప్రాచీనంబగు పరమ రూపమది ప్రకటితమగు నపు డపుడు మఱిన్! 28

ఇచ్చటినుండీ వెడలి కనుగొనుడు మచ్చికతో నచటను గనుడూ!
మహాత్ముడును మఱి వీరుడునైనా మానుగ శత్రుఘ్నుని జేతన్!
చంపబడెడి యా రాక్షసోత్తముని చంపబడెడి లవణాసురునీ,
కనుగొనుడీ! మీరందఱు గూడను గడు విచిత్రమగు విషయములన్! 29

అటనుండియు సురలందఱుగూడను నల ప్రజాపతీ వచనములన్,
విని వేగము శత్రుఘ్న లవణులా విమల రణంబును గనుగొనగా!
ఆ ప్రదేశమునకును వచ్చిరి మఱి యల దేవతలును మునులు మఱిన్,
శత్రుఘ్నుడు మఱి లవణులు నిలిచిన సహజ వీరభూమికి వారున్! 30

బయలుదేరినా ప్రళయాగ్నికి వలె బన్నుగ యుండిన బాణమునా!
శత్రుఘ్నుని హస్తమునందున్నా యలరెడి యా ఘన శరమును వే
సర్వభూతములు కనులను గాంచెను సర్వదిశలు కాంతులు జెలగన్!
మహా విష్ణువూ ప్రతిరూపంబును మానుగ విరాట్ స్వరూపమునూ! 31

రఘునందనుడగు నా శత్రుఘ్నుడు రహి యాకాశము నంతయునూ,
సురలు, మునులు, కిన్నరులు, నాగులును సురుచిరముగ యుండుట గాంచీ,
సింహనాదమును, బహు బిగ్గఱగను శీఘ్రముగను జేసియు మఱలన్,
లవణాసురునీ వైపు జూచి మఱి లావుగ బిలిచెను రణమునకై 32

మహాత్ముడగు శత్రుఘ్నుని జేతను మఱల రణమునకు బిలువబడీ,
లవణాసురుడును గోపముతోడను లావుగ యుద్ధోన్ముఖుడగుచున్,

శత్రుఘ్నునితో రణమును సలుపగ చరచర సమరమునకు వచ్చెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 33

అటుబిమ్మట యా ధనుర్ధరులలో నల శ్రేష్ఠుడు శత్రుఘ్నుండున్
ఆ ధనుస్సునూ యాకార్ణంతము నటు లాగియు బహు శీఘ్రముగన్
అట్టి మహా బాణమును వేగముగ నిట్టె ధనువునను సారించీ,
లవణుని వక్షస్థలము మీదనూ లాలితముగ వదిలెను నపుడున్! 34

విభుధ పూజితంబైన శరంబును విమల శరంబును శీఘ్రముగన్
లవణుని వక్షస్థలము జీల్చి మఱి లావగు ధ్వనియును జేయుచునూ!
రసాతలంబున ప్రవేశించి మఱి రమ్యముగా బహు శీఘ్రముగన్,
శత్రుఘ్నుని హస్తమున జేరెనూ శాత్రవ సంహారము జేసీ! 35, 36

రాక్షసుడగు నా లవణుండును మఱి రహి శత్రుఘ్నుని బాణముచే
బ్రద్దలు గొట్టగబడువాడగుచును బన్నుగ యా లవణాసురుడున్,
వజ్రము చేతను గొట్టబడిన యా వర పర్వతమును బోలె మఱిన్!
నేలపైబడెను రక్తధారలను నిర్జరులును నానందింపన్! 37

లవణాసురుడును మరణింపగనే లాలితముగ దివ్యంబైనా
మహాశూలమును సకల దేవతలు మానుగ జూచుచు నుండగనూ!
అల రుద్రునికిని వశమైపోయెను కలకల నాదము జేయుచునూ!
ఎచటి నుండి వచ్చెనో యాశరమును నచటికి బోయెను వెనువెంటన్! 38

ఉత్తమమైనా చాప బాణములు నురుతరముగ గలిగిన యట్టీ
రఘుప్రవీరుడు శత్రుఘ్నుండును రయమున నొక బాణము జేతన్!
లోకభయంబును లుప్తము జేసెను జీకటులను దొలగించియునూ,
సహస్ర రశ్మిగ యా శత్రుఘ్నుడు చయ్యన ప్రకాశమును జెందెన్! 39

అటుబిమ్మట యా దేవతలందఱు అల ఋషులును, మునులును మఱిన్
పన్నగములు అప్సరస లందఱును బన్నుగ శత్రుఘ్నా! యనుచున్
జయము బొందితివి అన్ని లోకములు జయశీలంబులు కీర్తింపన్
అని కీర్తించుచు నా శత్రుఘ్నుని మఱి యలరుచు బూజించిరి యపుడున్! 40

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
అఱువది తొమ్మిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

డెబ్బదియవ సర్గము

(శత్రుఘ్నుడు దేవతలనుండి వరములను బొందుట మధుపురిని నిర్మించిన తదుపరి రాముని వద్దకు వెళ్ళవలయునని నాతడు సంకల్పించుట)

లవణుడు జంపగ బడిన పిమ్మటను లాలితముగ నింద్రుడు మఱియున్
అగ్నియు మున్నగు దేవతలందఱు నలరి వచ్చి యాతని కడకున్!
శత్రువులను బీడించునట్టి యా శత్రుఘ్నుని గూర్చియు వారున్
మధురమైన వచనములను బలికిరి మాధుర్యము జిందగ నపుడున్! 1

వత్సా! అదృష్ట వశముజేత మఱి వనర విజయమును లభియించెన్!
లవణాసురుడును వధింపబడెనూ లాలితముగ నీ జేత మఱిన్,
పురుషశ్రేష్ఠుడ! సువ్రత వినుమా! పొలుపుగ మాదు సువచనములన్!
వరము లిచ్చెదము! గోరుకొనుము మఱి వాసిగ మనసున గోరినవి! 2

మహాబాహు! నీకును విజయంబును మానుగ గలుగగ కోరికనూ!
మే మందఱమును వచ్చిన వారము మిగుల కోరికల నిచ్చుటకున్,
మా దర్శనమును వ్యర్థముగాదూ! మాధుర్యంబును జిందుగదా!
మనసునందుగల కోరిక దెలుపుము! మానుగ యిచ్చెద మిపుడు మఱిన్! 3

శూరుండును మఱి మహాబాహువును సురుచిరముగ ప్రయతాత్ముండున్
యైనయట్టి యా శత్రుఘ్నుండును నలరి దేవతల భాషితమున్,
విని శిరస్సుపై యంజలి తోడను విమలముగా నిటులను బలికెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 4

రమ్యంబును మఱి మాధుర్యమునగు రయమున యీ మధుపురి వేగన్
దివిజుల చేతను నిర్మితంబునై దీరుగ శీఘ్రము నిదియు మఱిన్,
రాజధాని యగుగాత! యీ పురము రమ్య మయోధ్యకు వోలె మఱిన్!
ఇదియే నాకు ప్రధాన వరంబును నిదియే నా కోరిక సుమ్మా! 5

ఆ దేవతలును సంతసించియును నల శత్రుఘ్నునితోని మఱిన్
మధుర వచనములతో నిట్లనిరీ మంజుల సుమధురాక్షరములతో,

ఈ మధుపురియును నిస్సంశయముగ నింపుగ శూరులు నైనట్టి
సేనలతోడను నిండియుండునూ స్థిరముగ నుండును నెల్లపుడున్! 6

మహాత్ములైనా యా దేవతలును మానుగ బలికియు నా విధమున్
స్వర్గంబునకును దరలిపోయిరీ సహజ తేజమున వారలునూ!
మహాతేజమును గలిగినట్టి యా మానుగ శత్రుఘ్నుడు గూడన్,
తన సైన్యంబును జేకొని వచ్చెను దగ మధు పురమునకును వేగన్! 7

ఆ సేనయు శత్రుఘ్న శాసనము నలరి వచ్చె విని వేగముగన్
మధుపురమును నిర్మించుటకును మఱి మానుగ సుందర నగరముగన్,
శ్రావణమాసమునందు పురంబును సహజ శిల్పముల తోని మఱిన్,
నిర్మించుటకును బూనికొనిరి మఱి నిపుణులైన శిల్పులతోడన్! 8

పండ్రెండేండ్లను బట్టె యా నగరి బహు శిల్పంబుల తోని మఱిన్,
శూరులైన సైనికులతోని మఱి సుందరముగ నిర్మింప బడెన్,
సకల కళలతో నిండియుండెనూ సర్వ సంపదలతోని మఱిన్
ఏవైపున భయమును లేకుండగ యింపుగ నుండెను దేశంబున్! 9

క్షేత్రములన్నియు సస్య యుక్తములు నింద్రుడు కాలమునందు మఱిన్,
వర్షించుచు నున్నాడు మఱియునూ వనరగ యమునా తీరమునన్
అర్ధచంద్రునీ యాకారములో నటు నిర్మించిన నగరమునన్,
శత్రుఘ్నుండును బరిపాలించెడి ప్రేతయుక్తమగు నగరమునన్
పురుషులు నారోగ్యము గలవారై బొందుగ శోకంబులు లేకన్!
రోగంబులు మఱి లేకయుండిరీ రూఢిగ బలసంయుక్తులునై!
నాలుగు వర్ణంబుల వారును నట నయముగ నివసించుచును మఱిన్,
చతుష్పథములగు, వీధులలోనూ సకల వస్తు సముదాయముతో,
శోభించుచు నుండెను నచ్చట మఱి సుందర వస్తువులను గూడీ! 10,11

పూర్వము లవణాసురుడు జేసినా పాలుపుగ తెల్లని భవనంబున్
శత్రుఘ్నుండును నా భవనంబును సరసత నింద్రుని భవనముగా,
అనేకంబులగు వర్ణంబులతో నందముగా నుండెడి విధమున్
పాలరాళ్లతో నిర్మించెను మఱి బరగ నీడ కనబడు రీతిన్! 12

వచ్చిన తన పని పూర్తిజేసికొని వనరగ భరతానుజుడైనా
ఆ శత్రుఘ్నుడు సకల సంపదల యలరుచున్న నగరము గాంచీ!
హృదయమందు దా సంతసమందెను సదయ హృదయమున నాతండున్!
ఆ మధుపురి యందు జుట్టునూ యలరెడి యుద్యానంబులనూ,
క్రీడా స్థానంబులు గల వచ్చట క్రీడకు ననువగు వనంబులున్
దేవతలకు మఱి మనుష్యులకునూ దీరుగ సంబంధించినదీ,
అలంకరణములు ననేక మచటను నలరి జేయబడి యందముగన్!
అనేక దిక్కుల నుండి వచ్చినా యలరు వర్తకులతో నిండీ
వివిధ వస్తువులతో నిండెను పురి. వివిధాలంకారంబులతో,
దేవతా నగరి వోలె నుండెనూ దిక్కులన్నియును కాంతులతో! 13, 14, 15

ఆ మధురాపురి నిర్మించియు మఱి యల ద్వాదశ వర్షంబులునూ
జరుగుచుండగా శత్రుఘ్నునకును జాగృతి గలిగెను మదియందున్,
రామపాద దర్శనము జేయగా రమ్యముగా బుద్ధియు బుట్టెన్,
అన్నల నందఱ జూడవలయునని యాశ గలిగ శత్రుఘ్నునకున్! 16

అటు బిమ్మట యా నరాధిపుండగు నా రఘుకుల వర్ధనుడు మఱిన్
ఆ శత్రుఘ్నుడు ననేకులైనా యలరు జనులతో నిండిన యా
అమరావతితో సమానమైనా యా పురమును నెలకొలపి మఱిన్,
ఆ శ్రీ రఘుపతి పాదదర్శనము నలరి జేసి కొనవలయుననీ
మది యందున దా సంకల్పించెను మానుగ చింతన జేసె మఱిన్! 17

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
డెబ్బదియవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

డెబ్బది యొకటవ సర్గము

(స్వల్పమైన సైన్యంబును దీసికొని శత్రుఘ్నుడు అయోధ్యకు బయలుదేరుట, మార్గ మధ్యమందు వాల్మీక్యాశ్రమమునందు శ్రీరామ చరిత గానమును విని వారందఱును నాశ్చర్యము జెందుట)

అటుబిమ్మట యా శత్రుఘ్నుండును నలరుచు బండ్రెండవ యేటన్
స్వల్ప సంఖ్యగల భృత్యులతోడను స్వల్ప సైన్యమును గూడికొనీ
రఘురాముడు బాలించుచున్న మా రమ్య యయోధ్యను బోవుటకున్
మనసునందు మఱి నిశ్చయించెనూ మానుగ రాముని దర్శింపన్ 1

అటుబిమ్మట యా శత్రుఘ్నుండును నలరు మంత్రులను ముఖ్యులనూ,
వెనుకకు మఱలను బంపివేసెనూ వేగము గలిగిన యశ్వములన్
కొలది కుంజరములను రథంబులను గూడి యయోధ్యకు బయనించెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

మహాకీర్తిగల రఘునందడును నా శత్రుఘ్నుడు శీఘ్రముగన్
నిర్ణయింపబడినట్టి ప్రకారము నియమితముగ యేడెనిమిదియున్!
మకాములను మఱిజేసి యాతడును మానుగ వాల్మీక్యాశ్రమమున్
జేరి యచ్చటను విడిది జేసెనూ శ్రీవాల్మీకుల దర్శించెన్! 3

పురుషశ్రేష్ఠుడు శత్రుఘ్నుండును పూనికతో వాల్మీకులకున్
అంజలి ఘటించి నమస్కరించుచు నాతడు నిచ్చిన పాద్యంబున్
అర్ఘ్యంబును, యాతిథ్యంబును మఱి యాతడిచ్చు ఫలమూలములన్
భుజించి యచటను విశ్రమించెనూ పొలుపుగ యాశ్రమ మందుననూ! 4

ఆ మునీశ్వరుడు వాల్మీకులునూ యల శత్రుఘ్ననకును మఱియున్,
అనేక విధముల కథలను దెలిపెను నలరుచు మంజుల వచనములన్,
వేలకొలది వృత్తాంతంబులనూ విశదముగా వివరించె మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 5

మునీశ్వరుండును లవణుని వధకును మోదమునను సంబంధించిన యా
శత్రుఘ్నునితో బలికె నిట్టులను చక్కని దృష్టాంతంబులతో!

శత్రుఘ్నా! నీవును వధించితివి! శాత్రవుడగు లవణాసురునీ
చంపి శక్యమును కాని కార్యమును నింపుగ జేసితి విపుడు మఱిన్! 6

మహాబాహు! శత్రుఘ్నా! వినుమా! మానుగ లవణుడు దనతోడన్,
యుద్ధముజేసిన మహావీరులను యుద్ధతి జంపెను రణమందున్!
ఎందఱినో మఱి బలవంతులనూ చందముగా సైన్యముతోడన్,
వాహనములతో జంపివేసెనూ వరుసగ హయముల, నేనుగులన్! 7

పురుషశ్రేష్ఠుడ! యా పాపాత్ముని భూరి భుజంగము వలె నీవున్
అనాయాసముగ సంహరించితివి యలసట లేకుండగను మఱిన్!
నీ తేజస్సులచేత వానినీ నిస్తేజము గావించితివీ!
వానివలన యీ లోకమునందున వనరగ బాధలు దప్పినవీ! 8

భయంకరంబగు రావణ వధయును బహు ప్రయత్నములతోని మఱిన్
చేయగ బడినది కానీ నీవును జేసితి వీ ఘనకార్యంబున్
అనాయాసముగ బహు సుఖకరముగ యలరి జేసితివి నీవిపుడున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 9

ఈ లవణుండును జంపబడుటచే నిఖిల భూతములకును మఱియున్
దేవతలకు మఱి యక్షులు, నాగులు దీరుగ సమస్త ప్రాణులకున్,
సంతోషంబును గలిగినదియు మఱి వింతగాదు నా వచనములున్!
జగత్తు కంతకు శ్రేయము గలిగెను వగ మాసెను ప్రాణుల కిపుడున్! 10

పురుషశ్రేష్ఠుడ! శత్రుఘ్నా! విను! పూనికతో నీ యుద్ధంబున్
ఇంద్రుని సభలో నుండి జూచితిని సాంద్రముగా నే గనుగొంటిన్!
అపురూపంబును నీ పరాక్రమము నలరి జూచితిని నే నపుడున్!
నీ యాయుధముల గొప్ప దనంబును నిపుణత బరిశీలించితినీ! 11

శత్రుఘ్నా విను! నాకు గూడ మఱి సరసత హృదయము నందుననూ
మహాప్రీతియును గలుగుచున్నది మానుగ యానందంబు మఱిన్,
నీ శిరస్సు మఱి వాసన జూచెద నిర్మల భావము తోని మఱిన్
ఇది ప్రేమకు నత్యుత్తమమైనా నింపగు లక్షణ మదియు సుమా! 12

మహామతియును నా వాల్మీకులునూ మానుగ నా విధి బలుకుచునూ
ఆ శత్రుఘ్నుని శిరస్సుపైనీ యటుల మూర్కొనియు సుప్రీతిన్

ఆతనికిని మఱి యతని మిత్రులకు నాతిథ్యంబును నిచ్చె మఱిన్
కందమూలముల ఫలముల తోడను కమ్మని తేనియ మధారలతో! 13

భోజనంబు జేసియు గూర్చుండిన భూరిబలుడు శత్రుఘ్నుండున్,
ఉత్తమ మగు గీతుల మాధుర్యము నురుతరముగ గలిగిన యట్టి
శ్రీరాముని యా పవిత్ర చరితము శ్రీకరముగ యా సమయముననన్
రచియింపగ బడినట్టి విధమునను రమ్యముగా విని నాతండున్! 14

వీణాతంత్రుల లయ గూడినదీ విమలమైన త్రిస్థానములన్,
కరుణాన్వితమై గూడియున్నదీ, కడు సంస్కృతమై యున్నదియున్,
లక్షణములతో గూడియున్నదియు లాలితముగ సమతాలములన్,
కూడియున్నదియు, యా కాలమునను కుదురుగ పురాకృతమునైనా!
రామచరితమును విని శత్రుఘ్నుడు రమ్యముగా నా రాత్రియునూ! 15

పురుషశ్రేష్ఠుడు శత్రుఘ్నుండును పూర్వంబున నెటు జరిగినదో
జరిగినటులున్న సత్యములైనా జాగృతి గలిగిన యక్షరముల్
విని యాతండును విగత సంజ్ఞుడై మోహమునందున మునుగుచునూ
ముహూర్త కాలము అసంజ్ఞుండునై భాష్పలోచనుడును నగచున్
మాటిమాటికిని నిట్టూర్పుచు మఱి మానుగ యా గీతము వినెనూ!
జరిగిపోయినా వృత్తాంతంబును జరుగుచున్న దానికి వోలెన్! 16, 17

శత్రుఘ్నుని యనుచరులు గూడనూ సారసగీతి సుసంపదనూ
వినుచును నవాఙ్ముఖులు నగుచును మఱి వింతగ వినుచును దీనులునై!
'ఇది యాశ్చర్యము!' ననుచును బలికిరి యింపుగ మధురాక్షరములనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 18

ఆ ప్రదేశమున యే సైనికులును నలరి యుండిరో వారపుడున్,
పరస్పరంబును సంభాషించుచు బన్నుగ యాశ్చర్యమునందీ
ఇదేమి సోదరులారా! మనమును నే ప్రదేశమున నున్నామూ!
స్వప్నము జూచుచునున్నామా? మఱి స్వప్నము వినుచును నున్నామా? 19

పూర్వము మనమును ప్రత్యక్షముగను పొలుపుగ జూచిన విషయములన్
ఆశ్రమ పదమున వినుచున్నారము నది మఱి స్వప్నమ! సత్యంబా?

మహోన్నతంబగు సీత బంధమా? మఱి సంగీతపు దృఢ రచనా?
తెలియుటలేదుగదా మఱి యేదో తేటతెల్లముగ మనసునకున్! 20

వారందఱునూ బహు విస్మయమును వనరగ బొందుచు సైనికులున్,
శత్రుఘ్ననితో నిటులను బలికిరి భ్రాతృభావమున వారలునూ!
ఓ నరశ్రేష్ఠుడ! శత్రుఘ్నా విను! యొనరగ వాల్మీకుల వారిన్
స్పష్టముగా ప్రశ్నింపుము విషయము సరసత జరిగెడి సంగతులన్! 21

శత్రఘ్నుండును కుతూహలముతో సైనికులను గాంచుచు నతడున్,
వారలతోడను బలికె నిట్టులను వనరగ మదిగల భావమునూ!
ఈ దృశ విషయములనూ నిచ్చటనూ నింపుగ ప్రశ్నించుటయు మఱిన్
మనకును దగినదికాదు సుమా! మన మరియాదకు నిది భిన్నమగున్! 22

ఈ ప్రదేశమున మున్యాశ్రమమును నింపుగ యనేక విషయంబుల్,
జరుగుచునుండును నద్భుతంబులును జరుగుచుండు నాశ్చర్యంబుల్,
కానీ మనమును కౌతూహలమున కమనీయముగా ప్రశ్నింపన్!
ఈ మహామునిని యడుగుట దగదూ! నింపుగ యుక్తముగాదు మఱిన్! 23

రఘునందనుడగు శత్రుఘ్నుండును రయమున సైనికులను బిలిచీ
ఆ మహామునికి నమస్కరించుచు యంజలితో నటనుండి మఱిన్
తన శయన స్థానమునకు బోయెను దగ మున్యాశ్రమ మందుననూ!
బృహస్పతియు కనిపించెను నప్పుడు పొలుపుగ తూరుపు దిక్కుననూ! 24

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
డెబ్బది యొకటవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

డెబ్బది రెండవ సర్గము

(శత్రుఘ్నుడు వాల్మీకుల వారి యాజ్ఞనంది, అయోధ్యకు బోవుట, రామాదులతో కలిసి, అచ్చట సప్తదివసములు వసించుట, మరల మధురకు బయలుదేరి వెళ్లుట)

అనేకార్థములు, ససుత్తమంబగు నల శ్రీరాముని గీతమునూ
ఆలోచించుచు శయనించిన యా యలశత్రుఘ్నునికిని మఱియున్,
నించుకంతయును నిద్దురలేదూ! యంచితముగ యాలోచనతో!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

సుమధురంబును తంత్రీలయముల సమన్వితంబగు నట్టిదియున్
అట్టి రామచరితమున బుట్టినా నిట్టె శబ్దమును వినియు మఱిన్,
మహాత్ముడగు నా శత్రుఘ్ననకును మానుగ యా శుభరాత్రియునూ!
శీఘ్రముగను మఱి గడిచిపోయినది చీకుచింతలును లేకుండన్! 2

ఆ రాత్రియు మఱి తెలతెలవారెను నల శత్రుఘ్నుడు వేగముగన్
పూర్వాహ్ణమునకు సంబంధించిన పొలుపగు కార్యక్రమము మఱిన్,
పూర్తిచేసికొని నమస్కరించుచు బొందుగ యంజలి ఘటియించీ,
వాల్మీకులతో నిటులను బలికెను వాల్చి శిరస్సును వినయముగన్! 3

భగవంతుడ! ఓ పూజ్యుడ వినుమా! భవ్యమైన నా వచనములన్
రఘునందనుడగు రామచంద్రునీ రయమున దర్శించుటకు మఱిన్
మనసునందునను గోరుచుంటినీ మానుగ మౌనులతో గూడన్,
నీదు ననుజ్ఞను గోరుచుంటినీ నిర్మలమగు భావన తోడన్! 4

ఆ వాల్మీకులు నిటుల బలికెడీ యల శత్రుఘ్నుని పలుకు వినీ
సగౌరవముగా కౌగలించుకొని సరసత శిరసున ముద్దాడీ!
పోయిరమ్మనుచు ననుజ్ఞ నిచ్చెను బొలుపుగ యా రఘునందనునీ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 5

అటుబిమ్మట యా శత్రుఘ్నుండును యల వాల్మీకికి యంజలితో
నమస్కరించుచు కాంతియు గలిగిన రయమున రథమును నెక్కి మఱిన్,
ఆ శ్రీరాముని దర్శించుటకై యాతురతను గలుగుచు మదిలో
శీఘ్రముగా నాతడు నయోధ్యకును శ్రీకరముగ పయనం బయ్యెన్! 6

ఇక్ష్వాకుల వంశంబునకును మఱి యింపుగ బహు నానందంబున్
జేసెడివాడును మహా బాహువును స్థిరుడగు శత్రుఘ్నుండు మఱిన్,
సుందరమగు నా యయోధ్యపురినీ చందము ప్రవేశ మొనరించీ
మహాద్యుతియుగల రాముని భవనము మానుగ దర్శించెను నంతన్! 7

మంత్రుల మధ్యన నున్న యట్టి యా మానుగ పూర్ణ సుచంద్రునితో
సమానమైనా ముఖమును గలిగిన సరసత తేజము గూడిన యా
అమరుల మధ్యను నున్న యట్టి యా యలరు సహస్రాక్షునికి వలెన్
అట్టి రామచంద్రుని గనుచును మఱి నిట్టె ప్రవేశించెను సభలో! 8

ఆ శత్రుఘ్నుడు తేజస్సులతో నలరి ప్రకాశించుచునున్నా
సత్య పరాక్రమమును గలిగిన యా సరసత మహాత్ముడైనట్టీ,
రామచంద్రునకు నమస్కరించుచు రహి యంజలి ఘటియించి మఱిన్
ఈ విధముగ బలికెను రామునితో వినయ మొప్పగా మధురముగన్! 9

మహారాజ! ఓ రామచంద్ర విను! మానుగ నాదు సువచనములన్
ఆజ్ఞాపించిన దంతయు నేనును నలరి జేసితిని నంతయునూ
పాపాత్ముండగు లవణుడు రణమున బరిహరింపబడినాడుగదా!
అతని పురంబును గూడను రామా! యలరుచు నే నిర్మించితినీ! 10

రఘునందన శ్రీరామా వినుమా! రమ్యమైన నా వచనములన్
నీవును లేకుండగ నేనును నట నిలిచితి ద్వాదశవర్షంబుల్,
గడిచిపోయినవి రామా! వినుమా! కడు కఠినముగా గడిచినదీ!
నీవు లేక నే నివసించుట యట నిశ్చయింపజాలను నింకన్! 11

అపరిమితంబగు పరాక్రమంబును నలరినట్టి శ్రీ రఘురామా!
నా విషయంబున ననుగ్రహింపుము! నయముగ గాంచుము సుప్రీతిన్!

మాతృహీనయగు వత్సము వలెనూ మానుగ నేనుండగ జాలన్!
చాలకాల మిటు దూరదూరముగ దర్శింపగ జాలను నిన్నున్! 12

ఇటుల బలుకు నా శత్రుఘ్నుని మఱి యింపుగ కాకుత్స్థుం డపుడన్
కౌగలించుకొని యీ విధి బలికెను కమ్మని యాప్యాయత తోడన్!
శూరుడ! విషాదమును నందకుమా! సురుచిరముగ క్షత్రియులు మఱిన్!
జేయవలసినా పనికాదు సుమా! స్థిరకర్తవ్యము జేయుమిలన్! 13

శత్రుఘ్నుడ! విను నా వచనములను చారు సుందరత వెలయంగన్!
క్షత్రియు లెపుడును దిగులును జెందరు సహజ ప్రవాసము జేత మఱిన్,
క్షత్రియ ధర్మము ననుసరించి మఱి సరసత ప్రజలను నెప్పుడునూ
పరిపాలింపగ వలయుగదా మఱి పావనకర్తవ్యంబు మఱిన్! 14

నరశ్రేష్ఠుడ! ఓ శత్రుఘ్నా విను! నయముగ నాదు సువచనములన్,
ఆయా సమయములందు నీవు మఱి యవలోకించుటకును నన్నున్
అయోధ్య పురమునకు రావచ్చును నలరి జూడవచ్చును మమ్మున్
నీ పురంబునకు బోవగ వచ్చును నిస్తేజంబును నందకుమా! 15

ప్రాణంబులకంటెను మఱి నీవును బన్నుగ యిష్టుడవును దలపన్
సంశయంబు లేదెంత మాత్రమును సందేహంబును లేదు సుమా!
క్షత్రియు లెపుడును స్వరాజ్య పాలన సహజముగా జేయగవలయున్,
భార్యా పిల్లలు బంధుమిత్రులును బన్నుగ ప్రజలను తదుపరియే! 16

ఆ కారణమున కాకుత్స్థా విను! నలరుము నాతో నిటనుండీ
సప్త రాత్రములు నివసింపుము నిట! సఖునిగ బంధువుగా నుండీ!
అటుపై సభృత్య బలవాహనముల యలరి కూడికొని నీవు మఱిన్!
మధుపురమునకును వెళ్లగలవు సుమ ! మహి పాలింపగ నచ్చటకున్! 17

శ్రీరాముని యా ధర్మ యుక్తములు స్థిర మనోనుగమ వచనములన్
విని శత్రుఘ్నుడు దీన వచనముల విమలముగా బలికెను నిటులన్!
తప్పక యట్లే జేసెద రామా! దయతో గాంచుము! అని పలికెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 18

మహా ధనస్సును గల శత్రుఘ్నుడు మానుగ రాముని మాటవినీ,
శ్రీ రఘురాముని యాజ్ఞ ప్రకారము స్థిరముగ నొక వారము రోజుల్,
అయోధ్యయందున కాలము గడిపీ, యటుమీదట నాతండు మఱిన్,
మధుపురంబునకు ప్రయాణమాయెను మానుగ సహచరులను గూడీ! 19

మహాత్ముడును మఱి సత్యపరాక్రమ మహిమను గలిగిన రాఘవునీ!
భరతుని మఱియును నా లక్ష్మణునీ బన్నుగ యనుమతి జేసికొనీ
తల్లుల నందఱ గాంచి వారలకు దగ వందనములు జేసి మఱిన్
మహారథము నెక్కెను శత్రుఘ్నుడు మానుగ నందఱ పూజించీ! 19

మహాత్ములును భరతుడు లక్ష్మణుడును మానుగ బహుదూరము వచ్చీ
ఆ శత్రుఘ్నుని సాగనంపగా నాతండును సంతసమందీ
అన్నల నిద్దఱ కౌగిలించుకొని యలరుచు నంజలి ఘటియించీ,
తన నగరమునకు మధుపురమునకును తన్మయమున జేరెను నంతన్! 21

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
డెబ్బది రెండవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

డెబ్బది మూడవ సర్గము

(ఒకానొక బ్రాహ్మణుడు మరణించిన బాలుడైన పుత్రుని దీసికొని వచ్చి రాజద్వారము వద్దకు వచ్చి విలపించుట)

ఆ రాఘవుడును శత్రుఘ్నుని మఱి యల మధుపురికిని బంపి మఱిన్,
రాజ్యంబును మఱి ధర్మము జేతను రమ్యముగా బాలించుచునూ!
సుఖవంతుండై లక్ష్మణు తోడను సురుచిరముగ భరతుని తోడన్,
సంతోషముగా నుండెను రాముడు సకల సహచరుల గూడికొనీ! 1

అటుబిమ్మట మఱి కొన్ని రోజులకు నల జన పదమునకును జెందూ!
వృద్ధుడైన యొక బ్రాహ్మణోత్తముడు వికటముగా మరణించిన యా
బాలుని గైకొని రాజద్వారమున బన్నుగ వచ్చెను, రోదనతో,
భార్యా బంధులతోడను వచ్చెను బన్నుగ రాజును వినుతింపన్! 2

ఆ బ్రాహ్మణుడును పుత్రప్రేమతో అలరి దుఃఖమును గూడికొనీ
'పుత్రా! పుత్రా' యనుచు నేడ్చుచును భూరిధ్వనుల జేయుచును మఱిన్,
మాటి మాటికిని యనేక విధముల మాటలతో నేడ్చుచు నతడున్,
తనలో తానే రోదనతోడను దగ నీ విధముగ స్వగతముగన్! 3

పుత్రా! నేనును పూర్వజన్మమున బొలుపుగ యెంతటి పాపంబున్,
జేసితినోకద! బదునాల్గేడుల ప్రాయమునందున నీవు మఱిన్,
యౌవనమును బొందుటకును బూర్వము నీ విధి దుఃఖము గలుగుటకై
అకాలమందున మృత్యువాతబడి యట మరణించితి వీ విధమున్
బాలుడైన యేకైక పుత్రునీ బరగ యకాలము మరణంబున్,
చూడగ వలసియు వచ్చెను నా కిల చోద్యముగద! యీ విషయంబున్! 4

పుత్రక యల్పములైన దినములను బొందుగ మరణించెద నేనున్!
సందేహంబును లేదు సుమా! మఱి సంకోచంబును లేదు మఱిన్
నిన్ను గుఱించిన శోకముతోడను నేనును మరణించెద నిపుడున్
నీ తల్లియు మరణింప గలదు సుమ! నిశ్చయముగ శోకము తోడన్! 5

ఏనాడైనను నేను నసత్యము నిల బలికిన యటులనుగానీ,
ఏ ప్రాణికినీ హింస జేసినటు నెఱుగను నే జీవితమునమూ,

ఏ జీవులయందుననను బాపమును నింపుగ జేసిన యటుగానీ
నాకు జ్ఞాపకము లేదు సుమా మఱి నయముగ స్మృతియును లేదు గదా! 7

నా పుత్రుండును తల్లిదండ్రులకు నయముగ జేయగ వలసిన యా
సేవాదులు మఱి శ్రాద్ధ కర్మలను జేయక మునుపే బాల్యమునన్,
ఏ పాపముచే యమలోకమునకు నింపుగ బోయెనొ తెలియదుగా!
చిత్రమైన దీ లోకము మఱియును చిత్రమైనవీ కర్మలునూ! 8

రాముని కాలములో దేశములో కాలము కానీ వారలకే
ఈ విధముగ మృత్యువును వచ్చి మఱి నిలలో వేధించుచునుండెన్!
అట్టి భయంకర దృశ్య మెన్నడును నింపుగ జూడగలేదు గదా!
చెవులతోని మఱి వినలేదుగదా! చిత్రములును జరుగుచు నుండెన్! 9

దేశములోగల బాలురకును మఱి దీరుగ యకాల మరణంబున్
సంప్రాప్తించుచు నున్న దనగనూ సరిగా రాజగు రామునిలో,
గొప్ప పాప మేదో మఱియుండును గొప్ప దోషముండగ వచ్చున్,
అందుకనే యీ యకాలమరణము లందుకున్న వీ రాజ్యమునన్! 10

ఇతర దేశముల యందున్నట్టీ యిలలో బాలుర కెవ్వరికిన్
మృత్యు భయంబును లేదు గదా మఱి సత్యము నీ బాలుని కిపుడున్
రాజా! యీ బాలకుని వేగమే! రయమున బ్రతికింపుము వేగన్!
ఇతర దేశముల ధర్మమువలె నిల యింపుగ నిలుపుము ధర్మంబున్! 11

నేనును మఱి నా భార్యయు గూడను నిజముగ యనాధులకు బోలెన్,
రాజద్వారమున మరణింతుము నిక రమ్యముగా శ్రీరఘురామా!
నీవు బ్రహ్మ హత్యాపాపముతో నిఖిలంబును బాలించుచునూ!
సుఖ సంతసములతోని నుండుమా! సురుచిరముగ తమ్ములతోడన్! 12

ఇట్టి పుణ్యమును జేసిన నీవును గట్టి కాలమును వర్ధిలుమా!
హాహాకారంబులతో మేమును నలమటించెదము రాజ్యమునన్!
నీ రాజ్యంబున గనుమా మేమును నిత్యోత్సవమున నుంటిమిగా
అకాల మరణంబులతో మేమును నడలుచుంటిమీ రఘురామా! 13

బాలుర మరణానికి హేతువునగు బన్నుగ రాముడు బాలింపన్
నాథుడులేనీ దేశమైనదీ నయముగ యకాల మృత్యువులన్,
ఇక్ష్వాకులు పాలించిన దేశము నిలలో నీ నాడును మఱియున్
నాథుడులేని దేశమైనదీ నయముగ యాపదలను నిండీ! 14

శాస్త్ర విరుద్ధంబైన రీతిలో బరిపాలింపగ బడిన ప్రజల్
రాజుజేసినా దోషంబులకును రహి యాపదలును జెందుదురూ!
రాజు చరిత్రము దుష్టమైనచో రమ్యముగా ప్రజలును మఱియున్
అకాల మరణము జెందుచు నుందురు నలవికాని వేదన తోడన్! 15

పురములందు మఱి గ్రామములందును బొలుపుగ నివసించెడి వారల్
అయుక్త కార్యంబులు జేయుచునూ యంతట యరాజకంబు మఱిన్!
రక్షణయును లేకుండినపుడు ధర రాక్షసత్వమును వృద్ధియగున్!
మృత్యుభయంబును గలుగుచు నుండును సత్యముగను రాజ్యము నందున్! 16

సుస్పష్టముగా రాజ దోషమే! సురుచిరముగ పరిశీలంపన్
సందేహము లే దెంత మాత్రమును సరసత యాలోచింపగనూ!
అందుచేతనే పురముల యందును చందముగా గ్రామములందున్,
బాలకులును మరణించుచుండిరీ బన్నుగ యకాల మరణంబుల్! 17

ఈ విధముగ యా బ్రాహ్మణుండునూ యింపుగ యనేక విధములనూ
మాటల చేతను మాటిమాటికిని మనుజేంద్రుని నిర్బంధించీ
దుఃఖపీడితుండై యా విప్రుడు దోరముగా తన సుతుని మఱిన్,
కౌగలించుకొనుచుండెను నాతడు గడు తీవ్రముగా దుఃఖమునన్! 18

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
డెబ్బది మూడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

డెబ్బది నాల్గవ సర్గము

(తపస్సు జేయుచున్న శూద్రుడు అధర్మము జేయుటయే బ్రాహ్మణ పుత్రుని మరణమునకు హేతువు అని నారదుడు రామునకు తెలుపుట)

రామచంద్రుడును దుఃఖము తోడను రహి శోకము గూడిన యట్టి
బ్రాహ్మణుండు చేసిన దీనమునగు బన్నుగ విలాప మంతయునూ!
విని దుఃఖముతో మనసునందునను వికృత పరివేదన నందీ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

ఆ శ్రీరాముడు దుఃఖముతోడను నలరుచు గూడిన వాడగుచున్
మంత్రులందఱిని మఱి పిలిపించెను జింతిత మానసుడు నగుచున్,
వసిష్ఠునీ మఱి వామదేవునీ వనరగ నందఱ బిలిపించెన్,
ఆ యా గణ ప్రముఖుల నందఱనూ నలరి సభకు మఱి బిలిపించెన్! 2

అటుబిమ్మట యా వసిష్ఠ తోడను నలరి ప్రవేశింపగ బడినా
ఎనమండ్రుగురగు బ్రాహ్మణు లందఱు నింపుగ నటు బిమ్మటను మఱిన్
దేవతుల్యుడగు రాజును గూర్చి దీరుగ విజయీభవ! యనుచున్!
అని బలుకుచును దీవెన లిచ్చిరి నలరి వేద వాక్యంబులతో! 3

మార్కండేయుడు మౌద్గల్యుండును మానుగ వామను దేవుండున్
కాశ్యపుండు మఱి కాత్యాయనుడును గౌతముండు జాబాలి మఱిన్
నారదుండునూ బ్రాహ్మణోత్తములు నయముగ నందఱు బ్రాహ్మణులున్
ఆసనముల మీదను నందఱునూ యలరి గూర్చొనగ జేరి రటన్! 4

సమనుప్రాప్తులై వచ్చిన ఋషులును సరసన వచ్చిన మునుల మఱిన్
రామచంద్రుడును నంజలి తోడను నలరి నమస్కృతులను జేసీ
మంత్రులనూ నైగముల గూడ మఱి దగు విధముగ సత్కారములన్
అనుకూలముగా జేసి కొనెను మఱి యంజలి ఘటించి వినయమునన్! 5

సముపవిష్టులును దీప్త తేజసులు సకల మహాత్ముల బరికించీ
వారలనందఱ గూర్చొనజేసీ వనరగ నీవిధమున బలికెన్
ఈ బ్రాహ్మణుడును నిందించుచు మఱి నిష్ఠురముగ బలుకుచునుండెన్
అనుచు బలికి యా విషయ మంతయును నలరి బలికె కథ యంతయునూ! 6

దీనుడైన యా రాజు మాట విని దీన వాక్యముల వినియు మతిన్
ఋషుల సమక్షమునందు నారదుడు రూఢిగ యీ విధమున బలికెన్
శుభకరమగు వాక్యమును బలికెనూ గురుతరముగ నందఱు వినగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 7

రాజా! ఓ శ్రీ రఘురామా విను! రమ్యమైన వచనముల మతిన్
ఆ బాలునకును సకాల మరణము నలరి యెటుల బ్రాప్తించినదో!
ఆలకింపుమా రాజా! రామా! యాలకించి యా బిమ్మటనూ!
ఏమి చేయవలెనో యది చేయుము నింపుగ కర్తవ్యంబు మతిన్! 8

పూర్వకాలమున కృతయుగమందున పొలుపుగ బ్రాహ్మణులే యపుడుస్
తపస్సు జేసెడి వారు సుమా! మఱి దగ జపముల జేసెడి వారున్!
ఆ బ్రాహ్మణుడును నెన్నడుగూడను నే విధమగు తపమును జపమున్
జేసెడి వారును కానేకాదూ జేరి మంత్రములు జదువుచునూ! 9

ప్రజ్వలించు నా యుగమునందునను బన్నుగ యజ్ఞానం బనెడీ
యావరణంబును లేకయుండెనూ యంతయు బ్రహ్మ మయంబగుచున్,
ప్రకాశించుచుండెను నా కాలము బ్రహ్మ కాలమని దెలుపదగున్,
ఆ సమయంబున జనులందఱునూ యల మృత్యువునూ లేకుండన్,
త్రికాల జ్ఞానము గలవారగుచును స్థిర చిత్తము గల వారగుచున్! 10

రామా! పూర్వము కృతయుగమందున రయమున సర్వము గూడ మతిన్
బ్రహ్మమయంబై యున్నత స్థితిలో బరగ నుండె నా సమయమునన్,
అబ్రాహ్మణుడును తపస్సులేకను నలరి యుండెడీ వాడు మతిన్,
లేనేలేడూ! నరాధిపా! విను లీలగ నాదు సువాక్యములన్! 11

అట్టి బ్రహ్మమయమైన, యాపదలు లేని యుగంబది శ్రీరామా!
దేదీప్యంబుగ ప్రకాశించెనూ దీరుగ జగమంతయును మతిన్
అందఱు ద్విజులే! ఆ యుగమందున నందఱును బ్రాహ్మణులు మతిన్,
అకాల మృత్యువు లేనివారలై నందఱు రోగములును లేకన్
సుఖసంతృప్తిని జెంది యుండిరీ, సురుచిరముగ కృతయుగమందున్! 12

అటు బిమ్మటనూ దృఢదేహముగల అల మను వంశస్థుల తోడన్
గలిగిన త్రేతాయుగము వచ్చినది కడు విక్రమమును వికసింపన్,
అల త్రేతాయుగమందు క్షత్రియులు నల విప్రులతో బాటుగనూ!
తపస్సు గల వారగుచును వారును తరుగని భక్తి ప్రపత్తులతో! 13

కృతయుగమందున బ్రాహ్మణ జాతియు మత వీర్యంబుల నధికముగా
నాధిక్యంబును గలదై యుండగ యల క్షత్రియ జాతియు నపుడున్,
తక్కువగా నుండెడి దప్పుడు మఱి దగ యాధిక్యము లేకుండన్,
అది యంతయు మఱి త్రేతాయుగమున నల సమానమగు వీర్యముతో
సమానంబులును నైపోయినవీ సరసత యొక్కటిగా మారెన్!
త్రేతాయుగ బ్రాహ్మణ జాతియు మఱి కృతయుగ బ్రాహ్మణ జాతికినీ
తక్కువగా మఱి పరిగణింపబడి దగ గాంచగ బడుచుండె నటన్! 14, 15

అపుడు శాస్త్ర నిర్మాతలు గూడను నలరు బ్రాహ్మ క్షత్రియు లందున్
భేదము నధికము లేకపోవుటను సాదరముగ యా సమయమునన్,
అందఱికిని మఱి సమ్మతమ్మైనా యలరు సకల జాతుల నపుడున్,
చాతుర్వర్ణంబుల సమాజమును జతురత కల్పించిరి యపుడున్! 16

ధర్మప్రచురమ్మై, యధర్మమ్మైనా దగ యావరణము లేనట్టీ
త్రేతాయుగము ప్రకాశమానమ్మై తేజరిల్లు చుండగ నపుడున్!
భూమి మీద మఱి యధర్మంబునూ పొలుపుగ యొక పాదమునుంచెన్,
అట్టి బంధ సంబంధముచే తమ నల వారల తేజస్సు మఱిన్
కొంచెము తగ్గెను ధర్మము గూడను నంచితముగ పాదము దగ్గెన్! 17, 18

భూమిమీద మఱి యధర్మ పాదము పొలుపుగ ప్రసరించుట చేతన్
అంతకు పూర్వము కృష్యాదికమును నలరి మాంసమును బోలె మఱిన్,
రజోగుణంబును మలమును వలెనూ రయమున పూర్వులు విడనాడీ
పరిహరించిరో యట్టి యనృతము బన్నుగ కృష్యాదికము మఱిన్
అధిక ప్రచారములోనికి వచ్చెను నా యధర్మ పాదముజేతన్! 19

అధర్మంబు ఒక పాదము చేతను ననృతమును వ్యాపింపగనూ
పిదప పూర్వమున కృతయుగంబులో ప్రేరణ జేతను ధర్మంబున్
ఆయుర్దాయ ప్రమాణము గూడను నలరు దగ్గు ముఖము నుట్టెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 20

అధర్మంబు నిల ధరిత్రిపైనీ అలరి వ్యాప్తిజేసిన గూడన్
ఈ ధరాతలము సత్యధర్మముల నింపుగ యాసక్తియు గలదై
శుభకర్మంబుల మాత్రము జేసెను శుద్ధభావమున మదియందున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 21

త్రేతాయుగమున బ్రాహ్మణులును మఱి క్షత్రియులును గూడన నపుడున్
తపస్సుజేసిరి సత్కర్మల మఱి దగజేసిరి లోకంబునకున్
ఇతర జనులు మాత్రము వారలకును నిలజేసిరి శుశ్రూషలనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 22

వారి లోపలను వైశ్య శూద్రులకు వనరగ శుశ్రూషను జేయన్
పరమ ధర్మముగ యేర్పడి నప్పుడు వరముగ భావించిరి యపుడున్
విశేషించి మఱి శూద్రులందఱును విమలముగా మఱి యందఱకున్,
సేవాభావము చేతనుండిరీ సేవా శుశ్రూషల తోడన్! 23

రాజశ్రేష్ఠుడా! వైశ్యశూద్రులకు రహి యధర్మమును నన్పృతముల్
సంక్రమించినా తరువాతను మఱి సరసత మధ్య సుకాలమునన్
త్రేతా ద్వాపర సంధికాలమున దీరుగ వెనుకటి వారికినీ
బ్రాహ్మణ క్షత్రియులకు గూడను మఱి బన్నుగ ప్రకాశమును దగ్గెన్! 24

అటు మీదట యీ భూమి మీదనూ యధర్మ ద్వితీయ పాదంబున్!
దిగియు మఱియునూయాక్రమించెనూ ధీరత ధర్మంబున గూడన్!
అందువలన యీ యుగమునకొచ్చెను నలరు ద్వాపరము నను పేరున్!
అన్పృతంబు మఱి యధర్మంబునూ యలవృద్ధియు బొందెను నపుడున్! 25

పురుషశ్రేష్ఠుడ! రాజా వినుమా! పొలుపుగ నాదు సువచనములన్
ద్వాపరమనియెడి నామము గలిగిన దగ యుగంబు జరిగెడి వేళన్!
అధర్మంబు మఱి యన్పృతంబునూ దగవృద్ధిని బొందును నపుడున్
ధర్మము రెండగు పాదంబులచే దగ నడుచును వసుధా స్థలిలో! 26

ద్వాపర మనియెడి పేరును గలిగిన దగ యుగమందున తపస్సునూ
వైశ్యుల యందున బ్రవేశించెనూ వనరగ జప తప ధ్యానంబుల్,
ఈ విధముగ యా తపస్సు గూడను నింపగు మూడగు యుగములనూ
మూడు వర్ణముల యందున గూడను మోదముగను బ్రవేశించెన్! 27

రామా! మూడగు యుగములందునను మోదముగా నీ తపసు మఱిన్
మూడు వర్ణముల వారల యందున ముదమున యున్నది శ్రీరామా!
శూద్రునకును మఱి యుగానుసారము సురుచిరమగు ధర్మంబు మఱిన్
తపస్సులును లభ్యంబులు కావూ! దగ యోజించిన గూడ మఱిన్! 28

నరశ్రేష్ఠుడ! ఓ రామా వినుమా! నయముగ నాదు సువచనములన్
శూద్రుడు తపమును జేయగూడదూ సురుచిరముగ నీ యుగమందున్,
కానీ కలియుగమందు శూద్రునకు గడు తపస్సు జేయుట గలదూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 29

రాజా ద్వాపర యుగమునందునను రయమున శూద్రులు దపస్సునూ
జేయుట మిక్కిలి యపరాధము సుమ! స్థిరముగ యధర్మమును గూడన్
నీ దేశంబున యొక ప్రాంతంబున నిండిన దుర్బుద్ధియు యొకడున్
శూద్రుడు దపస్సు జేయుచు నుండెను స్థిరముగ బ్రాహ్మణునికి వోలెన్
అందువలననే బ్రాహ్మణ బాలుడు నలరి మృతియు జెందెను నిపుడున్! 30

దుష్టబుద్ధిగల యే నరుడైనను దోరముగా రాజ్యము నందున్
పురమునందునను నధర్మమైనది పొలుపుగ జేయగ రానిపనీ!
చేసినచో నది యలక్ష్మి గలిగీ పొలుపుగ రాజు నధర్మమునన్
బడిపోవును మఱి సంశయంబునూ బన్నుగ సందేహము లేదూ! 31

ప్రజలను ధర్మముగా బాలించిన ప్రభునకు అధ్యయనము జేయూ,
పుణ్యములోనూ, తపస్సులోనూ పుణ్య కార్యముల యందుననూ,
ఆఱవ వంతును పణ్యాఫలంబును నలరి జేరు కర్తకును మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 33

ఆఱవ భాగము గైకొనుచును మఱి యలరి ప్రజల రక్షింపనిచో
ఎట్లు? అదియు యపచారము గద మఱి యలరి యట్లు జేయుట తగునా?
పురుష శ్రేష్ఠుడ! శ్రీ రఘురామా! పొలుపుగ నీవును శీఘ్రముగన్!
రాజ్యము నంతయు బరిశోధింపుము! రహి దశ దిశలను వేగముగన్! 33

రామా! ఎచ్చట పాపకార్యమును రహి జరుగుచు నున్నది మఱియున్
చూచుటకును మఱి ప్రయత్నింపుమా! సురుచిరముగ నంతటను మఱిన్
ఇట్లు జరుగుచో ధర్మంబునకును నింపుగ వృద్ధియు గలుగు సుమా!
ఆయుర్వృద్ధియు జరుగు జనులకును యా బాలుడు జీవించు మఱిన్! 34

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
డెబ్బది నాల్గవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

డెబ్బది యైదవ సర్గము

(రాముడు పుష్పకము నెక్కి తన రాజ్యములో నంతటను దిరుగుచు, పాప కర్మలు జరుగుచున్నవా? యని అన్వేషించుట, అంతటనూ పుణ్యకర్మలు జరుగుచుండుట కనుగొనుట, దక్షిణ దిక్కున తపస్సు జేయుచున్న శూద్రుని యొద్దకు బోవుట)

అమృతమయమువలె నున్న యట్టియా యలరు నారదుని పలుకువినీ,
రామచంద్రుడును సాటియులేనీ రమ్య సంతసము నొందె నటన్!
తమ్ముడు లక్ష్మణుతోని బలికె నిటు నిమ్మగ మోదము బొంగారన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

సౌమ్యుడ! సుమిత్ర నందన వినుమా! సరసత నాదు సువచనములన్,
ఉత్తమ వ్రతములు గల బ్రాహ్మణునీ యోదార్పుము వేగము నీవున్
బ్రాహ్మణ బాలుని శరీరంబునూ బనగ నూనె తొట్టిని వేగన్!
బెట్టింపుము! వే రక్షింపుము మఱి ప్రీతి పాత్రమున నీవు మఱిన్! 2

సౌమ్యుడ! ఓ లక్ష్మణ కుమార విను! సౌమ్యముగా నా వచనములన్
బహు శ్రేష్టములును, సుగంధములనూ బన్నుగ వాసన గలిగిన యా
తైలంబులనూ యుపయోగించియు దగ యా బాలుని శరీరమున్
క్షీణింపగ మఱి జేయబోకుమా స్థిరముగ జేయుము నేర్పాటుల్! 3

అక్లిష్ట కర్మణుడైన బాలునీ యల శరీరమును నెవ్విధమున్
రక్షింపగ దగునో నా విధమును రక్షింపగ జేయుము వేగన్!
విపత్తిగానీ, పరిఖేదంబును వికృతమును గాకుండునటుల్
జేయుము లక్ష్మణ! బ్రాహ్మణ బాలుని శ్రీకరముగ బ్రతికించు నటుల్! 4

మహాకీర్తిగల కాకుత్స్థుండును మానుగ శ్రీరాముడును మఱిన్
శుభలక్షణములు గల లక్ష్మణుతో సూటిగ బలుకుచు నీ విధమున్,
మఱల రాముడును మనసునందునను మానుగ పుష్పకమును గూర్చి
'ఇచటికి రమ్మా' యనుచు బిలిచె మఱి నింపుగ యాలోచించి యిటుల్! 5

హేమభూషితంబైన పుష్పకము నింగితమును మఱి దెలిసికొనీ,
రాముని యొక్కయు యభిప్రాయమును రయమున పుష్పకమును దెలిసీ

ముహూర్త కాలము నందున వచ్చెను మోదముగా రాముని కడకున్
ఆజ్ఞ యేమనుచు ప్రశ్నించెను మఱి యలరుచు వినయముతోని మతిన్! 6

ఆ పుష్పకమును వంగి నమస్కృతి యలరి జేసి రాముని తోడన్
'నరాధిపా! ఓ రామా! వినుమా? నయముగ నే నిటనున్నానూ!
మహాబాహు! నీవశ్యుండును నే మానుగ నీ కింకరుడను నే!
వచ్చినాను! ననుచును బుష్పకమును వనరగ బలికెను రామునితో! 7

నరాధిపుండగు రామచంద్రుడును మానుగ పుష్పకమును బలుకూ
రుచిరముగను నా మాటలు వినుచును రూఢిగ మునులకు శీఘ్రముగన్,
అంజలి ఘటించి యాశీస్సులుగొని యా మహా మునుల దీవెనలన్
గొనుచు వేగమున విమాన మెక్కెను కూరిమి జనులందఱు గనగన్! 8

ధనస్సు మఱియును నంబుల పొదినీ దగ రుచిరంబగు కాంతియునూ
గల ఖడ్గంబును ధరించి రాముడు కరమున భరతుని లక్ష్మణునీ!
నిద్దఱనూ నగరంబున నుంచీ నింపుగ వెతుకుచు నటునిటులన్,
పశ్చిమ దిక్కునకును బయనించెను బన్నుగ రాముడు వేగముగన్! 9

శ్రీమంతుండగు రామచంద్రుడును స్థిరముగ హిమవత్ గిరి చేతన్
ఆదరింపబడినట్టి యుత్తరపు అలరు దిశకు గూడను బోయీ!
అధర్మమును మఱి జూడనివాడై నటు బిమ్మట పరిశుద్ధమగూ
ఆచారముగల యుద్ధము వలెనూ మఱి నిర్మలముగ నున్నట్టీ
తూర్పు దిశకు మఱి బోయి గాంచెనూ తోరముగా నా ప్రాంతంబున్! 11

మహాబాహువును దశరథ పుత్రుడు నరాధిపుండగా రాఘవుడున్,
పుష్పకంబుపై నున్నవాడనూ పొలుపుగ దక్షిణ దిక్కునకున్
పోయి జూచెనూ నటుబిమ్మటనూ పొలుపుగ శైవల పర్వతమున్!
దానికి యుత్తర ప్రక్కను నుండిన దగ విశాలమగు సరస్సునూ
గాంచెను నచటను నయోధ్య రాముడు గాంభీర్యంబును జెలగుచునూ! 12, 13

రాఘవుండు నా సరస్సునందున యధో ముఖంబున నున్నట్టీ
వ్రేలాడుచునూ విమల తపస్సును విమలతరముగా జేసెడి యా
యొక మహామునిని గాంచెను రాముడు ప్రకటిత సుందర ప్రకృతినీ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 14

ఉత్తమమైనా తపస్సు జేసెడి యురుతర తపసిని గాంచి మఱిన్
ఆతని జోడను నిటులను బలికెను నతని సమీపమునను జేరీ
సువ్రత! వినుమా! ధన్యుండవు సుమ! సురుచిరముగ యా తపసు మఱిన్
ఎందులకును మఱి జేయుచుంటీవీ? కందుచు నీ విధముగను మఱిన్! 15

తపో వృద్ధ! ఓ దృఢ విక్రమ విను! దగ శాంతంబును గలవాడా!
మునీంద్ర! నీవును దెలుపుము నాకును మోదముగా నీ వెవ్వఱవూ!
ఏ జాతికి మఱి జెందినవాడవు? యింపుగ తెలియగ యడిగితినీ!
వేడుకగా నే నడగుచుంటినీ, విమలముగా దెలుపుము నాకున్!
శ్రీ దశరథునీ జ్యేష్ఠ కుమారుడ! స్థిరముగ బిలుతురు రాముడనీ! 16

ఎవరును జేయగ జాలని తపసును నింపుగ జేయుచు నుంటి విటన్,
నీవు వరముగా పొంద దలచినది నిర్ద్వంద్వముగా దెలుపు మికన్!
ఈ తపస్సునకు ప్రయోజనంబును నింపుగ ఫలితము దెలుపు మికన్!
స్వర్గంబును మఱి గోరుచుంటివా? మార్గంబును మఱి వేఱొకటో? 17

తాపస దెలుపుము నే కోరికతో తపసు జేయుచుంటివి యిచటన్
వినగోరుచునుంటిని తాపసుడా! విమలముగా నీ వచనములన్,
బ్రాహ్మణుండవా? జయింపరానీ ప్రబలమైన విక్రమము గలా!
క్షత్రియుండవా? వైశ్యుండవ మఱి క్షాత్రబుద్ధిగల శూద్రుడవా?
నీకు భద్రమగు గాక! సత్యమును నిర్మల మనసున దెలుపు మికన్! 18

నరాధిపుండగు రామచంద్రుచే నయముగ బిలువగ బడినట్టీ
ఆతడు క్రిందికి శిరసును గలుగుచు నా నృపపుంగవు డైనట్టీ!
ఆ దశరథునీ కుమారుండునగు యల శ్రీరామునికిని మఱియున్
తన జాతిని మఱి తా నెవడైనది తాను దేని కొఱకును మఱియున్
తపస్సు జేయుచు నున్నాడో మఱి దగ దెలిపెను శ్రీరామునకున్! 19

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
డెబ్బది యైదవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

డెబ్బది యాఱవ సర్గము

(శ్రీరాముడు జంబూకుని వధించుట దేవతలు ప్రశంసించుట అగస్త్యాశ్రమములో అగస్త్యుడు రాముని సత్కరించి అతనికి యలంకారమును నిచ్చుట)

అక్లిష్ట కర్మణుడైన రామునీ యా వచనములను వినియు మఱిన్
'అవాక్శిరుండై యటులే యుండియు నలరి బలికె నిటులను నతడున్! 1

మహాయశస్సును గలవాడా! విను! మానుగ నాదు సువచనములన్,
శూద్రయోని యందున జన్మించితి సురుచిరముగ యొకనాడు మఱిన్,
నుగ్రమైన తపసును నేనును మఱి యవలంబించియు నున్నాడన్!
శరీరంబుతో గూడువాడనై సరసత దేవత్వంబు మఱిన్
గోరుచుంటినీ యందు కొఱకునై కూర్మి తపసు జేయుచు నుంటిన్! 2

శ్రీరామా విను! నేనిప్పుడు మఱి స్థిరముగ సత్యము బలికితినీ!
అసత్యమును నే బలుకుటలేదూ! యలరుచు మిథ్యావచనములన్!
శూద్రయోని యందున బుట్టితినీ సురుచిరముగ నుగ్రమునైనా
తపస్సు నే నవలంబించితినీ దగ దేవత్వమును గూడిన యా
శరీరంబుతో నందగోరుచును సరసత నిర్మల భావనతో
శంబూకుండను నామముతోడను సరసత నుంటిని లోకమునన్! 3

ఆత డటుల బలుకుచు నుండగనే యలరుచు శ్రీరాముడు వేగన్
ధగధగలాడుచు నున్న యట్టి యా దగ నిర్మలమగు ఖడ్గమునన్!
ఒరలో నుండియు దీసి వేగముగ యొద్దిక శిరసును ఖండించెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 4

ఆ శూద్రుండును నా విధంబుగను నటుల జంపబడు చుండగనూ
అటుబిమ్మట యింద్రాగ్ని దేవతలు నలరి 'సాధు సాధు' అని బలికి మఱిన్
మాటిమాటికిని ప్రశంసించిరీ మానుగ శ్రీరామని యిపుడున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 5

వాయువు చేతను నెగుర గొట్టబడి వనరగ సుగంధ పుష్పములున్-
దివ్యమునైనా పుష్ప వర్షమును బూనికతో నంతట గురిసెన్!

అప్సరసలునూ యాడిరి పాడిరి యందముగా నాకాశమునన్,
గంధర్వులునూ బన్నుగ బాడిరి కలకల ధ్వనులను జేయుచునూ! 6

దేవతలందఱు ప్రీతిని జెందుచు దీరుగ సత్య పరాక్రమమున్
గలిగినట్టి యా రాముని తోడను కమ్మని బలుకులతో నిటులన్,
మహాబుద్ధిగలవాడా రామా! మానుగ విను! మా వచనములన్
దేవ కార్యమును నీ విటులను మఱి తేజముగా జేసితివి మఱిన్! 7

శత్రువులను మఱి సంహరించితివి సరసత సమయము నందుననూ
ఇష్టమైన వరమును మఱి గోరుము! నిష్టము తోడను నిచ్చెదమూ!
ఇట్లు నీవు సంహారము జేయగ యీ శూద్రుడు తపముల ద్వారా
స్వర్గము జేరుట యనునది తప్పెను సరసత యీ కార్యము జేతన్! 8

రామా! నీవును స్వయముగాను మఱి రహి సంహారము జేయుటచే
ఈతడు శూద్రుడు కాడు మఱియునూ యీతని శూద్రత్వము బోయెన్!
ఇతడు స్వర్గమును నందగలడు మఱి నీతడు దివ్యత్వము నందున్!
రాజే స్వయముగ దండించుటచే రహి యీతడు దపసుల చేతన్
పొందశక్యమును గానటువంటీ అందరాని స్థానము నందెన్! (కాళిదాసు) 9

సత్య పరాక్రముడైన రాముడును సరసత దివిజుల మాటవినీ
అంజలి ఘటించి నమస్కరించుచు నల సహస్రాక్షుడగు నింద్రునితో,
ఈ విధముగ బలికెను రఘురాముడు నింపుగ మధురాక్షరములనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 9

దేవతలును నా విషయమునందున దీరుగ ప్రసన్నులును నగుచో
ఆ బ్రాహ్మణ పుత్రుండు మఱలనూ యలరుచు జీవించును గాతన్!
నాకు చాల నిష్టంబౌ వరమును నయముగ నిత్తురు గాత మఱిన్!
అనుచు బలికె నా శ్రీరాముండును నాదివిజులతో గూడికొనీ! 10

ఆ విప్రుని యేకైక పుత్రుడును నా బాలుండును వేగ మఱిన్,
నా యపరాధము జేతను బొందెను నకాల మరణంబును నతడున్!
కాలము చేతను యమక్షయమునకు కఠినముగా కొని పో బడియెన్!
ఆ బాలుని బ్రతికింపుడు మీరలు నలరి మీదు దివ్యత్వమునన్! 11

అకాల మృత్యువు జెందిన పుత్రుని యలరి నేను బ్రతికించెదనూ!
అనుచు నేను బ్రతినను జేసితినీ యా బ్రాహ్మణునికి నేను మఱిన్!
నేను బలికినా దానికి మీరలు నిజమును జేయుడు సురలారా!
మీకు శుభంబును గలుగును గాతను! మీకు మంగళంబగు గాతన్! 12

ఆ శ్రీరాముని తద్వాక్యము విని యలరుచు దేవత లందఱునూ!
శ్రేష్ఠులైన యింద్రాది దేవతలు శ్రీకరముగ సంతోషించీ,
సంతోష పూర్వకము నిటులను బలికిరి సరసత పొంగారగ నంతన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 13

రఘురామా! నిశ్చింతగ నుండుము! రమ్యముగను సంతోషమునన్,
ఈ దినమందే యా బాలకుడును నింపుగ మఱలను జీవితమున్
పొందినాడు మఱి బంధు సమీప్యము నందినాడు గద రూఢిగనూ!
నీ వాక్యంబును నిజమాయెను సుమ! నిఖిల సురలు పూవులు జల్లన్! 14

కాకుత్స్థా! మఱి యా శూద్రుండును కదిలిపోయెనో ఖడ్గమునన్
ఆ ముహూర్తమున యా బాలుండును నలరుచు జీవించెను పృథ్విన్,
తండ్రితోని మఱి కలిసిపోయెనూ తల్లిని జూడగ యాతండున్!
తల్లిదండ్రులును బంధు మిత్రులును దగ సంతసమును నంది రటన్! 15

నరర్షభా! ఓ రామా! వినుమా! నయముగ మాదు సువచనములన్,
స్వస్తియగును గాతను నీకును మఱి సరస మంగళము నగుగాతన్!
మంచిది రామా! మేము బోయెదము నంచితముగ శీఘ్రంబుగనూ!
ఆగస్త్యునీ యాశ్రమము జూడగా నలరుచు గోరుచు నున్నామూ! 16

మహా కాంతిగల బ్రహ్మ ఋషియునగు నా యగస్త్యునీ దీక్ష మఱిన్
సమాప్తమైనది రఘురామా! విను! జలశయ్యను శయనించి, మఱిన్,
ద్వాదశ వర్షము పూర్తియైనదీ దగ దీక్షయు ముగిసెను నిపుడున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 17

కాకుత్స్థా! యా కారణముననూ కడు వేగముగా నా మునినీ,
అభినందించుటకును మేమును మఱి యలరి పోయెదము మే మిపుడున్,
నీకు భద్రమగు గాత! నీవునూ నిర్మలుడగు నా మహామునిన్
గాంచుటకును మఱి బయలుదేరుమా! కడు వేగముగా నచ్చటకున్! 18

రఘునందనుడగు రామచంద్రుడును రయమున దేవతలకు నపుడున్!
అట్లే! యనుచును ప్రతిజ్ఞ జేసియు నల బంగారము జేత మఱిన్,
అలంకరింపగ బడిన పుష్పకము నారోహించెను శీఘ్రముగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 19

అటుబిమ్మట యా దేవతలందఱు నధికమైన విస్తరముననూ
విమానములనూ బయనించిరి మఱి విలసిత భక్తి ప్రపత్తులనూ!
రాముడుగూడను బహు శీఘ్రముగా రమ్యముగా నా యగస్త్యునీ
తపో వనమునకు బయనంబాయెను దర్శింపగ యా యగస్త్యునీ! 20

తపో నిధియు మఱి ధర్మాత్ముండును నా యగస్త్యుడును శీఘ్రముగన్,
వచ్చినట్టి యా దేవతలను మఱి మచ్చికతో దర్శించి మఱిన్
వారి నందఱిని బహు నాదరమున యాహ్వానించెను వినయముగన్!
అర్ఘ్య పాద్యముల సమర్పించెనూ యందఱికిని సమముగ నపుడున్! 21

అటుబిమ్మట యా దేవతలందఱు నగస్త్య పూజలు గ్రహియించీ,
మహా మునిని గూడను బూజించియు మానుగ యర్చనలను జేసీ,
అనుచరులను మఱి కలిసిపోయిరీ ఆనందముతో దివికి మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 22

దేవతలందఱు బోవుచుండగా దీరుగ కాకుత్స్థుడు గూడన్,
బంగరు పుష్పకమును దిగి యాతడు బహుముఖ ప్రజ్ఞయు గలిగిన యా
ఋషి సత్తముడగు నగస్త్యునకు మఱి రూఢిగ సమీపమును జేరీ
అంజలి తోడను నమస్కరించెను నా మునికిని బహు వినయమునన్ 23

నరాధిపుండగు రఘురాముండును నయముగ తేజస్సుల జేతన్!
మండిపడుచు నున్నాడా యన్నటు మహాత్ముడగు నా యగస్త్యుకున్!
నమస్కరించియు నాతిథ్యము మఱి నందుకొనియు నాశ్రమ మందున్
మహా మునికి ముందఱ గూర్చుండెను మానుగ వినయముతో నపుడున్! 24

మహా తేజమును మహా తపముగల మానుగ యగస్త్య డంతటనూ!
ఆ శ్రీరామునితో నిటు బలికెను నలరుచు ప్రియ వచనంబులతో,
నర శ్రేష్ఠుడ! శ్రీ రాఘవ! వినుమా! నయముగ భాగ్యవశంబుననూ

నీ విచ్చుటికిని విచ్చేసితివీ! నిజ భాగ్య విశేషంబులచే
నీకు స్వాగతము! నీకు స్వాగతము! నిండు హృదయమున స్వాగతమున్! 25

రామా! నీవును అనేకంబులగు రమ్య గుణంబుల జేత మఱిన్
నాకు గౌరవింపగ దగు వాడవు! నయముగ పూజింపగదగినా!
అతిధి దేవతవు! నిత్యము నా హృది యలరి యుందువూ! స్థిరముగనూ!
మఱపురాదు నీ మహనీయంబగు మధుర రూపమును జగదీశా! 26

నీవు శూద్రునీ సంహరించుటకు నిజముగ వచ్చితి వనుచు మఱిన్,
దేవతలందఱు దెలుపుచు నుండిరి తీరుగ విషయము వివరించీ,
నీవు ధర్మమును నాచరించి మఱి నిజముగ బ్రాహ్మణ బాలకునీ
బ్రతికించితివీ చనిపోయిన యా బ్రాహ్మణ-బాలుని మఱు భూమిన్! 27

రఘురామా! యీ రాత్రియందునను రమ్యముగా నిటు నాకడనే
సమీపమందున సంభాషించుచు సరసత నాకడనుండు మికన్!
శ్రీ లక్ష్మీ సమేతుడవైనా స్థిరముగ నారాయణుడవునూ!
సర్వము నీ యందుననే యున్నది సకలమునకు యాధారుడవున్! 28

సకల దేవతల ప్రభుడవు నీవును సనాతనుండవు నీవు మఱిన్
ఆది మధ్యతము నంతము నుందువు నరసి జూడ నీ రూపంబున్!
రేపటి ప్రాతఃకాలము నందున రివ్వున బోవచ్చును నీవున్!
పుష్పకంబుపై బోవచ్చును మఱి పురమునకును మఱి యయోధ్యకున్! 29

విను రామా! మఱి దివ్యమైనదియు విమలాకారము గలదియునూ!
తన తేజములను బ్రకాశించునది దగ దివ్యాభరణంబు మఱిన్!
విశ్వకర్మచే నిర్మింపగబడి వికృతి లేక మఱి యుందునదీ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 30

రామా! దీనిని స్వీకరించి మఱి రమ్యముగా నాకును నిపుడున్
ప్రియమును జేయుము ప్రీతి వర్ధనా! ప్రీతిని గురిపింపుము నా పై
ఒకరు నిచ్చినా దానిని మఱియును యొనరగ గైకొనకుండ మఱిన్,
మరొక్కరికి నిచ్చినచో నది మఱి మహా ఫలంబని దెలుపబడెన్! 31

నీవును బహు విధ ఫలములు నిచ్చీ నిలిచి పోషణము జేయుటకున్
సమర్థుండవును సహజ సిద్ధుడవు! సకల దేవతా నీకంబున్

ఇంద్రునితోడను తరింపజేయగ సాంద్రశక్తిగల వాడవునూ!
అట్టి నీకు మఱి నిట్టి కానుకను నర్పించుచు నుంటిని నేనున్!
స్వీకరించి నను కృతార్థు జేయుము! స్థిర యశస్సు సమకూర్చు మికన్! 32

ఆ కారణమున రఘురామా! విను! అలరు ప్రదీప్తం బగుచున్నా
భాస్కరునికి వలె ప్రకాశించెడీ బహు విచిత్రమును దివ్యమునూ,
ఆభరణంబును నిచ్చుచుంటినీ అపూర్వమైనదీ, దివ్యమునూ
యథావిధిని మఱి స్వీకరింపుమా! అలరుచు ముదమున దయతోడన్! 33

(దిగువ నున్న 14 శ్లోకములు చాల ప్రతులలో లేవు, వీనికి వ్యాఖ్యాతలు
వ్యాఖ్యలు వ్రాయలేదు)

అటు బిమ్మట యిక్ష్వాకు వంశజుడు నలర మహారథుడైనట్టీ
మతి మంతులలో శ్రేష్ఠుడైన యా మానుగ శ్రీ రఘురాముడునూ
క్షత్రియ ధర్మము యనుసరించుచును సకలము దెలిసిన యగస్త్యుతో
వినయముతోడను నీ విధి బలికెను వికసిత భావన తోని మఱిన్! 34

పూజ్యుడవైనా బ్రాహ్మణుడా విను! పొందుగ నాదు సువచనములన్
ప్రతిగ్రహము నీ లోకమునందున బ్రాహ్మణునకు విధియింపబడెన్
గావున యతనికి నింద్యముగాదూ! కమనీయముగా గ్రహియింపన్!
కాని క్షత్రియుడు ప్రతిగ్రహించుట గానము లోకము నందుననూ! 35

బ్రాహ్మణోత్తమా! ప్రతిగ్రహంబును బరగ క్షత్రియులకును మఱియున్,
సాధ్యమైనదీ విశేషించి మఱి సంధ్య వార్చెడీ బ్రాహ్మణులున్!
ఇచ్చిన దానిని ప్రతి గ్రహించుట యింకను నింద్యము గద స్వామీ!
అందుచేత మఱి నీ వే తెలుపుము! అలరి యుంటివీ! దగు రీతిన్! 36

రామునిచేతను నిటుల బలుకబడి రహి మహాఋషియు నగస్త్యుడున్,
తిరిగి బలికెనూ రఘు రామునితో దీరుగ మధుర సువాక్యములన్
రామా! పూర్వము బ్రహ్మ భూతమును రమ్యముగా కృతయుగముననూ!
సమస్తమైనా ప్రజలందఱునూ రాజును లేకుండగను మఱిన్
నుండిరిగానీ సురలకు మాత్రము నుండె రాజుగా శతక్రతువున్! 37

అటు బిమ్మట యా ప్రజలందఱునూ యలరి రాజు కొఱకును వారున్!
దేవదేవుడగు బ్రహ్మ దేవునీ దీరుగ ప్రార్థించియు వారున్
దేహా! నీ చేతను దేవతలకు దీరుగ రాజుగ యింద్రుడునూ!
స్థాపింపగ బడినాడు గదా మఱి సరసత లేడు గదా మాకున్!
రాజు నొక్కనిని దయసేయుము మఱి రయమున మాకును నీ వసుధన్! 38

లోకాధిప! ఓ బ్రహ్మదేవుడా! మాకును నొక నర శ్రేష్ఠు మఱిన్!
నరాధిపునిగా దయసేయుము మఱి నయముగ పూజలు జేసి మఱిన్!
మా పాపములను దొలగ ద్రోసికొని మానుగ నుందుము పుణ్యగతిన్
రాజును లేకుండగ వసుధాస్థలి రహి వసియింపము మేము మఱిన్
ఇది మా దృఢ నిశ్చయము సుమా మఱి ఇది మా ప్రతినయు ప్రజాపతీ! 39,40

అటుబిమ్మట సురశ్రేష్ఠుడైన యా యలరు ప్రజాపతి శీఘ్రముగన్,
ఇంద్రుడు మొదలగు లోకపాలురను సాంద్రముగా బిలిచియు నిటులన్!
మీమీ తేజస్సులలో నుండియు మిగుల కొంత భాగమును మఱిన్
యీ రాజునకును నివ్వవలయునని యింపుగ బలికెను నాతండున్!
'అటులే!' యనుచును వారలు గూడను నలరుచు నిచ్చిరి తేజసులన్! 41

అటుబిమ్మట యా బ్రహ్మదేవుడును నలరుచు తుమ్మెను శీఘ్రముగన్,
దాని నుండి క్షుపుడును రాజును మఱి దగ జన్మించెను చిత్రముగన్!
బ్రహ్మదేవుడును నాతని యందున బరగ లోక పాలుర యందున్
సమముగ బంచెను పితామహుండును సరసత ప్రజలును మెచ్చుకొనన్! 42

అటుబిమ్మట యా బ్రహ్మదేవుడును నట్టి క్షుపుని ప్రజలకును మఱిన్,
ప్రభువునుగా మఱి ప్రసాదించెనూ బన్నుగ ప్రజలను బాలింపన్!
లోకపాలురయు భాగమునందున లోలత యింద్రుని భాగముచే
రాజు భూమినీ యాజ్ఞాపించెను రమ్య సస్యములు బండగనూ! 43

వరుణుని భాగము జేత నరేంద్రుడు వనర శరీరము పోషించెన్!
కుబేరునీ యా యంశము జేతను కూరిమి వారికి ధనమిచ్చెన్
యముని యంశ జేతను యా ప్రజలకు నలరుచు శాసించెను వారిన్!
లోకపాలురా యంశంబుల మఱి లోలత రాజును గ్రహియించెన్! 44,45

నరుల లోపలమ శ్రేష్ఠుడవైనా రామా వినుమా! వచనములన్!
ఇంద్రునికిని మఱి సంబంధించిన నింపగు భాగముచేత ననున్!

తరింపజేయుటకై దీనిని మఱి దగ స్వీకరణము జేయమఱిన్
నీకు క్షేమమగు గాత! మఱియునూ నీకును మంగళమగుగాతన్! 46

రామచంద్రుడును నాముని యిచ్చిన రహి సూర్యునివలె భాసించూ!
విచిత్రమైనది దివ్యమైనదియు, దీప్తమైనదియు నగునట్టి
ఆభరణంబును గ్రహించె నప్పుడు నల బహుమానముగా నెంచీ,
అయోధ్య ప్రజలకు జూపించెదనని యనుచు బలికె నాముని తోడన్! 47

రఘునందనుడగు రామచంద్రుడును రహి యాభరణము గ్రహియించీ,
అటు బిమ్మట యా ప్రకాశించెడీ యల యాభరణము గాంచి మఱిన్,
అది మన యొద్దకు నెటుల వచ్చెనో యలరుచు ప్రశ్నించెను మఱియున్,
అల యాభరణము వృత్తాంతంబును అల యగస్త్యునీ ప్రశ్నించెన్! 48

మహామునీ! యత్యుత్తమమైనా యాభరణంబును గల యట్టీ
ఆశ్చర్యకరంబైనది మఱియును నద్భుతమైనది మునివర్యా!
ఇది నీకెటులను బ్రాప్తించినదీ నీకు లభించెను ఎట్లు మఱిన్!
ఎవనిచేత గ్రహియింపబడి యిటకు నెట్లు వచ్చినదో దెలుపు మఱిన్! 49

భగవంతుడ! ఓ మహాయశా విను! బన్నుగ నాదు సువచనములన్,
కౌతూహలమున యడుగుచుంటి గద! గడు నాశ్చర్యము నొందుచునూ!
అనేక విధముల యాశ్చర్యములకు అలరు నిధివి గద మహామునీ!
దీని పుట్టు పూర్వోత్తరములనూ దీరుగ తెలుపుము నే వినెదన్! 50

కాకుత్స్థుండగు రామచంద్రుడును గడు వినయముతోడను ప్రశ్నింపన్
మునియును బలికెను మోదము తోడను మురిపెముగా నా విషయంబున్
రఘురామా! పూర్వమున జరిగినది! రహి త్రేతాయుగ మందుననూ
జరిగిన విషయము నంత దెలిపెదను! బరగ వినుము శ్రీ రఘురామా! 51

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
డెబ్బది యాఱవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

డెబ్బది యేడవ సర్గము

(అగస్త్యుడు రామునకు స్వర్గములో నుండు ఒక పురుషుడు శవమును భక్షించిన కథను జెప్పుట)

రామా! పూర్వము త్రేతాయుగమున రమ్యముగా చుట్టును మఱియున్,
నూఱు యోజనాల్ పరిధి యందునను నూతులుగానీ, చెఱువులునూ,
మృగములుగానీ, పక్షులుగానీ, మేదిని యందున లేవు మఱిన్,
బహు విశాలమగు భూఖండంబును బన్నుగ నుండెను నచ్చటనూ! 1

ఓ సౌమ్యుడ! యట నిర్మానుషమగు నొసర యరణ్యము నందుననూ
ఉత్తమమైనా తపస్సు జేయుచు చిత్తము దైవము కర్పించూ
ఆ యరణ్యమున సంచరించుటకు నా ప్రదేశమున కొచ్చితినీ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

సుఖకరమైనా రుచిని గలవియు ఫల మూలంబులతోను మఱిన్,
సమృద్ధమైనా బహుమానములను సరసత గలిగిన యడవులనూ
ఆ యరణ్య ఘన రూపంబును మఱి యట వర్ణించుటకును మఱియున్
శక్యము గాదూ శేషునకును మఱి శక్యముగాదూ బ్రహ్మకునూ! 3

ఆ యరణ్య మధ్యమునందుననూ అలరు యోజనము విశాలమున్
గలిగినట్టి యొక సరస్సు గలదూ! కమ్మని జలములు గలిగి మఱిన్
అట్టి సరస్సున కారండవములు, నలరు చక్రవాకములు మఱిన్,
హంసలునూ విహరించుచుండునట యలరు తుమ్మెదల నాట్యములున్!
నాచులేక కలువల, పద్మంబుల నయముగ యుజ్జ్వలమై యుండున్! 4

అత్యర్థము బహు సుఖాస్వాదనము ననుత్తమంబైనది మఱియున్,
అరజస్కంబును, నక్షోభ్యంబును నలరు శోభితంబైనదియున్
పక్షుల సముదాయముతో గూడిన బహు విధ మంజులమైనదియున్
పృథివిలోని యద్భుతముగ నుండెను పుడమిలోని యాశ్చర్యముగన్! 5

ఆ సరస్సునకు సమీపంబునను నతి ప్రాచీనము పవిత్రమున్!
ఆశ్చర్యకరంబైనట్టిదియునూ యలరు నొక్క యాశ్రమముండెన్!
కాని యందునను తపస్సు జేసెడి ఘన మును లెవ్వరు లేరచటన్,
నిశ్శబ్దము మఱి నిరామయముగా నిస్తేజముగా నుండె నటన్! 6

పురుషర్షభ! ఓ రామా వినుమా! పూనిక నాదు సువచనములన్,
గ్రీష్మంబునకును సంబంధించిన భీష్మమైన యా రాత్రి మఱిన్,
అచ్చటనే నివసించితి నేనును ముచ్చట సరస్సు తీరమునన్
ప్రాతఃకాలము సంధ్యలు విరియగ బరగ సరస్సును దిలకింపన్!
ఆ సరస్సు గూర్చియు బోయితినీ! యటగల శోభల జూడగనూ! 7

రామచంద్ర ఓ రామా వినుమా! రయమున నాదు సువచనములన్!
అటుబిమ్మట యా సరస్సునందున యలరుచు చూచితి నొక శవమున్!
ఆ శవంబు మఱి బలసియున్నదీ యట మాలిన్యము లేకుండెన్!
ఆ శవంబు బహు శోభను గూడి యలరి యున్నదీ యచ్చోటన్! 8

ఓ రామా! ఓ ప్రభూ! వినుము మఱి యొనరగ యివి యేమనుచు మఱిన్
యిది యేమై యుండునొ యని మది నింపుగ యాలోచించుచునూ!
ముహూర్త కాలము నందు నిలిచితి మోదంబున యాశ్చర్యముగనూ!
సరస్తీరమందున జూచుచు మఱి సరసత యా శవమును మఱియున్! 9

అటుబిమ్మట మఱి మూహూర్తకాలము నట నే నిలిచియు జూచుచునూ!
చూచుటకును నాశ్చర్యకరంబును సుందరమైనది దివ్యమునూ!
మనోగమనమును గల విమానమును మానుగ గాంచితి నచ్చోటన్!
దానికి హంసలు గట్టబడినవీ! యలరుచు నెగురుచు నున్నవియున్! 10
వీరుడ! ఓ రఘునందన వినుమా! విమలమైన నా వచనములన్!
ఆ విమానమును స్వర్గవాసియగు నలరు దివ్య పురుషుని నొకనిన్,
దివ్యములైనా యలంకారముల దీరుగ ధరించినటువంటీ
వేయిమంది యప్సరసలు వానిని విమల సేవలను నుండిరటన్! 11

కొందఱు స్త్రీలును విమానమందున కూరిమి సుమధుర గీతములన్,
బాడుచుండిరీ లయతాళములను బన్నుగ మృదంగ ధ్వనితోడన్!
కొందఱు వీణా మధుర స్వనములను కొందఱు కిన్నర నాదములన్
మఱి కొందఱు నృత్యమును జేయుచును మానుగ నుండిరి క్రీడలతో! 12

మఱి కొందఱు యప్సరసలు నచ్చట మానుగ చంద్ర సుకిరణములన్,
బోలుచు దెల్లగ నున్నట్టివియునూ, బోలుచు బంగరు దండములన్,
గలచామరములు వీచుచు నుండిరి కమ్మని ముఖ పద్మంబులనూ!
ఆతని వింజామరల వీచుచును నతి వైభవముగ నుండి రటన్! 13

రఘురామా! అటు బిమ్మట నాతడు నలరు స్వర్గ వాసియు మఱియున్!
అంశుమంతుడును మేరు కూటమును నటుల విడిచి సింహాసనమున్

విడిచి విమానము నుండి దిగియు మఱి వికటముగా గనుచుండగనే
ఆ శవమును భక్షించెను నాతడు నింత మిగులకుండగ నతడున్! 14, 15

అల స్వర్గ నివాసియును బిమ్మటను అల బలిసిన మాంసమును మఱిన్
అధికముగా మఱి యథా కామముగ యంతయు భుజించి నాతండున్,
సరస్సులోనికి దిగి యాతండును దగ యాచమనము జేయుటకున్
ఉపక్రమించెను స్వర్గవాసియును మున్నతముగ నీటిని గ్రోలి! 16

రఘునందన! శ్రీరామా వినుమా! రమ్యమైన నా వచనములన్!
స్వర్గవాసియును యథా న్యాయముగ సరసత యాచమనము జేసి!
ఉన్నతమగు నా విమాన శ్రేష్ఠము నురుతరముగ యధిరోహింపన్
ఉపక్రమించెను స్వర్గవాసియును నుల్లాసముగా సఖియలతో! 17

పురుష శ్రేష్ఠుడ! రామా వినుమా పొందుగ నాదు సువచనములన్
విమానమును మఱి యధిరోహింపగ యలరుచున్న యాతని గాంచి!
ఆతనితో నే నటుల బలికితిని యలరుచు సుమధుర వచనములన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 18

దేవతలకు మఱి సమానుండవును దీరుగ మఱి నీ వెవ్వడవూ?
నింద్యమైన యాహారంబును మఱి నీవు దినుటయును నెందులకూ?
ఎందువలన? కారణమును దెలుపుము? చందము నంతయు వివరింపూ?
ఏ లోకమునందుండి వచ్చితివి? యింపుగ దెలుపుము నంతయునూ! 19

దేవతుల్యుడా! దెలుపుము నాకును దేవతుల్యమగు స్థితియు మఱిన్,
ఇట్టి నింద్యమగు నా హారంబును నిట్టి యుండు నెవనికిని మఱిన్!
ఆశ్చర్యముగా నున్నది నాకును నలరు దీనిలో యథార్థమున్!
వినగోరుచు నున్నాను మిత్రమా! నీకు నీ శవము గాంచగనూ!
తగిన భక్ష్యమని భావింపను నే దగు నాహారంబని తలపన్! 20

రఘురామా! నే తెలియగ దలచి రయమున వేడుకతో నేనున్
నేను బలికినా పలుకులు వినియును నిశితముగా నంతయు మఱియున్!
విషయము నంతయు దెలియజేసెనూ! విపులముగాను, యథార్థముగా!
స్వర్గనివాసియు నాలోచించియు ననసముగా బరిశీలించి! 21

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
డెబ్బది యేడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

డెబ్బది యెనిమిదవ సర్గము

(శ్వేతుడు తనకు కుత్సితమైన ఆహారము తినవలసి వచ్చినందుకు కారణము
అగస్త్యునకు దెలుపుట, బ్రహ్మతో తనకు జరిగిన సంభాషణమును
దెలుపుట, అగస్త్యునకు దివ్యాలంకారమును దానము జేయుటచే
అతడు ఆకలి దప్పుల నుండి విముక్తుడగుట)

రఘు నందన శ్రీరామా వినుమా! రమణీయములగు వచనములన్,
బలుకబడిన నా శుభాక్షరములను బన్నుగ విని నా వాక్యములన్,
అంజలి ఘటించి నిటుల బలికెనూ యలరుచు స్వర్గనివాసియునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

బ్రహ్మర్షీ! ఓ బ్రాహ్మణుడా విను! బన్నుగ నీ వడిగిన విధమున్,
నా సుఖదుఃఖములకు కారణములు నతిక్రమింపగ నివియున్!
పూర్వము జరిగిన విషయంబులు నే బొలుపుగ దెలిపెద సర్వమునూ!
ఆలకింపు మఱి బ్రాహ్మణోత్తమా! యసదృశమగు నీ విషయంబున్! 2

సుదేవుడనియెడి వాడుగలడు సుమ! సురచిరముగ పూర్వంబుననూ
త్రైలోక్యంబుల విఖ్యాతుడు మఱి దీరుగ యశస్సు గలవాడున్!
మహాపరాక్రమ శాలియైన యా మానవేంద్రుడును గలడు సుమా!
విదర్భదేశపు రాజాతడు సుమ! వినయ సంపదయు గలవాడున్!
అతనికిని నే పుత్రరత్నమును నలరుచు నుంటిని యా విధమున్! 3

అతనికిని మఱి యిరువురు భార్యలు నలరుచు నుండిరి సుఖముగనూ!
ఇరువురు కుమారులును మఱి గలిగిరి యింపుగ యా రాజునకపుడున్,
పెద్దవాడ నగు నా పేరును మఱి పేరిమి శ్వేతుడు నందు రిలన్!
చిన్న వానినీ సురథుడందురు స్థిరముగ నాతడు తమ్ముడుమా! 4

ఆటుపిమ్మట మఱి నాదు తండ్రియును నటు స్వర్గస్థుడు నాయె మఱిన్
ప్రజలు నన్ను రాజ్యాభిషిక్తునిగ బన్నుగ జేసిరి తదుపరియున్!
సావధాన చిత్తుడనై నేనును సమాహితుడనై వినయమునన్,
ధర్మ సమ్మతముగా నప్పుడు నే ధర పాలించితి చతురతతో! 5

మంచినియమములు గలవాడా! విను! మానుగ విప్రోత్తమ వినుమా!
నే నీ విధముగ రాజ్యము జేయుచు నిరతము ధర్మ సురక్షణచే!
జేయుచుండగా వేలకొలదియును స్థిరముగ వర్షములును గడిచెన్!
ఆనందంబుగ గడిచిపోయినవి యా వత్సరములు వేగముగన్! 6

బ్రాహ్మణ శ్రేష్ఠుడ! అట్టి నేను మఱి బన్నుగ నేనొక నిమిత్తమున్
శకునము జేతను తెలియబడిన యా సరగున యాయుర్దాయంబున్,
మరణము గూర్చియు నాలోచించుచు మానుగ చింతన జేయుచునూ!
మహారణ్యమును జేరితి నేనును మానుగ తపసును జేయగనూ! 7

అట్టి నేను బహు సుందరమైనది యలరు సరస్తీరము నందున్
తపసు జేసికొనుటకు నేనును మఱి దగ దుర్గంబైనది మఱియున్
మృగ పక్షులతో శూన్యమైన యా మేదిని యందున జేరి మఱిన్!
తపస్సు జేయుట ప్రారంభించితి తగ మనసున పరిశుద్ధుడనై! 8

సోదరుడైనా యా సురధునీ సురుచిరముగను మహీపతిగన్
రాజునుగా నే నభిషేకించితి రమ్యముగా రాజ్యమునందున్!
ఇట్టి సరస్తీరమును జేరియును గట్టి తపస్సును జేసితినీ,
బహుకాలము నే తపస్సు జేసితి బన్నుగ తపమును ఫలియించెన్! 9

మూడువేల వర్షంబులు నేనును ముదమున సుమహారణ్యమునన్,
కఠినమైన యా తపము జేసితిని కరుణాపూరితముగ మఱియున్,
తపము ఫలింపగ బోయితి నేనును దగ సర్వోత్తమ లోకంబున్,
బ్రహ్మ లోకమును జేరితి నేనును బ్రహ్మ విదుడ నైతిని పిదపన్! 10

పరమోదారుడ! బ్రహ్మణోత్తమా! బరగ వినుము! నా వచనములన్
బ్రహ్మలోకమున నున్నను గూడను బరగ వినుము నాకలి దప్పుల్
బాధించుచునూ యున్నవి నను మఱి బాధబడుచు నున్నాడను నే
వీని నుండి దప్పించుకొనగ నే నింపుగ యోజన జేసితినీ! 11

త్రిభువన శ్రేష్ఠుండైన బ్రహ్మతో దీరుగ నే బ్రశ్నించితినీ,
భగవంతుడ! యీ బ్రహ్మలోకమున బన్నుగ యాకలి దప్పులునూ!
యుండవనుచు నే వింటిని కద మఱి యుండి బాధబడుచుంటిని నే!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 12

కాని నన్ను యాకలి దప్పులునూ కదలుచున్నవీ నా యందున్,
ఇది యే కర్మకు ఫలితమోకదా! యింపుగ నెఱుగను పితామహా!
పితామహా! నేనేమి తినవలెను? యే యాహారము భుజింపగా
దానిని దెలుపుము వేగముగా మఱి తన్మయముగ మఱి జేయుదునూ! 13

అటుపిమ్మట నా పితామహుండును నలరి దెలిపె నాతో నిటులన్
సుదేవ పుత్రా! నా మాటలు విను! సురుచిరముగ భావింపు మికన్!
నీకు మధురమగు మాంసాదులు మఱి మాననీయ యాహారములున్
నిత్యము వానిని భక్షణ సేయుము! నిండాకలినీ బాపుకొనన్! 14

ఉత్తమమైనా తపస్సు జేయుచు నురుతరముగ నీ శరీరమున్
బలియునట్లుగా జేసినావుగద! బహు నాహారము భుజించున్
మహామతీ ఓ శ్వేతుడ వినుమా! మానుగ నాదు సువచనములన్,
విత్తనంబు నాటనిది మొలవదూ! విమలమైన భూతల మందున్,
ఆహుతి సేయనిదే జ్వలింపదూ! అలరుచు యజ్ఞమునందు మఱిన్! 15

కొంచెము గూడను దానము సేయక కూరిమి తపస్సు జేసితివీ,
తపస్సునే మఱి సేవించితివీ! దానముసేయక నీవు మఱిన్,
వత్సా! నీవును నా కారణమున యాకలి దప్పుల చేత మఱిన్,
బాధపడుచు నున్నావుగదా మఱి భగ్న హృదయమున రోదనతో! 16

అట్టి నీవు నాహారము జేతను నలరి బాగ పోషింపబడీ,
అనుత్తమంబును, అమృత రసముగల యలరునట్టి నీ శరీరమున్,
భక్షణ సేయుము నాకలిదీరగ బన్నుగ దినదినమును నీవున్!
జీవన నిర్వాహంబు జరుగునూ భావంబున యల భక్షణతో! 17

శ్వేతా వినుమా! నా వచనములను శ్రీకరముగ మది నుంచికొనీ,
మహా ఋషియునగు అగస్త్యుండునూ ఆ వనమును వచ్చిన యపుడున్
ఈ కష్టంబును నీకు దొలగునూ, నింపుగ సుఖమును బొందెదవూ!
నీ పాపమునకు పరిష్కారమును నింపుగ జరుగును నా దినమున్! 18

మహాబాహూ! ఓ సౌమ్యుడ వినుమా! మానుగ మధుర సువచనములన్
ఆ యగస్త్యుడును సురగణములకును అలరి తరింపగ జేయగనూ!

సమర్థుండు మఱి యాకలిదప్పుల సహజ బాధలను నొందుచునూ!
నున్న యట్టి నీ బాధను వేఱుగ సన్నగ వినిపింపగ వలెనా? 19

బ్రాహ్మణోత్తమా! అట్టి నేను మఱి భగవంతుడు పూజ్యుడు నైనా
బ్రహ్మదేవునీ నిశ్చయమును విని బన్నుగ నాదు శరీరమునే,
కుత్సితమైనా యాహారముగా కూరిమి గుడుచుచు నున్నాడన్
విధి నిర్ణయమును దాటలేరు కద! వేద విదులు, తపసులు గూడన్! 20

బ్రాహ్మణోత్తమా! బ్రహ్మర్షీ విను! బన్నుగ నాదు సువాక్యములన్
అనేక వర్ష గణంబులు గూడను నలరుచు దినుచున్నను గూడన్,
తరుగటలేదూ! విరుగుట లేదూ! తగ నటులే నుండును నెపుడున్
నాకు గూడ తృప్తిని గలిగించుచు నయముగ నున్నది రుచికరమున్! 21

క్లేశమయుడనగు నట్టి నాకు మఱి క్లేశమునుండియు దొలగించీ
దయజూడుము నను ఆపద్బాంధవ! దారిలేని నను గాపాడీ!
నీకు దప్ప మఱి యెవ్వరికిని నిల నిండు దయను గాపాడగనూ!
సామర్థ్యంబును లేదుకదా మఱి సాహసంబు గనలేము గదా! 22

సౌమ్యుడవగు ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడ!సరసత యీ యాభరణంబున్
ధరించుటకు మఱి ప్రతి గ్రహింపుము దయను జూడు నను ద్విజోత్తమా!
నీకు మంగళంబగును గాత! మఱి నిండు దయను ననుగాంచుమికన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 23

బ్రహ్మర్షీ! ఓ ద్విజోత్తమా! విను! బన్నుగ యిదిగొ సువర్ణంబున్,
ధనమును వస్త్రంబులను మఱియునూ దగ భక్ష్యములను, భోజ్యములన్
ఆభరణములను నిచ్చుచుంటినీఅందుకొనుము! వేద్విజోత్తమా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 24

పూజ్యుడవైనా మహామునీ! విను పొందుగ నాదు సువాక్యములన్
అన్ని కామముల అన్ని భోగముల యందించెద మఱి ఋషివర్యా!
నన్ను తరింపగ జేయుట కొఱకై నన్ననుగ్రహింపుము వేగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 23

బహు దుఃఖముతో నుండినట్టి యీ బరగ స్వర్గ నివాసుని మాటల్
విని యాతనినీ తరింపగ జేయుగ దగ యుత్తమమైనట్టిదియునూ!

ఆభరణంబును నే గైకొంటిని! యాతడు సంతృప్తిని జెందన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 26

సుందరమగు నా యాభరణంబును సురుచిరముగ నే గైకొనగన్
ఆ రాజర్షికిని సంబంధించిన వెనుకటి మనుష్య దేహంబున్,
నశించిపోయెను క్రొత్త దేహమును నయముగ వచ్చెను శీఘ్రముగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 27

ఆ మనుష్య దేహంబు నాతనికి యదృశ్యంబు నొందగ వేగన్!
క్రొత్త దేహమును బుట్టుక వచ్చెను కూరిమి సుందరత వెలయన్
ఆ రాజర్షియు సంతసమందెను నలవి కాని విధమున నపుడున్,
సుఖముగ నాతడు స్వర్గము నేగెను శుభకర చింతన తోని మతిన్! 28

రఘురామా! ఇంద్రునితో సమానుడును రహి యా రాజర్షియును మతియున్!
ఆ కారణమును ముందు నుంచుకొని యతి యాశ్చర్యకరంబు మతిన్
దివ్యమైన యా యాభరణంబును దీరుగ నిచ్చెను నా కపుడున్!
అది నీకిచ్చుచు నుంటిని రామా! మది సంతసమును నందగనూ! 29

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
డెబ్బది యెనిమిదవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

డెబ్బది తొమ్మిదవ సర్గము

(ఇక్ష్వాకు పుత్రుడైన దండుని రాజ్యము)

రాఘవుండు యాగస్త్యుడు జెప్పిన రమ్యములును నాశ్చర్యంబున్!
నగు మాటలు విని రామచంద్రుడును నలరుచు బహు గారవముననూ!
ఆశ్చర్యముతో నా యగస్త్యునీ యలరుచు నీ విధి ప్రశ్నించెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

పూజ్యుడ! ఓ భగవంతుడ వినుమా! పొలుపుగ విదర్భ రాజయినా
ఆ శ్వేతుండును తపస్సు జేసిన అట్టి భయంకర వనమందున్!
ఎందుచేత మృగ శూన్యమైనదీ పొందుగ దెలుపుము మునివర్యా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

ప్రసిద్ధుడైనా విదర్భరాజును బన్నుగ శూన్యంబైనదియున్
మనుజ వర్జితమునైన వనమునకు మానుగ తపస్సు జేయుటకున్,
ఎందులకచటికి బోయెను నాతడు బొందుగ సత్యము తెలియగనూ!
తెలిసికొనగ గోరుచు నున్నాడను దీరుగ దెలుపుము మునివర్యా! 3

మహాతేజమును గల యగస్త్యుడును మానుగ రాముని వచనమునూ!
కౌతూహలమును గూడినట్టీ యా క్రమమగు పలుకులు వినియు మఱిన్,
ఈ విధముగనూ బలుకగ సాగెను నింపుగ మధుర సువాక్యంబులన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 4

రామా! పూర్వము కృతయుగమందున రమ్యముగా పాలకుడపుడున్
మనువను రాజును పరిపాలించెను మానుగ దేశమునందుననూ!
అతని కులమునకు ప్రకాశంబునూ యానందంబును గలిగించూ!
ఇక్ష్వాకుడు నను పుత్రుడు గలిగెను నింపుగ యాతని వంశమునన్! 5

భూమియందు మఱి దుర్జయుడైనా పొలుపుగ జ్యేష్ఠుడు నిక్ష్వాకున్
రాజ్యమునకు నభిషిక్తుని జేసీ రమ్యముగా మనువును నిలిపెన్!
పుడమియందు రాజుల వంశములను పొలుపుగ స్థాపింపుము పుత్రా!
ఆ యిక్ష్వాకుని తోడను బలికెను నలరుచు నా మనువును నపుడున్! 6

రఘురామా! యా పుత్రుండును మఱి రయమున 'అట్లే!' యనుచు మఱిన్,
ప్రతిజ్ఞజేసెను నిక్ష్వాకుండును బన్నుగ యా మనువునకు మఱిన్,
అటుబిమ్మట బహు సంతోషించియు యా మనువును దన పుత్రునితో,
ఈ విధముగ మధురముగా బలికెను నింపుగ మధురాక్షరములనూ! 7

పరమోదారా! భవ్యకుమారా! బన్నుగ నీ మాటలకు మఱిన్,
సంతసించితిని నీవును దప్పక సంతముతో జేయుదువు మఱిన్!
దండముజేతను ప్రజలనందఱిని బన్నుగ రక్షణ సేయుమికన్
దండప్రయోగము జేయకుమా మఱి చండశాసనుడవగుచు మఱిన్,
కారణంబు లేకుండ జేయకుము కఠిన దండనము భూప్రజలన్! 8

అపరాధుల విషయమున దండమును యథా శాస్త్రముగ విధించినా
ఆ దండము రాజును స్వర్గమునకు నలరుచు కొనిపోవును వేగన్
మహాబాహు ఓ పుత్రక! వినుమా! మానుగ దండ ప్రయోగమునన్
యత్నశీలుడవు యై యుండుము మఱి రత్నము వలె బాసిల్లు మికన్!
అటు జేసినచో నీకు లోకమున యలరి ధర్మ వృద్ధియు గలుగున్! 9, 10

మనువు కుమారునకు నీ విధమున మానుగ నుపదేశించి మఱిన్,
యోగ మార్గమును నవలంబించియు రాగ మార్గమును త్యజియించి
స్వర్గలోకమున భాగమైన యా పరసత బ్రహ్మ సులోకమునూ
తరలిపోయెనూ తన పుణ్యమునకు దగు ఫలమనుభవమును నందన్! 11

మనువు త్రిదివమును బోయిన పిమ్మట మానుగ యిక్ష్వాకుండు మఱిన్
పుత్రుల నే విధి పుట్టించెదనని పూనికతో యాలోచనతో,
మనస్సు నందున పరితపించెనూ, మానుగ యనేక విధములనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 12

ధర్మాత్ముండగు మనుసుతుండును మానుగ ఇక్ష్వాకుండపుడున్
అనేక విధముల కర్మల జేసెను నలరుచు యజ్ఞ సుయాగములన్,
దేవసుతులతో సమానులైనా దీరుగ నూర్గురు పుత్రులనూ
పుట్టించెను మఱి సంతానములను పూనికతోని సుపుత్రులనూ! 13

తండ్రీ ఓ రఘునందన వినుమా! దగ నాదు సువచనంబులనూ'
వారందఱిలో చిన్నవాడు మఱి వనరగ విద్యాభ్యాసంబున్

లేక మూఢుడై యుండెను నాతడు లీలగ దిరుగుచు నుండె నటన్
పెద్ద వారలను గౌరవింపడూ పేరిమి యన్నలగూడ మఱిన్! 14

వీని శరీరమునందు దప్పకను వికట దండమును బడగలదూ!
అనుచు దెలిసినా తండ్రి శీఘ్రమున అల్పమైన తేజస్సుగలా!
యాతనికిని మఱి దండుడు ననుచును నలరి నామధేయము బెట్టెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

అరిందమా! ఓ రఘురామా విను! నలరు నాదు శుభవచనములన్,
తండ్రి యిట్టి దండునకును మఱియును దగు భయంకరంబగు చోటున్
జూడ జాలకను వింధ్య శైవలా సురుచిర పర్వత ప్రదేశమున్
మధ్య దండునకు రాజ్యము నిచ్చెను మానుగ కష్టము లందుకొనన్! 16

రఘురామా! యా దండుడు మఱియును నలరెడి పర్వత ప్రాంతమునన్
యుండిన దేశమునకు రాజునై యురుతరముగ యుత్తమమైనా
పురమును గూడను నెలకొల్పెను మఱి పూనికతో యా దేశమునన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 17

రఘురామా! యా పురంబునకునూ మధుమంతంబన పేరు మఱిన్
బెట్టెను మఱియును మంచి నియమములు పేరిమిగల యా శుభశుక్రున్
పురోహితునిగా జేసికొనెను మఱి పూనికతోడను యా రాజున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 18

ఈ విధముగ యా పురోహితునితో నింపుగ గూడిన ప్రజ తోడన్,
సంతోషముతో నిండినట్టి యా సరసత యా రాజ్యంబు మఱిన్
స్వర్గధామమును దేవేంద్రుని వలె సరసత పాలించెను నతడున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 19

అటుబిమ్మట మనుజేంద్ర పుత్రుడును నలరుచు నాదండుడు మఱియున్
శుక్రాచార్యుని గూడినవాడై సురుచిరముగ యా రాజు మఱిన్
స్వర్గము బృహస్పతితో గూడిన సరసత దేవేంద్రునికి వలెన్
రాజ్యంబును పాలించె నాతడును రమ్యముగా బహు సుఖలీలన్! 20

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
డెబ్బది తొమ్మిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఎనుబదియవ సర్గము

(దండుడు శుక్రాచార్యుని పుత్రిని బలాత్కరించుట)

మహర్షియును నా కుంభసంభవుడు మానుగ రాముని గూర్చి మఱిన్
అటుల బలికి యా కథయందే మఱి యలరుచు మఱియొక వాక్యంబున్
తెలుపుటకును మఱి ప్రారంభించెను తేటతెల్లముగ యగస్త్యుడున్
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

కాకుత్స్థా నటుపిమ్మట దండుడు గలిగి మనో నిగ్రహము మఱిన్
అనేక యాయత వత్సరంబులును నాతడు ధరణిని పాలించెన్,
శత్రు బాధయును లేని రాజ్యమును సరసత దేశము బాలించెన్!
ప్రజలును నానందముతో నుండిరి బన్నుగ సుఖలీలల తోడన్! 2

అటుబిమ్మట యా రాజు దండుడును నలరుచు నొక కాలమునందున్,
మనోహరంబగు చైత్రమాసమున మానుగ వసంత ఋతువందున్,
సుందరమగు నా శుక్రాచార్యుని శుభకరమగు నాశ్రమమునకున్,
జూడగబోయెను సురుచిర ప్రభలను సుందర యుద్యానంబులనూ! 3

అచ్చోటను వన ప్రాంతమందునను నాదండుడు గాంచెను నచటన్!
అనుత్తమంబును నుత్తమురాలును, నపురూపంబును గలిగిన యా
భార్గవ కన్యను గాంచెను నాతడు గడు నాశ్చర్యము నందె నటన్,
ఆ కన్యయు మఱి భూలోకములో నపురూపంబగు సుందరతన్
ప్రకాశించుచుండెను దండుడుగని తన్మయముగ నానందించెన్! 4

సుదున్మేధుండగు నాదండుడు సురుచిరముగ యామెను గాంచీ
మన్మథ బాణంబుల చేతను మఱి మానుగ బీడింపగ బడుచున్
మిగుల భయపడిన కన్యను గాంచీ మిక్కిలి సమీపమును జేరీ!
ఈ విధముగ బలికెను నాతండును నింపుగ సుమధుర వచనములన్! 5

అందమైన యా కటి ప్రదేశము నలరెడి దానవు నెవ్వరవూ?
మంగళప్రదురాలా! మఱి దెలుపుము! అంగన! యెవ్వరి దానవునూ?
ఎచ్చటినుండీ నిటు వచ్చితివీ? ఎవరి కుమార్తెవు నీవు మఱిన్?
శుభాననే! నే ననంగు చేతను ప్రుక్కుచు నిన్నడుగుచు నుంటిన్! 6

మదోన్మత్తుడును, కాముకుండునూ, మానుగ యా దండుడు మఱియున్,
ఈ విధముగ బలుకుచు నుండగనూ యా భార్గవుని పుత్రికయునూ,
సానునయముగా గూడినట్లుగా సరసత రాజును గూర్చి యిటుల్!
బ్రతిమాలుచు మఱి యిటులను బలికెను ప్రబలమైన వేదన తోడన్! 7

రాజేంద్రా! విను! యాశ్రమమందున నలరి నేను వసియింతు మఱిన్
అక్లిష్ట కర్మణుడైన మహాముని యలరు భార్గవుని పుత్రికనూ!
పెద్ద కుమార్తెను పేరు అరజ మఱి పేరిమి పూజింతురు నన్నున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 8

రాజా! యీ విధి బలాత్కారముగ రహి స్పృశింపకుము మఱి నన్నున్
తండ్రి వశములో నున్న కన్యకను దగ గాంచుము గారవమునను!
మహారాజ! నా తండ్రి నీ గురువు! మానుగ నాతని శిష్యుడవున్!
మహా తపసుగల యాతండును మఱి మానుగ కోపించిన నీకున్!
మహాపదయునూ గలుగును నీకును మానుగ సర్వము భ్రష్టముగున్! 9

నా వలనను మఱి నీకేమైనను నయముగ కార్యము గలిగినచో
ధర్మదృష్టితో సన్మార్గంబున దగ ద్యుతి గలిగిన నా పితరున్!
ఆలోచించియు గైకొను మఱియును నలర కోరికయు నెఱవేరున్!
ఈ విధమున బలవంతము జేయకు! నింపుగ జేటును సమకూరున్! 10

అటుల కానిచో నీకు మిక్కిలియు నలరు భయంకర ఫలము మఱిన్
గలుగగలదు సుమ! దూరము నుండుము! కనుల కావరము నందకుమా!
నా తండ్రికి మఱి క్రోధము వచ్చిన నయముగ త్రైలోక్యంబులను !
కాల్చివేయుగదు! నీకును దెలియును! గడు నమంగళము గలుగు మఱిన్!
అనవద్యాంగంబులు గలవాడా! యల నా తండ్రిని గోరినచో
నా తండ్రియు నీ కివ్వగలడు సుమ! యలరుచు వివాహమునకు మఱిన్! 11, 12

కామ వశుండైన దండుడును కాఱుజీకటులు గ్రమ్మి మఱిన్
మదోన్మత్తుడై శిరస్సునందున మానుగ యంజలి ఘటియించి,
అటుల బలికెడి యరజను గాంచీ, యాతండును బ్రతిమాలుచునూ,
యీ రీతిని ప్రారంభించెను బలుకుట నీప్సితార్థమును నెఱవేరన్! 13

మంచి నితంబుము గలదానా విను! మానుగ కాలము గడుపకుమా!
యాలసింపకుము కరుణింపుము నను విలసిత ముఖమును గలదానా!
నీ మూలముననను బోవుచున్నవీ! నిండు ప్రాణములు ప్రాణసఖీ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 14

నినుబొందిన పిమ్మట మఱి నాకును నిండు ప్రాణములు బోయిననూ
భయంకరంబగు పాపంబును మఱి బన్నుగ వచ్చిన భయపడనూ!
భయ స్వభావముగలదానా విను! బన్నుగ వ్యాకులతను జెందీ
నిను సేవించెడి యీ భక్తునిగని నను బొందుము మఱి సుశ్రోణీ! 15

బలవంతుండగు నాదండుడు మఱి బన్నుగ యీ విధమున బలికీ,
పెనుగులాడెడీ యా కన్యను మఱి పెనుభూతముగా బట్టుకొనీ
బాహువులను మఱి బట్టుకొనియునూ బలాత్కారముగ గ్రహియించీ,
యథా కామముగ మైధునమునకును నలరుచు నుపక్రమించె మఱిన్! 16

ఆ దండుడు మఱి మహా ఘోరమును నలరుచు దారుణమైనట్టీ
పాపకృత్యమును జేసి వెంటనే బన్నుగ శీఘ్రముగా నతడున్!
అత్యుత్తమ మగు సుందర నగరము నలరు దనదు నిజపురమునకున్
మధుమంతమునకు బయలుదేరెనూ మానుగ భయపడుచును నతడున్! 17

ఆ అరజయు మఱి రోదించునదై అలరుచు భయంబడుచున్నదియై
ఆశ్రమమునకు సమీపముజేరీ యా తరుణియు వేదన తోడన్!
వేదతుల్యుడగు తండ్రి కొఱకునై దీనత వీక్షించుచు నుండెన్!
కంటికి మంటికి కన్నీరొలుకుచు నేకధారగా నుండెనటన్! 18

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ఎనుబదియవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఎనుబది యొకటవ సర్గము

(శుక్రాచార్యుని శాపముచేత దండుడు వాని రాజ్యము నశించుట)

అనంతమైనా కాంతి గలిగినా యా శుక్రాచార్యుడు వేగన్,
ఆ వృత్తాంతము వినినవాడునై యలరి శిష్యులను గూడికొని
యాకలితో బాధను బడుచును మఱి యలరుచు ముహూర్తకాలమునన్
దన యాశ్రమమును దిరిగి వచ్చెనూ దగ తన సుతను గనుంగొనగన్! 1

దీనురాలునూ పరాగంబుచే దీరుగ కప్పగ బడినదియున్
ప్రాతఃకాలమునందు సూర్యుచే బన్నుగ కప్పగబడినట్టి
వెన్నెలవలెనూ కాంతిహీనమై వేదన తోడను నున్నదియున్
అట్టి రజను గనె యాచార్యుండును నిట్టె నందె యాశ్చర్యంబున్! 2

అట్టి సమయమున యాచార్యుండును నాకలిచేతను బీడితుడై
మహా కోపమును గలిగెను నతనికి మానుగ శక్యముగా కుండన్,
అతడు మూడు లోకములను గూడను నలరి కాల్చి వేసెడి విధమున్,
తన శిష్యులతో బలికెను నాతడు దగ క్రోధముతో జ్వలించుచున్! 3

కోపించిన నా జేత మఱియునూ కూరిమి నా శాపము జేతన్,
విపరీతంబగు ప్రవృత్తి గలిగియు వినయ విహీనుండైనట్టి
ఈ దండునకును అగ్ని శిఖకు వలె నింపుగ భయంకరంబైనా
ఎట్టి యాపదయు రానున్నదొ మఱి గట్టిగ జూడుడు నికముందున్ 4

ప్రజ్వరిల్లెడి అగ్ని జ్వాలలను బన్నుగ స్పృశించి నట్టులనూ,
ఈమెను ముట్టిన దుష్టబుద్ధియగు నిల దురాత్మునకు నికమీదన్,
పరివారంబును వినాశనంబును బరగ దాపురించినది మఱిన్
గురుపుత్రిని యవమానించిన యా ఘోర పాతకునికిని యిపుడున్,
ఏమి శిక్ష విధియింపవలయునో యెఱుగను గద హృదయమునందున్! 5

ఏ కారణమున దండుడు నీ విధి నిండు భయంకర పాపమునూ
జేసినాడొ మఱి యాకారణంబున స్థిరముగ యా దుర్బుద్ధి మఱిన్!

పాపకర్మకును తగిన ఫలంబును బరగ నందగల డింక సుమా!
తానుగాక తన వారిని గూడను దగ యగ్నిని బడవేయు నికన్! 6

పాపకర్మ మఱి పాపాచారము బరగ జేయు దుర్మతి యైనా
ఈ రాజును మఱి పుత్ర సహితముగ యింపుగ సైన్యముతో గూడన్!
వాహనములతో నశించిపోవును వనరగ ప్రకృతిజేత మఱిన్!
ఏడుతరములను దుఃఖము జెందును బీడు వడిన పొలమును బోలెన్। 7

దుర్మతియగు నీతని దేశంబును దోరముగా నూరైనట్టి
యోజనముల పరిధిని నింద్రుండును భాజనముగ మఱి పరాగమున్,
కురిపించియు మఱి కాల్చివేయునూ కుదురుగ పచ్చిక లేకుండన్
పచ్చని మొక్కయు గనరాకుండగ వెచ్చని గాడ్పులతో నుండున్! 8

ప్రాణులన్నియును నశించిపోవును బన్నుగ కనిపింపక మఱియున్,
ఇచ్చటగల స్థావరములు మఱియును మచ్చిక జంగమములు గూడన్,
పాంసు పరాగము నంతట గురియును బరగ ధూళి వర్షము జేతన్!
నశింపగలవూ! కనిపింపక మఱి కదిలిపోవుచుండును నెటకో! 9

దండుని దేశము సరిహద్దులు మఱి మెండుగ నున్నవొ నా వఱకున్
నిలిచియున్న యాప్రాణులన్నియును నిర్మల ప్రాణి సమూహంబున్!
సప్తదివసముల పాంసు పరాగము సరగున బొందియు వేగముగన్!
కనబడకుండగ మాయమగును మఱి కదిలిపోవు చుండును నెటకో! 10

ఇటుల బలికి యా శుక్రాచార్యులు చటుల క్రోధమున శీఘ్రముగన్
ఆశ్రమ వాసులతో బలికెను మఱి యలరుచు వారలతోని మఱిన్!
మీరందఱు దేశము సరిహద్దుల నివసింపుడు వేగము జనుడూ!
అనుచు శిష్య సముదాయము తోడను నలరి బలికె యాచార్యుండున్! 11

శుక్రాచార్యుని మాట వినియునూ సురుచిరముగ యాశ్రమ మందున్
నున్న జనంబును నా దేశంబును బన్నుగ విడిచియు వేగముగన్,
సరిహద్దుల వెలుపల వసియించెను బరిహరించి తమ నివాసమున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 12

శుక్రాచార్యుడు మునులతోని మఱి మోదముతోడను నిటు బలికెన్
తన పుత్రికయగు యరజను గాంచియు దగ యీ విధమున కోపముతో!
దుర్బుద్ధియు గలదానా వినుమా! తోరముగా నీ యాశ్రమమున్
అభ్యాసము జేయుచు యోగంబును నలరి యుండుమా నిచ్చోటన్,
ఈ యాశ్రమమున వసించుచుండుము నిండు మనసుతో నుండు మికన్! 13

అరజా! యోజన విశాలమైనా యలరు మనోహరమైనట్టీ
ఈ సరస్సు ప్రాంతమునందుననూ యెట్టి మనో వ్యధ లేనట్టీ
అనుభవింపుమా! భగవచ్చింతన బద్మసంభవుని పూజించీ,
కాలంబునకును వేచియుండుమా! కర్మ ఫలము దప్పించుటకున్! 14

నీ సమీపమున యెట్టి మృగంబులు నిర్మలముగ రాత్రుల యందున్
వాసంబును మరి జేయుచుండునో వర్ధిలుచుండును నిత్యంబున్!
ఏ నాటికినీ ధూళి వర్షమున నింపుగ జంపగ బడవు సుమా!
నీ తోడను మఱి గూడియుండునూ! నిత్యము స్నేహ సుసంపదలన్! 15

ఆ సమయంబున యా భార్గవియును నరజయు వినయముతోని మఱిన్,
బహు దుఃఖించుచు వేదన తోడుత బ్రహ్మ ఋషియు నగు పితృాజ్ఞన్,
వినియును 'అట్లే! జేసెద నను'చును విన్నపంబు మఱి జేయుచునూ!
అచ్ఛోటను మఱి వాసము జేయుచు నలరి యుండె బహుకాలంబున్! 16

శుక్రాచార్యులు నిటుల బలికి మఱి సురుచిరముగ మఱియొక చోటున్,
వాసమేర్పరచుకొని యుండెను మఱియును వనరగ శిష్యులతో గూడన్!
ఆ దండుని రాజ్యము గూడను మఱి యలరి సప్త దివసంబులలో!
భృత్య సైన్య వాహనముల తోడను భస్మంబై పోయెను వేగన్! 17

రఘురామా! విను నాదు వచనములు రమ్య మధురమగు వాక్యములన్
వింధ్య శైల పర్వతముల మధ్యను సంధ్య వోలె నున్నట్టిదియున్,
దండదేశమును ధర్మ సౌఖ్య పరిపూర్ణమైన కృతయుగముననూ
అధర్మంబు మఱి జరుగుట చేతను అల ఋషి మును లీ విధముగనూ
శాపము నిచ్చెను పాంగు వర్షమున పాపము దొలగగ నచ్చోటన్! 18

కాకుత్స్థా! శ్రీ రామా వినుమా! కడు రమ్యములగు వచనములన్,
అది మొదలుగ యీ ప్రాంతంబునకును నలరు దండకారణ్యమనీ,
పేరు వచ్చినది నీకును దెలియును బేరిమి యచ్చటి ముచ్చటలున్
ఇచట మునులు నివసించుట చేతను నింపుగ జన స్థానంబనియున్!
పేరు వచ్చినది యా విషయంబును పేరిమి తెలియును నీకు మఱిన్!
ప్రశ్నించిన యా విషయములన్నియు బన్నుగ దెలిపితి రఘురామా! 19, 20

ఓ వీరా! సంధ్యోపాసనకును సమయము దాటుచు నున్నదియున్,
నలుమూలలనూ మహర్షులందఱు నయముగ స్నానముజేసి మఱిన్,
జలపూర్ణములగు కుంభంబుల మఱి సరసత దగ్గఱ నుంచుకొనీ
సూర్యదేవునీ యుపాసించుచును సురుచిరముగ నున్నారు మఱిన్! 21

ఒక చోటను మఱి కలిసినట్టి యా యొనరగ బ్రహ్మ సువేత్తలునూ,
బ్రాహ్మణమును మఱి బఠించుచుండిరి బన్నుగ వేదాధ్యయనంబుల్!
సూర్యదేవుడును నస్తమించెనూ సరుచిరముగ సంధ్యలు విరిసెన్!
సంధ్యోపాసన జేయుము వేగము సరసత భక్తి ప్రపత్తులతో! 22

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ఎనుబది యొకటవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఎనుబది రెండవ సర్గము

(రాముడు అగస్త్యాశ్రమమునుండి అయోధ్యకు బయలుదేరుట)

రఘునందనుడగు రాముడంతటను రహి యగస్త్యు మాటలు వినియున్
సంధ్యోపాసన జేయుటకును మఱి సరసత యప్సర గణములతో
నిండినట్టి యా పవిత్రమైనా నిర్మల పరిశుద్ధమునైనా
అట్టి సరసునకు బోయెను రాముడు నిట్టె సంధ్యలను వార్చుటకున్! 1

రామచంద్రుడును నట్టి సరస్సున యాచమనంబును జేసి మఱిన్,
సాయంసంధ్యను నుపాసించి మఱి చయ్యన యర్ఘ్యంబును వదిలీ
మహాత్ముడైనా యా యగస్త్యునీ మానుగ యాశ్రమ మందు మఱిన్,
భక్తితోని మఱి ప్రవేశించెనూ రక్తిని మునులను సేవించీ! 2

అగస్త్యుండు మఱి యా శ్రీరాముని యలరు భోజనము కొఱకు మఱిన్
ఉత్తమ గుణములు నున్న దుంపలును నురుతర శాకంబులు మఱియున్
వరియన్నంబును మొదలగు వానిని వనరగ యేర్పాటును జేసీ,
వన్య ఫలములను పాలు పెరుగులను వడ్డింపగ జేసెను వేగన్! 3

నరుల లోపలను శ్రేష్ఠుడైన యా నయముగ రాముడు నమ్రతముతో
సమానమైనా యన్నంబును దిని సంతోషించిన వాడగుచున్,
ఫలమూలంబులు, పాలు, పెరుగులను బన్నుగ భుజించి యాతండున్,
ఆ రాత్రిని యచ్చట శయనించెను నా యగస్త్యు యాశ్రమ మందున్ 4

అరిందముండగు రఘూత్తముండగు నా రఘునందనుడును మఱిన్
ప్రాతఃకాలమునందు లేచి మఱి యాహ్నిక కృత్యములను మఱియున్,
జేసికొనీ మఱి దిరిగి వెళ్లుటకు శ్రీకరముగ మఱి యనుజ్ఞనూ
పొందుట కొఱకై యా యగస్త్యునీ పొలుపుగ సమీపమును జేరెన్! 5

అల శ్రీరాముడు కుంభసంభవుని అభివందనమును జేసి మఱిన్
అంజలితోడను నిటులను బలికెను నతి వినయమునను గూడికొనీ
నేను నాదు పురి యయోధ్యకును మఱి నిక్కముగా బోవుట కొఱకై
అనుమతి నిను యాచించుచుంటినీ యలరి యిమ్ము దయతోగూడీ! 6

మహాత్ముడవు నగు నీ దర్శనమున మానుగ ధన్యుడ నైతిని నే
అనుగ్రహింపగబడితి మహాత్మా! యారని నీ తేజము జేతన్!

మహాత్ములగు మిము దర్శించుటకును మానుగ పవిత్రమందుటకున్
మీ యాశ్రమముకు రాగలను సుమా! మిగుల మిమ్ము సేవించుటకున్! 7

కాకుత్స్థుండగు రామచంద్రుడును గడు నద్భుతమగు యోచనయున్,
గలిగిన వాక్యము బలుకుచుండగా నిలసిత ధర్మము నేత్రముగా
గలుగు మహాముని సంతోషించుచు కమ్మని మాటలు నిటు లనియెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 8

రామా! శుభకర నక్షరములునూ రహి గలిగిన నీ వచనములున్
ఆశ్చర్యకరంబులుగా నున్నవి! యలరుచు రఘునందన నీవే
అఖిల భూతములు యఖండ భూతిగ యలరుచు నుందువు నెల్లపుడున్,
పవిత్రమును మఱి జేయువాడవును! బన్నుగ యీశ్వరుడవు నీవే! 9

రఘురామా! నిను మహూర్తకాలము రహి గాంతురొ వారలును మఱిన్
పవిత్రులగుదురు పావనులై మఱి పరమ పుణ్యమును గాంతురిలన్,
స్వర్గలోకమును బొంది వారలును సర్వసుఖములను నంది మఱిన్
దివిజుల చేతను బూజింపగబడి తేజస్సుల నిల బొందెదరూ! 10

భూలోకములో నే ప్రాణులు నిను పూర్ణ దృష్టితో జూడకనూ
క్రూర దృష్టితో జూచుచుందురో కూరిమి యమ దండము జేతన్
గొట్టుబడుచునూ నరకము నందున కూలిపోవుదురు వెనువెంటన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 11

రఘు వంశంబున శ్రేష్ఠుడ! రామా! రమ్యముగా విను! నా పలుకుల్,
నీవు సకల ప్రాణులను నీ విధము నిజముగ పవిత్రులను జేసీ,
సుగతిని కల్పింతువు శ్రీరామా! సురుచిరముగ వారలను మఱిన్
భూలోకములో నిన్ను గూర్చి మఱి బొలుపుగ స్తుతించు వారలునూ!
పరమసిద్ధినీ నందగలరు సుమ! బన్నుగ స్వర్గము నందుదురూ! 12

నీవు నెట్టి క్లేశంబులు లేకను నిశ్చయముగ పయనించి మఱిన్
మంగళ ప్రదమగు మార్గమునందున మఱి పయనింపుము రఘురామా!
ధర్మముగా బాలింపుము రామా! దయతో ప్రజలను జూడు మఱిన్!
ఈ మహా వసుంధరకును నీవును నింపుగ నీవు సుగతివి కదా! 13

మునిచేతను మఱి నిటుల బలుకబడి మోదముతో శ్రీరాఘవుడున్
పుణ్యశీలమును గల యాతనికిని పొలుపుగ మునికిని వేగముగన్!

అంజలి ఘటించి నమస్కరించుచు నతి వినయంబును గూడికొనీ
ఆ ముని యాశీస్సులను గైకొనెను నలరుచు శుభకర వచనములన్! 14

అటుబిమ్మట యా యగస్త్యునికినీ యల సమస్త మునులకును మఱిన్
నమస్కరించుచు యాశీస్సులగొని యలంకరింపగ బడినట్టీ
యా పుష్పకమును సావధానుడై యధిరోహించెను రాఘవుడున్
జయజయ ధ్వనులును జేసిరి దివిజులు జానకీ రమణునకు మఱియున్! 15

ముని గణంబులన్నియు గూడను మఱి మోదమునను బోవుచునున్నా
ఇంద్రుని వంటీ కాంతి గలిగినా యా శ్రీరాముని దేవతలున్!
సహస్రాక్షునికి వలె నందఱునూ యన్ని వైపులను గూడికొనీ
ఆశీర్వాదంబులతోడను మఱి యలరి సలిపిరీ పూజలునూ! 16

హేమ భూషితంబైన పుష్పకము నింపుగ సుఖముగ గూర్చొనినా
రామచంద్రుడును వర్షాకాలము రమ్యముగా మేఘము వర్దన్
నున్నటువంటీ చంద్రుని వలెనూ యురుతర ప్రకాశమును నందెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 17

అటుబిమ్మట మధ్యాహ్న సమయమున యా రాఘవుడును నయోధ్యకున్
జేరి యచటచట బూజింపగబడి యలరి సేవకా బృందముచే
మధ్యమ కక్షను జేరెను నాతడు మానుగ పుష్పకమును గాంచీ,
ఇటులను బలికెను నా శ్రీరాముడు నింపుగ యా పుష్పకమునకున్! 18

'నీవు బొమ్మికను! నీకు స్వస్తియగు!' నిర్మలముగ శ్రీరాఘవుడున్
బలుకుచు సుందరమైనదియును మఱి బన్నుగ స్వేచ్ఛా ప్రయాణమున్!
జేయునట్టి యా పుష్పకమును మఱి శీఘ్రముగా బంపియు వేగన్
ద్వారమునందున నున్నయట్టి యా ద్వారపాలకుని వేగముగన్
బహు నాతురతను నిటులను బలికెను బన్నుగ యాజ్ఞాపించినటుల్! 19

లఘు విక్రమమును గలిగినట్టి యా లక్ష్మణ కుమారుని మఱియున్
భరతుని యొద్దకు గూడ బోయి మఱి బన్నుగ నేనును వచ్చినటుల్,
దెలిపి మఱియు నా యొద్దకు బిలువుము దీరుగ నేనును బలిచినటుల్!
ఆలస్యము మఱి జేయబోకుమా! అలరి బిలువు వారందఱినీ! 20

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ఎనుబది రెండవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఎనుబది మూడవ సర్గము

(భరతుడు సలహో జెప్పగా రాముడు రాజసూయ యాగము చేయు ప్రయత్నము నుండి విరమించుట)

అక్లిష్ట కర్మణుడైన రామునీ యాతని మాటలు వినియు మఱిన్,
ద్వారపాలకుడు బయలుదెరెనూ దగ లక్ష్మణ భరతుల బిలువన్!
దీసికొనియు మఱి వచ్చి దెలిపెనూ దీరుగ శ్రీరాముని కపుడున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

రఘునందనుడును శ్రీరాముడు మఱి రయమున భరతుడు లక్ష్మణుడున్
వచ్చినట్లుగా జూచి యిరువురను మచ్చికతో వద్దకు బిలిచీ,
కౌగలించుకుని బలికె నిట్టులను కమనీయంబగు వచనములన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

ఓ భరతుడ! ఓ లక్ష్మణులారా! యొనరగ యత్యుత్తమమైనా
బ్రాహ్మణ కార్యము జేసినట్లుగను బన్నుగ నిప్పుడు మఱల మఱిన్
ధర్మసేతువును రాజధర్మమును దగ సంబంధించిన యటువంటీ
అత్యుత్తమ మర్యాదను జేయగ యలరుచు నుంటిని నేను మఱిన్! 3

ఇట్టి ధర్మసేతువు జూడగనూ యక్షయమైనది నిజముగనూ
అవ్యయమైనది నాకు మిక్కిలియు అలరి యిష్టమైనదియునూ
ఇది ధర్మంబును బోషించును మఱి ధర్మ విస్తరము జేయు మఱిన్,
సకల పాపముల నశింపజేయును సార్వభౌమమును రక్షించున్! 4

ఆత్మవంటి వారైన వారు మఱి యలరి మీర లిద్దఱి తోడన్
కలిసియు నేమను నత్యుత్తమమగు గడగి రాజసూయమును మఱిన్!
చేయవలయునని గోరుచునుంటిని శ్రీకరముగ నే నిపుడు మఱిన్!
దానియందు ధర్మము శాశ్వతముగ యలరి నిలిచి యుండును నెపుడున్! 5

శత్రు వినాశకుడైన మిత్రుడును శాత్రవ సంహారుడునైనా
ఆతని చేతను నిర్వహింపబడె యల యత్యుత్తమ మైనట్టీ!
రాజ సూయ యాగమును జేసియును రమ్యముగా వరుణత్వమునూ!
పొందె నాతడును నందెను స్వర్గము జిందె యశస్సును నీ వసుధన్! 6

ధర్మవేత్తయగు సోముడుగూడను ధర్మముతో బాటుగ నడిచీ
రాజసూయ యాగమును జేసియును రమ్యముగా లోకమునందున్,
కీర్తిని మఱియును శాశ్వతముగనూ స్థానమునందెను నీ వసుధన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 7

మనకు నెద్ది మఱి శ్రేయస్కరమో యాలోచింపుడు మీరిపుడున్,
మీరును నాతో చర్చింపుడు మఱి మిగుల గాఢముగ విషయంబున్,
బహు శ్రద్ధగ యోజించి మఱియునూ బరగ నెద్ది హితమో నదియున్
యేది మున్ముందు ఫలమునిచ్చునో నింపుగ దెలుపుడు నాకు మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 8

వాక్య విశారదుడైన భరతుడును వనరగ రాముని పలుకు వినీ,
అంజలి ఘటించి నమస్కరించుచు నలరి బలికె నీ విధముగనూ! 9

సత్పురుషుడ! ఓ మహా బాహు విను! శాంతముగా నా వచనములన్,
అతి విక్రమమును గలిగినవాడవు! అలరి నేర్పరివి ధర్మమునన్!
ధర్మము ప్రతిష్ఠమైనది రామా! దగ నీయందే! నీ యందే!
సకల భూమియును ప్రతిష్ఠితంబై సరసత యున్నది నీయందే!
కీర్తి ప్రతిష్ఠితమై యున్నది మఱి కిలకిల లాడుచు నీయందే! 10

రాజులందఱును మహాత్ముండవని రమ్యముగా లోకంబులకున్,
నాథుండవునూ యైన నిన్ను మఱి రహినాథుడ వని భావించీ,
దేవతలును మఱి ప్రజాపతికి వలె దీరుగ జూచుచు నున్నారూ!
ఎటుల మేము నిను జూచుచుంటిమో! యటులను జూచుచు నున్నారూ! 11

మహాబలముగల రాజా! రామా! మానుగ రాజులు నందఱునూ,
పుత్రులు తండ్రిని జూచినట్లుగా బొలుపుగ జూచుచు నున్నారూ!
ఈ ధరణికి మఱి సకల ప్రాణులకు నింపుగ నీవే గతివి సుమా!
నీవు దెలిపినటు నడచెదరందఱు నికిలేశుండవు నీవు మఱిన్! 12

ఓ రాజా! ఓ రఘురామా! విను! యొనరగ నాదు సువాక్యములన్,
ఏ యజ్ఞము వలనను నీ ధరణిని నిలగల రాజ సువంశములున్,
అన్ని నశించుటకును నవకాశము నలరి యున్నవో నట్టి యెడన్!
అట్టి యజ్ఞమును మహనీయుడవగు నలరి నీ వెటుల జేయుదువూ? 13

రఘురామా! యీ భూమి మీదగల రహి పౌరుష వంతులకు మఱిన్
అందఱికిని మఱి కోపముగలుగును చందము నా యజ్ఞము వలనన్!

కావున దానిని మానుట మంచిది! కమనీయమునగు స్నేహమునన్!
అందఱికిని మఱి గలుగు కోపమున యలరి వినాశము గలుగు గదా! 14

పురుష శ్రేష్ఠుడ! గుణవంతుడ విను! బూనికతో నా వచనములన్!
అతుల విక్రమము గలవాడా! విను! యలరి భూమిపై నున్నట్టి
చంపుట వారిని యుక్తముగాదూ! సహజముగా వారందఱునూ!
నీ వశమందున యుండిరిగద మఱి నీకెందుల కీ క్రోధంబున్? 15

సత్య పరాక్రమ వంతుడైన యా సహజముగా నా రాఘవుడున్
అద్భుత మయములు భరతుడు బలికిన యా వచనములను విని యతడున్!
మహానందమును నందెను నాతడు మానుగ నీ విధమున బలికెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

కైకేయీ యానంద వర్ధనుడు గడు రమ్యములగు బలుకులనూ
వినియు రాముడును బలికెను నిటులను విశదముగా భరతుని తోడన్
అనఘా! నీదు సువచనంబులచే అలరి సంతసించితి నేనున్!
పరితుష్టుడ నే నైతిని భరతా! పరమానందము నొందితినీ! 17

పురుషశ్రేష్ఠుడ! భరత కుమారా! పూనికతో నీ వాక్యములున్,
భూమికి పాలన హేతువులును నగు బుడమికి కల్యాణము గలుగూ!
ధర్మ సమ్మతంబగు వాక్యములను ధార్మికంబులగు విషయములన్,
నిర్భయంబుగా దెలిపినావు గద! నిఖిల ప్రజలు నానందింపన్! 18

ధర్మంబులు మరి తెలిసినవాడా! దగు రీతిని నేనిపుడు మఱిన్
నీదు మంచి మాటల చేతను మఱి నిండు హృదయమున సమ్మతినీ!
క్రతువులయందున శ్రేష్ఠమైన యా క్రతువును రాజసుయాగమునూ!
జేయరాదనియు నిర్ణయించితిని దీరుగ నీ మాటల వలనన్! 19

మహాబలా! ఓ లక్ష్మణ పూర్వజ! మానుగ విచక్షణుల జేతన్
లోకపీడనా హేతువైన యా లోలత కర్మంబులను మఱిన్,
చేయుగరాదూ! భరతకుమారా! చిన్న వారలును గూడ మఱిన్
గారవింపుగా వలయును భరతా! గారవమున వారల మాటల్!
గ్రహింపదగునూ! అందువలన మఱి కడు యుక్తయు మంచిదియైనా
నీ వచనములను నే వినుచుంటిని! నెమ్మదిని మంచిది యనుచున్! 20

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో ఎనుబది మూడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఎనుబది నాల్గవ సర్గము

(లక్ష్మణుడు అశ్వమేధ యాగమును గురించి తెలుపుతూ
ఇంద్రవృత్రుల కథను దెలుపుట, వృత్రుడు తపస్సు జేయుట,
అతనిని జంపుమని ఇంద్రుడు విష్ణువును ప్రార్థించుట)

శ్రీరాముడు మఱి మహాత్ముడైనా శ్రీకరముగ భరతుండు మఱిన్
పలికిన పలుకులు విని లక్ష్మణుడును బన్నుగ శ్రీరామునితో నిటులన్!
శుభకరమగు వాక్యమును బలికెనూ! శుభచింతన మఱి జేయుచునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

రఘురామా! విను! అశ్వమేధమును రమ్య యజ్ఞమును జేసినచో
సర్వపాపముల దొలగించును మఱి సకల దుఃఖములు దొలగించున్,
ఎదిరింపగ శక్యముగానిది మఱి యది పవిత్రమును జేయునదీ,
ఇట్టి యజ్ఞమును నీ హృదయమునకు నిష్టంబగు గాతను రామా! 2

మహాత్ముడును మఱి విక్రమవంతుడు మానుగ యింద్రుని విషయమునన్
పూర్వము జరిగిన వృత్తాంతంబును పొందుగ ప్రసిద్ధమే యదియున్
బ్రహ్మహత్య పాపంబు తగిలినా బన్నుగ యా యింద్రుడు మఱియున్
హయ మేధముచే పవిత్రుడాయెను నందఱికిని దెలియును నిదియున్! 3

మహా బాహు! నా దేవాసురులును మానుగ స్నేహముతో నున్నా
పూర్వకాలమున లోకంబులకును బొలుపుగ యిష్టుండైనట్టీ
వృత్రుం డనియెడి పేరు గలిగినా వికటరాక్షసుం డొకడు మఱిన్
మహా భయంకర రూపము తోడను మానుగ నుండెను నాతండున్! 4

వంద యోజనంబుల లావును మఱి జిందగ మూడొందల యెత్తున్
నున్నటువంటీ! యా రాక్షసుడును నురుతర రూపము గలిగియునూ!
ఆతడు త్రైలోక్యంబులకును మఱి యద్భుత స్నేహమునను గూడీ
నందఱినీ మఱి జూచుచుండెనూ యనురాగమునను గూడికొనీ! 5

ధర్మజ్ఞుండును కృతజ్ఞుండునూ దగ బుద్ధిని గలిగిన వాడున్!
అయన యాతడును సావధానముగ యలరి విశాలంబైనట్టీ

భూ మండలమును ధర్మము జేతను బొందుగ బాలించెను నతడున్
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 6

ఆ సమయంబున యా వృత్రుండును నలరి పాలనము సేయగనూ
సమస్త కామములను నిచ్చెను మఱి సరసత వసుధా స్థలియందున్!
ప్రసూనంబులును ఫల మూలంబులు బన్నుగ సకల సుధాన్యములన్
రసభరితములై యుండెనప్పుడును రాజుగ వృత్రుడు నున్నపుడున్! 7

మహాత్ముడైనా యాతని పృథివియు మానుగ దున్నకనే పండున్,
సంపన్నముగా నుండెనప్పుడును సకల సస్యములతో నపుడున్!
ఆ వృత్రుడు నతి విశాలమైనా యాశ్చర్యము గలిగించెడిదీ!
అట్టి రాజ్యమును ననుభవించెనూ నిట్టి ధర్మమును నిలుపగనూ! 8

ఆ వృత్రునకును మనస్సునందున యద్భుత యాలోచన గలిగెన్
అనుత్తమంబగు తపస్సు జేసెద యా తపస్సు శ్రేయస్కరమున్
ఇతర సుఖములన్నియు గూడను మఱి నిల స్థిరంబులును గావియున్!
అందుకనే నే తపస్సు జేసెద యల పరమేశ్వరు దలచుచునూ! 9

ఆ వృత్రుడు తన జ్యేష్ఠ కుమారుని యల మధురుడు అనువాని మఱిన్
తన స్థానంబున యధిపతిగా మఱి దనర జేసి జనె యడవులకున్
సకల సురలకును భయముగలుగగా సకల ప్రాణులును భయమందన్
మహోగ్రమైనా తపస్సు జేసెను మానుగ ధర కంపమునంద న్! 10

వృత్రాసురుడును నా విధముగనూ వికటమైన తపమును జేయన్,
సురరాజగునా యింద్రుడు గూడను సోలి భయార్తుండై వేగన్
వైకుంఠంబును బోయి విష్ణువును విమల ప్రార్థనను జేసి మఱిన్
సురలకు గలిగిన యాపదలను మఱి సురుచిరముగ వివరించి మఱిన్! 11

మహాప్రభూ! ఓ లోకరక్షకా! మానుగ నా ప్రార్థన వినుమా!
తపస్సు జేసెడి వృత్రునిచే మఱి దగ సమస్త లోకంబులునూ!
జయింపబడినవి, దేవా! వినుమా! సరసత ధర్మాత్ముం డతడున్,
మహా బలీయుడు, నాతని నేనును మానుగ శాసింపగ లేనూ! 12

సురేశ్వరా! ఓ విష్ణు దేవుడా! సురుచిరముగ నా మాట వినూ!
ఆతడు నింకను తపస్సుజేసిన యలరెడి లోకంబులు మఱియున్

నుండెడి వఱకును నాతని వశమై నుండును పాలించును నతడున్
సురలము మేమును దాస్యవృత్తిచే స్రుక్కుచు నిల జీవింపవలెన్! 13

సురేశ్వరా! యా మహాబలముగల పరమోదారుం డైనట్టి
అట్టి యాతనిని యుపేక్షించుచును నలరి యుంటివీ నీవు మఱిన్,
నీవు క్రుద్ధుడవు నగుచుండగ మఱి నీరసుడగు నా వృత్రుండున్,
క్షణకాలము జీవింపగ జాలడు జాగుసేయకుము రణమునకున్! 14

విష్ణుదేవుడా! నీకు నితనిపై నిర్మల స్నేహము గలిగి మఱిన్,
నుండినప్పుడును నీతండును మఱి రూఢిగ లోకములకును మఱిన్,
ప్రభువైనాడూ! మఱి ప్రస్తుతమును బన్నుగ శాసించును జగతిన్,
కావున నీతని శాసింపగనూ గలవు నీవు మఱి జగదీశా! 15

అట్టి నీవు మఱి సమాహితుడవునై యలరి సావధానము తోడన్
లోకములను మఱి యనుగ్రహింపుము లోలత్వంబును లేకుండన్!
నీవు జేసినా రక్షణ జేతను నిఖిలము ప్రశాంతముగ నుండున్!
బాధారహితంబై యుండునుగద! వ్యధా రహితముగ నుండు మఱిన్! 16

విష్ణుదేవుడా! దేవతలందఱు విమలాంజలులను నీ కొఱకున్,
ఎదురు జూచుచున్నారు గదా ప్రభు! సదయ హృదయ రక్షింపు మఱిన్,
ఘన వృత్రాసుర సంహారంబును ఘనముగ జేసియు సురలకునూ!
సహాయంబు మఱి సహకారంబును సరసత జేయుము వేగ ప్రభూ! 17

మహాత్ములైనా యీ దేవతలను మానుగ నిత్యము రక్షించీ,
సహాయంబు మఱి జేసినాడవును సహకారంబును జేసి మఱిన్
ఇతరులెవ్వరును నీ కార్యంబును నించుక జేయగ జాలరుగా!
గతిలేనట్టి వారలకును మఱి గతి నీవే గద! పరమాత్మా! 18

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ఎనుబది నాల్గవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఎనుబది యైదవ సర్గము

(ఇంద్రునిలోనూ, వాని వజ్రాయుధములోనూ, విష్ణు తేజస్సు ప్రవేశించుట- ఇంద్రుని వజ్రాయుధము జేత వృత్రాసుర సంహారము - బ్రహ్మహత్య యావరించిన యింద్రుడు తమోమయమైన ప్రదేశమునకు వెడలిపోవుట)

శత్రు నిబర్హుడైన రాఘవుడు శాత్రవ సంహారుడు నైనా
లక్ష్మణు కుమారు వాక్యములను విని లాలితముగ నీ విధి బలికెన్!
సువ్రత! వృత్రుని సంహారంబును సురుచిరముగ దెలుపుము నాకున్,
సావధానముగ వినియెద లక్ష్మణ! శాంతముగా దెలుపుము నాకున్! 1

రాముని జేతను నిటుల బలుకబడి రమ్యముగా నా లక్ష్మణుడున్
దివ్యమైన యా వృత్తాంతంబును దీరుగ బలికెను రామునకున్! 2

సకల లోకముల సంరక్షకుడగు సర్వేశ్వరుడగు విష్ణువునూ!
ఇంద్రుని వచనములను విని మఱియును సాంద్రముగా దేవతలయునూ
వచనంబుల విని యా దేవుండును వనరగ దేవత లందఱితో
మధుర వచనముల బలికెను నీ విధి మాధుర్యము జిందగ నపుడున్! 3

మహాత్ముడైనా పుత్రునితోడను మానుగ పూర్వపు స్నేహముచే
కట్టబడిన వాడనుగా నుంటిని గడు ప్రీతిని నే గూడికొనీ
ఆ కారణమున, మీ ప్రియార్థమును నలరి జేయగా లేను మఱిన్
ఆ మహాసురుని జంపగ జాలను నలరి నాదు హస్తంబులచే! 4

మీకు నుత్తమంబగు సుఖంబునూ మేదురముగ గల్పింపవలెన్
ఆ వృత్రుడు బ్రతికుండగా జగతి యలరి మీకు సుఖమును లేదూ!
అందువలననే యా సురాధిపతి యా పని చేయగ వలయు సుమా!
అట్టి యుపాయము దెలిపెద వినుడూ! అలరుచు మీరందఱు నిపుడున్! 5

దేవతలారా వినుడు దెలిపెదను దివ్యమైన నొక యుపాయమున్
నన్ను నేను మూడైన విధములుగ నయముగ విభజించెద నేనున్!

నా స్వరూపమును మూడు విధములై నయముగ నుండును వ్యాపించీ!
అట్లు జేయుటను నింద్రుడు వృత్రుని అలరి జంప గలుగును నింకన్! 6

ఒక యంశము వాసవుని బొందునూ యొనరగ నాదు త్రియంశములన్
రెండవ యంశము వజ్రాయుధమున మెండుగ నుండును మిళితంబై
మూడవ యంశము భూమియుబొందును మురిపెముగా తనయుండగుచున్!
అపుడు నింద్రుడును వృత్రాసురునీ యలరి చంపగలుగును నపుడున్! 7

విష్ణుదేవునీ యా మాటలు విని విమల భావములు గల సురలున్
నిటులను బలికిరి యంజలి తోడను నింపుగ సుమధుర భావమునన్
దైత్య రాక్షసుల సంహరించినా దయానిధీ! ఓ జగదీశా!
ఎటుల నీవు మఱి దెలుపుచుందువో అటులే సందేహములేదూ! 8

నీకు భద్రమగు గాత! మంగళము! నీకు క్షేమమును నగు గాతన్!
వృత్రాసురునీ సంహారంబును నాత్రముననను గోరుచునున్నా!
మేము బోయెదము మా స్థానములకు మిగల హర్షములతోని మఱిన్!
ఇంద్రుని యందున బ్రవేశబెట్టుము! సాంద్రముగా నీ యంశమునూ! 9

అటుబిమ్మట యింద్రాది దేవతలు నా మహాత్ములును వేగముగన్
వృత్రాసురుడును తపస్సు జేసెడి ఆ ప్రదేశమును జేరి మఱిన్
మహారణ్యమునకును బోయిరి వే మానుగ యాతని దర్శింపన్!
ఆ వృత్రాసురు వధించు టెటులని ఆలోచనలను జేసి రటన్! 10

ఆ దేవతలును దపస్సు జేసెడి యల తేజసులను నిండిన యా
మహాసురుని దర్శించిరి వారట మానుగ యగ్నికివోలె మఱిన్
మూడు లోకముల నాశ్చర్యముగా మోదముతో నాకాశంబున్
కాల్చివేయుచున్నాడా యన్నటు గనబడుచుండెను నచ్చటనూ! 11

ఆ వృత్రాసురు జూడగనే యట యా దేవతలు మనసులలో
ఇతనిని మన మెటు వధింపగలమా! యితని నుండి మనమును నిపుడున్
పరాజయంబును రాకుండును మఱి బన్నుగ రణమున బోరాడన్!
అని యీ విధముగ యాలోచించుచు నలసట జెందిరి వారు మఱిన్! 12

ఆ దేవతలును నచటను గూడీ యాలోచించుచు నుండగనూ!
ఆ దేవేంద్రుడు వజ్రాయుధమును నలరి రెండు చేతులతోడన్,
బట్టుకొనియు మఱి వృత్రాసురుపై బన్నుగ ప్రయోగమును జేసెన్!
ఆ ప్రయోగమున జెలరేగెను నట యలరుచు మంటలు జ్వాలలునూ! 13

భయంకరంబగు కాలాగ్నికి వలె భగ భగ మండెడి జ్వాల వలెన్
వృత్రుని శిరస్సు క్రింద బడగనూ నాత్రముగా జగ మంతయునూ!
భయము బొందెనూ హాహారవముల బరగ జెలగె లోకము నందున్!
ప్రాణులన్నియును గలతను బొంవదెను బన్నుగ హృదయములందుననూ! 14

మహా యశస్వియు విబుధాధిపుడును మానుగ నింద్రుడు గాంచి మఱిన్
ఆ వృత్రుని వధ అసంభావ్యముగ యలరుచు మది భావించి మఱిన్
ఏమి జరుగనో యని మదిలోపల నింపుగ భయబడుచు నతడున్
లోకంబుల యా చివరి దేశముల లోలత బోయెను శీఘ్రముగన్! 15

ఆ శచీపతియు వృత్రు వధించీ యటు నిటు బోవుచు నుండగనూ!
వెనువెంటను నా బ్రహ్మ హత్యయును వెంబడించె యాతనిని మఱిన్
అతని యవయవములను జొరబడెను నలరి బ్రహ్మ హత్యయును మఱిన్
అపుడు నింద్రుడును దుఃఖక్రాంతుం డయ్యెను సురగణముల మధ్యన్! 16

శత్రువునగు నా వృత్రుని జంపీ సహస్రాక్షుడును వేగముగన్
కనబడకుండగ మాయమగుటయును కనలి యగ్ని దేవతలు మఱిన్
త్రైలోక్యంబులకు ప్రభువునూ దీరుగ లోకము లన్నిటికిన్!
దేవ దేవుడగు విష్ణుదేవునీ దీరుగ పూజించిరి యంతన్! 17

నీవే యుత్తమ గతివి యటంచును నెఱనమ్మితి మిట పరమాత్మా!
అన్నిటి కంటెను పూర్వమునున్నా వన్నిల దేవుడవును నీవున్!
సకల భూతముల రక్షణ కొఱకై నరగున విష్ణువు నైనావూ!
అఖిల జీవులకు నాత్మవు నీవే! యఖిల జీవులకు పితరుడువున్! 18

సురశార్దూలా! ఆత్మ స్వరూపా! సురుచిరముగ వృత్రాసురునీ
వధించినాడవు! బ్రహ్మ హత్యయును కంపము నొందించెను నింద్రున్

బాదించుచునున్నది యాతనినీ బాధ గలుగు జేయుచు నుండెన్ !
దాని నుండి యా యింద్రునకును మఱి దగ విడుదల వేగము నిమ్మా! 19

దేవతల యా వచనంబును విని దేవతలకు మఱి ప్రభువైనా
విష్ణుదేవుడును బలికె నిట్టులను విమలమైన వచనంబులనూ!
ఇంద్రుడు నన్నే పూజించినచో సాంద్రముగా ప్రార్థించినచో
నే నాతని మఱి పవిత్రవంతుగ నిశ్చయముగ నే జేసెదనూ! 20

పాక శాసనుడు పుణ్యాకరంబును బన్నుగ హయమేధంబుననూ
ననుబూజించిన పొందగలడు సుమ నయముగ సర్వశుభంబులనూ!
ఎట్టి భయంబును లేకయుండునూ, గట్టిగ దేవత్వమును మఱిన్!
మఱల యాతడును నింద్రత్వంబును మానుగ బొందును స్థిరముగనూ! 21

దేవతలకు మఱి ప్రభువగు విష్ణువు దీరుగ యమృతమును వోలెన్
వాక్కును బలుకుచు నా దేవతలకు చక్కని సందేశము నిచ్చీ,
ఆ దేవతలును స్తుతించు చుండగ నలరుచు నా విష్ణువు మఱియున్
స్వర్గంబునకును బయలుదేరెనూ సురుచిరముగ గరుడిని పైనీ! 22

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ఎనుబది యైదవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఎనుబది యాఱవ సర్గము

(ఇంద్రుడు లేకపోవుటచే జగత్తులో అశాంతి పెరుగుట.
ఇంద్రుడు అశ్వమేధము జేసి బ్రహ్మ హత్య నుండి విముక్తుడగుట)

నరులందుననూ శ్రేష్ఠుడైన యా నయముగ లక్ష్మణు డపుడు మఱిన్
ఆ వృత్రాసురు వృత్తాంతంబును నలరుచు బూర్తిగ దెలిపి మఱిన్,
మిగిలిన వృత్తాంతంబు మొదలిడెను మేదినీశుడును వినగ మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

అటు బిమ్మటనూ మహా వీరుడును నలరెడి దేవ భయంకరుడున్,
అల వృత్రుండును జంపబడగనూ యల దేవేంద్రుని జేత మఱిన్
ఆ యింద్రునకును గలిగెను పాపము నల వృత్రాసురు జంపుటచే
బ్రహ్మ హత్య పాపంబును దగిలెను బరగ స్పృహను దప్పెను నతడున్! 2

అతడు లోకముల జివటికి బోయెను నల సంజ్ఞను మఱి గోల్పోయెన్,
అల యింద్రుడు చైతన్య రహితుడై యలరి కొంత కాలం బచటన్,
సర్పంబును వలె దొరలుచు నుండెను సరసత ధూళిని బడుచు మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

అటుబిమ్మట యా సహస్రాక్షుడును నట కనబడకుండగ బోయి మఱిన్
లోకమంతయును దిగులును జెందెను లోలత్వంబును బొంది మఱిన్
భూమియందు తడి లేకపోయెనూ పొలుపుగ యడవులు యన్నియునూ!
ఎండిపోయినవి ప్రకృతి యంతయును మండిపోయినటు లుండె నటన్! 4

చెఱువులందునను, నదుల యందునను స్థిరముగ నీరును లేక మఱిన్,
ఎండిపోయినవి నదీజలంబులు బండలు గనబడు చుండె మఱిన్,
అనావృష్టిచే ప్రాణులకును మఱి యల మనుష్యులకు గూడ మఱిన్
సంక్షోభము నేర్పడె జీవులకు సకలము బాధాకర మయ్యెన్! 5

లోకమంతయును నీ విధముగ మఱి లోలత క్షీణించుట గాంచీ,
దేవతలందఱు దిగులును జెందిరి దీనత నొందిరి సర్వులునూ!

పూర్వము విష్ణువు జేసిన యజ్ఞము బూనికతో మఱి జేయుటకున్
సంభారంబులు సమగూర్చిరి మఱి సాధుజనుల ప్రోత్సాహముతో 6

అటుబిమ్మట యా దేవతలందఱు నలరి యుపాధ్యాయుల తోడన్!
ఋషుల తోని మఱి గూడినవారై రూఢిగ మునులను గూడి మఱిన్,
భయముచేత మఱి మోహితుడైనా బన్నుగ యింద్రుడుగల చోటున్
వెదుకుచు మఱి వారచటికి బోయిరి విమల సహస్రాక్షుని గనగన్! 7

ఆ దివిజులునూ బ్రహ్మ హత్యచే నావరింపబడినట్టియు నూ
ఆ దేవేంద్రుని గాంచి వారలును నల దేవతలకు ప్రభువైనా
ఆతనిని తమ ముందు నుంచుకొని నలరుచు సురులును మునులు మఱిన్
అశ్వమేధ యాగంబును జేసిరి యలరుచు ఘన మునులును ఋషులున్! 8

నరేశ్వరా! ఓ రఘురామా! విను! నలరు నాదు వచనంబులునూ
అటుబిమ్మట యా బ్రహ్మ హత్యయును చటుల పాపమున మండి మఱిన్,
విముక్తి కొఱకై మహాత్ముడైనా విశ్రుత యశమును గలవాడున్,
ఆ మహేంద్రునీ యశ్వమేధమును నట జరిగెను నతి ఘనముగనూ! 9

యజ్ఞము సమాప్తమైన పిమ్మటను నలరి మహాత్ముడు నింద్రుని యా
బ్రహ్మ హత్యయును వారలతోడను బన్నుగ సమీపమును జేరీ
నాకు నెచ్చటను స్థానంబును మఱి నయముగ కల్పింతురు మీరల్
అనుచును బలికెను బ్రహ్మ హత్యయును నలరు దేవతా ప్రముఖులతో! 10

అపుడా సురలును సంతోషించియు నలరి బ్రహ్మ హత్యను గూర్చి
నిటులను బలికిరి బ్రహ్మ హత్యతో నింపుగ సుమధుర వచనములన్!
సమీపింపగా శక్యముగానీ సరసత వినుమా నీవు మఱిన్!
నిన్ను నీవె నాలుగు భాగములుగ నిండుగ విభజింపుము నీవే! 11

దుఃఖము గలిగించెడి నివాసమును దోరముగా గలిగించునదీ,
బ్రహ్మ హత్యయును నా సమయంబున బరగ సురల మాటలు వినియున్
ఆ విధముగ నాలుగు భాగములై నలువైపుల నది చెదురుచునూ
మఱియొక చోటన తన నివాసమును మానుగ కోరెను దేవతలన్! 12

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఎనుబది యాఱవ సర్గము

(ఇంద్రుడు లేకపోవుటచే జగత్తులో అశాంతి పెరుగుట.
ఇంద్రుడు అశ్వమేధము జేసి బ్రహ్మ హత్య నుండి విముక్తుడగుట)

నరులందునమా శ్రేష్ఠుడైన యా నయముగ లక్ష్మణు డపుడు మఱిన్
ఆ వృత్రాసురు వృత్తాంతంబును నలరుచు బూర్తిగ దెలిపి మఱిన్,
మిగిలిన వృత్తాంతంబు మొదలిడెను మేదినీశుడును వినగ మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

అటు బిమ్మటనూ మహా వీరుడును నలరెడి దేవ భయంకరుడున్,
అల వృత్రుండును జంపబడగనూ యల దేవేంద్రుని జేత మఱిన్
ఆ యింద్రునకును గలిగెను పాపము నల వృత్రాసురు జంపుటచే
బ్రహ్మ హత్య పాపంబును దగిలెను బరగ స్పృహను దప్పెను నతడున్! 2

అతడు లోకముల జివఱికి బోయెను నల సంజ్ఞను మఱి గోల్పోయెన్,
అల యింద్రుడు చైతన్య రహితుడై యలరి కొంత కాలం బచటన్,
సర్పంబును వలె దొరలుచు నుండెను సరసత ధూళిని బడుచు మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

అటుబిమ్మట యా సహస్రాక్షుడును నట కనబడకుండగ బోయి మఱిన్
లోకమంతయును దిగులును జెందెను లోలత్వంబును బొంది మఱిన్
భూమియందు తడి లేకపోయెనూ పాలుపుగ యడవులు యన్నియునూ!
ఎండిపోయినవి ప్రకృతి యంతయును మండిపోయినటు లుండె నటన్! 4

చెఱువులందునను, నదుల యందునను స్థిరముగ నీరును లేక మఱిన్,
ఎండిపోయినవి నదీజలంబులు బండలు గనబడు చుండె మఱిన్,
అనావృష్టిచే ప్రాణులకును మఱి యల మనుష్యులకు గూడ మఱిన్
సంక్షోభము నేర్పడె జీవులకు సకలము బాధాకర మయ్యెన్! 5

లోకమంతయును నీ విధముగ మఱి లోలత క్షీణించుట గాంచి,
దేవతలందఱు దిగులును జెందిరి దీనత నొందిరి సర్వులునూ!

పూర్వము విష్ణువు జేసిన యజ్ఞము బూనికతో మఱి జేయుటకున్
సంభారంబులు సమగూర్చిరి మఱి సాధుజనుల ప్రోత్సాహముతో 6

అటుబిమ్మట యా దేవతలందఱు నలరి యుపాధ్యాయుల తోడన్!
ఋషుల తోని మఱి గూడినవారై రూఢిగ మునులను గూడి మఱిన్,
భయముచేత మఱి మోహితుడైనా బన్నుగ యింద్రుడుగల చోటున్
వెదుకుచు మఱి వారచటికి బోయిరి విమల సహస్రాక్షుని గనగన్! 7

ఆ దివిజులునూ బ్రహ్మ హత్యచే నావంరింపబడినట్టియు నూ
ఆ దేవేంద్రుని గాంచి వారలును నల దేవతలకు ప్రభువైనా
ఆతనిని తమ ముందు నుంచుకొని నలరుచు సురులును మునులు మఱిన్
అశ్వమేధ యాగంబును జేసిరి యలరుచు ఘన మునులును ఋషులున్! 8

నరేశ్వరా! ఓ రఘురామా! విను! నలరు నాదు వచనంబులునూ
అటుబిమ్మట యా బ్రహ్మ హత్యయును చటుల పాపమున మండి మఱిన్,
విముక్తి కొఱకై మహాత్ముడైనా విశ్రుత యశమును గలవాడున్,
ఆ మహేంద్రునీ యశ్వమేధమును నట జరిగెను నతి ఘనముగనూ! 9

యజ్ఞము సమాప్తమైన పిమ్మటను నలరి మహాత్ముడు నింద్రుని యా
బ్రహ్మ హత్యయును వారలతోడను బన్నుగ సమీపమును జేరీ
నాకు నెచ్చటను స్థానంబును మఱి నయముగ కల్పింతురు మీరల్
అనుచును బలికెను బ్రహ్మ హత్యయును నలరు దేవతా ప్రముఖులతో! 10

అపుడా సురలును సంతోషించియు నలరి బ్రహ్మ హత్యను గూర్చీ
నిటులను బలికిరి బ్రహ్మ హత్యతో నింపుగ సుమధుర వచనములన్!
సమీపింపగా శక్యముగానీ సరసత వినుమా నీవు మఱిన్!
నిన్ను నీవె నాలుగు భాగములుగ నిండుగ విభజింపుము నీవే! 11

దుఃఖము గలిగించెడి నివాసమును దోరముగా గలిగించునదీ,
బ్రహ్మ హత్యయును నా సమయంబున బరగ సురల మాటలు వినియున్
ఆ విధముగ నాలుగు భాగములై నలువైపుల నది చెదురుచునూ
మఱియొక చోటన తన నివాసమును మానుగ కోరెను దేవతలన్! 12

నేనొక యంశముజేత పూర్ణముగ నిండిన యుదకము గల యట్టీ
నదులయందు నా వర్షాకాలపు నాలుగు మాసములును మఱియున్,
పాపాత్ముల దర్పము దొలగించుచు బహు స్వేచ్ఛగ వర్తించుచునూ!
నివసించెద! ఓ దేవతలారా! నిరుపమానముగ నదులందున్! 13

నే నొక యంశము జేత నెల్లపుడు నిఖిల కాలముల యందుననూ!
చవట భూములను బీడు బూములను సరసత యుండెద నేనచటన్!
సందేహంబును లేదు సుమా మఱి సత్యము జెప్పుచు నుంటి నిలన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 14

నా మూడవ యంశము జేతను మఱి నయముగ యౌవన వతులైనా
దర్పంబును గల స్త్రీలయందు మఱి దర్పంబును దొలగించుచునూ!
మూడు దినము లట నివసింతును మఱి మోదముగా వారల యందున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

దేవతలారా! నాల్గవభాగము దీరుగ యపరాధము లేనీ
బ్రాహ్మణ శ్రేష్ఠుల నెవరు వంచనగ బన్నుగ జూపుదురో వారిన్!
ఆశ్రయించుకుని నేనుందును సుమ! యలరు వ్యధలు సమగూర్చుచునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

ఆ సమయంబున దేవతలందఱు నలరి బ్రహ్మ హత్యను గాంచీ
మధురముగా నీ విధమున బలికిరి మానుగ విధేయతను గూడీ
ఓ దుర్వస నీ పలుకులన్నియును నిజముగ జరుగును గాత నికన్!
నీ కే దిష్టమొ యటుల జేయుమా! నిశ్చయముగ యంతయు జరుగున్! 17

అటుబిమ్మట యా దేవతలందఱు నలరుచు సంతోషము తోడన్,
గూడిన వారై సహస్రాక్షునికి గూరిమి జేసిరి వందనముల్!
అల శచీపతియు గూడ పాపమును నల దొలగియు దుఃఖము దొలగీ
బాధలేని వా డయ్యెను జగతిని బరువును దీర్చిన వా డయ్యెన్! 18

ఇంద్రుడు పాపము దొలగిన వాడై సాంద్ర ప్రతిష్ఠితు డయ్యె మఱిన్,
లోకమంతయును ప్రశాంతమయ్యెను లోలత్వంబును దొలగె మఱిన్,

ఆ యింద్రుండును నద్భుతమైనా యట్టి యశ్వమేధమును మఱిన్,
బహు విధములుగా గీర్తించెను మఱి బన్నుగ కొనియాడెను దానిన్! 19

రఘురామా! యా అశ్వమేధమూ అనుగ్రహము నిట్టిదియు సుమా!
మహాభాగ్యమును గల వాడా మఱి మానుగ వినుమా! నా పలుకుల్!
అశ్వమేధయాగంబును జేయుము! నలరి శుభములను బడయు మికన్!
యాగంబుల నది సాటిలేనిదీ యోగంబును సమగూర్చునదీ! 20

మహాత్ముండు మఱి యింద్రుని తోడను మానుగ విక్రమమును గలుగూ!
తేజస్సులుగల రామచంద్రుడును దీరుగ మనోహరమునైనా
ఉత్తమమైనా లక్ష్మణు మాటను నురుతరమగు సూచనయు మఱిన్
సంతోషించెను సరస హృదయమున సమయస్ఫూర్తిని లక్ష్మణునీ! 21

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ఎనుబది యాఱవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఎనుబది యేడవ సర్గము

(రాముడు లక్ష్మణునకు ఇలోపాఖ్యానము దెలుపుట - ఇలుడు ఒక మాసము పాటు స్త్రీగను, ఒక మాసము పురుషుడుగా నుండుట)

సుమిత్ర నందనుడగు లక్ష్మణునీ సురుచిరమగు వచనముల వినీ,
మాటలయందున నేర్పరియును మఱి మహాతేజమును గలవాడున్,
రామచంద్రుడును నవ్వుచు బలికెను రమణీయముగా లక్ష్మణుతో!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

సుమిత్రనందన! నర శ్రేష్ఠా వినుము! సూనృతమగు నీ వచనములన్,
వృత్రాసుర వధ గూర్చియు మఱియును వాజి మేధ ఫలమును గూర్చి
నీవు వచించిన విషయమంతయును నిజము యధార్థం బగును సుమా!
నేనొక విషయము నీకు దెలిపెదను నెమ్మది వినుమా! సౌమిత్రీ! 2

సౌమ్యా! వినుమా! లక్ష్మణ! దెలిపెద సరసత నాదు సువచనములన్
పూర్వము కర్దమ ప్రజాపతికినీ పొలుపుగ నొక్క కుమారుండున్,
పరమ ధార్మికుడు శ్రీమంతుండును బన్నుగ యిలుడను బేరుగలా,
బాహ్లిక దేశమునకును రాజుగా బన్నుగ నుండెడి వాడతడున్! 3

నర శ్రేష్ఠుడ! మఱి మహా యశస్సును నయముగ గలిగిన రాజు మఱిన్,
భూమినంతనూ తన వశమందున పొలుపుగ యుంచుకొనీ యతడున్,
ప్రజలందఱినీ పుత్రుల వలెనూ బన్నుగ జూచుచు నుండె మఱిన్,
ధర్మంబును నాలుగు పాదములను దగ పాలించుచు నుండె మఱిన్! 4

సౌమ్యుడ వగు ఓ లక్ష్మణ కుమార! సరసత విను నా వచనములన్!
దేవతలును మరి ధీమంతులునగు దైత్యులు రాక్షసులును మఱియున్,
నాగులు, యక్షులు, గంధర్వులునూ నయముగ నిత్యము భయంబుతో,
ఆ రాజును బూజించు చుండిరీ యలరి ప్రియంబును జూపుచునూ
ఇతనికి కోపము వచ్చినచో మఱి నిల త్రైలోక్యంబులు గూడన్,
బయపడుచుండెను బహు విధములుగా బాధ నొందు చుండెను మిగులన్! 5,6

బాహ్లీక దేశపు రాజును మఱియును బరగ కీర్తి శాలియు నైనా
యా యిలుండు నా విధముగ ధర్మము నలరి పరాక్రమ మందుననూ
స్థిరుడై యున్నత గుణములతోడను శ్రీకరముగ వానరుడును నై
ప్రకాశించు చుండెను తేజముతో భానునివలె యా కార్యమునన్! 7

మహాబాహువగు నా రాజును మఱి మానుగ భృత్యుల తోని మఱిన్
సైన్యముతోడను వాహనములతో సరసత మనోహరంబైనా
వసంత చైత్రమునందు నాతడును వన విహారమును జేయుచునూ
వన్య మృగంబుల వేటాడెను మఱి వలలు వేసి మఱి బట్టుచునూ! 8

ఆ యిలుండు మఱి యరణ్యమందున యలరుచు వందల కొలదియునూ
వేలకొలది మృగములను జంపియును విమలుండగు నా రాజనకున్,
సంతృప్తియు మఱి గలుగలేదుగద! సరియని మది దలపగ లేదూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 9

మహాత్ముడైనా యా యిలుండు మఱి మానుగ యనేక మృగములనూ,
జంపెను గానీ యా రాజుకు మఱి సంతృప్తియు గలుగగ లేదూ!
తిరిగి తిరిగి పిదపను యాతండును దీరుగ కుమార స్వామియునూ!
జన్మించిన దేశమునకు బోయెను సరసత వేటకునై యతడున్! 10

ఆ ప్రదేశమున యందు దేవతల యలరు ప్రభువు దుర్ధర్షుడునూ!
అయిన శివుడు తన యనుచరులను మఱి యలరి గూడికొని యచ్చోటన్,
మహాపార్వతిని విహరింపగనూ మానుగ జేయుచు నుండె నటన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 11

వృషభధ్వజుడగు బరమేశుండును విమల పార్వతికి ప్రియంబునూ
జేయగోరుచును నా పర్వతమున శ్రీకరముగ సెల యేఱుననూ!
స్త్రీ రూపంబును ధరించి యుండెను జిత్తము హర్షము బులకింపన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 12

ఆవన ప్రాంతము నందునున్న యా నల మగ ప్రాణులు నన్నియునూ
పుంలింగములో నున్న తరువులును బొలుపుగ నన్నియు గూడ మఱిన్,
స్త్రీ లింగముగా మారిపోయినవి చిత్రముగా నా సమయమునన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 13

అచటనున్న ప్రతి వస్తువుగూడను నలరుచు స్త్రీ సంజ్ఞను బొందెన్
ఇంత లోపలను కర్దమ పుత్రుడు ఇల రాజును నచటకు వచ్చెన్
వేలకొలది మృగములను జంపుచును వికటముగా వేటాడుచునూ
ఆ ప్రదేశమునకును వచ్చెను మఱి యలసట బొందుచు నాతండున్! 14

లక్ష్మణ కుమార! సుమిత్రనందన! లాలితముగ విను! వచనములన్!
పక్షులతోడను మృగములతోడను బన్నుగ క్రూర మృగంబులతో
సమస్తమును మఱి స్త్రీ లింగంబున సరసత మారుట జూచి మఱిన్
తాను మఱియు దన యనుచర బృందము దగ స్త్రీలుగ మారుట గాంచీ
ఆశ్చర్యంబును బొందెను నాతడు నలరుచు గుర్తించెను నతడున్
తానును నారీతిగ యైనందుకు దన మనసున చింతను గూడీ!
దుఃఖము గలిగెను నాతనికిని మఱి! దోరముగా నా సమయమునన్! 15,16

శివుడు జేసినా పనియని దలచుచు చిత్తమునను భయమును బడుచున్
భృత్యులతోడనూ సైన్యంబులతో సత్యముగా వాహనములతో
కూడినట్టి యా రాజా నిలుండును గూరిమి యంజలి ఘటించుచున్,
జటాధారియును నగు నా శివునీ సరగున శరణము బొందె నటన్! 17

అటు బిమ్మట యా వరముల నిచ్చెడి యలరుచు దేవీ సంగతుడై
యున్నటువంటీ యా పరమేశుడు సన్నగ నవ్వుచు బలికె నిటుల్!
స్వయముగ వరములు నిచ్చువాడునై సరసత యిలునితొ నిటు బలికెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 18

కర్దమ పుత్రుడ! మహా బలా విను! గడు ధన్యుండవు లేలెమ్మా!
ఉత్తమ వ్రతములు గలవాడా! మఱి యురుతర గుణములు గలవాడా!
ఓ సౌమ్యుడ! ఓయిలాకుమారా! యొనరగ పురుషత్వము దప్పన్
మఱియొక వరమును గోరుకొనుము మఱి మంజులముగ నే నిచ్చెదనూ! 19

స్త్రీగా మారిన యా రాజును మఱి స్థిర మహాత్ముడగు యా శివునీ
ప్రత్యాఖ్యానింపగ బడువాడై మఱి బన్నుగ పరమేశుని జేతన్!
మఱియొక వరమును గోరలేదు మఱి మనసున చింతను విడలేదూ!
శోకము చేతను గుమిలిబోవుచును సొలిపోవుచును నతడుండెన్! 20

అటుబిమ్మట యా మహారాజును నలరుచు బహు శోకముతోడన్
శైలరాజునకు కుమార్తెయైనా సద్గుణవతి యా పార్వతికిన్!
పరిపూర్ణంబగు భక్తి భావమున బన్నుగ నమస్కరించి మఱిన్,
ఈ విధముగ ప్రార్థించెను నాతడు నింపుగ నిలుడును బ్రార్థించీ! 21

వరముల నీయగ సమర్థురాలివి ఓ దేవీ! నా ప్రార్థననూ
నీవు జగతికిని వరముల నిత్తువు! నిఖలమునకు మాతవు నీవే!
సౌమ్యమైన నేత్రముతో జూడుము! సకలము నీవే గద మాతా!
మనసులోని నా కోర్కెను దీర్చుము! మన్నింపుము నను దయతోడన్! 22

రుద్రుని ప్రియురాలైనటువంటీ! రూఢిగ జగదీశ్వరియు మఱిన్,
ఈశ్వరు సన్నిధియందు రాజఋషి యింపుగ మనసున నున్నట్టీ,
అభిప్రాయమును దెలిసికొనియు మఱి యలరుచు నీ విధముగ బలికెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 23

నీకు శివుండును సగము వరంబును నిర్ద్వంద్వంబుగ నిచ్చు మఱిన్,
నేనును నీకును సగము వరంబున నిశ్చయంబుగను నిచ్చెదనూ!
అందువలన యా స్త్రీత్వబును మఱి చందముగా పురుషత్వములన్!
ఏది కావలెనా దాని లోపలను నింపుగ సగమును గోరుకొనూ! 24

దేవి యొక్క యా యద్భుతమైనది యాశ్చర్య కరంబును నైనా
అత్యుత్తమమగు నా వరంబు విని యలరి యిలుండును మనసుననూ!
సంతోషించుచు నిటులను బలికెను సద్గుణ మతియగు బార్వతి తోన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 25

తల్లీ పార్వతి! దయతో వినుమా! నరసముగా నా వచనములన్,
తల్లీ! దేవీ! సౌందర్యంబును సాటిలేని దానవు నీవున్!
నా విషయంబున ప్రసన్ను రాలవు నయముగ యగుచో శీఘ్రముగన్!
ఒక మాసము స్త్రీత్వంబు బొందగా యొనరగ దయసేయుము నాకున్,
మఱల నొక్క మాసము పురుషుండును నగుదుగాక! ధరయందుననూ! 26

రుచిరాననమును గల దేవియునూ, సురుచిరముగ నాతని మనసున్
దెలిసికొనియునూ శుభకర వాక్యము దీరుగ బలికెను నాతనితో!
'అట్టే' కాగల దనుచును బలికెను నంబుజాక్షి యాతని తోడన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 27

ఓ రాజా! పురుషుడవైనప్పుడు నొనర స్త్రీత్వమును స్మరింపవూ!
తదుపరి మాసము నందున నీవును దగ స్త్రీగా నున్నపుడు మఱిన్
పురుషత్వంబును స్మరియింపవు సుమ? పూర్ణముగా నిది జరుగునికన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 28

ఈ విధముగ యా యిల రాజును మఱి యింపుగ యొక మాసంబు మఱిన్
పురుషుడుగా నయి మరొక్క మాసము బొలుపుగ త్రైలోక్యంబులనూ,
సాటిలేని సుందరిగా యిలయై సరసత స్త్రీగా నగుచుండెన్!
చిత్రజగతి మఱి చిత్రంబులు మఱి స్థిరముగ జరుగుచు నుండు విలన్! 29

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ఎనుబది యేడవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఎనుబది యెనిమిదవ సర్గము

(ఇలా బుధుల పరస్పర సందర్శనము, ఇలా సహచారిణులను కింపురుషి అను పేరుపెట్టి బుధుడు వారిని పర్వతము మీద నివసింపుడని పంపుట)

శ్రీరామునిచే బలుకబడిన యా శ్రీకరమగు నా యిలుని కథా
వృత్తాంతంబును భరత లక్ష్మణులు విమలాశ్చర్యము నందుచునూ
విచిత్రమగు నా వృత్తాంతంబును వీనుల విందుగ వినుచు మఱిన్
అద్భుతంబనుచు బలికిరి వారలు నాశ్చర్యంబును నొందుచునూ! 1

అల శ్రీ లక్ష్మణ భరతు లిద్దఱును నలరెడి మహాత్ముడైనట్టీ
ఆ రాజునకును గలిగిన యట్టీ యల స్త్రీత్వము పురుషత్వములన్
గూర్చినట్టి యా విస్తరంబునూ కూర్మి నమస్కృతి పూర్వముగన్
అల రాముని మఱలను బ్రశ్నించిరి యలరి దెలుపుమని యంతయునూ! 2

దుర్గతి జెందిన యా యిలుండునూ తోరముగా స్త్రీ యైనపుడున్
ఎట్లు ప్రవర్తించెనో నే విధముగను నింపుగ వర్తించెనో నతడున్
పురుషుడు నైనపుడు యిలుండును బొందుగ వర్తించెను నతడున్!
కౌతూహలమును నగుచున్నది సుమ! కూరిమి విచిత్ర మిదియుగదా! 3

కౌతూహలమున యడిగిన ప్రశ్నకు గడగి లక్ష్మణుడు భరతుండున్
విని యా రఘుకుల వర్ధనుండునూ, విమలముగా నిటులను బలికెన్!
రాజునకును మఱి యేమి జరిగెనో రమ్యముగా నిటులను దెలిపెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 4

లోకసుందరీ స్త్రీగా దోచెను లోలత ప్రథమ సుమాసమునన్,
పూర్వము తననూ యనుసరించినా పొలుపుగ వచ్చిన వారలతో,
వారందఱునూ స్త్రీలుగ మారిరి వారలతో గూడిక గలదై
పద్మ పత్రముల వంటి నేత్రములు బన్నుగ గల యా సుందరియున్,
వృక్షంబులతో పొదలతోడనూ, విమలమైన లతలను గూడీ
వ్యాకులమగు నా యరణ్యంబులో వనరగ పాదంబుల తోనే
విహరించెను నా లలనామణియును విమల తేజమున నచ్చోటన్! 5,6

ఆ సమయంబున ఇలా దేవియును నల సమస్త వాహనములనూ
విడిచి వేసెనూ కాలి నడకతో విస్తృతముగ మఱి నడుచుచునూ
ఆ పర్వత వివరమునందుననూ నడుచుచు క్రీడలు సలిపెనటన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 7

అటుబిమ్మట యా వనస్థలముననూ నల పర్వతము సమీపమునన్
అనేక విధముల పక్షులతోడను నలఘు నీటి పక్షుల తోడన్
సుందరమైనా కాంతి గలిగినా సురుచిర సరస్సు గాంచె నటన్!
ఆ సరస్సులో చంద్రుని సుతుడగు నలరు బుధుని మఱి యిల జూచెన్!
బుధుండునూ మఱి ఉదయించిన యా పూర్ణచంద్రునకు వోలె మఱిన్!
ప్రజ్వలించుచుండెను నాతండును బన్నుగ తనదు శరీరముతో! 8,9

జల మధ్యంబున నుండి తీవ్రమగు సరసత తపస్సు జేయుచునూ,
నున్నవాడునూ, దురాసదుండును నురుతర బుద్ధియు గలవాడున్,
యశస్కరుండును, కామ కరుండును నల సుందర రూపము గలిగీ,
యౌవనమున నున్నట్టి వాడునూ, యట్టి బుధుని జూచెను నిలయున్! 10

రఘునందన! ఓ లక్ష్మణ వినుమా! యామెయు నాశ్చర్యము నందీ
స్త్రీలుగ మారిన పూర్వ పురుషులను జిత్తము కలుషము నందగనూ
సమస్తమైనా సరస్సునంతను సరసత క్షోభింపగ జేసెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 11

బుధుడైతే యామెను జూడగనే పాలుపుగ మన్మథ శరములకున్
వశుడైపోయెను వశమును దప్పెను వనరగ ధైర్యము గోల్పోయెన్!
అప్పుడాతడును నీటిలోపలను నలరి చలించెను కామమునన్!
ఆశ్చర్యంబున నామెను గాంచుచు నలరి మనసునను జింతించెన్! 12

మూడు లోకముల స్త్రీల కంటె మఱి మురిపెముగను సుందరియైనా
ఇలను గాంచుచును నా బుధుండునూ నింపుగ కామార్తుండగుచున్!
మనసు లోపలను జింతించెను మఱి మానుగ సాలోచన తోడన్,
దేవత కంటెను నధికురాలు మఱి దీరుగ యెవరో యామె గదా! 13

ఇట్టి రూపమున శోభించెడి యా నింపుగ యుండెడి స్త్రీని మఱిన్
దివిదేవతలా స్త్రీల యందునను దీరుగ నే జూడగలేమా!
నాగ స్త్రీలలోగాని మఱియునూ నయముగ యసురుల స్త్రీలందున్
అప్సరలందున గాని నేను మఱి యలరి జూడనే లేదు గదా! 14

ఈమె యితరునీ భార్యగాక మఱి నింపుగ యవివాహిత యగుచో
నాకు భార్యయగు గాక! యీమెనూ యలరి స్వీకరించెద నేనున్!
ఈ విధముగ మఱి యాలోచించియు నింపుగ జల మధ్యమునుండీ!
నదీ తీరమును జేరెను నాతడు నయముగ యిలకు సమీపమునన్! 15

ధర్మాత్ముండగు బుధుడు బిమ్మటను దగ యాశ్రమమును జేరి మఱిన్.
అటగల యుత్తమ స్త్రీలను బిలిచెను నాప్యాయతతో నాతండున్!
ఆ స్త్రీలును గూడను వినయముతో నంజలి ఘటించుచు వారున్
ఆ బుధునికినీ నమస్కరించిరి యలరి వినయమునను గూడికొనీ! 16

ధర్మాత్ముండగు నా బుధుండునూ దగ యా స్త్రీలను బ్రశ్నించెన్!
త్రిలోక సుందరియైన యీమె మఱి దీరుగ యెవ్వరి భార్య మఱిన్?
యెందులకును మఱి యిటకొచ్చినదీ? చందముగా దెలుపుడు మీరల్!
విషయమంతయును దెలుపుడు నాకును వివరముగా వృత్తాంతంబున్!
ఆలస్యంబును జేయబోకుడూ? అలరి దీర్చి నా కౌతుకమున్! 17

బుధుని యొక్క యా శుభకరమైనా పొలుపుగ 'మధురాక్షరములతో
నున్నయట్టి యా మధుర వాక్యమును బన్నుగ విని యా స్త్రీలు మఱిన్!
మధుర వ్యాక్కుతో నీ విధి బిలికిరి మంగళకరమగు భావనమూ!
ఆ యువకునితో బలికి రంతటును నటు క్రీగంటను వీక్షించీ! 18

అందమైన యా కటి ప్రదేశము సుందరి యామెయు నెల్లపుడున్
ఆధిపత్యమును వహించి మాపై యలరుచున్నదీ నిజముగనూ!
వివాహంబు కాలేదు సుమా మఱి విమలభావమున మాతోడన్
కలిసి తిరుగుచుండును నెల్లపుడును కమ్మని గానము జేయుచునూ! 19

క్షత్రియుడైనా యా బుధుండునూ సరసత బలికెను వచనములన్
అస్పష్టముగా నుండుట గాంచియు యలరి వినియు నా వాక్యములన్

పుణ్యప్రదమగు నావర్తిని యగు పొలుపగు విద్యను మనసుననూ,
జపించె నాతడు భక్తి పూర్వముగ స్మరించి యా దేవతను మఱిన్! 20
(తెలియని యర్థము దెలియ జేయునది దీరుగ యందురు అవర్తినీ)

మునిశ్రేష్ఠుండగు నా బుధుండునూ యా రాజేంద్రుని సకలంబున్!
వృత్తాంతంబును దెలిసికొనియు మఱి వివరముగా నంతయు దెలిసీ,
సమస్తమైనా స్త్రీలను గూర్చియు సరసత నెఱిగియు నంతయునూ
ఆ యుత్తమమగు స్త్రీలతోని మఱి యలరుచు జిఱు నగవున బలికెన్! 21

మీరీ పర్వత శిఖరముపైనీ కింపురుషుల రూపంబులతో
నివసింపుచు నుండుడు మీరందఱు నిర్వైఱ భావము తోని మఱిన్
ఈ పర్వతమున పై భాగంబున నింపుగ మధుర సుగీతములన్!
వర్తిలుచుండుడు నివాసంబుగా నొనరగ విలాసంబులతోడన్! 22

ఓ వనితా మణులారా వినుడూ! యొనరగ మీరందఱు గూడన్
నిత్యంబును ఫలమూలంబులతో నిరతము పత్రంబుల తోడన్!
జీవనంబు గడిపెదరు మీరలును భావంబున సంతోషముతో
కింపురుషులు నను ప్రియ భర్తలనూ పొలుపుగ మీరలు బొందెదరూ! 23

ఆ స్త్రీలును మఱి సోమ పుత్రుడగు నలరు బుధుని వాక్యమును వినీ,
కింపురుషిలుగా జేయగబడిరీ కింపురుషులును సుభర్తలుగా
ఆ స్త్రీలందఱు నపుడు వేగమున యా పర్వత శిఖరము నేగీ!
విహరించుచు నుండిరి వారలునూ విమల గీత నృత్యంబులతో! 24

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ఎనుబది యెనిమిదవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

ఎనుబది తొమ్మిదవ సర్గము

(ఇలా బుధులకు పురూరవుడు అను పుత్రుడు జన్మించుట)

లక్ష్మణ భరతులు నిద్దఱునూ మఱి లాలితముగ కింపురుషులయున్,
ఉత్పత్తిని గూర్చియు వినియును మఱి యురుతర గుణములు గలిగిన యా
శ్రీరామునితో నిటులను బలికిరి చిత్తము హర్షము బొంగారన్,
ఇది చాలా యాశ్చర్యము ననుచును నింపుగ బలికిరి వారలునూ! 1

అటుబిమ్మట యా మహాయశుండును చటుల పరాక్రమవంతుడునూ
కీర్తిమంతుడగు రాముడు బలికెను కింపురుషులనూ గూర్చియునూ!
ఇలుని కథను మఱి తెలుపగ సాగెను నింపుగ మధురోక్తుల తోడన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

మునిశ్రేష్ఠుండగు బుధుడంతటనూ మోదముగా పర్వతమందున్
నివసించెడి యా సమస్తమైనా నిఖిల కిన్నరల జూచి మఱిన్
చిఱునవ్వును నవ్వుచు యాతండును స్థిర సౌందర్యము గలిగిన యా
స్త్రీని గూర్చి మఱి పలికెను నిటులను చిన్ని మాటలను యాతండున్! 3

సురుచిరాననే! సౌందర్యవతీ! సురుచిరముగ విను నా పలుకుల్
నేను చంద్రునీ ప్రియపుత్రుడనూ నిండు ప్రేమతో జూడు ననున్
స్నేహ పూర్ణమగు దృష్టిని జూడుము స్థిరమగు రక్తిని జేరు ననున్
సుందరమైనా కటి ప్రదేశము చందముగా గలదాన! ననున్!
నీ వానినిగా జేసికొనుము నను నిర్దయ జూడకు ప్రియురాలా! 4

తన వారలతో విడువబడిన యా తరుణి శూన్యమగు స్థలముననూ,
ఆతని మాటలు వినియు బిమ్మటను అందమైన ఘన కాంతిగలా!
అల సోముని పుత్రునితో నిటులనె యందమైన యిల వేగముగన్,
మన్మధ వశురాలై యోమెయునూ మాటలు దడబడుచును నపుడున్! 5

సోమసుతా! ఓ సౌమ్యుడ! వినుమా! సురుచిరముగ నే స్వేచ్ఛగనూ!
సంచరించెడీ దానను సుమ్మా! వంచన సేయకుమా నన్నున్
నీకు నేను వశురాలను నైతని! నిజముగ నాజ్ఞాపింపుము నన్నున్
ఏమి గోరుచున్నావో నీవును నింపుగ జేయుము! నిక నన్నున్! 6

కాముకుడైనా చంద్ర సుతుండును నల యిల యద్భుత పుణ్యమునూ
విని యా బుధుడును విమలానందము విస్తృతముగ నొందుచు నతడున్,
ఆమెతోని విహరించెను బుధుడును నద్భుతమగు ప్రకృతియందున్,
కొండలందు మఱి కోనలందునను కూరిమి సరస్సులందుననూ! 7

బహు సుందరమగు ముఖమును గలిగిన బన్నుగ యట్టి యిలను మఱియున్
అధికముగా క్రీడింప జేసెనూ యానందముగా రమియించెన్!
కాముకుడైనా యా బుధునికి మఱి గడిచిపోయె మాధవ తిథులున్,
క్షణము వోలె మఱి గడిచిపోయెనూ కమ్మని వైశాఖంబు మఱిన్! 8

అటుబిమ్మట యా మధుమాసంబును నలరి పూర్తియగు చుండుగనూ!
పూర్ణచంద్రునీ వంటి ముఖముగల పొలుపుగ శ్రీమంతుడు నైనా!
ఆ ప్రజాపతికి సుతుడు నిలుండును నందమైన శయనము మీదన్
మేలుకొనియెనూ పురుష రూపముగ మేదినీశుడుగ యా రాజున్! 9

అతడచ్చటనూ సలిలాలయమున నలరుచు దపస్సు జేయుచునూ
యూర్ధ్వబాహుడై నిరాలమ్బముగ యురుతర ధ్యానము గలవాడున్
సోముని పుత్రుడు బుధుని గాంచెనూ సురుచిరముగ యా యిలుండునూ
బుధుని గాంచి యాతనితో నిట్లనె బుధ జన సుతుడగు రాజపుడున్! 10

భగవంతుడ! ఓపూజ్యుడ! వినుమా! బన్నుగ యనుచరులను గలిసీ,
ప్రవేశింపగా శక్యముగానీ పర్వతమునకు నే నొచ్చితినీ!
కానీ నాదు సుసైన్యమెచ్చటను నయముగ కనిపించుట లేదూ!
సహచరులందఱు నెటకు బోయిరో, సరసత తెలియదుగా నాకున్! 11

నష్ట సంజ్ఞుడగు రాజు మాట విని నయముగ యుదార వాక్యములన్
ఆ బుధుండు నోదార్చుచు నిలునీ యట గలిగిన వ్యధ మాన్పుచునూ
ఈ విధముగ శుభకర వాక్యంబును నింపుగ బలికెను నాతనితో,
మహాపదయు యేదో గలిగిన యటు మానుగ బలికెను యాతనితో! 12

మహా గొప్పదగు రాళ్ళ వర్షమును మానుగ నీ యనుచరులు మఱిన్,
కాలగతిని మఱి బొందినారుగద! కర్మము దప్పదు నెవ్వరికిన్,
నీవును గాలీ వానకు భయపడి నిరాశతో నిటుకొచ్చితివీ!
ఈ యాశ్రమమున నిదురించితివీ! నిండిన యలసట దీరగనూ! 13

ఓ వీరుడ! నిక యూరిడిల్లుమా! యొనరగ నీకును క్షేమంబున్,
భద్రంబును నగుగాత! వీరుడా! భయమును దుఃఖము విడిచి మఱిన్
ఫలమూలంబుల దినుచు హాయిగా బన్నుగ సుఖముగ యుండు మిటన్
ఈ యాశ్రమమున నివసింపుము నిక యింపుగ మాతో గూడికొనీ! 14

గొప్ప బుద్ధిగల యా రాజును మఱి కూరిమి యాతని మాటలకున్
నూరడిల్లుచును దనలో తానే యోర్పు వహించియు మదియందున్
భృత్యులందఱును నాశమొందు టను భీకరమగు స్థితి యేర్పడుటన్!
దీనత్వము మఱి బొందుచు రాజును ధీరత వాక్యంబును పలికెన్! 15

భృత్యులు లేనివాడనుగా మఱి భీకరముగ జేయగ బడితిన్,
నా పంబంధిత మగు రాజ్యంబును నయముగ నే విడిచెద నిపుడే!
బ్రాహ్మణోత్తమా! యిట నొక క్షణమును బన్నుగ నుండను నిలిచి మఱిన్
నే బోవుటకును ననుజ్ఞ నిమ్మా! నిండు మనసునను మునివర్యా! 16

బ్రాహ్మణోత్తమా! ధర్మపరుండును మహా యశస్సును గలవాడున్
శశిబిందువనే జ్యేష్ఠ కుమారుడు పరసతగలడూ నాకు మఱిన్,
అతడు రాజ్యమును నందగలడు సుమ! నలరుచు పరిపాలించు ధరన్,
పటుతర శక్తియుగలవాడును మఱి, ప్రబల పరాక్రమ వంతుడునూ! 17

మహాతేజమును గలవాడా! విను! మానుగ సుఖవంతమునైనా
భృత్య మిత్రులను ప్రియ భార్యలనూ సత్యంబుగ నే విడిచి మఱిన్!
ఇచట యొంటిరిగ నుండగ జాలను! నేకాకిగ యీ వనమందున్,
అశుభ వాక్యమును బలుకకుమా! మఱి అలరి యిటను నుండుము ననుచున్! 18

అల ప్రజాపతికి కుమారుడైనా యా యిలుండు నటు బలుకగనూ!
మహా విజ్ఞుడగు నా బుధుండునూ మానుగ బలికెను నీ విధమున్,
ఆ రాజును నోదార్చుచు బలికెను నలరి బుధుడునద్భుతముగనూ!
ఇచట నివాసము నీకు బహుళముగ నిష్టంబగుతను గాత మఱిన్! 19

మహాబలా! ఓ కార్దమేయ! విను! నలరుచు నాదు సువచనములన్
నీవు దుఖమును జెందకుమా మఱి నిశ్చయముగ నా పలుకు వినూ!
ఇచ్చట నీవొక వత్సర కాలము నొనరగ వాసము జేసినచో,
నీకు హితంబును గలుగజేయుదును నిశ్చయముగ నా పలుకు వినూ! 20

అక్లిష్ట కర్మణుడైన యా బుధుని యలరెడి మాటలు వినియు మఱిన్!
అకర్దమునీ సుతుండు గూడను నా విధముగ వసియించుటకున్
మనసునందు మఱి నిశ్చయించుకొని మానుగ యా విధమున జేయన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 21

ఆ రాజును ఒక మాసము దినములు నలరుచు స్త్రీ రూపము తోడన్,
అట్టి బుధుని రమియింప జేసెనూ యతి రమ్యముగా తరుణి వలెన్!
మరొక్క మాసము పురుషుడుగానై మానుగ చింతనతోని మఱిన్
ధర్మబుద్ధితో నుండెను నాతడు ధార్మికత్వమును వెలయగనూ! 22

అటుబిమ్మటనూ యా సుశ్రోణియు నాయిల తొమిదవ మాసమునన్
బుధుని వలననూ మహాబలముగల పురూరవుండను బాలకునీ
జన్మింపగ జేసినది యాయిలయు జన్మాంతర సుకృతివలనన్
చిత్రమైనసంగతులు జగతిలో చిత్రితమగు చుండును నెపుడున్! 23

పుట్టగనే సుశ్రోణియైన యిల పొలుపుగ తండ్రికి సమానమున్,
వర్ణంబును గల మహాబలముగల వనరగ యా శిశువును వేగన్
తండ్రియైన యా బుధుని చేతిలో దగ నుంచెను నా యిలయు మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 24

బుద్ధిమంతుడగు నా బుధుండునూ బొలుపుగ వత్సరమును పైనన్
పురుషుడైన యా యిలుని మఱియునూ పొలుపుగ ధర్మ యుతంబులునూ,
కథలతోని మఱి గాథల తోడను కమ్మని వృత్తాంతంబులతో
ఆనందింపగ జేసెను బుధుడును నల యిల రాజును ధర్మమునన్! 25

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
ఎనుబది తొమ్మిదవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

తొంబదియవ సర్గము

(అశ్వమేధ యజ్ఞము జేయుటచే నిలకు పురుషత్వము లభించుట)

రాముడు తెలిపిన యాపురూరవుని రమ్యమైన యద్భుతమైనా
జన్మంబును గూర్చియు విని వేగము సరసత భరతుడు లక్ష్మణుడున్!
ఆశ్చర్యంబును నంది రాఘవుని యలరుచు ప్రశ్నించిరి యిటులన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

నరశ్రేష్ఠా! ఓ రాఘవ వినుమా! రమ్యమైన మా వచనములన్
బుధుని వద్ద ఒక వత్సర కాలము బూర్తిగ యుండిన యా యిలయున్,
అటుబిమ్మటనూ యేమి జేసినదొ చటులత దెలుపుము శ్రీరామా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

ఆ శ్రీరాముడు అడుగుచున్న యా యల లక్ష్మణుడును భరతుండున్,
వారిద్దఱి యా వాక్య మధురతను వనరగ విని యా రాఘవుడున్,
ఇలునికి సంబంధించిన వృత్తాంతము నింపుగ శ్రీ రఘునందనుడున్
ఈ విధముగనూ దెలుప మొదలిడెను నింపుగ యద్భుతమగు కథనా! 3

శూరుండగు నా ఇలుడు మఱలనూ సురుచిరముగ పురుషత్వంబున్,
బొందిన బిమ్మట గొప్ప బుద్ధిగల పొలుపుగ మణియును గలిగిన యా
చంద్రుని పుత్రుండగు బుధుండునూ సాంద్రముగను నుదారతయున్,
స్వభావంబుగల సంవర్తుని మఱి సరసత యాహ్వానించె మఱిన్! 4

భృగు పుత్రుండగు చ్యవనుని బిలిచెను దగ యరిష్టనేమను వానిన్
ఆనందంబును గలిగించెడి యా యలరు ప్రమోదనుడనువానిన్!
దుర్వాసుండను మహామునిని మఱి తోరముగా నాహ్వానించెన్,
మహా మునుల నాహ్వానించెను మఱి మానుగ విషయము వినిపింపన్! 5

వాక్యజ్ఞుండును, తత్త్వదర్శనుడు నల శశిసుతుడగు బుధుండునూ,
వీరి నందఱిని యాహ్వానించెను విమలమైన ధైర్యము జేతన్!
సావధాన చిత్తులునైనట్టి సారస హృదయము గలవారిన్,
వారందఱితో నిటులను బలికెను వనర బుధుండును వినయముగన్! 6

మహాబాహువగు నీ రాజును మఱి మానుగ కర్దమ పుత్రుడునూ!
ఇలుడనియెడు నొక మహాత్ముడీతడు నింపుగ జరిగెను నొక కథయున్,
ఇతని విషయమున యేమి జరిగినదొ యింపుగ దెలియుడు మీరలునూ
ఇతనికి శ్రేయస్సును మఱి గలుగగ నింపుగ జేయుడు మీరలునూ! 7

వా రీ విధముగ మాటలాడుచును మంతన మాడుచు నుండగనూ,
మహా తేజమును గల కర్దముడును మానుగ మహాత్ములైనట్టి
బ్రాహ్మణోత్తములతో గూడను మఱి బన్నుగ తదాశ్రమంబునకున్
ఆగమనంబును జేసె నాతడును నందఱు నాహ్వానింపగనూ! 8

పులస్త్యుండు మఱి క్రతువును వచ్చెను పొలుపుగ వషట్కారుండున్
మహాతేజమును గల యోంకారుడు మానుగ వచ్చిరి యటకు మఱిన్,
అచటనున్న యా మహాత్ములందఱు యర్చన జేసిరి వారలకున్!
ఫలపుష్పంబులు నాతిథ్యముగా బన్నుగ నిచ్చిరి వారలకున్! 9

మహాత్ములందఱు బరస్పరంబును మానుగ గలియుటచేత మఱిన్
హృష్ట మనసులై వారందఱునూ నిష్టముగా భాషించుచునూ
బాహ్లిక దేశపు రాజగు నిలునీ బన్నుగ హితమును గోరుచునూ
వేఱువేఱుగా నిటులను బలికిరి వెన్నపూస దీసిన యటులన్! 10

కర్దముండు తగ సుతుని కొఱకునై బహు హితమగు వాక్యంబు మఱిన్
బలికెను నాతడు ద్విజులతోడనూ బన్నుగ బహు గంభీరతనూ,
బ్రాహ్మణులారా! యీ రాజునకును బన్నుగ హితమును దెలుపుడికన్,
నా మనసునగల యాలోచలను నయముగ దెలిపద వినుడు మఱిన్! 11

శివుడు దప్ప వేఱొక చికిత్సయును స్థిరముగ కనబడుటయు లేదూ!
మహాత్ముడగు నా శివునకు మఱియును మహాశ్వమేధము కంటె మఱిన్
మఱియొక ప్రియమగు యజ్ఞము లేదూ! మానుగ మన మాలోచింపన్,
శివునకు ప్రియమగు నశ్వమేధమును జిరతరముగ జేయుట మేలున్! 12

ఆ కారణమున మన మందఱమును యా పార్థివునీ కొఱకు మఱిన్,
దురాసదంబగు యజ్ఞంబును మఱి తోరముగా జేసెద నిపుడున్,
ఆ కర్దమునీ మాటలు వినుచును నా బ్రాహ్మణ శ్రేష్ఠులు మఱియున్,

ఆ రుద్రుని యారాధింపగను యట్టి సుయజ్ఞము జేయుటకున్
అంగీకారము దెలిపిరందఱును నశ్వమేధ యజ్ఞము జేయన్! 13

పరపురంజయుడు, మరుత్తుండు అను బన్నుగ ఖ్యాతుండగునట్టి
రాజఋషియునగు యా సంవర్తుని రహి శిష్యుండైనట్టియునూ
ఆ యజ్ఞంబున యేర్పాటులనూ యన్నియు జేసెను శీఘ్రముగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 14

అటు బిమ్మట యా బుధుని యాశ్రమము నలరి సమీపము నందుననూ,
మహాయజ్ఞమును జరిగె నప్పుడును మానుగ వైభవమును గూడీ
మహా యశస్సును గల రుద్రుండును మానుగ సంతసమును నందెన్!
మహా మునులు ఋషులందఱు జేరిరి మానుగ యజ్ఞము జేయగనూ! 15

అటుబిమ్మట యా మహాయజ్ఞమును నలరి సమాప్తంబగు చుండన్
ఉమాపతియు సంతోషించియు మఱి యురుతర భావమునను గూడీ!
ఇల మహారాజు సమక్షమందున నింపుగ బ్రాహ్మణు లందఱితో,
సంతోషముతో నీ విధి బలికెను సమరస భావమునను గూడీ! 16

ఓ ద్విజసత్తములారా! వినుడూ! యొనరగ యీ యాగముజేతన్!
మీ భక్తికినీ సంతోషించితి మిగుల రక్తికిని మెచ్చితినీ!
బాహ్లీకపు దేశమునకు రాజును బన్నుగ యా యిలునకు నింకన్,
ఏమి ప్రియము శుభమును జేయగవలె! నింపుగ దెలుపుడు మీరలునూ! 17

దేవతా ప్రభువునైన శివుండును దీరుగ బలుకుచు నుండగనూ,
బ్రాహ్మణులందఱు సావధానులై బన్నుగ బ్రార్థించిరి శివునీ,
ఇల పురుషుండును నగునట్లుగ మఱి యీప్పితార్థమును గోరుచునూ,
అనుగ్రహింపగ జేసికొనిరి మఱి అభ్యర్థన మఱి జేసికొనీ! 18

అటుబిమ్మటను సంతోషించిన యలరు తేజమును గలిగిన యా
దేవదేవుడగు మహాదేవుండును దీరుగ సంతసమును నందీ
ఇలకు మఱల పురుషత్వంబును మఱి నింపుగ నిచ్చియు వేగముగన్!
అంతర్ధానము జెందె శివుండును జింతను బాపుచు భక్తులకున్! 19

హయమేధంబును బూర్తియైనదీ యంతటట శాంతము నందినదీ,
శివుడును మఱి యంతర్ధానము జెందెను శ్రీకరముగ యా బ్రాహ్మణులున్,
వచ్చిన వారలు నందఱు గూడను వచ్చినటుల బోయిరి వేగన్
యజ్ఞఫలంబును నందెను నిలుడును యాజ్ఞ నంది యా శివుని మఱిన్! 20

ఇలుడైతే బాహ్లీకదేశమును నింపుగ విడిచియు నచ్చోటన్,
మధ్య దేశమునకును వచ్చెను మఱి మాననీయులగు మంత్రులతో!
అత్యుత్తమమగు కీర్తి నిచ్చునది యలరి యశస్సును గూర్చునదీ,
ప్రతిష్ఠానపురమును నెలకొల్పెను బహు సుందరమగు నగరంబున్! 21

పర పురంజయుడు రాజ ఋషియునూ బన్నుగ శశిబిందువును మఱిన్,
బాహ్లీక దేశంబును బాలించెను బరగ ప్రజలు సుఖమందగనూ!
కర్దమ ప్రజాపతికి పుత్రుండును గడు బలీయుడును నిలుడు మఱిన్!
ప్రతిష్ఠానపురమును బాలించెను బన్నుగ ప్రజలును సుఖమందన్! 22

ఇలుడైతే మఱి కాలమునందున నింపుగ యుత్తమమైనట్టి
బ్రహ్మలోకమునకును బోయెను మఱి బరగ యిలుని సుతుడైనట్టి
పురూరవుండును బ్రతిష్ఠానమున పొలుపుగ రాజయ్యెను నపుడున్!
ధర్మము నాలుగు పాదంబులనూ దగ నడిపెను నాతండు మఱిన్! 23

పురుషశ్రేష్ఠుడ! అశ్వమేధ మది పొలుపుగ దాని ప్రభావంబున్
అటువంటిది సుమ! స్త్రీయగువాడును నలరి పురుషుడగుచును మఱియున్!
దుర్లభమైనా బ్రహ్మలోకమును దోరముగా బొందెను నతడున్!
పరమేశ్వరునీ సంకల్పంబులు బహు విధములుగద! లోకమునన్! 24

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
తొంబదియవ సర్గము సమాప్తము

❖ ❖ ❖

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

తొంబది యొకటవ సర్గము

(రాముని యాజ్ఞచేత అశ్వమేధ యాగమునకు నేర్పాటు జరుగుట)

అపరిమితమునగు కాంతిగలిగినా యా కాకుత్స్థుడు రాఘవుడున్,
సోదరులిద్దఱికిని యాఖ్యామము సురుచిరముగనూ దెలిపి మఱిన్,
సుమిత్రనందును తోని మఱలనూ శుభకరమగున యట్టిదియున్,
ధర్మ సమ్మతంబగు వాక్యంబును దగ యీ విధముగ దెలిపె మఱిన్! 1

లక్ష్మణకుమార! విను! నా వచనము లాలితముగ నే దెలుపునదీ!
వసిష్ఠునీ మఱి వామదేవునీ వనరగ జాబాలిని మఱియున్
కాశ్యపునీ యా యశ్వమేధమున కనుల పండువుగ ముందుననూ!
యుండవలసినా యందఱి కంటెను నుత్తములైనా బ్రాహ్మణులన్,
వీరి నందఱిని బిలిచి మఱియునూ వీరలతో నాలోచన జేసీ
లక్షణ సంపన్నమునగు హయమును లాలితముగ నే విడిచెదనూ! 2,3

రాముని జేతను బలుకబడిన యా రమ్య వచనమును వినియు మఱిన్
త్వరిత విక్రముడు గల వాడగుచును రగ సుమిత్రనందనుడు మఱిన్!
సమస్తమైనా బ్రాహ్మణులను మఱి సరసత బిలిచిన వాడగుచున్!
వారినందఱిని వెంట దీసికొని వనరగ రామునకును జూపెన్! 4

అ ద్విజులును మఱి దేవ సమానుడు నల పాదములకు వందనముల్
జేయుచున్న యా శ్రీరాముని గని స్థిరతరముగ నాప్యాయతతో!
సుదురాధర్షుడు నగు యాతనితో సురుచిరముగ యాతనిని మఱిన్,
ఆశీస్సులతో బూజించిరి మఱి యలరు గోరికలు సిద్ధింపన్! 5

ఆ సమయంబున శ్రీరాముండును నంజలితో గూడినవాడై
వచ్చినట్టి యావిప్రుల గాంచీ మచ్చికతో వినయము తోడన్,
ధర్మము తోడను గూడినట్టి యా దగ సమ్మతమును నైనట్టీ
అశ్వమేధమునకును గుఱించి యా యలరు వచనమును నిటు బలికెన్! 6

సమస్తమైనా ద్విజులందఱునూ సరగున రాముని మాటవినీ
ఆనందంబును బొంది రందఱును నంతులేని సంతోషంబున్!

అశ్వమేధమునకును నారాధ్యుడు నా మహేశునకు వందనముల్
జేసి మఱి యునూ ప్రశంసించిరీ శ్రీకరముగ యా యజ్ఞంబున్! 7

ఆ సమయంబున యా రఘురాముడు నా ద్విజముఖ్యులు బలికిన యా
అద్భుతమైనా దృష్టిగలిగినా యశ్వమేధమునకును మఱియున్,
సంబంధించిన వాక్యంబును విని సంతోషించిన వాడాయెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 8

ఆ శ్రీరాముడు నా బ్రాహ్మణులును నలరి జేయు విషయము దెలిసీ,
లక్ష్మణుతోడను నీ విధి బలికెను లాలితముగ యా రాఘవుడున్!
మహాబాహు! నా మహాత్ముడైనా మానుగ సుగ్రీవుని బిలువన్
వేగము బంపుము! దూతను నచటికి జాగుసేయకను వెనువెంటన్! 9

వానర నాయకులను మఱి యింకను వనమున వసించు వారలతో,
చాల మందితో మహోత్సవంబును సరసత దిలకించుట కొఱకై
ఆహ్వానంబును బంపు లక్ష్మణా! యతి వేగముగా వారలకున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 10

సాటిలేని యా పరాక్రమముగల సరసత విభీషణుండు మఱిన్
స్వేచ్ఛగ సంచారమును జేయగల శక్తి గలిగినా వారలతో,
చాల మంది రాక్షసులను గలిసి మఱి చయ్యన మన యాగంబునకున్,
అశ్వమేధ యజ్ఞంబును గాంచీ ఆనందించును గాక! మఱిన్! 11

నాకు ప్రియంబును జేయగ దలచిన నయముగ మహాభాగులును మఱియున్,
రాజులు గలరో వారలందఱును రహి పరివారము గూడికొనీ,
అనుత్తమంబగు నశ్వమేధమును నలరి జూడ వత్తురు గాతన్!
వసుధన్యునిగా జేతురు గాతను నా యజ్ఞంబును దిలికించీ! 12

సుమిత్రనందన! లక్ష్మణ వినుమా! సురుచిరముగ పరదేశములన్
ఉన్నటువంటీ ధర్మబుద్ధిగల యున్నతులగు ద్విజులందఱినీ!
పరివారముతో నాహ్వానింపుము బన్నుగ యజ్ఞము దిలకింపన్!
పాల్గొనుటకునూ యజ్ఞము నందున బన్నుగ బిలువుము వారలనూ! 13

మహాబాహు! విను! తపసే ధనముగ మానుగ భావించెడి ఋషులన్!
కార్యవశంబున దేశాంతరముల గల భార్యా సహితులునైనా

ద్విజుల నందఱను నాహ్వానింపుము తేజము దశదిశలును వెలుగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్ 14

తాళంబులు మ్రోగించుచు దిశలను దగ దిరిగెడి వారలను మఱియున్
నటులను, వర్తకులను గూడను మఱి నయముగ యాహ్వానింపవలెన్!
గోమతీనదీ తీరమునందున కూరిమి సుమహా ఘనమైనా
యజ్ఞ వాటికను నిర్మింపగవలె యాజ్ఞాపింపగ బడు గాతన్
మహాబాహు! మఱి యనుత్తమంబును మానుగ పుణ్యక్షేత్రంబున్,
మహాబాహు! మన దేశమంతటను మానుగ శాంతులు జరిపింపన్!
ఆజ్ఞాపింపుము! అన్ని విధములను నాలస్యము లేకుండ మఱిన్! 15, 16

సుమిత్రనందన లక్ష్మణ వినుమా! సురుచిరముగ నా వచనములన్,
వందలకొలదియు, ధర్మవేత్తలును, నైమిషమున బహు శాంతమునన్
అత్యుత్తమమగు మహా యజ్ఞమును నలరుచు దిలకించుచును మఱిన్!
ధన్యాత్ములు మఱి యగుదురు గాతను దానధర్మముల నందుచునూ! 17

ధర్మజ్ఞా! ఓ సుమిత్రనందన దగజనులందఱినీ మఱియున్,
శీఘ్రముగా మఱి యాహ్వానింపుము శ్రీకరముగ వీరందఱునూ!
యథావిధముగా సత్కరింపబడి నలరుచు సంతోషము తోడన్!
పరిపుష్టులునై తిరిగి పోగలరు బహుమతులను మఱి నందుకునీ! 18

ముక్కలుగానీ బియ్యంబును మఱి మోయు వాహనములును లక్ష!
తిలలు, పెసలు మ్రోసెడి వాహనములు దీరుగ బదివేలును మఱియున్,
ముందు బోవు గాతను సెనగలునూ మోదముగా యులవలు మినుముల్
లవణము వీనికి దగినట్టిదియునూ లాలిత తైలాదికములునూ
అంతకంటె తక్కువ ప్రమాణమున యలరు గంధ ద్రవ్యంబులునూ
పోవుగాక యా ధాన్యంబులతో బొలుపుగ వాహనముల మీదన్! 19, 20

భరతుండును బహు కోట్లకొలదియును బన్నుగ రజిత సుముద్రలునూ!
నూరు కోట్లకును మించినట్టి యా మాత్న సువర్ణ సునాణ్యంబుల్!
జాగరూకుడై భరతుడు వానిని సరసత గైకొని పోవలెనూ!
ముందుగ బోవును గాత భరతుడును చందము వారల కందింపన్! 21

కావలసిన యా చోటులందుననను అంగళ్లను, వీధులు తెఱచూ!
వర్తకులును, నటులును, నర్తకులును వనరగ వంటల వారు మఱిన్!

నిత్యము యౌవనమందు నుండెడీ నిరతము దృఢకాయులునైనా
చాల మంది పురుషులు భరతునితో సరగున బోవుదురు గాతన్! 22

మహా యశస్సును గల భరతుండును మానుగ నా యా సంఘములన్,
ముఖ్యుల మఱియును బాలుర వృద్ధుల మోదముగను బ్రాహ్మణుల మఱిన్!
కర్మ · పర్యవేక్షకులను మఱియును ధనాగార యధ్యక్షులనూ
ధనాగారముల సంబంధించిన తదితర ముఖ్యుల ప్రముఖులతో!
మన తల్లులనూ యందఱినీ మఱి మన యంతఃపురములను మఱిన్
దీక్షకు నుపయోగింపవలసినా దీరుగ బంగరు ప్రతిమయునూ!
ఆ యా కర్మలయందు దక్షులును నలరు వివిధ పనివారలనూ!
ముందు నుంచుకుని మన భరతుండును చందముగా బోవును గాతన్! 23, 24, 25

మహా బలముగల నర శ్రేష్ఠుండును మానుగ తేజము గలిగిన యా
పరివారముతో గూడి నట్టిదియు బన్నుగ యా రాజుల కొఱకున్
మంచి మంచి బహు గుడారంబులను నంచితముగ యా మహాత్ములున్!
వారల పరివారంబు కొఱకునై వనర యన్న పానాదులకున్!
వస్త్రములను నేర్పాటుజేసెనూ వాసిగ యందఱు కీర్తింపన్! 26

ఆ సమయంబున శత్రుఘ్నునితో నలరి కలిసి భరతుడు గూడన్
బోయెను మఱి యా సమయమునందున పొలుపుగ సుగ్రీవునితోడన్,
సహచరులును యా మహాత్ములైనా సకల కపులు బోయిరి వేగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 27

బహుళ రాక్షసుల తోడను గూడను బరగ స్త్రీలతో కలిసి మఱిన్
విభీషణుండును నుగ్రమైన యా విమల తపస్సులు గలవారిన్
ఋషులను మునులను బూజలు జేసెను రూఢిగ విప్రులకును మఱియున్!
బ్రహ్మణోత్తములు వద్దన జేసిరి బన్నుగ వచ్చిన వారలకున్! 28

27,28 శ్లోకాలు ప్రాత్యప్రతితో లేవు అది యుక్తము
(ముఖ్యంగా 28, 29 శ్లోకాలు ఇచ్చట కుదరవు)

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
తొంబది యొకటవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

తొంబది రెండవ సర్గము

(రాముని అశ్వమేధ యాగములో దాన గౌరవములు బాగుగా జరుగుట)

రఘునందనుడగు రామచంద్రుడును రయమున యాగమునకు వలయూ
సామగ్రిని యంతటిని బంపి మఱి సలక్షణము, సంపన్నమునూ,
కృష్ణసారమగు హయమును వేగము కూరిమి విడిచెను రాఘవుడున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

రాముడంతటను యా లక్ష్మణునీ రహి ఋత్విక్కులతో గూడన్
అశ్వము వెనుకను సంచరించుటకు నాజ్ఞాపించియు శీఘ్రముగన్,
తాను సైన్యమును గూడి మఱియునూ దగ నైమిషమునకును బోయెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

మహాబాహువులు గలవాడును మఱి మానుగ రఘునందను డపుడున్,
అద్భుతమైనా యజ్ఞ వాటికను నలరి జూచి యాశ్చర్యముతో
సంతోషించియు లక్ష్మణుతోడను శాంతముతో నిటులను బలికెన్!
ఇది చాలా బాగున్నది లక్ష్మణ! నింపుగ సుయజ్ఞ వాటికయున్! 3

రాజులందఱును నైమిషమందున రహిని వసించెడి రామునకున్
కానుకలను మఱి దెచ్చియిచ్చిరీ కమనీయంబగు బహుమతులన్,
రామచంద్రుడును వారల మఱలను రయమున సుపూజ్య భావననూ
సన్మానించెను సకల వస్తువుల స్వర్ణ రజిత మణి భూషలతో! 4

నరేంద్రులను బూజించుటయందును నయమున నియుక్తులైనట్టి
భరతుండును మఱి శత్రుఘ్నుండును బన్నుగ బోజన వస్త్రములన్
ఇతర వస్తువుల యేర్పాటులనూ యింపుగ జేసిరి వారచటన్
కోరుకొనిన వస్తువులను వారును గూరిమి యలరించిరి వారున్! 5

ఆ సమయంబున సుగ్రీవునితో నలరుచు మహాత్ములైనట్టి
మహాత్ములైనా వానరులంతట మహితాత్ములు విప్రుల కపుడున్
నియమవంతులై వడ్డన జేసిరి నిఖిల ప్రజలు హర్షింపగనూ!
ఏ ఫలహారము లడిగిరో వారును, నింపుగ నందించిరి వారున్! 6

చాలా మంది రాక్షసులను గూడిన చయ్యన యా విభీషణుడు మఱిన్
సావధాన చిత్తుండై యాతడు సరగున యుగ్ర తపస్సులనూ
గలిగినట్టి యా ఋషి మునులకు మఱి సరుగున కింకరుడాయె మఱిన్
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 7

మహాబలముగల నర శ్రేష్ఠుండును మానుగ తేజము గలిగిన యా
పరివారముతో గూడినట్టి యా బన్నుగ యా రాజుల కొఱకున్!
మంచి మంచి బహు గుడారంబులను నంచితముగ యా మహాత్ములున్!
వారల పరివారంబు కొఱకునై వసర యన్న పానాదులకున్,
వస్త్రములను నేర్పాటు జేసెనూ, వాసిగ యందఱు కీర్తింపన్! 8

ఆ విధముగ యా వాజి యజ్ఞమును నా విధముగ యేర్పరుపబడెన్!
లక్ష్మణు జేతను రక్షింపగ బడి లలిత యశ్వ సంచారంబున్,
నేత్రోత్సవముగ జరుగుచు నుండెను నిఖిల దాన సంతర్పణలన్
కనుల పండువుగ జరుగుచు నుండెను కమనీయముగా నచ్చోటన్! 9

మహాత్ముడైనా యా శ్రీరాముని మానుగ యజ్ఞమునందు మఱిన్
యాచకులును సంతృప్తిని జెందీ యలరు వఱకునూ 'ఇమ్ము' అనీ,
వినబడుచుండెను నట్టి మాటలును వినబడలేదే పలుకులునూ!
రాజశ్రేష్ఠుడగు రామచంద్రునీ రమ్యమైనా యా యజ్ఞంబున్!
ఈ విధంబుగా కొనసాగెను మఱి యింపుగ జరిగిన యా దినముల్! 10

మహాత్ముడైనా రాముడు జేసిన మంగళకర యజ్ఞము నందున్!
తృప్తి జెందువఱకును యాచకులును దీరుగ యనేక విధములునూ!
బెల్లముతో జేసిన భక్ష్యంబులు యుల్లము సంతస మందగనూ!
పటిక బెల్లమున జేసినట్టి యా బన్నుగ భక్ష్యంబులు మఱియున్!
తృప్తి జెందగా నివ్వబడెను మఱి దీరుగ సంతసమును నందన్! 11

ఆ యాచకులా పెదవుల నుండియు నలరి పలుకులను వెలుపలికిన్
రాకముందుగనె యా వానరులును రయమున యా రాక్షసులు మఱిన్
వారికి కావలసిన పదార్థముల వరుసగ నిచ్చుచు నుండి రటన్
'లేదు!' అనే మాటయు రాదుగదా! లీలగ కపి యసురులకు మఱిన్! 12

సంతసమున పరిపుష్టిని జెందిన చిందిన జనముల నిండిన యా
యజ్ఞమునందున మలినముగా మఱి యలరు వారు నట లేరుగదా!

దీనుడుగానీ లేనేలేడూ! చిక్కిన వాడును లేడుగదా!
సంభరితంబగు వస్తు సంతతని దగనుండెను మినుమిక్కిలిగా! 13

అచట నున్న యా చిరంజీవులగు నలరు మునులకును హృదయమునన్,
ఇని దానంబులు జేసినట్టి యా నింపుగ మఱియొక యజ్ఞంబున్
నేది గూడ మఱి స్మృతికి రాదుగధ! యింపుగ విచిత్రముగ నుండెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 14

బంగారము గావలసిన వారికి బంగారంబును లభ్యమయెన్
ధనము కావలయు నన్న వానికిని ధనమును బొందెను వారు మఱిన్,
రత్నంబులు కావలసిన వానికి రత్నంబులునూ నందె మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

నిరంతరంబును నిచ్చుచు నున్నను నిర్మలమతి యాచకులకునూ
బంగారంబును, వెండి, రత్నములు బన్నుగ వస్త్రములును గూడన్,
రాసులుగా గనబడుచుండెను నట, రమ్యముగా నా యజ్ఞమునన్!
దానమెంత జేసినను గూడ మఱి దరుగ దాయె నిసుమంతయునూ! 16

ఇట్టి యజ్ఞమును మేము పూర్వమును నెన్నడునూ జూడగ లేదూ!
ఇంద్రుని యజ్ఞముగాని మఱియునూ సాంద్రముగా సోమునిగానీ
యముని యజ్ఞమునుగాని మఱియునూ వరుణుని యజ్ఞముగాని మఱిన్,
ఇటుల లేదు! అని మునులును బలికిరి నింపుగ సంభాషించుచునూ! 17

ఎచట జూచినను వానరులును మఱి యెచట జూచినను రాక్షసులున్,
నిలిచి యుండిరీ వారలందఱును నిండు జేతులను గూడికొనీ
యాచకులకు వస్త్రములును, ధనమును నలరు భోజనము, భక్ష్యములున్,
వద్దన్నను మఱి యిచ్చుచు నుండిరి సద్దు జేయకను గద్దించీ! 18

రాజశ్రేష్ఠుడగు రామచంద్రునీ రహి యజ్ఞము నే మాత్రమునూ!
దానాదులలో భోజనాదులను తగ్గుదలను లేకయును మఱియున్!
ఈ విధముగ వత్సరము పైబడిని నింపుగ నడిచెను నచ్చోటన్!
దేశ దేశముల ప్రజలును వచ్చిరి దివ్యమైన యాగము గాంచన్! 19

శ్రీరామ కథా సుథాలహరి యందు - ఉత్తరకాండములో
తొంబది రెండవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

తొంబది మూడవ సర్గము

(వాల్మీకి శ్రీరాముని యజ్ఞమునకు వచ్చుట, రామాయణమును గానము జేయుడని వాల్మీకి కుశలవులను ఆజ్ఞాపించుట)

తధా భూతమగు పరమాద్భుతమును దగ యజ్ఞము జరుగుచునుండ న్,
భగవంతుడగు వాల్మీకియు మఱి బన్నుగ శిష్యులతో గూడన్
ఆ యజ్ఞము దర్శించుట కొఱకును నా ప్రదేశమునకును వచ్చెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

ఆ వాల్మీకియు నద్భుత దర్శన మలరు యజ్ఞమును గాంచి మఱిన్
ఋషుల ప్రవేశ స్థానమువందున రూఢిగ యేకాంతము నందున్
శుభకరమగు నా పర్ణశాలనూ సురుచిరముగ నిర్మించె నటన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

ఆ వాల్మీకియు వసించుచుండిన యా ప్రదేశమందున మఱియున్
శోభావంతములైన ఫలములను, సురుచిరమగు మూలంబులనూ
అనేక విధముల వస్తువులను మఱి యనేక విధముల శాకములున్
నిండిన బండ్లను నిలిపి రచ్చటను మెండుగ వారల కొఱకు మఱిన్! 3

మహాతేజమును గలవాడును మఱి మధుర మనస్సును గలవాడున్!
ఆ వాల్మీకుల వారి నంతటను నట గల ఋషి మునులును మఱియున్!
రాజగునట్టి రామచంద్రుడును రయమున బూజించిరి యచటన్
ఆ వాల్మీకియు నట వసియించెను నలరు శిష్యులను గూడికొనీ! 4

ఆ వాల్మీకియు సంతోషించిన యలరు శిష్యులను బిలిచి మఱిన్
వారలతో నీ విధమున బలికెను వనరగ మధుర సువచనములన్!
మీ రిద్దఱునూ సావధానమున మీరిన సంతోషము తోడన్
శ్రీ రామాయణ కావ్యగానమును శ్రీకరముగ జేయుడు నేడున్! 5

ఋషుల నివాస స్థానములందున రూఢిగ పవిత్ర స్థానములన్
బ్రాహ్మణ గృహముల యందును మఱియును బన్నుగ వీధుల యందునవూ!

రాజ మార్గముల యందున మఱియును రాజుల గృహముల యందుననూ,
శ్రీరామాయణ కావ్యగానమును శ్రీకరముగ జేయుడు నేడున్! 6

శ్రీరాముని యా భవన ద్వారమున చిత్తము హర్షము బులకింపన్,
అశ్వమేధ యాగంబు నెచట మఱి యలరి జేయుచును నున్నారో,
ఋత్విక్కులు మఱికవులు గాయకులు రూఢిగ యెచ్చటనున్నారో,
శ్రీరామాయణ కావ్యగానమును శ్రీకరముగ జేయుడు మీరల్! 7

వత్సలార! మఱి పర్వతాగ్రముల వనరగ పండిన ఫలములనూ!
వన్య ప్రదేశములందు బుట్టినా వనరగ మధుర సుమూలములన్
కడు పారగ భుజియించి వెడలుడూ! కమ్మని గానము జేయుగనూ!
ఫల మూలంబుల దినుటచేత మఱి బరగ కంఠమును జెడదు గదా!
కమ్మని కంఠ స్వరమును గలుగును నిమ్ముగ శ్రమయును గలుగదుగా! 8,9

మహీపతియునగు రామచంద్రుడును మానుగ మిము పిలిపించినచో
ఋషి మునులందఱు గూర్చొని యుందురు రూఢిగ యా సమయములందున్
అట మీ గానము జరుగగాత! మఱి యాలస్యము లేకుండగనూ!
కవి పండితులును మెచ్చుకొనెదరూ కావ్య గానమును వినియు మఱిన్! 10

నేను పూర్వమును దెలిపినట్లుగా నిండుగ ప్రమాణముల బట్టీ
రోజుకు నిఱువది చొప్పున బాడుడు రూఢిగ రామాయణమందున్!
ఇరువది సర్గలు మధుర వాక్కుతో నింపుగ గానము జేయవలెన్!
దెలియని వారికి గూడ మధురముగ దెలియు నట్లుగా బాడవలెన్! 11

ధనమునందు మఱి కోరిక తోడను దగ కొంచెము గూడను మఱియున్
లోభంబును మఱి జేయగూడదూ! లోలత కీర్తియు గూడ మఱిన్!
ప్రతి నిత్యము నాశ్రమమున మండీ యల ఫలమూలములను దినుచున్,
అట్టి వారికిని ధనమెందులకూ? నిట్టి సంపదలు నెందులకున్? 12

మహీపతియునగు రామచంద్రుడును మానుగ యెవ్వరి పుత్రులనీ
అడిగినచో మఱి బదులు దెలుపుడూ యలరుచు నీ విధముగను మఱిన్!
ఆ వాల్మీకులవారి శిష్యులము వలరి మేము విరువురము మఱిన్
అలరి యిటుల బలుకుడు మీరటనూ యల రాఘవుతో గూడ మఱిన్! 13

మిగుల మధుర స్వరముల బుట్టించెడి దగ వీణా తంత్రులుగానీ
వేఱు వేఱు స్వరముల నిష్పత్తికి విమలములగు మూలములైనా
వీణా శిరస్సు మీది తీగెలును వేఱుగ బిగియించిన యట్టి
స్థానంబుల మఱి మీదగాని బహు సరసత నాద వ్యాప్తియునూ,
గలుగునట్లుగా జేసి మీరలును గడు నిర్భయముగ మధురముగా
కావ్యగానమును జేయుడు మీరలు కవులు గాయకులు మెచ్చుకొనన్! 14

కావ్యంబును మఱి మొదటి నుండియును గానము జేయగవలెను సుమా!
రాజు విషయమున యనాదరంబున యలస భావమున మీరు మఱిన్
గానము జేయగరాదు సుమా మఱి కడు ధర్మము ననుసారముగా
రాజు సకల ప్రాణులకును గూడను రహి తండ్రి గదా యోచింపన్! 15

ఆ కారణమున మీరిద్దఱునూ అలరుచు రేపటి యుదయమునన్
ఉత్సాహముతో సావధానమున యురుతర యాసక్తినిగూడీ,
వీణాతంత్రుల యాశ్రుతిలయలకు విమలముగా సరిపోవునటున్
మధురమైన యా శ్రీ కావ్యంబును మానుగ గానము జేయుడికన్! 16

అల ప్రాచేతసు మునియు మఱియునూ అలరు యశస్సును గలవాడున్,
పదమోదారుడు నగు మహర్షియు బన్నుగ యా వాల్మీకి యిటుల్!
అనేక విధముల యా దేశించియు అనేక విధముల శాసించీ,
మౌనముగా దానుండెను మఱియును మహాత్ముడగు వాల్మీకియునూ! 17

మునిచేతను నుపదేశింపగ బడి మోదముగా నా యిరువురునూ!
అరిందములునగు మైథిలి సుతులును నలరుచు అట్లే యనుచు మఱిన్
బలుకుచు వారలు వెడలిపోయిరీ బహుళ నమ్రతను జూపుచునూ!
యాగము జేసెడి ప్రదేశమునకును రాగ తాళముల జేరి రటన్! 18

ఆ బాలకు లిద్దఱును గూడను యాముని పలికిన వచనములన్
అ యద్భుతముల శుక్రుడు జెప్పిన యలరు నీతి శాస్త్రంబు మఱిన్
అశ్వని దేవతలకును వోలె మఱి యలరి హృదయమున నుంచుకొనీ
వేడుకతో ఆ రాత్రిని సుఖముగ విమలముగా గడిపిరి యచటన్! 19

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
తొంబది మూడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

తొంబది నాల్గవ సర్గము

(కుశలవులు రామాయణ గాథను గానము జేయుట శ్రీరామచంద్రుడు
ఆ గానమును సభలో వినుట)

రాత్రి తెల్లవారుచు నుండగనే రయమున వారిద్దఱును మఱిన్!
స్నానంబును జేసిన వారగుచును సరసత హుతాశనునికి మఱిన్
హోమము జేసిన అగ్ని గలుగుచును హోమము పూర్తియునై పిదపన్,
పూర్వము వాల్మీకులచే నెటులను నేర్పబడినదో సమస్తమున్
అచ్చట జేసిరి గానంబును మఱి యలసట లేకను వా రచటన్! 1

ఆ శ్రీరాముడు ప్రాచీనులునగు నల సంగీతాచార్యుల జేతన్
నిర్మింపగ బడినట్టిదియునూ మఱి నిర్మాణము జేయగ బడియున్
అపూర్వమగు షడ్జాది మఱియునూ అల స్వరజాతిని లయతోడన్!
ఆ ముని కుమారులును బాడగనూ నలరి వినెను రాఘవుడు మఱిన్! 2

ఆ శ్రీరాముడు ద్రుత మధ్యంబుల అల విలంబితము మొదలైనా
ప్రమాణములతో గూడినట్టి యా బన్నుగ వీణా తంత్రులకున్
లయలకు ననుగుణముగ నున్నట్టీ యా గీతిని మఱి బాలురచే
అలరి వినియు కౌతూహలమందుచు నా రఘురాముడు శీఘ్రముగన్! 3

అటుబిమ్మట నరశ్రేష్ఠుడైన యా రామచంద్రుడును శీఘ్రముగన్
అశ్వమేధ యాగము మధ్యను మఱి యల మునులను రాజులను మఱిన్
పండితులను నా యా సంఘంబుల బన్నుగ యధ్యక్షులను మఱిన్
పౌరాణికులను శబ్ద శాస్త్రమున బరగ వేత్తలగు బ్రాహ్మణులన్,
స్వరలక్షణములు దెలిపిన వారిని సరసత గానము వినుట మదిన్,
ఆసక్తియుగల బ్రహ్మణోత్తముల యలరు శాస్త్ర లక్షణములనూ!
తెలిసిన వారిని విశేషించి మఱి గాంధర్వంబున నిపుణులునూ!
పాదంబుల సంబంధము దెలిసిన బరగ వ్యాకరణ వేత్తలనూ!

ఛందస్సులలో బహు జ్ఞానంబును సరసత గల వారిని మఱియున్
స్వరముల అచ్చుల మాత్రల విషయము సరసత నెఱిగిన వారి మఱిన్

జ్యోతిషమందున బరినిష్ఠితులను మతిమంతుల విషయము లందున్,
అలంకార శాస్త్రమును దెలిసినా యలరెడి నిపుణుల రప్పించెన్!

కావ్యంబులలో విశారదులునూ యనేక భాషజ్ఞులను మఱిన్,
పరుల మనస్సుల భావంబులనూ బన్నుగ దెలిసిన వారి మఱిన్!
అనేకులగు యా వర్తకులను మఱి యలరుచు వ్యవహారము లందున్
యుక్తియుక్తముగ బలికెడి వారును నున్నత శీలము గలవారిన్!

న్యాయ శాస్త్రములయందు ప్రవీణుల యత్యధికములగు శాస్త్రములన్
జ్ఞానవంతులను ఛందస్సును మఱి తెలిసినట్టి వారలను మఱిన్
పురాణంబులును దెలిసిన వారిని బొలుపుగ వేదములందు మఱిన్
ద్విజ శ్రేష్టులునూ జిత్రకళను మఱి దీరుగ తెలిసిన వారలనూ!

వృత్త శాస్త్రముల యందు ప్రవేశము విమల వికాసము గల వారిన్!
గీత నృత్యములయందున మఱియును నీతి విశారదులను మఱిన్
శాస్త్రజ్ఞులనూ నీతి యందునను నిపుణత గలవారిని మఱియున్,
వేదాంతార్ధము విమల రూపమున విశదముగా వివరించెడి యా
వీరినందఱిని బిలిపించియు మఱి విశదముగా రప్పించి మఱిన్
ఆ బాలుర రప్పించెను సభకును నరుచుచు సంతోషము తోడన్! 4,10

ఆ శ్రోతలు నందఱును నచ్చటను నలరి మాటలాడుకొను చుండగనూ!
ఆ సమయంబున యా మునిబాలకు లలరి నిరువురును హర్షమునన్!
వృద్ధిని జేసెడి యాగానంబును విమలత ప్రారంభించి రటన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 11

అటుబిమ్మటనూ యతి మానుషమగు నలరుచు దుర్లభమైనట్టి
మధురమైన యాగానంబును మఱి మానుగ ప్రారంభమునయ్యెన్
అట్టిగాన సంపదను లోకులును నలరి యెంత వినిననుగానీ
పరితృప్తిని మఱి గలుగలేదు గద! బన్నుగ సంతృప్తియు మఱియున్! 12

సమస్తమైనా ముని గణంబులును సరసత తేజము గలిగిన యా
రాజులందఱును దమనేత్రంబుల రయమున ద్రావుచు నున్నారా?
అనునట్లుగనూ మాటిమాటికిని నలరుచు బాలకులను మఱియున్,
జూచుచుండిరీ యాశ్చర్యమునను సురుచిరముగ యానందమునన్! 13

అచటనున్న యా శ్రోతలందఱును వలరుచు సమాహితులు నగుచున్
పరస్పరము యభిభాషించుచునూ పరగ నుండిరీ యీ విధమున్,
ఈ బాలకు లిద్దఱును గూడనూ యింపుగ బింబము నుండి మఱిన్
వెలికి దీసినా బింబము వలెనూ విమలముగా రాముని వోలెన్,
పోలికతో నున్నారు గదా మఱి పోలికతో రాముని రూపున్! 14

జటధారులును, నార బట్టలును సరసత లేకను బోయినచో
గానము జేయుచు నున్న బాలురకు కమనీయముగా రాముడకున్
భేదమేమియును గనబడబోదూ! బాధ గలుగు మది యెందులకో!
తండ్రీ - కొడుకులు అను భావంబును దఱచుగ మది గలుగుచు నుండున్! 15

పౌరులు మఱియును జానపదులునూ దగ మాటాడుచు నుండగనూ!
మొదటిదయిన నారద దర్శితమును మోదముగను పూర్తియు నయ్యెన్!
నారదుండు వాల్మీకికి దెలిపిన నయముగ రామాయణ కథలో
మొదటి సర్గమును పూర్తియైనదీ మోదముగా శ్రోతలు వినివా! 16

పిమ్మట రెండవ సర్గ మొదలుకొని ప్రియముగ యిరువది సర్గలునూ
గానము జేసిరి ముని కుమారులును గడు సుందరముగ రాగమునన్
అటుబిమ్మట యా రాఘవుండునూ యా యిరువది సర్గలు వినియున్,
సోదరులందున ప్రీతి గలిగినా సురుచిరముగ యా రాఘవుడున్,
అపరాహ్ణము నా సమయమునందున యల లక్ష్మణుతో నిటులనియెన్! 17

సుమిత్రనందన! లక్ష్మణ వినుమా! సురుచిరముగ నా వచనములన్,
మహాత్ములగు నీ యిరువురకును మఱి మానుగ పదునెనిమిది వేలున్
బహూకరింపుము బంగరు ముద్రలు బన్నుగ యింకేమైన మఱిన్
కావలసినచో దానిని నిమ్మా! కడకు ద్రోయకుము కోరికలన్!
లక్ష్మణుండు యా బాలకులను మఱి యలరు స్వర్ణ ముద్రలు వేగన్!
వేలు వేలుగా నిచ్చెను నాతడు వేడుకతో నా బాలురకున్! 18,19

ఆ గాయకులును లక్ష్మణుడిచ్చెడి యలరెడి బంగరు ముద్రలునూ,
గైకొనలేదూ! నిరాకరించిరి కడు శాంతముగా నిటులనిరీ,
ఆ మహాత్ముడును నాశ్చర్యముతో వలరుచు ప్రశ్నించిరి వారున్,
ఈ బంగారము నెందులకనుచును నింపుగ బ్రశ్నించిరి వారున్! 20

వన్యములకు మఱి సంబంధించిన వనరగ ఫల మూలంబులతో
జీవించెడి వనవాసులమైనా స్థిరముగా మేమును ధనమందున్
ధనముల యందున వెండితోని మఱి వన్నెల బంగారముతోడన్,
ఏమి జేసికొందుము మేమును మఱి యింపుగ వన్య ప్రదేశములన్! 21

ఆ బాలురు నటు బలుకుచుండగా నా శ్రోతలు రాఘవుడు మఱిన్
అందఱు గూడను వేడుక తోడను నలరుచు గూడిన వారగుచున్,
ఆశ్చర్యంబున బొంది రందఱును నద్భుత మందిరి చిత్రముగా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 22

మహా తేజమును గల శ్రీరాముడు మానుగ యా కావ్యంబు మఱిన్,
ఎటుల వచ్చెనో దెలిసికొనగనూ వేడుకతో రఘు దీపకుడున్
ఆ మునిసుతులను నిద్దఱినీ మఱి యలరి యీ విధము ప్రశ్నించెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 23

ఈ కావ్యమునకు ప్రమాణమెంతో నింపుగ దెలుపుడు శీఘ్రముగన్,
మహాత్ముడైనా యీ రచయితయును మానుగ యే దేశము వాడున్?
ఈ ఘనకావ్యము రచియించిన యా నింపుగ యా ముని శ్రేష్ఠుండున్
ఎచటివాడు? మఱి యెచటనుండెనో యింపుగ దెలుపుడు మీరలునూ! 24

ఈ విధముగ బ్రశ్నించుచున్న యా యింపుగ రామునితోని మఱిన్
మునికుమారులును నిటులను బలికిరి మోదము తోడుత మధురముగన్!
ఈ కావ్యంబును రచించినట్టీ యింపుగ భగవంతుండైనా
యజ్ఞ సమీపమునకు వచ్చిరి మఱి యల వాల్మీకులవారు మఱిన్! 25

ఏ కావ్యము నీ చరిత్రయును మఱి యింపుగ దర్శింపగ బడెనో
ఆ కావ్యము నతి దీర్ఘమైనదియు, యంతులేని వృత్తాంతంబున్,
ఇరువది నాలుగువేల శ్లోకములు నింపుగ రచియింపగ బడియెన్!
అనేక పాత్రలు ననేక కథలును నలరుచు గల వీ కావ్యమునన్! 26

మహాత్ముడును మఱి తపోశాలియును మానుగ వాల్మీకులు నిందున్,
నూరు ఉపాఖ్యానంబులు మఱియును దీరుగ యొకటవ సర్గంబున్,
మొదలుకొనియు యైదొందల సర్గలు మోదమునను నుండును మఱియున్!
ఉత్తరకాండము గూడినట్టి యా నురుతర యారగు కాండలునూ!
ఈ కావ్యమునను రచింప. బడెనూ నింపుగ భావ సమన్వితమున్! 27

యా ఋషియును మఱి నీదు చరిత్రకు మానుగ సంబంధించిన యా
ఈ కాండాదులను రచించెనూ నింపుగ మధుర సువచనములన్,
కావ్య నాయకుని జీవితంబు మఱి గలిగియుండునో యందాకన్,
ఉన్న కథయును నీ కావ్యములో యున్నది నిక్షిప్తంబై రాజా! 28

మహారథుడవగు రాజా వినుమా! మానుగ వినగా కోరికయున్
మనసునందు గలిగినచో వినుమా! మానుగ యజ్ఞము మధ్యమనన్
తీరకతో నటకును మఱి రమ్మా! దీరుగ యజ్ఞ సువాటికకున్!
తమ్ములతోడను గలిసియు రమ్మా! కావ్యగానమును వినుమచటన్! 29

రఘుకుల నందనుడైన రాముడును రహి బలికెను వారలతోడన్!
'తప్పక యట్లే! జేసెద' న నుచును యా రాఘవుడు బలుకగనూ!
ఆ బాలురు నిద్దఱును గూడనూ యలరుచు రాముని యనుమతినీ,
వాల్మీకుల వా రున్న స్థానమును వనరగ బోయిరి కుశలవులున్! 30

రఘు నందనుడగు రాము డంతటను రమ్యముగా మునులను గూడీ
మహాత్ములగు నా రాజులతోడను మాధుర్యము వికసింపగనూ!
ఆ రామాయణ గీత మధురిమను నా స్వాదించియు రాఘవుడున్!
యజ్ఞ శాలకును బోయెను రాముడు నాచరింప శుభకార్యంబున్! 31

ఆ గాయకులగు బాలురిద్దఱును నల గానంబును జేసిన యా
కావ్యంబును మఱి తాల లయలకును కమనీయముగా నుండె మఱిన్
సర్గల యందున విభక్త్య మగుచును సరికావ్యంబున శబ్దములన్,
స్వరములకును మఱి యనుకూలముగా సరసతతో నట నుండె మఱిన్,
వీణాతంత్రుల లయ కనుగుణమై విమల వ్యంజనములను గూడీ
యున్న కావ్యమును రాముడు వినెనూ చెన్నుగ సంతసమును నందెన్! 32

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
తొంబది నాల్గవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

తొంబది యైదవ సర్గము

(సీతాదేవి తన పరిశుద్ధత్వము విషయమున శపథము జేయవలయునని శ్రీరాముడు బలుకుట)

రఘు నందనుడగు రామచంద్రుడును రమ్యముగా మునులను గూడీ
రాజులతోడను వానరులను మఱి రహి సహచరులును గూడికొనీ,
శుభకరమగు నా మధురగీతమును సురుచిరముగ బహు దినములునూ
వినియు నాతడును నాశ్చర్యంబును విమలాద్భుతముల నొందె మఱిన్! 1

ఆ గీతంబును బట్టి గాయకులు యా సీతాపుత్రులు ననుచున్
తెలిసికొనియు మఱి రామచంద్రుడును దీరుగ యాలోచన తోడన్
పరిశుద్ధంబును నడవడికయు గల బన్నుగ దూతల నటుబిలిచీ
ఆ పరిషత్తున మధ్యలో నిటుల యలరి బలికె బహు మధురముగన్! 2

ఇచ్చటినుండియు వెడలుడు మీరలు మచ్చిక వాల్మీక్యాశ్రమమున్
నా వచనములుగ దెలుపుడు మీరలు నయముగ వాల్మీకులకు మఱిన్,
పరిశుద్ధంబగు చరిత్ర గలిగిన పరమ పతివ్రత మఱి యగుచో
సీత కల్మషము లేనిదియైతే స్థిర పతినిష్ఠయు గలదైతే
మహామునిని వాల్మీకుల వారిని మానుగ యనుజ్ఞ పొంది మఱిన్,
ఇచ్చోటున తన బరిశుద్ధతనూ యింపుగ నిరూపణము జేసీ
తన సతీత్వమును నలుగురు మెచ్చగ దగ నిలిచియు యుండును గాతన్! 3,4

వాల్మీకుల యా యభిప్రాయమును వనర దెలిసికొనియును వేగన్
నమ్మకమును గలిగెడి ప్రమాణమును, నయముగ జూపుటకును మఱియున్
అంగీకారము దెలిపిన మైథిలి యభిప్రాయమును దెలిసికొనీ
శీఘ్రముగా రండిటకు మీరలును స్థిరముగ దెలుపుడు నాకు మఱిన్! 5

జనకుని కుమార్తె యైన సీత మఱి సరసత రేపటి యుదయమునన్,
పరిషత్ మధ్యను నిలిచి నన్ను మఱి బన్నుగ నట నిర్దోషినిగా
నిరూపించుటకు గూడను, మైథిలి నిండు సభను మఱి నిలిచి మఱిన్
శపథము జేయును గాత! సత్యమును సతతము బలుకును గాత! మఱిన్! 6

శ్రీ రాముని యా పరమాద్భుతమగు శ్రీకరమగు వచనముల వినీ
ఆ దూతలునూ మునిపుంగవుడును వెచ్చోటను గలడో యటకున్!
ఆశ్రమమునకును బోయిరి వారలు నల వాల్మీకుల కనుగొనగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 7

ఆ దూతలు మఱి ప్రకాశించెడీ అమితమైన కాంతియు గలుగూ
ఆ మహాత్ముడగు వాల్మీకులకును నలరుచు నమస్కరించి మఱిన్,
రాముడు దెలిపిన మధుర వచనముల రయమున దెలిపిరి మునికి మఱిన్
'ఏమి యాజ్ఞ?' అని యడిగిరి వారలు నింపుగ వినయము తోని మఱిన్! 8

మహాతేజమును గల యా మునియును మానుగ దూతల భాషితమున్,
ఆలకించి శ్రీరాముని హృదిలో నలరు మనోగతమును దెలిసీ,
అటుపిమ్మటనూ యా మునీంద్రుడును నలరుచు నీ విధమున బలికెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 9

అట్లే యగు గాతను! మీకును మఱి యలరి శుభము గలుగును గాతన్!
మహీపతియును నగు రామచంద్రుడును మానుగ యే విధి బలికెడినో!
అటులే మైథిలి జేయగలదు సుమ! మానుగ గిరిగీసిన రీతిన్
స్త్రీకి భర్తయే దేవతగద! మఱి స్థిర బంధము లోకమునందున్! 10

రాజదూతలును, యా మునీశ్వరుని రమ్యమైన మాటలను వినీ,
మాహాతేజమును గలిగినట్టి యా మానుగ రాముని యొద్దకునూ,
ఆగమించి యంజలితో గూడుక యల నమస్కృతులు జేసీ మఱిన్,
ముని పలికిన యా పలుకులన్నియును మోదముతో బలికిరి వారున్! 11

అటు బిమ్మట యా మహాత్ముడైనా యా ముని వచనములను వినియున్
సంతోషించెను కాకుత్స్థుండును స్వాంతము నందున బహుళముగన్
అచటికి వచ్చిన ఋషులను మునులను నలరి రాజులను గూర్చి మఱిన్
ఈ విధముగ భాషించెను నాతడు నింపుగ వారలతోని మఱిన్! 12

శిష్యులతో గూడిన పూజ్యులునూ శ్రీకరముగ సహచరులు మఱిన్,
గూడినట్టి యా నరాధిపతులును గూర్మి చూడదలచిన వారున్
ఎవరైనను మఱియున్నదో నిచట నింపుగ జూడగ దలచినచో
వారును గూడను మైథిలి జేసెడి వనర శపథమును జాతు రిటన్! 13

మహాత్ముడైనా రాముని మాటలు మానుగ విని యా బిమ్మటనూ!
అచట గలట్టి ఋషిమును లందఱు నలరి బాగు బాగనుచు మఱిన్!
బిగ్గఱగా నట ధ్వనులను జేసిరి బిరుదులు గల యా రాజులునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 14

మహాత్ములైనా రాజులు గూడను మానుగ రఘునందనుని మఱిన్,
ప్రశంసించిరీ పలు భాషలతో బన్నుగ కీర్తించిరి వారున్,
నరశ్రేష్ఠా! ఓ రామచంద్ర విను! నయముగ యిది నీకే తగునూ!
ఇతరు లెవరికిని సాధ్యముగాదూ! యింపుగ యీ లోకము నందున్! 15

శత్రుసూదనుండైన రాముడును నాత్రము లేకను నిటు బలికెన్,
రేపు జరుగు మఱి సమావేశమును రేపటి దినమున మీరు మఱిన్,
విచ్చేయగ వలె ననుచు బలుకుచును విమల భావమున నందఱినీ
నిశ్చయమును మఱి జేసి వారలను నిర్ణయించి పంపెను వారిన్! 16

మహాత్ముండు మఱి మహానుభావుడు మానుగ రాజ సుశ్రేష్ఠుండున్,
రామచంద్రుడును శపథము రేపును రహి జరుగును ననుచును మఱియున్,
నిర్ణయంబు జేసియు మునులను మఱి నికరముగా నా రాజులనూ
అందఱినూ మఱి పంపివేసెనూ నలరుచు నుదయము నచ్చుటకున్! 17

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
తొంబది యైదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

తొంబది యాఱవ సర్గము

(సీత పరిశుద్ధురాలని వాల్మీకి ఘోషించుట)

ఆ రాత్రియు దెలవారుచుండగా యా రఘునందనుడు వేగన్!
యజ్ఞశాలకును బోయి ఋషులనూ యందఱినీ మఱి బిలిపించెన్! 1

వసిష్ఠుండు మఱి వామదేవుడును వవరగ జాబాలియును మఱియున్
కాశ్యపుండు మఱి దీర్ఘ తపముగల విశ్వామిత్రుండును మఱియున్,
మహాతపముగల దుర్వాసుండును మానుగ పులస్త్యుడును వచ్చెన్,
శక్తియునూ, భార్గవుడు, వామనుడు సద్గుణుడును దీర్ఘాయువునూ!

మార్కండేయుడు మహా కీర్తిగల మౌద్గల్యుడు గర్గ్యుడు మఱియున్,
సకల ధర్మముల నెఱిగినట్టి యా శతానందుడును నటకొచ్చెన్
తేజస్వియునగు భరద్వాజుడును సుప్రభ గలిగిన యట్టి మఱిన్,
అగ్నిపుత్రుడును నారదుండునూ, పర్వతుండునూ నట కొచ్చెన్!

మహాకీర్తిగల గౌతముండునూ మానుగ కాత్యాయనుడు మఱిన్,
సుతజ్ఞుండునూ తపసులకును నిధి యగస్త్యుడును మఱి యటకొచ్చెన్!
వీరేగాకను బహు నియమంబులు విమల యశులు వచ్చిరి, యటకున్,
వచ్చిన వారలు నందఱు గూడను కౌతుహలమును గూడికొనీ,
వేడుకతోడను నటకొచ్చిరి మఱి విమలాద్భుతమును గాంచుటకున్! 2-6

మహావీరులును, రాక్షసులును మఱి మహా బలముగల వానరులున్,
సమస్తమైనా మహాత్ములందఱు సారెకు కౌతూహలముననూ
వేడుకతోడను నటకొచ్చిరి మఱి విమలాశ్చర్యముతోని మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 7

వేలకొలది క్షత్రియులు శూద్రులును వైశ్యులు వచ్చిరి యటకు మఱిన్,
నానా దేశాగతులగు వారలు, నానా వ్రతములు గల యట్టీ!
జ్ఞాననిష్ఠులును కర్మనిష్ఠులును యోగ నిష్ఠులును నైనట్టీ
బ్రాహ్మణోత్తములు వీరందఱునూ బన్నుగ జానకి జేసెడి యా
శపథంబును మఱి జూచుట కొఱకై సమాగతులునై వచ్చిరటన్! 8,9

శిలాప్రతిమలుగ మారిపోయి రా చిత్రముగా నటులుండిన యా
నిశ్చలంబుగా యున్నటువంటీ నిఖిల జనంబులు వచ్చి రటన్

విని యా వాల్మీకులవారు సీతతో విమలముగా నటకొచ్చి మఱిన్
బాలకులగు యా కుశీలవులనూ బన్నుగ గాంచుచు నుండెనటన్! 10

'అవాన్ముఖీ యగునట్టిదియును మఱి యల కృతాంజలియు నట్టిదియున్
కన్నీరును మఱి కంఠమునందున గల యా సీతాదేవియునూ!
అంజలి ఘటించి నమస్కరించుచు నలరి శీర్షమును వంచుకొనీ,
ఆ ముని వెనువెంటనె వచ్చెను మఱి యమృతమూర్తియగు మైథిలియున్! 11

బ్రహ్మదేవునీ వెనువెంటను మఱి బన్నుగ శ్రుతి వచ్చిన యటులన్,
ఆ వాల్మీకుల వారి వెనుకనే యా జానకి వచ్చుచు నుండన్,
ప్రజలందఱునూ బాగు బాగనుచు బన్నుగ బలికిరి ధ్వని గలుగున్!
ఋషి మునులందఱు కన్నీళులతో రూఢిగ జెందిరి కలత మఱిన్! 12

ఆ సమయంబున దుఃఖము జేతను నత్యధికంబగు శోకముతో
వ్యాకులతను జేయగ బడినట్టి వనరగ ఋషిమునులును రాజున్
అచ్చటి వారందఱు గూడను మఱి మచ్చికతో కోలాహలమున్
అయ్యో! పాపము! వనుచు జనంబులు యావేదనయును బొందిరటన్! 13

యజ్ఞవాటికను ప్రేక్షకులందును నలరి కొందఱును యఱచుచునూ!
శ్రీరామా! మఱి బాగుబాగు యని స్థిరముగ జేసిరి ధ్వనులటనూ!
సీతాదేవీ! బాగుబాగు యని శీఘ్రము జేసిరి కొందఱునూ!
ఓ సీతా! ఓ రాములారా! యని యెనరగ యఱచిరి వాటికనూ!
బ్రాహ్మణోత్తములు గలవరబడిరీ కంటినీటితో దిగులొందీ! 14

అటు బిమ్మట సీతా సహాయుడును నలరెడి ముని శ్రేష్ఠుండైనా
ఆ వాల్మీకులు నట్టి సమయమున నల జన సముదాయము మధ్యన్!
నిలిచి రామచంద్రునితో నిట్లనె నీరస భావముతోని మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

దాశరథే! ఓ రామా! వినుమా! దగ నా వచనములను మఱియున్,
సువ్రతయును మఱి ధర్మచారిణియు సూనృతవ్రత! యీ వైదేహిన్,
లోకపవాదమునకు భయంపడి లోలత యడవుల వదిలితివీ!
నా యాశ్రమమునకును సమీపమున నయముగ విడిచీ పోయితివీ! 16

మహావ్రతము గలవాడా రామా! మానుగ లోకపవాదమునన్!
భయపడినట్టి నీ కీ మైథిలి బన్నుగ విశ్వాసమును మఱిన్!
యోగ్యమైన యా ప్రమాణంబునూ భాగ్యముగా జూపగ గలదూ!
ఆమెకు ననుమతి నిమ్ము రాఘవా! అల సాక్ష్యముతో బనిలేదూ! 17

కవలలుగా బుట్టిన యీ యిరువురు కమనీయముగా నీ సుతులే!
సీత పుత్రులే నిజముగ నమ్మము! శ్రీకరముగ కాకుత్స్థులమా!
ఎదిరింపగ శక్యంబునుగానీ యీ యిద్దఱు నీ కుమారులే!
నీకు నేను మఱి దెలుపుచు నుంటిని నిజముగ సత్యము రఘురామా! 18

రఘురామా! ఓ సీతారామా! రహి వినుమా! నా వచనములన్
నేను ప్రచేతసు పదియవ పుత్రుడ నిజముగ నమ్మము శ్రీరామా!
నే నెప్పుడునూ యసత్యంబును నిల నిజముగ బలుకగ లేదు సుమా!
వీరిద్దఱునూ నీ పుత్రులు సుమ! విమలములైనవి నా పలుకుల్! 19

కొన్నివేల వత్సరములు నేనును కూరిమి తపస్సు జేసితినీ,
ఈ వైదేహిని దోషమున్నటుల యిలలో దేలిన యట్లయినన్
నాకు తపస్సున ఫలితంబును మఱి నయముగ లభింపకుండు మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 20

మనస్సుజేతను, కర్మ జేతనూ మానుగ వాక్కులజేత మఱిన్!
పూర్వంబున నే నే పాపంబును బొలుపుగ జేయగలేదు మఱిన్,
సీత పాపమును లేని దయినచో స్థిరముగ నేనును వేగముగన్,
పుణ్య ఫలంబును బొందెదనూ మఱి పురుషోత్తముడను నయ్యెదనూ! 21

రఘురామా! యీ వైదేహియునూ రహిని యైదు జ్ఞానేంద్రియముల్
మనస్సునందున గూడను నామెయు మఱి పరిశుద్ధము గలదగుచున్
వనమునందు సెలయేఱు దగ్గఱకు వనరగ గ్రహించితిని నేమన్
తెలిసికొనియు గాపాడితి నామెను దీరుగ పరిశుద్ధాత్మయనీ! 22

పరిశుద్ధంబగు వడవడికయుగల పాపంబులు మఱి లేనిదియున్,
పతినే దైవముగా పూజించే బన్నుగ యీమె పతివ్రతయున్,
లోకంబున యపవాదంబునకును లోలత భయపడి నీకు మఱిన్
తగిన ప్రమాణము నీయగలదు సుమ! దగ నీ భయమును బోనాడీ! 23

అందువలన ఓ రఘురామా విను! చందముగా సీతను నీవున్,
పరిశుద్ధంబని దెలిసినచో మఱి బన్నుగ లోకపవాదముకున్
భయపడి నీవును విడిచితివో మఱి బన్నుగ యీ జానకి మఱియున్
పరిశుద్ధము మఱి పతివ్రతయునని బన్నుగ దివ్యజ్ఞానముచే
తెలిసికొనియు నే దెలుపుచు నుంటిని తేటతెల్లముగ సత్యంబున్! 24

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
తొంబది యాఱవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

తొంబది యేడవ సర్గము

(సీతాదేవి శపథము జేయుట - రసాతలములో బ్రవేశించుట)

వాల్మీకులచే బలుకబడిన యా వనరగ రఘునందనుడు మఱిన్,
జనుల మధ్యనూ నున్న సీతనూ బన్నుగ యా రాముడు గాంచీ,
వాల్మీకులకును యంజలి ఘటించి వనరగ నమస్కృతులు జేసీ
స్పష్టముగా నా ప్రచేతసునితో నిష్టముగా నిటులను బలికెన్! 1

ధర్మవేత్తవగు మహానుభావా! దగ నీ జెప్పిన దంతయునూ,
యథార్థమే సుమ! నీవు జెప్పినది యథాస్థితిని నమ్మెచు నుంటిన్!
నీవు బలికినా దోష రహితములు నిజమగు మాటలపైని మఱిన్,
నాకైతే మఱి పూర్తి నమ్మకము నయముగ నున్నది మునివర్యా! 2

పూర్వము సురల సమక్షమునందున బొలుపుగ మైథిలి విషయమునన్!
పూర్తి నమ్మకమును నేర్పడినది బొలుపుగ శపథము గూడ మఱిన్,
జేయబడినదీ అందుచేతనే శ్రీకరముగ సీతను మఱియున్
గృహమునకును మఱి గొనిదెచ్చితినీ ఖేదంబును మఱి మాన్పుచునూ! 3

మహామునీ! లోకాపవాదమును మానుగ బలవత్తరముగనూ!
నుండుట చేతను వైదేహిని నే ఖండితముగ నే నొదిలితినీ!
ఈమె యందునను నే పాపంబును నింపుగ లేదని దెలిసియునూ
లోకభయంబున త్యజించితిని మఱి లోలత నను నిక క్షమింపుమా! 4

ఈ గాయకు లిద్దఱును గూడనూ కవలలుగా బుట్టిన యట్టి
పుత్రలనుచు నే నెఱుగుదును సుమా! పూర్తి నమ్మకము గలదు మఱిన్!
జనుల మధ్య పరిశుద్ధురాలుగా మానుగ నిర్ణయమును మఱియున్,
జరిగిన పిమ్మట నాకు సీతపై సమ్మతి ప్రీతియు గలుగు మఱిన్! 5

రాముని యభిరుచి దెలిసికొనియు మఱి రయమున మహేంద్రుడును మఱియున్
మొదలగు మహాత్ములందఱు గూడను మోదమునను సీతను గూర్చి

మహాశపథమును జూడదలచియును మానుగ వచ్చిరి యచ్చుటకున్
ఏమి జరుగునో జూతమటంచను నింపుగ యిటకొచ్చిరి వారున్! 6,7

ఆదిత్యులు వసువులు రుద్రులునూ యలరెడి విశ్వ సుదేవతలున్
మరుద్గణంబులు సాధ్యులు మఱియును సమస్త దేవతలు నటకున్,
నాగులు, యక్షులు, సిద్ధులు గూడను నయముగ వీరందఱు గూడీ,
సంతసమున గూడిన మనస్సుతో చక్కగ వచ్చిరి యిచ్చుటకున్,
అలవచ్చిన వారందఱు గూడను నలరుచు సీతా శపథంబున్!
గూర్చి మఱియు తబ్బిబ్బు బడుచునూ కూరిమి వచ్చిరి యచ్చుటకున్! 8,9

దేవతలను ఋషులను మఱి గాంచుచు దీరుగ రాముడు నిటుబలికెన్
దేవతలారా! అకల్మషములగు దీరుగ ముని వాక్యములందున్
నమ్మకమున్నది కానీ జనముల నయముగ మధ్యను నుండిన యా
జానకియందున నాకు ప్రేమయును నయముగ గలుగును గాత! మఱిన్! 10

అటుబిమ్మట శుభకరము పుణ్యమును నలరు దివ్యగంధము గలదీ
మనోహరంబును నైన వాయువును మానుగ యానందము మఱియున్
అందఱినీ సంతోషంబును మఱి యలరుచు గలిగించెను నపుడున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 11

సకల దేశముల నుండి వచ్చినా సమస్త మానవులందఱునూ
పూర్వమందు నా కృతయుగంబు వలె పొలుపుగ యూహింపగరానీ,
ఆశ్చర్యంబును గాంచినట్లుగా నలరి జూచి రా సమయమునన్
సావధాన చిత్తముతో గాంచిరి సర్వజనులు నా సమయమునన్! 12

సమాగతులునై వచ్చిన వారిని సహజరీతి గాంచుచు వారిన్,
కాషాయాంబరములు ధరించినా కలికి సీత ప్రాంజలి తోడన్,
అంజలి ఘటించి నమస్కరించుచు నలరి శీర్షమును వంచి మఱిన్!
క్రిందికి జూచుచు నిటుల బలికినది సుందర వాణిని గూడికొనీ! 13

నేను రాఘవుని దప్ప మఱెవరిని మనసున గూడను స్మరింపనో
మాధవునకు మఱి భార్యయైన ధర మానుగ భూదేవియు మఱియున్

నాకు వివరమును నిచ్చుగాత! మఱి నను మనసున ప్రీతిని గాంచీ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 14

మనసుచేత మఱి కర్మచేతనూ మానుగ వాక్కుల జేత మఱిన్
అల శ్రీరాముని ఘనముగ మనసున యలరుచు బూజలు సలుపుచునూ
నుండినట్లయిన యా మాధవి యగు దండిగ భూదేవియు మఱియున్
నాకు వివరమును నిచ్చుగాత మఱి మనసున ప్రేమను గాంచుచునూ! 15

నేనిప్పుడు జెప్పిన దంతయునూ నిజముగ సత్యంబైన మఱిన్
రాముని కంటెను మఱియొక పురుషుని నయముగ యెఱుగక పోయినచో
అతుల మాధవీ భూదేవియునగు నలరి వివరమును నిచ్చు మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

సీతాదేవియు నీ విధముగనూ శ్రీకరముగ శపథము జేయన్
అత్యుత్తమమును నద్భుతమయినా యలరెడి యొక దివ్యమునైనా!
సింహాసనమును మధ్య నుండి మఱి శ్రీకరముగ పైకిని లేచెన్!
అద్భుతమైనా యాకారముతో నలరు ప్రకాశించుచు నున్నా
ఆ సింహాసనమును దివ్యమునగు నల రత్నంబుల చేత మఱిన్
అలంకరింపగ బడియు నమితమగు నపూర్వమగు బలమును గలుగా!
సర్పంబులు మఱి తమ శిరములపై సరసత మోయుచు నుండె నటన్! 18

ఆ సింహాసనమున నున్నట్టీ యల ధరణీ దేవియు సీతన్!
తన బాహువులను బట్టుకొనియు మఱి దగ వత్సా! రమ్మనుచు మఱిన్
స్వాగతంబుతో నభినందించుచు సరసత తన యాసనముననూ
గూర్చుండగ జేసెను మైథిలినీ కూర్మి బ్రీతి బొంగారగనూ! 19

సింహాసనమున గూర్చుండియు మఱి శ్రీకరముగ యా సీతయునూ!
రసాతలంబున బ్రవేశించెడీ రమ్య దృశ్యమును జూడగనే,
దివ్యమైన బహు పుష్ప వృష్టియును దీరుగ బడెను నిరంతరమున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 20

జనకనందినీ యలరు శీలమును సరసత యెంతటి ఘనము మఱిన్ -
'బాగు! బాగు!? అని దేవత లందఱు బలికినట్టి యా నాదంబున్!

బహు బిగ్గఱగా వినవచ్చెను మఱి పలు దిక్కులు వ్యాపించుచునా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 21

అంతరిక్ష గతులైన దివిజులును నల జానకి రసాతలమున్,
ప్రవేశించుటను గాంచి వారలును బరగ సంతసించిన వారై
బహు విధములునగు వాక్యంబులతో బన్నుగ గీర్తించిరి వారున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 22

యజ్ఞ ప్రదేశము నున్న మునులకును నలరు నరేంద్రులకు గూడన్
ఉత్తములైనా యితర జనులకును నురుతరమగు విద్వాంసులకున్!
ఆశ్చర్యము మఱి తగ్గలేదు గద! యద్భుత భావము గూడ మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 23

అంతరిక్షమున నున్నవారునూ జింతను వసుధను నున్నట్టి
స్థావర జంగమముల యందును మఱి సరసత గలిగిన వారు మఱిన్,
మహా కాయములు గలుగు దానవులు మానుగ పాతాళము నున్నా,
పన్నగాధిపులు గొందఱట్టియెడ బన్నుగ జానకి సతీత్వమున్!
సంతోషించుచు నానందముతో సరసత ధ్వనులను జేసి రటన్!
కొందఱు నాలోచనలో బడిరీ కొందఱు ధ్యాన పరాయణులై
కొందఱు కలతను జెందినవారై కూర్మి మనస్సుల చింతనతో
కొందఱు రాముని గాంచుచుండిరీ కొందఱు వైదేహిని మఱియున్! 24, 25

అల వైదేహీ రసాతలంబున యలరి ప్రవేశించుట గాంచీ
లోకమంతయును గలతను జెందెను శోకముతోడను గూడికొనీ!
ముహూర్త కాలము స్పృహను దప్పి మఱి మోహమందె క్షణకాలంబున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 26

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
తొంబది యేడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

తొంబది యెనిమిదవ సర్గము

(సీతాదేవి కొఱకు శ్రీరాముని శోకము, బ్రహ్మదేవుడు ఓదార్చుట, ఉ త్తరకాండ
శేషమును వినుమని జెప్పుట)

ఆ వైదేహీ రసాతలంబున యలరి ప్రవేశము నందగనూ
గాంచిన వారలు దుఃఖము తోడను సంచితముగ నఱచిరి వేగన్!
రాముని సన్నిధి నున్న మునులునూ రమణి సీతనూ బొగడుచునూ!
సాధు! సాధు! అని యఱచిరి వారలు సౌమ్యభావమున గొంతెత్తీ! 1

రఘునందనుడగు రామచంద్రుడును రమ్య దండ కాష్ఠమును మఱిన్,
ఆనుకొనియు కన్నీటి జేతనూ యలరు నేత్రములు వ్యాకులమై!
శీర్షంబును వంచియు నాతండును స్థిరమగు వేదనతోని మఱిన్,
దీనమైన యా మనస్సు తోడను దీరుగ దుఃఖితు డాయె నటన్! 2

రఘునందనుడగు రాము డంతటను రహి చిరకాలము ధ్యానించీ,
అధికముగా కన్నీటిని విడుచుచు నధిక కోప శోకంబులతో,
గూడినవాడై యిటులను బలికెను గూరిమి తనలో తాను మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

రూపము దాల్చిన లక్ష్మి వంటిదియు దీరుగ వైదేహియు నేనున్
జూచుచుండగనె యదృశ్యురాలై సురుచిరముగ పూర్వంబుననూ!
ఎన్నడులేనీ శోకతాపములు నింపుగ నాదు మనస్సునకున్
ప్రవేశింపగా దలచుచున్నటుల బరగ స్ఫురించుచు నుండె మదిన్! 4

ఆ సీతను నే జూడకుండగా నలరి మహోదధి యావలకున్
లంకాపురికిని యెత్తుక పోబడి యలరి దాపబడినది గూడన్!
అచ్చటి నుండియు గూడ నా వలన యలరి దీసికొని రాబడియెన్!
వసుధా తలమున నుండి జానకిని వనరగ దెలుపగ నేల మఱిన్! 5

పూజ్యురాల! ఓ భూదేవీ విను! పొలుపుగ నాదు సువచనములన్,
నా వైదేహిని నాకు నిమ్ము! మఱి నయముగ గైకొనియెద నేనున్
అట్లు కానిచో నెట్టి వాడనో యలరి నీకు దెలిసెడి విధమున్!
క్రోధంబును నే జూపెదనమ్మా! కోపము నందకు భూదేవీ! 6

నీవు నాకు మఱి యత్తగారివే! నిజముగ దెలియును నాకు మఱిన్!
ఎందుచేతననగా మఱి పూర్వము చందముగా నాగలి చేతన్!
దున్నుచున్న యా జనక నరేంద్రుడు బన్నుగ నీ నుండియె సీతన్!
పైకి దీసినాడు గద! తల్లీ! పూర్వము బంధుత్వంబును దలపు మికన్! 7

అందువలన యా వైదేహిని మఱి చందముగా మఱలను నిమ్మా!
లేదా నాకును వివరము నిమ్మా? లీలగ యందున యణిగెదమా!
పాతాళములో నైననుగానీ బన్నుగ స్వర్గములోగానీ
ఆమె తోని నే కలిసి వసింతును నాశ్చర్యము లే దింతయునూ! 8

ఆ వైదేహిని గైకొని రమ్మా! యాలసింపకుము! వేగముగన్!
ఆమె కోసమై మత్తుడనైతిని! యలరి క్షణంబును మన జాలన్!
మహీతలంబున నున్న సీతనూ! మానుగ పూర్వంబెటుగలదో!
అట్టి జానకిని యివ్వకపోయిన యలరి యేమగునో దెలియు మికన్!
పర్వతములతో, వనములతోడను, బన్నుగ నుండిన నీ స్థితినీ
తారుమారు జేసెద నే నిపుడే దగ ధ్వంసంబును జేసెదనూ!
అంతయు జలమయ మగు గాతను! మఱి యంతయు వికృతి జేసెదనూ! 9,10

క్రోధ శోకములు గూడిన రాముడు గూరిమి నీ విధి బలుకగనూ!
దేవగణంబులతో గూడిన యా దేవదేవుడగు బ్రహ్మయునూ!
రామునితోడను నిటుల బలికెనూ రమ్యముగా మధురోక్తులతో!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 11

మంచి నియమములు గలవాడా! వినుI నంచితముగ శ్రీ రఘురామా!
సంతాపంబును మదిలో దలపకు! వింతగ దుఃఖింపకు నీవున్,
నీ పూర్వపు సుస్వరూపంబునూ! నిర్మలమగు నాలోచనలన్!
మదియందున మఱి స్మరింపు రామా! మానుగ నీ జన్మను గూర్చి! 12

మాలిన్యము లేనిది పతివ్రతయు మానుగ సీతాదేవియునూ!
నీదు పూర్వరూపమును గోరుచును నీ యాశ్రమమను తపస్సులా,
బలము వలన మఱి సుఖము తోడుతను బరగ నాకలోకమును జనెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 13

నీకును మఱిలను నామె సంగమము నిర్మలముగ స్వర్గమునందున్
గలుగుగాత! సంశయమును లేదూ! సందేహము లేదింతయునూ!
ఈ మహా సుపరిషత్తు మధ్యమున యీ మాటను దెలుపుచు నుంటిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 14

రఘురామా! నీవును వినినట్టి రమ్య కావ్యములలోను మఱిన్
ఉత్తమమైనా యీ వాక్యము మఱి యురుతరముగనూ విపులముగన్!
స్పష్టముగా మఱి దెలుపగలదు సుమ! సంశయంబు లేదింతయునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

ఓ వీరుడ! రఘురామా! వినుమా! యొప్పుగ నాదు సువచనములన్!
నీ జన్మంబును మొదలుకొనియు మఱి నీకు గలిగినా విషయములన్!
సుఖ దుఃఖంబుల యనుభవంబునూ సురుచిరముగ రాబోవునదీ!
ఆ వృత్తాంతంబంతయు గూడను రమ్యముగా వాల్మీకియునూ!
యీ కావ్యంబున నిబంధించెనూ నింపుగ లోకులకును దెలియన్! 16

ఇట్టి యాదికావ్యంబంతయునూ గట్టిగ యాలోచింప మదిన్
నీకే సంబంధించియున్నదీ నిజముగ పరిశీలించినచో
రాముడొక్కడే కావ్య యశస్సును రయమున యందగ గలవాడూ!
మరొక్కడెవడును లేడు గదా మఱి మానుగ యాలోచించినచో! 17

దివ్యంబును నాశ్చర్యకరంబును దీరుగ సత్యంబైనదియున్,
అయినట్టిది యిది యే వృత్తాంతము నలరి దాచనట్టిదియు మఱిన్!
ఇట్టి మధురమగు కావ్యంబును మఱి గట్టిగ నేమను దేవతలున్!
కలిసికట్టుగా విని యున్నారము కమ్మని తీయని శ్లోకములన్! 18

పురుష శ్రేష్ఠుడ! కాకుత్స్థా! విను! బొందుగ నాదు సువచనములన్
అట్టి నీవు ధర్మానుసారముగ యలరి సావధానముతోడన్
రామాయణమున రాబోయెడికథ రహి మిగిలిన యీ శేషమునూ!
ఆసక్తిని రఘురామా! వినుమా! యలరి జరుగబోవునది మఱియున్! 19

మహాకీర్తియును గలవాడా! విను! మానుగ యీ కావ్యము నందున్!
మిగిలిన బాగంబునకును నామము దగ యుత్తర భాగము యనియున్
నామము గలదూ! రఘుకులతేజా! నయముగ ఋషులను గూడికొనీ!
కలిసి వినుము! కమనీయ ఘట్టములు కమ్మని రామాయణ గాథన్! 20

రఘురామా! మఱి యుత్తమంబైన రహి యీ భాగము మఱి యొకరున్
ఎవ్వరునూ వినగూడదు సుమ్మా! వీరుడవగు శ్రీ రఘురామా!
రాజర్షివియునగు నీవే ముందుగ రమ్యముగా వినవలెను సుమా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 21

ముల్లోకములకు ప్రభువగు వాడును మోదముగను నా బ్రహ్మయునూ
ఇటుల బలికి బంధువులను గూడిన యింపుగ సురలను గూడి మఱిన్,
స్వర్గంబునకును తరలిపోయెనూ సాధువచనముల బలుకుచునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 22

బ్రహ్మ లోకమును సంబంధించిన బన్నుగ తేజము గలవారున్
మునులు ఋషులు మఱి దేవతలందఱు మోదమునను నా ప్రజాపతిన్
అనుమతి గైకొని యుత్తర కథనూ యలరి వినుటకై వారలునూ
తిరిగి వచ్చిరీ యయోధ్యకును మఱి తీరుగ యీ నగరంబునకున్! 23

రామాయణమున యుత్తర భాగము రామునకును మున్ముందు మఱిన్
ఏమి జరుగనున్నదో యనుచును మఱి యింపుగ వినుటకునై వారున్!
తిరిగి వచ్చిరీ కౌతూహలమున దీరుగ యయోధ్య వాటికకున్!
మహాతేజమును గలిగిన రాముడు మానుగ బ్రహ్మయు బలికిన యీ
శుభకరమగు యీ వాక్యంబును విని సూటిగ మహర్షితో నవియెన్! 24

ఈ ఘట్టములో సీతాదేవి త్రిభువన వ్యాప్త మహాశక్తి స్వరూపిణి యని తెలిపే విధంగా కొన్ని శ్లోకాలు ప్రాచ్యప్రతిలోనున్నవి.

ఆ ఐదు శ్లోకాలు గీతికారూపమున భావార్థము దిగువ తెలియజేయబడినవి.

ఇంతటిలో వసుధాస్థలియందున నొక వాణియు వినబడెను వటన్
రామా! నీవును తాపము విడుమా! యిల కారణమును వేల్పు సుమా!
అల దైవమె కారణము సుమా మఱి యలరి వినుము నా వచనములన్!
దుఃఖమెందులకు దురపిల్లుటయును? దూరాలోచన లెందులకూ? 1

వైదేహిని కావలెనని గోరుచు వగచుచు నుంటివి నీవు మఱిన్!
వ్యర్థమైన పరితాపంబిది సుమ! వనరగ మది యోచించినచో

ఆమె దర్శనంబును లభింపదూ! యలరుచు యత్నించిన గూడన్!
ఆమె మూడు లోకములయందునూ యలరి యుండెనూ వ్యాపించీ! 2

ఇచట నున్న యీ మహాలక్ష్మినీ యింపుగ నాగులు బూజింత్రూ
మానవ లోకమునందు మానవులు మానుగ బూజించెదరు సుమా!
ఈమె పితృదేవతలకు నిరతము నింపుగ యిచ్చెడి స్వధయె సుమా!
స్వర్గమందు నమృతమును భుజించెడి సురల తృప్తి యీ స్వరూపమే! 3

మహా విష్ణువూ దేహము నందున మానుగ యీమెయె లక్ష్మిగనూ,
ప్రతిష్టితంబై యున్నది యీమెయె బన్నుగ శుభకర రూపమునన్!
స్వర్గమునందున యున్నటువంటీ సిద్ధ పురుషులా సిద్ధిగనూ!
ప్రతిష్ఠితంబై యున్నది యీమెయె ప్రాగ్జ్యోతియు యనబడుచు మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 4

రామా! సీతను కనుగొనవలెనను రమ్య ప్రయత్నము విరమింపూ!
సీతను జూడగ మది దలచినచో శ్రీకరముగ యా కుశలవులన్
జూచుకొనుము మఱి యీ దృష్టులతో జూడగ సీతారాములనూ
అప్పుడు నున్నారు వారు మఱి యిప్పుడునూ నున్నారు సుమా!
ఎప్పుడునూ నుందురు లోకంబున అంతట నుందురు నుండెదరూ! 5

భగవంతుడ! ఓ పూజ్యుడ వినుమా! బ్రహ్మలోకమును జెందిన యా
ఋషులు నాదు మఱి జరుగబోయెడీ విషయంబును వినదలచి మఱిన్!
కోరికతో నున్నారు గదా మఱి కోరిక దీర్పగ వలయుగదా!
అట్టి యుత్తరా కథా వస్తువును నలరెడి రేపటి దినముననూ!
జరుగుగాక విబుధులు పండితులును సరగున వత్తురు గాత! మఱిన్! 25

ఇటుల నిశ్చయము జేసి రాముడును నచ్చట గూడిన జనుల మఱిన్
బంపివేసి, కుశలవుల దీసికొని పర్ణశాలకును బోయె మఱిన్!
ఆ సీతాదేవిని గూర్చియె మఱి యాలోచించుచు నుండగనూ!
ఆశర్వరి మఱి గడిచిపోయినది యల తెలిరేకలు వికసించెన్! 26

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
తొంబది యెనిమిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

తొంబది తొమ్మిదవ సర్గము

(సీతాదేవి రసాతలములో ప్రవేశించిన తరువాత, శ్రీరాముని జీవన విధానము, రామరాజ్యములోని పరిస్థితులు, రాముని తల్లులు స్వర్గస్థులగుట)

రాత్రి తెల్ల వారిన బిమ్మటనూ రాముడు మహామునులను మఱియున్,
పిలిపించియు నాసీనుల జేసియు ప్రీతిని పూజించియు వారిన్
అటుబిమ్మట పుత్రులకు దెలిపెనూ యలరుచు మీరే మాత్రమునూ,
సంకోచంబును లేకుండగ మఱి సరసతగానము జేయుడికన్! 1

మహాత్ములైనా యా మహాఋషులు నాశీనులునై యుండి మఱిన్
అటుబిమ్మట యా కుశీలవులునూ యల జరుగగ బోయెడి కథనూ!
దెలిపెడి యుత్తర రామాయణమును దీరుగ గానము జేసిరటన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

సత్యప్రభావము గల సీతయునూ సరసత రసాతలంబునకున్
ప్రవేశించినా తదుపరి యజ్ఞము దగు రీతియు పూర్తియుగాగన్
ఆ తరువాతను రామచంద్రుడును నల శోకా క్రాంతుండయ్యెన్!
సీత గనపడక బోవుట చేతను సిరులూరెడి యా జగంబునూ!
శూన్యముగా గనబడె నాతనికిని న్యూనత వతనికి గానబడెన్!
శోకము జేతను బరితపించుచును శూన్యత నొందుచు లోకమునన్!
శాంతి పొంద జాలక పోయెను మఱి కాంతి నందకనుబోయె మఱిన్! 3,4

తామర పూవుల రేకుల వంటీ తగ నేత్రంబులు గలిగిన యా
రాఘవుండునూ యథా రీతిగా దగ యాగంబును పూరణమున్
జేసికొనియు మఱి ఋక్ష వానరుల శ్రీకరముగ రాక్షసులను మఱిన్
బంపివేసి మఱి బ్రాహ్మణులకు వే బహు దానంబులు జేసి మఱిన్
వారిని గూడను బంపివేసియును వరుసగ యితర జనంబులనూ
పంపివేసి మఱి సీతను గూరిచి బహు విధముల యోజించుచునూ!
అయోధ్య పురిలో బ్రవేశించెనూ యల తన పుత్రుల గూడికొనీ! 5,6

రఘునందనుడగు రామచంద్రుడును దగ యజ్ఞంబును బూర్తిగనూ!
జేసికొనియు నిద్దరు పుత్రులతో శ్రీకరముగ మఱి యయోధ్యలో!

ప్రవేశించెనూ యా శ్రీరాముడు బన్నుగ సీతను దప్ప మఱిన్!
ఎవ్వరినీ తన సతి గాగను మఱి యింపుగ గైకొన లేదతడున్!
ప్రతి యజ్ఞము నందున గూడను మఱి పత్నీ కార్యము జేయుటకున్
బంగరు సీతయు నుండెను గద మఱి బన్నుగ కార్యములును జేయన్! 7,8

అటుబిమ్మట పదివేల వర్షములు బరగ యశ్వ మేధంబులునూ
వానికి బదిరెట్లుగ బంగారము వనరగ దక్షిణ లిచ్చుచునూ!
వాజిపేయ యాగములను జేసెను నొనరగ ధర్మ ప్రవృత్తులతో!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 9

శ్రీమంతుండగు రామచంద్రుడును శ్రీ యగ్ని ష్టోమంబు మఱిన్
అతి రాత్రంబును నధికమైన యా ధనముగలిగినా గోసవమున్!
అను యజ్ఞంబులు పూర్ణ దక్షిణలు నర్పించుచు రఘురాముడునూ
ఎన్నో యితరములగు యజ్ఞంబులు నింపుగ జేసెను ఘనముగనూ! 10

మహాత్ముడగు శ్రీరామచంద్రుడును మానుగ యీ విధముగను మఱిన్
రాజ్యపాలనము జేయుచు మఱియును రహి ధర్మము రక్షించుటకై
ప్రయత్నించుచుండగ బహు కాలము బన్నుగ గడిచెను ధర్మముగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 11

భల్లూకంబులు వానరంబులును బరగ రాక్షసులు గూడి మఱిన్
రాముని శాసనమందు నుండిరీ రమ్యముగా సభ్యత తోడన్!
సామంతులునగు రాజులు రోజును సరసత రామునకును వారున్,
ఆనందంబును గలిగించుచునూ నట నుండిరి వేడుక గాగన్! 12

సుభిక్షమును మఱి యుండునట్లుగా సురుచిరముగ యా మేఘములున్,
కాలమునందున వర్షించుచునూ కమ్మని గాలులు వీచె నటన్!
దిక్కులన్నియును నిర్మలంబుగా దీరుగ నుండెను కాంతులతో
నగరంబులు గ్రామంబులు గూడను నయముగ యానందము తోడన్!
పుష్టిగ నుండిన జనముల తోడను బొలుపుగ నిండీ యుండె నటన్! 13

రాముడు రాజ్యము బాలింపగనూ రహి యెవ్వరికిని గూడ మఱిన్
అకాల మరణము రాలేదూ మఱి యలరి వ్యాధులును నట లేవూ!
అనర్థములు మఱి గలుగగలేదూ! యంటు వ్యాధులును మఱి లేవూ!
పూర్ణాయుర్దాయము తోడను మఱి బొలుపుగ నుండిరి పుడమి జనుల్ 14

పుత్రపౌత్రులను గూడికొనిన యా బొలుపుగ యానందించుచు మన్నా
కీర్తిమంతురాలగు కౌసల్యయు నార్తి బావుచును బీదలకున్,
కౌసల్యయు మఱి చాలకాలమున కమ్మని స్వర్గము నందె మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

మహా యశస్సును గలిగినట్టి యా మానుగ సుమిత్ర కైకయునూ
అనేక విధముల ధర్మంబులనూ యలరు విత్త ధన ధాన్యములన్,
ధర్మంబులనూ జేసి మఱియునూ దగ కౌసల్య సుమార్గమునన్!
అనుసరించి బోయిరి వారలునూ, యలరి స్వర్గమును జేరి రటన్! 16

మహా భాగ్యవతులైన వారలును మానుగ ముప్పురు గూడ మఱిన్
స్వర్గమునందున దశరథేశ్వరుని సమక్షమందున నిలిచి మఱిన్!
సంతోషించుచు సకల ధర్మముల సాహచర్యమున లబించెడీ
సౌఖ్యంబుల్నూ యనుభవించిరీ సరసత పుణ్యఫలంబులనూ! 17

అరిందముండగు రామచంద్రుడునూ యా యా సమయము లందువనూ
తల్లులందఱికి తృప్తి గలుగుటకు దగ భేదంబును లేకుండన్!
తపోనిష్ఠులగు బ్రాహ్మణులకును మఱి దగ గో భూ దానంబు లనూ
జేయుచు నుండెను దృప్తిని జెందగ శ్రీకరముగ కోరినవన్నీ! 18

ధర్మాత్ముండగు రామచంద్రుడును దగ మాతా పితరులకునునై!
బ్రాహ్మణోత్తములకును బహు విధిగా బహు దానంబులు జేసె మఱిన్!
సంతృప్తిని నందగ విప్రులునూ సకల దానములు జేసె మఱిన్!
పూర్తిజేయుటకు కష్టమైన యా పొలుపుగ యజ్ఞంబులు జేసెన్! 19

ఈ విధముగ శ్రీరామచంద్రుడును నింపుగ యజ్ఞంబులు జేతన్
అనేక విధములునైన ధర్మములు నలరి వృద్ధి జేయచునుండెన్!
అనేక వేలావత్సరంబులును నలరుచు సుఖముగ గడిచినవీ!
ధర్మము నాలుగు పాదంబులనూ దగ నడిచెను లోకమునందున్! 20

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
తొంబది తొమ్మిది సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూఱవ సర్గము

(కేకయ దేశమునుండి కానుకలు దీసికొని గార్గ్యుడు వచ్చుట అతడు దీసికొని వచ్చిన సందేశమును అనుసరించి భరతుడు రాముని యాజ్ఞచేత ఇద్దఱు కుమారులతో కలిసి గాంధర్వ దేశమును నాక్రమించుటకు బోవుట)

అటు బిమ్మట మఱి కొంతకాలమును నటు జరిగిన తదుపరిని మఱిన్
కేకయ రాజగు యుధాజిత్తునూ కీర్తి యశస్సును గలిగిన యా!
రాముని యొద్దకు తన గురువును మఱి యాంగిరసుని పుత్రుండు మఱిన్,
మహాతేజమును గలవాడును మఱి మానుగ బ్రహ్మర్షి యగువాడున్!
అట్టి గార్గ్యునీ బంపె నయోధ్యకు నపూర్వమగు కానుకలిచ్చీ! 1

కేకయ రాజగు యుధాజిత్తునూ కీర్తి మంతుడగు రామునకున్
పదివేలగు నశ్వంబులు మఱియును బన్నుగ కంబలములను మఱిన్
రత్నంబులనూ రంగురంగులా రమ్య వస్త్రముల నంపె మఱిన్
అందమైన యాభరణంబులనూ యలరు సువర్ణ సుహారములున్! 2,3

బుద్ధిమంతుడగు కాకుత్స్థుండును పొలుపుగ శ్రీరాముడును మఱిన్
మహాఋషియునగు గార్గ్యుండును మఱి మానుగ వచ్చిన విషయంబున్!
మేనమామయగు నశ్వపతియునూ మితిమీరిన యా కానుకలన్!
వినియు రాముడును విస్మయమందుచు వినయవంతులగు దమ్ములతో,
క్రోసెడు దూరము నెదురగబోయెను కూరిమి వినయాంజలి తోడన్!
ఆగార్గ్యుని బూజించె రాముడను నల యింద్రుండు బృహస్పతినీ,
పూజించిన విధమున బూజించెను బొలుపుగ భక్తి ప్రపత్తులతో! 4,5

ఆ శ్రీరాముడు నా గార్గ్యుని మఱి యా విధముగ పూజించి మఱిన్
ఆ కానుకలను, నా ధనంబునూ, యలరి గైకొనుచు రాఘవుడున్
మేనమామ కుశలమును, గూర్చియును మేదుర భావమునను నడిగీ,
గూర్చుండిన యా మహామునిని దగ కూరిమి నిటులను బ్రశ్నించెన్! 6

మాదు మేనమామయును ప్రీతితో మానుగ బలికెను మీ తోడన్
ఏమి దెలుపమని మా తోడుతనూ యింపుగ దెలిపెను మీ తోడన్!

మాట నేర్పుగల వారి లోపలను మాననీయుడవు నీవు మతిన్
పూజ్యుండవు సాక్షాత్ బృహస్పతిగ బొలుపుగ నిచటికి వచ్చితివి? 7

ఆ గార్గ్యుండును రామచంద్రునీ నలభాషితమును వినియు మతిన్
అద్భుతమునూ నాశ్చర్యకరంబును నలరు కార్య విస్తారమునూ!
విప్పి జెప్పుటకు నుపక్రమించెను విశదముగా దాశరథికినీ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 8

మహా బాహువులు గలవాడా మఱి నరుల యందునను శ్రేష్ఠుడవున్!
నీదు మేనమామయును యుధాజితు నిర్మల ప్రీతిని బలికిన యా!
మాననీయముగ పలికిన పలుకులు మనసున కింపును గలిగినచో,
ఇష్టమైనచో వినుమా దెలిపెద నింపుగ బలికిన వచనములన్! 9

యా దేశమునకు దగ్గఱ యున్నది మహా ప్రకాశంబైనదియున్
సింధునదికి మఱి రెండు వైపులను సింధురమై గంధర్వులతో!
నున్న దేశ మది ఫలమూలములకును వన్నెలు గల పుష్పంబులకున్!
ప్రశస్తమైనది యా ప్రదేశమును బన్నుగ సుందరమైనదియున్! 10

ఆయుధములతో గూడిన వారును నలరు యుద్ధమున నేర్పరులున్!
మహాబలముగల వారును నైనా మానుగ యా శైలూషునియున్!
వంశంబునకును జెందినవారగు వనర మూడు కోట్లకు పైనీ!
గంధర్వులు నాదేశంబును మఱి చందముగా రక్షించుదురూ! 11

మహాబలముగల రఘురామా! విను! మానుగ యా గంధర్వులనూ
ఆ గంధర్వుల పురిని జయించీ యట్టి స్థానమున నీవు మతిన్!
నీకును సంబంధించినట్టి యా నిజ నగరములను రెండింటిన్!
నిర్మాణము గావింపుము వేగము నిఖిల సుఖములకు నిలయముగా! 12

ఆ దేశంబును పరమ శోభనము నతి సుందరమును నైనదియున్!
ఇతరులెవ్వరును బ్రవేశించి మఱి నింపుగ నుండగ జాలరుగా!
ఆ దేశము నీ కిష్టమగును మఱి నటు వసియింపగ గోరుదువూ!
నీకు నేను మఱి యహితము దెలుపను నీకు సర్వమును దెలియునుగా! 13

రామచంద్రుడును మేనమామలయు రమ్య వచనముల మునిద్వారా!
వినియు తప్పకను నటులే జేసెద! యనుచును, బలుకుచును గార్గ్యునితో!

భరతుని వైపున గాంచె రాఘవుడు కార్యభారమును వహియింపన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 14

రామచంద్రుడును సంతోషించియు రయమున యంజలి ఘటియించీ
గార్గ్యునితోడను నిటులను బలికెను కమ్మని వచనముల తోడన్!
బ్రహ్మర్షీ తక్షుడు పుష్కలుడును బన్నుగ భరతుని పుత్రులునూ!
వీరులైన యా కుమారులిద్దఱు విమలముగా దమ మామలచే!
రక్షింపగ బడుచును ధర్మంబున రహి సమాహితులునై వారున్,
ఆ దేశములో సంచరించుచును నలరుచు బాలింపగ గలరూ! 15,16

సైన్యముతో, ననుచరులతోడనూ, సరసత యాకైకేయి సుతున్
ఆ భరతుని మఱి ముందు నుంచుకొని యా గంధర్వ కుమారులనూ!
సంహరించి మఱి యాక్రమించుకొని సరసత పురులను రెండింటిన్
విభజించుకునీ పరిపాలించుచు విమలత వసించు చుండెదరూ! 17

అతి ధార్మికుడగు భరతు డంతటను నా పుర వరముల నిలిపి మఱిన్
పుత్రుల నిద్దఱ నిలిపి రాజ్యమున పొందుగ సహచరులను గూర్చి,
సుస్థిరమును నగు రాజ్యంబును మఱి సురుచిర పాలనమును నిలిపీ!
ఆ భరతుండును నాదరి జేరును నలరి యయోధ్యను బరికింపన్! 18

రామచంద్రుడును గార్గ్యునితోడను రమ్యముగా బలుకుచు నటులన్!
సైన్యముతో, యనుచరులతోడనూ దగ భరతుని యాదేశించీ,
అపుడు నా పురద్వయ రాజ్యములను నా కుమారు లిద్దఱికి మఱిన్!
అభిషేకంబును నలరి జేసె మఱి యఖిల జనులు గనుగొనగ మఱిన్! 19

ఆ భరతుండును యంగీరసునీ యలరు సుతుని గార్గ్యుని మఱియున్,
ముందు నుంచుకొని శుభ నక్షత్రంబును మోదముగా గాంచుచు మఱియున్
సైన్యముతోడను, సాయుధ బలమున దగ కుమారు లిద్దఱి తోడన్!
బయలుదేరెనూ భరతుండును మఱి బన్నుగ గజహయ బలములతో! 20

అటుబిమ్మట మఱి కొంత దూరమును నల రాఘవు జేతను మఱియున్,
అనుసరింపబడి యల దేవతలును నల యెదిరింపగ జాలని యా
సైన్యంబును మఱి యింద్రుని తోడను సరసత గూడిన సేనవలెన్
నగరమునుండీ బయలుదేరెనూ, నయముగ గంధర్వుల పైకిన్! 21

మాంసాశినములు నగు జంతువులును మహా రాక్షసులు గూడ మఱిన్
రక్తము ద్రావగ వలెనను కోరిక రయమునవారిని వేధింపన్!
కోరికతోడను బిరబిర బోయిరి కూరిమి భరతుని వెంట మఱిన్!
బిరబిర బోయిరి రాక్షసులును మఱి చరచర బోయిన వా మృగముల్! 22

మాంసంబును భుజియించునట్టి యా మానుగ క్రూరములైనట్టీ
వేలకొలది భూతంబుల గుంపును విలవిల బోయిరి వేగముగన్!
ఆ గంధర్వుల మలిన మాంసములు నల విడివడినా యెముకలనూ!
భరతుని వెంటను బయలుదేరెనూ భక్షించుటకై రణమందున్! 23

ఎన్నో వేలకు మించి సింహములు వ్యాఘ్రంబులును, వరాహములున్
ఆకాశమునందున విహరించెడి యలరు పక్షులును రాబందుల్!
భరతుని సేనకు ముందు బోయినవి భక్షింపగ మృత దేహములన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 24

మాసమునందున మాసార్థమునకు మఱి యెక్కువ గల కాలమునూ,
ప్రయాణంబు మఱి జేసి వారునూ బన్నుగ యుత్సాహము తోడన్!
పుష్టిగ నుండిన జనులతోడ మఱి పొలుపుగ నుండిన సేనయునూ
ఎట్టి రోగ బాధలు లేకుండగ గట్టిగ జేరెను కేకయకున్! 25

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నూఱవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట యొకటవ సర్గము

(భరతుడు గంధర్వులను సంహరించి, రెండు పురములను నెలకొల్పి వాటిని పుత్రులిద్దఱికీ యిచ్చి, మఱల యయోధ్యకు తిరిగి వచ్చుట)

కేకయ రాజగు యుధాజిత్తునూ గార్గ్యునితో గూడను మఱియున్,
సైన్య నాయకుండైన భరతుతో చయ్యన వచ్చిన యట్లుగనూ!
విని యాతడు బహు సంతస మందెను విమలానందము నందె మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

మహాతేజమును గలిగినట్టి యా మానుగ కేకయ రాజు మఱిన్,
మహా గొప్ప జన సముదాయముతో మఱి స్వేచ్ఛా రూపము గలుగూ
గంధర్వుల మీదికి రణమునకును చందముగా ఘనముగ యేగెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

భరతుండును మఱి యుధాజిత్తునూ బన్నుగ గలిసిన వారగుచున్
సేనా సహితులునై వారలునూ, స్థిరముగ నడిచెడి వారలునూ,
శీఘ్రమైన గమనంబుల జేతను శిలలను గూడిన దారులలో,
గంధర్వుల యా నగరము జేరిరి గజ హయ భటులను గూడికొనీ 3

మహా విక్రమముగల గంధర్వులు మానుగ భరతుడు వచ్చి నటుల్
విని వారందఱు గలిసిన వారై విపుల యుద్ధమును జేయుటకున్!
అన్ని వైపులను నొక్కసారిగా జెన్నుగ గర్జించిరి వారున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 4

అటు బిమ్మట తుములము, వ్యాకులమును చటులముగా రోమాంచమునూ
గలిగించెడి యా భీకరంబైన భయంకరంబగు యుద్ధంబున్!
సప్త రాత్రములు జరిగెను గానీ సరసత యెవరికి గాని మఱిన్
విజయంబును లభియింప లేదుగా వికటమైన యుద్ధమునందున్! 5

ఖడ్గంబుల, శక్తులు, ధనస్సులును, మొసళ్లు, రక్త ప్రవాహములున్,
నిండి మనుష్యుల మృతదేహంబులు దండిగ ప్రహించుచు రాగన్!

నదులన్నియునూ యన్ని దిక్కులను నయముగ ప్రారంభము నగుచున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 6

అటుబిమ్మట యా రాముని తమ్ముడు నలరుచు భరతుడు గోపించీ,
సంవర్తంబును సుదారుణంబగు సకల మారణంబగు దానిన్
ఆ గంధర్వుల పై ప్రయోగించెనూ అన్ని దిశలు ధ్వనములును గలుగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 7

మూడు కోటులగు నా గందర్వులు మోదముతో నా మహాత్ముడున్,
భరతుని జేతను కాలపాశమున బంధింపగబడు వారగుచున్!
సంవర్తముచే జీల్చబడుచు మఱి క్షణకాలము నుండిన వారున్!
జంపబడిరి వారందఱు గూడను స్వర్గమునకు బోయిరి వారున్! 8

భరతుని జేతను నొక్క నిమిషమున బన్నుగ యే యుద్ధంబు మఱిన్
జేయగ బడెనో జేసెనొ దానిని స్థిరముగ మఱి యొక యుద్ధంబున్,
సురలు గూడ స్మరియింపగలేదూ! సురుచిరముగ యే యుద్ధమునన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 9

ఆ గంధర్వుల సంహరించి మఱి యాకైకేయీ పుత్రుండున్,
ఆ భరతుండును సంపూర్ణములును సమృద్ధములునగు రెండింటిన్!
పురంబులను మఱి యట నిర్మించెను బొలుపుగ యట్టి ప్రదేశమునన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 10

ఆ గంధర్వుల దేశము నందున యల భరతుండును వేగముగన్,
తక్షశిలా యను పురమునందునను తక్షుని రాజునుగా జేసెన్!
ఆ గాంధార సుక్షేత్రమునందున యలరు పుష్కరీవత నగరిన్!
పుష్కలునీ మఱి రాజుగ జేసెను బొలుపుగ రాజులు మెచ్చుకొనన్! 11

ఆ పురంబులును రెండును గూడను నలరుచు ధన రత్నంబులతో
నిండియున్నవీ నిఖిల సంపదల మెండుగ ధన సంపదలు మఱిన్!
అడవులతోడను నుపశోభితంబై నలరుచు నుండును నెల్లపుడున్!
అనేక గుణముల చిత్రంబులతో నలరుచు నిర్మింపగ బడియెన్! 12

శ్రేష్ఠములగు నా రెండు పురములును శ్రీకరముగ నుండెను నచటన్!
పాప రహితమగు వర్తనంబులను బహు సుందరముగ నున్నవియున్!

ఉద్యానంబులతోను మఱియునూ యురుతర వాహనముల గూడీ,
వేఱువేఱుగా విశాలంబులగు విపిణ వీధులును గల వచటన్! 13

సుందరమగు నా పురశ్రేష్ఠంబులు నందమైనవియు రెండు మఱిన్!
అనేకంబులగు వస్తు సంపదల యలరి ప్రకాశించెను మఱియున్!
సురుచిరమగు గృహ ముఖ్యంబులతో శోభిత విమానముల తోడన్!
కూడియున్నవీ రెండు పురములును కూరిమి సంపదలను గూడీ! 14

అందమైన మఱి విశాలంబులగు చందము దేవాలయములతో
తాల తమాలా వృక్షంబులతో తిలక వకుల వృక్షంబులతో
ప్రకాశించుచున్నవి నగరంబులు బన్నుగ నదీ నదంబులతో!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

రాఘవానుజుడు మహా బాహువును రహి కైకేయీ కుమారుడున్,
అయిన భరతుడును నైదు వర్షములు అట్టి పురములను నిర్మించీ
తిరిగి యయోధ్యకు వచ్చెను నాతడు దీరుగ రాముని యొద్దకునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

శ్రీమంతుండగు భరతు డంతటను స్థిరముగ మఱియొక ధర్మములా
యున్నటువంటీ శ్రీరామునకును శచీపతియు వాణీపతికిన్!
నమస్కరించిన యట్లు నాతనికి నమస్కరించియు బిమ్మటనూ!
గంధర్వులవధ, పురనిర్మాణము, కమనీయంబగు కథను మఱిన్!
జరిగినదంతయు జరిగినట్లుగా దాశరధికి దెలిపెను నతడున్!
శ్రీరాముడు విని విషయము నంతను శ్రీకరముగ సంతస మందెన్! 17, 18

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నూట యొకటవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట రెండవ సర్గము

(రాముని యాజ్ఞ ననుసరించి భరత లక్ష్మణులు వారు కారుపథ ప్రదేశమునందు వేఱువేఱు రాజ్యములలో లక్ష్మణుని పుత్రులైన అంగద, చంద్రకేతువులను నియమించుట)

భరతుని మాటలు విని శ్రీరాముడు బన్నుగ సోదరులను గూడీ,
అత్యధికముగా సంతోషించెను నలరుచు ప్రాగ్దిశ నగినటులన్!
ఆ సమయంబున రామచంద్రుడును ,అలరుచు తమ్ములతోని మఱిన్,
ఆశ్చర్యమునగు వాక్యము బలికెను నలరుచు వారలతోని మఱిన్! 1

సౌమిత్రీ! నీ కుమారులైనా యంగదు చంద్ర సుకేతువునూ,
ధర్మము దెలిసిన వారు మఱియునూ ధార్మిక సిద్ధాంతంబులనూ
తెలిసిన వారలు రాజ్యనిమిత్తము ధీమతి గలిగిన వారు మఱిన్!
దృఢ పరాక్రమము గలిగిన వారలు దృఢ సంకల్పులు వారు మఱిన్! 2

వీరిద్దఱి రాజ్యాభిషక్తులను విమలముగా గావించెదరూ!
ధనుర్ధరులునగు వీరిద్దఱునూ ధర సుఖముగ నుండుటకు మఱిన్!
దగ సుందరమగు ప్రదేశంబునూ, దగ జన సమ్మర్దములేనీ,
దేశంబును మఱి యాలోచింపుడు దీరుగ జేయుడు నిర్ణయమున్! 3

సౌమ్యుడ! విను! కైకేయి నందనా! సరసత నాదు సువచనములన్,
ఇతర రాజులకు నే దేశంబున నింపుగ గలుగునొ బాధలునూ
ఆశ్రమంబులా వినాశనంబును నలరి జరుగునో దేశమునన్!
మన యపరాధము నట్టి దేశమున మానుగ యుండదొ యచ్చోటన్!
అట్టి దేశమును గనుమా భరతుడ! యా ప్రదేశమును దగినదియూ! 4

రాఘవుడటులను బలుకుచుండగా రమ్యముగా భరతుం డిటులన్!
బలుకగ సాగెను భవ్య రీతినీ భావయుక్తముగ నిజముగనూ,
ఇట్టి కారుపథ దేశంబును మఱి నిష్టము సుందరమైనదియున్!
రోగంబులు మఱి లేని దేశమది రోదనలును మఱి యుండవుగా! 5

అచట మహాత్ముడు నైనటువంటీ అంగదునకు మఱి రాజ్యంబున్
పురమును మఱి నిర్మింపబడును నిక పురంధరునికి వలె నిచట మఱిన్!

ఉద్యానంబులతోను మఱియునూ యురుతర వాహనముల గూడీ,
వేఱువేఱుగా విశాలంబులగు విపిణ వీధులును గల వచటన్! 13

సుందరమగు నా పురశ్రేష్ఠంబులు నందమైనవియు రెండు మఱిన్!
అనేకంబులగు వస్తు సంపదల యలరి ప్రకాశించెను మఱియున్!
సురుచిరమగు గృహ ముఖ్యంబులతో శోభిత విమానముల తోడన్!
కూడియున్నవీ రెండు పురములును కూరిమి సంపదలను గూడీ! 14

అందమైన మఱి విశాలంబులగు చందము దేవాలయములతో
తాల తమాలా వృక్షంబులతో తిలక వకుల వృక్షంబులతో
ప్రకాశించుచున్నవి నగరంబులు బన్నుగ నదీ నదంబులతో!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

రాఘవానుజాడు మహా బాహువును రహి కైకేయీ కుమారుడున్,
అయిన భరతుడును నైదు వర్షములు అట్టి పురములను నిర్మించీ
తిరిగి యయ్యోధకు వచ్చెను నాతడు దీరుగ రాముని యొద్దకునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

శ్రీమంతుండగు భరతు డంతటను స్థిరముగ మఱియొక ధర్మములా
యున్నటువంటీ శ్రీరామునకును శచీపతియు వాణీపతికిన్!
నమస్కరించిన యట్లు నాతనికి నమస్కరించియు బిమ్మటనూ!
గంధర్వులవధ, పురనిర్మాణము, కమనీయంబగు కథను మఱిన్!
జరిగినదంతయు జరిగినట్లుగా దాశరథికి దెలిపెను నతడున్!
శ్రీరాముడు విని విషయము నంతను శ్రీకరముగ సంతస మందెన్! 17, 18

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నూట యొకటవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట రెండవ సర్గము

(రాముని యాజ్ఞ ననుసరించి భరత లక్ష్మణులు వారు కారుపథ ప్రదేశమునందు వేఱువేఱు రాజ్యములలో లక్ష్మణుని పుత్రులైన అంగద, చంద్రకేతువులను నియమించుట)

భరతుని మాటలు విని శ్రీరాముడు బన్నుగ సోదరులను గూడీ,
అత్యధికముగా సంతోషించెను నలరుచు ప్రాగ్దిశ నగినటులన్!
ఆ సమయంబున రామచంద్రుడును అలరుచు తమ్ములతోని మఱిన్,
ఆశ్చర్యమునగు వాక్యము బలికెను నలరుచు వారలతోని మఱిన్! 1

సౌమిత్రీ! నీ కుమారులైనా యంగదు చంద్ర సుకేతువునూ,
ధర్మము దెలిసిన వారు మఱియునూ ధార్మిక సిద్ధాంతంబులనూ
తెలిసిన వారలు రాజ్యనిమిత్తము ధీమతి గలిగిన వారు మఱిన్!
దృఢ పరాక్రమము గలిగిన వారలు దృఢ సంకల్పులు వారు మఱిన్! 2

వీరిద్దఱ రాజ్యాభిషక్తులను విమలముగా గావించెదరూ!
ధనుర్ధరులునగు వీరిద్దఱునూ ధర సుఖముగ నుండుటకు మఱిన్!
దగ సుందరమగు ప్రదేశంబునూ, దగ జన సమ్మర్దములేనీ,
దేశంబును మఱి యాలోచింపుడు దీరుగ జేయుడు నిర్ణయమున్! 3

సౌమ్యుడ! విను! కైకేయి నందనా! సరసత నాదు సువచనములన్,
ఇతర రాజులకు నే దేశంబున నింపుగ గలుగునొ బాధలునూ
ఆశ్రమంబులా వినాశనంబును నలరి జరుగునో దేశమునన్!
మన యపరాధము నట్టి దేశమున మానుగ యుండదొ యచ్చోటన్!
అట్టి దేశమును గనుమా భరతుడ! యా ప్రదేశమును దగినదియూ! 4

రాఘవుడటులను బలుకుచుండగా రమ్యముగా భరతుం డిటులన్!
బలుకగ సాగెను భవ్య రీతినీ భావయుక్తముగ నిజముగనూ,
ఇట్టి కారుపథ దేశంబును మఱి నిష్టము సుందరమైనదియున్!
రోగంబులు మఱి లేని దేశమది రోదనలును మఱి యుండవుగా! 5

అచట మహాత్ముడు నైనటువంటీ అంగదునకు మఱి రాజ్యంబున్
పురమును మఱి నిర్మింపబడును నిక పురంధరునికి వలె నిచట మఱిన్!

చంద్రకేతునకు అందమైనదియు సాంద్ర రోగములు లేనిదియున్,
చంద్రకాంతపురమున నిర్మింపుము నింద్రుని పురముగ విలసిల్లన్! 6

భరతుని జేతను బలుకబడిన యా భవ్య వాక్యమును వినియు మఱిన్
శ్రీరాఘవుడును నంగీకారము స్థిరముగ ప్రకటించెను మఱియున్,
ఆ దేశంబును స్వాధీనంబును నలరి జేసికొని శీఘ్రముగన్
అంగదు కొఱకును నేర్పాటును మఱి యలరి జేసె శ్రీరాఘవుడున్! 7

అక్లిష్టకర్మణుడైన రాఘవుడు నంగదు కొఱకై వేగముగన్!
సుందరమును మఱి సురక్షితంబును సురుచిరమైనట్టిదియునూ!
అంగదీయ పురమును నిర్మించెను నంగదు కొఱకును నపుడు మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 8

మల్లుడైన యా చంద్రుని కొఱకై మానుగ యమరావతి వోలెన్
దివ్యమైన యా చంద్రకాంతయని దీప్తి జెందినా పురము మఱిన్!
మల్లభూమియందునస్థాపింపగ యల్లన సాగిరి శిల్పులునూ!
సకలములగు సౌకర్యములతో సరసత నిర్మించిరి యచటన్! 9

అపుడు యుద్ధమున జయింప శక్యము నలవిగాని శ్రీరాఘవుడున్,
లక్ష్మణుండు మఱి భరతుడు గూడను లాలితముగ హర్షించి మఱిన్!
వారిద్దఱికిని యభిషేకంబును వనరగ చేసిరి బహు ప్రీతిన్!
పరిపాలింపగ బంపి రచటికిని ప్రజలు సంత సిల్లగ నపుడున్! 10

రఘునందనుడుగు రామచంద్రుడును - రయమున కుమారు లిద్దఱికిన్
అభిషేకంబును జేసి యంగదుని నల పశ్చిమ ప్రాంతంబునకున్!
చంద్రకేతువును నుత్తర ప్రాంతము దగ బంపెను బరిపాలింపన్!
అల గాంధర్వము బరిపాలింపగ యలరి బోయిరా యిరువురునూ! 11

సుమిత్ర నంధనుడైన లక్ష్మణుడు సురుచిరముగ యంగదు వెంటన్,
అనుసరించి మఱి బయలుదేరెనూ, యాశ్చర్యము లేకింతయునూ
అల భరతుండును చంద్రకేతునీ యలరుచు సైన్యము వెంట మఱిన్!
రక్షించెడి వానిగ బోయెను మఱి రయమున వారలతో గూడన్! 12

లక్ష్మణుడైతే యంగదీయమున లాలితముగ నొక వర్షంబున్
అచట నుండియును నా కుమారుడును నలరుచు నెదిరింపగలేనీ,
శక్తిగలిగినా వాడగుచును మఱి స్థిరముగ నిలిచిన వాడగుచున్!
ఆ తరువాతను నా లక్ష్మణుడును అయోధ్య నగరికి యేతెంచెన్! 13

భరతుడు గూడను నా విధముగనే బన్నుగ వత్సరమున కంటెన్
కొంచె మధికముగ యచ్చట నుండీ యంచితముగ నా కుమారునీ,
పరిరక్షణమును జేయుచు నాతడు బరగ చంద్రకేతువును మఱిన్,
మఱల యయోధ్యకు తిరిగి వచ్చెనూ మానుగ రాముని సేవకునూ! 14

రామపాద సేవాతత్పరులగు రమ్య ధార్మికులు నగువారున్,
లక్ష్మణ భరతులు నిద్దఱు గూడను లాలితముగ సుస్నేహమునన్!
ఎంత కాలమును గడిచినదో మఱి యింతయు గుర్తింపగ లేదూ!
భ్రాతృప్రేమ యన యిటులుండగవలె బరగ యన్న దమ్ములకును మఱిన్! 15

ఈ విధముగ యా యన్న దమ్ములును నిరతము ధర్మ సుమార్గమునన్
ప్రయత్నించుచును నిత్యంబును మఱి పౌరుల కార్యము లందుననూ,
ప్రయత్నించెడీ వారలకప్పుడు బన్నుగ గడిచెను కాలంబున్,
పదివేలకు మించిన వర్షంబులు బరగ గడిచినవి వారలకున్! 16

ధర్మసాధనంబైన యయోధ్యను దగ వసించుచును వారలునూ
చాలకాలమును గడిపివారలును సంపూర్ణములగు మనసులతో
కూడిన లక్ష్మీ సంపన్నులునూ కూరిమి రాముడు లక్ష్మణుడున్!
భరతుండును మఱి ముప్వురు గూడను బరగ మహాయజ్ఞమునందున్,
చక్కగ యజ్ఞము జేయుచుండగా బిక్కటిలగ జ్వలియించెడి యా
మూడగ్నులకును వోలెను వారును ముదమున నందిరి ప్రకాశమున్! 17

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నూట రెండవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట మూడవ సర్గము

(రాముని యొద్దకు కాల పురుషుడుగ వచ్చుట ఒక సమయము (షరతు) పెట్టి
ఆ కాలపురుషుడు రామునితో మాటలాడుటకు ఉద్యమించుట)

రామచంద్రుడును ధర్మపరుండై దగయుండగ యా స్థితి యందున్,
అటుబిమ్మట మఱి కొంతకాలమున కాలపురుషుడును నట కొచ్చెన్!
తాపస రూపంబును ధరించి మఱి దగరాజ ద్వారంబునకున్
లక్ష్మణమూర్తిని గాంచి బలికె నటు లాలితముగ మృదు వచనములన్! 1

వచ్చినట్టి యా కాలపురుషుడును మచ్చికతో లక్ష్మణు తోడన్,
వ్యవహారిక భాషను మాటాడెను వనరగ శాంతముతో నిటులన్!
ద్వారమందు నెవరో నిలిచిరి యని దగ శ్రీరామునితోని మఱిన్,
ఎంతో ముఖ్యంబైన కార్యమున వింతగ వచ్చిన వాడనుచున్!
బలుకుననుచు మఱి విన్నవించెనూ బన్నుగ లక్ష్మణుతోని మఱిన్ 2

మహా బలము గలవాడా! వినుమా! మానుగ నాదు సువచనములన్!
అమిత తేజమును, నధిక బలంబును నల ప్రజాపతికి దూతను నే!
ఒక పనిమీదను నేను వచ్చితిని యొనరగ శ్రీరాముని తోడన్,
బలుకరించుటకు, భాషించుటకును బరగ వచ్చితిని నేను మఱిన్! 3

ఆతని యా వచనంబుల వినియును నా సౌమిత్రియు వేగముగన్
త్వరిత మానుడగుచును మఱి నాతడు దగ దూతను మఱి గుఱించియున్
ఆ శ్రీరామునకును మఱి దెలిపెను ఆ ముని వచ్చిన యటుల మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 4

మహాకాంతి గలవాడా! రామా మానుగ విను! నా వచనములన్!
రాజ ధర్మమున నుభయ లోకములు రహి గెలిచినవాడా లెమ్మా!
తపస్సు చేతను సూర్యుని వంటి దగ ద్యుతి గలిగిన దూత నినున్!
చూచుటకును మఱి భాషించుటకును సురుచిరముగ వచ్చెను నేడున్! 5

లక్ష్మణోక్తమగు నా మాటలు విని లాలితముగ శ్రీ రాఘవుడున్!
వినయముగా మధురముగా బలికెను వేగముగను మధురోక్తులనూ!

నాయన! లక్ష్మణ! ముందుగ నాతని నయముగ సత్కృతులను జేసీ
ఆ మహామునిని లోపలికిని మఱి యలరి గొని రమ్ము! వేగముగన్! 6

ఆ లక్ష్మణుడును 'అట్లే జేసెద!' యనుచు బలికె తేజస్సులతో
మండుచు నున్నాడా యనునట్లును దండిగ కిరణంబుల చేతన్!
కాల్చుచున్న వాడా యనునట్లును కఠిన కాల పురుషుని మఱియున్,
ముని రూపంబున యున్న యాతనిని మోదమునను లోనికి జేర్చెన్! 7

ఆ ఋషియును మఱి స్వతేజస్సుతో నలరు ప్రకాశించెడి వానిన్
ఆ శ్రీరాముని సమీపించి మఱి యలరు మధుర వచనంబులతో
'వృద్ధి పొందు' మని యభినందించెను సిద్ధిని గోరుచు నాతనికిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 8

మహాతేజమును గల శ్రీరాముడు మానుగ యా మౌనిని మఱియున్,
అర్ఘ్య పాద్యములతో పూజించెను నలరుచు వినయముతోని మఱిన్!
అటుబిమ్మట శ్రీరామచంద్రుడును నలరి సావధానము తోడన్,
కుశల ప్రశ్నలను వేయుటకును మఱి కూరిమితో ప్రారంభించెన్! 9

రామచంద్రుడును కుశల ప్రశ్నలను రమణీయముగా బ్రశ్నింపన్,
మాటలాడు వారలలో శ్రేష్ఠుడు మహా యశస్సును గలవాడున్,
అయినటువంటీ యా మహా మునియు నలరెడి కాంచన దివ్యమునా!
ఆసనంబు పై గూర్చుండెను మఱి యలరు రామునికి సమీపమున్! 10

అటుబిమ్మట శ్రీ రామచంద్రుడును నా మహామునిని గూర్చి యిటుల్,
మృదు మధురముగా వినయ వాక్యములు యాదరమున నీ విధి బలికెన్!
మహామునీ! మఱి నీకు స్వాగతము! మాననీయ! యిదె స్వాగతమూ!
ఎవరి నుండి దూతగ వచ్చితివీ? యింపుగ దెలుపుము విషయంబున్! 11

రాజసింహుడగు రఘురాముండును రమ్యముగా ప్రేరేపింపన్,
ఆ ముని బలికెను రఘురామునితో రహస్యముగ బహు నెమ్మదిగన్!
నీవు హితంబును గోరినచో నది నిర్మల భావ రహస్యంబున్
ఇద్దఱు మాత్రము నున్నపుడే మఱి నింపుగ దెలుపగ వలయు సుమా! 12

మునులలోపలను ముఖ్యుడైన యా మోదమునను ముని వచనములన్
నీవును మది మన్నించినచో నది నిజముగ యే మానవుడు వినున్!

మాటలాడుకొనుచున్న మనలనూ మఱి గాంచునో గుప్తముగాగన్!
నీవు జంపగా వలయును నతనిని నిక్కముగా వధియింపవలెన్! 13

రామచంద్రుడును నట్లే యనుచును రయమున ప్రతిజ్ఞ జేసి మఱిన్
సుమిత్రనందనుడైన లక్ష్మణుని జూచి బలికె నీ విధముననూ!
మహా బాహు! ఓ లక్ష్మణ వినుమా! మానుగ ద్వారము నందుననూ
నిలిచి యుండుమా! ద్వారపాలకుని దూరము బంపుము నెటకైనా
నీవు గూడ మఱి యా వచనములను నిలిచి వినగ రా దిటు పైనన్! 14

సుమిత్రనందన! లక్ష్మణ వినుమా! సురుచిరముగ నా వచనములన్
నేను మఱియు నీ ఋషిని గూడికొని నిర్జనమందు రహస్యమునన్!
మాటలాడుకొనుచుండగ నెవ్వడు మానుగ జూచునో కనుగొనునో!
అతనిని నేనును జంపివేయవలె యది ఋషి వాక్యము సౌమిత్రీ! 15

అటు బిమ్మట యా కాకుత్స్థుండగు నల శ్రీరాముడు లక్ష్మణునీ
ద్వారమునందున నిలిపి యాతనిని దగ రహస్యమున మునితోడన్!
ఈ విధముగనూ బలికె లక్ష్మణుడు నింపుగ వినయముతోని మఱిన్!
'మునివర్యా' ఆ రహస్య వాక్యము మోదముననను దెలుపుము వేగన్! 16

దేనివలన/యిట కేతెంచితివో/దీరుగ నీ కిష్టంబైనా
ఆ వాక్యంబును శంకలేక మఱి యలరి దెలుపుమా నాతోడన్!
నా మనస్సునను గూడ వినగనూ నయముగ నున్నది మహామునీ!
నేను గూడ మఱి యీ విషయమునే నిజముగ యోచించుచు నుంటిన్! 17

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నూట మూడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట నాల్గువ సర్గము

(కాల పురుషుడు రామునకు బ్రహ్మదేవుని సందేశమును దెలుపుట? రాముడు అంగీకరించుట)

మహాసత్త్వ! ఓ రాజా! వినుమా! మానుగ నాదు సువచనములన్,
నే నెందుల కిట వచ్చితినో మఱి నెమ్మది వినుమా! నీవు మఱిన్,
మహాబలముగలవాడా రామా! మానుగ రహస్యమును వినుమా!
ప్రజాపతియునగు బ్రహ్మదేవుడును బరగ బంపె నీ వద్దకునూ! 1

పర పురంజయా! మహావీరుడా! బరగ నేను పూర్వమునందున్,
హిరణ్య గర్భోత్పత్తి సమయమున మాయా సంభావిత మగుచున్!
సంకల్పముచే జనింపబడినా సరసత నే నీ పుత్రుడనూ!
సకల సంహార కర్తయైన యా కాలంబును నీ పుత్రుడనూ! 2

లోకంబులకును నధిపతియును మఱి లోలత సర్వ సమర్థుండున్
భగవంతుండగు బ్రహ్మ దేవుడును బన్నుగ యిట్లను చుండె మఱిన్
సౌమ్యా! లోకంబుల రక్షింపను సరసత నొక నిశ్చయము మఱిన్,
అంగీకారము జేసి యుంటివీ యందటికిని దెలియును నిదియున్! 3

పూర్వంబున మాయా బలంబుచే బొలువుగ లోకము లన్నిటినీ,
స్వయముగనే యదృశ్యము జేసీ, స్వయముగ మహా సముద్రమునన్
శయనించియు యుండియు నీవును మఱి సరసత ముందుగ నన్ను మఱిన్
సృజనంబును జేసితివి బిమ్మటను సకలము సృజియించితివి మఱిన్! 4

అటు బిమ్మట మాయా బలంబుచే నలరు పెద్ద బడగలు గలుగూ,
యుదక నివాసియునైన శేషునీ యురుతరముగ సృజియించి మఱిన్
మధు కైటభులను గొప్ప ప్రాణులను మానుగ రెండింటి మఱిన్,
సృజియించితివీ, వారి యెముకలను సరసత వ్యాప్తంబై ధరణీ
పర్వతములతో నిండిపోయినది బన్నుగ యిరుకై పోయి మఱిన్! 5,6

నీదు నాభి యందున సూర్యునితో నిల సమానమై దివ్యంబున్,
పద్మమునందున నన్ను సృజించీ ప్రజాపతిత్వము నాకు మఱిన్,

పూర్ణముగా నా కప్పగించితివి! పృథివిలోని జీవులను మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 7

ప్రజాపతిత్వ సుభారమంతయును బన్నుగ నా పై మోపితివీ!
జగత్పతివి! నిన్నుపాసించితిని! సకలము నీవే యనిదలచీ!
నాకు దేజసును నిచ్చినవాడవు! నయముగ నీవేయని మదిలో
సర్వభూతముల రక్షింపవె యని సరసత నిను ప్రార్థించితినీ! 8

అటుబిమ్మటనూ నీవు ప్రాణులను నలరుచు రక్షించుట కొఱకై
యెదిరింపగ శక్యంబునుగానీ కదిరి సనాతనమైనదియున్!
అల హిరణ్య గర్భ స్థితినుండీ యల విష్ణు స్థితి నొందితినీ!
సజ్జనులను రక్షించుచుందువూ దుర్జనులను శిక్షించెదవూ! 9

అదితియందు బహు విక్రమశాలిగ బరగ పుత్రునిగ జన్మించీ
ఉపేంద్రుడను నామమున జనించీ యురుతర కార్యములను జేసీ
సురల విక్రమము వృద్ధిజేయుచును సురుచిర కార్యములును దగులన్,
అల దేవతలకు సహాయమును మఱి యలరి జేసెదవు నిశ్చలతన్! 10

జగత్తునందున శ్రేష్ఠుండవు మఱి సరసత నీవును నట్టి యెడన్
ప్రజలందఱునూ రావణుజేతను బన్నుగ హింసలు బడుచుండన్,
ఆ రావణునీ సంహరించుటకు నలరుచు మానవ జన్మంబున్
నెత్తుటకును మఱి సంకల్పించీ చిత్తము బులకింపగ నీవున్! 11

పదునొకండు వేల్ వర్షంబులు భువి బన్నుగ నుండగ దలచి మఱిన్,
స్వయముగనే నియమంబు నేర్పఱచి స్వయముగ నివసించితివి భువిన్!
మానవుండుగా జన్మించితివీ మహి దేవునిగా నీవు మఱిన్
రాక్షసులను బరిమార్చితివీ మఱి రమ్య సంస్కృతిని నిలిపితివీ! 12

సంకల్పముచే దశరథ సుతుగా జన్మించిన నీకును మఱియున్
మనుష్యులందున పూర్ణాయువునూ మానుగ పరిపూర్తిగ నయ్యేన్!
అందువలన నరులందున శ్రేష్ఠుడ! యా కారణమున యిక నీవున్!
మా దగ్గఱకును బయన మగుటకును మానుగ సమయము వచ్చినదీ! 13

మహారాజ! యింకను నీ ప్రజలను నింపుగ రక్షింపగ నీకున్
కోర్కెయున్నచో నిచటనె యుండుము! కూరిమి క్షేమంబగు గాతన్!

అనుచును బలికెను ప్రజాపతియునూ యలరుచు నాతో బలికె మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 14

రఘురామా! యటులనుగాకను మఱి యల సురలోకము బాలింపన్
అభిలాషయు మది యున్నట్లయితే యలరుచు దేవతలను మఱియున్,
విష్ణువైన నీ సంరక్షణమును నింపుగ పొందిన వా రగుచున్
నిర్భయంబుగా నుందురు గాతను! నిశ్చింతను సురలోకమునన్! 15

కాల పురుషు జేతను బలుకగ బడి కమల గర్భుడగు బ్రహ్మయునూ
పంపినట్టి యా సందేశము విని బన్నుగ శ్రీ రాఘవుడు మఱిన్!
పకపక నవ్వుచు సకలంబును మఱి సంహరించు కాలుని గూర్చి!
వాక్యంబును మఱి బలుకుచు రాముడు వనరగ యీ విధమున నతడున్! 16

పరమాశ్చర్యము బరమాద్భుతమునూ బరగ ప్రజాపతి పలుకులకున్
విని సంతోషంబు బొందితిని! విమలానందము గలిగినదీ!
నీదు రాకవలనను గూడను మఱి నిర్మల భావన గలిగినదీ!
మనో నిశ్చయము గలిగించుటకును మానుగ యవకాశము గలిగెన్! 17

నేను పుట్టినది మూడు లోకముల నిర్మల కార్య సుసాధనకే
నీకు మంగళం బగును గాత! మఱి నీకు శుభంబును నగు గాతన్!
ఎచ్చటి నుండీ నే వచ్చితినో యచ్చటికే నే బోయెదనూ!
లోకంబునకును మంగళంబు మఱి లోక శాంతియును నగుగాతన్! 18

కాల పురుషుడా! నేను నిన్ను మఱి కలవరపడుచును నుండగనే
నీవు వచ్చితివి! యాకస్మికముగ నిర్మలమగు నీ విషయమునన్
మఱియొక యోచన లేదు! లేదు! నూ! మానుగ బ్రహ్మయు దెలిపినటుల్
అన్ని పనుల యందును నేనును మఱి యలరి సురలతో నుండవలెన్! 19

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నూట నాల్గవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట యైదవ సర్గము

(దుర్వాసుడు శపించుననే భయముచేత లక్ష్మణుడు నియమ భంగమైనను
లెక్క జేయక రాముని దగ్గఱకు వచ్చి అతనిరాకను గూర్చి తెలుపుట, రాముడు
దుర్వాసునకు భోజనము పెట్టుట, అతడు వెళ్లిపోయిన తరువాత
రామునకు లక్ష్మణుని విషయమున చింత గలుగుట)

ఆ శ్రీరాముడు కాలపురుషుడును నా విధముగ సంభాషణమూ
జేయుచుండగా నా సమయంబున శ్రీకరముగ దుర్వాసుడునూ
రాముని దర్శనమును గోరుచునూ రాజద్వారమునకును వచ్చెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

మునిసత్తముడగు నా మహామునియు మోదముగా లక్ష్మణుని మఱిన్
సమీపించి నీ విధముగ బలికెను చయ్యన ముందుకు పోయినటుల్!
నాకును శ్రీరాముని వేగముగను నయముగ జూపింపుము మఱియున్,
అటులగానిచో నా కార్యంబును నలరి మించి పోవును సుమ్మా! 2

శత్రువీర సంహారకుడైనా సరసత లక్ష్మణుడును మఱియున్
ముని భాషితములను వినియును మఱియును విన్నపమును నాలించి మఱిన్!
మహాత్ముడగు నా దుర్వాసునికిని మానుగ నమస్కృతులను జేసీ
ఈ విధముగ బలికెను లక్ష్మణుడును నింపుగ వినయముతోని మఱిన్! 3

భగవంతుడ! ఓ పూజ్యుడ! వినుమా! బన్నుగ కార్యంబేమి మఱిన్?
ఏ ప్రయోజనము కొఱకు వచ్చితివి? ఏమి జేయుదును నే నిపుడున్
బ్రాహ్మణుడా! యా రామచంద్రుడును బని తొందరలో నున్నాడూ!
ఒక్క ముహూర్తము నిరీక్షింపుమా! చక్కని రాముడు గనబడునూ! 4

ముని శార్దూలుండగు శ్రీరాముడు ముసిరిన కోపము తోని మఱిన్
తద్వాక్యము విని కలుషీకృతుడై దగ నేత్రంబుల జేత మఱిన్,
కాల్చి వేయుచున్నాడా యన్నటు దగ సౌమిత్రిని గాంచుచునూ!
కోపము తోడను బలికె నిటులను క్రోధపు పొగలును వ్యాపింపన్! 5

సౌమిత్రీ! ననుగూర్చి రామునకు సరసత యీ క్షణ మందుననే
తెలుపగవలయును నటులకానిచో యీ దేశంబును మఱి నిన్నున్!
రాముని భరతుని గూడ శపింతును రమ్యమైన యీ పురంబునూ,
మీ సంతానమును శపింతును మ్రింగజాలనీ కోపమునన్!
నా కోపంబును నాదు మనస్సును నలిపి యుంప జాలను నేనున్!
ఈ విషయము మీ కందఱికిని మఱి నింపుగ దెలియును నయోధ్యకున్! 6,7

మహాత్ముడైనా దుర్వాసుని యీ మహాభయంకరంబైనట్టి
ఆ వాక్యము విని లక్ష్మణుండునూ యలరుచు మనసున యోజించెన్,
ఆ వాక్యము విషయంబున తానును నలరి జేయవలసిన యట్టి
నిర్ణయమును మఱి యాలోచించెను నిండు మనసుతో లక్ష్మణుడున్! 8

ఒక్కనికే నాకును మరణంబును బిక్కటిలగ వచ్చును గాతన్!
అందఱికిని మఱి వినాశనంబును నలరి జరుగకుండును గాతన్!
అనుచు మనస్సున నిశ్చయించుకొని యీ లక్ష్మణుడును రామునికిన్,
ఆ దుర్వాసుని గూర్చి తెలిపెనూ యతనికోపమును గూర్చి మఱీన్! 9

రాజయినట్టే రామచంద్రుడును! రహి లక్ష్మణునీ మాటవినీ
కాలపురుషునీ పంపి వేసి మఱి కడు వేగము తొందర బడుచున్
వెలుపలకును మఱి వచ్చి రాఘవుడు విలక్షణుండగు దుర్వాసున్
కనులగాంచి మిక్కిలి భయబడుచును కమనీయంబగు నంజలితో! 10

రామచంద్రుడును నల తేజసులను రహి మండుచు నున్నట్లుగనూ
అటుల నున్న యీ మునీశ్వరునికిని యంజలి ఘటించి వినయమునన్
ఏమి చేయవలెనని ప్రశ్నించెను నింపుగ యీ మునితోని మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 11

సర్వసమర్థుడు మునిశ్రేష్ఠుండును సరసత దుర్వాసుండు మఱిన్
రామునిచేతను బలుకబడిన యీ రమ్య వచనములు వినియు మఱిన్,
ఈ విధముగ రామునితో బలికెను నింపుగ మధురాక్షరములతో,
ధర్మ వత్సలా! వినుమా! దెలిపెద! దగ నాదు స్వవచనంబులనూ! 12

రామా! నేనును ననిశన ప్రతమును నలరుచు ప్రారంభించి మఱిన్,
వేయి వత్సరంబులు నీ నాటికి విమల సమాప్తిని బొందె మఱిన్!

అట్టి నేను నీవిచ్చిన విందును నెట్లు సిద్ధముగ యుండె మఱిన్
అటులే నేనును జేయవలయునని నలరి గోరుచును నుంటి మఱిన్! 13

రాజగు రాముడు తద్వచనము విని రమ్యప్రీతి మానసు డగుచున్,
ముని ముఖ్యుండగు దుర్వాసునకును యధా సిద్ధముగ నున్నటులన్
భోజనంబు మఱి సమర్పించెనూ భూరి తృప్తియును గలుగు నటుల్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 14

ఆ ముని శ్రేష్ఠుడు అమృతము వంటీ యలరు భోజనము భుజించియున్,
'రామా! చాలా బాగున్నది! యని యలరి బలికి రామునితోడన్!
తన యాశ్రమమును తరలిపోయెనూ దగ సంతృప్తిని దెలుపుచునూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

దుర్వాసుడు తన యాశ్రమంబునకు దూలుచు బోయిన పిమ్మటనూ!
రామచంద్రుడును కాలపురుషునీ రమ్యమైన వచనమును వినీ
దుఃఖాక్రాంతుండాయె మనసులో దూరాలోచన జేసి మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

ఘోర దర్శనముగల యా వాక్యము స్మరించి దుఃఖము జేత మఱిన్,
బహు తపింప జేయగ బడుచును మఱి బరగ యవాఙ్ముఖు డగుచు మఱిన్
దీనమైన మనసును గలవాడగుచును ధీరత గోల్పోయెను మదిలో!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 17

మహా యశస్సును గల రాఘవుడును మానుగ కాల సుపురుషుండున్!
దెలిపిన వచనములను స్మరించుచును తేటతెల్లముగ మనసుననూ!
ఇక యేమైనను సోదరాదులను నింపుగ పరివారంబు మఱిన్!
నశింపవలసినదే యని మనసున నయముగ భావన జేసి మఱిన్!
మౌనముగా నుండెను రాఘవుడును మాటలేక నోటను మఱియున్! 18

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నూట యైదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట యాఱవ సర్గము

(రాముని చే విడువబడిన లక్ష్మణుడు శరీరముతో స్వర్గమునకు బోవుట)

తలక్రిందికి మఱి వంచి దీనుడై దగ రాహువు గ్రస్తుండైనా
చంద్రునివలె మఱి యున్న రామునీ సాంద్రముగా జూచియు మఱియున్,
సౌమిత్రియు సంతోష పూర్వకము సరసత మధురము నైనట్టి
వాక్యంబును మఱి పలికె నాతడును వనరగ మధురాక్షరములతో! 1

మహా బాహు! విను! మదర్థమునమా సంతాపంబును జెందుకుమా!
పూర్వమందునను జేయబడిన యా పొలుపుగ నిర్మాణము చేతన్!
కాలగతియు నీ విధముగ నుండును గతి దప్పింపగ లేరు గదా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

సౌమ్యుడ రామా! నా మాటలు విను! సరసత నిస్సంశయముగనూ!
నన్ను వధింపుము! నీ ప్రతిజ్ఞనూ నయముగ పాలింపుము రామా!
హీన ప్రతినగల మానవులును మఱి మానంబును బోగొట్టుకొనీ
నరకమునకును ప్రయాణమగుదురు నయముగ నిర్వక్రమముగనూ! 3

లక్ష్మణు చేతను నటుల పలుకబడి లాలితముగ శ్రీరాఘవుడున్,
ప్రచలితేంద్రియుండై యాతండును బన్నుగ మంత్రుల, సహచరులన్,
పురోహితులనూ రప్పించెను మఱి పొలుపుగ వారల మధ్యమునన్
దుర్వాసుని యాగమనంబును మఱి దోరముగా ముని ప్రతిజ్ఞనూ!
జరిగిన విషయంబంతయు దెలిపెను సంగతి సందర్భముల మఱిన్! 4

దానిని విని యా మంత్రులందఱును దగ యుపాధ్యాయులను గూడీ,
అందఱు గూడను మౌన ధారణము చందముగా ధరియించి మఱిన్,
ఆసనంబులను నట గూర్చుండిరి యలరుచు మాటలు లేకుండన్!
మహాతేజమును గలుగ వసిష్ఠుడు మౌనధారణను వీడి మఱిన్
ఏతద్వాక్యంబును బలికెను మఱి విమలాక్షరములతోని మఱిన్! 5

మహా బాహువులు గలవాడా! మఱి మహా యశస్సును గల్గవాడా!
రాబోయెడి యా భయంకరంబగు రభసను గూర్చియు లక్ష్మణుతో!

నీకు గలిగెడీ వియోగంబునూ నిర్మలముగ దెలియును నాకున్!
దివ్యచక్షువుల జూడగ బడినది దీరుగ నంతయు ముందుగనే! 6

మహా బాహువులు గలవాడా! మఱి మహా యశస్సును గలవాడా!
రాబోయెడి యా భయంకరంబగు రభసను గూర్చియు లక్ష్మణుతో!
నీకు గలిగెడీ వియోగంబునూ నిర్మలముగ దెలియును నాకున్!
దివ్యచక్షువుల జూడగ బడినది దీరుగ నంతయు ముందుగనే 7

ఈ లక్ష్మణునీ విడిచి వేయుమా! యింపుగ కాలము జూడగనూ!
బహు బలవత్తరమైనది సుమ్మా! ప్రతిజ్ఞ వ్యర్థము జేయకుమా!
ప్రతిజ్ఞ భంగము నయినట్లయితే బన్నుగ ధర్మము నశియించున్!
విషయములన్నియు దెలియును నీకును వేఱుగ దెలుపగ నేల మఱిన్? 8

ధర్మము వినష్టమైన బిమ్మటను దగ నటుబిమ్మట జరుగు నిదీ,
సచరాచరముల గూడినట్టి యా సదేవ ఋషుల గణంబులతో!
మూడు లోకముల సముదాయంబును మురిపెముగా నశియించు మఱిన్
సంశయంబు మఱి లేదుగదా మఱి సందేహంబును లేదు నిలన్! 9

పురుష శ్రేష్ఠుడ! అట్టి నీవు మఱి యా లక్ష్మణు విడుచుట ద్వారా
ముల్లోకంబుల పాలనంబునూ మురిపెముగా జేయుదు వీవున్!
సర్వజగంబును స్వస్థతనుండును సరసత ముల్లోకంబులునూ!
ప్రతిజ్ఞ భంగము చేయరాదు సుమ! పన్నుగ సర్వము ధ్వంసమగున్! 10

సభలో గలిగిన వారందఱునూ సరసత ధర్మార్థంబులకున్
సమ్మతమైనా పలికిన వాక్యము సహజముగా విని రాఘవుడున్!
పరిషత్ మధ్యను లక్ష్మణు తోడును బలికె నిటుల వైరాగ్యముగన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 11

సౌమ్యుడ లక్ష్మణ! విను నా వాక్యము సహజముగా ధర్మంబునకున్
వైపరీత్యమును గాకుండుటకై వదిలి వేయుచుంటిని నిన్నున్!
సత్పురుషులకు లోకమునందున సరసత త్యాగము విధించినా
వధను విధించిన రెండును సమమే వదిలివేయు చుంటిని నిన్నున్! 12

రాముని చేతను నా వాక్యంబును రహి బలుకగ బడు చుండగనూ
లక్ష్మణు డంతట భాష్ప వ్యాకులిత యింద్రియంబులను గలవాడై!
తొందర బడుచును వెడలిన వాడై దోరముగా సరయూ నదికిన్!
భార్యా పిల్లల దర్శింపకనూ తగ దర్శింపక తన గృహమున్! 13

ఆ లక్ష్మణుడును సరయూ నదికిని అలరి బోయి యాచమనమునూ
జేసి యంజలిని ఘటించి మఱియు సుస్థిరముగ నమస్కృతి జేసీ,
శరీర ద్వారములన్నింటికి మఱి సరసత నిగ్రహమును జేసీ,
యూపిరి బయటకు విడుకుండనూ యురుతర యోగమునను నుండెన్! 14

ఉచ్ఛ్వాసము నిశ్వాసము లేకను నురుతర మగు యోగము నందున్
సమాధిలో నున్నట్టి యతనిపై యింద్రుడు, చంద్రుడు, దేవతలున్
అప్సర స్త్రీలును ఋషులు మునులు మఱి యలరు సకల మునులును గూడన్
పూవులు జల్లిరి పుష్ప వర్షముగ పున్నమి వెన్నెల రేకలుగా! 15

ఆ దేవేంద్రుడు మనుజుల కెవరికి యలరుచు కనబడ కుండగనూ!
మహాబలముగల యా లక్ష్మణునీ మానుగ సశరీరము తోడన్
కొనిపోయెను తన యైరావతమున కూరిమి స్వర్గమునందుంచెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

అటుబిమ్మట మఱి సమస్తమైనా నలరుచు సురసత్తములు మఱిన్
విష్ణువు యొక్కయు నాల్గవ భాగము విమలముగా వచ్చిన రీతిన్
జూచి మిగుల సంతోషించిరిగా సురుచిరముగ మందారములన్
ఆ లక్ష్మణునీ పూజించిరి మఱి యలరుచు సుగంధ పుష్పములన్! 17

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నూట యాఱవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట యేడవ సర్గము

(వసిష్ఠుని యాజ్ఞప్రకారము పౌరులందఱినీ తనతో పరమ ధామమునకు తీసుకొనివెళ్ల వలెనని రాముడు ఆలోచించుట-కుశలవులను రాజ్యము నందు నభిషిక్తులను జేయుట)

రామచంద్రుడును నా లక్ష్మణునీ రయముగ విడిచియు శోకముతో
బాధబడుచునూ పురోహితులతో బన్నుగ మంత్రులతోని మఱిన్!
సంఘ ముఖ్యులను గూర్చి మఱియునూ సరసత బలికెను నీ విధమున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

ధర్మవత్సలుడు వీరుడైన యా దగభరతుని రాజ్యము నందున్
అయోధ్యాధిపతిగా యీనాడే యభిషేకంబును జేసెదనూ!
అటుబిమ్మట నేనును వనమునకును నలరి బోయెదను, దపమునకున్!
ఫలమూలంబుల దినుచు వనంబున బరగ గడిపెదను జీవితమున్! 2

కావలసిన సామాగ్రి నంతయును కమనీయముగా తే తెండీ!
ఆలస్యంబును గాకూడదు మఱి యలరి తెండి సంభారములన్!
నేడే నేనును గూడ లక్ష్మణుడు నిశ్చితముగ పొందిన గతినీ
అట్టి సుగతినీ నేను పొందెదను నాలస్యము లేకుండగనూ! 3

ఆ రామునిచే బలుకబడిన యా యలరు వాక్యముల వినియు మఱిన్
సమస్తమైనా యమాత్యాదులును సరసత శరములతో భూమిన్!
వంగిన వారై చైతన్యంబును రంగుగ వదిలిన వారగుచున్
నేలమీద బడిపోయిరి వారలు తాళలేక క్షణమును వారున్! 4

శ్రీరాముని యా భాషితమును విని చిత్తము సంక్షోభము నందన్
ఆ భరతుండును స్పృహ గోల్పోయెను నలరుచు నిశ్చేష్టితు డయ్యెన్!
రాజ్యంబును మఱి సమస్త సుఖముల రహినిందించుచు భరతుండున్!
ఈ విధముగ బలికెను రామునితో నింపుగ తన యింగితము మఱిన్! 5

రఘునందన! శ్రీరామా వినుమా! రయమున నాదు సువచనములన్
నీవు లేనిచో నేను రాజ్యమును నిజముగ వాంఛింపను భువిలో!

సత్యము మీదను స్వర్గసుఖాలను సరసత ప్రతిజ్ఞ జేసి మఱిన్!
తెలియజేయుచున్నాను రాఘవా! దీరుగ నా యభిలాష మఱిన్! 6

నరాధిపా! ఓ రాజా వినుమా! నయముగ వీరుండగు కుశునీ
దక్షిణ కోసల దేశమునందున దగ యభిషేకంబును జేసీ!
ఆ విధముగనే లవుని గూడనూ యల యుత్తర కోసల యందున్,
ఈ విధముగ కుశలవుల నిద్దఱిని నింపుగ రాజ్యాభిషిక్తులునూ
జేసిపోవుదము మన మిద్దఱమును శ్రీకరముగ వనములకు మఱిన్! 7

శీఘ్ర గమనమును గల మన దూతలు శత్రుఘ్నునకు సమీపంబున్
మన యీ గమనము గూర్చి దెలిపెదరు మంజులముగ యీ వార్త మఱిన్!
ఆలస్యము మఱి జేయగూడదూ! అమృతంబు విషమగును సుమా!
ఈనాడే మన దూతల నంపీ నింపుగ దెలుపగ వలయు సుమా! 8

భరతుని జేతను బలుకబడిన యీ బన్నుగ యీ వచనముల వినీ
ఆ వసిష్ఠుడును విషాద భావము నలరి మునిరికొన నిటులనియెన్!
అధోముఖములను బాధ బడెడి యీ యల పౌరులనూ జూచి మఱిన్,
నిటులను బలికెను శ్రీరామునితో నింపుగ మధుర సువాక్యములన్! 9

నాయన రామా! నేలను బడినా నయముగ యీ ప్రజలను గాంచీ
దయజూడుము! మఱి యీప్సితంబునూ దగ దెలిసికొనీ కార్యంబున్
జేయదగినదీ యాలోచింపుము! శ్రీకరముగ శుభమగు వానిన్!
అనిష్ఠ కార్యములను జేయకుమా! నాదరింపు ప్రజలను నెపుడున్! 10

ఆ కాకుత్స్థుడు రామచంద్రుడును నా వసిష్ఠునీ మాటవినీ
ఆ ప్రకారముగ మంత్రులనూ మఱి యల పురోహితులను మఱియున్!
పౌరులందఱిని లేవదీసి మఱి బన్నుగ వారల ప్రశ్నించెన్
ఏమి జేయవలయును నే నిపుడును నింపుగ దెలుపుడు మీరలునూ! 11

అటుబిమ్మట యీ ప్రకృతులందఱును నల రామునితో నిటులనిరీ!
కంటినీరు మఱి తొణికిసలాడగ చంటిపాపలకు వోలె మఱిన్!
రఘురామా! నీ వెచటికి బోదువో! రయమున మేమును నచ్చటికిన్!
పరుగుల తోడను నీ వెనుకను మఱి పారవశ్యమున వచ్చెదమూ! 12

కాకుత్స్థా! ఓ రఘురామా! విను! గడు పౌరుల మగు మాపైనీ
ప్రేమయు, బ్రీతియు నీ కుండినచో! ప్రియమగు స్నేహము గలిగినచో
అనుత్తమంబగు స్నేహమున్నచో నలరుచు పుత్రుల భార్యలతో
గలిసియు నీతో బయనమయ్యెదము గష్టమనక గ్రహియింపు మమున్,
సన్మార్గంబున బోయెదమూ మఱి సరగున నీ బోయిన దారిన్! 13

విడిచి వేయదగు వారము గామని విశదముగా నీ కుండినచో
ప్రభూ! మేము నీ వారలమును గద! బన్నుగ వాత్సల్యము జూపీ
మమ్ములనందఱినీ ఓరామా! మానుగ తపోవనంబునకున్,
దుర్గంబునకైనను గొనిపోమ్మా! నదిలోకైనను వచ్చెదమూ!
సముద్రమునకైనను నీ తోడను సరసత గొనిపొమ్మా! రామా! 14

రఘురామా! ఓ రాజా వినుమా! రమ్యముగా సంతసము నిదే!
ఇదే మాకు మఱి వరప్రసాదము! ఇదే పరమ వాంఛితము మఱిన్!
అనుసరించి నిను నడుచుట యందే యదియే మాకానందంబున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

ఆ శ్రీరాముడు నా దినంబునకు నలరెడి పౌరుల దృఢభక్తిన్
తాను నిర్ణయించిన సిద్ధాంతము దగ యోచించియు మనసుననూ!
'తప్పక అట్లే!' యనుచును బలికెను తన్మయంబునను బులకించీ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

ఆ శ్రీరాముడు వీరుడైన యా యల కుశుణ్ణి మఱి రాజుగనూ!
దక్షిణ కోసల దేశంబునకును దగ యభిషిక్తుని జేసి మఱిన్!
అల లవుణ్ణి మఱి యుత్తర కోసల యలరు దేశమునకును నపుడున్
అభిషిక్తునిగా జేసి మఱియునూ యలరి పయనమును గావించెన్! 17

అటుబిమ్మట యా మహాబాహువును నలరెడి రఘురాముడు మఱియున్
పురములందు నభిషిక్తులైన యా పొలుపుగ సుతులను నంకమునన్
గూర్చుండగ జేసియు దా మఱియును గూరిమి కౌగిలి జేర్చికొని
మాటిమాటికనిని శిరస్సుపైనీ మఱి మఱి యాఘ్రాణించి మఱిన్

ముద్దు బెట్టుకొని వేలకొలదియును మోదముగా రథములు మఱియున్
ఆయతముల కొలదియు యేనుగులను నలరుచు యశ్వ సహస్రములన్
ధనములుగా వారలకును నిచ్చెను దగిన వస్తు సామగ్రి మఱిన్! 18

అనేకంబులగు రత్నంబులు మఱి యధికమైన ధనములు గలుగూ
సంతోషించిన పరిపుష్టులునగు బరగ జనంబుల గూడికొనీ,
యున్నటువంటీ యా సోదరులను నురుతరులగు నా కుశలవులన్,
వారి వారి నగరములకు బంపెను నొనరగ ధన సంపత్తులతో! 20

వీరులైన యా కుశీలవుల మఱి విమలబుద్ధిగల కుమారులన్!
అభిషేకించియు నటుబిమ్మటనూ తమ తమ నగరములకును మఱిన్,
పయనము జేయించెను వారలనూ బన్నుగ ధనముల నిచ్చి మఱిన్!
మహాత్ముడైనా శత్రుఘ్నునకును మానుగ దూతల బంపె మఱిన్! 21

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నూట యేడవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట ఎనిమిదవ సర్గము

(సోదరులతోను, వానరులతోను, భల్లూకములతోను కలిసి పరమ ధామమునకు వెళ్లవలయునని రాముడు నిశ్చయించుకొనుట, మీరు భూతలము నందే యుండుడని విభీషణ, హనుమత్, జాంబవత, మైంద ద్వివిదులను నాజ్ఞాపించుట)

రామునిచే యాజ్ఞాపింపగబడి రయమున యా దూతలు మఱియున్
శీఘ్రగమనమును గల యా దూతలు శ్రీఘ్రముగను బయనించి మఱిన్
మార్గమధ్యమున యాగకుండగా మధురకు బోయిరి వేగముగన్
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 1

మూడు రాత్రులును, మూడు బవళ్ళును మోదమునను బయనము జేసీ
యా దూతలునూ మధురను జేరిరి యాగకుండగను మధ్య మఱిన్,
జరిగిన విషయమునంతయు దూతలు సరసత యా శత్రుఘ్నునకున్
వినయ మొప్పగా దెలిపిరి వారలు విమలము మఱియు యథాతథమున్! 2

లక్ష్మణునీ యా పరిత్యాగమును లాలితముగ యా రాఘవునీ
ప్రతిజ్ఞయును మఱి కుశీలవుల యా బన్నుగ యభిషేకంబు మఱిన్,
పౌరులు రాముని వెంట వెళ్లుటకు బన్నుగ సంకల్పించుటయున్
దూతలు దెలిపిరి శత్రుఘ్నునకును దోరముగా వివరించి మఱిన్, 3

ధీమంతుండగు రామచంద్రుడును ధీరుడైన యా కుశుకొఱకున్
వింధ్య పర్వతా సమీపమందున సాంద్రగిరి గుహల మధ్యమునన్!
కుశావతీ యను నగరంబును మఱి కూరిమి యట నిర్మించుటయున్
దూతలు దెలిపిరి శత్రుఘ్నునకును దోరముగా విషయంబు మఱిన్! 4

లవుని కొఱకు మఱి రమ్య పురంబును లాలితముగ శ్రీవస్తియనూ
పేరు గలిగినా నగరంబును మఱి ప్రసిద్ధముగ నిర్మించిరటన్!
మహారథులు నగు రాముడు భరతుడు మానుగ యయోధ్య నగరంబున్
జనశూన్యముగా జేసి స్వర్గమును జనుచున్నారు గదా యిపుడున్
అనుచు దెలిపిరీ శత్రుఘ్నునకును నా దూతలు వినయము తోడన్! 5

ఆ దూతలు మఱి యా శత్రుఘ్నుకు నలరి సమస్తము శీఘ్రముగా
నివేదించి మఱి వినిపించిరిగా విశదముగా నంతయు దెలిపీ,
'రాజా! తొందర బడుము' నటంచును నయముగ దెలిపియు వారలునూ!
విరమించిరి యా విషయంబును మఱి విదరముగా మఱి దెలుపుటకున్! 6

రఘునందనుడగు శత్రుఘ్నుండను రయమున భయంకరమునైనా!
సమీపించినా కుల్కక్షయంబును సాదరముగ విని ప్రకృతులన్
పురోహితుండగు కాంచనునీ మఱి పాలుపుగ రప్పించియు మఱియున్
తన సోదరులను గూడి రానున్న దగిన విపర్యాసమును మఱిన్
జరిగినదియు మఱి జరిగినట్లుగా సర్వము దెలిపెను యాతనికిన్! 7,8

అటుబిమ్మటనూ వీరుడైన యా నరాధిపుండగు నరేంద్రుడున్
పుత్రద్వయమును నభిషేకించెను పుడమి నేలనూ విడివిడిగా!
సుబాహు వనియెడి పుత్రరత్నమును సురుచిరముగ మధురము బొందెన్!
శత్రుఘాతి యనువాడు వైదిశా సరసత నగరము నందె మఱిన్! 9

ఆ రాజగు శత్రుఘ్నుడు మఱియును నల మధురకు సంబంధించీ
ఉన్న సైన్యమును ధనమును మఱియును నురుతముగ రెండును జేసీ,
యిద్దఱు సుతులకు బంచియిచ్చెనూ శ్రద్ధగ నుండగ బోధించెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 10

సుబాహువును మఱి మధుర యందునను, సురుచిరముగ స్థాపించె నటన్,
శత్రుఘాతినీ వైదిశముననూ స్థాపనమును జేయించి మఱిన్
ఆ శత్రుఘ్నుడు నొక్క రథముతో నల యయోధ్యకును బోయె మఱిన్!
సుఖము లెప్పుడును నుండవుగా మఱి చోద్యముగా కష్టంబులునూ! 11

అల శత్రుఘ్నుడు ప్రజ్వలించెడీ యగ్నివోలె నున్నట్టియునూ,
మహాత్ముడైనా శ్రీరాముని మఱి మానుగ జూచెను నాతండున్!
తెల్లని సన్నని పట్టుబట్టలను దీరుగ ధరించి యుండిన యా
రాముని దగ్గర యనేక మునులును రమ్యముగా నట గూర్చొనిరీ! 12

అటుబిమ్మట యా శత్రుఘ్నుడునూ యఖిల ధర్మముల నెఱిగిన యా
శ్రీరామునకును నమస్కరించీ యంజలి ఘటించి యాతండున్!

ఇంద్రియ నిగ్రహ వంతుడగుచునూ సాంద్రముగా ధర్మంబు మఱిన్
ఆలోచించుచు నిటులను బలికెను నన్నయైన శ్రీరామునితో! 13

రఘునందన! శ్రీరామా వినుమా! రమ్యముగా నా పుత్రులకున్,
అభిషేకంబును జేసి వచ్చితిని! రహి ప్రకృతులను గూర్చి మఱిన్!
ఇపుడు నీదు ననుగమనమునందున కృత నిశ్చయమును నంది మఱిన్!
వచ్చితి ననియును దెలిసికొనుము మఱి మచ్చికతో నీ వెను వెంటన్! 14

రామచంద్ర! ఓ వీరుడ వినుమా! రహి భిన్నముగా నేమియునూ!
జెప్పకుమా మఱి దిరస్కరింపకు! శ్రీకరముగ నా కోరికనూ!
విశేషించి నా వంటివానితో వికటముగా నెదిరించుటయున్
నేను నిచ్చగింపను శ్రీరామా! నిర్మలముగ నీ యాజ్ఞలనూ! 15

రఘునందనుడగు రామచంద్రుడును 'రమ్యముగా' శత్రుఘ్నుని యా
యాశయంబు దుర్బలము కానిదని యాతని బుద్ధిని గమనించీ,
ఆతని దృఢనిశ్చయమును గాంచీ 'తప్పక అట్లే' యని పలికెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 16

ఆ సంభాషణ జరుగుచుండగా నలరెడి స్వేచ్ఛా రూపములన్
ధరించు వారలు వానరులును మఱి దగ భల్లూకంబులు మఱియున్,
రాక్షసులును మఱి యనేక దారుల యలరుచు వచ్చిరి గుంపులుగా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 17

ఆ వానరులును నందఱు గూడను నల స్వర్గమునకు నభిముఖులై
యున్న రామునీ జూడగ దలచియు నురుతర భావము గలవారై
ఆ సుగ్రీవుని ముందు నుంచుకొని యలరుచు సంతోషము తోడన్!
కుప్పిగంతులును వేయుచు వచ్చిరి కూరిమి రాముని దర్శింపన్! 18

రాముని క్షయమును గూర్చి దెలిసినా రమ్య దేవతల పుత్రులునూ
ఋషుల పుత్రులును గంధర్వులు యా రూఢిగ నున్న సుపుత్రులునూ
యైన యట్టి యా వానరులందఱు నలసట లేకను వచ్చి రటన్,
అంతిమ దర్శనమును జేయుటకును నలరి పావనంబగుటకునై! 19

ఆ వానర రాక్షసులందఱునూ యల రామునకును నంజలితో
నమస్కరించుచు బలికి రిట్టులను నయముగ సుమధుర వాక్యములన్!
రఘురామా! శ్రీరామా వినుమా! రమ్యముగా మే మందఱమున్!
నీ వెనుకను మేమును వచ్చుటకును నిర్ణయించి యిటు వచ్చితిమీ! 20

పురుష శ్రేష్ఠుడు! రామా! వినుమా! బొలుపుగ మాదు సువచనములన్.
నీవెంటను రాకుండగ మేమును నీవు వెడలి పోవుటయు గనీ,
యురు దండంబును బ్రయోగించి మఱి యముని కడకు మము బంపినటుల్
భావించెదమూ రఘురామా! విను! బాధ భరింపగ లేము సుమా! 21

ఇంతలోపలను మహాబలీయుడు మంతనమున సుగ్రీవుండున్,
రామచంద్రునకు నమస్కరించియు రయమున యథావిధిని నతడున్!
ఆ వీరునితో విన్నవించుటకు నలరుచు ప్రారంభించె నిటుల్,
మనసులోని తన మనోభావముల మాధుర్యముగను వినిపించెన్! 22

రాజా! నేనును కిష్కంధకునూ యల యంగదుకు రాజ్యమునన్!
అభిషేకంబును జేసి నచ్చితిని యలరుచు ప్రజలును గీర్తింపన్!
నీ యను గమనము నందు నేను మఱి నిశ్చయముగ నున్నాను సుమా!
కొండ కోనలకు వనములకైనను కూరిమి వచ్చెద నీతోడన్! 23

ఆనందింపగ జేయు వారిలో నతి శ్రేష్ఠుండగు రాఘవుడున్
ఆ వానరపతి తద్వాక్యము విని యలరుచు స్తుతినీ దెచ్చుకొనెన్!
ఆ సుగ్రీవుని మిత్రత్వంబును నలరెడి మైత్రీ భావంబున్,
ఆ సుగ్రీవుని తోని బలికెనూ యతి మధురముగా రాఘవుడున్! 24

మిత్రుడవగు! ఓ సుగ్రీవా! విను! మేదుర భావముతోని మఱిన్,
నీవు ప్రక్కనను లేకుండగనూ నేను స్వర్గమునకును గానీ
పరమపదమునకు గానీ వెడలను బరగ యొంటరిగ నేను మఱిన్! 25

(ఈ శ్లోకము, పై శ్లోకము చాల ప్రతులలో లేవు)

వారలచేతను నిటుల పలుకబడి వనరగ నవ్వుచు రాఘవుడున్
అట్లే యనుచును బలికె నాతడును నతిమధురములగు వచనములన్,

అటుబిమ్మటనూ మహాకీర్తిగల యల విభీషణుని గాంచి మఱిన్!
ఈ రీతిని బలికెను రాఘవుడును నింపుగ ప్రీతి సువచనములన్! 26

రాక్షసేంద్ర! ఓ విభీషణా విను! రమ్యములగు నా వచనములన్
ఎంతవఱకు నీ ప్రజలు ధరిత్రిని శాంతముగా జీవించెదరో!
అంత వఱకునూ నీవు లంకలో నలరుచు వసియింపగ గలవూ!
చిరకాలము జీవింపగలవు సుమ! చిన్నబోకుమా నాపదలన్! 27

చంద్రుడు సూర్యుడు గగనతలముననను నందముగా వసియించుదురో
ఎంతవఱకు నీ భూమండలమును శాంతముగా నుండునొ మఱియున్,
ఎంతవఱకు నా కథ లోకంబున భ్రాంతి లేక నిలబడి యుండున్!
అంతవఱకునూ నీదు రాజ్యమును నలసట లేకను జేయుదువూ! 28

స్నేహభావమున నిన్ను నేను మఱి స్థిరముగ శాసించుచు నుంటిన్!
నీ శాసనమును ననుసరించి మఱి నయముగ కావ్యము జేయదగున్!
ప్రజలందఱినీ ధర్మము జేతను బన్నుగ రక్షింపుము నీవున్
ప్రత్యుత్తరమును బలుకవద్దు సుమ! బన్నుగ నా శాసనమునకున్! 29

మహాబలముగల విభీషణా విను మానుగ మఱియొక విషయంబున్,
దెలుపగ గోరుచునుంటి నేను మఱి తేటతెల్లముగ నీకు మఱిన్!
ఇక్ష్వాకుల కులదేవత జేతను విమలురైన యింద్రాదులచే
పూజింపగ బడు వాడునైన యా పొలుపుగ యా జగన్నాథు మఱిన్
ఆరాధింపుము! విభీషణా మఱి యాతని ధ్యానముననను నిలుపూ! 30,31

రాక్షస నాయకులకు రాజైనా రహి యా విభీషణుడు మఱియున్
రాముని యాజ్ఞను స్మరించుచును మఱి రాముని మాటలకును నతడున్
'అట్లే జేసెద? ననుచు బలికెనూ! యలరుచు వినయముతోని మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 32

రామచంద్రుడును విభీషణునితో నటు రమ్యముగా బలికి మఱిన్
హనుమంతునితో నీ విధి బలికెను నానందము మదిలో దొలుకన్
జీవితమున నిశ్చయము జేసికొని స్థిరబుద్ధిని యుండిన నీవున్
నీవు ప్రతిజ్ఞను వ్యర్థము సేయకు! నిశ్చలముగ నుండుము నీవున్!

రామాయణ కథ లోకమునందున రహి ప్రచారమున నుండు మఱిన్!
అంతకాలమును జీవింపుము ధర! యంతకాలమును వినుచు మఱిన్! 33

హరీశ్వరా! ఓ వానర నాయక! యలరుచు మత్కథ లోకమునన్
ఎంతవఱకు మఱి ప్రచారముండునొ నింపుగ నంతటి కాలమున్,
నీవును మదిలో సంతోషించుచు నిర్మల భావముతోని మఱిన్,
నాయానతి పాలించి వర్ధిలుము! నలరుము సంతసమును గూడీ! 34

మహాత్ముడగు నా రాముని జేతను రహి విని యాతని వచనములన్
ఆ మారుతియును నంజలితోడను నలరి నమస్కృతి జేసి మఱిన్!
అత్యధికముగా సంతోషించుచు నలరి యిటుల విన్నపము జేసెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 35

పవిత్రమగు నీ కథ లోకములో రహి ప్రచారమున యలరుచునూ
యుండునొ మఱియును నంతవఱకునూ మెండుగ నీదు స్వరూపమునూ!
మనసున జూచుచు మఱి మఱి గాంచుచు మౌనముగా మది స్మరించుచున్!
నీ యానతినీ బాలించుచునూ నీ భువిలో నే నుండెదనూ! 36

వృద్ధుండును మఱి బ్రహ్మపుత్రుడూ విమలుడు జాంబవంతునితో
అటులే జెప్పియు మైంద ద్వివిదులకు నా విధముగనే దెలిపె మఱిన్!
కలియుగంబు మఱి వచ్చు వఱకునూ కమ్మగ జీవింపుడు ధరణిన్!
అనుచు జాంబవంతునితో గూడను యైదుగిరిని యాదేశించెన్! 37

శ్రీ రఘురాముడు విభీషణాదుల చిత్తము హర్షము బులకింపన్!
ఆ విధముగనే దెలిపె మఱియునూ యల భల్లూక సువానరులన్!
అందఱి తోడను సంబోధించీ యలరుచు దెలిపెను నీ విధమున్!
నేను ముందుగా దెలిపిన విధమున ముదమున రండీ! నా తోడన్!
అనుచు బలికెనూ యాత్మారాముడు నందఱి తోడుత మధురముగనూ! 38

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో

నూట ఎనిమిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట తొమ్మిదవ సర్గము

(పరమ ధామమును జేరుటకై బయలుదేరిన రాముని తో అయోధ్య వాసు లందఱు గూడ బయలుదేరుట)

అటు బిమ్మటను యా రాత్రియునూ యల తెలతెల వారుచు నుండన్
పృధు వక్షంబును గలవాడును మఱి పృధు యశస్సు గలవాడు మఱిన్,
కమల పత్రముల వంటి నేత్రములు గలిగిన వాడును రాఘవుడున్,
పురోహితునితో నిటులను బలికెను బులకిత రోమాంచము తోడన్! 1

దీప్యమానమగు అగ్ని హోత్రమును దీప్తిని బ్రాహ్మణులను గూడీ
ముందుగ యది పయనించుగాత! మఱి మోదముతో జ్వలియించుచునూ!
వాజపేయ ఛత్రంబును గూడను వన్నెల జిందుచు శోభలతో
అయోధ్య నగరీ రాజమార్గమును నలరుచు బయనించును గాతన్! 2

అటుబిమ్మటనూ తేజో రాశియు నల వశిష్ఠుడును వేగముగన్!
మహావీర ప్రస్థానంబునకును మానుగ సంబంధించిన యా
విధినంతటినీ యథా శాస్త్రముగ విమలముగా పూర్తిని జేసెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 3

అటుబిమ్మట యా రామచంద్రుడును నల సూక్ష్మాంబర ధరుడగుచున్
పర బ్రహ్మమును స్మరించుచును మఱి బన్నుగ హస్తంబుల జేతన్!
కుశలను ధరించి యటుబిమ్మటనూ కూర్మి బోయె సరయూ నదికిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 4

మార్గము నందున యెచ్చట గూడను మాటలాడకను యుండి మఱిన్,
నడక దప్ప మఱి చేష్టలేవియును మానుగ లేనీ వాడునునై
సుఖ దృష్టియు మఱి లేని వాడునై సుసుచిరముగను బ్రకాశించూ
సూర్యుని వలెనూ గృహము నుండి మఱి యరదము వలెను బయల్వెడలెన్! 5

అటుబిమ్మట రాముని కుడి ప్రక్కను నలరు పద్మ హస్తము లక్ష్మి
వచ్చినదీ! మఱి యెడమ ప్రక్కయును అచ్చముగా భూదేవియునూ!

ఎట్ట ఎదుట సంహార శక్తియును నిట్టె నడుచుచుండెను నపుడున్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 6

అనేక విధముల బాణంబులు మఱి యాయతమును నుత్తమమైనా
మహాధనుస్సును సమస్తమైనా మానుగ యాయుధములు మఱియున్,
అన్నియు గూడను పురుషరూపములు నలరుచు ధరించి ధీరతనూ
ఆ రఘువీరుని వెనుక నడిచినవి యేల మెఱుపులు మెఱిసిన రీతిన్! 7

వేదంబులు మఱి సర్వదక్షిణీ విమలమైన గాయత్రియునూ
ఓంకారము మఱి వషట్కారమును నొప్పుగ యందఱు గూడ మఱిన్,
బ్రాహ్మణ రూపంబులను ధరించియును బ్రహ్మ తేజమును నొలుకుచునూ!
ఆ రఘువీరుని యనుసరించి మఱి యలరుచు బోయిరి వెనువెంటన్! 8

మహాత్ములును, ఋషులును, మునులును మఱి మానుగ సమస్తమైనట్టీ
మహాసురులునూ, తెరువబడిన యా మానుగ స్వర్గ ద్వారమునన్
ఆ శ్రీరాముని యనుసరించియును నలరిబోయిరీ వెనువెనుకన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 9

అంతఃపురమున నున్న స్త్రీలునూ వృద్ధులైన దాసీలు మఱిన్
బాలదాసినులు, కంచుకిలూ మఱి బన్నుగ కింకరులును గూడన్
ఆ శ్రీరాముని యనుసరించుచును నలరుచు బోయిరి వెనువెంటన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 10

అల భరతుండును నంతఃపురమున నటనుండిన వారలతోడన్
శత్రుఘ్నునితో కలిసి బోయెనూ సరసత రాముని వెనువెంటన్
వారందఱునూ అగ్ని హోత్రాగ్ని వనరగ యుండిన శ్రీరామున్,
గతిగా బొందియు నా రఘువీరుని కదిలిపోయిరీ వెనువెంటన్! 11

మంత్రులు, పుత్రులు పశువుల బంధుల మానుష సహితులు నైనట్టీ
భృత్యులతో గూడను మఱి యింకను బన్నుగ యనుచరులను గూడీ
సంతోషముతో దన్మయుంబుతో సరసత భక్తి ప్రపత్తులతో
ఆ శ్రీరాముని యనుసరించుచును నలరుచు బోయిరి వెనువెంటన్! 13

పిమ్మట సంతోషించుచుండినా ప్రీతిని నిరోగ వంతులునూ,
జనులను నిండిన ప్రజా సమూహము సరసత రాముని గుణములచే,
రంజింపగ జేయగబడువారై రయమున బోవుచు నున్నట్టి
ఆ శ్రీరాముని యనుసరించుచును నలరుచు బోయిరి వెనువెంటన్! 14

ఆ శ్రీరాముని యనుసరించి మఱి యలరుచు వచ్చిన స్త్రీ పురుషుల్,
పశువులు పక్షులు అన్నియు గూడున బావరహితులై వారలునూ
ఉత్సాహముతో నుండిరి వారలు నురుతరముగ శాంతిని గూడీ
ఆ శ్రీరాముని యనుసరించియును నలరుచు బోయిరి వెనువెంటన్! 15

వానరులందఱు హృష్టపుష్టులై వనరగ స్నానంబులు జేసీ
ఆనందముతో నుండిరి వారలు నలరుచు ధ్వనులను జేయుచునూ!
ఆ వానర సముదాయ మంతయును నలరుచు కిలకిల శబ్దములన్
జేయుచు రాముని యనుసరించుటకు స్థిర సంకల్పము నుండి రటన్! 16

ఆ ప్రదేశమున దీనుడుగానీ అలరు సిగ్గుబడు వాడు మఱిన్
దుఖితుండుగానీ మఱి యచ్చట దురపిల్లెడివాడునుగానీ,
లేనే లేడూ! వెదికిన గూడను లీలగ కనిపింపడు నచటన్
సమస్తమును మఱి హర్ష పూర్ణమును సరసత ప్రముదిత యద్భుతముల్,
ఆశ్చర్యముగా నుండె నచ్చటను హర్షానంద సుమోదములన్! 17

బోవుచున్న యా రాముని గనుగొని పులకిత గాత్రులు నై జనులున్,
పల్లెల నుండి వచ్చిన వారలు జెన్నుగ రాముని జూడగనే
సంతోషముతో స్వర్గము కొఱకును సరసత బొందగ కోరికతో
ఆ శ్రీరాముని యనుసరించుచును నలరుచు బోయిరి వెనువెంటన్! 18

భల్లూకంబులు, వానరవీరులు బన్నుగ వచ్చిరి రాక్షసులున్
నగర వాసులగు జనములు గూడను నయముగ సుసమాహితులగుచున్
మహాభక్తితో రాముని వెనుకను మానుగ వచ్చిరి యచ్చటికిన్!
ఆ శ్రీరాముని యనుసరించుచును నలరుచు బోయిరి వెనువెంటన్! 19

నగరంబులలో నదృశ్యములుగా నలరెడి భూతంబులు గూడన్
స్వర్గంబునకును బయలుదేరినా యా శ్రీరాముని గూర్చి మఱిన్!
అదృశ్యములుగా ననుసరించి మఱి యలరిపోయినవి వెనువెంటన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 20

అట్టి మహాప్రస్థానము నందును నట గాంచిన యా జంగమముల్
స్థావరంబులను నా శ్రీరాముని సరసత గాంచియు యాతనినీ
అనుసరించియును నాతని వెంటను నతి శీఘ్రముగా బోయినవీ!
రాముని దృష్టియు బడగానే మఱి రయమున స్థావరములు నైనా
వృక్షంబులలో గూడ జ్ఞానమును నుద్భవించి యవిగూడ మఱిన్!
ఆ జీవులు రామునితో గూడను అలరి బోయినవి వెనువెంటన్! 21

అయోధ్యయందున శ్వాసను బీలుచు యలరు ప్రాణి యొక్కటియు మఱిన్
మిగులగ లేదూ! కానిపింపవూ మేదిని యందున ప్రాణులునూ!
తిర్యగ్జంతువు లన్నియు గూడను శ్రీ రఘు వీరుని వెనువెంటన్!
అనుసరించి మఱి పయనించినవీ యలరి మహా ప్రస్థానంబున్! 22

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నూట తొమ్మిదవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి – ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట పదియవ సర్గము

(సోదర సహితులైన రాముడు తన వైష్ణవ తేజస్సులో ప్రవేశించుట. ఆ రామునితో వచ్చిన వారి కందరికిని సంతానకమను లోకము లభించుట)

రఘు నందనుడగు రామచంద్రుడును రహి యొకటిన్నర యోజనముల్
దూరంబునుగల పుణ్యప్రదమగు దోరముగా యుదకము గలుగూ!
పశ్చిమాభిముఖుడై తన చేతను బరగ నిశ్చయింపగ బడినా
సరయూనదినీ కనుగొనె రామును సరసత పుణ్యానదీ జలమున్! 1

రఘునందనుడగు నా భూపతియును రామచంద్రుడును వేగముగన్,
సుడులతోను మఱి ముడులతోడనూ సురుచిరముగ వ్యాకులమైనా
జలము గలిగినా నది యంతటనూ సరసత పరిశీలించి మఱిన్!
తిరిగి తిరిగి మఱి ప్రజల తోరుతను దీరుగ ప్రజలను గూడి మఱిన్!
ప్రవేశించుటకు తగిన ప్రదేశము బన్నుగ మఱి స్వర ప్రాపకమున్
అట్టి ప్రదేశమునకు దా వచ్చెను నిట్టె మహా ప్రస్థానముకున్! 2

అటుబిమ్మట యా ముహూర్తమందున యలరు లోక పితయైనట్టీ
బ్రహ్మదేవుడును భూషితులైనా బన్నుగ మహాత్ము లైనట్టీ
సమస్త సురలను గూడిన వాడై సరసత విమాన కోటులతో
కూడినవాడై కాకుత్స్థుండును కూరిమి ప్రస్థానంబునకై
వచ్చినట్టి స్థానమునకును వచ్చెను మచ్చిక తోని ప్రజాపతియున్! 3,4

స్వయముగనే మఱి కాంతి గలిగినా స్వీయ తేజమును గలిగిన యా
పుణ్యకర్మలును గలిగినదియును మఱి పొలుపుగ దివి దేవతలు మఱిన్
గూడినట్టి యా యనుత్తమంబగు కూరిమి యా యాకాశంబు మఱిన్
దివ్యతేజమును గూడికొన్నదై దీరుగ జ్యోతిర్భూతంబై
లోకమంతయును వలుముకున్నదీ లోలత నింతయు లేకుండన్! 5

సువాసనలతో సుఖప్రదములగు సురుచిరమగు గాలులు వీచెన్
దివి దేవతలును గురిపించిన యా దీరుగ పుష్ప సువృష్టియునూ,
మహా ప్రవాహము వోలె కనబడెను మానుగ దివి భువి యంతటనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 6

వందల కొలదియు తూర్యంబులతో వనర ధ్వనులతో వ్యాకులమై
గంధర్వాప్సర గణముల చేతను గడు వ్యాకులమగు సమయమునన్!
సరయూనదీ జలంబుల గూర్చియు సరసత యా రాముడు వేగెన్,
మెల్లమెల్లగా నడిచెను రాముడు చల్లని చల్లని గాలులలో! 7

అటుబిమ్మట యా పితామహుండును నాకాశంబున నుండి మఱిన్,
కొంచెము దగ్గఱ కొచ్చి బలికెనూ యంచితముగ తన పరిభాషన్!
లోకరక్షకా! విష్ణూ రమ్మా! లోలత నీకు శుభంబగునూ!
భాగ్యవశమునను వచ్చినావు గద! బన్నుగ మమ్మును విడివడుచున్! 8

మహాబాహు దేవతలను బోలిన మానుగ సోదరులను గూడన్!
నీదు స్వీయ దేహము నందున మఱి నిర్మలముగ మదినివేశింపూ!
నీ దేహంబును దేని లోపలను నిజముగ నుండగ దలచెదవో!
దాని లోపలను బ్రవేశింపుమా దగ నీ కోరిక దీరగనూ! 9

మహాతేజమును గలవాడా! వినూ! మానుగ వైష్ణవ శరీరమున్!
లేదా సనాతనము, నిత్యంబును లీలగ యాకాశము నందున్!
శుద్ధ బ్రహ్మ స్వరూపంబుననూ సురుచిరముగను బ్రవేశింపూ!
దేవా! నీవును లోకగతివిగద! నీ వనాది సిద్ధంబుగనూ!
ఉన్నటువంటీ విశాలంబులగు నురుతర నేత్రంబులు గలుగూ!
మాయదప్ప మఱెవ్వరి చేతను మానుగ యూహింపగను దగూ!
శక్యంబును మఱి కాని వాడవును సరసత క్షయ రహితుండవునూ!
జరాశూన్యడవు! నిన్ను దెలిసికొన జాలరు నెవ్వరు నీ వసుధన్! 10,11

మహామతియుగల శ్రీరాముండును మఱి ప్రజాపతీ వచనములన్,
విని మఱియును నిశ్చయము జేసికొని విలసితులగు తమ్ముల గూడీ,
సశరీరముగను విష్ణు తేజమున సరసత ప్రవేశమును బొందెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 12

అటుబిమ్మటనూ విష్ణుమయుండగు నా రాముని యా దేవతలున్
సాధ్యులునూ మఱి మరుద్గణంబులు సరసత యింద్రుడు నగ్ని మఱిన్
దివ్యఋషులు, మఱి గంధర్వులునూ దీరుగ మఱి యప్సరసలునూ!
గరుత్మంతులును నాగులు యక్షులు కమనీయముగను దైత్యులునూ!
దానవులును, రాక్షసులు గూడనూ దగ పూజించిరి విష్ణువునూ! 13,14

గత కల్మషమై సకల దివంబును కమనీయంబైనది యిపుడున్!
పరిపుష్టంబై ప్రముదితమైనది బన్నుగ సుమనోరథములునూ!
పరిపూర్ణంబై వికసించినవీ! బాగు బాగు! అని దేవతలున్
బలుకుచు పూవులు జల్లిరి కుంభిని పుష్పోత్సవమో యన్నటులన్! 15

అటుబిమ్మటనూ మహాతేజమును నటు గలిగిన యా విష్ణువునూ
బ్రహ్మదేవుతో నిటులను బలికెను బన్నుగ మధురాక్షరములనూ!
సువ్రత! వినుమా! యీ జనులకు మఱి సురుచిరముగ కరుణించి దయన్
ఉత్తమ లోకము నిమ్మా వీరికి యురుతరమగు సుఖశాంతులనూ! 16

సమస్తమైనా మనస్వినులునూ సరసత వీరందఱు గూడన్
నాపై నుండిన స్నేహము జేతను నా వెనుకను వచ్చిరి వేగన్,
నా నిమిత్తమై దేహంబులునూ నయముగ వదిలిన భక్తులునూ,
సేవింపగ దగు వారు గదా మఱి చిర సౌఖ్యము నీదగు వారున్! 17

ఆ విష్ణువు వచనంబుల వినియును నలరి లోక గురువైనట్టీ
సమర్థుండునగు నా బ్రహ్మయునూ, సరసత నీ విధమున బలికెన్!
చింతింపకుమా! వీరిని గూరిచి చిరసౌఖ్యములను నందెదరూ!
సంతానకమను లోకంబునకును సరసత పోవగగలరు సుమా! 18

తిర్యగ్జంతువుగూడ భక్తితో దీరుగ నిన్నే స్మరించుచున్,
ప్రాణంబుల మఱి విడిచి బెట్టుచో బరగ రామ రామా యనుచున్,
బ్రహ్మలోక గుణములు గలిగిన యా బ్రహ్మ లోక దాపున గలుగూ!
సంతానకమను లోకంబులలో సరసత వసియింపగ గలదూ! 19

సుర సంభవులగు వానరులునూ సురుచిర భల్లూకంబులునూ!
అందఱు గూడను తమ యుత్పత్తికి యల కారణభూతులునైనా
దేవతలందున లీనమైరి మఱి దీరుగ మఱు జన్మము లేకన్
ఇతరులు మాత్రము సంతానంబును నింపుగ బోయిరి లోకంబున్! 20

అట్టివారిలో సుగ్రీవుండును నలరి సూర్య మండలముననూ
ప్రవేశించెనూ యితర దేవతలు బన్నుగ యందఱు గనుచుండన్,
తమ దంద్రులనూ పొందిరి వారలు దమస్సులనూ దాటి మఱిన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 21

బ్రహ్మదేవుడును నా విధముగనూ బన్నుగ బలుకుచు నుండగనూ
సరయూనదియందున గలిగిన యా సరిగోప్రతార క్షేత్రమునన్
వచ్చిన జనులును సంతోషముతో వనరగ నిండిన కన్నీటన్
వ్యాకులులై సరయూనది యందున వనర ప్రవేశము జేసి రటన్! 22

ఎవ్వడు సరయూ నదీ జలంబుల నింపుగ జలకము లాడి మఱిన్
ప్రాణంబులనూ విడిచి యాతడును బన్నుగ సంతస మందెడినో!
మానుష సంబంధమునగు దేహము మానుగ విడిచియు వేగముగన్,
విమానంబునూ యధిరోహించెను వేడుకలర నేగెను దివికిన్! 23

పశుపక్ష్యాదులు గూడను మఱియును బన్నుగ యా సరయూ నదిలో
జలముల యందున ప్రవేశించి మఱి ప్రకాశించు దేహంబులతో!
స్వర్గంబునకును బ్రవేశించినవి స్వర్గ సుఖములను నందగనూ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 24

తిర్యగ్జంతువులును గూడను మఱి దివ్యములైనవి జలములలో
దివ్యమైన యా శరీరములతో దీప్యమానమగు సురలవలెన్!
ప్రకాశించుచుండెను చిత్రముగా దిశలన్నియు వెలుగులు నిండన్!
సరయూ నదిలో ప్రవేశించినా స్థావరములు మఱి జంగమముల్,
ఆ జలములలో మునుగగనే మఱి యల సురలోకము జనుచుండెన్! 25,26

ఆ సరయూనది జలములందునను నల ప్రాణంబులు విడిచిన యా
భల్లూకంబులు వానరులును మఱి బన్నుగ రాక్షసులను వేగన్!
తమ తమ దేహములను జలములలో దగ విడిచియు స్వర్గము నేగెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 27

అటుబిమ్మట యా బ్రహ్మదేవుడును నలరుచు వచ్చిన వారలనూ,
స్వర్గలోకమున నుండి మఱియునూ స్వర్గసుఖములను నందించీ
సంతోషాతిశయంబు గూడినా కాంతిని గూడిన దివిజులతో
బ్రహ్మలోకమును దరలిపోయెనూ బన్నుగ ప్రజాపతియు నపుడున్! 28

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో

నూట పదియవ సర్గము సమాప్తము

శ్రీరామ కథా సుధాలహరి - ఉత్తరకాండము (ద్వితీయ సంపుటము)

నూట పదునొకండవ సర్గము

(శ్రీ మద్రామాయణ మహాత్మ్యము)

ఉత్తరభాగ సమూహితంబునూ, యురుతర ప్రమాణమును గలుగూ
నీ యాఖ్యానము బ్రహ్మ చేత మఱి యింపుగ పూజింపగ బడియెన్,
రామాయణమను పేరుతోని మఱి రమ్య ప్రసిద్ధిని పొందిన యా
ముఖ్యమైన యా కథా విశేషము మూలము వాల్మీకులచేతన్
రచింపబడినది వివిధ భాషలను రంజింపగ బడె తెలుగుననూ! 1

చరాచరాత్మకములైన యట్టి యా సరసత త్రైలోక్యములందున్,
వ్యాపించిన యా మహావిష్ణువును వనరగ పూర్వమునందు వలెన్!
స్వర్గమునందున సంప్రతిష్ఠుడై సరస భావమున నటనుండెన్!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 2

శ్రీ విష్ణువునకు సంబంధించిన స్థిరమగు చరితము యగుటయునూ
స్వర్లోకంబున దేవతలును మఱి సరసత గంధర్వులు సిద్ధుల్!
మహర్షులునూ సంతోషించుచు మానుగ నిత్యము నీ కథనూ!
పారాయణమును జేయుచు నుందురు బన్నుగ వినుచుందురు దీనిన్! 3

శ్రీ రామాయణ యాఖ్యానంబును స్థిరముగ యాయుష్యము మఱియున్
సౌభాగ్యంబును నిచ్చునదీ మఱి సకల పాపముల దొలగించున్!
వేదంబులతో సమానమైనది విమల పండితులు నెల్లపుడున్,
శ్రాద్ధ సమయముల యందును గూడను సరసత వినిపింపగ వలయున్! 4

అపుత్రకుడునూ పుత్రుని పొందును నల దరిద్రుడును ధనంబునూ,
పొందును, నెవ్వడు రామాయణమున బొలుపుగ యొక శ్లోకమునైనా
పఠించునో మఱి యావ్యక్తియునూ బన్నుగ సమస్త పాపములన్,
చేత విముక్తుండగును సుమా మఱి శ్రీకరమగు విజయము గలుగున్! 5

ప్రతి దినమును పాపములు జేయుచును బన్నుగ నుండిన మానవుడున్
రామాయణమున యొక్క శ్లోకమును రమ్యముగా బఠియించినచో,
సర్వ పాపముల నుండి విముక్తియు సరసత గలుగును నాతనికిన్,
సర్వేశ్వరునీ సద్భక్తియునూ సర్వస్వము గలుగును బరమున్! 6

చదివిన వానికి వస్త్రంబులునూ సరసత ధేనువు స్వర్గమునూ
నివ్వగలిగినది సంతోషముగా నింపుగ సంతోషించుచునూ
చదువువాడు సంతోషించినచో సమస్త దేవతలు గూడన్
సంతోషించుచు రామాయణమును చదివింపగ వలయును జగతిన్! 7

ఆయుర్దాయము నిచ్చునదీ మఱి యలరునట్టి రామాయణమున్,
అనెడి యట్టి.యాఖ్యానంబును మఱి యలరి పఠించెడి పురుషుండున్,
పుత్రుల పౌత్రుల గూడి జగతినీ పొలుపుగ బూజింపగ బడునూ!
మరణానంతరమున నాతడు మఱి మానుగ రెండిటి లోకములన్,
బూజింపగబడు చుండును వాతడు బొలుపుగ యందఱి జేత మఱిన్! 8

ప్రాతఃకాలము నందుగాని మఱి పన్నుగ మధ్యాహ్నము నందున్
సాయంకాలము లందుగాని మఱి సరసత యపరాహ్ణము నందున్,
సావధాన చిత్తమున రామకథ సర్వస్వము జదివెడి వాడున్!
దుఃఖము నాతడు నందడు నిజముగ దోరముగా సుఖమును బొందున్! 9

అనేక వత్సర సముదాయంబును నలరు శూన్యముగ నున్నట్టీ
రమ్యమైన యా యయోధ్యనగరము రహి బుషభుండను రాజు మఱిన్,
వచ్చిన తదుపరి మఱల జనులతో మచ్చిక నిండినదగును సుమా!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 10

ఆయుర్వర్ధక మైనది మఱియును నల భవిష్య గథ గూడినదీ
ఉత్తర కథతో గూడినదియును మఱి యున్నతమైనది నీ కథయున్!
ఇట్టి రామకథ సుధారసంబును నిట్టి ప్రచేతసు పుత్రుండున్,
అల వాల్మీకియు రచియించెను మఱి యా బ్రహ్మయు నామోదించెన్! 11

(ఇటుపైనిపదునైదు (15) శ్లోకములు చాల ప్రతులలో లేవు, వీటికి వ్యాఖ్యతలు
వ్యాఖానములు జేయలేదు. ప్రక్షిప్తములై యుండవచ్చును)

ఒక్క సర్గమును వినుటవలననే యొనరగ మానవుడును మఱియున్,
వేయి యశ్వమేధంబులునూ మఱి విమలముగను పదివేలకుపై
వాజపేయములు జేసిన ఫలమును వనరగ పొందును నాతండున్
కావున రామాయణము జదువ వలె కాలగతిని లెక్కింపకనూ! 12

ఈ లోకములో రామాయణమును నింపుగ చదివిన వాడు మఱిన్
విన్నవాడునూ పుణ్యఫలంబుల విమలత బొందిన వాడగునూ!
ప్రయాగాది తీర్థములకు మఱియును బన్నుగ గంగానదులకునూ
నైమిశారణ్యములకును మఱియును కురుక్షేత్రమును బోయినటుల్
భావింపగవలె పుణ్యఫలాదుల భాగ్యంబును లభియించినటుల్! 13

సూర్యగ్రహణ సుపుణ్యకాలమున సురుచిరముగ మఱి పుట్టెడునూ,
బంగారంబును దానము జేసిన శృంగారుండగు పురుషుండున్,
రామకథను మఱి చదివిన వాడును రమ్యముగా నీ లోకములో
సమానులని యును దెలుపుచు నుందురు సాటిలేని విధముగను మఱిన్! 14

బహుళ శ్రద్ధతో రామకథను మఱి బన్నుగ పఠియించెడి వాడున్,
సకల పాపముల నుండి ముక్తుడై బరగ సౌఖ్యముల నందుచునూ
విష్ణులోకమునకును బయనించును గష్టములను దొలగించుకునీ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 15

పూర్వమందు నా వాల్మీకులనూ పాలుపుగ రచియించిన యట్టీ
ఆర్షమైన యా యాది కావ్యమును నలరి భక్తితో నెల్లపుడున్!
భక్తితోని బఠియించుచుండునో బన్నుగ నొందును విష్ణువునూ!
అతని పుత్రులును, భార్యలు సహితము అల సంతానము సంపదలున్!
వృద్ధిని బొందుచు సిద్ధిని నందును చిరతర సౌఖ్యంబుల నందున్! 16,17

అనుత్తమంబగు రామాయణమును నల గాయత్రీ స్వరూపమున్
ఈ సత్యంబును దెలిసికొనియు మఱి నింపుగ పరిశుద్ధంబైనా

అంతఃకరణముతో బఠింపవలె అలరి భక్తి రక్తిని గూడీ!
రఘుపతి రాఘవ రాజారామా! పతిత పావనా సీతారామ్! 18

అపుత్రకుండును పుత్రుని బొందును అల దరిద్రుడును ధనంబునూ
పొందును నెవ్వడు రామాయణమును బొలుపుగ ఒక శ్లోకమునైనా
బఠించునో యా వ్యక్తియు మఱియును బన్నుగ సమస్త పాపములన్
చేత విముక్తుండగను సుమా! మఱి శ్రీకరమగు విజయము గలుగున్! 19

ఎవడు నిత్యమును రాఘవు చరితము నింపుగ భక్తిని బఠించునో!
చెవులారగ వినునో యాతండును శ్రీకరముగ నిష్కల్మషుడై
దీర్ఘమైన యా యుర్దాయంబును ధీరత యాతడు నందు సుమా!
ముట్టిన దంతయు బంగారంబగు బట్టిన ప్రతినలు నెఱవేరున్! 20

ఎవడు శ్రేయమును నందగోరునో యిల సౌఖ్యంబులు నందుటకున్
నిత్యంబును మఱి యా శ్రీరాముని నిరతము స్మరింపవలెను సుమా!
ప్రతి దినంబు నీ రామాయణమును బరగ బ్రాహ్మణులతోను మఱిన్
వినిపింపగ జేయగవలెను సుమా! విమల గానముగ నిత్యంబున్! 21

ఈ రఘువీరుని చరితంబును మఱి నింపుగ బఠించు వాడు మఱిన్
మరణానంతరమును యాతండును మానుగ మహిమాన్వితమైనా
విష్ణులోకమును బొందును నాతడు విమలానందముతోని మఱిన్!
సంశయంబునూ లేదు సుమా మఱి సందేహంబును లేదిలనూ! 22

రామకథను పూర్తిగ జదివిన యా రమ్య జీవితము గలవాడున్,
తండ్రితాత ముత్తాతలుగూడను దగ ముత్తాతల తండ్రియునూ,
అతని తండ్రి గూడను జేరుదురూ యల శ్రీ విష్ణువు పాదములన్!
సంశయంబులే దెంత మాత్రమును సందేహంబును లేదు మఱిన్! 23

రాముని చరితము ధర్మార్థములను రమ్య కామ మోక్షంబులనూ
నాలుగు పురుషార్థములను నిచ్చును నయముగ లోకుల కెల్లరకున్!
అందువలన మానవుడు నిత్యమును చందము ప్రయత్నశీలుండై
శ్రేష్ఠమైన యీ రామాయణమును శ్రీకరముగ చదువగ వలయున్!
ప్రతినిత్యంబును జదువుచుండవలె బన్నుగ స్త్రీలును పురుషులునూ! 24

రామకథను గల శ్లోకముగానీ రమ్యముగా నొక పాదంబున్
పదమునైననూ భక్తి తోడుతను బన్నుగ చదువుచు నుండవలెన్!
లేదా మఱియును నాలకింపవలె విదితముగా భక్తిని గూడీ!
బ్రహ్మ లోకమును బోవును నాతడు బ్రహ్మచేత బూజింపబడున్! 25

ఇది యీ విధముగ పూర్వము జరిగిన యింపుగ వృత్తాంతంబు మఱిన్
యాఖ్యానము బఠియించు వారికిని యలరుచు వినువారికి మఱియున్,
స్మరించు వారికి గూడ మంగళము సరసత గలుగును గాత! మఱిన్!
ఆ శ్రీ విష్ణువు అనుగ్రహంబును నలరి ప్రవర్ధిత మగు గాతన్!
అనుచు మదిని దృఢ విశ్వాసముతో అంతట జాటుదు నీ వసుధన్! 26

శ్రీరామ కథా సుధాలహరి యందు - ఉత్తరకాండములో
నూట పదునొకండవ సర్గము సమాప్తము

ఉత్తర కాండము సంపూర్ణము
శ్రీ మద్రామాయణము సంపూర్ణము
శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

అల పరమాత్ముడు రామచంద్రునీ అలరు కటాక్షము జేత మఱిన్
సర్వదేవతల యనుగ్రహముచే సారస్వత వాణీ కృపచే
మహాకవులు వ్రాసిన రామాయణ రమ్యకథల ప్రోత్సాహముచే
నేనీ రామాయణము బాడితిని నిర్మల భావముతో మదినీ!

రామదాసునూ, త్యాగరాజునూ రహి బ్రోచిన యా శ్రీరామున్
భద్రాచలమున నెలకొనియున్నా భవ్యమూర్తి యా రఘువీరున్!
రఘుపతి రాఘవ రాజారామా పతిత పావనా సీతారామ్!
అనెడి పల్లవిని పాడుకొంటినీ అల రఘువీరుని శ్రుతి లయలన్!